రామునినిశ్చయమిట్టిదని తెలియును గావునను.ధీమత్ =బుద్ధిమంతుడైన,ఇచ్చట మత్ అనునది మతుప్ ప్రత్యయము, 'భూమ నిందా ప్రశంసాసు, నిత్యయోగేతిశాయినే సంబంధోస్తి వివక్షాయాం, భవంతి మతుబాదయః॥' సిద్ధాంతకౌముది. 'తదస్యాస్త్య స్మి న్నితి మతుప్' పాణిని. V. 2-94 ధ్యాయం త్యనయేతి ధీ దీనిచేఁ జక్కఁగా ధ్యానము చేయుదురు కావున ధీ=బుద్ధి. కావున ధీమంతుఁడనఁగాఁ బ్రశంసింపఁదగిన చక్కని యాలోచనతో నిత్య సంయోగము గలవాఁడు. అనఁగా నాయనబుద్ధి ప్రమాదపడ దని యర్థము. మాయామృగము విషయమున సీతారాము లిరువురు ప్రమాద పడినను లక్ష్మణుఁడు ప్రమాదపడలేదు. అది మాయామృగ మనియే చెప్పెను. మారీచుని కూఁత విషయములో సీత పొరపడినను లక్ష్మణుఁడు ప్రమాద పడలేదు. తన రక్షణమందుఁ దా నవివేకముగ సీతవర్తించెను గాని లక్ష్మణుఁడు తన్ను రక్షింపఁ బట్టు పట్టియే యుండెను అందు సౌమిత్రి, సుమిత్ర కొడుకు. తన్నుఁ దల్లి వలెఁ జూచుకొమ్మని కదా యామె చెప్పెను. ఆమాట ప్రకారము తమ యెడ మాతా పితృ గౌరవమే కాని ద్వేష బుద్ధి గలవాఁడు కాఁడు. లక్ష్మణుఁడట్టి వాఁడని సీతకుఁ దెలియును. వేల్పు టేటి విధమునన్ = గంగానదివలె, గంగానది వానకాల మందు బురద నీళ్లు వచ్చి పడినను నలుపై పోదుగదా.

తా త్ప ర్య ము.

రామచంద్రమూర్తి నిశ్చయము బుద్ధిమంతుఁ డగు లక్ష్మణు నభిప్రాయము దెలిసిన దగుటచే సీతాదేవి వానకాలమున మడ్డి నీళ్ళెన్ని పడినను స్వభావ శ్వేత గుణముల వదలని గంగవలె నీమెయు గుండె నిబ్బరము గలదై యున్నది. లేకుండిన నెప్పుడో గుండె పగిలి చచ్చియుండును.

క. రాముని కీ యసితేక్షణ, రాముఁడు నీ సతికిఁ దగును • ప్రాయమునందున్
శ్రీమానిత శీలంబుల, సాముద్రికలక్షణముల • సర్వాంశమునన్. ౨౬౦

అర్థములు. అసితేక్షణ = కాటుక కన్నులది, ప్రాయము = వయస్సు, శ్రీ మానిత శీలంబులన్ =సంపత్కరమై గౌరవింపఁబడఁ దగిన స్వభావ గుణములచేత.

తా త్ప ర్య ము.

రామచంద్రమూర్తి కీ కాటుక కంటి సీతయు, రామునికీ పతివ్రతకును వయస్సు నందు శోభాకరములై గౌరవింపఁదగు స్వభావగుణము లందు సాముద్రిక లక్షణము లందు సర్వాంశమునఁ బుట్టుట యందుఁ దగియున్నారు. అది యెట్టులన—

రాముఁడు నసితేక్షణుఁడే, సీతయు నసితేక్షణయే. ఒకరు సీత మాత్రమే యసితేక్షణ, రాముఁడు కాఁడు. ఆకారణమున సీతయందది యాధిక్యమని వ్రాసిరి కాని యది సరికాదు. కిష్కింధా కాండము ౧౦౦౦ వ పద్యమందు "వికసిత మేచక కంజ

తుల్యా దర్శనీయుఁ డని రామచంద్రమూర్తి చెప్పఁబడెను. కావున నిరువురు నసితేక్షణులే. అయినను స్త్రీలయందు స్వభావసిద్ధమైన సౌందర్యమొకటి యతిశయించి యుండుటచేతను సీతకన్నులు తన కన్నులకంటె మోహజనకంబు లని రామచంద్రమూర్తి 'నే నొకక్షణంబసితేక్షణ లేక నేని పొందిక బ్రదుకంగనేర'నని (సుందర. ౧౪౧౩ ప) చెప్పుటచే సీతాదేవికన్నులే సౌందర్యమున నతిశయించె నని భావము. అట్టి కన్నుల కరుణార్ద్రదృష్టి నాపై నెప్పుడు పడునో కదా. ప్రాయమునందున్=వయస్సునందు, వివాహకాలమునను రామచంద్రమూర్తికిఁ బండ్రెండేండ్లు. సీతాదేవికి నాఱేండ్లు. రాముని యేండ్లలో సగము సీతాదేవికిఁ గలవు. కావునఁ దగిన వయస్సే. ఈడులేని పెండ్లి రసాభాసము, శాస్త్రవిరోధము. 'వర్షై రేకగుణాం భార్యా ముద్వహే త్త్రిగుణో వరః। ద్వ్యష్టవర్షోష్టవర్షాం వా వయోమాత్రావరాచ యా' విష్ణుస్మృతి. అనఁగా కన్యక యెనిమిది యేండ్ల దగునేని వరుఁడు పదునాఱేండ్లవాఁడై గాని యిరువదినాలుగేండ్లవాఁడై గాని యుండవలెను.

ఈ లెక్క వివాహ సమయమందే గాని యీవలఁ గాదు. ఇప్పుడు శ్రీరామచంద్రమూర్తికి ముప్పది తొమ్మిది సంవత్సరములు. సీతాదేవికి ముప్పదిరెండు సంవత్సరములు. విష్ణు పురాణము కూడ వరునివయస్సులో మూఁడవ వంతు వధువునకుండ వలె నని చెప్పుచున్నది.

సీతారాములు వయస్సు నం దెట్లు తగి యున్నారో శీలమునం దట్టులే తగి యున్నారు. ఎట్లనిన:— రామచంద్రమూర్తి 'వానియెడ నుండెనేని యేచేని దోష మద్ది గర్హ్యంబుగాదు సదాభిల, కని చెప్పెను. సీతాదేవియో'

వధకుఁ బాత్రుల పట్లన్ గృపఁ జూపవలయు సజ్జనుఁ డపరాధము చేయనట్టి యతఁడుం గలఁడే' యని చెప్పెను.

సాముద్రిక ప్రకారము సార్వభౌముఁడు కాఁగలవాని చిహ్నములు రామచంద్రు నందుఁ గలవు. అట్టివానికి భార్యగా నుండఁదగిన దాని కెట్టి చిహ్నము లుండవలయునో యట్టివి సీతయం దున్నవి. వంశము నందు నొకరు సూర్యవంశమునఁ బ్రసిద్ధికెక్కినవారి కుమారుఁడు. సీతాదేవి చంద్రవంశమున జగత్ప్రసిద్ధి గన్న జనకుని కూఁతురు.

ఈ సందర్భమున నీ స్తోత్రము పఠనీయము.

అయోధ్యాపురనేతారం, మిథిలాపురనాయకీం
రాఘవాణా మలంకారం, వైదేహానా మలంక్రియామ్,
రఘూణాం కులదీపంచ, నిమీనాం కులదీపికామ్
సూర్యవంశే సముద్భూతం, సోమవంశే సముద్భవామ్

పుత్రం దశరథస్యాఽపి, పుత్రీం జనకభూపతేః
వసిష్ఠానుమతాచారం, శతానంద మతానుగామ్
కౌసల్యా గర్భసంభూతం, వేదిగర్భోదితాం స్వయమ్.
పుండరీక విశాలాక్షం, స్ఫురదిందీవరేక్షణామ్,
మత్తమాతంగ గమనం, మత్తహంసవధూగతామ్.

* * * * *

సర్వలోక విధాతారం, సర్వలోక విధాయినీమ్
లోకాభిరామం శ్రీరామం అభిరామాంచ మైథిలీం
అన్యోన్య సదృశౌ వేతౌ త్రైలోక్య గృహదంపతీ.
(హనుమద్విరచిత సీతారామ స్తోత్రమునుండి సముద్ధృతము.)

'స్మరణమాత్ర సంతుష్టాయ' యన్నట్లు స్మరణముచే సంతోషించు వాఁడు రామచంద్రమూర్తి. ఒక్క నమస్కారముతో సంతోషించునది జానకి. 'ప్రణతి ప్రసన్న జానకి' యని యీ కాండమే చెప్పుచున్నది.

ఇట్టి యనురూప దాంపత్యము లోకమునందుఁ గలదా యని హనుమంతుఁ డాశ్చర్యపడుచున్నాఁడు.

ఇచ్చట నీ శ్లోకార్థము గ్రాహ్యము.

యువత్వాదౌ తుల్యేఽప్యపరవశతా శత్రుశమన
స్థిరత్వాదీన్ కృత్వా భగవతి గుణాన్ పుంస్త్వసులభాన్
త్వయి శ్రీ స్త్రైకాంతాన్ మ్రదిమ పతిపారార్థ్య కరుణా
క్షమాదీన్ వా భోక్తుం భవతి యువయో రాత్మని భిదా॥

తల్లీ! యౌవనములోనైన గుణములు మీ యిద్దఱ యందు సమానములే, అయినను స్వాతంత్ర్యము శత్రు సంహారము స్థిరత్వము (స్వకార్యము నుండి చలింప కుండుట) యీ మొదలగు పురుషులయం దుండఁ దగు గుణములు నీ భర్తయం దున్నవి. నీ యందో మృదు హృదయము, భర్త విషయమున పారతంత్ర్యము, కరుణ, (ఇతరుల దుఃఖముల సహింప లేకుండుట) క్షమ (అపరాధముల సహించుట) గలవు. ఈ యీ మొదలగు గుణములు మీ స్వరూప విగ్రహములను ననుభవించుట యందు భేదము గలదు. ఈ కారణముచే భక్తుల కిరువురును సేవ్యులే కాని యొకరు మాత్రము గారు. ఈ సందర్భమున వీరి యిరువుర సామ్యము గుఱించిన ఈ ప్రమాణ వాక్యంబులు స్మరణీయంబులు. "నిత్యైవైషా జగన్మాతా, విష్ణోః శ్రీ రనపాయినీ। యథా సర్వగతో విష్ణు, స్తథైవేయం ద్విజోత్తమ।" జగన్మాత యగు శ్రీ దేవి విష్ణువునకు నిత్యానపాయిని. ఇరువురకు వెలుపాటు లేదు. ఒకరున్నచోట రెండవ వారు తప్పక యుందురు.

త్వం మాతా సర్వలోకానాం, దేవదేవో హరిః పితా
త్వయా చ విష్ణునా చాంబ ! జగద్వ్యాప్తం చరాచరమ్.

అమ్మా! సర్వలోకములకు నీవు తల్లివి; దేవదేవుఁడగు హరి తండ్రి; మీ యిరువురిచేఁ బ్రపంచ మంతయు వ్యాపింపఁబడినది.

లక్ష్మ్యా సమస్తం చిదచిత్స్వరూపం
వ్యాప్తం తదీశస్య తు సాఽపి సర్వమ్
తథాపి సాధారణ మీశితృత్వం
శ్రీ శ్రీశయో ర్ద్వావ సదైకశేషీ ।

చిద చిత్స్వరూపము సమస్తము లక్ష్మీదేవిచే వ్యాప్తము. దానిని నియమించు నది యామెయే. అయినను యీశత్వము శ్రీ శ్రీశులయందు ఇరువుర యందు సమానము. సర్వదా ఏకశేషులే.

ఒక మాటచే నిరువురఁ దెలుపునది యేకశేషము. జనని + జనకుఁడు = ఈ యిరువురను జెప్పవలసి వచ్చినపుడు జనకులు అనినఁజాలును. ఇట్టులే భ్రాతలు=అన్న, చెల్లెలు, అక్క- తమ్ముఁడు. పుత్రులు = కొడుకు, కూఁతురు.

ఇట్టులే భగవంతుని పేరు చెప్పినపుడు భగవతి లక్ష్మికూడ నున్నట్టులే భావింపవలయును.

ఈ విధముగ సర్వకారణత్వము సర్వవ్యాపకత్వము సర్వనియంతృత్వము లక్ష్మీనారాయణు లందు సీతారాములయందు నిరువురయందుఁ గలదు.

భగవంతుని విషయమై 'సర్వస్య వశీ-సర్వస్యేశానః' అనియు 'విశ్వ స్యాత్మే శ్వరగ్ం' వాక్యము లుండిన లక్ష్మి విషయమై 'అ స్యేశానా జగతో విష్ణుపత్నీ, ఈశ్వరీగ్ం సర్వభూతానా' మిత్యాది వాక్యములు గలవు.

కావుననే న్యాసవిద్యయందు శరణాగతి యిరువురకుఁ జెప్పఁబడెనే కాని యొకరికి మాత్రమే చెప్పఁబడ లేదు."లక్ష్మీంచ మాం సురేశేశ, ద్వయేన శరణంగతః మల్లోక మచిరా ల్లబ్ధ్వా మత్సాయుజ్యం స గచ్ఛతి।నిరుపాధిస్వతంత్ర శ్చ స్వామినః కరుణానిధిః నిరుపాధిస్వతంత్రాచ స్వామినీ నః కృపానిధిః । త్వమేవ సర్వశాస్త్రేషు శరణత్వేన నీయసే । ఆత్మాత్మీయం చ యత్కించ దుర్భరం దుస్త్యజం మమ । తత్సర్వం తవ విన్యస్తం శుభయోః పాదపద్మయోః । ఉపేయస్య తవ ప్రాప్త్యై త్వా ముపాయత్వేయా వృణే । ఉపాయో భవ మేదేవ శరణం భవ మేఽచ్యుత । ఉపాయో భవ మే దేవి, శరణం భవ మేఽంబికే ।

* * * *

సకృదేవం ప్రపన్నస్య, కృత్యం నైవావశిష్యతే।
చంద్రాం ప్రభాసాం యశసా జ్వలంతీం
శ్రియం లోకే దేవజుష్టా ముదారాం
తాం పద్మనేమీం శరణ మహం ప్రపద్యే
అలక్ష్మీర్మే నశ్యతాం త్వాం వృణే.

ఈ విధముగ శ్రుతు లిరువురకు శరణాగతి విధించుచున్నవి. ఇరువుర యం దుపాయత్వము గలదు. ఉపేయత్వము గలదు. హనుమంతుఁడు చంపఁబోనిన రాక్షస స్త్రీలను తనకు శరణాగతలైన స్త్రీలను దానే స్వతంత్రించి రక్షించెఁగదా. ఇత్యాది కారణములచే సీతారాము లిరువురు సమానులుగ సేవ్యులనియే హనుమంతుఁడు గ్రహించెను.

క. అని బంగరు బొమ్మనఁ ద్రిభువనములకు నేల్పుసాని • వరలక్ష్మి వలెన్
గన నగుసీతను గనుఁగొని,మనమున రాముని దలంచి•మఱియుం బలికెన్. ౪౭౧

తా త్ప ర్య ము.

అని బంగారు బొమ్మవలె, లేక మూఁడులోకములకు నేల్పుసాని = ఈశ్వరి యగు, వరలక్ష్మివలె = శ్రీ మహాలక్ష్మివలె నుండు సీతాదేవిని జూచి మనస్సున రాముఁన్ని దలఁచి యి ట్లనుకొనెను.

బంగారు బొమ్మ యనుటచే సుగుణముల రాశి యనియు హేయగుణ రహిత యనియు లోకుల యందఱిచేతఁ గోరఁబడునది యనియు భావము. 'హిరణ్మయీం లక్ష్మీ'మ్మని కదా, శ్రీసూక్తము. త్రిభువనములకు నేల్పుసాని యనుటచే మూఁడు లోకములలోని వా రామె యాజ్ఞాబద్ధు లని భావము.

'యథా మయా జగద్వ్యాప్తం స్వరూపేణ స్వభావతః తయా వ్యాప్తమిదం విశ్వం నియంత్రీ చ తథేశ్వరీ।సర్వేషా మేవ లోకానా మీశ్వరీ మమ వల్లభా।' నేనెట్లు స్వరూప గుణములచే లోకమున వ్యాపించి యున్నానో లోకముల కెల్ల నీశ్వరి యగు నా వల్లభయు నట్లే వ్యాపించి యున్నది. ఆమె యీ లోకములకు నీశ్వరి యను శ్లోకార్థ మిట ననుసంధించునది.

యథా సర్వగత స్త్వంహి, తథైవేయం రఘూత్తమ. ప. పు. నీ వెట్లు సర్వత్ర వ్యాపించి యున్నావో రామచంద్రా! యీమెయు నట్లే వ్యాపించి యున్నది.

లోకేశ్వరి యనిన శచీ సరస్వతీ పార్వతీత్యాదు లందెవరో యనిసందేహము గలుగకుండుటకై వరలక్ష్మి యనియె స్పష్టముగఁ జెప్పుచున్నాఁడు. సంస్కృతమున ఇవ శబ్దము ఏవార్థమున గ్రహించి నట్లు ఇచ్చట వలె యనునది నిర్ధారణమందు గ్రహింపనగు.

పై పద్యమునందు సీతాదేవిని మనుష్యభావమునఁ జెప్పెను. ఆమెను మఱియుఁ బరీక్షించి యమానుష లక్షణము లుండుట గ్రహించి దేవతాస్త్రీలలో నీమె యెవతెయై యుండు నని విచారించి లక్ష్మీదేవియే యని తీర్మానించుకొను చున్నాఁడు. హనుమంతుఁడు రామచంద్రమూర్తిని తొలుత దర్శించి నపుడు రామచంద్రమూర్తి నాలుగు చేతులతోఁ గనఁబడఁగా నీయన సామాన్యమనుష్యుఁడు గాఁడు, భగవదవతారమూర్తి యని గ్రహించెను. ఇచ్చట లక్ష్మీత్వము సుస్పష్టముగా సీతయందుఁ గాన వచ్చెను.

వేల్పుసాని యనుచో "బ్రహ్మేశాది సురవ్రజ స్సదయితః త్వద్దాసదాసీ గణా" యను శ్లోకార్థము గ్రహింపనగు.

స్వరూపం స్వాతంత్ర్యం భగవత ఇదం చంద్రవదనే
త్వదాశ్లేషోత్కర్షా ద్భవతి ఖలు నిష్కర్షసమయే
త్వ మాసీ ర్మాత శ్శ్రీ కి మిమ రిద మిత్థం స్వవిభవ
స్తదంతర్భావా త్త్వాం న పృథ గభిధత్తే శ్రుతి రపి॥

తల్లీ! భగవంతుని స్వరూపము స్వాతంత్ర్యము ఎట్టిది యని విచారించి నిష్కర్ష చేయవలసి వచ్చినపుడు నీ సంయోగాధిక్యమును బట్టి యాయన కవి గలుగు చున్నవని చెప్పవలసి యున్నది. అనఁగా సకల సమృద్ధిస్వరూప వగు నీవున్న చోటనే యాయన యుండును గనుకనే శ్రీనివాసుఁ డని పేరుగల వాఁడయ్యెను, అని నిన్నుఁ బట్టి యాయన గుణములు స్వరూప స్వభావములు తెలియవలసి యున్నవి. కనుక శ్రుతులు నీవు భగవంతునికంటె భిన్నమని చెప్పవు.

సీ. ఈ కాంతకై కదా • యిషువున నొక్కంట, బలశాలి యవ్వాలి • భంగపడియె
నీ వెలందికె కదా • రావణతుల్యవీ,ర్యుండు గబంధుఁడు • రూపు మాసె
నీ మానినికె కదా•భీమవిక్రముఁ డైన, యనిరోధుఁడు విరాధుఁ • డంతమొందె
నీ నెలంతకె కదా • కానలోఁ బదునాల్గు, వేలరక్కసులనుఁ • బేరు మాసె
తే. నీమెకై కాదె ఖరఖలు•నామ మణఁగె, నీ పతికిఁ గాదె త్రిశిరుండు•నీల్గి చనియె
నీ సుదతికయి దూషణుం•డే పడంగెఁ, బటుపరాక్రముఁ డగు రామ•భద్రుచేత.

ఈ ప్రకార మీయామెయే రామచంద్రమూర్తి భార్య సీతాదేవి యని నిశ్చయించుకొని యీయామె మాహాత్మ్యము మనస్సునకుఁ దెచ్చుకొని మఱియు నిట్లనుకొను చున్నాఁడు.

అర్థములు. ఇషువు=బాణము, అనిరోధుఁడు=అడ్డములేనివాఁడు,

రామచంద్రమూర్తి చేయు కార్యముల కన్నిఁటికి మూలకారణ మీయామెయే కదా యనుకొనుచున్నాఁడు.

తా త్ప ర్య ము.

రామచంద్రమూర్తి బలశాలి యగు వాలిని నొక్క బాణముచే జంపుట యీమె కొఱకే కదా. ఈమె కొఱకే కదా రావణునితో సమానమైన బల వీర్యములు గల కబంధుఁడు రూపు మాసిపోయెను. యుద్ధమునం దెదురులేని భయంకరమైన పరాక్రమము గల విరాధుఁడు చచ్చుట కీమె కదా కారణము. ఈమె నిమిత్తముగాఁ గదా జనస్థాన మందుఁ బదునాలుగువేల రాక్షసులు నాశ మైరి. ఖరుఁడు - త్రిశిరుఁడు - దూషణుఁడు రామచంద్రమూర్తిచేఁ జచ్చుటకు నీమె కదా కారణము.

ఇన్నిఁటి యందుఁ గారణము సీతాదేవి. కర్త శ్రీరామచంద్రమూర్తి. ఇవన్నియు మనస్సునం దుంచుకొనియే రావణు విషయము నందును నిమిత్తము శ్రీరామచంద్రమూర్తి యనియు నిమిత్తము కారణము సీతాదేవి యనియు ౧౩౩౬ వ పద్యమున హనుమంతుఁడు వానరులకుఁ జెప్పెను. చేయించునది సీతాదేవి. చేయువాఁడు రామమూర్తి. నిగ్రహానుగ్రహముల రెంట నిదే నియమము.

ఉ. ఈమెకు నై దురాలభక • పీశ్వరపాలితపూజ్యసంపదల్
శ్రీమహితార్క-సంభవునిఁ • జేరె నిమేషములోన, సాగరం
బీమెకుఁ గాదె నేను దరి • యించితి, నీ పురిఁ గంటి, నీమెకై
రాముఁడు లోక మెల్ల మహిఁ • గ్రాఁచిన యుక్తమ నాకుఁ జూడఁగన్. ౪౬౩

అర్థములు. దురాలభ=లభింప సాధ్యముకానిది. అర్క-సంభవునిన్=సుగ్రీవుని, క్రాఁచినన్ = కాల్చినను.

తా త్ప ర్య ము.

ఈమెకుఁగాను గదా దుర్లభమైన వానరరాజ్యసంపద నిమిషములో సుగ్రీవునికి లభించెను. ఈమె నిమిత్తమై కదా నేను సముద్రము దాఁటితిని. ఈ పట్టనము జూచితిని. ఈమెను రక్షించుకొనుటకై రామచంద్రమూర్తి గాని నేను గాని చేసిన యీ కార్యములు క్షుద్రములు. ఇవి యవి యననేల? ఈమె నిమిత్తమై రామచంద్రమూర్తి మూఁడులోకములు దహించినను దోషముగాదు. ఏల?

క. మేలో త్రిభువన రాజ్యము, మేలో జానకి యటన్న • మేదినిసుతకున్
దై త్రిలోక్యరాజ్య మెల్లను, జాలదు పో యొక్క-కళకు • సరిపోలంగన్. ౪౬౪

తా త్ప ర్య ము.

సీతాదేవి లేక మూఁడులోకముల ప్రభుత్వము వచ్చిన మేలా? మూఁడులోకముల ప్రభుత్వము లేక యొక సీతాదేవి లభించుట మేలా? యని యాలోచించిన సీత కళలలో నొక్క-కళకైనను నీ మూఁడులోకములు సరిపోఁ జాలవు. సీతాదేవి

రొక్కతె యుండెనా యిటువంటి ముల్లోకములు కోటానఁగోట్లు లభించును. ఆమె లేకున్న, యీ మూఁడులోకములు కూడ దక్కవు. కావున సీతను రక్షించుకొనుటకై యీ మూఁడులోకములను భస్మము చేసినను దోషము గాదు.

భగవంతుఁడనేక కోటి బ్రహ్మాండ నాయకుఁడు. లక్ష్మీదేవి యీ యఖిలాండ కోటి బ్రహ్మాండములకు నాయకి. ఈ యనంత బ్రహ్మాండము లామె వలననే నామ రూపవంతములై స్థితి గలవై యున్నవి. అట్టి యామె కీ మూఁడులోకము లేమి లెక్క? ఇట్లు చెప్పుటచే లక్ష్మీదేవి (సీతాదేవి) సహధర్మ చారిణియై భగవత్సంకల్పానుసారముగఁ దదాజ్ఞా వశవర్తినియై యాయనకుఁ బరతంత్రయై యుండు నని భావము.

ఆ. ఈమె ధర్మశీలుఁ • డెంతో మహాత్ముండు, మిథిలనాథుఁ డగుచు • మేల్మిగన్న
ప్రథితజనకుతనయ • భర్తృదృఢవ్రత, యల్ల సీత సంది • యంబు లేదు. ౪౬౫

అర్థములు. ప్రథిత = కీర్తి కెక్కిన.

తా త్ప ర్య ము.

ఈమె ధర్మగుణము గలవాఁడును నింతయని చెప్పరాని మాహాత్మ్యము గలవాఁడును నగు మిథిలాధినాథుఁడగు జనకునికూఁతురు. పరమ పతివ్రత యగుసీతయే, సందేహములేదు. ఆమె యందుఁగానున్న నిట్టి లక్షణములు మఱి యొకతె యందుండవు.

సీ. తమ్మిపుప్పొడులయం • దం బైన మడిదుమ్ము, రేఁచునాఁగటికొనఁ • దోఁచె ధాత్రి
సత్యశీలుం డైన • జనకావనీశుని, ముద్దులకూఁతు రై • తద్ద పెరిఁగె
అతివీరుఁ డార్యుండు • నపరాజితుండైన, యాజికిఁ దొలికోడ • లగుచు నెగడె
విదితాత్ముఁడును కృత • విదుఁడు ధర్మజ్ఞుఁడౌ, రాముని మోహంపు • రాణి యయ్యెఁ
తే. గాంతుపై భక్తిఁ గష్ట మన్ • చింత లేక, సౌఖ్యములఁ బాసి చొచ్చెని • ర్జనవనంబు
నాకులలములుదినియింటి • యందుఁబోలెఁ, బతిని సేవించుపతివ్రత్య • సతులఁజిక్కె.

అర్థములు. తమ్మి = తామర, ధాత్రి=భూమి, దాది, సత్యశీలుఁడు=సత్యము పలుకుటే స్వభావముగఁ గలవాఁడు, అపరాజితుఁడు=జయింపరానివాఁడు, ఆజికి = దశరథునకు, తొలికోడలు = పెద్దకోడలు; విదితాత్ముఁడు=ఆత్మజ్ఞానము గలవాఁడు, కృతవిదుఁడు = కృతజ్ఞుఁడు, మోహంపురాణి = ప్రియురాలు.

తా త్ప ర్య ము.

తామర పుప్పొడులచే నందంబైన పొలము దుమ్మును రేఁగునట్లుచేయు నాఁగటి కొనవలన భూమియందు, పుప్పొడిచే నందమైన తామరల దుద్దునందుఁ దోఁచు లక్ష్మీదేవివలె జనించి ధాత్రిని లోకమున కంతయు ధాత్రిజేసెను. ఆ పిమ్మట సత్య

మైన శీలము, సత్యమే శీలముగాఁ గలిగిన జనకునకు ముద్దుకూతురై తనకు జనకుఁడగుటచే లోకమునకంతయు జనకుఁడను పేరువచ్చునట్లు చేయుచుఁ బెరిగెను. (తనతోఁ బుట్టిన కారణమున చంద్రుఁడు లోకమున కంతయు మామయైనట్లు) ఆవల నతి పరాక్రమవంతుఁడును ఆర్యుడను సార్థకనామధేయము గలవాఁడును యుద్ధమునందుఁ బరాజయ మెట్టిదో యెఱుఁగనివాఁడును, నగు దశరథునకు పెద్దకోడ లయ్యెను. ఆత్మజ్ఞానముగలవాఁడును కృతజ్ఞుఁడును శరణాగతరక్షణ ధర్మ మెఱిఁగినవాఁడును, నగు రామచంద్రమూర్తికి ముద్దులరాణి యయ్యెను. ఇటువంటి మహానుభావురాలు భర్తపై గల భక్తిచేతఁ గష్టమను విచారమే లేక సౌఖ్యములనెల్ల సమూలముగ వదలి పతిసేవ యథేచ్ఛముగఁ జేయవచ్చునని జనులులేని యడవికివచ్చి యాకలములుదిని స్వగృహమందువలె సంతుష్టచిత్తయై పతిని సేవించు మహాభాగ రాక్షసస్త్రీల నడుమఁ జిక్కుపడి యున్నది. సీతాదేవికి నడవియందలి కష్టములు కష్టములుగాఁ దోఁపకుండుట కేమి కారణము? భక్తి పూర్వకముగ మనస్సంతయు భర్తపై నుంచినది కావున. ఱాతిని ద్రొక్కినా కంపను ద్రొక్కినా యని మనస్సు దానిపై నుండినఁ గదా కష్టము తెలియును. మనస్సు మఱియొక విషయమున నానందించునపుడు తక్కిన వెల్లు మనస్సునకు రాఁగలవు.

ఉ. సుందరిఁ గష్టదూర దర•సుస్మితభాషిణి స్వర్ణవర్ణ రా
కేందునిభాస్య రాక్షసకు•లేశ్వరపీడిత నీరువట్టుచే
నందురువాఁడు పెంజలువ•పందిరి డాయఁగఁ గోరునట్లు లీ
కుందరదం గనంగ రఘు•కుంజరుఁ గోరుట యుక్తమే కదా. ౪౬౭

అర్థములు. కష్టదూర = కష్టములకు దూరముగ నుండఁదగినది, దరసుస్మిత భాషిణి = కొంచెపుఁ జిఱునవ్వుతో మాటలాడునది, 'స్మిత మిహ వికాసి నయనం కించిల్లక్ష్యద్విజం హసితం । మధురస్వనం విహసితం సాంగశిరఃకంప ముద్ధసితమ్ । అపహసితం సాస్రాక్షం విక్షిప్తాంగం భవత్యతిహసితం ద్వే ద్వే హసితే చైషా ముత్తమ మధ్యమాధ మాభిధే క్రమశః.

పెదవులు కదలింపక కన్నులచే నవ్వుట హసిత మనఁబడును. కొంచెముగా దంతములు కనపడఁ బెదవులు తెఱచుట హసిత మనఁబడును. ఇవి రెండుత్తమ స్త్రీల లక్షణము. మధురముగ స్వరము వినవచ్చునట్లు నవ్వుట విహసితము. దేహము శరీరము కదలునట్లునవ్వుట ఉద్ధసితము. దీనినే యపహసితమందురు. ఈ రెండును మధ్యమ స్త్రీల లక్షణములు. కన్నీళ్లు కాఱునట్లు నవ్వుట అపహసితము. విశేషముగ దేహమంతయు గదలునట్లు నవ్వుట అతిహసితము. పకపక వికవిక నవ్వులు దీనిలోఁ జేరినవే. ఇది యధమ స్త్రీల లక్షణము. స్వర్ణవర్ణ=బంగారు చాయగలది. రాకేందు నిభాస్య = పూర్ణచంద్రునివంటి ముఖము గలది, రాక్షసకులేశ్వర పీడిత=రావణుచే

బాధింపఁబడునది, నీరువట్టుచే = దప్పిచే, వందురు వాఁడు = బాధపడువాఁడు, రఘుకుంజరు కోరుట=రాముఁడు కోరుట, షష్ఠీసమాసంబునఁ బ్రత్యయలోపము.

తాత్పర్యము.

సీతాదేవి సౌందర్యముచేతనే యాదరింపఁదగినది. కష్టములెట్టివో యెఱుఁగక సుఖము లనుభవింపదగినది. ఉత్తమ స్త్రీ గావునఁ గొంచెపుఁ జిఱునవ్వుతో మాటలాడునది, బంగారు ఛాయగల దేహము గలది, నిండు చందురుని వంటి ముఖము గలది. రావణుచే బాధింపఁబడునది. ఇట్టి దానినిదప్పి గొన్నవాఁడు పెద్ద చలువ పందిరి యొద్దకుఁ బోవఁ గోరునట్లు రామచంద్రమూర్తి చూడఁగోరుట యేమి యాశ్చర్యము? చూడఁగోరఁజేని దోషమాతనిదేకాని యామెది కాదు. చలువ పందిరి యొద్దకు దప్పి గొన్నవాఁడు పోకుండిన దోషమెవరిది? దుఃఖ మెవరికి?

క. రాజ్యపదభ్రష్టుఁడు దన,రాజ్యము లభియింప నలరు • రహిని త్రిలోకీ
 పూజ్య యగు సీత మరలం, బ్రాజ్యంబుగఁ బొంది ముదము•పడు రాముండున్.

తాత్పర్యము.

రాజ్య సింహాసనమును పోఁగొట్టుకొన్నవాఁడు తన రాజ్యమును మరల సంపాదించుకొని సంతోషించు నట్లు మూఁడు లోకములకు త్రివిధ జీవకోటులకు (బద్ధ - ముక్త - నిత్య) పూజ్యురాలగు సీతను రామచంద్రమూర్తి మరలఁ బొంది సుఖించును, సంతోషించును.

దప్పిగొన్నవాఁడు - చలువపందిరి. రాజ్యము-భ్రష్టరాజు - ఈ రెండుపమానములు రామచంద్రమూర్తియే సీతను బొందుటకై కృషిచేసి యామె యున్న చోటికి వచ్చి యామెను గ్రహింపవలయు నని సూచించుచున్నది. ఆ విషయమున సీతాదేవి చేయవలసిన ప్రయత్న మేమియు లేదు.

ఉ. చుట్టములం దొఱంగినను • జూఱలు వోయినఁ గామభోగముల్
 నిట్టలమైన కష్టముల • నెవ్వగఁ దాను మునింగి యుండినన్
 నెట్టన ప్రాణనాథుఁ గన • నిల్పి మనం బనయంబు నోర్పుతో
 గిట్టకయున్న దీమె పిడి•కింట వయో బిగఁబట్టి ప్రాణముల్. ౪౬౯

అర్థములు. తొఱంగినను = వదలినను, చూఱలు = కొల్లలు, నిట్టలము = అధికము, నెవ్వగన్=నెఱ+వగన్ = నిండు దుఃఖమునందు, అనయంబు = సర్వదా, గిట్టక = మరణింపక.

తాత్పర్యము.

దప్పిగొన్నవాఁడు చలువపందిరికై రాఁగా, నందు నీళ్ళు లేకుండెనేని యెట్లు ప్రతిపించునో యట్లు రామచంద్రమూర్తి తన నిమిత్తమై యెంతో కృషిచేసి వచ్చి

నపుడు సీత తాను మరణించి యుండిన నెంత సంతాపపడునో యను భావముతో నాయన కట్టి సంతాపము కలిగింప నిష్టము లేక బంధువులందఱు విడిచినను, ఇష్టసౌఖ్యములు కొల్లపోయినను, ఎన్ని దీర్ఘకష్టములలో మునిఁగినను, సర్వకాల సర్వావస్థల మనస్సు తన భర్తయందే నిలిపి పోనున్న ప్రాణములను బోనీయక బిగఁబట్టి యున్నది. ఆమె చేయఁదగినది యింతమాత్రమేగాక మఱియేమి చేయఁగలదు.

ఈ పద్యము మొదలు సీతాదేవి వృత్తాంతము ఏకమై, అనన్యమై, భగవత్ప్రాప్తి యెప్పుడో యెప్పుడో యనియే కోరు పరమభక్తుని ప్రపన్నుని చరిత్రము ననుకరించు చున్నది. లంక యందు స్త్రీలు,

౧. జన్మకర్మములచే రాక్షసు లయి రావణు వలచియుండువారు.

౨. జన్మకర్మములచే రాక్షసులు గాకపోయినను రావణుచే నపహరింపఁబడి లంకకు వచ్చిన పిమ్మట వానికి వశపడి యుండుటే సుఖ మని యుండువారు.

౩. రావణుచే బలాత్కారముగ నపహరింపబడి లంకనుండి రావణు బారినుండి తప్పించుకొని పోవు మార్గము తెలియక రక్షించువారు లేక క్షుద్ర సహవాస మని వాని సాంగత్యము రోసి వానికి విముఖులై లంక యందే పడి యుండువారు.

౪. బలాత్కారముగ లంకకుఁ దేఁబడినను రామచంద్రమూర్తిని నమ్మి యాయనయే రక్షకుఁడని విశ్వసించి యాయననే ధ్యానముచేయుచు లంకను, రావణుని సపరివారముగ దగ్ధముచేసి పోవలయు నని యుండు సీతాదేవి.

ఈ లోకమునం దీ నాలుగు తెగల మనుష్యులే కానవచ్చు చున్నారు.

౧. మొదటి తెగవారు పాపములోఁ బుట్టి పాపములోఁ బెరిఁగి యింద్రియ పరమార్థమని తలఁచి పరలోక విచారమే లేనివారు.

౨. ఉత్తమ వంశములలోఁ బుట్టినను స్వధర్మము నుండి చెడి కామదాసులై యింద్రియ సుఖములకుఁ బాలుపడినవారు.

౩. ఉత్తమ జన్మము లెత్తియు సంసారమునఁబడి కామమునఁ జెడ నొల్లక సంసారమునుండి తప్పించుకొను మార్గము తెలియక రక్షకులులేక పరితపించు జీవులు.

౪. ఏదియో యల్ప పాపముచే సంసారమునఁ బడితి మని తలంచి నిర్వేద పడుచు దీనినుండి తప్పించువాఁడు భగవంతుఁడు తప్ప వేఱొకరుఁడు లేఁడని విశ్వసించి తక్కిన యుపాయము లన్ని వదలి పరమభక్తినో, ప్రపత్తినో యాశ్రయించి యుండువారు.

సీతాదేవి తాను జెఱనుండి తప్పించుకొని పోవుటయే గాక తనవలె దుఃఖించు చున్న దేవ గంధర్వనాగకాంతలను విడివడఁజేసి నట్లు ఈ నాలుగవవారు తాము తరించి తమ తోడి వారిని దరింపఁజేయుదురు. వీరికిఁ గావలసినదే రామాయణంబున సీతాచర్య నేర్పునది. దేహమునందుండు బద్ధజీవుఁడు కామ క్రోధాదులు, ఇంద్రియ

ములు తన్ను బాధించు చున్నను వానిని లక్ష్యపెట్టక దుఃఖములవలె సుఖంబులను గోరక భగవత్ప్రాప్తికై యెదురుచూచుచు భగవత్ప్రాప్తితప్ప వేఱు స్వర్గాదిఫలము గోరక భగవత్ప్రాప్తికి భగవంతునిఁ దప్ప, కర్మజ్ఞాన, యోగసాధన భక్తులను నుపాయముల వెదకక దేహాభిమానము స్వాతంత్ర్యము సంపూర్ణముగ వదలి స్వరక్షాభారము భగవంతుని మీఁదనే వైచి, అనన్యార్హ శేషత్వము, అనన్యశరణత్వము, అనన్యభోగ్యత్వము నను నాకారత్రయ సంపూర్తిగలిగి సంసారము నుండియే తరింపఁగోరి ప్రపత్తిచేతనో, పరమ భక్తిచేతనో సాయుజ్యము పొందవచ్చునని సీతాదేవి చరిత్రమువలన మన మెఱుంగవలసి యున్నది. మీఁదఁ జెప్పిన విషయము లన్నియు సీతాదేవి చరిత్రయందు గమనింప నగు. సాయుజ్య లక్షణము యుద్ధకాండమునఁ జెప్పఁబడును. కావున భగవత్ప్రాప్తి కోరువాఁడు ఆయన యనుగ్రహప్రాప్తికై సీతాదేవివలె భగవన్నామోచ్చారణము చేయుచు స్వధర్మము వదలక మీఁదఁ జెప్పినట్లు వర్తించుట తప్ప మఱియేమియుఁ జేయవలసిన పనిలేదు. సీతాదేవి ప్రతిదినము సంధ్యవార్చుచుండెననుటచే పరమభక్తుఁడైనను, ప్రపన్నుఁడైనను, జ్ఞానియైననుయావజ్జీవము నిత్యకర్మముల వదలరాదు. కామ్యకర్మములతోఁబనిలేదు. ప్రపన్నుఁడు పరమభక్తుఁడు యజ్ఞాదులు చేయవలసిన పని లేదు. ప్రాణాయామ మభ్యసింప వలసిన పనిలేదు. ఆసన సిద్ధి పనిలేదు. సన్న్యాస విషయము తలంప వలసిన పనిలేదు. సర్వభూతదయ వదల రాదు. శత్రువులం దైనమైత్రియే చూపవలయును. ఇ వన్నియు సీతాదేవి చర్యవలన మనము నేర్చుకొని బాగుపడవలసిన విషయములు. ఈ ప్రకారము వర్తించు వానికి జన్మాంతమునందే ముక్తి సిద్ధించును. సందేహములేదు.

ఉ. చూడదు రాక్షసాంగనలఁ • జూడదు పుష్పఫలద్రుమంబులన్
జూడదు రమ్యహర్మ్యముల • సుందరి డెందమునందు నెప్పుడున్
జూడఁగఁ గోరుచున్ భువన•సుందరు రాముని నొక్కని న్మదిన్
వేడుక సేయ దక్కొ నవ•నీసుత, యుక్తమె కా తలంపఁగన్. ౪౭౦

అర్థములు. ద్రుమంబులన్ = చెట్లను.

తా త్ప ర్య ము.

సుందరి యగు సీతాదేవి భువన సుందరుఁడైన శ్రీరామచంద్రు నొక్కని మాత్రమే చూడఁగోరుచు సర్వవేళల మనస్సంతయు నాయన యందే నిలిపి తన్ను బాధించు రాక్షసస్త్రీలను జూడదు. పూలచే పండులచే నిండి మనోహరమైన చెట్లను గాని యింపైనమేడలను గాని చూడదు. ఇది తగినకార్యమే కదా. చూడదనుటకుఁ గన్నులుమూసికొని కూర్చుండినదని యర్థముగాదు. వానిని మనస్సులోకి రానీయలేదని భావము. రాక్షసాంగనలఁ జూడలేదనుటచే వారుపెట్టు బాధలను లక్ష్యము చేయలేదని భావము. పండ్లు పూలచెట్లను జూడలేదనుటచే ప్రియములమీఁద మనస్సు పోనీయలేదని భావము. ప్రియాప్రియములు రెండు వదలె నని భావము. సుందరి-

భువనసుందరుఁ గోరె ననుటచే నపహత పాప్మాది గుణములు శుద్ధాత్మయందుఁ బరమాత్మయందుఁ గలవనియు జీవునం దల్పముగను పరమాత్మయందుఁ బూర్ణముగను సంకోచ వికాసములు లేకయున్న వనియు శేష శేషిత్వ భావమును దెలుపుచున్నది. రాముని నొక్కని ననుటచే నేకభక్తిని నేకాగ్రభక్తిని అనన్యత్వమును జెప్పఁబడెను. యుక్తమెకా యనుటచేఁ బ్రపన్నునకుఁ బరమభక్తునకు నిట్టిచర్య తగును గదా యని భక్తాగ్రగణ్యుఁడగు మానుమద్దాసుఁ డామోదించుచున్నాఁడు. తాను బండితుఁడైనవాఁడే కదా నొరుగుటివాని పాండిత్యము నెఱుఁగఁ గలఁడు. ఈ పద్యము భక్తుఁడు, ప్రపన్నుఁడు చాతకమువలె నుండవలయు నని బోధించుచున్నది. భూమియందెన్ని చెఱువులు నదులున్నను జాతకము వానిలోని నీరు శ్రావణ మేఘములో నుండి పడు నీటి బొట్టునకై కాచి యుండును. అట్టులే భక్తుఁడు దేవత లెందఱున్నను దన యిష్టదైవమునే నమ్మి యేకభక్తి గలవాఁడై యుండును. అట్టులే పతివ్రతయుఁ దన భర్తకంటె ధనవంతులు, విద్యావంతులు, రూపవంతులు, బలవంతులు లోకమున నుండినను వారినెల్లఁ దన భర్తకంటె నధములుగానే యెంచును గాని వారిని బ్రేమించదు. వారివలన నొకటి యాశింపదు. ఈ సందర్భమున నీశ్లోకము స్మరింపనగు పూర్వార్థము దండి చెప్పినది. ఉత్తరార్థము కాళిదాసు చెప్పినది.

'కేవా న సంతి భువి వారిరుహావతంసహంసావళీవలయినో జలసన్నివేశాః।
కిం చాతకః ఫల మపేక్ష్య సవజ్రపాతాన్ పాథోధరం (పౌరందరం) కలయతే నవ వారిధారాః'.

క. వరభూషణములకంటెను, బరమం బగు భూషణంబు • భర్తయె పతికిన్
దరుణీమణి తద్భూషా,విరహితయై వనుకతన • వెలుఁగదు కంటె. ౪౭౧

తాత్పర్యము.

శ్రేష్ఠములయిన యాభరణములకంటె పతివ్రతకు శ్రేష్ఠమైన భూషణము భర్తతోడ నుండుటయే. ఆభర్త యను భూషణము సమీప మందు లేమిని సీమె యువతులలో నెంత గొప్పదైనను బ్రకాశింపక యున్నది.

భూషలుగావు మర్త్యులకు భూరిమయాంగద తారహారముల్...... వాగ్భూషణమే సుభూషణము - భూషణముల్ నశియించు నన్నియు నన్నట్లు భూషణముల కంటె గొప్పదియు యావజ్జీవముండునదియు నిహపరతారకమగునది యగు విద్య లోనయిన నన్నియు భగవద్భక్తి లేకున్నచో వ్యర్థములు. భక్తి లేని పండితుఁడు చాకిమూటమోయు గాడిదవంటివాఁడు. జీవునకు భర్త భగవంతుఁడే.

క. ఎంతటి దుష్కరమును భూ,కాంతుఁడు ఘటియించు నీమెఁ • గనకయు బ్రదికెన్
జింతావ్యథఁ జిక్కంపు, స్వాంతగ దే మిగుల రాము•నిస్తులచరితల్. ౪౭౨

అర్థములు. నిస్తుల చరితల్=అసమానమైన నడవడి. దీని తాత్పర్యమునకు ౪౫౪-౪౫౫ పద్యములు చూచునది. మరల నదియే చెప్పవలసిన కారణ మేమన : ఇందుఁ గ్రియభేదము. 'మమ ప్రాణాహి పాండవాః' 'సాధుల ప్రాణము నాయది సాధుల ప్రాణంబు నేను' అని చెప్పినవాఁడు తనప్రాణము నొకచోట నుంచి తానొక చోట నెట్లుండఁ గలిగెను? లోకమున దేహము ప్రాణము నొకచోఁగూడి యుండును గాని వేఱువేఱుగా నుండుట గలదా? ప్రాణమొకచో నుంచి తానొకచో జీవించుట దుష్కరముగదా. ఇట్టి యసాధ్య కార్యము రామచంద్రమూర్తి చేయుచున్నాఁడే, ఏమి వింత? ముందీ విషయము భార్యాభర్తృ న్యాయము ననుసరించి చెప్పఁబడెను. ఇప్పుడు భక్త భగవన్న్యాయము ననుసరించి చెప్పఁబడెను.

క. అళినీలకుంతలాంతను, నళినీదలతుల్యనయన • నవ్యసుఖార్హన్
గలకంఠి దుఃఖితం గనఁ, బలు కేటికి నాకుఁ గూడ • వ్యథ పైకొనియెన్. ౪౭౩

అర్థములు. అళి=తుమ్మెదలవలె, నీల=నల్లనైన, కుంతలాంతను=వెండ్రుకల కొనలు గలదానిని, తలవెండ్రుకలు తెల్లనగుటకు కొనలయందుఁ బ్రారంభమగును. ఆకారణముచేఁ దక్కిన భాగమందుండు నలుపుకంటెఁ గొనలయందు నలుపుతక్కువ. అట్టి కొనలే నల్లనివని చెప్పినపుడు తక్కిన భాగముల నలుపు చెప్పవలసిన పనిలేదు. నల్లని వెండ్రుకలు మోహకారులు.

గీ. ఇరుల గెలిచిన యంతఃపు • రేందుముఖుల
కరుల మరుఁ డను వేఁటకాఁ • డురులుచేసి
మరులు గొలుపంగ లేఁడమ్యో • మనుజవిభుని
సరులులేని దృఢక్కుంజన • శాబకములు. శృం. నై. మ.

ఇట్లు చెప్పుటచే సీత తల విరియఁబోసికొని యున్నదని సూచన.

నళినిదళతుల్య = తామరతేకులవంటి, నయన = కన్నులు గలదానిని, ఇట్లు చెప్పుటచే కలువకంటి యగు సీత కన్నులయందుఁ బద్మముల సౌందర్యము గల దనియు నా కారణమున బద్మాక్షుఁడగు రాముని వశపఱుచుకొనఁ గలిగె ననియు భావము. నవ్యసుఖార్హాన్=క్రొత్త క్రొత్త సౌఖ్యములకు యోగ్యమైనది. కలకంఠి = మధురమైన కంఠస్వరము గలది. ఈమె దుఃఖించునపుడే యీమె కంఠస్వర మింత యవ్యక్త మధురముగా నున్నదే, సంతోషముతో మాట్లాడిన నెట్లుండునో కదా యని భావము, దుఃఖితన్=దుఃఖించుదానిని, వ్యథ = సంతాపము, పైకొనియెన్= తనంతటఁదానే వచ్చి మీఁదఁబడెను. నా ద్వంద్వ జయము కూడ వ్యర్థమై పోయెను.

తా త్ప ర్య ము.

తుమ్మెదలవలె నల్లని వెండ్రుకల కొనలు గలది, తామర తేకులవంటి కన్నులు

గలది, సాముద్రిక లక్షణములఁ బట్టి యెంతో సుఖింపఁదగినది, మధురమైన కంఠ స్వరము గలది, ఇట్టిదికూడ వ్యసనముల పాలగుటచేత, జితేంద్రియుఁడ నని ద్వంద్వా తీతుఁడనని గర్వముగల నాకుఁగూడ నా సమ్మతి లేకయే దుఃఖము తనంతఁదానే వచ్చుచున్నది. రామాంజనేయు లిరువురు విజితేంద్రియులే. నిర్ద్వంద్వులే. ఇరువురు సీతాదేవికై దుఃఖించిన వారే. ఏల ? పామరత్వముచేతనా? కాదు. పరుల దుఃఖము తన దుఃఖముగా నెంచుట దయ. అట్టి దయ కారణము. బ్రహ్మచారిని, జ్ఞానిని, యోగిని, విరాగిని, క్రోధిని కావున మృగమను, సీతాదేవికి నాకు నింతయుఁ బూర్వ మెట్టి సంబంధములేదు. అట్టి నాకే యీమె స్థితి దుఃఖము బలవంతముగాఁ గలిగింపఁగా భర్తయు ప్రియుఁడు రక్షాభారము వహించినవాఁడు, ఈమెచే సేవితుఁడు, ఆనంద మనుభవించువాఁడు నగు శ్రీరామ చంద్రమూర్తి తనలో సగ మగు నీమెకై వ్యసన పడిన నేమివింత ? అది స్వభావ విరుద్ధముగాదు. ఇట్టులే "జీవే దుఃఖాకులే విష్ణోః కృపా కాప్యుపజాయతే" అన్నట్లు తన యంశమైన జీవునకుఁదాను భర్తగాను స్వామిగాను ఆధారముగను, శరణ్యుఁడుగ నుండియు నట్టి జీవుఁడు సంసారములోఁబడి దుఃఖించుచుండ జగత్పితయు, కరుణా నిధియు వాత్సల్యసాగరుఁడైన భగవంతునకు దయపుట్టకుండునా? వ్యసనపడకుండునా ?

ఉ. రాముఁడు లక్ష్మణుండుఁ దను • రక్షణసేయ సుఖించు చుండు నీ
వామ క్షమన్ క్షమాతరుణిఁ • బద్మవిలోచన రాక్షసాంగనల్
భీమవిలోకనల్ బెదరు • పెట్టుచుఁ గావఁగ వృక్షమూలమం
దీమెయు నున్న దార ! విధి • కేది యసాధ్యము తప్పఁ జూచినన్. ౪౭౪

అర్థములు. క్షమన్ = ఓర్పునందు, క్షమాతరుణి=భూదేవి, భీమ విలోక నల్ = భయంకరములైన చూపులు గలవారు.

తాత్పర్యము.

రామచంద్రమూర్తియు లక్ష్మణుఁడు తన్ను రక్షించుచుండ సుఖపడవలసిన యీమె యోర్పునందు భూదేవి వంటిది, కమలముల వంటి కన్నులు గలది, చూచు టకే భయంకరములైన కన్నులు గల రాక్షస స్త్రీలు బెదరు పెట్టుచు రక్షింపఁగా చెట్టు మొదట నీ విధముగా నున్నది. భగవంతుఁడు దయతప్పి ప్రతికూలించినపుడు ఆయన కేది యసాధ్యము. అర్థాంతరన్యాసాలంకారము.

రాముఁడు, భగవంతుఁడు. లక్ష్మణుఁడు—ఇది యనంత గరుడ విష్వక్సేనాది

నిత్య భాగవతుల కుపలక్షణము. ఇట్టి వారిచే రక్షింపఁబడు ప్రత్యగాత్మ; వామ = సంకోచ వికాసములకు లోనగు జ్ఞానము గలిగి భక్తిలేమిని ప్రతికూలముగ వర్తించి; క్షమన్=ప్రకృతి తత్త్వమునందుఁబడి స్త్రీ వలె పరవశమై, పద్మవిలోచన = ప్రపంచ పదార్థములందు దృష్టికలదై; లంక యనెడి దేహములోఁ బడఁగా భయంకరములైన కామక్రోధలోభాదులు పీడించుచు ప్రకృతి విడిచి పోకుండునట్లు రక్షింపఁగా వృక్ష మూలమందు 'సమానవృక్షే' యను శ్రుతి, వృక్ష మనఁగా దేహమని బోధించుటచే వృక్షమూలమందనఁగా దేహమునకు మూలమైన హృదయ స్థానమందు నీ విధముగ దుఃఖించుచున్నది. శుద్ధాత్మ యిట్లు బద్ధాత్మ యగుటకు భగవత్సంకల్పమే కదా కారణ మని భావము.

తే. మంచు సోఁకిన నెత్తమ్మి•మాడ్కిఁ గాంతి, దఱిఁగి దుఃఖపరంపరఁ•దప్త యగుచు
నంటుకానిని బాసిన•పెంటిచక్రి, వాక మన సీత దీనత • వనరు టయ్యె. ౪౭౫

అర్థములు, నెత్తమ్మి = అందమైన కమలము, తఱిఁగి = క్షీణించి, శర దృతువునఁ గళకళ లాడుచున్న తామర పువ్వు మంచుకాలము రాఁగానే కాంతి క్షీణించిన దగును. అట్లీమె పంద్రెండవ సంవత్సరము లయోధ్యలో సమస్త సౌఖ్యము లనుభవించుచుండి యిప్పు డాగంతుకముగ నిట్టి కష్టము లనుభవించుచున్నది. కాన కాంతిహీనమై యున్న దని భావము. మంచుసోఁకిన నెత్తమ్మి యనుటచే మంచు కాలమౌ శిశిరఋతువు, నేఁడు రేపటితో వెళ్ళిపోవును. ఆవల వసంతము రాఁగానే యథాపూర్వము కాంతియుక్తమగును. అటులే యీమెకును దుఃఖము త్వరలోనే తొలఁగిపోవు నని సూచన. దుఃఖపరంపరతప్త=ఒకటి వెంబడి రొకటి విరామము లేక దుఃఖముమీఁద దుఃఖమే వచ్చుటచే నెంతదుఃఖము సహింప సాధ్యమో యంతకు మించిన దుఃఖముచే బాధింపఁబడుచున్న దని భావము. కమలములు రాత్రి వచ్చిననే ముడుచుకొనిపోవును. దానికిఁదోడు మంచుకూడఁ గురిసిన నేమగును! అంటుకానిని = భర్తయగు చక్రవాకమును, పెంటిచక్రవాకము = ఆఁడు జక్కవ పక్షి. చక్రవాక దంపతులకు రాత్రివేళ వియోగము. కావున నెడబాసి రెండును విరహవేదనఁ దపించును.

"ఆయాతి యాతి పునరేవ జలం ప్రయాతి
పద్మాంకురాణి విచినోతి ధునోతి పక్షౌ
ఉన్మత్తవ ద్భ్రమతి కూజతి మందమందం
కాంతా వియోగ విధురో నిశి చక్రవాకః."

అన్నట్లు మగచక్రవాకమును బాసిన యాఁడుచక్రవాకము ఎట్లు తపించునో యట్లు తనభర్తను విడిచి యీమెయు దుఃఖించి యీమెయు దుఃఖించు చున్నదని భావము. చక్రవాకికి రాత్రివేళ భర్తృ వియోగము కలిగినను మరల నుదయము

కాఁగానే భర్తతోఁగలిసికొందు నను నాశగలదు. అట్లులే యీయామె యాపదలు కాఁపురములు సేయవు, మంచికాలమువచ్చును, తన భర్త తన్నుఁ గలిసికొను నను నాశతో జీవించుచు ప్రకృతము దుఃఖపడుచున్నది. ఈ యుపమానములందు దుఃఖాశయము గ్రాహ్యమేకాని తక్కినవి గ్రాహ్యములు కావు.

తా త్ప ర్య ము.

మంచు సోఁకుటచేఁ గాంతి పోయిన కమలమువలె దుఃఖముమీఁద దుఃఖము వరుసగాఁ బ్రాప్తింపఁగా మిగులఁ బరితాప పడుచు తన భర్త యగు చక్రవాకమును బాసిన చక్రవాకి వలె సీతాదేవి దుఃఖించుచున్నది.

మానిని. పూవుల ప్రేఁకన వ్రాలినకొమ్మలఁ • బొల్చు నశోకమహాతరువుల్
తావులు నించుచు మాధవచారుసు•ధాకరకాంతులు రేఁగుచు దుః
ఖావిలఁ జేయుచు నున్నవి యీ తర•శాక్షి నటంచు మనంబున నీ
దేవియ సీత యటంచును నిశ్చయ•ధీయుతుఁ డుండె ద్రుమంబు పయిన్. ౪౬

అర్థములు. ప్రేఁకన = భారముచే, తావులు = వాసనలు, మాధవచారుసుధాకర కాంతులు=వసంతకాలమున మనోహరమైన చంద్రకాంతులు, రేఁగుచున్=విజృంభించుచు, దుఃఖావిలన్=దుఃఖముచే వ్యాకుల పడిన దానిని, ద్రుమంబుపైన్ = చెట్టుమీఁద. మానిని = ఏడు భగణములు, గురువు. పదుమూఁడింట యతి.

తా త్ప ర్య ము.

పూవుల బరువుచే వంగినకొమ్మలు గల యశోకవృక్షములు సువాసనలు వ్యాపింపఁజేయుచు వసంతకాల చంద్రుని మనోహరకాంతులు విజృంభించుచు నీమె విరహాగ్నిని మఱింత ప్రజ్వరిల్లఁజేసి బాధపెట్టు చున్నవి, అని తనలో ననుకొనుచు నీమెయే సీతాదేవియని నిశ్చయబుద్ధిగలవాఁడై రాక్షసస్త్రీలు మేలుకొని యుండుటచే చెట్టుమీఁదనే యుండెను. పూచిన యశోకములు, వసంతకాలము, వెన్నెలకాంతు లివి యుద్దీపనములు, కావున దుఃఖకరములు.

సీతాదేవిని నశోకవృక్షము క్రింద నుంచవలసిన కారణమేమి?

దీనికే సీతాశోకవృక్ష న్యాయ మని పేరు. ఏ చెట్టుక్రింద నుంచినను ఆచెట్టు క్రింద నుంచవలసిన కారణ మేమని ప్రశ్న పుట్టును. ఈమె కూర్చుండిన చెట్టునకు సమీపమందే మేడ యున్నట్లు హనుమంతుని వాక్యముల వలనఁ దెలియనగు. రావణుఁడు దాని యందామె నుంచ వలయుననియే తలఁచెను. గాని యామె నిరాకరించి సమీపమందున్న చెట్టుక్రిందఁ గూర్చుండెను.

—౧౭ వ సర్గము. హనుమంతుఁడు సీతాదేవికిఁ గాపున్న రాక్షసస్త్రీలఁ జూచుట—

క. అంతట నీలాంబువులం, గాంతం బగు హంసయట్లు • గగనాపరభా
 గాంతరమున వెలికలువల, కాంతి నిశాకాంతుఁ డమరెఁ గడు నిర్మలుఁడై. ౪౭౭

అర్థములు. నీలాంబువులన్ = నల్లని నీటియందు, కాంతంబగు= మనోహర మయిన, గగనాపరభాగాంతరమునన్ = ఆకాశముయొక్క వెనుకటి భాగమున, పడమటిభాగమున, వెలి= తెల్లని, నిశాకాంతుఁడు=చంద్రుఁడు, కడు నిర్మలుఁడై = మిగుల స్వచ్ఛకాంతి గలవాఁడై.

ఈనాఁడు శుద్ధ త్రయోదశి కావునఁ దొమ్మిదిన్నర గంటలకే చంద్రుఁడు నడినెత్తిమీఁదికి వచ్చె నని ముందు చెప్పఁబడెను. ఈనాఁడు చంద్రాస్తమానము. ఇఱువది యేఁ గడియలకు అనఁగా నాలుగున్నర గంటలకు. ఇప్పుడాకాశమునలుపని చంద్రుఁడు తెల్లకలువ వలె నున్నాఁడనుటచే మూఁడు గంటల పొద్దై యుండవలెను.

క. వాసిగ సీతను వెదకఁగ, భాసట యై వెలసె నేమొ • పావని కనఁగా
 భాసురనిర్మల తేజో, రాసులఁ దాపంబుఁ బాపె • రా జాతనికిన్. ౪౭౮

అర్థములు. భాసటయై=తోడై, భాసుర నిర్మల తేజోరాసులన్ = ప్రకాశించు నిర్మలమైన కాంతి పుంజముచే, రాజు=చంద్రుఁడు, అతనికిన్=హనుమంతునికి.

హనుమంతుఁడు సీతను వెదక నారంభించినపుడు లంకా ప్రవేశకాలము మొదలుకొని యీమె కనఁబడు వఱకు హనుమంతునకు సహాయుఁడై చంద్రుఁడు ప్రకాశించెను. పూనిన కార్యము నెఱవేఱినది కావున నిఁకఁ దానుండ రాదని చంద్రుఁడు వెడలి పోవుచున్నాఁడని భావము.

తా త్ప ర్య ము.

హనుమంతుఁడు సీతాదేవిని చక్కఁగా వెతుకుటకుఁ దోడై యుండెనేమో యన్నట్లు నిర్మల కాంతులచేఁ బ్రకాశించి చంద్రుఁ డాయనకు మనస్తాపం బణఁచెను.

క. వేఁగున మునిఁగెడిఁ యుడుపము, నాఁ గడుదుఃఖమున పేర్మి • సవయుచు నుండం
 గాఁ గనుఁగొనె రాముని మొల,నాఁగను నాఁగటిచాలు•నవలామిన్నన్. ౪౭౯

అర్థములు. వేఁగునన్ = బరువుచే, ఉడుపము = తెప్ప, నాన్ = అను నట్లు, వలె; నాఁగంటిచాలునవలామిన్నన్ = సీతాదేవి యనెడి స్త్రీరత్నమును.

తా త్ప ర్య ము.

బరువుచే మునిఁగిపోవుచున్న పడవవలె మిక్కిలి దుఃఖాతిశయముచే సీతాదేవి దుఃఖపడుచుండఁగా హనుమంతుఁడు చూచెను.

సీ. ధరణీసుతను జూచి • తన్నికటంబున, ఘోరదర్శనల సు•రారిసతుల
నేకాక్షిని నకర్ణ • నేకకర్ణను శంకు, కర్ణను దనుదీర్ఘ•కంధరలను
నెగయు ముక్కునదాని • దిగ్రవేలు చెవిదాని, ధ్వస్త కేశిని బోడి•తలలవారి
నతికాయ మగు నుత్త•మాంగంబుఁ గలదాని, గడ్డంబు వంటు ప•ల్కప్పుదాని

తే. లంబకర్ణలలాటను • లంబకుచను, గేశకంబళధారిణిఁ • గీశవరుఁడు
లంబజానుక లంబాస్య • లంబజఠర, లంబరదనాంశుకలయుఁ గ•దంబములను.

అర్థములు. నికటంబునన్ = సమీపమందు; ఘోరదర్శనలన్ = భయము గలిగించు నాకారముగలవారిని, ఏకాక్షి = ఒంటికన్నుగలది, అకర్ణ = చెవులు లేనిది, ఏకకర్ణ=ఒక చెవిగలదానిని, శంకుకర్ణ = మేకువంటి చెవిగలదానిని, తను దీర్ఘకంధరలను=సన్నమై పొడుగైన మెడగలదానిని, ధ్వస్తకేశిని = స్వల్పకేశములు గలదానిని, అతికాయము = దేహమునకు మించినది, పెద్దది, ఉత్తమాంగంబు = తల, పల్కప్పు = పెదవి, లంబకర్ణ లలాటను = వ్రేలు చెవులు నొసలు గల దానిని, లంబకుచను = వ్రేలుచన్నులదానిని, కేశకంబళ ధారిణి = కంబళి వంటి వెండ్రుకలు గల దానిని, కీశవరుఁడు = వానర శ్రేష్ఠుఁడు, కిసకిస = కిచకిచ, మనునవి గావునఁ గీశము లనఁబడెనేమో - లంబజానుకన్ = వంగిన మోఁకాళ్ళుగలదానిని, లంబాస్య = వ్రేలాడు ముఖముగలదానిని, లంబజఠర = వ్రేలాడు పొట్టగలదానిని, లంబరదనాంశుకల = వ్రేలాడు పెదవులుగలదానిని, వీరి, కదంబమ్ములను = సమూహములను, చూచెను.

తాత్పర్యము.

ఈ ప్రకారము సీతాదేవిని జూచి యామె సమీపంబునఁ జూచిన దిగులు కలిగించు రాక్షసస్త్రీలను ఒంటికంటిదానిని, ఒక చెవిదానిని, చెవులులేనిదానిని, మేకుచెవులదానిని, సన్నని నిడుపాటి మెడగల దానిని పైకి నెగదీసికొనిపోయిన ముక్కుబొక్కలదానిని, భుజముల మీఁదికి వ్రేలాడు చెవులదానిని, పొట్టి వెండ్రుకల దానిని, బోడితలలవారి, పెద్దతలకాయదానిని, గడ్డము తాఁకు పెదవిగలదానిని, వ్రేలాడు చెవులుగలదానిని, వ్రేలాడు నొసలుగలదానిని, వ్రేలాడు చన్నులదానిని, కంబళివంటి వెండ్రుకలు గలదానిని, వంగిన మోఁకాళ్ళుగలదానిని, వ్రేలాడుముఖము గలదానిని, వ్రేలాడు పొట్టగలదానిని, వ్రేలాడు పెదవి కలదానిని వీని గుంపును జూచెను.

సీ. గిటకలఁ బొడవుల • నట మఱుగుజ్జుల, వికటల వామనా•నికరములను
మిట్టపండ్లులదానిఁ • బొట్టయుబ్బినదాని, ముక్కుడిఁ బింగాక్షి • బొక్కనోటి
వికృతను గాళిని • బింగళఁ గ్రోధన, గాలాయసమహాశు • శూలకూట
ముద్గరహస్తల • మొగిఁ గలహప్రియ, నజమృగమహిషశి•వాస్యతలల

తే. వ్యాఘ్రముఖనుష్ట్రి గజఘోట•కాంఘ్రి మఱి ని
ఖాతమూర్ధను నేకాంఘ్రి•కర్ణ కరల
నశ్వకర్ణిక ఖరకర్ణి • హస్తికర్ణి
మఱియు గోకర్ణి హరికర్ణి • మండలముల. ౪౮౧

అర్థములు. వికటలన్=పెద్ద పిక్కలు గలవారిని, వామనానికరములను = పొట్టివారి సమూహములను, ముక్కిడిన్ = ముక్కు లేనిదానిని, అభావంబున ఇడి ప్రత్యయము. వికృతను = వికారముఖముగల దానిని, పింగళ = గోరోచనము వన్నెగలదానిని, క్రోధన=మిగుల కోపము గలదానిని, కాలాయసమహాశు శూల = ఉక్కుతోఁ జేయఁబడిన పెద్దశూలములను, కూట = కల్లు, అజ = మేఁక, శివా=నక్క, వ్యాఘ్రముఖ = పులిముఖమువంటి ముఖముగలది, ఉష్ట్రి=ఒంటెయు, ఘోట = గుఱ్ఱముయొక్కయు, గజ=ఏనుఁగుయొక్కయు, అంఘ్రి = కాళ్ళుగలది, నిఖాతమూర్ధను = గుంతపడిన తలగలదానిని, ఏకాంఘ్రి=ఒంటికాలుది, ఏకకర్ణ = ఒంటిచెవిది, ఏకకర = ఒంటిచేయిది, అశ్వకర్ణిక = గుఱ్ఱపుఁ జెవులు గలది, ఖరకర్ణి= గాడిదచెవులు గలది, హస్తికర్ణి = ఏనుఁగుచెవులు గలది, గోకర్ణి = ఆవు చెవులు గలది, హరి కర్ణి = క్రోఁతి చెవులు గలవారి, మండలములన్ = సమూహములను.

తా త్ప ర్య ము. స్పష్టము.

సీ. అతినాసను ననాస • చ్యుతనాస నుద్గతనాస, దిర్యఙ్నాస • నాగనాసఁ
బాదచూడిక హస్తి • పాదగోపాద మ,హాపాద దీర్ఘజి•హ్వానఖలను
బెద్దతలలవారిఁ • బెద్దమెడలవారిఁ, బెద్దపొట్టలవారిఁ • బెద్దకనుల
వారిఁ బెంజన్నుల•వారిఁ గ రేణుకా,ముఖి నజాముఖి హస్తి•ముఖిని నాడు

తే. పందిమోముదానిని • వాజి వక్త్రి, నుష్ట్రివక్త్రిను ఖరవక్త్రి• నుగ్రదర్శ
నలను ముద్గరశూలహ•స్తలను గ్రోధ,నలఁ గరాళలఁ గన్గొనెఁ • గలహరతల.

అర్థములు. అతినాసను=మితి మించిన ముక్కుగల దానిని, అనాసను = పుట్టువునుండి ముక్కు లేని దానిని, చ్యుతనాస = ఉండి పోయిన ముక్కు గలదానిని, ఉద్గతనాస=నొసటి దగ్గఱ ముక్కు బొక్కలు గలదానిని, తిర్యక్ + నాస = అడ్డ ముక్కుగలదానిని, నాగనాస=తొండమువంటి ముక్కుగలదానిని, పాద చూడి కన్ = పాదములందు జుట్టు గలదానిని, హస్తిపాద = ఏనుఁగు కాలు గల దానిని, గోపాద=ఆవుకాలు గల దానిని, మహాపాద = పొడుగాటి కాళ్ళుగలదానిని, దీర్ఘ.

జిహ్వానఖలను = పొడుగు నాలుక గోళ్ళు గల వారిని, కరేణుకాముఖ = ఆఁడేనుఁగు ముఖము గలదానిని, అజాముఖ = మేకముఖము గలదానిని, హస్తిముఖ = మగ యేనుఁగు ముఖము గల దానిని, వాజివక్త్రి = గుఱ్ఱపు ముఖము గలదానిని, ఖర వక్త్రి = గాడిదముఖము గలదానిని, కరాళల = మిట్టకోఱలవారిని, కలహారతల = కలహ మాడుచున్నవారిని.

తాత్పర్యము. సులభము.

ఉ. కొల్లగఁ గల్లుఁ ద్రావి, పెఱికూఁతలు రోఁతలు గొల్పి, నంజుడుల్
నల్లయు నాని, వెక్కసపు • లాగున మైఁ గలయంగఁ బూసి యు
త్ఫుల్లసరోజనేత్ర యగు • భూసుత యుండు కుజంబుచుట్టు నం
పిల్లఁగఁ గాంచె రక్కసుల • మేఁ బులకింప సమీరసూతియున్. ౪౮౩

అర్థములు. నంజుఁడు = మాంసము, నల్ల = నెత్తురు,- అని = త్రావి, అంపిల్లఁగన్ = విజృంభింపఁగా, రక్కసులన్ = రాక్షసస్త్రీలను, మేన్ = దేహము, పులకింప = గగ్గురుపాటుచెందఁగా.

తాత్పర్యము.

కడుపారఁ గల్లుఁద్రావి, విన నసహ్య మగునట్లు వెఱ్ఱికూఁతలు గూయుచు మాంసము దిని, నెత్తురుఁద్రావి, చూచినవారికి వెక్కసము తోఁచునట్లు దేహము నంతయు నెత్తురు పూసికొని వికసించిన కమలములవంటి కన్నులు గల సీతయుండు చెట్టుచుట్టు అఱచుచుఁ, గేకలువేయుచు నుండు రాక్షసస్త్రీలను హనుమంతుఁడు తన దేహము పులకరింపఁ జూచెను. వారిని జూచునపుడు ఆయనకుఁగూడ భయము దోఁచె నని భావము.

—• హనుమంతుఁడు సీతాదేవిని జూచి సంతోషించుట. •—

సీ. ఆచెట్టు క్రీనీడ • నమలినచారిత్ర, వనటచేఁ దపియించి • వగచుదానిఁ
బెనఁగొన్న మాపుడు • నును వెండ్రుకలదాని, నెఱి మీఱునడవడి • నెగడుదానిఁ
గాంతిఁ బాసినదాని • గాంతుఁ గానఁగలేని, దాని మేల్సొమ్ములు • లేనిదాని
భర్త్రనురాగంబె • వరభూష యవుదానిఁ, బుణ్యహీనతఁ జేసి • పుడమిఁబడిన
తే. రిక్కయునుబోనిదాని రే • ద్రిమ్మరీఁడు, పట్టి బంధింపఁ జట్టాల • పట్టు లేక
సింగమాఁగినగుంపునఁ • జిక్కి యొంటి, నైన నాఁడేనుఁగునుబోలె • వడలుదానిఁ.

అర్థములు. క్రీనీడ=క్రిందు+నీడ=క్రీనీడ, క్రిందు శబ్దమునకుఁ బరుషేతరం బులు పరంబులగు నపుడు లుప్తశేషంబునకు దీర్ఘంబు మాత్ర మగు. సమాసంబునఁ బ్రాఁతాదుల తొలియచ్చు మీఁది వర్ణంబులకెల్ల లోపంబు బహుళంబగు. సు.వ్యా.

సంధి. ౫౧-౫౮- మాపుఁగు = మాసిన, భర్తృనిరాగంబె = భర్తృ + అను రాగంబు+ఏ=భర్తయందలి ప్రేమయే, రిక్క = నక్షత్రము, ఋక్షశబ్దభవము, రేద్రిమ్మరీఁడు = నిశాచరరాజు, రాక్షసరాజు-రావణుఁడు.

తాత్పర్యము.

ఆ చెట్టు క్రింద నీడలోఁ బవిత్రమైన స్వభావము గలదియు, దుఃఖముచేఁ దపించునదియు, మాసి పెనవేసి కొనిన వెండ్రుకలు గలదియు, చక్కని నడవడి గలదియు, కాంతి తొలఁగినదియు, మగని జూడలేనిదియు, మంచి సొమ్ములు ధరింపనిదియు, పతిభక్తియే సొమ్ముగాఁ గలదియు, పుణ్యము క్షయింపఁగా నేలమీఁదఁ బడిన నక్షత్రమువలె నుండునదియు, రాక్షసుఁడు పట్టుకొని వచ్చి బంధింపఁగాఁ జుట్టముల తోడుపాటులేక సింగ మడ్డగింపఁగా తోడి యేనుఁగు లన్నియుఁ జెదరిపోవ నొంటరిగాఁ జిక్కిన యాఁడేనుఁగువలెఁ దపించునదియు నగు దానిని.

తే. వాడుకొనమిని దంత్రులు • వదులుపాటి, ధూళిమాసినవీణనాఁ • దోఁచుదానిఁ
ప్రీతిభరమున మగని స్మ•రించుదాని, రక్కసులపల్కుఁ బెడచెవిఁ • జెక్కుదాని.

తాత్పర్యము.

వాడుకొనకుండుటచేఁ దంత్రులు వదులై దుమ్ముక్రమ్మిన కారణమున మాసిన వీణవలె నుండువానిని, ప్రీతి యతిశయముచే మగని స్మరించుదానిని, రాక్షసస్త్రీలు చెప్పుమాటలు లక్ష్యము చేయనిదానిని.

సీ. శారదవేళను • నీరదావృతమైన, పూపచందురురేకఁ • బోలుదానిఁ
క్రూరగ్రహావృత • రోహిణిచాడ్పున, నసురాంగనావృత • యైనదానిఁ
బావులు లేనట్టి•తీవ, బోలినదాని, ధూళి బ్రుంగియు రుచిఁ • దోఁచుదానిఁ
నసలు పైక్రమ్మిన • యబ్జినివలెఁ గాంతి, నెగడియు నెగడక • నెగడుదానిఁ
తే. దీరమాసిన చినిఁగిన • చీరదాని, జింకపిల్లలకన్నుల • చెలువు నవ్వ
కన్నుఁగవదానిఁ జూపఱ • కడుపుఁ జేతఁ, గలఁచిన ట్లొనరించెడి • కలికిఁ గనియె.

అర్థములు. శారదవేళను = శరత్కాలమందు, నీరద + ఆవృతము = మేఘముచేఁ గప్పబడినది, పూపచందురురేక = గీఁతవలెనున్న లేఁతచందురువలె నున్నదానిని, ఇది క్రమాభివృద్ధిని సూచించుచున్నది. క్రూరగ్రహావృతరోహిణి = క్రూరగ్రహముచే నావరింపఁబడిన రోహిణీనక్షత్రము, అసురాంగనావృత = రాక్షసస్త్రీలచేఁ జుట్టఁబడిన, బ్రుంగియు = మునిఁగియు, రుచి=కాంతిచే, అసలు = బురద, నేరెటేటి యసల్ దెచ్చి - మనుచరిత్ర, అబ్జిని=తామర తీఁగ, తీర=పూర్ణముగ, చూపఱ=చూచువారియొక్క, కలికిని=స్త్రీని

తా త్ప ర్య ము.

శరత్కాల మందు మేఘముచే నడ్డగింపఁబడిన పాడ్యమి చంద్రుని వలె నుండు దానిని, క్రూరగ్రహములైన బుధాంగారకులచే బాధింపఁబడు రోహిణి యను నట్లు రాక్షస స్త్రీలచే జుట్టఁబడిన దానిని, పూవులులేని తీఁగను బోలినదానిని, దుమ్ములో మునిఁగియుఁ గాంతి కనఁబడు దానిని, బురదపైనఁ గప్పిన తామర తీఁగవలె కాంతి కానవచ్చి కానరాక యుండు దానిని, పూర్ణముగ మాసి చినిఁగిన చీర గలదానిని, జింకపిల్ల కన్నులవంటి కన్నులు గలదానిని, చూచువారి కడుపులోఁ జేయి పెట్టి కలఁచు నట్లుచేయు స్త్రీని హనుమ చూచెను.

ఆ. భర్తృతేజమునను • బరమధీరత గల్గు, దీన మైనమోము• దానిఁ దనదు
శీలమహిమఁ గాపు • చేసికొం చడలెడు, దాని సీతఁ గనియె•వానరుండు. ౨౮౭

తా త్ప ర్య ము.

దుఃఖముతోఁ గూడి కాంతి మాసిన ముఖము గల దయ్యును భర్త పరాక్రమముఁ దలంచి యాయన తన్నుఁ దప్పక రక్షించునను ధైర్యముతో నుండు దానిని, మగఁడు వచ్చి రక్షించువఱకు కాకు నెవ్వరు రక్షించు చున్నా రనినఁ దన పాతివ్రత్యము చేతనే తన్నుఁ దాను గాపాడుకొనుచున్న దానిని, సీతాదేవిని వానరుఁడు చూచెను.

దీనివలన భక్తులు ప్రపన్నులు వెలుపలి కష్టము లెన్ని వచ్చి పీడించినను మహా విశ్వాసము వదల రా దనియు భగవంతుఁడు రక్షించువఱకుఁ దమ భక్తి ప్రపత్తులే వారినిఁ గాపాడఁ గల వనియు భావము

క. 'నా తేజము సాధులలో, నాతతమై యుండు వారి నలఁచు జనులకున్
హేతిక్రియ భీతి నిచ్చును, జేతోమోదంబు చెఱచు సిద్ధము సుధీ్మా.'
భాగ. ౯. ౧౨౫.

సీ. బెగ డొందిన కంపిల్లు•మృగకన్యకయుఁబోలె, దిక్కులు చూచుచు • స్రుక్కుదాని
వేఁడినిట్టూర్పుల • వృక్షపల్లవములఁ, గ్రాఁచెడి నేమొనాఁగ్రాలుదాని
నాంతరదుఃఖాబ్ధి • యందంద పొంగిన, యలలయ ట్లూర్పులు • వెలలుదాని
నవసిన యంగముల్ • నాగెంబుతో వినా,కృతభూష నై శోభ • నెసఁగుదాని,

ఆ. మదిరనయన సీత • మారుతి గనుఁగొని, సమ్మదాశ్రు లురల • జాలుగాఁగ
రామచంద్రునకును • సౌమిత్రికిని గేలు, మోడ్చి శాఖయంద • ముడిఁగియుండె.

అర్థములు. కంపిల్లు = వణఁకు, మృగకన్యక = ఆఁడుజింక, పల్లవములన్ = చిగుళ్ళను, క్రాఁచెడి = కాల్చెడి, అంతర దుఃఖాబ్ధి = లోపలనుండు దుఃఖ మను

సముద్రము, వినాకృత భూషణై = ఆభరణములు లేనిదై, భూషణై = భూషయయ్యు, మదిర నయన = మద్యమువలె మత్తు గలిగించు కన్నులు గల దానిని, జాలు = ప్రవాహము, అంగముల్ నాగెంబుతో = అంగముల నాగెముతో, షష్ఠీ సమాసమందలి నిలలమీఁది యచ్చులకు హల్లుపరంబగుచోఁ గొన్ని యెడల లోపంబు గానం బడియెడి. ప్రౌ. వ్యా. సంధి ౧౭వ సూత్రము. వినాకృత భూషణై; భూష యయినను "న్యూనవచో వాక్యంబునఁ దద్వచనంబు లధ్యాహారంబులగు. ప్రౌ. వ్యా. వాక్య. ౧౩ సూత్రము.

తాత్పర్యము.

భయపడి వడఁకు చున్న యాఁడు లేడివలెఁ దన్ను రక్షింప రాముఁడు వచ్చునా యని దిక్కులు చూచుచున్న దానిని తనవేఁడి శ్వాసములచేఁ జెట్లయందలి చిగుళ్ళను గాల్చు చున్నదా యేమి యన్నట్లున్న దానిని, హృదయమున నుండు దుఃఖ మను సముద్రము పొంగి పొరలి రాఁగా నలలవలె నిట్టూర్పులు విడుచు దానిని, శుష్కించి యాభరణములు ధరింపకుండినను సహజకాంతి పాయనిదానిని, చూచిన వారిని మైమఱవఁజేయు సౌందర్యము గల దానిని హనుమంతుఁడు చూచి యిప్పటికిఁ గృతార్థుఁడనైతి నని సంతోషముచేఁ గన్నులనీరు ప్రవహింపఁగా నిది యంతయు రామలక్ష్మణుల యనుగ్రహముచేఁగదా లభించె నని వారికి నమస్కరించి చెట్టుకొమ్మయందే మాట లాడుటకు సమయమువేచి ముడుచుకొని యుండెను.

దీనివలన యోగికి నాత్మావలోకన ప్రాప్తి భగవత్కటాక్షముచేఁ గలుగునని భావము. 'యమేవైష వృణుతే తేన లభ్య ధాతుః ప్రసాదా'త్తని శ్రుతులు చెప్పెడిని గదా.

—• ౧౮-వ సర్గము. రావణుఁ డశోకవనంబునకు వచ్చుట. •—

క. చంచత్పల్లవకుసుమో,దంచితవనిఁ గలయఁ జూచి • యవనిజఁ దక్కం
  గాంచఁగ మారుతి దలఁపఁగ, నించుకదక్కువగ రేయి•యెల్లం గడచెన్. ౪౮౯

అర్థములు. చంచత్ = కదలుచున్న, చెంచు అను శబ్దము దీనివలనఁ బుట్టినదే. చెంచు లనఁగా దిరుగుచుండువా రని యర్థము. వారి స్త్రీలు చెంచితలు, పల్లవ = చిగుళ్ళచేతను, కుసుమ = పూలచేతను, ఉదంచిత=మిగులఁ బ్రకాశించెడి, వని = వనమును, ఇంచుక తక్కువగ రేయి యెల్లం గడచెన్ = అనుటచే చంద్రాస్తమానమైన దని సూచన. నాలుగున్నర గంట ప్రొద్దయ్యె నని భావము.

తాత్పర్యము.

ప్రాతఃకాల వాయువుచేఁ గదలు చున్న చిగుళ్ళ చేతను, బూలచేతను బ్రకాశించు వనము నంతయుఁ బాఱఁజూచి సీతాదేవిని నింకను బాగుగఁ జూడవలయు నని

యాంజనేయుఁడు తలఁచు చుండఁగా గొంచెము తక్కువగా రాత్రి యంతయుఁ గడచెను.

ఉ. అంతట నాలకించెను ష•డంగక వేదవిదుల్ మఖక్రియా
స్వాంతులు వేగుజాము సమ•యంబున మేల్కని బ్రహ్మరాక్షసుల్
మంతు వొకింత లేక శుచి•మద్విధి నించెడి బ్రహ్మఘోషముల్
వింతగ వాద్యనాదములు • వీనులవిందుగ మ్రోయు చుండఁగన్. ౪౯౦

అర్థములు. షడంగక వేద విదుల్ = శిక్షా వ్యాకరణాదులగు నాఱంగములతోఁ గూడిన వేదము నెఱిఁగినవారు, మఖక్రియా స్వాంతులు = యజ్ఞ కార్యములందు మనస్సు గలవారు, బ్రహ్మరాక్షసులు = రాక్షసులందు బ్రాహ్మణులు, పేరు బ్రాహ్మణులు - రావణాదులు క్షత్రియులు, కావున వర్ణాశ్రమ విభాగము రాక్షసులందుఁ గలదని యేర్పడు చున్నది. బ్రాహ్మణ బీజోద్భవులగు పౌలస్త్యులు, కొందఱు తలఁచున ట్లనార్యులు గారు. క్రూరకర్ము లగుటచే రాక్షసులైరి. మంతువు = స్వర దోషము, కర్మాంగదోషములేక, శుచిమత్ + విధి = పరిశుద్ధమైన విధముగ, బ్రహ్మ ఘోషముల్ = వేదధ్వనులు, 'పరమాత్మా తపో వేదో బ్రహ్మా, బ్రహ్మాబ్జజే ద్విజే.' నానా. ౪.

తాత్పర్యము.

హనుమంతు డిట్లాలోచించుసమయంబున బ్రహ్మరాక్షసులు ఆఱంగములతోడ వేదములు తెలిసినవారలు యజ్ఞకార్యముల మనస్సుగలవారలు, వేకువ జామున బ్రహ్మముహూర్తమున మేల్కని యే తప్పు లేకుండు నట్లు శుచిర్భూతులై నించెడి వేద ఘోషములను వీనుల కింపుగ వాయింపఁబడు వాద్యముల ధ్వనులును వినవచ్చెను.

క. ఆ మంగళరవములఁ బూ,ర్వామరపతి మేలుకాంచి • యంబరసుమనో
దామంబు లెడల సీతా, వామాక్షిం దలఁచె రాగ•పరవశుఁ డగుచున్. ౪౯౧

అర్థములు. పూర్వామరపతి = రావణుఁడు, దేవతలకంటెఁ బూర్వులు కావున రాక్షసులు పూర్వ దేవత లనఁబడుదురు. అంబర = వస్త్రములు, సుమనో దామంబులు = పూలదండలు, ఎడలన్ = జాఱిపోవు చుండఁగా, రాగ పరవశుఁ డగుచున్ = కామముచే స్వాధీనత తప్పినవాఁడై.

తాత్పర్యము.

ఆ మంగళ ధ్వనులు విని రావణుఁడు మేల్కని, పట్టు వస్త్రములు ధరించిన పూలదండలు జాఱు చుండఁగా లేచి కామవశుఁడై సీతఁ దలంచెను.

క. మదనమదోత్కటుఁ డయి దశ•వదనుఁడు గాఢముగ మనము • వనజాక్షిపయిన్
బదిలముగ నిల్పి కామము, హృది నణఁపఁగనేరఁ డయ్యె•నించుక యైనన్. ౪౯౨

అర్థములు. మదన మదోత్కటుఁడు=కామ మదముచే నతిశయించిన వాఁడు.

తాత్పర్యము.

అతిశయించిన కామమదముచే రావణుఁడు తనమనస్సును దృఢముగ సీతయందుఁ బదిలముగ నిల్పి హృదయమునందుఁ గామమును గొంచెమైన నణఁపలేఁడయ్యెను.

ఇది మొదలు రావణుని మాటలు చేష్టలు కాముకునివో భక్తునివో పాఠకులు గమనింతురు గాక.

సీ. తనకును గల యను•త్తమలక్ష్మి శోభిల్ల, సర్వాభరణములు • సరగఁ దాల్చి
కుసుమితఫలితస•త్కుజసంతతులచేతఁ, గందోయి కెంతయు • విందు లిడుచు
విచ్చిన తమ్ముల, • బెచ్చు విహగనికోలంకులు శకుంతంబుల•కలకలములు
సొబగార నద్భుత•సుందరం బయి సెక్కలీహామృగంబుల•వ్యూహములను

తే. దృఙ్మనోహర మగుచును • దేజరిల్లి, రత్నకాంచనతోరణ•రాజి వెలసి
బహుమృగాకీర్ణ మయి గళ•త్ఫలచయ మయి, నవ్యమైన యశోకవనంబుఁజొచ్చె.

అర్థములు అనుత్తమలక్ష్మి = అత్యంత ముత్తమసంపద, దేనికంటె నుత్తమమైనది లేదో యది యనుత్తమము, కుసుమిత = పూచిన, ఫలిత = పండిన, సత్కుజసంతతులచేతన్ = మంచి వృక్షసమూహములచే, కందోయికి = రెండు కన్నులకు, కన్ను + దోయి = కందోయి, ఈహామృగంబుల = కృత్రిమముగాఁ జేయఁబడిన జింకల, దుప్పుల వ్యూహములను=సమూహములను, ఇచ్చటఁ గొందఱు తోడేళ్ల సమూహములని వ్రాసిరి. స్త్రీలు సంచరించు ప్రమదావనంబులందుఁ దోడేళ్ళ గుంపులుండునా? దృఙ్మనోహరము = కంటికింపు, గళత్ఫలచయము = రాలుచున్న పండ్లగుంపులు.

తాత్పర్యము.

తనకుఁగల మహాసంపద ప్రకాశించు నట్లు సమస్త భూషణములు ధరించిన వాఁడై పూచిన, పండిన చెట్లు కన్నులకు సంతోషము గలిగింపఁగా వికసించిన కమలముల నతిశయించిన సరస్సులు, పక్షుల కలకలములు నింపు గూర్పఁగా నద్భుతము సుందరమునై కృత్రిమపు జింకల, దుప్పుల సమూహములు గలిగి కంటి కింపై, ప్రకాశించి రత్నములయు, బంగారు తోరణములు అనేక విధములైన మృగములు రాలుచున్న పండ్లు గలిగిన యశోక వనమునఁ బ్రవేశించెను.

తే. వేయిగన్నుల వేల్పును • వెంబడించు, నమరగంధర్వసతు లట్టు•లసురసతులు
వందమంది సురేంద్రుని• వైరి వెంట, నరిగిరి ప్రదీపచామర•హస్తలగుచు. ౮౯౮

అర్థములు. వేయి గన్నుల వేల్పు= ఇంద్రుఁడు, ప్రదీప చామర హస్తలు= పెద్ద దీపములు, చామరలు చేతియందుఁ గలవారై, దీపములు పట్టుకొని వచ్చిరనుటచే చంద్రాస్తమానమైనది, చీఁకటి వ్యాపించిన దనుట స్పష్ట పడియె.

తా త్ప ర్య ము.

ఇంద్రుని వెంటఁబోవు దేవ గంధర్వ స్త్రీలవలె వందమంది రాక్షస స్త్రీలు చేతఁ గాఁగడాలు, చామరలు ధరించి రావణు వెంబడి పోయిరి.

సీ. రంగారుబంగారు • భృంగారువుల నీళ్ళు, కొందఱు గైకొని • ముంద అరుగ
మండలాగ్రంబులు • మణిమయాసనములు, గొని కొందఱంగనల్ • వెనుక రాఁగ
జాణ యొక్కతె మణి • స్థాలిఁ బానంబునఁ, బూరించి కుడికేలఁ • బూని నడువ
రాజహంసను బూర్ణ • రాజబింబముఁబోలు, గొడుగు నొక్కతె వెను • కడను బట్టఁ

తే. బైఁడిదండంబు నొక్కతె • పట్టుచుండఁ
గూర్కు కన్నులఁ దవప్రియ • కులసతులును
మబ్బుతోఁ జను మెఱుఁగుల • మాడ్కి నడవఁ
బంక్తికంధరుఁ డుద్యాన • వనముఁ జొచ్చె. ౪౫

అర్థములు. రంగారు = అందమైన, భృంగారువులన్ = గిండ్లయందు, మండలాగ్రంబులు = కత్తులు, ఆసనములు = పీఁటలు, మణి స్థాలిన్ = రత్న పాత్రమునందు పూర్ణరాజ బింబము = నిండు చంద్ర మండలము.

తా త్ప ర్య ము.

అందమైన బంగారు గిండులతో నీళ్ళు తీసుకొని కొందఱు ముందు పోఁగా, కత్తులు, మణి మయములైన పీఁటలు తీసికొని కొందఱు స్త్రీలు వెనుక రాఁగ, నొక నేర్పరి కత్తె రత్న పాత్రమును పానంబుతో నింపించి, దానిని గుడిచేతఁ బట్టుకొని నడువ, రాజ హంసను నిండు చంద్ర బింబమును సరిపోలు శ్వేతచ్ఛత్రమును నొకతె పట్టుకొని రాగా, బంగారు దండ మొకతె పట్టుచుండ, నిద్ర మబ్బు కన్నులతోఁ దన భార్యలు మబ్బువెంటఁ బోవు మెఱుపులవలె నడచి రాఁగ, రావణుఁ డుద్యాన వనముఁ బ్రవేశించెను.

శ్వేతచ్ఛత్ర లక్షణము—

నిచితంతు హంస పక్షైః కృకవాకు మయూర సారసానాంచ, దౌకూలేన నవేన తు సముద్గత చ్ఛాదితం శుక్లమ్। ముక్తాఫలైరుపచితం। ప్రలంబ మాలావిలం స్ఫటిక మూలమ్ । షడ్ఢస్త శుద్ధ హైమం నవ పర్వ నగైకదండంచ । దండార్ధ విస్తృతం తత్ సమవృత్తం రత్నభూషిత ముదగ్రమ్।నృపతేస్తదాతపత్రం కళ్యాణకరం విజయదంచ. (బృహత్సంహిత)

సీ. వ్రీలినకొప్పులు • రాలినపూఁతలు, దూలినసరములుఁ • గ్రాలువారు
నిద్దురమంపులు • నెఱిమత్తుకంపులుఁ, జెమ్మటమోములుఁ • జెలఁగువారు
శ్రమవారిఁ దడిసిన•సుమహారములవారు, మాలికాకులచికు•రాళివారు
జేవుఱుఁగన్నులుఁ • జెలువంపుఁజన్నెలు, మే లగువన్నెలు • మెఱయువారు

తే. రాఁగ రాగంబునను వెంట • రామవిభుని
కాంత మది నుంచి తమిఁ బెంచి • కళవళించి
మూర్ఖ్యము వహించి మర్యాద • మట్టగించి
క్రించు టసురుండు వనముఁ జొ • త్తెంచుటయును. ౪౯౬

అర్థములు. మంపులు = మత్తు, శ్రమవారిన్ = చెమటనీళ్ళచే. మాలికాకుల = పూలదండలు తాఱుమాఱుగా నున్న, చికురాళివారు = తలవెండ్రుకలు గలవారు, జేవుఱు = ఎఱ్ఱనైన, క్రించు టసురుండు = దుష్టరాక్షసుఁడు.

తాత్పర్యము.

వీడిన కొప్పులు, రాలిపోయిన గంధపుఁ బూఁతలు, వ్యత్యస్తముగాఁ గొలఁగిన సరములు, నిద్దుర మబ్బులు, మద్యము వాసనలు చెమటగాఱు ముఖములు, చెమట నీళ్ళచేఁ దడిసిన పూలదండలు, పూలదండలు కలసి చిక్కుపడిన వెండ్రుకలు, ఎఱ్ఱని కన్నులు, అందమైన సొగసులు, మేలైన కాంతులు గల స్త్రీలను రాగముచేఁ దన వెంట రాఁగా దుష్టుఁడగు రావణుఁడు సీతాదేవిని దలఁచుకొని కామాతిశయముచేఁ దత్తఱలాడి సీత తనకు వశపడు నని మూర్ఖుఁడై తలంచి పరస్త్రీల విషయమున నుండవలసిన మర్యాద వదలి వనము ప్రవేశింపఁగా.

క. అంజనతనయుఁడు రావణ, కుంజరగమనావళీ ని•కూజత్కాంచీ
శింజితములు శ్రవణపుటీ, రంజక హంసకనికాయ•రవములు వినియెన్. ౪౯౭

అర్థములు. రావణకుంజరగమనావళీ = రావణాసురుని స్త్రీసమూహముల యొక్క, నికూజత్కాంచీ = ధ్వనించుచున్న మొలనూళ్ళ, శింజితములు=ధ్వనులు, శ్రవణపుటీ రంజక = చెవులకు నింపైన, హంసక నికాయరవములు = అందెల సమూహముల ధ్వనులు.

తాత్పర్యము.

హనుమంతుఁడు సీతాదేవి సమీపమునకుఁ బోవలె నని యాలోచించు సమయమందు రావణాసురుని స్త్రీల యొడ్డాణముల యందలి గజ్జెలధ్వనులు, విన నింపైన యందెల నాదము వినవచ్చెను.

ఉ. ద్వారము డాసి యున్న సురవైరికులేశ్వరు, గంధసైలసి
క్రొత్తరుసుదీపికల్ గొని త•లోదరు లేగ వెలుంగు కామిని

స్తారుని, వక్రలోహితవి • శాలవిలోచనుఁ, జాపహీనుఁ డౌ
మారునిమాఱుమూర్తి యన • మంజులరూపు వహించు వీరునిన్. ౯౮

అర్థములు. గంధతైలసిక్త = వాసనచమురుతోఁ దడిసిన, ఉరుసుదీపికల్ = పెద్ద దీపములు, దివ్విటీలు; కామవిస్తారుని=విశేషించిన కామము గలవానిని, వక్ర= వంకరయు, లోహిత= ఎఱ్ఱనయు, విశాల = విరివియు నగు, విలోచనున్ = కన్నులు గలవానిని, చాపహీనుఁడు = విల్లులేనివాఁ డగు, మారుని = మన్మథుని, మాఱట మూర్తి = ప్రతిరూపము, మంజులరూపు = మనోహరమైన యాకారము.

తాత్పర్యము.

సువాసన తైలముతోఁ దడిసిన దివ్విటీలు దీసికొని స్త్రీలు రాఁగాఁ గామాతిశయము గలవాఁడును వంకరయు, నెఱ్ఱనయు, విశాలములగు కన్నులు గలవాఁడును విల్లుపట్టని రెండవ మన్మథుఁడును, సుందరుఁడు,వీరుఁడును తోఁటవాకిట వచ్చియుండు రావణాసురుని.

తే. అంగదంబులఁ దగిలిన•యమృతఫేన, సన్నిభోత్తమవిమలవ•స్త్రము లీలఁ
గేల సవరించువాని దోర్లీల నిట్టిఁ, డంచు నెన్నంగరాని యా •యసురఁ గనిమె.

అర్థములు. అమృతము = ధారోష్ణం త్వమృతం పయః = అప్పుడు పిండి వేఁడి చల్లారని పాలు.

తాత్పర్యము.

భుజకీర్తులకుఁ దగులుకొన్న ధారోష్ణముల నురుగువలెఁ దెల్లనైన వస్త్రమును సవరించుకొనువానిని భుజబలమునం దింతవాఁడని చెప్పరానివానిని రాక్షసునిఁజూడఁ దలమొత్తెను.

ఇట్టిఁడు = ఇట్టివాఁడు, అట్టి యిట్టి యెట్టి శబ్దంబుల మీఁది తచ్ఛబ్ద వకారంబునకు లోపంబు విభాషనగు. ప్రౌ. వ్యా. స. ౯ సూ.

క. కాంచెను గాంచన కాంచీ, చంచన్మణికింకిణీల•సన్మధ్యల రూ
పాంచితయువతుల మారుతి, పొంచి నగంబందు నుండి • పూవుంబోండ్లన్. ౧౦౦

అర్థములు. కాంచన కాంచీ = బంగారు మొలనూళ్ళయందు, చంచత్ = కదలుచున్న, మణి కింకిణీ = రత్నములు చెక్కిన చిఱుగజ్జెలచే, లసత్ = ప్రకాశించు, మధ్యలన్ = నడుములు గలవారిని, సౌందర్యముచేఁ బ్రకాశించు ప్రాయపు స్త్రీలను.

తాత్పర్యము.

బంగారుటొడ్డాణముల యందలి రత్నములగజ్జెలు గల నడుములు గల సుందరులగు ప్రాయపుస్త్రీలను చెట్టునందుఁ బొంచియుండి హనుమంతుఁడు చూచెను. ముందు

వెలుతురు గనఁబడెను. ఏమి యీ వెలుతురని తలయెత్తి నిక్కి-చూడఁగా రావణుఁడు, అవల వాని వెనుక వచ్చు స్త్రీలు గానవచ్చిరి.

ఉ. తారలు గూడియున్న యల•తారకరాజును బోలి సుందరీ
వారము చుట్టు గొల్వఁగను • వచ్చెడివాని లసత్పరిష్క్రియా
హారవిలాసునిం బటుమ•హాబలభాసునిఁ గామదాసునిన్
హారిశరీరు విశ్రవసు•నాత్మకుమారునిఁ గాంచి యాత్మలోన్. ౪౦౧

అర్థములు. తారకరాజు = చంద్రుఁడు, నక్షత్ర పర్యాయమున తారక శబ్దము పుంలింగ మందును గలదు. లసత్ =ప్రకాశించు, హార=సరములయొక్క-యు, పరిష్క్రియా = ఆభరణములయొక్క-యు, విలాసునిన్ = సౌందర్యము గలవానిని.

తా త్ప ర్య ము.

నక్షత్రములతోఁగూడిన చంద్రునివలె స్త్రీలు తన్నుఁ జుట్టుకొనఁగా వచ్చుచున్నవానిని, ప్రకాశించు హారములు, ఆభరణములు వీనిచే సుందరుఁడైన వానిని, మహాబలవంతుని, కామమునకు దాసుఁడైనవానిని, మనోహరమైన శరీరము గలవానిని, విశ్రవసు కుమారునిఁజూచి హనుమంతుఁడు తనలో నిట్లనుకొనెను.

మ. అగుఁ బో యీతఁడ రావణుం డనుచు ర•క్షోధీశుఁ గానంగ నీ
లగు తానంబును జేరి భూరిబలుఁడై • యా వీరు తేజంబునన్
విగళత్తేజుఁడు నొచ్చుఁ గొమ్మలను డా•వెన్ వాడునున్ సుస్తనిన్
జిగురుంబోఁడి సుగాత్రి డాయ నరుదెం•చెం జూడఁ గాంక్షించుచున్. ౪౦౨

అర్థములు. తానము = ప్రదేశము, విగళత్తేజుఁడు = జారిపోయిన తేజము గలవాఁడు, డావెన్ =డాఁగుకొనెను. క్వచిద్గకారోవః అనుసూత్ర ప్రకారము గకారమునకు వకారము వచ్చెను. అగుఁబో = నిశ్చయముగా నగును.

తా త్ప ర్య ము.

నిశ్చయముగా వీఁడు రావణుఁడే యని తలఁచి వానిని జక్క-ఁగాఁ జూచుటకు ననువైన స్థలముఁ జేరి అటఁగా వానికి నెదురు ముఖముగా నుండునట్లు విస్తారబలము గలవాఁ డయ్యును వాని తేజస్సు ముందర తేజోహీనుఁడై కొమ్మలసందున డాఁగుకొనెను. వాడును సీతను జూడ సమీపించి వచ్చెను.

—• ౧౯-వ సర్గము. రావణుఁడు సీతాదేవిని చేరఁబోవుట. •—

చ. తడయక సీత గాంచి దను•దన్వ్యాల భూషణభూషితాంగుఁడై
పడఁతులతోడ వచ్చు సుర•భంజను యౌవనరూపనైభవున్
వడఁకుచు నోరుగాలికి న•ణంకు ననంటినిబోలి యూరులన్
గడుపును బాహులం జనులు • గ్రక్క-న మాటుచు నేడ్చుచుండఁగన్. ౪౦౩

తా త్ప ర్య ము.

ఆభరణములచే నలంకరించుకొని యీడువారితో వచ్చుచున్న రావణుని యౌవన సౌందర్య సంపత్తి గలవానిని దూరమునందే చూచి సీతాదేవి పెను గాలికి నరటి చెట్టువలె గడగడ వడఁకుచు నాలస్యము లేక తొడలచేఁ గడుపును చేతులచే స్తనములను గప్పుచు నేడ్చుచుండెను.

సొమ్ములు మూటఁగట్టి యుత్తరీయమును బాఱవైచిన కారణముచేఁ బైఁటయు లేక యుండుటచేఁ గడుపు గానరాకుండఁ దొడలను జొమ్ములు గాన రాకుండ మోఁకాళ్ళను వడ్డముంచి ఆ కాళ్ళను రెండుచేతులు కట్టుకొని బిగించె నని భావము.

సీ. దశకంధరుం డంత • దర్శించె రాకాసి, మూఁక గావఁగ నార్తి • మునఁగుదాని
జలనిధి నవిసిన•కలముఁబోలినదాని, నుత్త నేలను గూరు•చున్న దానిఁ
గొట్టి వైచినపూవుఁ•గొమ్మ దీ టవుదాని, నతులితసంశిత•వ్రతవుదానిఁ
బంకపు నగను బల్•వన్నె లీనెడు దాని, నొంటి నేడ్చుచు జింత నొందుదాని

ఆ. బురద గ్రమ్మియున్న•సరసిజం బనఁగను, మెఱసి మెఱయ కుండు•మేనిదాని
మండనార్హ యయ్యు•మండనంబులు గ్రొచ్చి, యడలుదాని నవయు•నొడలిదాని.

అర్థములు. అవిసిన = పగిలిన, కలము = ఓడ, అతులిత = అసమానమైన, సంశిత = మిగులఁ దీక్ష్ణమైన, వ్రతన్ = వ్రతము గలదానిని, నిద్రాహారములు రెండును విడిచి కటికి నేలపైఁ గూర్చుండిన తీవ్ర వ్రతము గల దానిని, పంకపు నగను = దుమ్ము నెడి యాభరణముచే, మండనార్హ = అలంకారమునకు యోగ్యు రాలు, మండనంబులు = ఆభరణంబులు.

ఈ పద్యము మొదలు పండ్రెండు పద్యములు కుళకము.

ఈ పద్యము నారంభంబున దశకంధరుఁడనియుఁ గడపటి పద్యంబున దశా స్యుఁడనియుఁ బ్రయోగించుట, కర్తృ పదము మఱవ కుండుటకై దూరాన్వయము నివారించుటకై యని తెలియునది. ఈ నడుమ నుండిన వన్నియు సీతాదేవి విశేషణ ములు.

తా త్ప ర్య ము.

రాక్షస స్త్రీల గుంపు తన్ను రక్షింపఁగా దుఃఖించు చుండు దానిని, సముద్ర మధ్యమున పగిలిన యోడవలె దరిగానక యుండు దానిని, కటికి నేలపైఁ గూర్చుండిన దానిని, తెగఁగొట్టివైచిన పూవు తీఁగవలె నుండుదానిని నిద్రాహారములు మాని మిగులఁ దీవ్రమైన వ్రతము పట్టిన దానిని, దుమ్ము గ్రమ్మిన దేహము గల దానిని, తన వారెవ్వరు లేక యొంటిగ దుఃఖించుచుండు దానిని, బురద సోఁకిన కమలమువలె కాంతి గలిగి లేకున్న దానిని, ఆభరణములు ధరింప యోగ్యురాలయ్యు ధరింపని దానిని, కృశించిన దేహము గల దానిని.

చ. కనుఁగొన లేక మేర దన • కాతియకుం బరివేష్టమానభో
గిని యన నుండుదాని, గుణ • కీర్తితధార్మికవృత్తశీల మా
ఘనకుల మందుఁ బుట్టియును • గాపురుషాధము దుష్కులోద్భవున్
బెనిమిటిఁ జేసికొన్న యలి • వేణినిఁ బోని పతివ్రతామణిన్. ౧౦౪

అర్థములు. కాతియ = బాధ, మేర = అంతము, పరివేష్టమాన భోగిని = పొర లాడుచున్న ఆఁడుపాము; గుణకీర్తిత = గుణములచేఁ బొగడఁబడిన, ధార్మిక వృత్తశీలము = ధర్మాత్ముల నడవడి, యాచారము, కాపురుషాధమున్=నీచుడగు దుష్టపురుషుని, దుష్కులోద్భవున్=నీచపుఁ గులమందుఁ బుట్టినవానిని.

ఆఁడుపా మనుటచేఁ దాఁకిన మరణము సిద్ధమని భావము.

తాత్పర్యము.

తన దుఃఖ మెపుడు ముగియునో తెలిసికొనలేక నేలపైఁ బొరలుచున్న యాఁడు పామువలె నుండుదానిని, గుణములచే, ధర్మముచేత, నడవడిచేత, సదాచారముచేతఁ బ్రసిద్ధి కెక్కిన వంశమునఁ బుట్టియు, నీచకులమందుఁ బుట్టిన నీచపురుషుని దనభర్తగా జేసికొన్న దానివలె నుండుదానిని, పతివ్రతారత్నమును.

క. అంకరహితవిదితాత్మునిఁ, బంకజదళనేత్రు రామ • భద్రుని డాయన్
సంకల్పహయంబులచేఁ, బొంకంబుగ హృద్రథమునఁ • బోయెడిదానిన్. ౧౦౫

అర్థములు. అంకరహిత = (౧) సమీపమందు లేనివానిని, (౨) కళంకము లేనివానిని, హేయగుణ మొక్కటియైన లేనివానిని, విదిత + ఆత్ముని = తెలియఁ బడిన స్వభావము గలవానిని, సంకల్పహయంబులచేన్ = తలంపు లనెడి గుఱ్ఱము లచే, హృద్రథమునన్ = హృదయ మను రథమునందు; విరహిణియుఁ, బరమ భక్తుఁడు, ప్రపన్నుఁడు సమానులు. వీరల దేహ మెందున్నను హృదయము,సంకల్పము విరహిణికి భర్తయందును, భక్తులకుఁ బ్రపన్నులకు భగవంతుని మీఁదను నుండును. ఆ విషయమే యిందుఁ దెలుపఁబడెను. అంకరహిత=పతివ్రతకు భర్తయందు నట్టి కళంకము గానరాదు. ఆయన నిగ్రహములనుగూడ ననుగ్రహము లనియే తలంచుచుండును. విదితాత్ముని = తెలియఁబడిన మనస్సు; స్వభావము గలవాఁడు, ఆయన మనస్సు స్వభావ మెట్టిదైనది యనఁగాఁ దనయందు విశేషానురాగము గలవాఁ డని, ఆశ్రిత రక్షణ యాయన స్వభావ మని సీతకుఁ దెలియు నని భావము. కావుననే కదా కౌసల్య యందుండు ప్రేమకంటెఁ దనయం దెక్కువప్రేమ రామచంద్రమూర్తికిఁ గల దని హనుమంతునితోఁ జెప్పెను. (మా. ౮౭౭ వ ప.) పంకజదళనేత్రున్ = పంకము= పాపము, పాపములోఁ బుట్టిన దానిని ఛేదించు చూపుగలవాఁడు. ఆయన దృష్టి సోఁకినంత మాత్రముననే యెల్లపాపములు హరించును. అంతటి మహానుభావుఁడు కావుననే కదా యాశ్రితు లందలి దోషము సహింపవలె నని చెప్పెను. ఆయన దృష్టి తగులఁగానే దోషనివృత్తి కాఁగా నిఁక దండింపఁ గారణ మేమున్నది? కావున

నాయం దే దయిన దోష ముండినను క్షమించి తన్ను రామచంద్రమూర్తి రక్షించునని భావము. రామభద్రునిన్="భద్రశబ్దేన దేవస్య నిత్యనిర్దోషతోచ్యతే"(అహి.౫-౨౯) నిత్యనిర్దోషత్వము గల రాముని వని భావము. సంకల్పము = ప్రాణము, 'ప్రాణో మాయా క్రియాశక్తిర్భావ ఉన్మేష ఉద్యమః॥ సుదర్శనంచ సంకల్పః శబ్దాః పర్యాయ వాచకాః॥ (అహి. ౧౨ అధ్యా.।) హయ=త్వరగాఁ బోవునది, త్వరగాఁ బోవునట్టి ప్రాణవాయువులచే, పొంకంబుగన్ = దృఢముగ, చలింపకుండ నని యర్థము. రథ శబ్దమునకు = దేహము - మనోరథము, రథము, వాహనము నని యర్థము. హృద్రథమనఁగా హృదయ మను రథము. (౨) హృదయ మను శరీరము-బోవుడి దానిన్ = పోవుచున్న దానిని, ఇక్కడ లేదని భావము.

తా త్ప ర్య ము.

ఎట్టి కళంకము లేనివాఁడును, తల్లియందుంను ప్రేమకంటె నెక్కువ ప్రేమ తనయందుఁ గలవాఁడును, తనయందు దోష ముండినను దానిని హరింపఁ జేసి స్వీక రించువాఁడును, నిత్య నిర్దోషియు నగు రామచంద్రమూర్తి యొద్దకు సంకల్పము లను గుఱ్ఱములను గట్టిన హృదయ మను రథము నందుఁ గూర్చుండి పోవుచున్న దానిని.

హృదయమునే శరీరముగాఁ గల ప్రాణము లతివేగమునఁ బోవుచున్న వని యైనఁ జెప్పవచ్చును. అనఁగా సీతాదేవి శరీరమం దున్నదే కాని ఆమె హృదయము, ప్రాణము, భావము, సర్వము రామునొద్దకుఁ బోయిన వని భావము. భక్తులు, పతి వ్రతలు నిట్టివారై యుందురు.

క. అపవాదముచేఁ దేరకు, నిపతిత మగు కీర్తిఁ బోని • నెలఁగుకమిన్నన్
వ్యపకలితాభ్యాసం బగు, కృపణుని విద్యయునుబోలెఁ • గీడ్పడుదానిన్. ౫౦౭

అర్థములు. నిపతితము = పడిపోయినది, వ్యపకలితాభ్యాసము = అల వాటు తప్పినది, చింతనలేనిది, కృపణుని = లోభివానియొక్క.

తా త్ప ర్య ము.

నిష్కారణ నిందచేఁ జెడిన కీర్తివలె నున్నదానిని, ధనము మీఁదనే దృష్టి గలిగి లోభియై గురువున కేమైన నీయవలసి వచ్చునే యని సరిగా నభ్యసింపని వాని విద్యవలె నుండుదానిని.

చ. సమసిన కీర్తి, నాదరము • చాలని శ్రద్ధఁ, బరిక్షీణంబు నౌ
యమలిన పూజ, భగ్న యగు • నాశను, జెందఁబోవు లాభమున్
గమరిన పద్మమున్, మిగులఁ • గాలెడి దిక్కును, భగ్న పూజనున్
దమమును గూడు వెల్తురు, నిశాఘమునందలి రేయిటిఁ బోలుచున్. ౫౦౮

తా త్ప ర్య ము.

నశించిన కీర్తిని, ఆదరింపఁబడని శ్రద్ధను (శ్రద్ధగలవాని నాదరింపకున్న నా శ్రద్ధ క్షీణించి పోవును.) పూజా ద్రవ్యములు లేని పూజను, చెడిపోయిన యాశను.

చెదరిపోయిన లాభమును, వాడిపోయిన పద్మమును, కాలుచున్న దిక్కులను, విఘ్నమైన పూజను, చీకటితోఁ గూడిన వెలుతురును, ఎండకాలమందలి యేటిని బోలుచున్న దానిని. నిదాఘము=ఎండకాలము.

క. హతశూరము సైన్యమువలెఁ, బ్రతిహతశాసనము రీతి • రాహువు మ్రింగన్
వెతఁగొను జాబిలిఁ గల నిశ,గతి శాంతానలము భంగిఁ • గ్రాలెడిదానిన్. ౨౦౯

అర్థములు. హతశూరము = చంపఁబడిన శత్రువులుగలది, ప్రతిహత=నెఱవేఱని, శాసనము భంగిన్=ఆజ్ఞవలె, జాబిలి=చంద్రుఁడు, శాంతానలము = చల్లారిన నిప్పు.

తా త్ప ర్య ము.

శూరులు చచ్చిన సైన్యమువలె, వ్యర్థమైన యాజ్ఞవలె, రాహువు మ్రింగిన చంద్రునిగల రాత్రివలె, చల్లారిన యగ్నివలె నున్నదానిని.

తే. మైల దాఁకిన వేదినాఁ • బూలఁ గమల,దళములను బీఁకివైచి ప•క్షులను బఱచి
గజము గలఁపఁగ బురదచే•గాడు పడిన,సారసాకరమో యనఁ•జాలుదాని. ౨౧౦

తా త్ప ర్య ము.

అపవిత్రవస్తువు దాకిన యజ్ఞవేదికవలెఁ, దామరపూలను ఆకులను పీఁకివేసి, పక్షులను బాఱఁదోలి యేనుఁగు కలియపెట్టఁగా బురదగానైన తామరకొలని వలె నుండుదానిని.

చ. మగనిఁ దలంచి యేడ్చుటను • మానక, కట్ట దెగంగ వాఁకనాఁ
దగి, యుపచారహీన యయి • తానవసంగతిఁ గృష్ణపక్షమం
దగు నిశఁబోలు సుందరి, న•నర్ఘమణిస్థగితాలయోచితన్
మిగుల సుఖార్హ నున్, మృదుల•నిర్మల దేహను, సుందరీమణిన్. ౨౧౧

అర్థములు. తానవసంగతిన్ = కృశించి యుండుటచేత, అనర్ఘ = వెలలేని, మణీ=రత్నములచే, స్థగిత=చెక్కఁబడిన, ఆలయ=ఇంటియందుండ, ఉచితన్ = తగినదానిని.

తా త్ప ర్య ము.

మగనిఁ దలంచి విడువక యేడ్చుచు కట్టఁదెగిన వంకవలెనై, యుపచారములు లేక కృశించి కృష్ణపక్షరాత్రివలె నుండుదానిని, వెలలేని మణులు చెక్కిన యింట నుండఁదగిన దానిని, మిక్కిలి సుఖమునకు యోగ్య మగు దానిని, సుకుమారమైన నిర్మలమైన దేహము గలదానిని, అందగత్తెలందు శ్రేష్ఠురాలిని.

తే. అపుడ యెండకు వైచిన•యట్టి తమ్మి,తూఁడవంగను వాడిన•తోయజాక్షి
యూథపునిఁ బాసి కంబాన•నుక్కు చెడఁగఁ, గట్టఁబడి వగ నూర్చెడి•కరిణికరణి.

తా త్ప ర్య ము.

కొంచెము కాలమునకు ముందే యెండలో వేసిన తామర తూఁడువలె వాడిన

దానిని, యూథనాయకుని వదలి కంబమునకుఁ గట్టఁబడఁగా నార్చుచున్న యాఁడేనుఁగువలె నుండు దానిని.

క. తూలుచును నొంటిజడతో, జాలిగ నగ లేమి లేమి • శారదవేళన్
నీలం బగు వనలక్ష్మి,లీలలు గల భూమినా ల•లిం గనుదానిన్. ౫౧౩

అర్థములు. తూలుచును = సోలిపోవుచు, ఇది పూర్వపద్యముతో నన్వయము. ఒంటిజడతో = తల విరియఁబోసికొని, నేలపైఁ బొరలాడుటచే వెండ్రుక లన్నియు నొకటిగా జడకట్టుకొని పోయె నని భావము, నగలు=సొమ్ములు.

తా త్ప ర్య ము.

ఒంటి జడ గలిగి, చూచుటకు వ్యసనము గలిగించుచు, సొమ్ములేమి లేకుండుటచే శరత్కాల మందలి నల్లని వనభూమివలె నుండు దానిని.

తే. భయమునను శోకమున నుప•వాసములను
ధ్యానమునఁ గొఱకుడుపునఁ • దపముఁ జేయు
చుండునదివోలె శుష్కించి • యుండుదాని
దీన యగుదాని వెలవెల • నైనదాని. ౫౧౪

తా త్ప ర్య ము.

భయము చేతను, వ్యసనము చేతను; ఆహారములేమి చేతను, చింతచేతను, శుష్కించి కొంచె మాహారము దీసికొని తపస్సు చేయుదానివలె నుండుదానిని, శోకించుదానిని, తన్నుఁజూచి భయముచే తెల్లఁబోయిన దానిని.

ఉ. దేవతలార? నా పతికిఁ • దేజ మెలర్పఁగఁ జేసి యీ దశ
గ్రీవుఁ బరాభవింపుఁ డని • కే ల్ముకుళించి సభ క్తికంబుగా
భావములోన వేఁడు చెలిఁ • బ్రక్కలు చూచుచు నేడ్చుదాని, న
ప్పావని మైథిలిం గదిసెఁ • బాపి దశాస్యుఁడు పంచతార్థ మై. ౫౧౫

అర్థములు. పావనిన్ = పవిత్రురాలిని, పంచతార్థము = మరణము సమీపించిన కారణముచే.

తా త్ప ర్య ము.

దేవతలారా! నా పతికిఁ బరాక్రమ మతిశయింపఁజేసి రావణునకు నపజయము కలుగు నట్లు చేయుఁ డని రెండు చేతులు జోడించి భక్తితో నమస్కరించుచు మనస్సులోఁ బ్రార్థించు దానిని నీ ప్రక్క నా ప్రక్క చూచుచు నేడ్చుదానిని, పవిత్రురాలిని, బాపాత్ముఁ డగు రావణుఁడు మరణదశ ప్రాప్తించుటచే సీతను సమీపించెను.

—• ౨౦-వ సర్గము, రావణుఁడు తనకోరికను సీతాదేవికిఁ జెప్పుట. •—

క. చేరంగఁ బోయి రాక్షస,వీరుఁడు మధురోక్తిఁ బల్కెఁ • బృథ్వీసుతతో
వారక తన మదిఁ గలుగు వి,చారము తెల్లంబుగాఁగ • సాధ్వీమణికిన్. ౫౧౬

తా త్ప ర్య ము.

ఇట్లు సమీపించి రావణుఁడు తియ్యని మాటలతో తన మనస్సులో నున్నయా లోచనలు స్పష్టముగాఁ దెలియునట్లు పతివ్రతాశిరోమణియైన సీతాదేవితో నిట్లనియె.

ఉ. ఏటికి నన్నుఁ జూచి జల • జేక్షణ! దాఁపఁ గుచోదరంబు, లి
ట్లేటి కొకో వణంకఁ, బరు • లెవ్వరొకో కరభోరు! యిందు, నా
మాటను బాటిగాఁ గొనుము • మత్ప్రియురాల! బహూకరింపు నన్,
మేటిసురూపతాఖనివి • నీవ గదే జగదేకమోహినీ. ౫౧౭

అర్థములు. కుచ + ఉదరంబును = స్తనములను కడుపును, కరభోరు=కర భమువంటి తొడలు గలదానా! కరభము = మణికట్టు మొదలు చిటికెనవ్రేలి మొదలు దాఁక చేతి వెలుపలి చోటు. (౨) ఏనుఁగుతొండము. సురూపతా = సౌందర్యమునకు. ఖనివి = గనియైన దానవు.

తా త్ప ర్య ము.

నా ప్రియురాల! జగములను మోహింపఁజేయుదానా! నన్నుఁ జూచి యేల నీవు కడుపును, జనులను దాచిపెట్టెదవు. ఏల యిట్లు వణఁకు చున్నదానవు. ఇక్కడఁ బరు లెవ రున్నారు. నా మాట వినుము. నన్ను గౌరవింపుము. నీవేకదా సౌందర్యమునకు గని యైన దానవు.

ఆ. కలికి మనుజులైనఁ • గామరూపధరులు, రాత్రిచరులునైన • రాజవదన!
యిందు లేరు నీకు • నేటికి భయపడ? నాకు వెఱవ వలదు • నళిననేత్ర! ౫౧౮

తా త్ప ర్య ము.

కాంతా! ఇచట నీ జాతిలోఁ జేరిన మనుష్యులు లేరు. నా జాతికిఁ జేరి కామరూపధరు లైన రాక్షసులు లేరు. నీ వేల యెవరు చూచి యే మనుకొందురో యని భయపడెదవు. నాకు నీవు భయపడవలసిన పనిలేదు. నేను రాక్షసుఁడ నైనను నీ మీఁది కామమున వచ్చితినిగాని, నిన్నుఁ జంప రాలేదు.

క. పరదారగమనకేళియుఁ, బరదారాపహరణంబు • పద్మదళాక్షీ
పరగుఁ గులధర్మమయి ని,ర్జరవైరుల కెల్ల భీరు • సందియ మున్నే. ౫౧౯

తా త్ప ర్య ము.

ఓరీ! నేను నీ భార్యనుగాను, పరభార్యలను నీవు కోరవచ్చునా యందువేమో, పరుల భార్యలను బొందుట, పరుల ధన మపహరించుట యను నాటలు రాక్షసుల కందఱకు నా కొక్కనికే కాదు కులధర్మము. ఓసి పిఱికి! దీనిలో సందేహము లేదు; ఇది కులధర్మ మగుటచే దోషము గాదు. కావున నీకుఁ బాపభయ మక్కఱ లేదు.

క. రామా! యిది యిట్లయ్యు న,కామను నినుఁ దాఁక నొల్లఁ • గామము బలిమిన్
గామింపు యథాకామము,గా మైథిలి! నాదుపట్లఁ • గరుణామతి వై. ౫౨౦

తా త్ప ర్య ము.

సుందరీ! పరదారలను బొందుట నా స్వధర్మమైనను స్వధర్మము నిర్వహించుట నాకు విధియైనను, నాయందు నీకుఁ గామము కలుగ లేదు. కావున నా కెంత కామ మున్నను నిన్నుఁ దాఁకుట కిష్టపడను. నీవే నీ కోరిక ప్రకారము యథేచ్ఛముగా నన్ను నా యందు దయయుంచి కామింపుము.

ఉ. దేవి! భయంబు నొందఁగ మ•దిం దగ దిందుఁ, బ్రసాదదృష్టి సం
భావన సేయు నన్ను వెత•పాల్పడఁబోకుమ, యేకవేణి దు
ష్టావని శయ్యయున్ వరసు•భార్ద్ర తలంబునఁ బస్తు లుంటయున్
వావిరిచింతయున్ మయిల•వస్త్రము నీ కుచితంబులే యిటన్. ౫౨౧

అర్థములు. ప్రసాదదృష్టి = అనుగ్రహముతోఁ గూడిన చూపు, సంభావన= గౌరవము, దుష్టావని=పాడునేల.

తా త్ప ర్య ము.

దేవీ! నీ విచ్చట భయపడరాదు. నన్ననుగ్రహదృష్టి గౌరవింపుము. వ్యసనపడ వలదు. ఒంటి జడ, గొడ్డునేల పడుక, సుఖింపవలసిన చోట నుపవాసములు, వదలని విచారము, మాసినగుడ్డ యివి నీ కిచ్చటఁ దగునా?

ఉ. అందము లైన మాల్యనిచ•యంబులు దివ్యము లైన భూషలున్
జందనలేపనంబులును • జక్కనిపెక్కు తెఱంగు చేలముల్
సుందరమందిరంబులును • సొం పగు పానశయాసనంబులున్
సుందరి నృత్తగీతములు • నాల్కొనుమీ ననుఁ బొంది మైథిలీ! ౫౨౨

తా త్ప ర్య ము.

సొగసైన పూలదండల గుంపులు, దివ్యాభరణములు, దివ్య చందనపుఁ బూఁతలు, అనేకవిధములైన చీరలు, అందములైన యిండ్లు, సొంపయిన పానములు, పానుపులు, పీటలు, ఆటలు, పాటలు నన్నుఁగూడిన దానవై వీని నెల్ల నంగీకరింపుము.

క. స్త్రీరత్నమ! యిటు లుండకు; భూరివిభూషల ధరింపు • పువుఁబోఁడీ! నన్
జేరియునున్ రుచిరాలం, కారములకుఁ బాసి యుండఁ•గాఁ దగు నోక్కో. ౫౨౩

అర్థములు. రుచిరాలంకారములకున్ = అందములైన సొగసులకు, ద్వితీయార్థమున షష్ఠి. షష్ఠీస్థానకంబగు కువర్ణకం బొక్కొక్కచో ద్వితీయాది విభక్తులకు మాఱుగాఁ దత్తదర్థంబులఁ జూపట్టెడి. (ప్రౌ. వ్యా. కా. ౧౩.)

తా త్ప ర్య ము.

స్త్రీలయందు శ్రేష్ఠురాలా! నీ వీ ప్రకారముగా నుండఁ దగదు. వెలగల యాభరణములను ధరింపుము. నాయొద్ద నుండియును నీవు మనోహరము లైన యలంకారముల విడిచియుండ వచ్చునా?

క. చను చున్నది యెఱుంగ వో కో, వనజాక్షీ! హారియౌవ•నము నీకు వృథా
 చనినదియు మరలు నటవే? వనజాక్షీ! వచ్చునా ప్ర•వాహము మఱలన్? ౫.౨౪

అర్థములు. హారియౌవనము = మనోహర మైన వయస్సు, "రతివ్యాయామ సహనో మత్తేభస్యేవ మత్తతా।విద్యతే యువభావో యస్తద్యౌవన ముదాహృతమ్."

తాత్పర్యము.

పుష్పకోమలా! నీకుఁ బ్రాయము వృథా పోవుచున్నది. ఇది నీకుఁ దెలియ లేదు కాఁబోలు పోయిన ప్రాయము మఱలరాదు. ప్రవాహము మఱలి యెన్నడైన వెనుకకు వచ్చునా!

ఉ. నిన్ను సృజించి వెండి తరు•ణీ యలవిశ్వవిధాత రూపసం
 పన్నల సృష్టి సేయుటయె • మాని నటంచుఁ దలంతు లోకమం
 దన్నులమిన్న! నీకు సరి•యంగన లేమి నొకర్తుఁ, బూనుఘుం
 డన్నలు వైన నిన్నుడసి • యబ్జముఖీ! విడనాడి పోవునే. ౫.౨౫

అర్థములు. విశ్వవిధాత = ప్రపంచము సృష్టిచేసిన బ్రహ్మ, రూపసంపన్నలన్ = సౌందర్యలక్ష్మి గలవారల, అన్నులమిన్న = స్త్రీలయందు శ్రేష్ఠురాలా, నలువైన = నలువ + ఐనన్ = బ్రహ్మయైనను, నలు + వ = నలు + వాయి= నాలుగు వదనములు గలవాఁడు.

తాత్పర్యము.

నిన్నుఁ బుట్టించిన తరువాత బ్రహ్మదేవుఁడు సౌందర్యవతు లగు స్త్రీలను సృష్టి సేయుటయే మానె నని తలఁచెదను. ఏలన యో స్త్రీరత్నమా! నీకు సరియైన స్త్రీ లోకమున లేదు. నీ కంటె నందకత్తెను సృష్టింప యత్నించినను నది వ్యర్థ ప్రయత్నమగును. ఆ పనికిఁ బూన నేల, యవమాన పడనేల యని యా పనియే మానుకొనెను. నీవు లభించినపుడు మగవాఁ డా బ్రహ్మయైనను నిన్ను వదలి పోవునా!

ఈ రావణ వాక్యములను మహేశ్వరతీర్థీయ మందు భక్తిపర్యాయముగాఁ గ్లిష్టకల్పనము చేసి వ్రాయఁబడియున్నది. అది వాస్తమునకు విరుద్ధ మని యిదివఱకే వ్రాయబడెను. ఈ విషయమున తిలకవ్యాఖ్యయం దీ వాక్యములు గానవచ్చెడిని. 'ఈదృశేషు తీర్థ స్యాన్యథాయోజనం భ్రాంత్యైవ, రక్షస్తమోగుణావిష్టస్య భగవన్మాయామోహిత స్యాకృత్యేష్వేవ ప్రవృత్తేః। తథా క్రియమాణం భగవద్ధ్యాన మపి పాపభోగోత్తరం జన్మాంతరే ఉత్తమఫలాయేతి బోద్ధవ్యం··· . ·····ఏవంచ భగవతో నిందావరుద్ధభావేన ధ్యాన మపి నరక భోగోత్తరం జన్మాంతరే ఉత్తమ ఫలాయ। అత ఏవాస్య మరణోత్తరం చతుర్థ్య చతుర్యుగ్యాం చేదిరాజకులే జన్మ, చతుర్వింశతి చతుర్యుగ్యాం రామావతార ఇతిహరివంశోక్తేః। తావత్పర్యంతం చైత త్పాప ఫలభోగ ఇత్యర్థ ఆయాత ఇతి బోధ్యమ్.

ఇట్టిచోటుల తీర్థులవారి యన్యథార్థకల్పనమునకు భ్రాంతియే కారణము. తమోగుణావిష్టుఁడై భగవన్మాయామోహితుఁడైన వానికి యకృత్యములు చేయుట యందే ప్రవృత్తి. ఆ విధముగఁ జేయు భగవద్ధ్యానము కూడ పాపభోగానంతరము జన్మాంతరమున ఉత్తమ ఫలము నిచ్చు నని యెఱుఁగవగు. ఈ విధముగ నిందించుచు భగవంతుని ధ్యానించుటచే నరకానుభవానంతరము జన్మాంతరమున ఉత్తమ ఫలము నిచ్చును. ఆ కారణముచేతనే నాలుగు మహాయుగముల యనంతరము చేదివంశ మునఁ బుట్టెను. ఇరువది నాలుగవ మహాయుగమందు రామావతార మని హరివంశ మందుఁ గలదు. ఇరువది యెనిమిదవ మహాయుగమునఁ గృష్ణావతారము కావున నంత పర్యంత మీ పాపఫల మనుభవించు చుండె నని తెలియవలయు నని యర్థము. ఈ విషయమున నింత కెక్కువ చెప్పవలసినది లేదు.

తే. ఎచ్చ టెచ్చట నా దృష్టి • యిందువదన!, పడియె నీపయి నందంద • బ్రాఁతిఁ జలన
మించుకయు లేక నిలిచెనే • యించుఁబోఁడి, గురునితంబిని నిన్నెన్నఁ • దరమె నాకు.

అర్థములు. బ్రాఁతిన్ = ప్రీతిచే, గురునితంబిని = పెద్ద పిఱుఁదులు గల దానా ? తరమే = సాధ్యమా ?

తాత్పర్యము.

నీ దేహము మీఁద నా చూపు లెందెందుఁ బడెనో, యందందే యట్లే యవి ప్రేమచే భ్రాంతి గొని నిలిచి పోవుచున్నవి. కొంచెమైన నా స్థానమును విడిచి పోవు. ఇట్టి నిన్నుఁ బొగడ నాకు సాధ్య మగునా ? కాదు.

దూరా దాకర్షణే శక్తో యస్స ఆకర్షక స్స్మృతః
సర్వేషాం స్పర్శ లోలత్వం కురుతే యస్స చుంబకః
కృతార్థయతి యో దృష్ట్యా సంతు సంద్రావక స్స్మృతః
భ్రామకో మధురాభాషీ సంస్తవే ద్వేషభాజనమ్॥ భోజకారిక.

అయస్కాంతము ఇనుమును లాగుకొనునట్లు ఆకర్షించునది ఆకర్షక మనఁ బడును. తాఁకవలయు నని కోరిక పుట్టించునది చుంబక మనఁబడును. చూపుల చేతనే కృతార్థులఁ జేయునది సంద్రావక మనఁ బడును.

సీ. విడువుమీ మోహంబు • వెలఁది భార్యవు గమ్ము, నా కచ్చటచ్చట • నాఁచికొనుచు
దెచ్చిన నా యెల్ల • తెఱవలలో నగ్రమహిషివి గమ్ము స • మ్మదము మీఱ
నెల్లరఁ బీడించి • యేను దెచ్చినమణుల్, నేను రాజ్యంబును • నీ ధనంబ
నిర్జించి ధరణియు • నిఖిలపత్తనములు, నీదుసంతుష్టి కై • నెఱి నొసంగు

తే. వాఁడ జనకున, కెవ్వఁడే • వాలుమగఁడు, నన్ను రణమున నోర్వఁగా • నున్న జగము
నందుఁ? బోరులవేళల • సుందరాంగి, నాదు బలవీర్యములను గ • నంగఁ గలవు.

అర్థములు. నాఁచికొనుచు = బలాత్కారముగ గ్రహించుచు, అగ్రమహిషివి = పెద్దపట్టపు రాణివి.

తా త్ప ర్య ము.

సీతా ! నీ వీ యజ్ఞానమును వదలుము. నాకు భార్యవు కమ్ము. నే నాయా దేశంబులందు బలాత్కారముగ గ్రహించి తెచ్చిన స్త్రీల యందఱిలో సంతోషముతో నీవు పట్టపు రాణివి గమ్ము. నే వందఱను బాధించి తెచ్చిన మణులు, నేను, నారాజ్యము నీ సొత్తే. ఇదిగాక యింకయుఁ గావలయు ననిన భూమిని, సకల నగరములను జయించి నీవు తృప్తిపడుటకై నీతండ్రి జనకునకు సమస్తము నిచ్చువాఁడను. యుద్ధమునందు నా ధాటి సహింపఁగల శూరుఁ డెవ్వఁడున్నాఁడే; యుద్ధములందు నా బలము, శౌర్యము నీవే చూడఁగలవు.

చ. ఒరగినటెక్కెముల్, రవుతు • లూడిన వాజులుఁ, గూలు తేరులున్
విఱిగిన విండులుం, జెదరి • వ్రేలెడి వెంద్రుకలుం, దడంబడం
బఱచెడి పాదముల్, పిలుకు • మూతెడి సేనలుఁ, గల్గి శత్రువుల్
పిఱికితనానఁ బాఱుదురు • భీతి ననిన్ దనుజామరుల్ సతీ ! ౫౨౮

అర్థములు. పిలుకుమూతెడి=చచ్చుచున్న, అనిన్=యుద్ధమందు.

తా త్ప ర్య ము.

సీతా ! నేను యుద్ధము చేయునపుడు యుద్ధభూమి యెట్లుండు నని తలఁచితివో కదా ! కట్టుత్రాళ్ళు తెగి దండములు విఱిగి నేలరాలిన ధ్వజములు, రౌతులు చచ్చిన గుఱ్ఱములు, కుప్పకూలిన తేరులు, విఱిగినవిండ్లు, విరియఁబోసికొని పరువెత్తు వారి వెండ్రుకలు, తడఁబడ పరువెత్తుకాళ్ళు, చచ్చుచున్న సేనాభటులు గలవారై దానవులందు, దేవతలందు శత్రువు లగువారు భయపడి పరువెత్తుదురు.

ఉ. కన్నులకాంక్ష దీరఁ గనఁ • గా మది గోల్పెడు నీదు రూపమున్
జెన్నగు భూషణంబులను • జెల్వ! ధరింపుము మేన, నాశ దీ
ర న్నిఖిలేష్టభోగములఁ • బ్రాజ్యముగా భుజియింపు, క్రీడలన్
బన్నుగఁ దేలుమీ, రుచిర • పానకముల్ ముదమారఁ గ్రోలుమీ. ౫౨౯

తా త్ప ర్య ము.

నీ సౌందర్యమును గన్నుల కోరిక దీరఁ జూడఁ గోరిక కలదు. కావునఁ జెలువా! దేహమున నాభరణంబుల ధరింపుము. నీ యాశదీర సమస్తభోగములఁ బూర్ణముగ ననుభవింపుము. కేళుల వర్తింపుము. సంతోషముతో మనోహరములైన పానకములు త్రావుము.

మ. ధనమో భూమియొ రాజ్యమో యెదియునేఁ • దన్వి! యథేష్టంబుగా
వనితా! దానము సేయుమీ, ననుఁ గృపా • భావంబునం జూడుమీ
కొనుమీ యెయ్యది గోర నిచ్చెదను నీ • కు, న్నాపయిం గూర్మిఁ జూ
పిన నీవారల కెల్ల సౌఖ్యములు ప్రా • పించున్ నిజం బాడెదన్. ౫౩౦

తాత్పర్యము.

నీ యిష్టప్రకారము ధనముగాని, భూమిగాని, రాజ్యముగాని, మఱి యేదైనం గాని నీ యిష్టమువచ్చినవారికి దానము చేయుము. నన్ను దయతోఁ జూడుము. నీవేది కోరినను నిచ్చెదను. నా యందు నీ కనుగ్రహము గలిగెనా నీ బంధువుల కెల్ల సౌఖ్యములు లభింపఁజేసెదను. సత్యము చెప్పుచున్నాను.

తే. కలికి నాదు సమృద్ధియుఁ • గలిమి కీర్తిఁ, గనుము ప్రీతి, వనాటుండు • గతరముండు
చెలియ! చీరాంబరుండు ని • క్షిప్తవిజయుఁ, డతివ! స్థండిలశాయి నీ • పతి దలంప,

అర్థములు. వనాటుండు = అడవులందు సంచారము చేయువాఁడు, గత రముండు = పోయినసంపద గలవాఁడు, చీరాంబరుండు = నారగుడ్డలు కట్టువాఁడు, నిక్షిప్త = వదలఁబడిన, విజయుఁడు = గెలుపు గలవాఁడు, స్థండిలశాయి=నేలపైఁ బండుకొనువాఁడు.

తాత్పర్యము.

ఇంతసేపు తన్నుఁ బొగడుకొని యిఁక రాముని దూషించు చున్నాఁడు. కలికీ! నా సమృద్ధి, సంపద, కీర్తి వీనిని ప్రీతితోఁ జూడుము. ఇఁక నీ మగఁడో యిల్లు, వాకిలి, గుడిసె నైన లేక యడవులందుఁ దిరుగువాఁడు. సంపద లేనివాఁడు. కట్టు కొన మంచి వస్త్రములు లేక, నారచీరలు గట్టువాఁడు. గెలుపు లేనివాఁడు. పండు కొనుటకు నొక చాపనైన లేక నేలఁ బడి యుండువాఁడు. అట్టి దరిద్రరాముఁ డెక్కడ? నే నెక్కడ!

రావణుఁడు రామచంద్రుని దూషింప వలయు నని దూషించినను 'సత్యవాణీ సరస్వతీ' యన్నట్లు వాని నోట సత్యవాక్కులే వచ్చెను. 'మానిషాద'వలె నని యెఱుంగ నది. లేక ఘుణాక్షర న్యాయ మనినైనఁ జెప్పవచ్చును. వనాటుండు=వన మనఁగానీళ్లు, వానియందుఁ జరించువాఁడు నారాయణుఁడు, గతరముండు = పొందఁబడిన లక్ష్మి గలవాఁడు, చీరాంబరుండు = అంబరము = ఆకాశము, అదియే వస్త్రముగాఁ గల వాఁడు, నిరావరణుఁ డని యర్థము=నిక్షిప్తవిజయుఁడు=చెడిపోని గెలుపేగలవాఁడు, స్థండిలశాయి = స్థండిల మనఁగా యజ్ఞభూమి, దానియందుండు వాఁడు.

ఉ. రాముఁడు నింత దాఁక నటఁ • బ్రాణముతోడుత నున్నవాఁడో లేఁ
డో మది సంశయింతు, నిను • నుత్పలలోచన! చూడ నేనియున్
రాముఁడు చాలఁ, డగ్రమున • రాజిలఁ గొంగలు వార్షికాంబుద
స్తోమము గ్రమ్మినన్ వశమె • చూడఁగ వెన్నెల నెట్టివారికిన్ ! ౫౩౨

తాత్పర్యము.

సీతా ! రాముఁడు రాముఁ డని యంగలార్చెదవే, రాముఁ డింకను బ్రదికి యున్నాఁడు, చావలేదనుట యేమి నిశ్చయము. ఒకవేళ బ్రతికియున్నాఁ డనుకో, నిన్నుఁ జూచుటకైనను రాముఁడు రాఁజాలఁడు. ఎట్లన ముందు కొంగ లన్నియు

వ్యాపించి వానిపైన వాన మబ్బు కూడఁ గ్రమ్మినప్పుడు వెన్నెలను జూచుట కెవరి కైన సాధ్యపడునా ? అట్లులే సముద్రము దాఁటి నన్ను గెలిచికదా నీ యొద్దకు రావలె, ఆదెట్లు రాఁగలఁడు ?

తే. వృత్రశాత్రవకరగత • హేమకశిపు,కీర్తి చందంబునను రామ • మూర్తి మఱల
నాదు హస్తంబునం దుండి • నళిననేత్ర! నిన్ను గ్రహియింపనెట్టులు • నేర్చుఁ జెపుమ.

అర్థములు. వృత్రశాత్రవ కరగత = ఇంద్రునకు వశపడిన, హేమకశిపు కీర్తి=హిరణ్యకశిపునికీర్తి, ఇక్కడఁ గీర్తి కారణ మైన భార్యయని గ్రహింపవలయును. భార్యాహరణము కీర్తిహరణమే కదా, హిరణ్యకశిపుని భార్యను ఇంద్రుఁడు హరింపఁ గలిగెను గాని రాముఁడు నాచే జిక్కిన నిన్ను మఱల హరింపఁజాలఁడు. మఱల రాముఁడు నిన్ను హరించెనేని నా కీర్తి హరించినట్లే. అది యెన్నఁటికిని గాఁజాలదు. ఇంద్రుడు హిరణ్యకశిపుని భార్యను హరించి నారదాశ్రమమున నుంచె ననియు మఱల హిరణ్యకశిపుఁడు నారదు మూలమున నామెను గ్రహించె ననియు భాగవతమునఁ గలదు. ఇది వైధర్మ్య దృష్టాంతము. రావణాసురుఁడు సీతను హరించినట్టులు హిరణ్యకశిపుఁ డింటలేని సమయంబున నింద్రుఁ డాయన భార్యను కయాధువును హరించెను. ఆవల వాఁడు నయముననో, భయముననో మరలఁ దెచ్చుకొనెను. నీవు నాభార్యవు, నిన్ను రాముఁడు నయమునఁగాని, భయమునఁగాని హరింపఁజాలఁడు. ఇట్లు చెప్పి నను చెప్పవచ్చును. తన్ను గొప్పగాఁ జెప్పుకొనుటకై యింద్రునితోఁ దన్నుఁ బోల్చుకొనెను.

క. అందం బగు చిఱునగవున. సుందర రదనమునఁ గనుల • సొబగున వినతా
నందనుఁడు లేలిహానము, చందమున హరించె దీవు • సకి నా మనమున్. ౫౩౪

అర్థములు. లేలిహానము = పాము.

తాత్పర్యము.

అందమైన చిఱునవ్వుచేత, సుందరములైన దంతములచేత, కన్నుల సొగసు చేత, గరుత్మంతుఁడు పామును హరించినట్లు నీవు నా మనస్సును హరించుచున్నావు. ఈ యుపమానము సీతాదేవి రావణుపాలికిమృత్యుదేవత యని సూచించుచున్నది. మృత్యుదేవత యేదియో రోగమో, నొప్పియో నెపముపెట్టి యెట్లు చంపునో యట్టులే సీతయు రామునిచేత రావణుని జంపించు నని భావము.

ఉ. మాసినచీరఁ గట్టి, నెఱి • మాలి యలంకృతి లేక మిక్కిలిన్
గాసిలు చున్నయిట్టి నినుఁ • గాంచుట నా ప్రియురాండ్రతోడ వి
శ్వాసముగా రతిం జలుపఁ • జాలన, కంటె సమస్తసద్గుణా
వాసలు మత్సతుల్ ముగుద! • వారల కీశ్వరి వై చెలంగుమీ. ౫౩౫

తాత్పర్యము.

మాసిన చీరగట్టుకొని, సొగసు వదలి, యాభరణములు ధరింపక మిక్కిలి కష్ట

పడుచున్న నిన్నుఁజూచి నిశ్చింతముగా నా భార్యలతో నేను క్రీడింపలేకున్నాను. అయ్యో! సీత యింత కష్టపడుచుండఁగా నాకేమి సుఖ మని మనస్సంతయు నీమీఁదనే యుండుటచే వారిమీఁద మనస్సు పోవుటలేదు. అట్లైనచో నిప్పుడు నేను నిన్నంగీకరించిన వారి కందఱకు నా మీఁద కోపము రాదా? సవతి మచ్చరము సాధింపరాయందువేమో! నా భార్య లట్టివారు గారు. సుగుణసంపత్తి గలవారు. అదికాక వారి కందఱకు నీవే ప్రభ్వి కమ్ము. నీయధికారానుసారము నిన్ననుసరించి వారు వర్తింతురు.

క. సిరి నచ్చరలు భజించెడి, కరణిఁ ద్రిలోకీప్రవరలు ♦ కాంతా! యస్మ
  త్తరుణులు నిన్ను భజింతురు, కరమును భయభక్తియుక్తిఁ♦గరుణం గనుమీ. ౫౩౬

అర్థములు. త్రిలోకీప్రవరలు = మూఁడులోకములందు శ్రేష్ఠురాండ్రు, అచ్చరలు = అప్సరసలు. అస్మత్తరుణులు = నా స్త్రీలు.

తాత్పర్యము.

శ్రీ మహాలక్ష్మిని మూఁడు లోకములందు శ్రేష్ఠురాండ్రగు నప్సరస లేవిధముగ భయభక్తులతో సేవింతురో యా ప్రకారమే నా యాఁడువా రందఱు నిన్ను భయభక్తులతో సేవింతురు.

క. చేకొను మలకాపురిఁ గల, ప్రాకటరత్నములు ధనము ♦ బద్మదళాక్షీ
  లోకంబునఁ గల్గు నమూల్యాకల్పంబులను నన్ను ♦ నాదర మారన్. ౫౩౭

అర్థములు. అమూల్య+ఆకల్పంబులు=వెలలేని యాభరణములు.

తాత్పర్యము.

కుబేరుని పుర మగు నలకాపురియందుఁ గల నిధులలో నుండు రత్నము లన్నియు నీవే తీసికొనుము. అవిగాక లోకమునఁగల వెలలేని యాభరణములను గ్రహింపుము. నన్ను ననుగ్రహింపుము.

క. తపముననో బలముననో, విపులపరాక్రమములందొ ♦ విత్తమునందో
  విపుల సుకీర్తినొ కాంతినొ, చపలాక్షీ! రామవిభుఁడు♦సరియగు నాతోన్. ౫౩౮

తాత్పర్యము.

తపమునందో, బలమునందో, విస్తార పరాక్రమమందో, ధనమునందో, లోకమున మంచికీర్తియందో రాముఁడు నాతో సమానుఁ డగునా!

మ. లలనా! కోరినరీతిఁ గ్రీడలను దే♦లన్ రాదె, త్రావం గదే,
  కలభోగంబులఁ బొందుమీ, యొసఁగెదం ♦ గళ్యాణి! విత్తంబులో
  యిలయో యెయ్యది గోరి నాపయిఁ గృపా♦దృష్టుల్ ప్రసారించినన్
  జెలి! నీచుట్టము లెల్లరున్ సుఖులుగాఁ ♦ జింతింపు కాంతామణీ. ౫౩౯

తాత్పర్యము.

సీతా! నీ యిష్టమువచ్చినట్లు మనసారఁ గ్రీడింపరాదా! త్రావరాదా! భోగము

లన్ని యనుభవింపరాదా! నీకుఁ గావలసిన ధనమో, భూమియో నీ వేది కోరిన నిచ్చెదనే. నాపై నీవు దయార్ద్ర దృష్టులు వ్యాపింపఁజేసితివేని నీవేకాదు, నీకుఁ గావలసిన వారు బంధువు లందఱు సుఖపడుదు రని నమ్ముము.

మణిమంజరి. మసలకు కనకసు•మండన! ఝంఝ
ద్భసలవిసరములు • భాసిలు వేలా
కుసుమితతరుగణ • కుంజములందున్
బసమెయి మెలఁగుము • భామిని నాతోన్. ౪౮౦

అర్థములు. కనకసుమండన = బంగారుమయము లైన మంచి యాభరణములు గలదాన, ఝంఝత్ = ధ్వనించు, భసల విసరములు = తుమ్మెదల గుంపులు, భాసిలు = ప్రకాశించు, వేలా = సముద్రతీరమందలి, కుసుమిత = పూచిన, తరుగణ = చెట్ల సమూహముల, కుంజములందు = పొదలయందు.

తాత్పర్యము.

భామిని! నీవు ఆలస్యము చేయకుము. బంగారుసొమ్ములు గలదానా! ఝుంకారములు చేయు తుమ్మెదల గుంపులుగల సముద్రతీరమందలి పూలచెట్ల పొదలందు నాతో సంతోషముగా విహరింపుము. మణిమంజరి వృత్తమునకు, న న స స గ గణములు, తొమ్మిదింట యతి.

—• ౨౧-వ సర్గము. సీతాదేవి రావణునకు బుద్ధి చెప్పుట. •—

చ. అనుచు దశాస్యవాక్యముల • నాధరణీధవ యాలకించి దు
ర్మన యయి వేపమాన యయి • మానక సాధ్వి పతిం దలంచుచున్
గనుఁగవ నశ్రువుల్ దొరఁగఁ•గా విలపించుచు దీననాదయై
యనియెను గడ్డిపోఁచ తన • కడ్డము నిల్పి శుచిస్మితాస్య తాన్. ౪౮౧

అర్థములు. దుర్మన=వ్యసనముతోఁ గూడిన మనస్సు గలది, ఆలకించి=విని, వేపమాన = వణఁకుచున్నది, సాధ్వి=పతివ్రత, అశ్రువుల్ = కన్నీళ్లు, దొరఁగన్ = కాఱఁగా, దీననాదయై = దుఃఖముతోఁ గూడిన ధ్వనిగలది, ఏడుపు గొంతుతో, శుచిస్మితాస్య = పరిశుద్ధమైన చిఱునవ్వుతోఁ గూడిన ముఖముగలది. దుర్మన=పతి నెడఁబాసి యుండవలసి వచ్చెఁగదా, దుష్టుఁ డగు వీనిచేఁ బతివ్రతలు వినరాని మాటలు వినవలసి వచ్చెఁగదా యని వ్యసనము.

వేపమాన = అబల—అసహాయ యగుటచే వీఁడు తొందరపడి తాఁకు నేమో యను భయముచే వణఁకెను.

సాధ్వి = సాధుత్వము గలది. కావున వాని నిర్దహింపఁ గలిగియు సహించెను.

పతిం దలంచుచున్ = పతివ్రతలకు భర్తయే దైవము కావునఁ దక్కినవా రాపత్కాలంబుల దైవమును స్మరించున ట్లామె పతిం దలంచెను. పాలించువాఁడు గదా పతి.

అశ్రువుల్ దొరఁగగాన్ = తన్ను వాఁ డేమియుఁ జేయ జాలఁ డను ధైర్యము గలది కావునఁ దనకై యేడిచినదికాదు. తన వలన భర్తకు దుఃఖము వచ్చెఁగదా యనియుఁ, దనవలన వీఁడు సమూలము నాశమై పోవ నున్నాఁడే, చెప్పినను వినఁడే యని రావణు నిమిత్తమైయు కన్నీరు గార్చెను.

గడ్డిపోఁచ తన కడ్డము నిల్పి.

౧. వీఁడు దుష్టభావము గలవాఁ డైనను ప్రభువు, క్షత్రియుఁడు. ఇట్టి వీఁడు తన యొద్దకు వచ్చినపుడు 'ఆసనం చాన్న ముదకం దేయమ్' అతిథివంటివాఁడే. అతిథికి ఆసనమో, అన్నమో, నీళ్లో యథాశక్తి యియ్యవలయు నని శాస్త్రవాక్యము గలదు. కావునఁ దనకు లభించిన యీ తృణము నై చెను.

౨. రావణుఁడు వచ్చి సమీపమందుఁ గూర్చుండుటచే దుష్టులతో సంపక్తిఁ గూర్చుండరాదు గావున పంక్తి భేదము గలిగింప 'స్తంభేన సలిలేన వా పంక్తి భేదోఽభి జాయతే' స్తంభముగాని, నీళ్ళుగాని యేదైన నడ్డముండిన పంక్తి భేద మగును గావున నిరువురకు నడుమఁ దృణము నై చెను.

౩. స్త్రీ పరపురుషునిఁ బ్రత్యక్షముగఁ జూడరాదు. మాట లాడరాదు. 'న పర ముఖ నిరీక్షణం నాపి సంభాషణ'మ్మన్న నీతి ననుసరించి ప్రత్యక్ష సంభాషణము నివారింపఁ దృణ మడ్డము నై చెను.

౪. 'తృణ మివ లఘు మేనే' నిన్ను నేను తృణముగా నెంచుచున్నాను. అన్నట్లు నీ వీ తృణముతో సమానము. ఈ తృణము నన్నేమి చేయఁగలదో నీవు చేయగలిగిన దంతయే యని సూచింపఁ దృణము నై చెను.

౫. నీకు జ్ఞానములేదు 'జ్ఞానేన హీనః పశుభి స్సమానః' యన్నట్లు నీవు పశువుతో సమానము. నీకు భోగ్యవస్తు వీ గడ్డియే. నేను గాదని తెలుప గడ్డిపోఁచ యడ్డము నై చెను.

౬. అలకాపురిఁగల, మఱియు లోకమునఁ గల రత్నాభరణము లిచ్చెద నంటివే, అవి, నీ యైశ్వర్యమంతయు నీ తృణముతో సమాన మని తెలుప గడ్డిపోచ యడ్డమువేసెను.

౭. ఎంతటి శత్రువైనను గడ్డిపోఁచ నోటఁ గరచుకొన్నవాని వీరులు చంపరు. కావున నీవు బ్రదుకఁ గోరెదవేని దీనిని నోటఁ గఱచుకొని రామునియొద్దకుఁ బొమ్ము. నిన్ను రక్షించును. లేకుండిన నిన్నుఁ జంపుట నిజము.

౮. నన్ను నీవు బాధించితివా హిరణ్యకశిపునిచే బాధపడు ప్రహ్లాదుని రక్షింప స్తంభమునుండి నృసింహమూర్తి యుద్భవించినట్లు లీ తృణము నందు రామ మూర్తి యుదయించి ని న్నిచ్చటనే చంపును.

౯. తృణము విఱిచివేసిన యెడల సత్యము తప్పనని ప్రమాణము చేసి నట్లగును.

కావున నన్ను నీవు బాధించుటచే రామలక్ష్మణులు నీలంకను భస్మీభూతము చేయుదు రని ప్రమాణము చేసి చెప్పెద నని భావము.

౧౦. నా యవయవములందు నీ దృష్టి నిలిచియుండదని యంటివి. నీదృష్టులు మఱలక యంతటితో హతము లగునట్లు వామనుఁడు శుక్రాచార్యుని కన్నులు దర్భతోఁ బొడిచినట్లు దీనితోఁ బొడిచెదను.

౧౧. రామచంద్రమూర్తి నన్ను స్పృశించిన కాకాసురు నెట్లు దర్భచే గన్నులు పొడిచి పంపెనో యట్టులే నీ కన్నులు పొడిచెదను.

౧౨. నీవు రాముని గెలిచెద నంటివి. రామచంద్రమూర్తి విడిచిన యా దర్భను బ్రహ్మరుద్రేంద్రాదులును మఱలింపఁ లేకపోయిరి. అట్టి వానిని నీ వేమి గెలువఁగలవు ?

౧౩. ఈ తృణమును ద్రుంచునట్లు నీ తలను ద్రుంచెదను జుమీ యని సూచింప తృణము త్రుంచివైచెను.

పతివ్రతల కోపదృష్టి కోపింపఁ జేసినవారిని దహించును. దమయంతి యొుక వానిని దహించెను. గాంధారి చూపు ధర్మరాజు పదనఖంబులపైఁ బడ నవి కమ లెను. (భార. స్త్రీ. ౧-౧౬౮)

అట్టులే వీఁడును దన దృష్టిపడినా భస్మ మగును. అట్లు వానిని మాత్రము భస్మము చేయుట యామెకు సమ్మతము గాదు. వీఁడు పరస్త్రీహరణము తన కులధర్మ మని చెప్పెను. అట్టి కులమునే నిర్మూలింపవలెను. గాని యొకని నిర్దహించిన లాభ మేమి! అని తలంచి వాఁడు దగ్ధుఁడుకాకుండుటకై తృణము వైచెను.

౧౪. నీవు నాకుఁ గోపము వచ్చునట్లు చేసితివేని నా కోపాగ్నికి నీ వీ తృణ ప్రాయము సుమా. కావున నాకుఁ గోపమువచ్చునట్లు చేయకుము.

శుచిస్మితాస్య – ఇది నవ్వవలసిన సమయముకాదే ఏల నవ్వెను ?

౧. తక్కిన స్త్రీలు నవ్వుచున్నప్పు డుండు ముఖకాంతి యామె దుఃఖించు చున్న నుండును. అది స్వభావసిద్ధము. ఇప్పుడే యిట్లుండునది, సంతోషమున నుండు నపు డెట్లుండునో.

౨. పాము తన్ను మ్రింగుచుండఁ దాను గండుచీమను మ్రింగబోవు కప్పవలెఁ దన్ను మృత్యుదేవత వాత వేసికొనుచుండుట యెఱుఁగలేక నన్నాశించుచున్నాఁడే, వీఁ డెంత మూఢుఁడని నవ్వెను.'పట్టరాని దుఃఖమువచ్చిన ఫక్కుమని నవ్వు' మనిసామెత.

౩. క. గజ మంటినట్ల యడుచున్
భుజగము మూర్కొనినయట్ల • పొరిగొను ధరణీ
భుజుఁడు నగినట్ల చంపున్
గుజనుఁడు మన్నించునట్ల • గొనుప్రాణంబుల్ ॥పంచ॥

అని యుండుటచే రాజపుత్రి రాజనీతి యెఱిఁగినది కావున నట్లు నవ్వెను.

౪. రాముఁడు బలపరాక్రమంబుల నా యీడుగాఁ డనినావదవే, ఆయన యాశ్రమమున లేనపుడు గదా నన్నుఁ దెచ్చితివి. అట్టి పిఱికి పందవు చాటున నాఁడు వారి ముందర దంభములు పలికెదవే యని నవ్వెను

౫. ఈ నవ్వు సామాన్యమైన నవ్వుగాదు. శుచిస్మిత = అగ్నిహోత్రము వంటి నవ్వు, అదియే వానిని నాశము చేయఁగలదు; శుచి=అగ్ని.

క. నాపయిఁ జిత్తముఁ జేర్పకు, నీపడఁతులయందు మనము • నిలుపుము నను నీ
 వీ పగిది వేఁడ ఫలమా, పాపాత్ములు ముక్తిఁ గోరు•పగిదిని ఖలుఁడా! ౫౪౨

తా త్ప ర్య ము.

అందని పండునకై యఱ్ఱులు సాఁచినట్లు నాపై నీవు మన స్సుంప వలదు. పాపాత్మునకు ముక్తి లభింపనట్లు నేను నీకు లభించు దానఁగాను. నీ వెంత వేఁడినను ప్రయోజనము లేదు. అయినను నన్నేమి చేయు మనెదవా! నామీఁద నుంచిన మన స్సును మరల వెనుకకుఁ దీసికొని నీ భార్యల యం దుంపుము. నా మీఁద మనస్సుంచిన నీ కెట్టి కీడు కలుగునో నీ భార్యలమీఁద నీవు మన స్సుంపవేని యంత కీడు గలదు. "పరిభూతవిమన్నా చే ద్భార్యా భర్తా వినశ్యతి" నిష్కారణముగ భార్య నవమానించు టచే నామె దుఃఖించెనేని భర్త నశించును, అని కలదు గదా. కావున నీవు వారిని నుపేక్షింపకుము, న న్నపేక్షింపకుము.

ఉ. పుట్టితిఁ బుణ్యవంశమునఁ • బూజ్యతరాన్వయ మేను మెట్టితిం
 బట్టితి నేకపత్నినియ•మంబును నిట్లు రహించి పాపమున్
 గట్టుకొనంగ నేర్తునె యి•కార్య మొకండు ఘటించి! యేల యీ
 వట్టివి విప్రలాపములు • వాఁగెదు మూర్ఖుఁడ వౌచు రాక్షసా! ౫౪౩

అర్థములు. మెట్టితిన్ = ప్రవేశించితి. ఏకపత్నినియమంబు = పాతివ్రత్య వ్రతము, విప్రలాపములు=విరోధపు మాటలు, వాఁగెదు=వదరెదవు.

తా త్ప ర్య ము.

ఓరి రాక్షసుఁడా! నేను పుణ్యాత్ముని వంశమునఁ బుట్టితిని. అంతకంటెఁ బూజ్యులైన వారియింటఁ బ్రవేశించితిని. పతివ్రతానియమమును గ్రహించితిని. ఇట్టి నేను చేయరాని చెడు కార్యము చేయఁగలనా! చేసితి నేని నేను చెడుటయే కాక యీ రెండు వంశముల వారిని నరకముల పాలు సేయనా! ఇవంతయు నాలో చింపక యేల శాస్త్రవిరుద్ధము, లోకవిరుద్ధము, ఆత్మవిరుద్ధము నగు మాట లూరక వదరెదవు.

చ. అని పెడవాటుగా మఱలి • యా జనకాత్మజ పెండిపల్కె నో
 దనుజుఁడ! నేను సాధ్విఁ, బర•దారను, నీ సతిఁ గాను, నీ మదిం
 గను మిఁక సాధుధర్మము ప్ర•కారము, సాధులమార్గ మూనుమీ,
 పనిగొని తేరతేర కిటు • పాపము నీ వొడిగట్ట నేటికిన్! ౫౪౪

అర్థములు. పెడవాటుగా = వెనుక ప్రక్కఁగా, రావణునకు వీఁపు కనఁబడునట్లు.

తా త్ప ర్య ము.

అని చెప్పి యీ పాపాత్మున కెదురు ముఖమై యుండుటయు దోషమే యని తలఁచి వానిని లక్ష్యము సేయక వెనుకవైపుగాఁ దిరిగి వానికి బుద్ధివచ్చి బాగుపడును గాక యని మఱియు నిట్లనియె. ఓరి రాక్షసుఁడా! నేను బతివ్రతను, ఇతరుని భార్యను, నీ భార్యనుగాను. కావునఁ బరస్త్రీలయందుఁ బరపురుషు లెట్లుండవలెనో యా సాధు మార్గము తెలిసికో, తెలిసికొనుటయేకాదు. ఆ ప్రకారము సాధుమార్గమున నడుపుము. బుద్ధిపూర్వకముగ నేల యిట్లు నిష్కారణముగఁ బాపము సంపాదించు కొనెదవు.

క. నీ కెట్టులో నీ భార్యలు, లోకంబునవారి భార్య • లును రక్ష్య లటుల్
రాకాసి ఱేఁడ! నిన్నే, చేకొని యుపమగను బ్రీతిఁ • దెలఁగు స్వపతులన్. ౫౮౫

తా త్ప ర్య ము.

ఓరీ! స్త్రీలకుఁ బాతివ్రత్యము నియతము, ఆ వ్రతమును బురుషులు కాపాడ వలయును. నీ భార్యల పాతివ్రత్యమును నీ వెట్లు రక్షింతువో యితరుల భార్యల పాతి వ్రత్యమును నట్లే నీవు రక్షింపవలయును. పాతివ్రత్య నియమము మంచిదా, చెడ్డదా యని యాలోచింపుము అది మంచిది కావున నది యెందున్నను రక్షింపఁబడవలసి నదే. పాతివ్రత్యమే యక్కఱ లేదందువా, నీ భార్యలు అంకాడిన నేమి దోషము? ఇతరుల భార్యలను నీ వాశించితివేని నీ భార్యల వ్యభిచారమునకు నీ వనుజ్ఞ యిచ్చిన వాఁడవేకదా. కావున నిన్నే యుపమానముగఁ దీసికొని నే నితరుల భార్యల నాశించి నచో నా భార్య లితరుల నాశించిన దోష మేమి యనుకొని నన్ను నాశింపకుము.

ఉ. సంచలితేంద్రియుం డగుచుఁ • జంచలుఁడై తనభార్యయంద ప్రే
మించి రమించి తుష్టిఁ గొన • మేకొన నోపనిజాల్ముప్రజ్ఞయున్
సంచితలక్ష్మి యాయుధము • సంతతియున్ మఱి వాని యాయువున్
ద్రుంచుట సత్య మన్యవన•తాయుజవత్రవిశాలలోచనల్. ౫౮౬

అర్థములు. సంచలితేంద్రియుండు = బాహ్యేంద్రియ నిగ్రహము లేని వాఁడై, చంచలుఁడు = మనోనిగ్రహము లేనివాఁడై, మేకొనన్ = అంగీకరింప, జాల్ముని = మూఢుని, ప్రజ్ఞయున్ = బుద్ధియు, సంచితలక్ష్మి = వాఁడెన్ని జన్మ ముల నుండియో సంపాదించిన పుణ్యము, ఐశ్వర్యము; అన్య.........లోచనల్ = పరస్త్రీలు.

తా త్ప ర్య ము.

బాహ్యేంద్రియ నిగ్రహము లేక, మనోనిగ్రహము లేక తన భార్యతో మాత్రము క్రీడించి తృప్తి పడలేని మూఢుని బుద్ధి, పూర్వపుణ్యము, ఐశ్వర్యము, వాని సంతా నము, వాని యాయుస్సు వీని నన్నిటిని పరస్త్రీలు సత్యముగ నాశము చేయుదురు

కావున జారత్వ మెంత కీడో తెలిసికొని బుద్ధిగలవాఁడవై ప్రవర్తింపుము.

శా. లేరా పెద్దలు నీకు బుద్ధిఁ దెలుపన్? • లేకుందురా యీ పురిన్
వారిన్ డాయవొ ధర్మమార్గములు నే•ర్వన్? నీ దురాచారముల్
దూరీభూతసుపుణ్యసత్క్రియలు సా•ధువ్రాతదూరస్థుఁగా
నోరీ! తెల్పెడిఁ, గాక యున్న విపరీ•తోక్తుల్ వనుం బల్కెదే? ౫౮౭

అర్థములు, దూరీభూత=దూరముగాఁ జేయఁబడిన, సుపుణ్యసత్క్రియలు= మంచి పుణ్యము నిచ్చు కార్యములు, సాధువ్రాత దూరస్థుఁగాన్ = సజ్జనులకు దూర మందుండు వానిఁగా, విపరీతోక్తుల్ = విరుద్ధపు మాటలు.

తాత్పర్యము.

నీవు చేయరాని పని చేయఁ బూనినపుడు నీ మేలు కోరి నీ కిది తగదు, హాని కరము అని చెప్పెడు వా రింత పెద్ద పట్టణమం దొకరైన లేరా? విభీషణాదుల వంటి వారు లేకుందురా? ఉన్నారు. ఉండిన నేమి లాభము? ఏది ధర్మ, మేది యధర్మ మని తెలిసికొనుటకు నీవు వారియొద్దకు పోవుచున్నావా? వారిని నీవు చెప్ప నిచ్చు చున్నావా? లేదు. "తద్విద్ధి ప్రణిపాతేన, పరిప్రశ్నేన సేవయా, ఉపదేక్ష్యంతి తే జ్ఞానం, జ్ఞానిన స్తత్త్వదర్శిన" యన్నట్లు నీవు పోయి నమస్కరించి ప్రశ్నించినఁగదా ధర్మ తత్త్వ మెఱిఁగిన పెద్దలు నీకు జ్ఞాన ముపదేశింతురు. నీ వట్లడిగిన వాఁడవు కావు. ఏలన నీ దుష్టప్రవర్తనము, పుణ్యములు గాని కార్యములు చేయుట చూడఁగా సాధువులకు నీకుఁ జాల దూర మని తెలియుచున్నది. అటుగాకున్న నీ విట్లు విపరీతపు మాటలు మాటలాడనే యాడవు.

క. కాలంబు దీఱె రాక్షస, జాలంబుల కీవు వినవొ • సాధుల బోధల్?
బాలిశ! మిథ్యాస్నేహవి, లోలున్ నిను నమ్మి వారు • లోఁగరె చెట్టన్? ౫౮౮

తాత్పర్యము.

నీవై యడుగ కున్నను, నీమేలు కోరువారు నీకు హిత ముపదేశించియుందురు. కాని వారి మాటలు నీవువిన్న వాఁడవుకావు. ఏలరాక్షసులందఱు నీవలనఁ జావవలసిన కాలము వచ్చినది. కావున నింతవఱకు నీవు గొప్పవాఁడ వని నీ యాశ్రయమున మేలుపొందెద మని తలఁచి రాక్షసు లందఱు నీయందు స్నేహభావము గలవారై యున్నారు. వారు నీమేలుకోరునట్లు వారిమేలు నీవు కోరువాఁడవు కావు. నీస్నేహ మసత్యము. నీవుచెడుటయే కాక వారందఱు చెడునట్టి పనిని జేయుచున్నావు.

మిథ్యాస్నేహ మనఁగా స్నేహమభావ మని యర్థముకాదు. వారియందు నీకుఁ గల స్నేహభావ మే ఫల మియ్యవలయునో యా ఫల మిచ్చుటలేదు. స్నేహము వలని ఫల ముపకారము. అది నీ వలనఁ గలుగుటకు మాఱు అపకారము గలుగ నున్నది. కావున నీ స్నేహము మిథ్యాస్నేహము.

చ. అనయరతాత్ముఁ డౌచు నకృ•తాత్ముఁడైన నృపాలపాలప
ట్టనములు రాష్ట్రముల్ సిరి యు•డంగును, దద్గతి రత్నపూర్ణయై
గొన బగు లంక యిం కిటను • గూలెడు నిక్కము శీఘ్రకాలమం
దున యసురేంద్ర ! నీ యొకని • దోషమునం బలుమాట లేటికిన్. ౫౪౯

అర్థములు. అనయరతాత్ముఁడు = చెడునడవడియందు నాసక్తిగల మనస్సు గలవాఁడు, అకృతాత్మకుఁడు = పెద్దలచే శిక్షింపఁ బడని స్వభావము, మనస్సు గల వాఁడు, నృపాలపాలు = నీచరాజుయొక్క, తద్గతిన్ = ఆ విధముగా,

తా త్ప ర్య ము.

ఓరీ! పుణ్యాత్ములచేఁ జక్కదిద్దఁ బడని మనస్సు, స్వభావముగలవాఁ డగుటచే చెడు నడవడియందుఁ బ్రీతిగల నీచరాజు కారణముగ వాని పట్టణములు, రాజ్య ములు, సంపద నాశము లగును. ఆ విధముగనే నీ వొకఁడు చేయు పాపము వలన రత్నములతో నిండి యుందనైన లంక యంతయు శీఘ్రకాలమందే నిజముగ నాశము కాఁగలదు. ఎట్లనెదవా! ఓడ నడపువాఁడు మత్తుఁడై యోడను సుడిగుండము లోనికి దించిన వాఁడు చెడుటయే కాక వానిని నమ్మి యోడలోఁ గూర్చుండిన వా రందఱు చెడుదురు గదా.

ఉ. దూరపుఁజూపు లేక యెటు • దోచిన నెయ్యది యైనఁ జేయుచున్
గ్రూరపుఁ బాపకార్యముల•కుఁ మన సిచ్చి చరించు నా యప
స్మారి స్వకీయకృత్యములఁ • జావఁగ లోకము లెల్ల సంతసం
బారఁగఁ బండుగుల్ సలుపు • హాయిగఁ గన్ను మొగుడ్చు రాత్రులన్. ౫౫౦

అర్థములు. అపస్మారి = ఉన్మత్తుఁడు, స్వకీయకృత్యములన్ = తాను జేసిన కార్యములచే, దూరపుఁజూపు = దూరాలోచనము.

తా త్ప ర్య ము.

దూరాలోచనము లేక యేవేళ కేది తోఁచునో దానిని ధర్మాధర్మవిచారము లేక యే పాపకార్యమునందైన మనస్సు పోనిచ్చు నున్మత్తుఁడు వాడు చేసిన పాప కార్యములచే వాఁడు చావఁగా లోకు లందఱు సంతోషముతోఁ బండుగులు చేసికొని నిర్భయముగ, సుఖముగ రాత్రులందుఁ గన్నార నిద్రపోదురు.

ఉ. నిక్కపు వంచకుండ వగు•ని న్నొక నెచ్చెలి వంచు నమ్మి నే
డిక్కటి పోవువారు నినుఁ • దిట్టుదు రీ చెడుకూళ చిక్కె నీ
చిక్కుల దైవ తంత్రమునఁ • జేడ్పడుఁ గాక యటంచు సంతసం
బెక్కఁగ, నేలరా చెడెద • వీ గతి నిందును నందు నిందలన్ ? ౫౫౧

తా త్ప ర్య ము.

స్నేహితునివలె నటించుచుఁ దుదకుఁ గీడు గలిగించు నిజమైన మోసగాఁడ వగు నిన్ను నీ చిత్తవృత్తి తెలియనివారు, నిన్నుఁ దమకు మంచిస్నేహితుఁడ వని నమ్మి

దిక్కుమాలిపోవువాడు, నీవు కష్టదశలోఁ జిక్కుకొనినపుడు ఈ దుష్టుఁడు దైవవశమునఁ జిక్కులపాలైనాఁడు, దీనితో వీఁడు నాశమై పోవునుగాక యని సంతోషములో నిన్నుఁ దిట్టుదురు. ఓరి! యేలరా నిందల పాలయి రెండులోకము లందును జెడెదవు.

ఎవని కీర్తి యెంతవఱకు లోకంబున నుండునో యంతవఱకు వాఁడు స్వర్గమున నుండును. ఎవని యపకీర్తి యెంతవఱకుండునో యంతవఱకు వాఁడు నరకమున నుండును.

క. రవి కెట్టు లెండ శ్రీరా, ఘవునకు నే నట్లటన్న • గనకంబుల నై
భవముల నాశలు గొలిపెద, వవివేకీ ! మోసపుచ్చ • వలవిమె నీకున్. ౫౫౨

తాత్పర్యము.

రావణా! నీ వెంత మూఢుఁడవురా, రామచంద్రమూర్తినుండి నన్ను వేఱుదీయ నాలోచించెదవే, నీ చేనైన నగునా? సూర్యునకు నెండ యెట్టిదో, యెట్టు లనన్యమో నేను శ్రీరామచంద్రునకనన్యను. సూర్యునినుండి యెండను నీవు వేఱుపఱుపఁ గలిగెద వేని రామచంద్రమూర్తినుండి నన్ను వేఱుపఱుపఁగలవు. బంగారు, సంపద, భోగములను జూపి నన్ను మోసగింపఁ జూచెదవే, నీ వెంత యవివేకివిరా! మా యిరువురకు ననన్యత్వమే కాదు, ఎండ సూర్యుని కాంతియై సూర్యునిపై నాధారపడి యున్నను ఆ ప్రకాశమువలననే సూర్యుని యునికి తెలియవచ్చుట, సూర్యునకుఁ బూజ్యత గలుగుట. అట్టులే నేను రామచంద్రమూర్తి దాననై ఆయన మీఁద నాధారపడి పరతంత్రనై యున్నను ఆయన లోకమున కెక్కువ యుపయోగపడునట్లు చేయుదానను నేనే. ఆయన మహిమాతిశయము లోకమెఱుంగుట నావలననే. నేను లేనేని యాయన యునికియే లేనివాఁ డని చెప్పవలసి యుండును.

ఈ విషయము నీకు మారీచుఁడు 'జనకాత్మజ సంబంధంబున రాముం డప్రమేయపుఁ దేజం డయ్యె'నని చెప్పెనుగదా! అవివేకి వగుట నీ వా యర్థము గ్రహింపఁజాలవైతివి. యాచకులు లేరేని దాతలు లేరు. రోగులు లేరేని వైద్యులు లేరు. ప్రజలు లేరేని ప్రభువు లేఁడు. అట్టులే ప్రపంచము లేదేని భగవంతుఁడు లేడు; ప్రకృతిమూలమునగాక భగవంతుని దెలిసికొను మార్గమే లేదు. భగవంతుని శక్తియే లక్ష్మి. ఆమెయే మాయ. ఆమెయే ప్రకృతి. ఆమె చిద్విలాసమే ప్రపంచము. కావునఁ బ్రపంచము వేఱు, భగవంతుఁడు వేఱు కారు. లక్ష్మి యనుగ్రహముచేఁ బ్రపంచమును దాఁటఁగలము. భగవదనుగ్రహమునకుఁ బాత్రులును గాఁగలము. కాని బలాత్కారముచేతను మన ధనవిద్యాబలములచేతను ఆమెను వశపఱుచుకొన లేము. ఆమెను వశపఱచుకొనుటకుఁ ద్రిజట చెప్పినట్లు నమస్కారమే సాధనము.

లక్ష్మీదేవి నారాయణునకు నిత్యానపాయిని యనుటకు,
"ఏవం యదా జగత్స్వామీ, దేవదేవో జనార్దనః
అవతారం కరోత్యేష, తదా శ్రీ స్తత్సహాయినీ

రాఘవత్వే భవే త్సీతా, రుక్మిణీ కృష్ణజన్మని
అన్యేషు చావతారేషు, విష్ణో రేషానపాయినీ
దేవత్వే దేవ దేహేయం, మనుష్యత్వే చ మానుషీ
విష్ణో ర్దేహానురూపాం వై, కరోత్యేషాత్మన స్తనుం.

ఎప్పుడు జగత్స్వామి జనార్దనుఁ డవతార మెత్తునో యప్పు డెల్ల శ్రీదేవి యాయనకు సహాయురాలై యుండును. రామావతారమున సీతాదేవిగను, కృష్ణావతారమున రుక్మిణిగను, ఇతరావతారములందు నిట్లే విష్ణువును విడిచి యుండదు. ఆయన దేవతలం దవతరించెనా తాను దేవత్వమును, మనుష్యులం దవతరించిన మనుష్య స్త్రీగను నగును. విష్ణు దేహమున కనురూపమైన దేహమును దానుధరించును.

అనన్యయనఁగా రాయి నీళ్ళవలె, చీకఁటి వెలుతురువలె నన్యముగాక సూర్యుడు—ఎండ; చంద్రుఁడు—వెన్నెల, రత్నము, కాంతివలె, సముద్రము—అల, శక్తి—శక్తుఁడు - ఇవి చూచుటకు వేఱుగాఁ దోఁచినను వేఱు గానివి. గుణము - గుణి, విశేషణము - విశేష్యము వీనివలె నవినా భావసంబంధము-గలది యనన్యము. ఇట్లులే జీవాత్మ పరమాత్మల కనన్యత్వ మెఱుఁగునది. జీవాత్మవిశేషణము (ఎండ) పరమాత్మ విశేష్యము (సూర్యుఁడు) ''మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః'' అన్నట్లు పరమాత్మ యంశమే జీవాత్మ. కావున విశేషణ విశేష్య సంబంధము;పరమాత్మకంటె నే నన్యముగాను, అని జీవాత్మ యనుకొనుటయే యనన్యత్వ బోధ మని శంకరమతము గాని జీవాత్మయేపరమాత్మయనితలఁచుట కాదు. అపృథక్సిద్ధము.''ప్రకాశాదివత్తు నైవం పరః'' - బ్రి. సూ. 3. 2 ౨౫. ఈ యర్థమునే బోధించుచున్నది. అనఁగా కాంత్యాదికమువలెనే జీవుఁడు బ్రహ్మాంశము. ప్రకాశాదు లగ్న్యాదుల యంశమగునట్లు జీవుఁడును పరమాత్మ యంశము. ఈ యర్థమునే రామచంద్రమూర్తియు ముందు చెప్పఁగలఁడు. కావున ముముక్షు వగు బద్ధజీవుఁడు సీతాదేవి, రామచంద్రమూర్తి పట్ల నెట్టి యభిప్రాయము గలదై, యెట్లు ప్రవర్తించి, లంకనుండి ముక్తురా లయ్యెనో యట్లే పరమాత్మ విషయమున వర్తించి ముక్తుఁడు కావలయును. సీతాదేవి నేనే రాముఁడని చెప్పలే దనుఁటను గమనింపవలెను.అట్టులే రాముఁడు తానే సీత యని చెప్పలేదు.

తే. ఆ జగన్నాథు సత్కృతం • బైన భుజము, దిండుగా సుఖ మందెడి• దేవి నయ్యు
నసురుఁడా! పేరు లేనిపెద్దమ్మ నొకనిఁ, గరముచే నంటుదునె నాదు• కాంతుఁ బాసి.

అర్థములు. ఆ = ఆ విధముగఁ బ్రసిద్ధికెక్కిన, జగత్ + నాథు = బ్రహ్మ మొదలు స్తంబపర్యంతము చేతనాచేతనముల కన్నిటికిని, నాథుఁడు = రక్షకుఁడు అధిపతి యగు వానియొక్క, సత్కృతంబు = పూజింపఁబడినది, దేవిని = ప్రియురాల నగు రాణినై యాయనతోడ సమానమైన లోకపూజ్యత గల రాణిని నయ్యు, పేరులేని పెద్దమ్మ = ఇది లోకోక్తి, కీర్తిప్రతిష్ఠలు లేనివానిని, ఒకనిన్ = కశ్చిత్తు గానిని, అయనకు దాసుఁడుగా నుండనైన యోగ్యత లేని వానిని.

తా త్ప ర్య ము.

సర్వలోక ప్రసిద్ధుఁడై, చరాచరకోటికి బ్రహ్మమొదలు స్తంబపర్యంతమున కంతకు నాథుఁడైన నా కాంతునియొక్క పూజ్య మైన భుజమును తలదిండుగాఁ జేసి కొని పండుకొను సతిని దేవినైన నేను పేరు ప్రతిష్ఠలేని యనామకుని నొకనిఁ జేతిలో నైనఁ దాఁకుదునా !

ఉ. సాంగము వేదముం జదివి • సత్యము, శీలముఁ గల్గి సాధుస
త్సంగతిఁ జేత జ్ఞాని యగు • త్క్మావిబుధేశున కాత్మవిద్య నా
నంగుగ రామభద్రునకె • జ్యాపతికే తగు భార్య నేను నీ
యంగముఁ గాల నేనియును • నంటుదునా యిది యేమి భ్రాంతిరా ! ౫౫౮

అర్థములు. సాంగము = అంగములతోఁ గూడినది, శిక్ష, వ్యాకరణము, ఛందస్సు, నిరుక్తము, జ్యోతిషము, కల్పము, ఈ యాఱును వేదాంగములు. సాధు సత్సంగతి = సాధువు లగు సత్పురుషుల సాంగత్యము, జ్ఞాని = జీవాత్మ పరమాత్మల సంబంధము తెలిసినవాఁడు, క్ష్మావిబుధేశునకు= బ్రాహ్మణ శ్రేష్ఠునకు, ఆత్మవిద్య= యోగవిద్య, అంగుగన్= అన్నివిధముల చక్కఁగ, జ్యాపతికే = భూపతికే, తగు= యోగ్యురాలనైన, 'హ్రీశ్చ తే లక్ష్మీశ్చపత్న్యౌ' యని శ్రుతి చెప్పినట్లు భూదేవియు, లక్ష్మీదేవియు భగవంతుని భార్యలు, అంగము = దేహము, అంగముగాల యనుట యందు తిట్టుకూడ స్ఫురించెడిని.

సాంగము వేదముం జదివి=ఆఱంగములతోడ వేదముఁ జదువఁగానే లాభము లేదు, గాడిద గంధపొడిమూట మోసినట్టే. సత్యము, శీలము గలవాఁడై యుండ వలెను. నీవు వేదములు చదివితివి, ఏమి లాభము? సత్యశీలములు లేవు. ఇచ్చటనీశ్లోకము స్మరింప నగు. హనుమంతుఁడు మఱల రామచంద్రమూర్తి యొద్దకుఁ బోయినపుడు ఆయన రాక్షసుల బలాబలములు, ఆచారవ్యవహారములు ప్రశ్నింపఁగా,

'అగ్నిహోత్రాశ్చ వేదాశ్చ రాక్షసానాం గృహే గృహే' యనెను. ఇది వినఁ గానే అగ్నిహోత్రములు, వేదములు గలవారిని జయింప సాధ్యముగాదే, అట్టి వారిని నే నెట్లు చంపఁగలను ? అని యాయన ముఖము తెల్లఁబోయెను. అది తెలిసికొని హనుమంతుఁడు 'దయా సత్యంచ శౌచంచ రాక్షసానాం నవిద్యతే,' దయ, సత్యము, శౌచము అనునవి యెట్టివో వా రెఱుఁగరు అనెను. అప్పుడు రామునకు ధైర్యము వచ్చెను.

అంతమాత్రమే కాదు. సాధుసాంగత్య ముండవలెను. అది లేదేని తక్కిన వన్నియు ఫలవంతములు గావు.

"సంత స్సంగస్య భేషజమ్" "నాసద్భిః కించి దాచరేత్" "సంసర్గజా దోష గుణా భవంతి" "త్రిజగతి సజ్జన సంగతి రేకా భవతి భవార్ణవతరణే నౌకా" "సత్సం గత్వే నిస్సంగత్వమ్" "సత్సంగాద్భవ నిస్పృహో" "త్యజదుర్జన సంసర్గం భజ సాధు

సమాగమమ్'' "కురు పుణ్య మహోరాత్రం స్మర నిత్యత్వ మనిత్యతామ్" "మందో ష్యమందతా మేతి సంసర్గేణ విపశ్చితః" "దర్శనా దేవ సాధవః" ఈ ప్రకారము సాధు సాంగత్య ముండవలెను. దుర్జన సాంగత్యము మానవలెను. నీకు సాధుసాంగత్యము లేదు. దుష్టసాంగత్యము మెండుగాఁ గలదు. నీవు జ్ఞానివి కావు. త్ర్యావిధుడవు కావు. నీ కాత్మవిద్యయు లేదు.

తా త్ప ర్య ము.

షడంగములతో వేదముఁ జదివి, సత్యము, సదాచారము గలిగి, సాధువుల సాంగత్యము జేసి, జీవాత్మ పరమాత్మ సంబంధము తెలిసిన బ్రాహ్మణోత్తమునకు నాత్మసాధనభూత మైన యోగవిద్యవలె నీ యన్నిగుణములు గల రామభద్రునకు, భూపతికిఁ దగినభార్యను నేను. కావున నీనిలో నొక గుణమైన లేని నిన్నుఁ జేతితోఁ దాఁకు టటుండనీ, కాలితోనైనఁ దాఁకుదునా? ఇది యేమి భ్రాంతిరా, నన్నాశించెదవు? నీ యోగ్యత యెంతమాత్రమో తెలిసికొను తెలివికూడ నీకు లేదాయెఁగదా.

రామచంద్రమూర్తి త్ర్యావిబుధేశుఁ డెట్లయ్యె నని సందేహింపఁ బనిలేదు. త్ర్యా+విబుధ+ఈశుఁడు=భూదేవికి, దేవతలకు నీశుఁ డని భేదము.

రావణుఁడు శుద్ధబ్రాహ్మణుఁడు కాఁడు. శుద్ధక్షత్రియుఁడు కాఁడు. అనులోమ సంకరజాతి. అది ముందు విచారింపఁబడును.

క. కానవతలమునఁ జిక్కిన, ధేనుకతోఁ గరిని గూర్చు • తెరువున దుఃఖా
ధీన నయి వగచు నాతో, నా నాథునిఁ దెచ్చి కూర్చు • నయమతి వగుచున్. ౫౧౫

అర్థము. ధేనుక = ఆఁడేనుఁగు.

తా త్ప ర్య ము.

ఎంతో యాశపడి మోచి తెచ్చితినే. నీ విట్లనెదవే. ఇప్పుడు నన్నేమి చేయు మనెద వనెదవా? నీకుఁ గర్తవ్యము చెప్పెద వినుము. అడవిలో నొంటిగాఁ జిక్కి దుఃఖించు నాఁడేనుఁగు నొద్దకు మగయేనుఁగును దెచ్చి విడిచినట్లు నాభర్తను బాసి వగచుచున్న నాయొద్దకు నిప్పుడైన నీతిపరుఁడవై నాభర్తను దెచ్చి విడుము. తన్నుఁ దీసి కొని పోయి రామునియొద్ద విడువు మని చెప్ప లేదు. అట్లు చెప్పిన నా నెపమున మఱలఁ దాఁకును. కావున రామునినే యిటకుఁ దెమ్మనెను. అట్లైన నీవు నయమతి వనిపించి కొందువు. ఇప్పుడు వచ్చిన దుర్నీతిపరుఁ డను పేరు పోవును.

ఉ. ఇంకను గొన్నినాళ్లు పుర • మేలఁ దలంచెద వేని, దండభృ
త్కింకర ఘోరపాశములఁ • గీడ్వడ నొల్లవ యేని, రావణా !
కొంకకు రాములోఁ జెలిమిఁ • గోరుము, యప్పురుషోత్తముండు ధ
ర్మాంకుఁడు నిన్ను నేలు శర•ణాగతవత్సలుఁ డౌట నమ్మిలిన్. ౫౧౬

అర్థములు. దండభృత్ = దండధరుఁ డైన యమునియొక్క, కింకర = భటులయొక్క, ఘోరపాశములన్ = భయంకరములైన పాశములచే, కీడ్వడక =

బాధనొంద, ధర్మాంకుఁడు = శరణాగత రక్షణమే లక్షణముగాఁ గలవాఁడు, శరణాగతవత్సలుఁడు = శరణని వచ్చినవారియందుఁ బ్రేమగలవాఁడు, అర్చిలిన్ = కూర్మిచే, ఇంకను = ఇదివఱకు నీవు సుఖముగా రాజ్యము చేసినట్లు లేకపోయినఁ గూడ, కొన్నినాళ్ళు = అల్పకాలమైనను, నన్ను రాముని కర్పింపకపోయితివా నేఁడు మొదలు నీకు క్షయకాలమే. ఒక్కొక్కనాఁ డాలస్యము చేయుకొలఁది నీకు మృత్యువు సమీపించుచున్న దని తెలిసికొనుము, పుర మేలన్ = కష్టపడి సంపాదించినది, సమస్త భాగ్యభోగ్యపదార్థములతో నిండినది, నాది యని నీ వభిమానము వహించినది యగు పట్టనము. పుర మనఁగా దేహము. కావున నీ దేహమును నింకను గొన్నినాళ్ళు రక్షింపఁ దలఁచెద వేని.

ఏలఁ దలంచెద వేని=నాశము చేయుటకు నిష్టము లేదేని—బాగుగఁ బాలింపఁ గోరిక కలదేని, ఈ విధముగ నీవు జీవించి యీ లోకమున సుఖపడఁ గోరినను, లేక, దండ....నొల్లవ యేని=చచ్చి, యమకింకరుల చేతిలో నరకబాధ పడ నిష్టము లేకున్నను, రావణా! వదరుపోతా! నేను చెప్పఁబోవునట్లు నీవు చేయకపోయితివా, రామచంద్రమూర్తి నిన్నుఁ జంపుట నిజము. అప్పుడు నీకీ రాజ్యసుఖము లోనగు నీ లోక సుఖములు లేవు. పరలోకమున నీ పాపానుభవమునకై నరకబాధయుఁ దప్పదు. రెండు లోకములఁ జెడుదువు. పరలోకమున నీవు సుఖపడఁ గోరినను రామునకు నీ వనుకూలుఁడవై యుండవలసిన వాఁడవే. ఆయన యందుఁ బ్రతికూలభావము గలవారికి బరలోకసుఖము లేదు. అనుకూల భావము గలవారికి నరకదుఃఖము లేదు. అట్లైన నేమి చేయు మనెదవా? కొంకకు = జంకుపడకుము. నీ పురమందు నీ కెవరు మేలు చెప్పువారు లేరు. వారు చెప్పినను నీవు వినవు. కనుక నీయందు జాలి గలిగి నీవు చెడిపోవుట సమ్మతింపక నేనే చెప్పుచున్నాను. "స్త్రీ బుద్ధిః ప్రళయంకరీ" యని యొకఁడు చెప్పినట్లు వినిన నేమి యపాయము వచ్చునో యని సందేహింపకుము.

రాముతోఁ జెలిమి కోరుము = రామచంద్రమూర్తితో స్నేహము చేయఁ దలఁపుము, రాముతో=నీ వంటి క్రూరగుణము వికారాకారము గలవానితోఁ గాదు. ఆకారమున గుణమున నభిరాముఁ డగు వానితో - రాముతో=మఱి యెవ్వరితోనో కాదు. నా భర్త యగు రాముతో - నే నెట్లు నీ మేలుగోరి చెప్పుచున్నానో యట్లే నీ మేలుగోరి రక్షింపఁగల వానితో, వచ్చినవాఁడు రావణుఁడైనను రక్షించెద నని ముందు చెప్పఁగలఁడుగదా, అట్టి వానితోఁ జెలిమిఁ గోరుము. స్నేహము కోరుము, అనుకూలుఁడవు కమ్ము. ప్రతికూలబుద్ధివి కాకుము, కోరుము=అనుకూలుఁడనై వర్తించెద నని నీ మనస్సులో ననుకొనుము, చాలును. అంత కెక్కువ నీవు చేయవలసినది యేమియు లేదు. అట్టి యభిప్రాయము నీకుఁ బుట్టినను నిన్నాయన రక్షించును. ఓసీ నీవు నన్నుఁ జంపఁజూచుచున్నావు. ఆయనవిషయములో నిటువంటి ఘోరాపరాధము జేసిన నేను ఆయన యెదుటఁ బడిన వెంటనే చంపునుగాని, విడుచునా? ఇదియా నీవు

బోధించుహితము-అందు వేసెనో. ఓరీ! నీవంటివాఁడు కాఁడు. నీవు వధకర్హుఁడవైనను, ఘోరయుద్ధమందు నింకొక బాణము వేసిన చచ్చుస్థితిలో నీ వున్నను చేత నాయుధము లేక యుంటివేని నిన్నాయన చంపఁడు. శత్రువు లందును ఆయన వాత్సల్యము గలవాఁడు. ఇది నీ వనుభవముచేఁ దెలిసికొనఁగలవు. ఆయన పురుషోత్తముఁడు గనుక నాయనయం దిట్టి గొప్పగుణము గలదు. పురుషులకంటె నుత్తముఁడుగదా పురుషోత్తముఁడు. కావునఁ బురుషులయందుఁ గల ప్రాకృతాది గుణము లాయన యందు లేవు. కేవల శుద్ధసాత్త్వికగుణములు గలవాఁడు. కావున వనుకూల భావము గల నిన్ను నీ దోషము లెంచక రక్షించును. సజ్జనులు దోషము లెంచరు అని బహిరంగముగాఁ జెప్పఁగలఁడు. అట్టులే ప్రవర్తించును. 'అజ్ఞుండు చేసినయపరాధ ములను జేపట్టఁ డీశ్వరుఁడు కృపాళుఁ డగుట' నని కలదుకదా. ఇంకను ఆయన విషయమై యాయన నడవడి నెఱిఁగినవా రేమి చెప్పిరో వినుము. అవిజ్ఞాతా = పరుల దోషము లెఱుఁగనివాఁడు. "అపరాధశతము సల్పిన విపరీతము నెంచఁడాత్మ విజ్ఞుం డగుటన్" అపరాధానభిజ్ఞస్సన్ సర్వైవ కురుతే దయామ్" అపరాధముల నెఱుఁగక పోవుట మాత్రమేకాదు, ఎల్లప్పుడు దయయే తలఁచువాఁడు. కావున కరుణా కాకుత్స్థుఁడని బిరుదు సంపాదించినవాఁడు. కావున నేనును బురుషుఁడనే, ఆయన పురుషుడే. నా యట్టి వాఁడే కదా యని నిన్నుఁబట్టి పోల్చికొనకుము.

ధర్మాంకుఁడు - ధర్మగుణమే భూషణముగాఁ గలవాఁడు. "అంకో నాటక విచ్ఛేదే సంఖ్యాయాం యుధి భూషణే, సమీపే రూపకే స్థానే యథా పుత్సంగ చిహ్నయోః". నీకు బంగారు వెండి నగలు ఆభరణములు, ఆయనకు ధర్మగుణమే ఆభరణము. ధర్మాంకుఁడు=ఎదుటఁబడి నంత మాత్రముననే నిన్నుఁ జంపు నని భయ పడకుము.నిన్నుఁ జంపఁ దలఁచెనా నిన్ను ధర్మయుద్ధమందే చంపును.అధర్మమార్గమున జయము గోరఁడు. కావున నీవై చావఁ గోరి పైపడి శస్త్రధారివై పోయినఁ దప్ప నిన్నుఁ జంపఁడు. ఏలన నాయన ధర్మాంకుడు = ధర్మబుద్ధిగలవాఁడు - బుద్ధి మాఱదా - ఎల్లకాల మొక తీరున నుండునా యందువేమో - ధర్మాంకుఁడు = ధర్మమునకు స్థాన మైనవాఁడు. ధర్మమాయనను విడిచిపోదు. ఆయన ధర్మాంకుఁడు= ధర్మమే చిహ్నముగాఁగలవాఁడు. నీ వాయనను జూచినంతనే యాయన ధర్మాత్ముఁడని గుర్తింపఁగలవు. నీముఖము చూడఁగనే నీవు క్రూరుఁడ వని యెట్లు తెలియుచున్నదో యట్లాయనను జూచినవారు ధర్మాత్ముఁ డని తెలిసికొనఁగలరు. కావున నిన్ను నేలును=నిన్నవశ్యము రక్షించును. నీవు నీ పుర మేలు నట్లు నిన్నాయన యేలును. ఊరక యేలుట గాదు. అస్మిలిన్ ఏలును=ప్రేమతో రక్షించును. నీ దేహమును నీ వెట్లు రక్షించుకొను చున్నావో యట్లు నిన్ను రక్షించును. "రక్షతే భగవాన్విష్ణుః భక్తా నాత్మ శరీరవత్"అని కలదుకదా సూక్తి.ఏమి నమ్మకమందువా,ఆయన శరణా గతవత్సలుఁడు = శరణు అని వచ్చినవారిని తనబిడ్డలవలెఁ జూచువాఁడు. తన బిడ్డను

దా నెవఁడైనఁ జంపునా? నీవు చెప్పినది బా గున్నది. ఆయనయందు విరోధభావము మాని నా యింటనే యుండెదను. నీ వీ వనములో నుండుము. ఆయన నడవిలో నుండ నిమ్మనెద వేమో ?

ఉ. మానుము రాక్షసేంద్ర ! కొఱమాలినబుద్ధి దయాస్వరూపుఁ డా
మానధనుండు, న న్నిపు సమర్పణ చేసి భజింపు మీవునున్
దాన శుభంబు నీ కగును నా నుడి నీవు కృతాంతు ప్రేరణన్
వీనులఁ బెట్టవేని పృథివీపతిచే మృతిఁ గందు వాజిలోన్. ౫౫౭

అర్థములు. కొఱమాలిన బుద్ధి=నిష్ప్రయోజన మైన, యిటువంటి విపరీతబుద్ధి, మానుము=వదలుము—చెలిమిఁగోరుట కేమి లక్షణము ? అపరాధము చేయుటయా? ఉపకారము చేయనుండినను అపకారముచేయుట మానవలెఁగదా. చేసినయపకారము సవరించుకొనకుండిన నది యేమి స్నేహము ? అది స్నేహలక్షణమా ? కావున నీవు చేసిన యపరాధమును సవరించుకొనుము. ఆయన మానధనుఁడు కావున నవ మానము సహింపఁడు. అందు నాయన విషయమునఁ జేసిన యపరాధములను క్షమించునుగాని, యాయన యాశ్రితుల విషయమునఁ జేసిన యపరాధములను సహింపఁడు. కావున నా విషయమున నీవు చేసిన యపరాధమును ఆయన సహింపఁడు. నీవు దానిని సవరించుకొంటివా,వీఁ డిట్టి దుష్టకార్యము చేసెనే యని మనసున నుంచు కొని దండింపక దయాస్వరూపుఁ డగుట క్షమించును. అంతటి దయావంతుఁ డైనచో నిప్పుడు మాత్రము నన్నేల క్షమింప రాదు. ఏమో జ్ఞానహీనుఁడు చేసినాఁడులే యని యూరకుండరాదా యందువేమో, అటయిన నందఱు నపరాధములు, పాపములు చేయువా రేయగుదురు. పుణ్యపాప వివక్షయే లేకపోవును.లోక మధర్మమున నుండును. అప్పుడు ధర్మరక్ష యెట్లు చేయఁగలఁడు? అధర్మరక్షకుఁ డగును. అటయిన నిపుడు నన్నేమి చేయు మనెదవా? ఆయనను వెంటనే యిచ్చటికిఁ దోడుకొనివచ్చి నన్ను సమ ర్పించి సేవింపుము. ఈవునున్ భజింపుము=నీవు కూడ భజింపుము, ఆయన రాఁగానే నీ విషయమై వీనిని రక్షింప వలసినది యని నేనును జెప్పెదను. నీవు కూడ నమస్క-రింపుము. చాలును. అంత కెక్కు-వ నీ వేమియుఁ జేయవలదు. దానన్ =ఆ నమస్కా-ర రూపక సేవవలననే నీకు మేలు గలుగును.

కృతాంతుప్రేరణన్ = యముఁడు ప్రేరించుటచే, నా నుడి నీవు వీనులన్ బెట్ట వేని = విని యా ప్రకారము వర్తింపక పోయితివా, పృథివీపతిచేన్ = రామభూపా లునిచే, ఆజిలోన్=యుద్ధమందు, మృతిఁగందువు = చత్తువు.

తా త్ప ర్య ము.

రాక్షసరాజా ! నిష్ప్రయోజనమైన యీ బుద్ధి వదలుము. రామచంద్ర మూర్తి దయాస్వరూప మగువాఁడు. మానమే ధనముగాఁ గలవాఁడు. కావున న న్నాలస్యము చేయక యాయనకు సమర్పించి, నీవు కూడ సేవింపుము. దానివలన

నీకు మేలు గలదు. యముఁడు నిన్నుఁ బ్రేరించుటచే నా మాట వినక పోయితివా యుద్ధమందు నీవు ఆయనచేఁ జచ్చుట సత్యము.

ఉ. తప్పినఁ దప్పవచ్చు బల•దానవవైరిశితారపాతముల్
దప్పినఁ దప్పవచ్చు నల • ధర్మని మూడ్కులు కొంతకాలమేన్
జెప్పెద సావధానమతిఁ • జేస్త్రము వీనుల, రాముఁ డల్గినన్
జెప్పెడి దేమి మూర్తమునఁ • జీలిచి వైచును నిన్ను బోటులన్. ౫౫౭

అర్థములు. బలదానవవైరి = బలుఁ డను రాక్షసునకు విరోధి యగు ఇంద్రునియొక్క, శితార = నూ అంచులు గల వజ్రాయుధముయొక్క, పాతముల్ = పడుటలు, ధర్మని=యమునియొక్క, కొంతకాలమేన్=కొంతకాల మైనను, శాశ్వత ముగాఁ దప్పదు. ఎట్టి రోగి యైనను బ్రలయమం దైనఁ జావవలసిన వాఁడే, సావధానమతిన్ = హెచ్చరిక గల మనస్సుతో.

తా త్ప ర్య ము.

బ్రహ్మచేత, రుద్రునిచేత, వరములు గొన్న నీ వంటి వారి విషయమున నింద్రుని వజ్రాయుధము వ్యర్థమై పోయినఁ బోవచ్చును. యమధర్మరాజు కంటఁబడక కొంతకాలము తప్పించుకొనినఁ దప్పించుకొన వచ్చును గాని, నేను జెప్పెడి మాట యేకాగ్రచిత్తముతో వినుము. ఏమో చెప్పుచున్న దని యుదాసీనుఁడవు గాకుము. రామచంద్రమూర్తికిఁ గోపమే వచ్చెనా, నే నేమని చెప్పుదును. నిన్ను బ్రహ్మరుద్రాదుల వరములు కాపాడలేవు. ఆయన బాణము లల్పకాలములో నిన్ను, నీవంటి వారిని ముక్కలు ముక్కలుగాఁ జీల్చివేయును. ఆయనకుఁ గోపమువచ్చి విల్లెక్కుపెట్టువఱకే నీ జీవితము.

క. కడువడి సురపతి విడిచిన, పిడుగులవడువునను గడిఁది•బెడిదపుటులివుల్
విడివడ రఘుపతిశరములు, వెడలఁగ వినఁ గలవురా! వి•వేకముఁ గనరా. ౫౫౮

అర్థములు. కడువడిన్ = మిగులవేగముగ, కడిఁది = మిక్కిలి, బెడిదపు = భయంకరము లైన, ఉలివుల్ = ధ్వనులు, విడివడన్ = బయలువెడలఁగా.

తా త్ప ర్య ము.

నామాట నీవు వినక పోయితివా మిగుల శీఘ్రముగ నింద్రుఁడు విడిచిన పిడుగుల వలె మిగుల భయంకరములైన ధ్వనులతో రామచంద్రమూర్తి బాణములు వింటినుండి వెలువడ వినఁగలవు. అవి వినక ముందే తెలివి తెచ్చుకొనుము. ఒకసారి విని యవియంత భయంకరముగాఁ దోఁచిన శరము వచ్చెదనులే యనకుము. ఆ శబ్దము నీచెవిని బడక ముందే బాణము నీఱొమ్మున నాటియుండును, నీవు నేలఁబడి యుందువు. రామచంద్ర మూర్తి బాణములు వచ్చువిధము నీవు చూచిన వాఁడవు గావు. కావున నిన్ను నీవు గొప్పగాఁ జెప్పుకొనుచున్నావు. మారీచాదు లెఱుఁగుదురు. నీ శూర్పణఖ మెఱుఁగును. వారు నీకుఁ జెప్పియే యుందురు. నీ శరప్రయోగవిధము, రామచంద్ర

మూర్తి శరప్రయోగ విధము రెండును నేను జూచితిని. నీవి మేఘములనుండి వెలువడు నీళ్ళ బిందువులవంటివి. రామునివి పిడుగులవంటివి. మీ యిరువుర కిదియే తారతమ్యము. అనుభవమువలన నీవే తెలిసికొనఁగలవు.

ఉ. క్రూరవిషానలార్చులను • గుప్పునఁ గ్రక్కుచుఁ గోల లార్పుచున్
దోరముగాఁగ సర్పములు • దూఱెడు పట్టు లవక్రపర్వముల్
శ్రీరఘురామలక్ష్మణ సు•చిహ్నితముల్ శితభీక రేషువుల్
ఘోరముగాఁ బయిం గవియ • గోడుగొనుం జుమి లంక యంతయున్. ౫౬౦

అర్థములు. క్రూరవిషానలార్చులను = తీక్ష్ణమైన విష మనెడి యగ్ని జ్వాలలను, ఆర్పుచున్ = ఆడించుచు, దూఱెడు పట్టులు = ప్రవేశించు విధముగ, అవక్ర పర్వముల్ = వంకరలేని కణుపులు గలవి. సుచిహ్నితముల్ = పేర్లు చెక్కఁబడినవి, శిత = పదునైన, భీకర = భయము కలిగించు, ఇషువుల్ = బాణములు, గోడుగొనుం జుమి = కీడుల పాలగును జుమీ.

తాత్పర్యము.

ఓసీ ! రాముని బాణములు పిడుగుల వంటివి. పిడుగు లొకటియో, రెండో పడును. రాముఁ డూరి లోనికి రాఁ జాలఁడు. ఊరివెలుపల నెందో యుండి యొకటి రెండు బాణములు విడిచినంత మాత్రమున వచ్చిన భయ మేమి యుండువా ! నేను వేగమునందు, శక్తియందుఁ బిడుగు లని చెప్పితిని గాని,సంఖ్యయందుఁ గాదు. క్రూరములైన సర్పములు విషాగ్నులఁ గ్రక్కుచుఁ గోల లాడించుచు గుంపులు గుంపులుగఁ దూఱునట్టులు రామచంద్రమూర్తి యొక్క వంకరలేని కణుపులు గలిగి రామ లక్ష్మణుల పేర్లు చెక్కఁబడిన, భయంకరములైన బాణములు లంకలోఁ బ్రవేశించి రాక్షసులపైఁ బడఁగా నవి తగిలి చచ్చువా రెందఱో, భయపడి పరువెత్తువా రెందఱో లంక యెంత యల్లకల్లోల మగునో యాలోచింపుము.

తే. రామలక్ష్మణముక్తనా•రాచతతులు, కంకపత్రంబు లీ పురిఁ • గలయఁ బర్వి
పీనుఁగుల పెంట లొనరించు • దానవాళి, నింట నింటను నేడ్పులు•మింటి నంట.

అర్థములు. ముక్త = విడువబడిన, నారాచతతులు=బాణసమూహములు' కంకపత్రంబులు = గ్రద్దయీఁకెలు గలవి.

తాత్పర్యము.

రామ లక్ష్మణులచేత విడువఁబడిన గ్రద్దయీఁకలు గల బాణము లీ పట్టనమం దంతయుఁ గలయ వ్యాపించి పీనుఁగుల పెంటలు గలిగింపఁగా, రాక్షసుల యింట నింటను నాఁడువా రేడ్పు ధ్వను లాకాశ మంటఁగలవు.

తే. పాఁపమూఁక సుపర్ణుండు • పట్టి చిమ్ము,గతి మహాబలుఁ డగు రామ•ఖగవిభుండు
రాక్షసేంద్రమహోసర్ప•రాజి నెల్ల, నాశుగ్రసోటిఁ జించి చెం•డాడఁ జొచ్చు.

అర్థములు. పాఁపమూఁక = పాములగుంపు, ఖగవిభుఁడు = గరుత్మంతుఁడు, ఆశుగ్రతోటి=బాణము లను ముక్కుచే.

తాత్పర్యము.

కోట్లకొలఁది మే ముండఁగా నొక్క రాముఁడేమి చేయఁగలఁ డందువా?పాముల సమూహముల నొక్క గరుత్మంతుఁడు పట్టుకొని విదలించివైచువిధమున రాముఁ డనెడి గరుత్మంతుఁడు బాణము లను ముక్కుతో రాక్షసు లను సర్పములగుంపును చించి చెండాడును జుమ్మీ. ఎన్ని పాము లయినను నొక్క-గరుత్మంతుని గెలువఁ గలవా?

చ. అసురకుఁ గైవసం బయిన • యైంద్రపదంబుఁ ద్రివిక్రమాకృతిన్
వసముగఁ గైకొనండె హరి • వాసవశాత్రవ ! యట్ల రాముఁడున్
వెస నిట నుండి తోడ్కొనుచు • వెళ్ళును నన్, నిజ మంతవట్టు, నీ
వసదుగఁ జూడఁ బోకు రఘు•వర్యుని, భూమి మనంగఁ గోరినన్. ౫౬౩

అర్థములు. అసురకున్ = బలికి, కైవసము=స్వాధీనము, ఐంద్రపదంబు = ఇంద్రపదవి, వసముగన్=స్వాధీనపడునట్లు, వశము—తద్భ—వసము. నన్=నన్ను, అసదుగ = అల్పముగ, మనంగన్ = బ్రదుకుటకు.

తాత్పర్యము.

ఓరి యింద్రవిరోధీ! యింద్రవిరోధి యగు బలిచక్రవర్తి పూర్వ మింద్రుని స్థాన మాక్రమించి తానే యింద్రుఁడై యుండఁగా విష్ణువు దానిని మఱలఁ దన వశము చేసికొనలేదా ? అట్టులే రాముఁడు నీ స్వాధీనమందుండు నన్నుఁ దోడ్కొని పోవును. రామచంద్రమూర్తి యొంటరిగాఁ డేమి చేయఁ గల డని యూయనను నల్ప ముగఁ జూడవలదు. వాఁడునుఁ డొంటరివాఁడు కాఁడా ? బలపరాక్రమములు లెక్క గాని, యొంటరి సంటరి తనము లెక్కగాదు.

క. ప్రస్థానార్భటి చెలఁగ జ,నస్థానము వెడలి వచ్చి • నానారులు నా
కస్థానముఁ జేరఁగను హ,తస్థానము గాఁగ నదియు • ధైర్యము లేమిన్. ౫౬౪

అర్థములు. ప్రస్థానార్భటి = ప్రయాణధ్వని, నాకస్థానము = స్వర్గము, హతస్థానము = పాడుపడినది.

తాత్పర్యము.

యుద్ధమునందు నాతో రాముఁడు సాటియా యనెద వేమో. యుద్ధ సన్నాహమున భేరీ ఝాంకారాదులతో జనస్థాన రాక్షసు లందఱు వచ్చి చచ్చి జన స్థానము పాడు పడఁగా యుద్ధమున నెదిరింప ధైర్యము చాలక.

క. దొంగిలి తెచ్చితి వుటజము,నం గూళా యొంటి నుండు • నన్ నృపతిలకుల్
చెంగట లేమిని జోరుని, భంగియ గా కిదియు శూరు•పద్ధతి యటరా! ౫౬౫

అర్థము. ఉటజము=పర్ణశాల, ఆకుటిల్లు; కూళా=వంచకుఁడా !

తా త్ప ర్య ము.

అకుటింటిలో నొంటిగా నుండుదానిని వంచకుఁడా! రాజపుత్రు లిరువురు దగ్గఱ లేని సమయమునఁ దెచ్చితివి. ఇది దొంగవాని విధమా? శూరుని విధమా? ఇట్లు దొంగవలె వర్తించియు శూరుఁడ నని చెప్పుటకు సిగ్గు లేదా.

క. పులులపసి సోఁక శునకము, నిలువంగా లేనియట్లు ♦ నిలువం గలవే
కలన రఘూత్తంసుల ముం,గల విక్రమహీన నీవు ♦ కల్మషచిత్తా! ౩౨

అర్థములు. పసి=వాసన, కలనన్ =యుద్ధమందు, కల్మషచిత్తా=పాపాత్ముఁడా.

తా త్ప ర్య ము.

పులుల వాసన తగిలినంత మాత్రమున నా ప్రాంతమందు నిలువక కుక్కలు పరుగెత్తునట్లు నీవు యుద్ధభూమియందు రామలక్ష్మణుల యెదుట నిలువఁ గలవా?

చ. అలవి యెఱుంగ నేరక మ ♦ హాత్ములతోఁ బగ గొంటి, నీవు దు
ర్బలుఁడవు వారలం జెనయ ♦ వచ్చునె నీ కనిఁ దోర్యుగోగ్రు నా
బలదనుజారి నొంటిచెయి♦వాఁ డగు వృత్రుఁడు పోరఁ దాఁకిన
ట్టుల విను నీవు ద్రుంగెదు ప♦టుప్రదరాహతి వారిఁ దాఁకినన్. ౩౩

అర్థములు. అలవి = శక్తి, తారతమ్యము, చెనయఁగా = ఎదిరింపఁగా, అనిన్ = యుద్ధమందు. దోర్యుగ+ఉగ్రున్ = రెండుచేతులు గల భయంకరుఁడు, బలదనుజారి=ఇంద్రుఁడు, పటుప్రదరాహతిన్ = దృఢము లైన బాణముల దెబ్బలచే.

తా త్ప ర్య ము.

నీ శక్తి యేమాత్రమో, రామలక్ష్మణుల శక్తి యే మాత్రమో యాలోచింపక వారితో విరోధించితివి. నీవు బలహీనుఁడవు. యుద్ధమందు వారి నెదిరింప లేవు. రెండు చేతులు గల యింద్రుని నొంటిచేతి వృత్రుఁ డెదిరించి చచ్చినట్టులు నీవు వారి నెదిరించితివా వారి బాణముల తాఁకునఁ జావఁగలవు. అంతియగాని, నీవు గెలువ లేవు.

చ. అనుజ సమేతుఁ డై యుటకు ♦ నాత్మవిభుం డరుదెంచి వేగ పే
ర్చిన కినుకన్ వధించు నిను ♦ గ్రీష్మవిభాకరుఁ డల్పతోయమున్
దనకిరణాళిఁ బీల్చు గతి ♦ దాఁగిన యక్షపపర్వతంబునన్
వననిధినాథుపీటను ధ్రు♦వంబుగ వృక్షముఁ బిక్కురీతిగన్. ౩౪

అర్థములు. పేర్చిన = అతిశయించిన, గ్రీష్మవిభాకరుఁడు = ఎండకాలము నాఁటి సూర్యుఁడు, అల్పతోయమున్ = కొంచెపునీటిని, యక్షప పర్వతంబునన్ = నీ యన్నయగు కుబేరుఁడు, నీకు వరములిచ్చిన శివుఁడు నుండు కైలాసమున, వననిధి నాథుపీటను = వరుణు నగరమున, సముద్రములో.

తా త్ప ర్య ము.

నా భర్త తమ్మునితో నిచ్చటికి శీఘ్రముగ వచ్చి మిగులఁ గోపముతో నెండ

కాలము సూర్యుఁడు చిన్నగుంతలోని నీళ్ళు తన కిరణములచేఁ బీల్చు విధమున నీవు కైలాస పర్వతము లోనగు నూర్ధ్వలోకంబుల నెత్తున డాఁగినను సముద్రములో వరుణుని పట్టనము లోనగు నధోలోకంబులందు డాఁగినను బిడుగు వృక్షమును బడఁ గొట్టునట్లు పడఁగొట్టును.

—• ౨౨-వ సర్గము రావణుఁడు సీతాదేవిని బెదరించుట. •—

క. అని పరుసంబుగఁ బల్కిన, వనజాయతనేత్రి సీత•వచనంబులు దా
విని పంక్తికంఠుఁ డనియెన్, వినరాని కఠోరవాక్య•విస్తర మొలయన్. ౫౫౯

అర్థములు. వాక్యవిస్తరము = మాటల యతిశయము.

తాత్పర్యము.

ఈరీతి సీతాదేవి కఠినముగఁ బలుకఁగా, నాతఁడు మాటలు విని వినరాని పరుషము లైన మాటలచే నిట్లనెను.

కం. ఎం తెంతగ బతిమాలునో, యంతంత వశుండు పురుషుఁ•డగు సతులకుఁ దా
నెం తెంత ప్రియము లాడునో, యంతం తవమాన మొందు•నతఁ డతివలచేన్.

అర్థములు. అంతంతవమానము=అంత యనునది సర్వనామ మైనపుడు కళ. కావున నంతంతవమాన మని సంధికూర్చుటయ్యెను. విశేష్య మైనపుడు ద్రుతప్రకృతికము. ఇచ్చట నంత యను దానికిఁ గొలఁది యని యర్థము. "నీ యోగవిభవ మింత యంత యని పొగడ నే నెంతదాన" కళా ౨.ఇట్టులే "ఇంతింతలై వటుఁ డింతయై". భాగ.

తాత్పర్యము.

పురుషుఁడు స్త్రీల నెంతెంత బతిమాలునో యంతంత వారికి వశుఁ డగును. ఎంతెంత ప్రియము లాడునో యంతంత వారిచే నవమానింపఁబడును. వీఁడు మనకు లోపడినాఁడు గదా యని యెంత యవమానమైనఁ జేయుదురు. అట్టులే నేను మంచి మాటలాడు కొలఁది నీవు నోరికి వచ్చిన ట్లెల్ల మాటలాడు చున్నదానవు.

క. కాపథములఁ జను హయముల, నేపున రథచోదకుండు•నిలిపెడి రీతిన్
నీ పలుకుల రేఁగిన నా, కోపము నార్చెడిని గామ•గుణ మో చెలువా! ౫౬౧

అర్థములు. కాపథములన్ = తప్పు త్రోవలను, రథచోదకుండు = సారథి.

తాత్పర్యము.

తప్పు త్రోవలఁ బోవు గుఱ్ఱములను సారథి బిగియఁ బట్టి నట్లు నీ పలుకులు వినుట వలనఁ గలిగిన కోపమును నీ యందు నాకుఁ గల కామ మనునది బిగఁబట్టు చున్నది.

చ. వెలదిరో! యాత్మకామమును•విఘ్న మొనర్చెడునట్టివారి దం
డ్యుల నొనరింప నెట్లు తగి•యుండియుఁ గామభరంబునన్ దయన్
జెలిమిని జూపుచుందు గద•చెల్వరొ! యట్టులె కల్లతాపసిన్
వలచెడి నీవు వధ్య వయి•నన్ బరిభావ్యవు నైన నోర్చితిన్.

అర్థములు. దండ్యులన్ = శిక్షకుఁ బాత్రులను, వధ్యవు = చంపఁబడఁ దగిన దానవు, పరిభావ్యవు = అవమానింపఁ దగినదానవు.

తా త్ప ర్య ము.

ఓసీ ! తన కోరికకు నెవ్వరు విఘ్నము కలిగింతురో వారు చంపఁబడఁ దగిన వారు. అట్లుండియుఁ గామాతిశయము చేతను, దయచేతను, స్నేహభావము చేతను దొంగ తపస్విని వలచు నీవు చంపఁబడుటకు నవమానింపఁ బడుటకుఁ దగిన దాన వైనను సహించితిని.

క. నీ వాడిన పరుషోక్తుల, కే వధ కీ వర్హురాల • విప్పుడ యని కో
పావేశభరంబున నా, దేవారివిభుండు పలుకు • దివిజస్తుతకున్. ౫౭౩

అర్థములు. దివిజస్తుతకున్ = దేవతలచే స్తోత్రము చేయఁబడిన దానికి, దీనిచే సీతమె యిచ్చిన ప్రత్యుత్తరముల కామెను రహస్యముగా వర్తించు దేవతలు స్తోత్రము చేసి రని భావము.

తా త్ప ర్య ము.

ఇప్పుడు నీవు చెప్పిన పరుసపు మాటలకు నీ విప్పుడే చావఁదగిన దానవు ! అని రావణుఁడు కోపముచే దేహము తెలియక దేవతలచే శ్లాఘింపఁబడు సీతాదేవి కిట్లనెను.

మ. వినవే జానకి ! యింక రెండు నెలలే • విశ్వాసపూర్వంబుగాఁ
గను నే వేచెద, నంతయే గడువు, నెం • క్కం జూడు మా లోపలన్
ఘనవేణీమణి! నాదు శయ్య పతివై • కాదేని రెన్నెల్లపై
నిను వంటింటను గోసి వండుదురు నిం • టే ప్రాతరాశార్థమై. ౫౭౪

అర్థములు. రెన్నెలలు. రెండు+నెలలు = కొన్ని యెడల నవర్ణకంబు పరం బగు నపుడు పూర్వపదాంత్య డకారంబు నకారం బగు (బా. వ్యా. సం. ౧౫ సూ.) ప్రాతః + ఆశార్థమై = ఉదయకాల భోజనము, ఇది దాక్షిణాత్యుల చల్లనీళ్ళ కూటిని సూచించెడి నేమో.

తా త్ప ర్య ము.

జానకీ! నిను నిదివఱకు నేను నీకుఁ బన్నెండు నెలలు గడు విచ్చి యుంటిని. అం దిక రెండు నెలలే కొఱఁత. ఆ రెండు నెలలు ముగియువఱకు నీ యందు విశ్వాస ముంచి కాచి యుండెదను. ఈలోపల నీవు నాభార్యగా నా పానుపెక్కక పోయితివా, ఆగడువు తీఱిన మఱునాఁడే నిన్ను నా వంటవారు నా యుదయకాలభోజనము లోనికి నంజుఁ డుగా వండుదురు. నాలవ పాదంబున ననునాసికాక్షరయతి.

క. అని యిట్లు రాక్షసేంద్రుఁడు, జనకతనూజాత నిగుల • సాధ్వసపఱుపన్
గని నిర్జరగంధర్వాం, గనలు తపించిరి వెతన్ వి • శాలేక్షణ లై. ౫౭౫

అర్థములు. సాధ్వసపఱుపన్ = భయపెట్టఁగా, విశారేక్షణలై = దుఃఖ భయములచే మార్పుచెందిన కన్నులు గలవారై.

తా త్ప ర్య ము.

ఈ విధముగ రావణుఁడు సీతాదేవిని భయపెట్టఁగాఁ జూచి యచ్చటనున్న దేవ గంధర్వస్త్రీలు భయదుఃఖములచే వికార మైన నేత్రములు గలవారై తపించిరి.

క. వెఱ పెట్టి కఱకు లాడెడు, కఱటిం గని సీత వగవఁ • గనుసన్నల వా
తెఱలన్ మోములఁ గొందఱు, తెఱగంటి నెలంత లామె • ధృతిఁ దేర్పంగన్.

అర్థములు. వెఱపెట్టి = భయపెట్టి, కఱకులు = పరుషపు మాటలు, కఱటిన్ = మూర్ఖుని, కనుసన్నల = కంటి సంజ్ఞలచేతను, వాతెఱలన్=పెదవుల చేతను, తెఱగంటి నెలంతలు = దేవతాస్త్రీలు, తెఱ + గన్నులు=తెఱచుకొని యుండు కన్నులు గలవారు. దేవతలకు ఱెప్పపాటు లేదు. అనిమేషులు.

తా త్ప ర్య ము.

ఈ విధముగఁ బరుషపు మాట లాడుచు మూర్ఖుఁడగు రావణుఁడు భయపెట్టు చుండఁగా దేవతాస్త్రీలు కనుగిఱుపులచేతను, పెదవి విఱుపులచేతను, మూతిత్రిప్పుల చేతను ఆమెకు ధైర్యము వచ్చునట్లు వానికి లోఁబడ వలదని సైఁగలు చేసిరి.

దీనివలనఁ గొందఱు వానికి వెఱచి లోఁబడి యున్నను వానిమీఁదఁ బ్రేమ లేనివారై యుండి రని యేర్పడుచున్నది.

—• సీతాదేవి రావణునిఁ బరుషంబులు పలుకుట. •—

తే. వారి సన్నల ధృతిఁ గూరి • వారిజాక్షి, నిబ్బరంబుగ వృత్తశౌం•డీర్యగర్వ
వశమునను నాత్మహిత మెంచి • భావవీథి, నిట్టు లను వానితో దిగు•లింత లేక.

అర్థములు. ధృతి = ధైర్యము, కూరి = పొంది, నిబ్బరంబుగన్=అధిక ముగ, నిర్భరశబ్ద భవము. వృత్తశౌండీర్యగర్వమునను—వృత్త = తన పాతివ్రత్యము యొక్క, శౌండీర్య = బలము వలనఁ గలిగిన, గర్వమునన్ = పొగరుచేత, "ఐశ్వర్య రూప తారుణ్య కుల విద్యా బలైరపి, ఇష్టలాభాది నాన్యేషా మవజ్ఞా గర్వ ఈరితః" ఐశ్వర్యము రూపము వయస్సు కులము విద్య బలము ఇష్టలాభము—వీనిచే నితరుల లక్ష్యము చేయకుండుటకు గర్వ మనిపేరు. ఇచ్చట గర్వమునకుఁ గారణము పాతి వ్రత్యము.

తా త్ప ర్య ము.

వారు చేసిన సైఁగల వలన నధికమైన ధైర్యముగలదై సీతాదేవి పాతివ్రత్య బలమువలనఁ గలిగిన గర్వముచే, "వీనికి దేహబల ముండిన నాకుఁ బాతివ్రత్య బలము గలదు. వీఁడు నన్నేమి చేయఁగలఁడు" అని తన మేలాలోచించి యిట్లనెను.

ఉ. నిక్కము రోరి దుష్టమతి! • నీదుశుభం బిటఁ గోరు వారు లే
రొక్కరుఁ, గల్గి రేని యిటు • లొప్పని కార్యము నీవు చేయఁగా
నొక్కి వచింప కుందురె ఘ•నుల్ సరికాదుర మాను మంచు, నీ
యొక్కనితోడఁ బోవ దిటు • లొప్పరికించుట వారు రావణా! ౩౭౪

అర్థములు. ఒప్పరికించుటన్ = ఉపేక్షించుటచేత, నిక్కముర + ఓరి = నీచమిత్రోద్దేశములందు ఉద్దేశ్యవాచకమునకు ఏకత్వంబున రకారం బంతాగమంబగు. దీనినే పూర్వులు మఱియొక విధముగఁ జెప్పిరి. "కవులు పొగడువేళఁ గాంతలు రతి వేళ, సుతులు ముద్దువేళ గౌరవరులు, రణము సేయువేళ రాకొట్టి పిలుచుట, పాడి యుడియు మిగుల భజన కెక్క." ఒప్పనికార్యము=లోకము శాస్త్రము నంగీకరింపని చెడుకార్యము, నొక్కి=ఒత్తి, గట్టిగా.

తాత్పర్యము.

ఓరీ! రావణా! నీ మేలు కోరువారీ యూర లేరు. ఇది నిజము. ఏలః నీవు దుష్టబుద్ధివి కావున నిజముగా నీ మేలు కోరువారొకరైన నుండిన నీ విట్లు చేయరాని పని చేయఁబూని నపుడు నీ కిది సరిగాదు, ఇట్లు చేయవల దని గట్టిగా నొత్తి చెప్పకుందురా? వారు చెప్పక నిన్ను నవరింపక యుపేక్షించుటచే నిది నీయొక్కనితోఁ బోదు. వారు చేసిన వాఁ డనుభవించు నని తలఁచిరేమో కాని యదిపొరపాటు.

ఉ. అల్లను నేను రామునకు • నా హరికిన్ శచివోలె నన్ను నో
బాలిశ నీవు దక్కఁగఁ బ్ర•పంచమునం దెవఁ డైనఁ గోరునా
బాలిని జిత్తమం దయినఁ, • బల్కితి వెన్నొ దురుక్తు లా యఘం
బేలర నిన్నుఁ బాయుఁ ? జని•తేనియు నెక్కడ కైనఁ ద్రెక్కనున్. ౩౭౫

అర్థములు. త్రెక్కనున్ = త్రుంగును—చెఱుచును.

తాత్పర్యము.

ఇంద్రునకు శచివలె నేను శ్రీరామచంద్రమూర్తి భార్యను. ఇట్టి నన్ను మూర్ఖుఁడా! నీవు తప్ప మఱి యెవఁడైన నీ వలెఁ బ్రపంచమున మనస్సునం దైన నన్నుఁ గోరునా? నీ వెన్నో చెడుమాట లాడితివి. ఆ పాపఫలము నిన్ను విడుచునని తలఁచితివా? నీ వెక్కడికిఁ బోయినను నిన్నుఁ జెఱుచును.

ఉ. మత్తమతంగజంబుఁ గోల • మాలిన నీచశశంబు దాఁకఁగా
నెత్తినయట్లు నాదు విభు • నీ వెదిరింపఁగఁ గోరు టెల్ల, నీ
జిత్తుల రాము దవ్వు చనఁ • జేసియు దొంగిలి తెచ్చి నన్ను నీ
చిత్తమునం దొకింతయును • సిగ్గు వహింప వ దెట్టి మానివో. ౩౭౬

అర్థములు. మత్తమతంగజంబు = మదపుటేనుఁగు; శశంబు = చెవుల పిల్లి, ఎత్తినయట్లు = ప్రయత్నించినట్లు, జిత్తులన్ = వంచనచే, మానివో = పౌరుషము గలవాఁడవో - కావనుట.

తాత్పర్యము.

మదపుటేనుఁగుతోఁ బనికిమాలిన యల్పమైన చెవులపిల్లి యుద్ధము చేయఁగాఁ బ్రయత్నించినట్లు నీవు నాభర్తతో నెదిరించి పోరాడఁదలఁచుచున్నావు. నీవు వంచనచే రామచంద్రమూర్తిని దూరముగాఁ బోవఁజేసి నన్ను దొంగిలించి తెచ్చియు నీ మనస్సు నందైన నీవు సిగ్గుపడవు. ఏమి పౌరుషము గలవాఁడవురా.

క. లవమాత్ర మేనియును నా, ధవుకంటం బడిన నీవు • తత్సమయమునన్
బవరంబున నా నృపులా, ఘవసత్త్వము లపుడె నీకుఁ • గనఁబడి యుండున్. ౫౮౧

అర్థములు. లవము = కొంచెము, బవరంబునన్ = యుద్ధమందు, లాఘవసత్త్వములు = చులుకఁదనము - బలము.

తాత్పర్యము.

నీవు నన్ను దొంగిలించి తెచ్చు సమయంబున నీవు కొంచెమైన నా మగనికిఁ గనఁబడి యుండినయెడల యుద్ధంబున బాణప్రయోగము నందలి యాయన చులుకఁదనము బలము తెలిసి యుందువు.

క. ఏలాగో ననుఁ దమిఁ గను నా, భీలవిరూపములుఁ గృష్ణ•పింగళములు నా
నీ లోచనములు రెండును, నేలం బడ వవిసి యిపుడ • నిష్ఠురశీలా. ౫౮౨

అర్థములు. తమిన్ = కోరికతో, ఆభీల = భయంకరములైన, విరూపములు = వికారములైన యాకారము గలవి, కృష్ణపింగళములు = నలుపు పసుపు గలిసిన కాంతి గలవి, నిష్ఠురశీలా=నిర్దయుమైన స్వభావము గలవాఁడా.

తాత్పర్యము.

కామముతో నన్నుఁ జూచు నలుపు పసుపు కలసిన వన్నెగల వికారములైన నీ రెండు గ్రుడ్లేల కూలిపోలేదో?

క. దశరథుకోడల నగుచున్, విశదయశుం డైన రామ•విభునకు సతినై
యశేషుం గనుఁ ననుఁ బల్కిన,దశవదనా నీదు నాల్క • దగఁ జీలదుగా. ౫౮౩

అర్థములు. విశదయశుఁడు = నిర్మలకీర్తిగలవాఁడు.

తాత్పర్యము.

దశరథు కోడలనై నిర్మలకీర్తి వహించిన రాముని ధర్మపత్నినైన నన్నుఁ బనికిమాలిన మాటలు పల్కిన నీ నాలుక యేల రెండుగాఁ జీలకున్నదో.

ఉ. నేన దశాస్య నిన్నిపుడ • నీఱుగఁ జేయనె? నాకువల్లభుం
డానతి యీఁడు నట్టిపని•కై, తపమెల్లను బొల్లుపోవఁగా
మానస మొప్ప కుండుటను • మానితిఁ గాక, హరింపఁ జాలుదే
దానవ నన్ను? నిన్నెడపు•తత్పరతన్ విధి యిట్లు చేసెడిన్. ౫౮౪

అర్థములు. నీఱుగన్ = భస్మముగ, ఆనతి = ఆజ్ఞ, పొల్లుపోవఁగా= వ్యర్థమై పోవుట, కెడపు = చంపు, విధి = దైవము.

తా త్ప ర్య ము.

కుక్కను గొట్టను బచ్చువకోల కావలయునా? యన్నట్లు నిన్నుఁ జంపుటకు రామచంద్రమూర్తి రావలయునా? నేనే నిన్ను భస్మముచేయలేనా? నీకంత శక్తి యుండిన నేల చేయరాదందువా? నేను గేవల పరతంత్రురాలను. నా రక్షణభారము నా భర్తపై నైచియున్న దానను. నన్ను రక్షించు భారము ఆయనయం దున్నది. ఇప్పుడు నేను స్వతంత్రించి నిన్నుఁ జంపితినా నా పారతంత్ర్యవ్రతమునకు హాని వచ్చును. నా ప్రాణము పోయినఁ బోనిమ్ము. కానీ, నా స్వరూపస్వభావమైన పారతంత్ర్యమును విడువఁజాలను. దానిని విడిచిన నాకు స్వరూపహానియే కలుగును, ఆయన యాపద లందు నిన్ను నీవు రక్షించుకొమ్మని దుష్టుని శపింపు మని యనుమతి యిచ్చినవాఁడు కాఁడు. నే నాయనసొమ్ము. ఆయన నా స్వామి. స్వామి గదా తన సొమ్మును దాను గాపాడుకొనవలెను. ఉండిన ననుభవించువాఁ డాయనయే. పోఁగొట్టుకొనిన నష్టపడువాఁ డాయనయే. ఆయన నిమిత్తమై నా యునికిగాని నా నిమిత్తమై కాదు. కావున నాయన యాజ్ఞ లేని కార్యము నేనెట్లు చేయుదును. అట్లు భర్తయాజ్ఞ లేని కార్యము నేను చేసితినేని నా పాతివ్రత్యమునకే హానివచ్చును. కావున నీ విపుడే భస్మము చేయఁబడుటకు యోగ్యుఁడవైనను నట్లు చేయక యూరకున్న దానను. అటుగాకున్న 'హతోభవ' యనినఁ జచ్చిపడవా? కావున నీవు నన్నేమిరా చేయఁ గలవు? నిన్నుఁ జెఱుచుటకు దైవమే నిన్నిట్టు లాడించు చున్నాఁడు. నీ యంతట నీవే చెడుటకు సిద్ధముగా నున్నప్పుడు నే నేల చెఱుపవలె? బెల్లము దిని చచ్చువానికి విషము పెట్టవలయునా?

క. శూరుఁడ వై వితతబలో, దారుఁడ వై మైలబిలుని • తమ్ముఁడ వై పెం
పారియు వంచనమెయిఁ బర, దారస్తేయంబు నీకుఁ • దగునే యనుడున్. ౨౨

తా త్ప ర్య ము.

రామచంద్రమూర్తి యంతటి శూరుఁడవు గాకపోయినను లోకమున శూరుఁడ వని పేరు తెచ్చుకొన్నవాఁడవు. విస్తారమైన గొప్ప బలము గలవాఁడవు. లోక నమస్కృతుఁడైన కుబేరుని తమ్ముఁడవు. కులముచే బలముచే నింతటి గొప్పవాఁడ వయ్యు మోసముచేసి పరస్త్రీని దొంగిలించి తెచ్చుట నీకు సరియా? అని చెప్పఁగా.

చెఱలో నుండు దేవతాస్త్రీలో, విభీషణు భార్యయో, కూతురో, రావణా సురుఁడు శాపభయమున నిన్నుఁ దాఁకఁడు భయపడవల దని రహస్యము దెలిపిరి. రావణుఁడు చంపఁబూనిన నీ శాప మడ్డుపడును. సీతాదేవికి వీఁడు నన్నుఁ జంపినా చంపనీ, నా పాతివ్రత్యమునకు హాని లేదు గదా, యని యామె ధైర్యము.

—• రావణుఁడు సీతాదేవిపై నాగ్రహపడుట •—

క. జానకి వచనంబులను ద, శాననుఁ డాలించి క్రూర • మగు నయనంబుల్
దా నట్టె విచ్చి త్రిప్పుచు, మానవతీమణిని గినుక • మండుచుఁ జూచెన్. ౨౩

సీతాదేవి మాటలకుఁ గోపించిన రావణుని యాకారము వర్ణింపఁబడుచున్నది.

తాత్పర్యము.

సీతాదేవి నయభయములు గలుగఁ జెప్పిన మాటలను విని రావణుఁడు క్రూరములగు కన్నులు పెద్దవిచేసి గ్రుడ్లు త్రిప్పుచుఁ గోపముచే మండిపడుచుఁ జూచెను.

ఇవన్నియు భర్తని చేష్ట లని తీర్థుల యభిప్రాయము.

సీ. కాలజీమూత సం•కాశు, డున్నత మహా, భుజశిరోధరుఁడును • భూరిసింహ
గతిసత్త్వుఁడును దీప్త•తత జిహ్వాకాగ్రలోచనుఁడు మాల్యానులే•పనుఁడుమఱియుఁ
జలితాగ్రమకుటుండు • స్వర్ణాంగదధరుండు, రక్త మాల్యాంబర•సక్తతనుఁడు
నవ్యసుధోత్పాద•నద్ధాహిమందర, మన నల్ల మొలత్రాట • నమరువాఁడు
తే. పర్వతమునకు నుద్దియై • పరఁగువాఁడు! పీనభుజయుగ్మమున శృంగ•విహిత మైన
మందరధరాధరమునకు•మాఱ్రివాఁడు. రావణుండు త్రిలోకవి•ద్రావణుండు. ౫౮౭

అర్థములు. కాలజీమూత సంకాశుఁడు = నల్లని మేఘముతో సమానుఁడు, జీవనము = నీళ్ళు, దీనియందు మూఁజ్ బంధింపఁబడును గావున జీమూతము = మేఘము, ఉన్నత = ఎత్తైన, మహా = గొప్పవగు, భుజ = భుజములు, శిరోధ రుఁడు = మెడగలవాఁడు, భూరిసింహ = పెద్ద సింహముయొక్క, గతి=గమనము, సత్త్వుఁడు = బలముగలవాఁడు, దీప్తతత జిహ్వాకాగ్రలోచనుఁడు = మండుచున్న పెద్ద నాలుక కొనయు కన్నులు గలవాఁడు మాల్యానులేపనుఁడు = మాల్యములు గందపుఁబూఁతయుఁ గలవాఁడు, చలితాగ్రమకుటుండు = కదలుచున్న కొనగల కిరీటము గ్లవాఁడు, కోపముచేఁ దల వణకించు చున్నాఁడని భావము. స్వర్ణాంగద ధరుండు = బంగారు భుజకీర్తులు గలవాఁడు, రక్తమాల్యాంబర సక్తతనుఁడు=ఎఱ్ఱని మాలికలతోను వస్త్రముతోను గూడిన దేహము గలవాఁడు, నవ్య = నూతనమైన, సుధా + ఉత్పాద = అమృతము కలిగించుటకై, నద్ధ = కవ్వపుఁ ద్రాడుగాఁ గట్టఁ బడిన, అహి = వాసుకి యనెడి సర్పము గల, మందరము=మందర మను పర్వతము, పీనభుజ యుగ్మమునన్ = బలసిన రెండు భుజములచే, శృంగవిహితమైన = శిఖర ములతోఁ గూడిన, మందరధరాధరమునకున్ = మందరపర్వతమునకు, మాఱ్రి వాఁడు = సమానమైనవాఁడు, త్రిలోకవిద్రావణుఁడు = మూఁడులోకములను బరు వెత్తునట్లు చేయువాఁడు.

తాత్పర్యము.

నీలమేఘముతో సమానుఁడును, ఎత్తైన భుజములు మెడ గలవాఁడును, పెద్ద సింహమువంటి గమనము బలము గలవాఁడును, మండుచున్న నాలుకకొన కన్నులు గలవాఁడును, పూలదండలు గందపుఁ బూఁతయు గలవాఁడును, కదలుచున్న కిరీటము కొన గలవాఁడును, బంగారు బాహుపురులు ధరించిన వాఁడును, మందర పర్వతము

నకుఁ జుట్టఁబడిన పామువలె నల్లని మొలత్రాడు ధరించిన వాఁడును, పర్వతముతో సమానమైన వాఁడును, బలిసిన రెండు భుజములచే శిఖరములతోఁ గూడిన మంద రమువలె నుండువాఁడును, మూఁడు లోకముల జనులను భయపడి పరువెత్తునట్లు చేయువాఁడును నగు రావణుండు.

తే. రక్తపల్లవవరపుష్ప • రాజిచేత, నతులితాశోకములచేత • నద్రివోలె
నవదివాకరవర్ణకుం • డలయుగంబు,కలిమిఁ దనరారు మునిమనః • కంటకుండు. ౨౮

అర్థములు. రక్త పల్లవ వరపుష్ప రాజిచేతన్ = ఎఱ్ఱని చిగుళ్లు, శ్రేష్ఠము లైన పూలు, వాని సమూహముచే, నవదివాకర = ఉదయకాల సూర్యుని, వర్ణ = వన్నెగల, కుండలయుగంబు కలిమి = రెండు చెవుల పోగులుండుటచే, తనరారు = ఒప్పుచున్న.

తా త్ప ర్య ము.

ఎఱ్ఱని చిగుళ్ళు పూలచేతను అశోకవృక్షములచేఁ గొండవలె బాల సూర్యుని వన్నెగల పోగులచేత నొప్పుచు మునుల మనస్సు సంకట పెట్టువాఁడు.

క. చందనలిప్త శరీరుఁడు, సుందరత వసంతుఁ డగుచు • సురుచిర భూషా
బృందయుతుం డయి మసనము, నందలి మండపమునా భ • యంకరుఁ డగుచున్.

అర్థములు. చందనలిప్త శరీరుఁడు = గంధముచేఁ బూయఁబడిన శరీరము గలవాఁడు, మసనము=శ్మశానము.

తా త్ప ర్య ము.

చందనముచేఁ బూయఁబడిన శరీరము గలవాఁడై, సౌందర్యమున వసంతుని వలె నుండి యందమైన సొమ్ములు ధరించినవాఁ డయ్యును శ్మశానమందలి మండ పమువలె భయము గలిగించువాఁడు.

క. రాఁజెడి కోపహుతాశను, చేఁ జక్షులు జాజవాతి • చెదురోపమునన్
రోఁజుచు నాశీవిష మనఁ, గాఁ జటులత సీతతోడ • దశముఖుఁ డనియెన్. ౩౦

అర్థములు. హుతాశనుఁడు = అగ్ని, జాజవాతి = ఎఱ్ఱనయి, ఆశీవిష ము = పాము.

తా త్ప ర్య ము.

రాఁజుచున్న కోపాగ్నివలనఁ గన్ను లెఱ్ఱనయి తీవ్రరోషముచే బుసగొట్టు పామువలెనై కోపముచే దేహము కంపింప సీతతో నిట్లనెను.

ఉ. ఓ గుణహీనురాల! నను • నొల్లక నీతివిహీను నిర్ధనున్
బా గని యాశ్రయించె దట • పంకజమిత్రుఁడు సంధ్యఁ ద్రుంచు నా
లాగున నిన్ను నిప్పుడ చ • లంబున రూపఱఁ జేయువాఁడ, నీ
యాగడ మెల్ల నా యెదుట • నా! నను రావణు నీ వెఱుంగవా. ౩౧

అర్థములు. గుణహీనురాల = మంచి గుణములేనిదానా!, నిర్ధనున్ = దరి

ద్రుని, చలంబునన్ = పట్టుదలతో, రూపఱన్ = రూపులేకుండ, ఆగడను = అకార్యము, అవగడము రూపాంతరము.

తా త్ప ర్య ము.

ఓసీ గుణహీనురాలా! నన్ను ధనవంతుని బలవంతుని శౌర్యవంతుని రూపవంతుని లోకములనెల్ల హా హా యనిపించువానిని నంగీకరింపక, నీతిలేనివాని ధనములేనివాని నా కంటె మేలని చేరెదవా! సూర్యుఁడు సంధ్యను హరించునట్లు పట్టు పట్టి నిన్ను నాశము చేయుదునుఁ జూడుము. నీ యాగడములు నా యెదుటనా చేసెదవు! నేను రావణుఁడ నని యెఱుఁగవా! సాయంసూర్యుఁడు సంధ్యను హరింపవలయు ననినఁ దాను ముందు హరణము కావలెను. అటులే నేను జచ్చినను జచ్చెదను, నిన్ను జంపెదనని భావము. నిన్నుఁ జంపఁబోయి నేనే చచ్చెదను.

సీ. అని పల్కి యచ్చటి • యసురకాంతల నేక కర్ణ నేకాక్షి గో • కర్ణి హస్త
కర్ణిని మఱి లంబ • కర్ణి నకర్ణిక, హస్తిపాది నపాది • నశ్వపాది
పాదచూళికను గో • పాదిని బృహుపాది, నేకపాదిని విపు • లైకనేత్రఁ
బెద్దతలలవారిఁ • బెద్దమెడలవారిఁ, బెద్దపొట్టలవారిఁ • బెద్దచనుల
తే. వారి నతిమాత్రనేత్రల • శ్వాశకేశ్య,జిహ్వికను నజిహ్వికను మఱి • సింహముఖిని
సూకరీముఖ గోముఖ • జూచియనియె, వినుఁడు నా యాజ్ఞ మీరలు • వనితలార.

తా త్ప ర్య ము.

సులభము.

ఉ. మీరలు గుంపు గూడుచు స • మేలపుమాటల రామపత్ని నీ
వారిజలోచనన్ వినయ • వాక్కులనో మఱి సామదాన భే
దేరలనో భయంబుననో • యే గతినేఁ బ్రతిలోమలోమగీ
ర్వారములన్ మదీయవశ • వర్తిని వైశమ చేయుఁ డెల్లరున్. శ్లో ౩

అర్థములు. సమేలపు మాటలన్ = ఒద్దికైన మాటలతో, అనుకూల వాక్యముల, సమ్మేళన శబ్దభవము సమేలము- భేదేరలనో, భేద + ఇరలు = భేద వాక్కులచేతనో, ప్రతిలోమలోమగీర్వారములన్ = ప్రతికూలములు అనుకూలములు నైన మాటలు- వైశమ = శీఘ్రముగ.

తా త్ప ర్య ము.

మీరందఱు గుంపుగఁ గూడి యనుకూలవాక్యములచేత నీ రాముని భార్యను కమలములవంటి కన్నులు గల దానిని, వణఁకువ మాటలచేఁగాని, సామ దానభేదవాక్కులచేఁ గాని, భయముచేఁ గాని యే విధముననైన సరియు, యనుకూల ప్రతికూల వాక్యముల నాకు వశపడునట్లు వేగముగఁ జేయుఁడు.

క. అని యావతి యిడి రాక్షస, వనితలకున్ మఱల మఱల • వైదేహిని దాఁ
గనుఁగొని గర్జనములఁ దర్జన మొనరుప నడ్డ మగుచు • రాక్షసపతికిన్. శ్లో ౪

అర్థములు. ఆనతి = ఆజ్ఞ సీ త్రిభవము = ఆజ్ఞ, గర్జనములన్ = పెద్దగ నఱచు టచే, తర్జన మొనరుపన్ = భయపెట్టగా.

తా త్ప ర్య ము.

ఈ ప్రకారము రాక్షసస్త్రీలకు నాజ్ఞ చేసి మఱల మఱల సీతను జూచి పెద్దగా నఱచుచు బెదరింపఁగా రావణునకు నడ్డమై.

—• ధాన్యమాలిని రావణున కడ్డము వచ్చుట •—

తే. ధాన్యమాలిని రాక్షస•తరుణి యతనిఁ
గౌఁగిటను గ్రుచ్చి యను ఱేఁడ! • తన్మ్రాజ యేల ?
యీ సకియమానవి వివర్ణ • యేమనన్ మ
హాకృపణ రమియింపు నా•యందు నీవు. ౩౯

అర్థములు. తన్మ్రాజ=సీత, భూమియందుఁ బుట్టిన చెట్టువలె మొద్దువంటిది. ఈ సకియ+మానవి=ఈ స్త్రీ మనుష్యజాతిది. గొప్ప రాక్షసకులమునఁ బుట్టిన నీకు ఈ తుచ్ఛజాతి మనుష్య స్త్రీ యేల ? (౨) ఈసకి+అమానవి=ఈమె మనుష్య స్త్రీ యని తలంచు చున్నావు. కాదు సుమా. వివర్ణ=కాంతిలేనిది, (౨) నీ యోగ్యతకు మించినది, విశేషవర్ణ. మహా+కృపణ=మిగుల నీచురాలు (౨) మహా+అకృపణ= మిగుల్ల పతివ్రత. ఈమె కోపించిన నీవు నాశమగుదువు, అని భావము.

తా త్ప ర్య ము.

ధాన్యమాలిని యనెడి రాక్షస స్త్రీ రావణుని కనిష్ఠభార్య, యతని కడ్డము వచ్చి కౌఁగిలించుకొని రాజా ! యీ సీత యేల నీకు ? ఇది తుచ్ఛ మనుష్య స్త్రీ, కాంతి లేనిది, మహా నిర్భాగ్య, ఇట్టిది నీ కేల ? నాతో రమింపుము అనెను.

ఇట్లడ్డమువచ్చిన స్త్రీని వెనుక హనుమంతుఁడు అంగదాదులతోఁ జెప్పు నప్పుడు మండోదరి యని చెప్పెను. రూపసామ్యముచేతనే భ్రమించెనో, సుప్రసిద్ధు రాలగు మండోదరి పేరు తెలిసియుండి దీనిపేరు తెలియమిచేతనో లేక యిరువురు నడ్డమురాఁగా నొకరి పేరిచ్చుట నొకరి పే రచ్చుట వాల్మీకి చెప్పెనో! ఇచ్చటఁ జెప్పినవాఁడు వాల్మీకి. అచ్చటఁ జెప్పినవాఁడు హనుమంతుఁడు. ఈ ధాన్యమాలిని కొడుకే అతికాయుఁ డను వాఁడు. వాఁడుగూడ రామునకు సీత నిమ్మని రావణునకుఁ జెప్పినవాఁడే కావున తల్లి కొడుకు లిరువురు సుగుణసంపత్తి గలవారని యేర్పడు చున్నది. కావుననే రావణునకు నడ్డమువచ్చెను. మహాపతివ్రత సీత కటాలున శపించిన రావణుఁడు చచ్చునే, తనకు వైధవ్యము వచ్చునే యని యడ్డమువచ్చి యుండవచ్చును.

రంగనాథ రామాయణమునందు లక్ష్మణమూర్ఛనాఁడు హనుమంతుఁడు సంజీవనికిఁ బోవునపుడు ముసలిగా నున్న దీనికి శాపమోక్షణము గావించెననియు దీని

కొడుకు అతికాయుఁ డనియు నున్నది. అచ్చటఁ జెప్పఁబడినది దేవతాస్త్రీ.

"నా పాట విని దశాననుఁ డేగుదెంచి

* * *

వనిత నన్ గారింప వలదు ర మ్మనుచు
ననుఁ బ్రియోక్తులఁ దేల్చి నాతో రమింప
నతికాయుఁ డుదయించె నంత నా పుత్రు
నతివేగమున దానవాగ్రణి కిచ్చి."

యని యున్నది. దీని వలననే కాలనేమి కథ మతిహీనునిచేఁ గల్పిత మని స్పష్ట పడు చున్నది. వాల్మీకి చెప్పిన ప్రకార మిచ్చట సీతకు రావణున కడ్డము వచ్చుట నిజమా? ఈ కాలమందే యెందెందో మడుఁగులో మొసలియై యుండుట నిజమా? ఇది రాక్షసస్త్రీ, అది దేవతాస్త్రీ. అతికాయుఁడు దీనికొడుకా? దానికొడుకా? అతికాయుఁడు రాక్షసుఁ డనియే యుద్ధకాండమందు ౭౧వ సర్గమందుఁ గలదు. ఈ కారణముచేఁ గాలనేమికథ కల్పిత కథయే. పూర్వపీఠిక చూచునది. ఇప్పు డడ్డము వచ్చినవారు మండోదరీ ధాన్యమాలినులు మాత్రమే కారు. అక్కడ నున్న మతి కొంద ఱాఁడువాండ్రు నడ్డము వచ్చినట్లు హనుమంతుఁ డంగదాదులతో "ర మ్మంచు వారెల్లఁ గోపంబుఁ జల్లార్చి యా రాక్షసుం దోడుకొంచేగి" రను వాక్యములచేఁ దెలియ నగు. (చూ. దండకము. ౧౩౧౭.)

క. నిక్క మిది బ్రహ్మదేవుం, డిక్కమలాక్షికిని నొసటి • మెడ వ్రాయఁడు నీ
దిక్కులను గెలిచి తెచ్చిన, యక్కజపుం ధనము లెల్ల • ననుభోగింపన్. శ్లో౬

అర్థములు. ఇది = నే నిపుడు చెప్పఁబోవునది.

తాత్పర్యము.

నేను జెప్పునది నిజము. నీవు దిక్కుదిక్కుల గెల్చి తెచ్చిన యాశ్చర్యకరములైన ధనముల నెల్ల ననుభవించుటకు బ్రహ్మదేవుఁడు దీని ముఖమున వ్రాయ లేదు. ఇది యేమి చేయఁగలదు? నీ వేమి చేయఁగలవు?

క. కామంబు లేని కామినిఁ, గామించినఁ యంతఁ బురుషు • కాయంబు చెడున్
గామించు చున్న కామినిఁ, గామించిన బరమసుఖము • గలుగును నాథా! శ్లో౭

తాత్పర్యము.

కామములేని స్త్రీని గామించి, భోగించెనేని యట్టి పురుషుని దేహారోగ్యము చెడును. తనయందుఁ గామము కలిగి భోగింపవలయు నని కోరిక గల సమయంబున భోగించు పురుషునికి మిగుల సుఖము గలదు. కావున నీ మగతనము కోలంది నాతో రమింప రమ్ము.

ఇది వారివారి భార్యలతో సంగమించునపుడును సత్యము. ఇరువురకుఁ గామము కలిగిన సమయంబున భోగించిననే యిరువురకు సుఖము ఆరోగ్యము కలవుగాని

కామోద్రేక మున్నను లేకున్నను నిత్యశ్రాద్ధముగాఁ జేయు వారికి సుఖారోగ్యములు లేవు. సత్సంతానము లేదు.

క. అని చెప్పుచు నా రక్కసి, దనుజేశ్వరుని న్మరల్ప • దశవదనుఁడు దాఁ
జని నవ్వికొనుచుఁజొచ్చెను, దనమందిరమున్ సువర్ణ•ధామోజ్జ్వలమున్. ౫౯౯

తా త్ప ర్య ము.

అని చెప్పుచు నా రాక్షసి రావణుని మరలించుకొని పోఁగా రావణుఁడు దాని మాటలకు నవ్వికొనుచు బంగారుమయమై ప్రకాశించు తన గృహములోనికిఁ బోయెను.

తే. దేవగంధర్వపన్నగ•దేవతారి, కన్యకలు చుట్టుఁ గొలువంగఁ • గదలి పోయె
నట్లు సీతను దర్జించి • యనుచితగతిఁ, బంక్తివదనుండు మదనసం•భ్రాంతుఁడగుచు.

తా త్ప ర్య ము.

దేవగంధర్వస్త్రీలు, నాగస్త్రీలు, రాక్షసస్త్రీలు తన్నుఁ జుట్టుకొని సేవింపఁగా నిల్లు సీతను ననుచితమగు రీతి బెదరించి మదనునిచే తొట్రుపాటు పడువాఁడై వెడలి పోయెను.

—• ౨౩-వ సర్గము. రాక్షసస్త్రీలు సీతాదేవికి బోధించుట •—

క. అనలి యిడి యరిగిన నద్దానవపతు లంతఁ గ్రోధ•తామ్రాక్షుల నా
జానకిని డాసి పలికిరి, నానావిధపరుషభాష•ణంబుల నిట్టుల్. ౬౦౦

తా త్ప ర్య ము.

రావణుఁ డిట్టు లాజ్ఞ చేసి పోఁగా నా రాక్షసస్త్రీలు క్రోధముచే నెఱ్ఱ నైన కన్నులతో నా సీతను సమీపించి యనేకవిధము లైన కఠినపు మాట లిట్లనిరి.

క. బేలా! రావణుఁ బతిఁగా, నేలా కైకొనవు? వాని • నేమిగఁ గని తా
పౌలస్త్యుని దశకంఠునిఁ, ద్రైలోక్యవరిష్ఠు నిహత•దర్పితవైరిన్ ! ౬౦౧

అర్థములు. పౌలస్త్యుని = బ్రహ్మపుత్రుఁ డగు పులస్త్య మహర్షి వంశమున బుట్టినవానిని, గోత్రార్థక తద్ధితము, దశకంఠుని = పదితలలు గలవానిని, త్రైలోక్య వరిష్ఠున్ = మూఁడు లోకములందు శ్రేష్ఠుఁడగువానిని, నిహత దర్పితవైరిన్ = గర్వించిన శత్రువులఁ జంపినవానిని.

తా త్ప ర్య ము.

ఓసి! తెలివి లేనిదానా! ఏల నీవు రావణుని భర్తగా గ్రహింపకున్నదానవే. రావణుఁ డనఁగా నే మనుకొంటివే. కులము తక్కువయా యనిన, బ్రహ్మకుమారుఁ డగు పులస్త్యమహాముని వంశమునఁ బుట్టినవాఁడు. లోకములో నందఱకొక్క తల యయిన, పది తలలు గలవాఁడు, ప్రతిష్ఠయుఁ దక్కువా యనిన, మూఁడు లోకము లందు నీనిని మించినవాఁడు లేఁడు. బలహీనుఁడా యనిన, గర్వించిన శత్రువుల

నందఱ జయించినవాఁడు. మఱి దిట్టివాఁడు గాకున్న నీకే నెట్టివాఁడుగా నుండ వలయునే.

సీ. అంతట నేకజ•టాఖ్య యి ట్లను సీత!, రావణుం డనఁగ నీ•భావమునను
గొలఁదిగాఁ జూచెదే! • యల్లప్రజాపతు లార్వు, రందుఁ జతుర్థుఁ డ•బ్జాసనునకు
మానసపుత్రుండు • మహితయశస్వి పులస్త్యుండు వాని త•లంపునందుఁ
గలిగెవిశ్రవుఁ డను•కంజజతుల్యుండు, వాని పుత్రుఁడు గదే • వారిజాక్షి !
తే. రావణుం డభియాతివి•రావణుండు
తాన బతిమాలుకొన నీకుఁ • దగునె బిగువు ?
మక్కువ మొనర్చుకొలఁదిని • నిక్కపడెదు
నమ్మవా నాదుమాట నో • యెమ్మెలాఁడి ! ౬౦౨

అర్థములు. కొలఁదిగా = అల్పునిగా, ఆర్వురు ప్రజాపతులు = మరీచి, అత్రి, అంగిరుఁడు, పులస్త్యుడు, పులహుఁడు, క్రతువు అనువారు ప్రజాపతులు. వీరిలో నాలవవాఁడు పులస్త్యుఁడు. మానసపుత్రుఁడు = సంకల్పభవుఁడు, కంజజతుల్యుండు= బ్రహ్మతో సమానుఁడు, అభియాతి విరావణుండు = శత్రువుల నేడ్పించువాఁడు. ఎమ్మెలాఁడి = విలాసము గలదానా !

తాత్పర్యము.

అంతట నేకజట యను రాక్షసి యిట్లనెను. సీతా! రావణుని నీ మనస్సునం దల్పునిఁగా నెంచుచున్నావు. వాని పుట్టువు నీకుఁ దెలియదు. వినుము. ఆర్వురు ప్రజాపతులలో నాలవవాఁడగు పులస్త్యుఁడు; ఈయన బ్రహ్మకు మానసపుత్రుఁడు. ఆయన సంకల్పమునఁ గలిగినవాఁడు విశ్రవుఁడు. వాని కొడుకు రావణుఁడు. ఇఁక బలమునందా, శత్రువుల నేడిపించువాఁడు. ఇట్టి గొప్పవాఁడు తానై వచ్చి నిన్నుఁ బ్రార్థింపఁగా నీ కేల యీ బిగువు. వాఁడు మక్కువ చూపుకొలఁది నీవు నిక్కి నిక్కి పడెదవే, నా మాట నీవు నమ్మవా !

సీ. అవల హరిజట • యను పెనురక్కసి, తన పిల్లి కన్నులు • దర్ద విచ్చి
గిరగిర మని త్రిప్పి • కినుక మై నిట్లను, ముప్పదిగోటులు • మూఁడుకోట్లు
నిర్జరులను గెల్చె • నిర్జరనాథునిఁ, జెఱఁబెట్టె నట్టి పె•న్జెట్టి నీకుఁ
దగినవరుం డగు • మగువ ! వరింపుము, పం క్తికంఠుని ననఁ • బ్రఘస యనియెఁ
తే. క్రోధమూర్ఛిత యగుచును • ఘోరఘణిశిఁ
దనదు ప్రియభార్య రూపసి • ధన్యురాలి
విడిచి నినుఁ గోరు శూరుని • వీరవరుని
బలియు పతి వొట కింత ని•ర్బంధ మేల ? ౬౦౩

తాత్పర్యము.

అవల హరిజట యను రాక్షసి తన పిల్లికన్నులు బాగుగఁ దెఱచి గ్రుడ్లుగిరగిర

త్రిప్పుచు నిట్లనెను. ముప్పది మూఁడుకోటుల దేవతలను జయించెను, ఇంద్రుని చెర పట్టెను, అటివంటి జగజెట్టి నీకుఁ దగిన మగఁడే కావున వానిని వరింపుము. అనిన ప్రఘస యనునది క్రోధముచే దేహము తెలియక కఠిన వాక్యముల నిట్లనెను. తన ప్రియురాలి, సుందరిని, పుణ్యాత్మురాలిని విడిచి నిన్నుఁగోరు వానిని,శూరుని; పరాక్రమవంతుని, బలవంతుని భార్య యగుటకు నీవై పైపడి పోవలసి యుండఁగా నిన్నింత నిర్బంధ పఱుపవలెనా ?

క. కాంతాసహస్రకలితని, తాంతవిభాబహుళమణి వి•తానాంచిత మా
  నంతఃపురమును బో నిడి, కాంతా ! నీ తోడఁ గూడఁ•గలఁ డాతండున్. ౧౦౪

అర్థములు. కాంతా సహస్రకలిత = అనేక స్త్రీలతోఁగూడినది, నితాంత విభా = అధిక కాంతి గల, బహుళమణి వితానాంచితము=అనేకవిధము లగు రత్న సమూహములచేఁ బ్రకాశించునది.

తా త్ప ర్య ము.

అంద గాఁడు వారక్కడ నున్నారే, వారు చూచుచుండ నెట్లు వానితో సంభోగించెద నందువా, అనేక స్త్రీలతోఁగూడినదియు, అనేక రత్నకాంతులు గలదియు నగు నంతఃపురమును విడిచి యొంటిగ రమ్మనిన నిచ్చటకే వచ్చును. పోయి పిలుచుకొని వత్తునా ?

సీ. వికట యి ట్లనియెను • నికటంబునను జేరి, యమరులతో యుద్ధ • మాడువేళ
  నెన్ని మాఱులో గెల్చె • హేలమై నాగగంధర్వయక్షోరగ•దానవులను
  నట్టి మహాత్ముండు • పెట్టి నీపై మతి, యాసింప నిర్భాగ్య•రాల యేల
  యతని యిల్లాల వై•హర్షింప నొల్లవు ! నాఁగ దుర్ముఖి యెల•నాఁగ కనియె

ఆ. నెవనిఁ దలఁచి సూర్యుఁ • డెండలుగాయండు, వెఱచు గాలి వీవ • వృక్షతతులు
  పూలవాన రాల్చు • బోలుపుగా మబ్బులు, పరమభీతిఁ గురియు • వలయునపుడు.

అర్థములు. నికటము = సమీపము, హేలమై = విలాసముగా.

తా త్ప ర్య ము.

వికట యనునది చనువుగ దగ్గఱఁజేరి కూర్చుండి యిట్లనెను. సీతమ్మా! రావణుఁడు యుద్ధములు చేయుచుండిన సమయమందు నాఁటవలె నవలీలగా నాగులను, గంధర్వులను, యక్షులను, పన్నగులను, దానవులను నెన్నిమాఱులో గెల్చినాఁడే, అంతటి మహాత్ముఁడు మనస్సంతయు నీ మీఁదఁ బెట్టినాఁడే పిల్లా! నీ వెంత నిర్భాగ్యురాలవే, అట్టివాఁడెంతో యాశపడిరాఁగా వాని యిల్లాలవై సంతోషింపకున్న దానవు. అనఁగా దుర్ముఖి యిట్లనియె. ఓసీ! యతని పేరనిన సూర్యుఁడు లంకపై నెండగాయ భయపడును. గాలి విసర భయపడును. చెట్లు భయపడి వాఁడు తమ క్రిందికివచ్చినపుడు పూలవాన కురియించును. వాఁడు కోరినపుడు మేఘములు వర్షించును.

ఆ. అట్టి రాజరాజు•నమరారిఁ బతిఁగాఁగఁ, గొనుము నాదుమాట•వినుము శుభముఁ
గనుము సౌఖ్యముగను•మనుము మా రావణు,జాయ వగుట కింతె•సందియంబ ?

తా త్ప ర్య ము.

అటువంటి మహిమ గలవాఁడు, రాజుల కెల్ల రాజగువాఁడు, దేవతలకు విరోధి యగువాఁడు, రావణుఁడు. వాని భర్తగాఁ జేసికొని, నా మాట విని, సుఖముగాఁ బ్రదుకుము. మా రావణు భార్య వగుట కింత సందేహ మటే.

—• ౨౪-వ సర్గము. రాక్షసస్త్రీలు సీతాదేవిని బెదరించుట. •—

సీ. మఱియు నందఱుఁ జేరి • మైథిలిఁ గనుగొని, తర్జించి రిటు క్రూర•గర్జనముల
నది యేల యొల్లవే • యఖిలభూతమనోహ,రం బైన శుద్ధాంత•రంగసీమఁ
బఱుపులమీఁదను • బన్నుండ? నో చెలి! మానుషి వగుటను • మనుజవరుని
నిల్లాల వగుటయే • హెచ్చుగఁ జూచెద, విఁక నేటి రాముఁడే? • యేల యతని
తే. మీఁద మన సుంచి యిడికెదు?•మెలఁత!యింకఁ,గల్ల నీ వెటు రామునిఁ•గనుటగాన
రాక్షసేశ్వరుఁ డైనట్టి•రావణుండు, నీకుఁ దగువాఁడు భర్తగా • నెమ్మిఁగొనుము.

అర్థములు. తర్జించిరి = భయపెట్టిరి, శుద్ధాంతరంగసీమన్ = అంతఃపుర ప్రదేశమున.

తా త్ప ర్య ము.

ఇట్లు నయవాక్యములు వ్యర్థములగుటఁ జూచి భయ వాక్యముల నా రాక్షసు లంద ఱొక్కటిగఁ జేరి యిట్లు క్రూరనాదములు చేయుచు బెదరించిరి. సీతా! ఎట్టివారి మనస్సైన హరింపఁజాలు నంతఃపురమందు పఱుపులమీఁదను బండుకొను టకు నీ కేమి నొప్పిరయా? ఏల పండుకొన ననెదవు. నీవు మనుష్యస్త్రీ వగుటచేత మనుష్యుని కిల్లాలగుటయే గొప్పగాఁ జూచుచున్నావు. ఇఁ కెక్కడి రాముఁడు ? రాముఁడెక్కడ ? నీ వెక్కడ. వానిమీఁద మనస్సుంచి యేల యేడిచెదవు! రాముని నీ విఁకఁ జూచుట యసత్యము. కాబట్టి రాక్షసరాజు రావణుఁడు నీకుఁ దగిన భర్త. వానిని గ్రహింపుము.

ఉ. మానుషి వౌట రాముఁ గొఱ•గాలిన మానుషు రాజ్యహీనునిన్
దీను దరిద్రు దుర్బలుని • దేవి! మనోహరుఁగా దలంచె, దీ
మానవభోక్త లోకచయ•మానితసర్వపదార్థ భోక్త యౌ
దానవభర్త భర్తగ య•థాసుఖముం జరియింప రాదటే ! ౬౦౮

అర్థములు. లోకచయమానిత = జనసమూహముచే గౌరవింపఁబడిన, సర్వపదార్థ భోక్త = అన్నివస్తువుల ననుభవించువాఁడు.

తా త్ప ర్య ము.

నీవు మనుష్య స్త్రీ వగుట పనికిమాలిన మనుష్యుని రాజ్యములేనివానిని ఏడ్చుచుండువానిని దరిద్రుని బలహీనుని భర్తగాఁ దలంచెదవు. ఈ రావణుఁడో

మనుష్యులఁ దినువాఁడు. తను లేదే పదార్థములు గొప్పవని గౌరవించెదరో వాని నెల్ల ననుభవించువాఁడు. రాక్షసరాజు. ఇటువంటివానిని మగనిఁగాఁ జేసికొని యథేచ్ఛముగా సుఖంపరాదా !

క. అనుచును దను వసురాంగన, లన విని కనుఁగవలఁ గాఱు • నశ్రులు కొనగో
టను మీటుచు జలజేక్షణ, యను నా రాకాసిమూఁక • నల్లనఁ గనుచున్. ౬౦౯

తా త్ప ర్య ము.

తన్నిప్రకారము పరుషముగ మాటలాడు చున్న రాక్షస స్త్రీలను గాఱుచున్న కన్నీళ్ళను గొనగోట మీటుచు సీతాదేవి యా రాకాసి మూఁకకు మెల్లగా నిట్లనెను.

—• సీతాదేవి రాక్షసస్త్రీలకుఁ దనమనోనిశ్చయముఁ దెలుపుట. •—

ఉ. రాక్షసకాంతలార! వినఁ • రా! తను లెవ్వరు మెచ్చ రీనుడుల్
రూక్షతరాఘకారణము • లుం జాఁడి మీ కివి, మర్త్యకాంతయున్
రాక్షసు నాలుఁ గాఁగలదె? • భక్షణ సేయుఁ డీ చెనఁటి • పల్కులు నా చెవిఁ గ్రుచ్చ కుండుఁడీ. ౬౧౦

అర్థములు. రూక్షతర = మిక్కిలి తీక్ష్ణములైన, అఘకారణములు = పాపమును గలిగించునవి.

తా త్ప ర్య ము.

రాక్షసస్త్రీలారా ! నామాట చెవిలోఁ బడనీయరా ? మీరు చెప్పునట్టి మాటలు లోకము మెచ్చునవికావు. అంతేకాదు. మీరు మహాఘోరపాపమును గలిగించునవి. ఎందైన మనుష్యస్త్రీ రాక్షసుని భార్యకాఁగలదా? మీకిటుసేయ నిష్టమేని నన్నుఁ జంపి తినుఁడు. ఈ దుష్టవాక్యములు పలుకుట చాలింపుఁడు.

క. దీనుండో వర రాజ్యవిహీనుండో యెవ్వఁ డైన • హృదయేశ్వరుఁడే
మానితుఁ డగు నా కెప్పుడు, భానుండు సువర్చల కగు • పగిదిం జగతిన్. ౬౧౧

తా త్ప ర్య ము.

దరిద్రుఁడో రాజ్యహీనుఁడో మఱి యెట్టి వాఁడైనను సువర్చలకు సూర్యునివలె నా మగఁడే నాకు గొప్ప,

సూర్యుఁడు తనఁ వేఁడిమిచే మిగులఁ దపింపఁ జేయుచున్నను సువర్చల యతనిని విడిచిపోయినదా ? విష్ణు పురాణము. ౧-౮

"కల్పాదా వాత్మనస్తుల్యం సుతం ప్రధ్యాయత స్తతః
ప్రాదురాసీ త్ప్రభో రంకే కుమారో నీలలోహితః
రురోద సుస్వరం సో౽థ ప్రాద్రవ ద్ద్విజసత్తమ !
కిం రోదిషీతి తం బ్రహ్మ రుదంతం ప్రత్యువాచ వై
నామ దేహీతి తం సో౽థ ప్రత్యువాచ ప్రజాపతిః

రుద్ర స్త్వం దేవనామ్నాసి మారోదీ ర్ధైర్య మావహ
ఏవ ముక్తః పునస్సోఽథ సప్తకృత్వో రురోదహ
తతోన్యాని దదౌ తస్మై సప్తనామాని వై ప్రభుః
స్థానానిచైవ మష్టానాం పత్నీః పుత్రాంశ్చవై ప్రభుః
భవం శర్వ మథేశానం తథా పశుపతిం ద్విజ!
భీమ ముగ్రం మహాదేవ మువాచ స పితామహః
చక్రే నామాన్యథై తాని స్థానాన్యేషాం చకార సః
సూర్యో జలం మహీవాయు ర్వహ్ని రాకాశ మేవచ
దీక్షితో బ్రహ్మణ స్సోమ ఇత్యేతా స్తనవః క్రమాత్
సువర్చలా తథైవోషా సుకేశీ చాపరా శివా
స్వాహా దిశా తథా దీక్షా రోహిణీచ యథాక్రమమ్.

కల్పాదియందు బ్రహ్మకుఁ గొడుకు పుట్టి యేడ్చెను. ఏల యేడ్చెద వనఁగా, నా పేరేమి చెప్పుమనెను. బ్రహ్మ నీవు రుద్రుఁడవనెను. మఱల నేడుగా నై యేడ్చెను. అప్పుడు భవ - శర్వ - ఈశాన - పశుపతి - భీమ - ఉగ్ర - మహాదేవ యని వారికిఁ బేర్లు పెట్టెను. ఆ యెనమండ్రను సూర్య - జల - మహీ - వాయు-వహ్ని - ఆకాశ - దీక్షిత బ్రాహ్మణ - సోమ - దేహము లిచ్చి సువర్చల - ఉష - సుకేశి - శివ - స్వాహా - దిశ - దీక్ష - రోహిణి యను నెనమండ్ర భార్యల నిచ్చెను. ఇందుఁ జెప్పఁబడిన సువర్చల యీమెయే.

ఈ సందర్భమున నీ శాస్త్రవాక్యములు స్మరణీయములు:

వ్యాసః. కురూపోవా కువృత్తోవా దుస్స్వభావోఽథవా పతిః
రోగాన్వితః పిశాచోవా మద్యపః క్రోధనోపివా
వృద్ధోవాథ విదగ్ధోవా మూకోంధో బధిరోపివా
రౌద్రోవాఽథ దరిద్రోవా కదర్యః కుత్సితోపివా
కాతరః కితవో వాపి లలనా లంపటోపివా
సతతం దేవవత్పూజ్యో సాధ్వ్యా వాక్కాయకర్మభిః
అహంకారం విహాయాథ కామక్రోధౌచ సర్వదా
మనసో రంజనం పత్యుః కార్య మన్యస్య వర్జనమ్.

కురూపుఁడైనను, దుర్వృత్తి మం దున్నవాఁడైనను, చెడుస్వభావము గలవాఁడైనను, రోగియైనను, పిశాచము పట్టినవాఁడైనను, మద్యముఁ ద్రాగువాఁడైనను, క్రోధగుణము గలవాఁ డయినను, ముసలి వాఁడైనను, వంచకుఁడైనను, మూఁగవాఁడు గ్రుడ్డివాఁడు చెవిటి వాఁడైనను, క్రూరుఁడైనను, దరిద్రుఁడైనను, లోభియైనను, కుత్సితుఁడైనను, పిఱికివాఁడయినను, జూదరియైనను. అన్యస్త్రీకాముకుఁ డైనను, పతిని పతివ్రత

యగు స్త్రీ సర్వదా దేవునివలెఁ ద్రికరణములఁ బూజింపవలెను. అతని విషయమున అహంకారము దుష్కామము క్రోధము వదలవలయును. అతని మనస్సు సంతోషపెట్ట వలెను. అతఁడు సంతోషింపని తక్కిన కార్యము లన్నియు వదల వలయును.

సీ. బలసూదనునకుఁ • బౌలోమి యట్టులు, దమి వసిష్ఠున కరుం•ధతిని బోలి
నీహారకరునకు • రోహిణిరీతిని, చ్యవనర్షి కి సుకన్య•చందమునను
సత్యవంతునకును • సావిత్రిమాడ్కిని, తీరిఁ గపిలునకు శ్రీ•మతివిధమునఁ
బ్రథ నగస్త్యునకు లో•పాము ద్రచాడ్పున, సగరునకును గేశి•నిగతిగాఁగ
తే. నల్లసౌదాసునకు మద•యంతికరణి, నలునకును దమయంతియుం•దంబు వెలయ
రఘుకులాధీశ్వరుం డైన • రామచంద్ర,విభునకే నాతని భజించి • వెలయుదాన.

తా త్ప ర్య ము.

పాతివ్రత్య మనునది తన కల్పితము గాదనియు సాధ్వాచారపరాయణ లైన యుత్తమ స్త్రీలందఱు దాని ననుష్ఠించి యున్నా రనియుఁ బూర్వపతివ్రతల నుదాహరించుచున్నది.

బలనిషూదనునకు = ఇంద్రునకు, పౌలోమి = శచీదేవి, నీహారకరునకు = చంద్రునికి, చ్యవనర్షికి = చ్యవనుఁ డను మహాఋషికి, సుకన్య, శర్యాతి యను రాజు కూఁతురు. చ్యవనుఁడు గ్రుడ్డివాఁడై నను ఆయన కిచ్చి తండ్రి వివాహము చేయఁగా నాయనను సేవించుచుండెను. చంద్రునకు రోహిణి యనుటచే చంద్రునకుఁ బెక్కురు భార్య లున్నను, చలిచేత వణకించుచున్నను రోహిణి యొక గడియనైనను నాయనను విడిచియుండదు. సత్యవంతుఁడు సంవత్సరమునకుఁ జచ్చు నని తెలిసియు సావిత్రి యాయనను వరించి చచ్చిన వానిని బ్రదికించుకొనెను. కపిలునకు=కపిల మహర్షికి - ఈయన యోగమందు సర్వదా యుండినను శ్రీమతి యాయనను విడిచినది కాదు. అగస్త్యుఁడు మహర్షి, దరిద్రుఁడు, లోపాముద్ర రాజకూఁతురు. అట్లుండియు నాయనను విడువక సేవించెను. సౌదాసునకున్ = ఈయనకుఁ గల్మాషపాదుఁ డనియుఁ బేరు గలదు. ఈయన వసిష్ఠశాపముచే రాక్షసుఁడై యుండినను ఈయన భార్య యాయనను సేవించుచునే యుండెను, నలునకు దమయంతి. ఈయన చక్రవర్తిగానుండి జూద మందోడి యడవులపాలైనను, దిగంబరుఁడైనను, దన చీరెలో సగము చించి యాయన కిచ్చి యాయనవెంట నడవులలోఁ దిరిగి యష్టకష్టములు పడి తుదకు మగని సంపాదించుకొనెను. ఇందు చంద్రమతి హరిశ్చంద్రుడు చెప్పఁబడలేదు. కారణ మేమో. ఏ రంభయు సీతారాములకుఁ బూర్వులే. ఇచ్చట సూక్ష్మముగ నొక్కొక్క మాటలో చెప్పిన యీ యితిహాసములఁ బెంచి వివరముగ వ్యాసమహర్షి భారతమున రచించెను. ఆకారణముననే యిరువదినాలుగువేల గ్రంథముగల భారతము లక్షగ్రంథ మయ్యెను. ఈ రామాయణ మందు నూ ఉపాఖ్యానములు సూచింపఁబడినవి. వీనికి వ్యాఖ్యానముగ భారతమునందుఁ గలవు. కావున రామాయణమునకు భారతము

వ్యాఖ్యాన'మని యీ వ్యాఖ్యానమున ముందు వ్రాయఁబడెను.' ఈ రామాయణ మందుఁ గల విషయములే భారత భాగవతములందుఁ బెంచి వ్రాయఁ బడినవి. ఈ వ్యాఖ్యాతయొక్క యీ యభిప్రాయమును బృహద్ధర్మ పురాణమందలి యీ యను వాదములు బలపఱుచు చున్నవి.

రామాయణం మహాకావ్య మాదౌ వాల్మీకినా కృతమ్
తన్మూలం సర్వకావ్యానా మితిహాస పురాణయోః
సంహితానాంచ సర్వాసాం మూలం రామాయణం మతమ్
తదేవాదర్శ మారాధ్యం వేదవ్యాసో హరేఃకలా
చక్రే మహాభారతాఖ్య మితిహాసం పురాతనమ్
కార్యాకార్య నిర్ణయేత్ర స్మృతిర్వై ధర్మసంహితా
ఇతిహాసాదివాక్యంతు తన్నిదర్శన సాధకమ్.

విధి రువాచ:—

యత్ త్వం వేదార్థవక్తా స్యాః కావ్యరూపేణ సర్వశః
అహం సృష్టికరో బ్రహ్మా తత్ర లీలాకరో హరిః
తద్వర్ణనస్య కర్తా త్వం సృష్టిరత్నాకరో భవ
లోకానాం ధర్మరూపైవ విష్ణోర్లీలా మలాపహా
త్వయా సా వర్ణితా లోకే పరోధర్మ స్థిరో భవేత్
త్వంచ త్రికాలవృత్తిజ్ఞః సత్యవాదీ ప్రతిష్ఠితః
నాహం త్వత్తః పృథక్ భూతః కవి రన్యః ప్రజాపతిః
కవి ర్బ్రహ్మా కవి ర్విష్ణుః కవి రేవ స్వయం శివః
కవిర్వై ధర్మవక్తాచ కవిః సర్వరసైకవిత్
త్వంతు రామచరిత్రాణి మునే భావీని వర్ణయ
తత్తు రామాయణం నామ మహాకావ్యం భవిష్యతి
వర్ణ యిష్యసి యద్యత్ త్వం తత్తు విష్ణుః కరిష్యతి
విష్ణోః కీర్త్యా భవత్ కావ్యం స్థాస్య త్యాచంద్రతారకమ్.

దేవ్యువాచ:—

రామాయణం మహాకావ్యం కృతం వాల్మీకినా స్వయమ్
తత్ర రామచరిత్రస్య వ్యపదేశేన సర్వశః
సర్వే ధర్మాః సముద్దిష్టా వర్ణాశ్రమ విభాగశః
నానా దేశ చరిత్రాణి శత్రుమిత్రకథా అపి
ఇతిహాసస్వరూపేణ సర్వేధర్మా నిరూపితాః.

వాల్మీకి రువాచ:—

వేదః పరిణతో భూత్వా మహాభారతతాం గతః

స్త్రీశూద్ర ద్విజబంధూనాం వేదార్థ జ్ఞానహేతవే
భారతం కృతవాన్ పూర్వం దేవో నారాయణః స్వయమ్
భారతస్య విధానాయ త్వం నారాయణ నిర్మితః
రామాయణాచ్చ విస్తీర్ణం త్వం మహాభారతంకురు
రామాయణ పరిపాట్యా త్వం మహాభారతంకురు
పరమాత్మ స్వరూపస్య సీతారామస్య చేష్టితమ్
వర్ణితం చైకరూపస్య తచ్ఛరీర విశేషవత్
స ఏవ దేవో భగవాన్ కృష్ణః కమలలోచనః
జీవ ద్వితీయ శ్చిక్రీడ భూభారహృయహేతవే
జీవాత్మ పరమాత్మానౌ నరనారాయణౌ పృథౌ
నారాయణో వాసుదేవో నరశ్చైవార్జునాహ్వయః
నరనారాయణమయం తన్మహాభారతం విదుః
ఏకం రామాయణమయం కృతం రామాయణం మయా
రామాయణే భారతేచ విశేషోఽయ ముదాహృతః.

బృహద్ధర్మపురాణమ్.

శ్రీకృష్ణోపి పునర్దేవి వ్యాసరూపధరో భువి
మానవానాం హితార్థాయ కావ్యాద్రామాయణా త్పునః
భాగా ద్భారత వర్షాంతర్గతాచ్చ వివిధాని హి
పృథక్ పృథక్ స ప్తదశ పురాణాని కరిష్యతి
సవ్యాసో భారతాద్యైశ్చ యదాశాంతిం నగచ్ఛతి
అష్టాదశ సహస్రంహి శ్రీమద్భాగవతాభిధమ్
కరిష్య త్యష్టాదశమం రమ్యం జనమనోహరమ్
యత్కించి ద్గిరిజే భూమ్యాం కీర్త్యతే వై కథానకమ్
రామాయణాంశజం విద్ధి శ్లోకమాత్ర మపీహ యత్.

ఆనందరామాయణమ్.

శ్రీమద్రామాయణమునకు భారత భాగవతము లెట్లు వ్యాఖ్యానములో రామాయణములోని 'పరం కవీనా మాధారమ్' భవిష్యత్కవుల కిది యాధారము అను వాక్యమునకు మీాఁది యనువాదములు వ్యాఖ్యానములై యున్నవి వాని సారాంశ మేమన:—

రామాయణము మహాకావ్యము. అది యాదియందు వాల్మీకిచే రచింపఁబడెను. అది సర్వకావ్యములకు నితిహాసపురాణములకు నాదిమూలము. సమస్తసంహితలకు మూలము రామాయణము. దాని నాధారముచేసికొని విష్ణుకలయగు వేదవ్యాసుఁడు మహాభారత మను పురాతనేతిహాసమును రచించెను.

బ్రహ్మవాక్యము. నీవు కావ్యరూపమున వేదార్థవక్త వైతివయితివో నేనే వక్త సృష్టికర్తను. అందు లీలాకరుఁడు విష్ణువు. ఆ విష్ణువుయొక్క లీలలు వర్ణించి సృష్టి రక్షింపుము. ధర్మరూపయగు విష్ణులీల పాపముల హరించును. నీవు దానిని వర్ణించితివేని లోకమున ధర్మము స్థిరపడును. నీవు త్రికాలవేదివి. సత్యవాదివి. నాకంటె నీవు భిన్నుఁడవు కావు. కవి యనగా వేఱొక ప్రజాపతియే. కవియె బ్రహ్మ. కవియె విష్ణువు—కవియె శివుఁడు. ధర్మకర్త కవియె. సర్వరసజ్ఞుఁడు కవియె. నీవు రామాయణమును భవిష్యము తోడ వర్ణింపుము. అది మహాకావ్యమగును. నీ వేమి వర్ణించెదవో దానిని విష్ణువు చేయును విష్ణుకీర్తిగల నీ వాక్యము ఆచంద్రతారకముగ భూమియందు నిలుచును.

దేవీవాక్యము:—

రామాయణ మహాకావ్యము వాల్మీకిచే రచింపఁబడెను. రామచరిత్రమును నెపముగాఁ దీసికొని సమస్త వర్ణాశ్రమ ధర్మములు నానాదేశ చరిత్రములు శ్రవ్యమిశ్ర కథలు ఇతిహాస స్వరూపముగ సర్వధర్మములు నిరూపింపఁ బడెను.

వాల్మీకి వాక్యము:—

వేదము పరిణమించి భారతముగ నయ్యెను. స్త్రీలకు శూద్రులకు బ్రహ్మబంధువులకు వేదార్థజ్ఞానము గలుగుటకై (వీరికి వేదము చదువునధికారము లేమిని) భగవంతుఁడు నారాయణుఁ డే పూర్వము భారతము రచించెను. భారత విధానార్థము నీవు నారాయణునిచే నిర్మింపఁబడితివి. రామాయణమున కంటె విస్తారముగ నీవు భారతమును జేయుము. రామాయణక్రమము ననుసరించి నీవు భారతము చేయుము. పరమాత్మ స్వరూపమైన సీతారామ చేష్టితము ఆయన శరీర విశేషము వలెనే యొక రూపముగ వర్ణింపఁ బడినది. ఆ భగవంతుఁడు కమలలోచనుఁడు, కృష్ణుఁడై భూభారము తొలఁగింపఁజేయ రెండవవాఁడగు జీవునితోఁ గ్రీడించెను. (రెండవవాఁడు జీవుఁడు అర్జునుఁడని యెఱుంగవలెను.) నరనారాయణులు జీవాత్మ పరమాత్మలు. నారాయణుఁడు వాసుదేవుఁడు. నరుఁడు అర్జునుఁడు. ఆ మహాభారతము నరనారాయణ మయము, రామాయణము నేకమయముగా నేను జేసితిని. (ఇందు జీవకృత్యమున కంటెఁ బరమాత్మకృత్యము విశేష మని భావము.) రామాయణమునకు భారతమునకిది భేదము. రామాయణమందు జీవాత్మను (సీతను) నెపముగా నుంచుకొని సర్వము తానే పరమాత్మ (రామచంద్రమూర్తి) చేసెను. భారతమందు జీవాత్మయగు నర్జునుచే సర్వము చేయించెను ఇది రెంటికి భేదము. వ్యాసరూపము ధరించి శ్రీకృష్ణుఁడను పేరు (కృష్ణశబ్దమునకు వ్యాసులనియు నర్థముగలదు) మానవుల హితముకొఱకు మఱల రామాయణ కావ్యమునకంటె భారముగ భరతవర్షమునఁ బుధు నేను పురాణములను భారతమును వేఱువేఱుగ వ్యాసులు రచించియు శాంతిలేనివాఁడై పదునెనిమిదివేలగ్రంథము గల శ్రీమద్భాగవత మను పేరుగల పదునెనిమిదవ పురాణమును జనమనోహరమైన రమ్యమైన దానిని జేయఁగలఁడు.

పార్వతీ! లోకమునఁ గీర్తింపఁబడిన కథ యే కొంచెమైనను రామాయణాంశజ మనియే యెఱుంగుము. ఆనంద. రా.

రామాయణమున జీవకృత్యము సీతాదేవి చరిత్రము వలనను పరమాత్మ కృత్యము రాముని చరిత్రము వలనను దెలియనగు. మనము జీవాత్మల (సీతాదేవి) ప్రవర్తనము దెలిసికొని యా ప్రకారము నడచి ముక్తులగుట యావశ్యకము. ఆ సీతాదేవి చరిత్రము విశేషించి సుందరకాండమునఁ గలదు. ఆ కారణముచేతనే యిది విశేషముగ నాదరణ పాత్రమై సుందరకాండ మను సార్థక నామధేయము వహించి యున్నది.

తా త్ప ర్య ము.

ఇంద్రునకు శచీదేవి, వసిష్ఠున కరుంధతి, చంద్రునకు రోహిణి, చ్యవనునకు సుకన్య, సత్యవంతునకు సావిత్రి, కపిలునకు శ్రీమతి, అగస్త్యునకు లోపాముద్ర, సగరునకుఁ గేశిని, సౌదాసునకు మదయంతి, నలునకు దమయంతి యెట్టులో రామచంద్రమూర్తికి నేనట్టులే, నే నాయన ననుభవించి కృతార్థురాల నగుదును.

క. జానకి యిటు పల్కిన విని, దానవకులనాథచోది•తలు రాక్షసుల్
దీనాత్మను గర్కశవా, చానిష్ఠుర బాణనిహతఁ • జలిపిరి మిగులన్. ౬౧౩

అర్థములు. చోదితలు = ఆజ్ఞాపింపఁబడినవారు, దీనాత్మను = దుఃఖించుచున్న మనస్సుగలదానిని, కర్కశ వాచా = కఠిన వాక్కులనెడు, నిష్ఠుర బాణ నిహతన్ = కఠిన బాణములచేఁ గొట్టఁబడిన దానినిగ, రావణచోదితలు అనునది హేతుగర్భితము.

ఈ స్త్రీలు సీతను బాధించుట కేమి హేతు వనిన రావణు నాజ్ఞయేకాని వారికి ద్వేషబుద్ధి గలిగి కాదు. కావుననే సీతాదేవి హనుమంతునితో (యుద్ధ. ౨౬-౨౬) 'నిర్జర విరోధి పనుపున,దర్జించిరి మీర లతని దాసులుగానన్, నిర్జితుఁడొట దశాస్యుఁడు, తర్జింతురె యింకనన్నుఁ దరుచరవర్యా' యని చెప్పెను.

తా త్ప ర్య ము.

సీతాదేవి యీ ప్రకారము చెప్పఁగా రావణుచే నాజ్ఞాపింపఁబడిన రాక్షస స్త్రీ లామెను కఠినవాక్కు లను బాణములచే మిగుల నొప్పించిరి.

క. కదలక మెదలక తెలివక, పెదవులు నా శింశుపాఖ్య•వృక్షస్థితుఁ డై
బెదరించు చండ రాక్షస, సుదతులు జానకిని వాయు•సూనుఁడు వినియెన్. ౬౧౪

తా త్ప ర్య ము.

ఇటునటు కదలక కైకుఁయి యనక శింశుపావృక్షమునందుండి జానకిని రాక్షస స్త్రీలు బెదరించు మాటల నెల్ల హనుమంతుఁడు వినెను. రావణుఁడు రాకముందే యామె సీతాదేవి యని హనుమంతుఁడు నిశ్చయించుకొనెను. ఆ నిశ్చయము రావణ సీతావాక్యప్రతివాక్యముల వలన స్థిరపడెను. ఇట్లుండ రావణుఁడు సీతాదేవి నన్ని

దుర్భాషణము లాడుచుండ వానిమీఁద మోఁకి హనుమంతుఁడు నాలుగు గుద్దులు చేసులార గుద్దక మెల్లు విని సహించి యూరకుండెను! ఇది దాసుని లక్షణమా ? హనుమంతుఁడు దూతగా వచ్చెను. సుగ్రీవుఁడు సీతాదేవిని జూచి రమ్మనెను. రామచంద్రమూర్తి ముద్రికనిచ్చి దీనిని సీతాదేవి కిచ్చి మాటలాడి రమ్మనెను. ఇది దూత ముఖ్యకృత్యము. దీనిని జేయక క్రోధమునకుఁ బాలుపడి యముఖ్య కార్యమును జేయవచ్చునా! అందు వాఁడు తప్పఁ దాగి కామవశుఁడై యున్న స్త్రీల నడుమ నున్నవాఁడు. అది యుద్ధసమయముగాదు. వానితో యుద్ధము పెట్టుకొనఁగానే రాక్షసులతో యుద్ధములోనే సరిపోవునుగాని వచ్చినకార్యమున కెడములేక పోవును. అందఱికంటె ముందు సీతాదేవి బెదరును. కావునఁ గార్యక్రమ మదికాదు. వచ్చిన పనిదైన యెడల యుద్ధ మెప్పుడైనఁ జేయవచ్చును. ఇవన్ని యాలోచించి హనుమంతుఁ డోర్పుగలిగిన వాఁడయ్యెను.

—• రాక్షస స్త్రీలు సీతాదేవిని గఱకు లాడుట •—

క. అంతట నందఱు రాక్షస, కాంతలు చుట్టుకొని రాము•కామిని భీత
స్వాంతమున వణఁకఁ గోపా,క్రాంతత నిట్లనిరి వాతె•ఱల్ చలియింపన్. ౨౧౫

అర్థములు. భీతస్వాంతమునన్=భయపడిన మనస్సుతో, కోపాక్రాంతతన్ = కోపముచే నాక్రమింపఁబడుటచేత, వాతెఱల్ = పెదవులు, వా+ తెఱ = వాతెఱ, పండ్లకు తెఱవంటిది.

తా త్ప ర్య ము.

సీతాదేవి యిట్లు చెప్పిన తరువాత రాక్షస స్త్రీలందఱు భయముచే వణఁకు నామెను జుట్టుకొని పెదవులు కోపముచేఁ గదలుచుండ నిట్లనిరి.

క. గొడ్డండ్లఁ ద్రిప్పుచును వఱ,గొడ్డంబులు పలుకుచుం బ్ర•కోపంబునఁ బై
పడ్డగతి నీ వటే మా,ఱొడ్డెదు నీ వేల యొల్ల•వో రావణునిన్. ౨౧౬

అర్థములు. వఱగొడ్డంబులు=వంకరమాటలు,"బిడ్డలకు బుద్ధిసెప్పని, గ్రుడ్డికిఁ బిండంబు వండికొని పొండిదె పైఁ,బడ్డాఁడని భీముం డొఱగొడ్డములను" భాగ. ౧ స్కం. పాఠము సరిగాదు. "భీముఁడు వఱగొడ్డము లాడంగనెట్లు గుడిచెద వధిపా" యనునది సాధుపాఠము.

తా త్ప ర్య ము.

గొడ్డండ్లు ద్రిప్పుచు వక్రభాషణము లాడుచు మిగులఁ గోపంబునఁ బైపడు నట్లు వచ్చి నీవటే మమ్ము రావణునిఁగూడ నెదిరించి మాటలాడెదవు. ఏల నీవు రావణు నొల్లవే. వాఁడు మగవాఁడు కాఁడాయేమి!

క. అను డా బిభీషికోక్తుల, విని జానకి శోక బాష్ప•వృష్టి కురియఁగాఁ
జనె నల్లశింశుపాద్రుమ,మున చాటునకున్ భయంబు • ముంచుకొనంగన్. ౨౧౭

అర్థములు. బిభీషికోక్తులు=బెదరింపు మాటలు.

తా త్ప ర్య ము.

ఈ ప్రకారము చెప్పుచున్న వారి బెదరింపుమాటలు విని శోకమునఁ గన్నీళ్లు వర్షింపఁగా భయపడి లేచి శింశుపావృక్షముచాటునకుఁ బోయెను.

ఆ. బొజ్జ వ్రేలువాట్ట • మొజ్జనికన్నులు, బుజ్జముక్కు గలిగి • చిఱ్ఱు చిఱ్ఱు
లాడుకొనుచు వచ్చి • యాడె జానకితోడ, వినత యనెడు నొక్క • వికటరూప.

తా త్ప ర్య ము.

సులభము.

క. పతిపై నెయ్యము మేల్మేల్, సతి ! కనబఱిచితివి నీవు • చక్కఁగ నైన్
మితి మీఱిన నది యేనియు, నతివా ! కీడునకు మూల • మగు నన వినవే ?

అర్థములు. నెయ్యము = స్నేహము.

తా త్ప ర్య ము.

నీవు నీ మగనిపై స్నేహము చక్కఁగఁ గనఁబఱిచితివి. మేలు మేలు. మెచ్చుకొంటినిగాని 'అతి సర్వత్ర వర్జయేత్.' ఏదైనను మితిమించరాదు. మగని మీఁదనైనను ఎంత ప్రేమ యుంచవలయునో యంతే యుంచవలయును. ఎక్కువగా నుంచరాదు. మితిమించిన దేదైనను కీడునకుఁ గారణమగును.

సీ. మనుజాంగనకుఁ దగు • మగనాలితనమును, మెలఁత చెప్పితి లెస్స • మెచ్చవచ్చె
నయిన నా చెప్పెడి • యత్యంతపథ్య మౌ, మాటలఁ జెవి నిడు • మందయాన
సురనాయకుం డైన • హరిహయునట్టులు, వరవిక్రముఁడు రూప • వంతుఁ డైన
నిఖిల రాక్షసభర్త • నీ ప్రియభర్తగాఁ, గొనుము నా మాటను • వినియుఁ జూడు
తే. త్యాగి గలవాఁడు కలవాఁడు • భోగపరుఁడు
దక్షిణుండు జనప్రియ • దర్శనుండు
రావణుఁడు నీకుఁ దగినట్టి • ప్రాణవిభుఁడు
కృపణుఁ డగు రామునకు నేల • యేడ్చె దిట్లు ? ౬-౨౦

అర్థములు. మగనాలితనమును = పాతివ్రత్యమును, అత్యంత పథ్యము = మిక్కిలి మేలిచ్చునది, దక్షిణుఁడు = చక్కని మనస్సుగలవాఁడు, నేర్పరి.

తా త్ప ర్య ము.

మనుష్యస్త్రీలకుఁ దగిన పాతివ్రత్యము గుఱించి చెప్పితివి. బాగుగనేయున్నది. అయినను అంతకంటె మేలైనది యొకమాట చెప్పెదను వినుము. దేవతాప్రభువైన యింద్రునివలె మిగులఁ బరాక్రమము గలవాఁడు, సుందరుఁడు అయిన రావణుని నీవు భర్తగాఁగొనుము. ఒకపూఁట నామాట విని చూడు. ఆవల నీకు నిష్టములేకున్నను కష్టముతోఁచినను వదలిపెట్టుము. రావణుఁడుమహాదాత, భోగమందాసక్తిగలవాఁడు, నేర్పరి, ఎందఱ భార్యలనైన సంతోషపెట్టఁ గలవాఁడు, చూచుటకుఁ బ్రియమైన

ఆకారముగలవాఁడు. ఇట్టి రావణుఁడుకదా నీకుఁ దగినమగఁడు. దరిద్రుని రాముని గట్టుకొని యేలయేడ్చెదవే.

ఉ. ఘుమ్మను నంగరాగములు • కాంచనరత్నసమంచితంబులౌ
సొమ్ములు లెస్స మైఁ దొడిగి • సుందరి ! యీ్ాత్రుటినుండి యెల్లలో
కమ్ముల నేలుమీా, విబుధ• కాంతునకున్ శచి, స్వాహా యగ్నికిన్
సమ్మతి నిష్టురాం డ్రయిన• చాడ్పున నీ వనుమీా సురారికిన్. ఉ.౨౧

అర్థములు. అంగరాగములు = వాసన పదార్థములు; పూసికొని, మైన్ = దేహమునందు.

తా త్ప ర్య ము.

ఘుమఘుమ వాసనగొట్టు గంధములు లోనైనవి పూసికొని బంగారు రత్నములచేఁ బ్రకాశించు సొమ్ములు పెట్టుకొని యీాక్షణమునుండి లోకములనెల్లఁ బాలింపుము. ఇంద్రునకు శచి, అగ్నికి స్వాహాదేవి యిష్టురాండ్రయినట్టు నీవు రావణాసురునకుఁ బ్రియురాలవు కమ్ము.

ఉ. నేటికి రాముఁ గట్టుకొని • యేడ్చెద వా కృపణున్ గతాయుషున్
గూటికి లేనివాని మదిఁ • గూర్చెదు, విన్ము మదీయవాక్యముల్
పాటిగ నెంచి మా పనుచు• భంగి నొవర్పక మాఱు పల్కి- ని
న్నాటికి గండకండగను • గోసి భుజింతుము వ్యంజనంబుగన్. ఉ.౨౨

అర్థములు. గతాయుషున్ = క్షీణించిన యాయుస్సుగలవానిని.

తా త్ప ర్య ము.

సీతా, యేమిటికే రాముఁడు రాముఁడని కౌఁగిలోభిని, అల్పాయువుగలవానిని, దినఁగూడు కట్టబట్ట లేనివానిని కట్టుకొని యేడ్చెదవు. అటువంటి వానిమీాఁద నీకేటికే ప్రేమ. నా మాటలు విను. మేము చెప్పినట్లు చేయక ధిక్కరించితివా, నిన్ను ముక్కలు ముక్కలుగా నటికి వ్యంజనముగా భుజింతుము తెలిసినదా !

తే. అంతటను వ్రేలుచన్నుల•యసుర పేర, వికట వికటాట్టహాసంబు • ప్రకటితముగ
ముష్టి పై కెత్తి చూపుచు•ముగ్ధసీత, ప్రక్కఁ గనుఁగొని యిట్లనుఁ•బరుషభంగి.

అర్థములు. వికటాట్టహాసంబు=భయంకరమైన నవ్వు.

తా త్ప ర్య ము. స్పష్టము

ఉ. ఓసి దురాత్మురాల ! కఠి•నోక్తులు పెక్కులు పల్కి- రాక్షసా
గ్రేసరు నయ్యొ పాప మని • కేవలమున్ మృదుకాయ వౌటచే
రోసము మాని పెందయను • గ్రూరత నిన్ను వధింపఁ డాతఁడో
తొన్మసుత ! కాలయోగ్య మగు • మా పలుకుల్ గణియింప వైతిగా. ఉ.౨౪

తా త్ప ర్య ము.

ఓసి దుర్బుద్ధీ ! మా రాక్షస రాజును నీ వెన్నిమాట లంటివే. అంతకరి

నముగా నీవు మాటలాడినను నీయందు దయగలవాఁడై నీవు సుకుమారివౌటచేఁ గోపింపక నిన్నుఁ జంపలేదు. దేశము కాలము నాలోచించి మేము చెప్పుచున్న మాటలు వినవుకదా.

ఉ. ఏరికిఁ దేఱి చూడఁగ మృ•గేక్షణ ! శక్యము గాని యీ యకూ
పారము తీరమం దసుర•వల్లభు నంతిపురంబులోన దు
ర్వారత మేము గావ దృఢ•పంజరమందలి చిల్కయట్టు లై
చేరితి వల్ల యింద్రుఁడును • జేరఁగ నేర్చునె నిన్నుఁ గావఁగన్. ౬.౨౫

అర్థములు. అకూపారము = సముద్రము.

తా త్ప ర్య ము.

రాముఁడు వచ్చును. నిన్నుఁ దోడుకొని పోవు ననెదవే. అదెట్టులే వచ్చును. మొట్టమొదట నా రెండ్డున నుండువారికి సముద్రతీరమునుండు నీ లంకకు రావ రాదు. ఒకవేళ సముద్రము దాఁటి వచ్చె ననుకో, రావణాసురుని యంతఃపురములో నుండు నిన్నుఁ దెలిసికొననే లేఁడు. ఒకవేళ నీ విచ్చట నున్నావని వినినను మేము ఇందఱము కావలి యుండఁగా మమ్ముఁ గాదని యెట్లు తీసికొని పోఁగలఁడే. పంజర ములోఁ జిలుకవలెఁ జిక్కితివే. ఆ యింద్రుఁడైన నిన్ను రక్షించుటకు దగ్గఱకైన రాఁగలఁడా ?

చ. వలవనిమాట లాడ, హిత•వాదిని నేను, మదీయవాక్యముల్
చెలువరో వీనులం జొనుపు • చెక్కులఁ గన్నులనీరు గాఱఁగా
వలవల యేల యేడ్చెద, వ•వశ్యము శోక మనర్థకంబెకా
వెలఁది! దశాస్యుతోడఁ గడు•వేడుకలన్ విహరింపు మర్మిలిన్. ౬.౨౬

తా త్ప ర్య ము.

సీతా! నే నెంతమాట పనికి కావలయునో యంతేమాట లాడుదును. వ్యర్థ ముగా మాటలాడలేను. నేను నీకు హితమే చెప్పుదును. అహితము చెప్పను. తెలిసి నదా నే నందఱవంటి దానఁగాను. నా మాటలు నీ చెవిలోకిఁ బోనిమ్ము. చెక్కిళ్ళ వెంబడి కన్నీరు గాఱునట్టు లేల వలవల యేడ్చెదవు. శోకము వలనఁ గీడేకాని మేలు లేదు. కాఁబట్టి ప్రేమగలదానవై రావణుతోఁ గ్రీడింపుము.

ఉ. ప్రాయము శాశ్వతం బటవె • భామల, కియ్యది నీ వెఱుంగవా,
తోయజనేత్ర ! జవ్వనము • దూలక మున్న నిశాంతకాంతసౌ
ఖ్యాయతి నొందఁ జూడుము వ•నాంతరవీథులఁ గేళికాద్రులన్
జే యని భోగముల్ గుడువఁ • జేఁ దశ యీ యమరారినేతతోన్. ౬.౨౭

తా త్ప ర్య ము.

ఏమే సీతా! నీ కీ వయస్సు ఇట్టులే శాశ్వతముగా నుండునని తలఁచితివా ! ఇంతమాత్రము నీకుఁ దెలియదా? వెన్నెల యున్నప్పుడేకదేమే అల్లోనేరేళ్లు, అవల

రమ్మనిన వచ్చునా? కావున యౌవనము పోకముందే మిక్కిలి మనోహరమైన విస్తారసౌఖ్యము నీ వనుభవింప యత్నింపుము. ఆట మలలయందు కే యని రావణుని తోడఁ గ్రీడించుట నీకేమి చేఁదా? చేదు మే సెదవు కాఁబోలు. మమ్ముఁగోరువాఁడు లేఁడుకాని మే మైనను జమ్మని విహరింపమా?

క. సుందరి! బృందారకపర, బృందారకు భర్తగాఁగ • నేలిన నిన్నుం
గ్రందుగ సప్తసహస్రము, లిందీవరలోచనాళి • వెలమి భజించున్. ౬౨౯

అర్థములు. బృందారకపర= దేవవిరోధు లగు రాక్షసులందు, బృందారకున్= శ్రేష్ఠుని, పుమాన్ బృందారకో దేవే తేషు శ్రేష్ఠమనోజ్ఞయోః॥ నానా॥ర.సప్త సహస్రములు = ఏడువేలమంది.

తా త్ప ర్య ము.

సుందరీ, రాక్షసశ్రేష్ఠుఁడైన రావణుని భర్తగాఁ గొనితివి అని యొక్క మాట యనుము. ఇప్పుడే నిన్ను నేడువేలమంది స్త్రీలు వచ్చి పరిచరింతురో లేదో నా మాట చూడుము.

క. సమ్మతి గొన కీ మా వాక్యమ్ముఁ దిరస్కృతి యొనర్పఁ•గాఁ జూచిన నీ
తోమ్ముఁ బగిల్చియు వెస నస్రమ్మును గ్రోలెదము వింత•చవు లూరంగన్.

అర్థములు. అస్రము = నెత్తురు, తిరస్కృతి = ధిక్కారము.

తా త్ప ర్య ము.

మేము చెప్పిన యీ మాటకును సమ్మతింపక తిరుగుపాటు చేసెదవా, యిదిగోఁ జూడు, నీ రొమ్ములు చీల్చి క్రొత్తపుచి పుట్టుచుండ నీ నెత్తురు ద్రావెదము.

క. చండోదరి యను రక్కసి, చండతరక్రోధమునను • సాధ్వసకర మా
దండి త్రిశూలముఁ ద్రిప్పుచు, గండున నిట్లనియె జనక•కన్యామణికిన్. ౬౩౦

అర్థములు. చండతర క్రోధమునను = మిగుల భయంకరమైన కోపముతో, సాధ్వసకరము = భయంకరము.

తా త్ప ర్య ము.

చండోదరి యను రాక్షసి మిగులఁ గోపించినదై భయంకరముగాఁ ద్రిశూలముఁ ద్రిప్పుచు గర్వమున సీతతో నిట్లనెను.

క. త్రాసోత్కంపిపయోధర, నీ సుందరి భీతవన్య•మృగనేత్ర స్వరా
వాసారిహృతను జూడఁగ, వాసిగ నా నోర నీళ్లు • వారక యూరెన్. ౬౩౧

అర్థములు. త్రాసోత్కంపి పయోధర = భయముచే మిగుల వణఁకుచున్న చన్నులుగలది, భీతవన్య మృగనేత్ర = భయపడిన యడవిజింక కన్నులు గలది. స్వర్+ఆవాస+అరి+హృతను=దేవవిరోధి యగు రావణాసురుచే నపహరింపఁ బడిన దానిని.

తా త్ప ర్య ము.

భయముచేత వణఁకుచున్న చన్నులు గల యీ సుందరిని బెదరిన యడవి జింక కన్నులవంటి కన్నులుగలదానిని జూడఁగా నెప్పుడెప్పుడు వాతవేసికొందునా యని నా నోర నీళ్ళూరక యూరుచున్నవి.

తే. ఎప్పుడో కద సీత య•కృత్తు ప్లీహ, మెదను గల్గిన యుత్పీడ • మిష్టముగను
జప్పరించుచు బంధన • మొప్పనిరాఁ, మెదడు నరములు తనివార • మెసవు టాడవు.

అర్థములు. యకృత్తు = కడుపులో నీరుతిత్తి క్రింద కుడివైపున నుండెడి మాంసవిశేషము, కారిజము, (Liver) ప్లీహము=హృదయమున (కడుపులో) నెడమ ప్రక్క నుండెడి మాంసవిశేషము. (Spleen) గుల్మము. ఎదను = హృదయ కోశమును, (Heart) ఉత్పీడము=ప్లీహమునకుఁ బైనున్న మాంసఖండము. బంధనమున్ = ఈ మాంసపుఁ గట్లను.

తా త్ప ర్య ము.

అక్కా, వికటా! నే నెప్పుడే యీ సీత యకృత్తును ప్లీహమును హృదయమునఁ గల యుత్పీడమును జప్పరించుచు మెదడు నరములు తృప్తిదీర తిందునే.

ఉ. అంతట నిట్లు పల్కెఁ బ్రఘు•సాఖ్య యి దేటికె యింతరచ్చ ? యీ
కాంత గళంబును న్నులిమి • గ్రక్కున నల్లమనుష్యకాంత దా
సంభ్రమ నొందె నంచును ద•శాననుతోఁ జని చెప్ప తేఁడు ని
శ్చింతతఁ దిందు పొం డనును • సిద్ధము దీనికి నాల మేటికిన్. ౬.౩౩

అర్థములు. గళంబు=మెడ; నులిమి=నలిపి; అలము=ఉపేక్ష; తాన్=తానే.

తా త్ప ర్య ము.

అప్పుడు ప్రఘస యను రాక్షసి యిట్లనెను. ఏమిటికే యీరచ్చ? నే నొక యుపాయముచెప్పెద. వినుఁడు. ఈ సీత గొంతు నులుముదము. చచ్చును. అంతట మనము రావణు నొద్దకుఁబోయి మనుష్యస్త్రీ తానే చచ్చిన దని చెప్పుదము. తిను పొండనును. దీనికేల యుపేక్ష ?

చ. గల గల వాదు లాడుటయె • కార్యముఁ బొప్పఁ దలంప రెవ్వరున్
బలుకులతోడ నేమిపని • భామిని నంజును నెల్లవారమున్
వలనుగఁ బంచుకోఁ దగును • వారుణి, నంజుకొనంగ నూరుఁగా
యలు గొని రంకు మీఁదగు • రయంబును జూతము గాక యిద్యోడన్. ౬.౩౪

తా త్ప ర్య ము.

అంతట నజాముఖ యిట్లనెను. కుండలో గ్రచ్చకాయలు పోసి యాడించినట్లు గలగల మని యందఱు వాదులాడువారేకాని యేపని యెట్లు చేయవలయునా యను జ్ఞాన మెక్కరికిని లేదు. ఉత్తమాటలలో నేమిపని యగును. ఈసీత మాంసమును మన మందఱము పంచుకొని సారాయములో నద్దుకొని లొట్టలువేయుచుఁ దిందముగాని

నేమీ, దీనిలోనికి నారుంగాయలు దీసికొని రాపొండు, చూతము. ఎవరు వేగిరము పోయి వచ్చెదరో చూడవలె!

క. అనుచు నజాముఖి పలికిన, విని శూర్పణఖాసమాఖ్య • వినిచె యథార్థం
 బనిమె నజాముఖి, కల్లును, గొనిరండీ యదియ యన్ని • కొదవలు దీర్చున్. ౬౩౫

తా త్ప ర్య ము.

అప్పుడు శూర్పణఖ యనునది యిట్లనెను. అజాముఖి సత్యము చెప్పెను. కల్లును దీసికొని వచ్చితిరా మనకొదవ లన్ని తీరిపోవును.

క. మానుష మాంసంబును స,మ్మానముగ నంజికొనుచు • మఱి సురలోనన్
 జానుగ నికుంభిలను గే,ళీనిరతిం దేల వచ్చు • లీలం బాలిన్. ౬౩౬

అర్థములు. నికుంభిల=ఇది లంకకుఁ బడమటి నైరుతిన నుండిన గ్రామశక్తి,భద్రకాళి. ఈ నికుంభిల యిప్పటికి నున్నది.

తా త్ప ర్య ము.

మనుష్య స్త్రీ మాంసమును కల్లులో నద్దుకొని నికుంభిల దేవాలయమందు మన యిష్టము వచ్చినట్టు గంతులు పెట్టవచ్చును.

క. ఈ రీతి నసురకాంతలు, దారుణముగ బెడిదములను • దర్జించిన నా
 శ్రీరాముదేవి విని వెఱ, హా రామా! యనుచు నేడ్చె • నంగిలినొండన్! ౬౩౭

తా త్ప ర్య ము.

ఈ విధముగా రాక్షసస్త్రీలు బెదరింపు మాటలాడఁగా శ్రీ సీతాదేవి రామా యని యంగిలి నొండ నేడ్చెను.లంకలో సీతాదేవి రాక్షసస్త్రీలచేఁబడు బాధల వంటివే, దేహమునందలి బద్ధజీవుఁడు సంసారమునఁబడి యింద్రియాదులచేఁ బడు బాధలు. అయినను రావణుఁడుగాని రాక్షసస్త్రీలుగాని సీతాదేవిని బెదరించిరేగాని చంపఁజాలిన వారుగారు. కావున జీవాత్మ నెవియుఁజంపఁజాలవు.బాధింపను మాత్రము బాధించును. సీతాదేవివలె బద్ధజీవులును ప్రారబ్ధ విశేష మని దృఢచిత్తముతో భగవంతుఁను రక్షకుఁడని మహా విశ్వాసము కలిగియుండవలెను. సీతాదేవి యింద్రియములకు వశపడలేదని మహావిశ్వాసము కల దని మీఁద దృఢపడెను. తరువాత జీవుఁడు చేయవలసిన భగవద్ధ్యాన మిఁక సీతావిలాపరూపమునఁ జెప్పఁబడును.

—• ౨౫-వ సర్గము, రాక్షసస్త్రీలమాటలకు భయపడి సీతాదేవి యేడ్చుట. •—

ఉ. అండజయాన యిట్లు బహు • శార్తి క్రమంపను చాసురాంగనా
 దండముతోడ నిట్టు లనఁ • దథ్యము మీ పలు కాదరింప, నన్
 దిండు యథేష్టవృత్తి, నగు • నే యసురాధము లేడ? మర్త్యనే
 తండసురయాన లేడఁ? గల • దా విపరీతపుహాస్తు ధాత్రిలోన్? ౬౩౮

అర్థములు. అండజయాన = హంసల నడకవంటి నడకగలది, "అండజయాన నీ వొసఁగు నట్టి సపర్యలు వచ్చె" నని మనుచరిత్ర.

తాత్పర్యము.

సీతాదేవి యీ విధమున మిగుల దుఃఖపడుచు నా రాక్షస స్త్రీలతోడ ని[illegible]లనియె. ఓ రాక్షసాంగనలారా! సత్యముగా మీ మాట నేను వినను. మీరు చెప్పి[illegible]నట్లు నేను జేయను. అయిన నన్నుఁ దినెదమందురా? మీ యిష్టప్రకారము తినుఁడు. నేను వల దనను. మీ రాలోచనలేక చెప్పుచున్నారు. నీచరాక్షసు లేడ? మనుష్య స్త్రీ లేడ? ఇటువంటి విపరీతపుఁ బొత్తు భూమిలోఁ గలదా?

రాక్షసస్థానమునఁ బ్రకృతిని,మర్త్యస్త్రీ స్థానమున జీవాత్మను గ్రహింపవలెను. మనుష్యులకు మనుష్యభక్షకు లగు రాక్షసులకు విజాతీయభేద మున్నట్లు కేవల మచేతన మైన దేహమునకుఁ గేవలచేతన మగు నాత్మకుఁ దారతమ్యము గల దని గ్రహింపవలెను. విషమాలంకారము. అనురూపము కాని వాని చేరిక చెప్పిన విషమాలంకారము.

క. అని రాకాసులలో మహి, తనయామణి చిక్కి వణఁకు • దనలోఁ గ్రుంగున్
వని మందనుండి చెదరినఁ,బెనుఁ దోడేలు పట్టుకొన్న • విడి హరిణి యనన్.౬౩౯

తాత్పర్యము.

మందనుండి చెదరి యొంటరిగాఁ దోడేలునకుఁ జిక్కిన యొంటి జింకవలె సీతాదేవి తన వారి నందఱ విడచి రాక్షసస్త్రీలలోఁ జిక్కుకొని వణఁకుచుండెను.

ఇచ్చటఁ దనవారు శుద్ధాత్ములు, అశుద్ధాత్మ ప్రకృతికి వశపడుట జింక తోడేలికిఁ జిక్కుట.

తే. ఇంబు జాఱఁగఁ బుష్పగ•దంబభార, లంబమానసుశాఖకాలంబ యగుచుఁ
గంబుకంధర తనదు మ•నంబునందు, నంబుజాక్షుని బతిని దుః•ఖంబు గదుర.౬౪౦

అర్థములు. ఇంబు = మనోజ్ఞత, ఇంపు; పుష్పకదంబ = పూలసమూహము యొక్క, భార = బరువుచే, లంబమాన = వంగి వ్రేలుచున్న, సుశాఖకాలంబ = కొమ్మను పట్టుకొన్నది, కంబుకంధర = శంఖమువంటి మెడ గలది.

తాత్పర్యము.

తన మనోజ్ఞత్వము పోవునట్లు పూలగుంపుల బరువుచే వంగిన కొమ్మను బట్టుకొని సీతాదేవి తన మనస్సులోఁ దన భర్తను దలఁచి శోకంబుతో.

క. కనుదోయి నీటివాఁకను, జనుదోయిని దడుపుకొనుచు • స్మరియించుచు లో
దనుజాంగనలకు వెఱచుచు, ఘనవాతోచ్చలితకదళి•కరణిన్ వణఁకెన్. ౬౪౧

అర్థములు. ఘనవాత = గొప్పగాలికి, ఉచ్చలిత = మిక్కిలి కదలుచున్న, కదళికరణిన్ = అరఁటిచెట్టువలె.

తాత్పర్యము.

కన్నీళ్ళచే స్తనములను దడుపుచు భర్తను లోపల స్మరించుచు రాక్షసస్త్రీ లే వేళ కేమి చేయుదురో యని భయపడుచుఁ బెనుగాలికి నరఁటిచెట్టువలె వణఁకెను.

చ. గడగడ లాడు నా కలువ•కంటి విశాలము దీర్ఘమైన పెన్
జడ యిటు నట్టిఁ బొర్లుచు మ•నంబునకుం దలఁపించె సర్పమున్;
బడఁతుక రామ ! లక్ష్మణ ! కృ•పారత ! యత్తరొ కోసలాత్మజా !
చెడితిని హా సుమిత్ర! కృప • సేయరుగా యొక రైన నా డెసన్. ౭౪౨

తాత్పర్యము.

గడగడ వణకుచున్న యా కలువలవంటి కన్నులుగల సీతాదేవియొక్క విశాలము, నిడివిగల పెద్దజడ సీతాదేవి నిలువఁబడి యుండుటచే నీ భుజము మీఁదికి నా భుజము మీఁదికిఁ బొర్లుచుఁ బెద్ద సర్పమును స్మరణమునకుఁ దెచ్చుచుండెను. ఆమె యును రామ! లక్ష్మణ ! దయగల యత్తా, కౌసల్యాదేవీ! హా సుమిత్రా! చెడితిని. ఒకరైన నాయందు దయ దలఁపరు గదా !

దీనివలన సోపాధి బాంధవు లెవ్వరు నెంత యాప్తులైనను నాత్మ నుద్ధారము చేయ లేరని సూచన. స్మృతిమ దలంకారము.

ఉ. తాలిమి పీడ, రాక్షసుల • తర్జనముల్ గడుఁగోడు గూర్చ, నా
యేలినవానిఁ బాసి త్రుటి•యేనియు జీవముతోడ నుండుటన్
గాలముకాని కాలమునఁ • గల్గదు మృత్యువు పూరుషాళికిన్
గోలల కన్న సూరిపలు•కుల్ కడునిక్కము వో తలంపఁగన్. ౭౪౩

అర్థములు. తాలిమి=ఓర్పు, ఏలినవానిన్ = ప్రాణేశ్వరుని, భర్తను, త్రుటి = అల్పకాలమున, కాలముకాని కాలమునన్ = అకాలమున, గోలలకు = స్త్రీలకు, సూరి = పండితులయొక్క.

తాత్పర్యము.

ఓర్పు సమసెను. రాక్షసుల బెదరింపులు బాధింప సాగెను. నా భర్తను బాసి యుండుట గలిగెను. ఈ మూఁడు కారణములచేఁ బ్రాణ మెప్పుడో పోవలసినదే, పోక యున్నది దీనివలన స్త్రీకిఁగాని, పురుషునకుఁగాని యకాలమున మృత్యువు రాదని చెప్పునట్టి పండితుల మాట సత్యమే కదా. అటు గాకున్న నా దేహమున జీవములు నిల్వఁగారణ మేమి గలదు ?

క. కొఱనోము నోఁచి పున్నెము, గఱగొఱ యగు నేను సుడియు • గాలికి జలధిన్
జిఱజిఱను దిరిగి మునిఁగెడి, విఱిగిన కల మనఁగఁ జెడుదు • విభురహితవలెన్. ౭౪౪

అర్థములు. కొఱనోము = పూర్ణముకాని వ్రతము, ఉద్యాపనము వఱకుఁ జేయక విడిచినది, గఱగొఱ=తక్కువ, విఱిగిన = పగిలిన, విభురహితవలెన్ =భర్త లేని దానివలె.

తాత్పర్యము.

ఏదియో గొప్ప నోము సలుపఁబూని సాంతముగ నెఱవేర్ప నైతిని. ఆకారణముచే నానోముఫలము నాకు లేదాయెను. ఆకారణముచే నాకు భర్తయుండియు

లేనిదాననై పడిసముద్రమున సుడిగాలికి గిఱగిఱ దిరిగి విఱిగిన యోడవలె నాపత్సముద్రమున మునుఁగుచున్నాను. నా నోము సాంతమైయుండిన యెడల నా పుణ్యఫలమే నా భర్తచే నన్ను రక్షింపఁజేసి యుండును.

దీని వలన స్త్రీల పాతివ్రత్యము, నోముల ఫలము, వారి భర్తల మూలమున వారిని రక్షించుచున్న దనియు, అట్టి ఫలము లేనియెడల భర్తలుండినను రక్షింపఁజాల రనియు నేర్పడుచున్నది. దీనిని బట్టియే యాఁడుదాని దదృష్ట మని నానుడి యేర్పడెను. అఁడుది నిర్భాగ్యురా లగు నేని మగవాఁడెంత పుణ్యుఁడు, సమర్థుఁడైనను దానికి సుఖము లేదు.

లోకమునఁ గొందఱు దరిద్రులుగను, కొందఱు భాగ్యవంతులుగను, కొందఱు దుఃఖులుగను, గొందఱు సుఖులుగ నున్నారు. ఈ భేదమునకు వారు వారు చేసిన పుణ్యవిశేషమే కారణము. వారి వారి పుణ్యమునకుఁ దగినట్లు భగవంతుఁడే దేని నెపము పెట్టి యిచ్చుచుండును. పుణ్యము లేనివానికి ఫలము లేదు. వారు వారు బాగుండుటకుఁ, జెడుటకు వారివారి కర్మమే కారణము.

ఉ. ఆ రఘురాముఁ బ్రాణవిభు • నాదట నేఁ గనుగొంట లేకయున్
గ్రూరపలాశినీవశముఁ • గూరి మహావ్యథ ప్రసక్తిఁ గంటి, దు
ర్వారరయోద్ధతం బయిన • వాహినిచేతను నుగ్గు వాహినీ
తీరమునట్లు లే మనుచుఁ • దేఁకువ నుండుదు జీవయుక్తనై. ౬౮౫

అర్థములు. ఆదటన్ = ప్రేమముతో, క్రూరపలాశినీ వశము = దయలేని రాక్షసస్త్రీల యధీనము, దుర్వార రయోద్ధతంబు = వారింపరాని వేగముచే నతిశయించినది, వాహిని = ఏఱు. తేఁకువన్ = ధైర్యముతో.

తాత్పర్యము.

నా ప్రియవల్లభుఁడైన శ్రీ రామచంద్రమూర్తి దర్శనము లేకుండుట యటుండ దయలేని రాక్షసస్త్రీలకు వశపడి మిగుల బాధపడవలసి వచ్చెను. మహావేగమున బ్రవహించు నదీవేగమునకుఁ దెగి పడెడి యొడ్డులవలె నేను మరణింపక యేమి ధైర్యముతోఁ బ్రాణము ధరించి యుండును.

భగవత్ప్రాప్తి లేకుండిన మానును గాక, బాధయైన లేకుండినఁ జాలుననిన నట్లుగాక బాధయు సహింపరాకయున్నది. దీనివలన భగవత్సాక్షాత్కార మగువఱకు సంసారబాధ తొలఁగదని యేర్పడుచున్నది. ప్రకృతి బంధము మన ప్రయత్నముచేఁ దొలఁగునది కాదు. భగవదనుగ్రహమువలననే తొలఁగవలెను.

క. మాన్యునిఁ గృతజ్ఞు నతసౌజన్యునిఁ గమలాక్షు సింహ•సమగతిఁ గృతిమూ
ర్ధన్యుని నా ప్రాణవిభున్, ధన్యులువోఁ గన్నులార • దర్శించు జనుల్. ౬౮౬

అర్థములు. మాన్యుని = పూజింపఁ దగినవానిని, కృతజ్ఞున్ = చేసినమేలు మఱవనివానిని, నతసౌజన్యుని = స్తోత్రముచేయఁబడిన సాధుత్వముగలవానిని. ఈ

మూఁ డాత్మగుణములు. కమలాక్షున్ = కమలములవంటి కన్నులుగలవానిని, సింహ సమగతిన్= సింహము నడకతో సమానమైన నడకగలవానిని, కృతిమూర్ధన్యున్= పుణ్యకార్యములు చేసినవారిలో శ్రేష్ఠుఁ డగు వానిని, ధన్యులు = కృతకృత్యులు, హో = నిజము, నాప్రాణవిభుని పుణ్యాత్ము లందఱు దర్శించుచున్నారుగాని నాకే దర్శించు నదృష్టము లేకున్నది.

ప్రాణములకు విభుఁడు భగవంతుఁడే. అట్టివానిని పుణ్యవంతులు సాక్షాత్కరింపఁ జేసికొను చున్నారు. అట్టివాఁడు నా యందుండినను నేను జూడలేకున్నాను. దీనికి నా పాపమేకదా కారణము.

ఇచ్చట నీ శ్రుతివాక్యములు స్మరింపనగు.

"తమక్రతుం పశ్యతి వీతశోకో
ధాతుః ప్రసాదా న్మహిమాన మాత్మనః॥"
తమాత్మస్థం యేఽనుపశ్యంతి ధీరా
స్తేషాం సుఖం శాశ్వతం నేతరేషామ్
సమానే వృక్షే పురుషో నిమగ్నో
అనీశయా శోచతి ముహ్యమానః
జుష్టం యదా పశ్య త్యన్య మీశ
మస్య మహిమాన మితి వీతశోకః. ॥ముండ॥

ఒక దేహమందు జీవాత్మ పరమాత్మ లిరువురు గలరు. అందు జీవాత్మ సంసారమున మునిఁగి యీశునిఁ గానలేక మోహమున దుఃఖించుచున్నది. అది యెప్పుడు రెండవవాఁడైన యీశ్వరుని దర్శించునో యప్పుడు శోకరహితమైన దగును.

ఇందాత్మగుణములు దేహగుణములు కలిపి చెప్పుటచే సగుణబ్రహ్మమే సేవ్య మని యట్టివాని సాక్షాత్కారము గలవారే పుణ్యాత్ము లని మోక్షార్హులని యేర్పడుచున్నది. "వేదః ప్రాచేతసా దాసీ త్సాక్షాద్రామాయణాత్మనా" యన్నట్లు సాక్షాద్వేదమైన శ్రీ రామాయణము ఎవ్వఁడు గుణవంతుఁడని ప్రారంభించి శ్రీరామ చంద్రమూర్తి యందు ననురాగము గలవారందఱు ముక్తులై రని యుపక్రమోప సంహారము లేకవిధము గల దయ్యెను. అట్టులే పంచమవేదము "నారాయణం నమస్కృత్య నారాయణ కథా మిమా' మ్మని ప్రారంభించి యందు ముఖ్యములైన విష్ణుసహస్రనామములు, భగవద్గీత,సగుణబ్రహ్మముపాసనమే మోక్షసాధనమని నిర్వహించెను. శ్రీ భాగవతము "విశ్వజన్మస్థితి విలయంబు లెవ్వనివలన" నని సగుణ బ్రహ్మముతోనే ప్రారంభించి "హరిం దలంపుమిఁక జన్మము గలుగ"దని ముగించెను. బ్రహ్మసూత్రములు 'బ్రహ్మజిజ్ఞాస'యని ప్రారంభించి 'జన్మాద్యస్య యతః' అని సగుణ బ్రహ్మోపాసనతోనే ప్రారంభించి, యట్టివారికి శ్రుతిప్రమాణమున పునర్జన్మములేదని

'నపుంసకాపృత్తిశబ్దాత్', అని సూత్రించెను. మందబుద్ధియై నిద్దురపోయెడి వాని కాళ్ళకు మ్రొక్కుటకంటె వాఁడే మేలుకొని యుండునపుడు మ్రొక్కుటఫలదాయకము. ఇది సర్వమత సమ్మత మార్గము.

క. వసనాభిఁ దినినవానికి, నసువులు వెయి నిలువనట్టు • లమరసనాథున్
వసుధాపతి నెడఁబాసిన, వసమే నా మేనఁ బ్రాణ•వాయువు లుండన్. ౭౪౭

అర్థములు. వసనాభి=విషము, అసువులు=ప్రాణములు, అమరసనాథున్ = దేవతలతో సమానుఁడు, వసమే=వశమే. అమరశబ్దము వాస్తవమున భగవంతునందే ముఖ్యవృత్తి నన్వయము. దేవతలందు గౌణాన్వయము. దేవతలకు బ్రహ్మకుఁగూడ మరణముగలదు. భగవంతుఁడు మాత్రమే మరణములేని వాఁడు కావున నమరుఁడు. దీపాదుత్పన్న దీపవత్, దీపమునుండి వచ్చిన దీపమువంటివి గదా పూర్ణావతారములు. కావున రాముఁ డమరసనాథుఁడు. వసుధాపతి=భూదేవియు భగవంతుని భార్యయే కదా ! 'హ్రీశ్చతే లక్ష్మీశ్చ పత్న్యౌ' అని శ్రుతి.

తా త్ప ర్య ము.

విషము దినిన వాని దేహమునుండి ప్రాణవాయువులు తమంతటఁ దామే లేచిపోవును. ఆ విధముగ నమరసన్నిభుఁడు భూపతియు నగు నా భర్తను బాసిన నా దేహమునఁ బ్రాణవాయువు లుండునా ?

క. కటకట యింతగ నెటచే, నటమటపడఁ బూర్వజన్మ • మందును నేనే
పటుపాపముఁ జేసితినో, కుటిలాత్మిక నగుచు నదియ • కూర్చెడిఁ గీడుల్. ౭౪౮

తా త్ప ర్య ము.

ఇంత మహాదుఃఖము ననుభవించుటకు నెంత ఘోరపాపమును బూర్వ జన్మమందుఁ జేసితినో ఆ పాపము నన్నిప్పు డిట్లు బాధించుచున్నది. "అత్యుత్కటైః పుణ్యపాపై రిహైవ ఫల మశ్నుతే." అత్యధికమైన పుణ్యముగాని పాపముగాని చేసి యుండిన నీ జన్మమందే ఫలానుభవముగలదు. తక్కినవి మఱుజన్మంబుల ఫలించును.

పూర్వజన్మమునఁ జేసిన పాపము నేఁడిటు లనుభవించు చున్నానని సీతా దేవి చెప్పెనే, ఆమె కర్మవశమునఁ బుట్టినదా ? కాదు. ఈ మాటల రాక్షసస్త్రీల నుద్దేశించి చెప్పఁబడెను. సత్యముగా నుండవలె, వారి కర్థముగాక యుండవలెఁ గావునఁ బూర్వజన్మ మనఁగా బాల్యమని యర్థము. నిన్నరణ్యమునకుఁ బిలుచుకొని పోనని రామచంద్రమూర్తి చెప్పినపుడు నీ వాఁడుదానవుగాని మగవాడవాయని దూషించెను. ఆ పాప మిప్పు డిట్లు బాధించు చున్నదని భావము. బ్రహ్మ, క్షత్రియ, వైశ్యుల కుపనయనముతో రెండవ జన్మము వచ్చును. వైశ్యులకు ద్విజన్ము లనిపేరు. సన్న్యాసాశ్రమస్వీకారము జన్మాంతరము. ఈ కారణములచే బాల్యము జన్మాంతరమే. జన్మాంతర మనఁగా నీ దేహము పోయి వేఱు దేహము వచ్చుటే కదా. ఏడు సంవ

త్సరములకుఁ బరిపూర్ణ నూతన దేహము వచ్చుచుండును. కావున సీతాదేవి యనాలోచిత వాక్యము చెప్పలేదు.

క. ఇక్కరణిని బెనుమోఁఱకు, రక్కసలోక్కటను మూఁగి • రక్షింపంగా
నెక్కడి రాముఁడు నా కిట, దిక్కిదీ చూడ మృత్యు• దేవత దక్కన్. ౧౯

తా త్ప ర్య ము.

ఈ విధముగ మూర్ఖపు రాక్షసస్త్రీలు గుంపుగఁ జేరి యందఱు నాపైఁ గావలి యుండ నెక్కడి రాముఁడు ? ఎక్కడి నేను ? ఆయనవచ్చి రక్షించునని యేమి నమ్మకము ? కావున మృత్యు దేవతయే నాకు దిక్కు.

భక్తుఁడు తన యోర్పు ఓపిక సర్వస్వము ధారవోసియును భగవంతుఁడు సాక్షాత్కరింపఁడేని "కలఁడు కలం డనెడివాఁడు కలఁడో లేఁడో" యను సందేహ మొకానొకవేళ గలుగును. ఈ సందేహ మనునది వ్యతిరేకముగఁ బరిణమింపరాదు. నే నింత శ్రమించి కష్టకష్టముల కోర్చినను భగవంతుఁడు సాక్షాత్కరింపలేదు. కావున నాస్తికునివలె భగవంతుఁడు లేఁడనుకొనరాదు. నాయం దేదో లోపమున్నది. దాని వలనఁ గానరాలేదని తలఁపవలయును.

క. ఛీ మనుజ జన్మ మేటికి, ఛీ మఱి పరవశ్య మైన • చెనఁటిబ్రతుకు నే
లా ? మదిఁ దలంచినప్పుడ, యే మరణముఁ బొంద రాదు • యేర్పడెఁ గంటే.

అర్థములు. పరవశ్యము = పరులకు స్వాధీనపడియుండునది. మనుజ జన్మమేటి కనుటచే దేవతగా నుండు నేను అకర్మవశతఁ గార్యార్థమై మనుష్యస్త్రీగాఁ బుట్టుటయుఁ దప్పనియే తోఁచుచున్న దని భావము. 'మానవానామిదం పథ్య' మ్మన్నట్లు దీని నూహించునది. మనుష్యజన్మ మేల నింద్య మనిన నది పరవశమైన బ్రదుకు గావున సంసార బద్ధుఁడైన జీవుఁడు స్వతంత్రించి చచ్చినను అసురలోకములు దప్పవు. స్త్రీ పర్యాయంబున నేను బతివ్రతను, భర్తకుఁ బరాధీనురాలను. ఈ దేహము, జీవము భర్తదిగాని నాదికాదు. దీనిని బోఁగొట్టుటకుఁ జెఱుచుటకు నా కేమి యధికారము గలదు ? కావునఁ బతియాజ్ఞలేక చచ్చుటకు నధికారములేని యీ యస్వతంత్రపు బ్రదుకు పాడు బ్రదుకు గదా యని భావము. సర్వం పరవశం దుఃఖం, సర్వ మాత్మ వశం సుఖ మ్మని స్మృతి కలదు గదా.

తా త్ప ర్య ము.

మనుష్యజన్మ మేమి పాడుజన్మము. ఛీ ఛీ. అందుఁ బరవశమైన బ్రదు కేమి బ్రదుకు. తలఁచినపుడు చచ్చునట్టి యధికారము కూడ లేదాయెఁగదా.

దీని వలన మనుష్యులు సుఖమో దుఃఖమో ప్రారబ్ధ మనుభవింప వలయునే కాని బలాత్కారమరణముచే దానిని దప్పించుకొన యత్నింపరాదని యేర్పడు చున్నది. దేహి కట్టి యధికారములేదు. అనుభవశేష మెప్పటికైన ననుభవింపవలసి

నదే. రాజదండితుఁడైన కారాగృహవాసి చెఱసాలనుండి తప్పించుకొనిన వంతతో ఉపమింపఁబడునా ?

—• ౨౬-వ సర్గము. సీతాదేవి శ్రీరాముని దలంచుకొని దుఃఖించుట. •—

ఉ. వెండియు నిట్టు లేడ్చుఁ బృథి•వీసుత యానతవక్త్రపద్మ యై
దండిగ బాష్పవారి ముఖ•తామరసంబున నావరింప గో
త్రం దొరలాడు గోడిగవి•ధంబున నొప్పుచుఁ బిచ్చి యెత్తిన
ట్లుండి ప్రమత్తరీతిఁ దన•యుల్లము భ్రాంతి మునింగినట్లుగన్. ౬౫౧

అర్థములు. ఆనత = వంపఁబడిన, వక్త్రపద్మయై = ముఖకమలము గలదై దొరలు = దొరలు, రెండు రూపంబులును గలవు. ఇట్టివే దొంగ దొంగలోనైనవి. గోడిగ=ఆఁడుగుఱ్ఱము. దొరలాడు గోడిగ యనుటచే నింతవఱకుఁ గొమ్మపట్టుకొని నిలఁబడిన సీతాదేవి యిప్పుడు నేలఁబడి పొరలాడుచున్నదని భావము. దేహికి దుఃఖమా దుస్సహ మాయెను. అది తప్పించుకొనుటకు బలవంతముగ మరణించుటకు నధికారము లేదాయెను. ఇఁక నీ దుఃఖము వాయునెట్లు ? ఎన్నాళ్ళని యీ దుఃఖ మనుభవింపవలె ననిన దాని కుపాయ మిఁక సీతాదేవి చేసినట్లు రామచంద్రమూర్తిని దలఁచుకొని తలఁచుకొని సర్వదా ధ్యానించుట గుణవర్ణనము చేయుట నిర్వేద పడుటయే కాని వేఱుపాయము లేదు. దీనికే యభ్యాసయోగ మని పేరు.

"తచ్చింతనం తత్కథన మన్యోన్యం తత్ప్రబోధనమ్
ఏకాంతే తత్పరత్వంచ తదభ్యాసం విదు ర్బుధాః" అధ్యాత్మరామాయణము.
"అథచిత్తం సమాధాతుం నశక్నోషి మయి స్థిరమ్
అభ్యాస యోగేన తతో మా మిచ్ఛాప్తుం ధనంజయ."

యని భ॥ గీ॥ ౧౨-౯ భగవంతు డుపదేశించెను.

ఇరువదినాలుగు గంటలు యావజ్జీవము సమాధియం దుండలేనివారి కిదియే యవ్యవధానమైన యుపాయము. ఈ తీవ్రనిర్వేదఫల మాచార్యప్రాప్తి. అది ముందు చెప్పఁబడును.

అంతవరకుఁ ద్యాగము, మహావిశ్వాసము, చింతనము కార్యములు. ఉత్తరీయము తోడ సర్వాభరణములు తీసివేయుటచేఁ ద్యాగము చెప్పఁబడెను. మహావిశ్వాసము చింతనము ముందు తెలియగలవు.

తా త్ప ర్య ము.

సీతాదేవి తలవంచుకొని కన్నుల నీళ్ళు దండిగఁ గాఱుచుండఁగా నేలఁబడి పొరలాడు నాఁడుగుఱ్ఱము వలెఁ బిచ్చి యెత్తినట్లు పిశాచము సోకుటచే దేహము తెలియనిదానివలె మనస్సు దిగ్భ్రమ గొన్నదానివలెనై మఱియు నిట్టులేడ్చుచున్నది

ఇందుఁ దమ మన స్సంతయు భగవంతునిపై నుంచిన భక్తప్రపన్నుల దశ వర్ణింపఁ బడెను. 'బాలోన్మత్త పిశాచ దశాలంబన' మన్నట్లు లతీత

భక్తియుక్తుఁడు 'బాల్యేన తిష్ఠాసేత్' అన్నట్లు బాలునివలె దేహాభిమానము విడిచి నేలఁబడి పొరలాడును. పిచ్చిపట్టినట్లు, దయ్యము పట్టినట్లు, వీఁడి గుడ్డయు నుండు నది పోవునది తెలియక వర్తించును. సీతాదేవి స్థితి యిట్లుండెను.

సీ. రాముఁ డేమఱి యుండ • కామరూపాశరుం, డేన్పు చుండఁగ నన్ను • నీడ్చి తెచ్చె
నీ రక్కసులచేతి • కిటు చిక్కి వీరలు, తర్జింప నెబ్బంగిఁ • దనువుఁ దాల్తుఁ
బ్రాణంబు లేటికి • నర్థంబు లేటికి, భూషణంబు లవేల • పొక్కవేళ
రామచంద్రునిఁ బాసి • రాక్షసీమధ్యంబునన్ వందుచుండఁగ • నాదుగుండె

తే. యినుపచిట్టెము గాక నా • హృదయమునకు
ముదిమియును జావు లే వొకో • పదముదంబ
నయ్యు దుఃఖంబుచే నది • యవిసి పడదు
కటకటా నాదు దౌర్భాగ్య • గరిమ నేమొ. ౭౪౨

అర్థములు. రాముఁడేమఱి యుండన్ = రామచంద్రమూర్తి నా రక్షణమం దజాగ్రత వహించిన వాఁడగుటచేత, కామరూపాశరుండు = కోరిన రూపము ధరింప గల రాక్షసుఁడు. సన్న్యాసివలె నైన రావణుఁడు. పదముదంబను = నలగినదానను. రామచంద్రమూర్తి ప్రమాదముచే నాకీ గతి గలిగెను. తానేకదా పొమ్మని నందు నేమో పూర్ణముగా వదలి పొమ్మనెనా ? కనుచూపు దూరము దాటఁగానే సీతను విడిచి నేను దూర మెట్లు పోదు నని తలఁచి మృగమును జంపి యుండరాదా! మరలి వచ్చియుండరాదా! అనఁగా భగవత్కటాక్షము దూరమయ్యె నేని యాపదలు తప్పక వచ్చును సూర్యకిరణములు దొలఁగనేని చీఁకటి వచ్చును. కోరిన రూపము ధరింపఁ గలది నిత్యవిక్రియ యగు ప్రకృతియే.

తాత్పర్యము.

రామచంద్రమూర్తి నా విషయమునఁ బ్రమాదపడుటచేతఁ గోరిన రూపము ధరింపఁ గల రావణాసురుఁడు నే నేడ్చుచున్నను బలాత్కారముగ నీడ్చి తెచ్చెను. ఇప్పు డీ రాక్షసులచేతఁ జిక్కి మరల రామ ప్రాప్తి నాకు లభింపఁ జేయకుండుటకై నేను భయపెట్టఁ బడుచుండఁగా నే నే విధముగా దేహము ధరింతును! నేను ప్రాణములు ధరించుట రామసేవానిమిత్తమే. నా ధనము రామకైంకర్యార్థమే. నా సొగసులు రామ సంతోషార్థమేగాయుండ నాయన లేక నే నేడ్చునవుడు నా కివన్ని యేల? ఎవరి కివి యుపయోగపెట్టుదును! రాక్షసస్త్రీల నడుమ నేను దుఃఖించుచుండ నా గుండె పగిలిపోక యున్నది. అది యినుప చిట్టెమేమో, లేక నా హృదయమునకు ముసలితనముగాని చావుగాని లేదేమో. అట్లుండినమొదల నే నింత తీవ్రశోకాగ్నిచే నలఁగియున్నను అది పగిలి పెటిలి పడక యుండునా ? గుండె యట్లు పోకుండుటకు స్వభావగుణము కారణముగాదు. గుండెలు పగిలి చచ్చిన వారెందఱు లేరు. నా నిర్భాగ్యదశ దాని నట్లు పోకుండ జేయుచున్నది.

తే. పాపజీవిత నయి రామ•భద్రుఁ బాసి, మొదలఁ బ్రాణంబులను నిల్పి • యున్నదాన
ఛీ యనార్యను నసతిని•శీలహీన, నేమి బ్రదు కిది తలఁప నా•కేమి వ్రతము. ౬౫౩

తాత్పర్యము.

రామచంద్రమూర్తి నా విషయమునఁ బ్రమాదపడెను. నన్ను విడిచిపోయె నని నే నేల యనవలె? ఆయన యట్లు పోవుట కేమి కారణము? నేను పాపజీవిత నగుటయే కారణము. నేను పుణ్యాత్మురాల నై యుండిన నే నేల పొమ్మందును. ఆయన యేల పోవును? ఆ పాపబలము చేతనే ప్రాణములను విడువలేక దేహమందు నిలిపియున్నదానను. ఎప్పుడు నేను దేహమం దభిమానముచేఁ బ్రాణములను నిలిపితినో యప్పుడు నే ననార్యను. ఆర్యనుగాను. పతివ్రతనుగాను, సదాచారవతిని గాను. అయి యుండిన నాకీ కష్టము వచ్చియుండదు. ఇట్టి శీలాదులు లేని దిక్కుమాలిన బ్రదుకేమి బ్రదుకు నా పతివ్రత మేమి వ్రతము! అది పర్యాప్తమైనది కాదు.

మ. తిననీ వీరలు నా శరీరమును వ్రీ•లిం, దీర ఖండింపనీ
మనఁజాలం జతురర్ణవీవలయిత•క్ష్మాభర్త నా భర్తఁ బా
సి నితాంతంబు దురంతమైన వ్యథ గా•సిం బొందు చే నిట్టి రీ
తిని సౌఖ్యంబులు గోరుదానవె? కదుం • దీపో కదే ప్రాణముల్. ౬౫౪

అర్థములు. తిననీ=తిననిమ్ము, "ఇచ్చుటకు సర్వత్ర ఈయయగు." తిననీయుము. తిననిమ్ము, తిననీ యని రూపంబులు తిననివ్వని యనునది గ్రామ్యము. ఇచ్చుటకు 'ఇవ్వ' శాస్త్రసమ్మతముగాదు. మనఁజాలన్ = బ్రదుకలేను, చతురర్ణవీ = నాలుగు సముద్రములచే, వలయిత=చుట్టఁబడిన, క్ష్మా=భూమికి, భర్త=పతి, నితాంతము = మిక్కిలి, దురంతము = అంతములేని.

తాత్పర్యము.

రామచంద్రమూర్తి సేవ మఱల లభించు నను నాశతో దేహమునందు అభిమానము వహించి ప్రాణములను దేహమున నిలిపితిని. అది యేమో యాశలేదాయె. ప్రాణమా బలవంతముగ విడువరాదాయె. దుఃఖములా సహింపరానివాయె నే నేమి చేయుదును? ఈ రావణుఁ డొక్క సముద్రముచేఁ జుట్టఁబడిన యొక ద్వీపమున కధిపతి. నా భర్త నాల్గు సముద్రములచేఁ జుట్టబడిన భూమితలమున కంతయు నధిపతి. అట్టివానిని విడిచి మిక్కిలి యంతములేని దుఃఖముపాలై నేను బ్రదుకలేను. కావున నీ రాక్షసులు నా దేహమును చీల్చి తిందురా తిననిమ్ము. ముక్కలు ముక్కలుగా నఱకుదురా, నఱకనిమ్ము. ఈ బాధకంటె నది గొప్ప బాధగాదు. ఇంత దీర్ఘకాల బాధయుఁ గాదు. ఇట్టి స్థితిలో నాకు మంచాలు పఱుపులు దిండ్లు సొగసులు కావలయునా? ఈ పాడు ప్రాణ మింత తీపా?

దీనివలన భక్తునిమనస్సు భగవంతునిపై నుండవలెఁగాని సౌఖ్యములపై నుండ నీయరాదని యేర్పడుచున్నది.

ఆ. ఎడమ కాలిగోర • నేనియు రావణుఁ దాఁకుదానఁ గాను • దథ్య మింత
యతని వలతు ననుట•యది యేటిమాట యిస్సీ మెఱుంగఁడతఁడు•చెనఁటియగుట.

తా త్ప ర్య ము.

రావణాసురుని నే నెడమకాలి గోటనైనఁ దాఁకు దానఁగాను. ఇది సత్యము. ఇఁక వానిని ప్రేమింతు ననుట యేమి మాట? ఛీ యింతమాత్రము వాఁడు తెలిసికొన లేకయున్నాఁడు. దీనికి వాఁడు సిగ్గువిడిచిన దుష్టుఁడగుటయే కారణము.

ఉ. తిట్టి తిరస్కరించిన మ•దిం దెలియండు, తలంపలేఁడు దాఁ
బుట్టిన వంశముం బరువుఁ • బోణిమియుం, దనుఁ దా నెఱుంగఁ డా
కట్టిఁడి, నన్ను వేఁడెడిని • గ్రౌర్యరతుం డయి, యేమి చేయుఁ దన్
గట్టి యముండు పాశముల • గట్టఁగ సిద్ధుఁగఁ జావనున్నడన్. ౬౫౬

తా త్ప ర్య ము.

నన్నుఁ దాఁకుటకే యిష్టములేనిది నన్ను మోహించునా! యను జ్ఞానము లేదు. అంతటి యూహాబలము లేకుండినఁ బోని, నోరారఁదిట్టి ఛీ పొమ్మని ధిక్కరించి నను దెలిసికొన లేకున్నాఁడు. అంతియగాక తా నెటువంటి వంశమునఁబుట్టెను? దాని గౌరవమేమి? తా నెటువంటి వాఁడు? తన గౌరవమేమి? ఇట్లు పిత్రార్జితము స్వార్జితమైన గౌరవమునైన నాలోచించి, ఛీ మన గౌరవమేమి? ఈ యాఁడు దానిచేత నీ చీవాట్లేమి ? యని నైనఁ దలఁపలేక క్రూరుఁడై బెదరించి నన్ను వశపఱుచుకొనఁ జూచుచున్నాఁడు. ఇది వాని దోషమా? కాదు. యముఁడు పాశములువేసి యీడువగాఁ జచ్చుటకు సిద్ధముగా నుండువాని కిటువంటి బుద్ధి గాక మంచిబుద్ధి చక్కని యాలోచన యెట్లు కలుగును. కాలబలముచే వాఁ డట్లు చేయుచున్నాఁడు.

—• సీతాదేవి రాక్షసస్త్రీలకుఁ బరుషంబుగఁ బ్రత్యుత్తర మిచ్చుట. •—

క. కోయుఁడు కడికండలుగా, వ్రేయుఁడు కత్తులను రోష•వివశత నన్నన్
ద్రోయుఁడు మండెడుమంటల, మీ యుక్తుల విన ని టుల • మిడిసిపడంగన్. ౬౫౭

అర్థములు. కడికండలు = తునుకలు తునుకలు, కడికిఁ జాలినంత తునుకలు-నోటఁ బెట్టుకొనుటకుఁ జాలినంత చిన్న ముక్కలు, మిడిసి పడంగన్ = మిట్టిపడఁగా

తా త్ప ర్య ము.

మీ నోళ్ళు పట్టునంత చిన్న తునుకలుగాఁ గోసెదరా కోయుఁడు. కోపించి కత్తులతో నఱకెదరా నఱకుఁడు. మంటలలో వేసి కాల్చెదరా కాల్చుఁడు. మీ యిష్టమేమైనఁ జేయుఁడు. నేను మీ మాటలు విననను. ఏల మీరీ గర్వమున మిట్టిపడెదరు? నా దేహము మీకు వశము. మీ యిష్టమువచ్చినట్లు చేయుఁడు. మనస్సునా స్వాధీనము. దానిని మీ రేమియుఁ జేయఁజాలరు. అని రాక్షసస్త్రీలకుఁ దెగ జెప్పి మఱల రామధ్యానము చేయుచున్నది.

సీ. తనవారిపట్లను • జెనుదోస మండిన, గుణము మాత్రముఁ గను • గుణధనుండు
ఇంచుక యుపకార • మెవఁడు చేసిన దాని, విస్మృతి నొందని • విజ్ఞతముఁడు
తన్ను నమ్మినవాని • ఖిన్నతకై తాను, విరవిర లాడెడి • కరుణగలఁడు
అన్యుల యభివృద్ధి • నాత్మఁగోరుచు నుండు, నిర్మలచిత్తుండు • నిపుణతముఁడు

తే. పదియునాలుగు వేల దు•ర్మదుల నొంటిఁ, జంపె రాక్షసులను జన•స్థానమునను
నట్టి నా ప్రాణభర్త దా•నిట్టికరుణ, మాలుటయునాదుదౌర్భాగ్య•మహిమ నేమొ.

తాత్పర్యము.

రామచంద్రమూర్తి నన్నుపేక్షింప నేమి కారణము ? ఆయన దయాగుణ విహీనుఁడా ? యనినఁ గాఁడు. నీ వాఁడను అనిన వారియం దెన్ని గొప్పదోషము లుండినను వానిని లెక్కింపక వారి యందుండు మంచిగుణము మాత్రము గ్రహించు కల్యాణ గుణములు గలవాఁడు. ఇట్టివాఁడు నా దోషము లెన్నునా ! (చూ. యుద్ధ. ౩౫౫) ఎంత కొంచె ముపకార మెవరొకటియైనఁ జేసినను దానిని మఱవని కృతజ్ఞుఁడు. ఇట్టి వాఁడింతకాలము నిర్వంచనముగాఁ దనసేవ చేసిన నన్ను మఱచునా ? (చూ. అయోధ్య. ౧౧ ప.)

తనయందు విశ్వాసముగలవారి కేదైన దుఃఖము ప్రాప్తించెనా ఆ దుఃఖము తనకు వచ్చినట్లు ఖేదపడువాఁడు. ఇట్టివాడు తన్ను నమ్మి తనతోడఁ దన నిమిత్తమై యడవుల పాలైనదాని విషయమున బరితాప పడకుండునా ! (అయోధ్య.౫౫) పరుల యభివృద్ధిఁగోరి యింకను నెవరెవరిని బాగుపఱుతునా యని సర్వజన శాశ్వత సౌఖ్యము గోరు వారి కది (ముక్తి) లభింపఁ జేయువాఁడు. ఇట్టివాఁడు నా మేలు గోరఁడా ? (అయోధ్య. ౫౫) తన్ను రక్షించు సామర్థ్యములేక యూరకున్నాఁడా యనినఁ బదునాలుగువేల దుష్టరాక్షసులను జనస్థానమం దొంటిగఁ జంపెనే. అట్టి వాఁడు తమ్ముఁడు కూడఁ దోడై యుండఁగా నీ రాక్షసుని జంపుట గొప్పకార్యమా ? కాఁబట్టి యిన్నికారణము లాలోచింపఁగా నామీఁద నాయనకు దయరాకుండుటకు నా దురదృష్టమహిమయే కారణము. ఇట్టి భావము వాస్తవభక్తుని లక్షణము. భక్తుఁడు భగవత్కటాక్షము తన యందు రాదేని భగవంతుని తప్పు పట్టఁడు. ఆయన కటాక్షము వచ్చునంత యోగ్యత తనయం దింకను గలుగ లేదు. కావున ఆయన కటాక్షము వచ్చుటకు నాయందుఁగల లోపములను బూర్తిచేసి కొనద నని తన్నుఁ దాను దప్పు పట్టుకొనునే కాని తాను జేయ వలసిన దంతయుఁజేసి పూర్ణభక్తి సంపాదించి కొనినట్లు భగవంతుఁడు కఠినుఁడై యనుగ్రహింపనట్లు భావింపఁడు. ఎవఁడు తాను బూర్ణభక్తుఁ డని తలఁచునో వాఁడు భక్తుఁడుగాఁడు. వాస్తవ భక్తున కింకను భగవత్సేవ చేయుటబోయితినే యని యుండునేకాని వాఁడు సేవయందుఁ దృప్తి వహింపఁడు. ఇది భక్తస్వభావము.

సీ. నన్నిట్టు లరికట్టు•ని స్నీచబలుఁ ద్రుంపఁ, జాలియు న న్నేల • నేల రాఁడొ ?
దండకను విరాధు • దండించినట్టి ప్రాగ్రణి న న్నేల • యరయ రాఁడొ ?
ఖరదూషణాదుల • ఖండించి నైచిన, శూరుండు న న్నేల • చూడ రాఁడొ ?
రక్కసుచేతిలోఁ • జిక్కిన ప్రియురాలిఁ, బ్రోయాలి న న్నేల • ప్రోవ రాఁడొ ?
తే. యుదధిమధ్యంబునను లంక•యుండుఁగాక, యన్యులకు నెల్లదుస్సాధ•మగునుగాక
మహిమ జగముల నెందును•మాఱులేని, రామబాణంబులకు నడ్డ•మేమి గలదు ?

తా త్ప ర్య ము.

రామచంద్రమూర్తి శక్తిచాలక తన్ను రక్షింప రాలే దనుట సరిగాదని కొన్ని దృష్టాంతములచే నిరూపించు చున్నది.

న న్నీ ప్రకారము నిర్బంధించి బాధపెట్టు నల్పబలుఁ డగు రావణుఁ జంప నేల రాకున్నాఁడు ? నా నిమిత్తమైకదా దండకాటవియందు విరాధుని వధించెను. నా నిమిత్తమై కదా ఖరదూషణాదులను సంహరించెను. అటువంటివాఁడు తనకుఁ బ్రియురాలను, ఇల్లాలను (ప్రోలు+ఆలు=ప్రోయాలు) నన్నేల రక్షింప రాకున్నాడు. అప్పుడు వారందఱు ముఖాముఖ మెదుటఁబడిరి. గావునఁ జంపఁ గలిగెను. వీఁడు సముద్రమధ్యమునఁ గానరాకున్నాఁడు. కావునఁ జంపఁలేఁ డందునా ? లంక సముద్ర మధ్యమున నుండిన నుండుఁగాక. ఇతరుల కిచ్చటికి వచ్చుట యసాధ్యమైన నగును గాక. మూఁడులోకములందును నడ్డములేని రామబాణములకు నీ సముద్రమా యడ్డము.

విషజలాప్యయాత్ వ్యాళరాక్షసాత్ వర్షమారుతా ద్వైద్యుతానలాత్
వృషమయాత్మజాత్ విశ్వతోభయాత్ వృషభ తే వయం రక్షితా ముహుః॥

అను గోపికల వాక్యము స్మరించునది. కృష్ణసాన్నిధ్యమునకై రుక్మిణీ గోపికల పరితాప మెట్టిదో సీతాపరితాప మట్టిదిగా నెంచవగు.

ఉ. సందియ మయ్యె నా విభుఁడు • చాలఁడు నే నిట నుం టెఱుంగ, నీ
చంద మెఱింగి యున్నయెడ • సైచునె మానధనుండు; రామ! నీ
సుందరి రావణాసురుఁడ • సుమ్ము హరించె న టంచుఁ జెప్పఁడే
మందల వీడ కున్న నస•మానబలుం డల గృధ్రనాథుఁడేన్. ౬౬౦

అర్థములు. మానధనుండు = మానమే ధనముగాఁ గలవాఁడు. మందల= బ్రదుకుపాటు, జీవితము.

తా త్ప ర్య ము.

నాయం డెంతయో ప్రేమగలవాఁడు, ఎన్ని యాపదలనుండియో నన్ను రక్షించినవాఁడు. నేఁడు నామీఁద దయతప్పినాఁడని కాని, శక్తిచాలక యూరకున్నాడని చెప్ప సాధ్యపడదు. అయిన నేల యూరకున్నాఁడు? నే నెచ్చట నుండునది యాయనకుఁ దెలియదని నా సందేహము. ఆ కారణముచే నూరకున్నాఁడుగాని, తెలిసియుం

టిన పౌరుషశాలి తనభార్యను బరుఁ డపహరించె నన్న యవమానము నెట్లు సహించును? సహింపఁడు. భార్తిగాఁ దెలియక యూరకున్నాఁడా యనిన నట్లు చెప్పుటకు వలను పడదు. ఏలన జటాయుప్రాణము పోకయుండెనా యాయన నీ భార్యను రావణాసురుఁడు హరించె నని చెప్పకుండునా? చెప్పియే యుండును గాని రామచంద్ర మూర్తి వచ్చువఱకు నతఁడు జీవించి యుండునో లేదో.

ఉ. అంతము నొందఁ జేసె నసు•రాగ్రణి వీరు జటాయుఁ బట్టి, వా
 డెంతటి తెంపు చేసెఁ గడు•వృద్ధుఁడు నయ్యును, ద్వంద్వయుద్ధమం
 దింతల నంతలం జనక • యేడ్తెఱ చూపె మదర్థ, మక్కటా
 యెంతకు లేఁడు నాదు దుర•దృష్టమ కాలముగాదు వానికిన్. ౬౬౧

అర్థములు. అంతము = మరణము, ఇంతల నంతలన్ = కొంచెపుఁ బ్రయత్నముతో, ఏడ్తెఱ = పరాక్రమము, మదర్థము = నా నిమిత్తము, ఎంతకులేఁడు= ఎంతకార్యమైనను జేయజాలనివాఁడా ? కాలము. = అనుకూల కాలము.

తా త్ప ర్య ము.

మీఁది యాలోచన క్రమమందు జటాయువు స్మరణమునకు రాఁగా వానిని గుఱించి యనుకొనుచున్నది. రావణుఁడు వీరుఁడైన జటాయువును జంపెనుగాని, వాఁడు ముసలివాఁ డయ్యును ఎంతసాహసము చేసెను. నిరాయుధుఁడై ద్వంద్వయుద్ధమందుఁ దన పరాక్రమ మంతయుఁ జూపెనుగాని, కొంచెముతో వీనిని విడిచెనా ? వాఁ డేకా నెంతదైనఁ జేసి జయించియుండును. నా దురదృష్టముచేతఁ గాలము వాని కనుకూలించి వచ్చినదికాదు.

సర్వం కాల మపేక్షతే విధివశాత్ నైవాస్మికాలక్షమః॥
 చండకౌశికమందు హరిశ్చంద్ర వాక్యము

ఉ. నాయిట నుండు జాడ రఘు•నాయకుఁ డింత యెఱింగెనేని య
 త్యాయతకోపఘూర్ణహృద•యంబున లోక మరాక్షసంబుగాఁ
 జేయఁడె ? యానిమేషమున • సింధువునం బెనుదుమ్ము రేపఁడె ?
 మాయఁగఁ జేయఁడే ఖలుని•మానముఁ బ్రాణము నామముం బురిన్. ౬౬౨

అర్థములు. ఇంత = రావణాసురుఁడు నీ భార్యను హరించెను అను మూఁడు మాటలు మాత్రము, అత్యాయత = మిగుల విస్తారమైన, కోప = కోపముచే, ఘూర్ణ = తిరుగుచు నుండుచున్న, హృదయంబునన్ = మనస్సుచే, అరాక్షసము = రాక్షసులు లేని దానిఁగా, సింధువునన్ = సముద్రమందు.

తా త్ప ర్య ము.

నే నీలంకలో నున్నదాన నను మాట మాత్రము తెలిసినవాఁడయ్యెనా రామచంద్రమూర్తి మిగులఁ గోపించినవాఁడై లోకమున రాక్షసుఁ డనువాఁడు లేకుండ జేయకుండునా? ఈ నిమిషమున సముద్రము నీళ్ళన్నియు నిగిరించి దుమ్ములు రేఁగునట్లు

చేయఁడా? ఈ దుష్టుని మానము ప్రాణము పేరు లంకాపట్టణ మనువానిని రూపు మాపఁడా? కావున నిప్పటి కాయనకుఁ దెలియదనియే తలఁచెదను.

క. అప్పుడు గద రాక్షససతు, లిప్పుడు నే నేడ్చురీతి • నిం టింట నెలుం
గొప్పఁగ విధవాకృతులన్, గొప్పగ నేడ్చెదరు గోలు•గోలున సతతమున్. ౬౬౩

అర్థములు. సతతమున్ = ఎల్లప్పుడు, జీవించి యుండువఱకు, నే నిప్పు డల్పకాల మేడ్చిన వారు కలకాల మేడ్తురు.

తాత్పర్యము.

ఈ రావణుని నూరుపేరు లేకుండ నెప్పుడు రామచంద్రమూర్తి ధ్వంసము చేయునో యప్పుడు నే నిప్పు డేడ్చు విధముగా రాక్షసస్త్రీ లింటింటఁ బెద్ద గొంతుకలతో లబో దిబో యని విధవలై యావజ్జీవ మేడ్చుచుండెదరు.

చ. ఉడిగెడువాఁడు కాఁడు పురు•షోత్తముఁ డేగతి నైన నాదు పో
బడిఁ గనిపట్టి యిచ్చటికి • వచ్చుట సత్యము, వచ్చినంత నా
కడిఁదిబలాఢ్యులం గని క•కావిక లై చనువారు గాక క్రము
క్కఁడి సురవైరులా యసురు • గాచుకొనం గలవారు మూర్తమేన్. ౬౬౪

తాత్పర్యము.

రామచంద్రమూర్తి చూచుటకు ముందే జటాయువు మరణించె నను కొందము. ఆయన నా వార్త చెప్పలే దనుకొందము. అంతతో నావార్త రామచంద్రమూర్తికిఁ దెలియకయే యుండునా ? ప్రస్రవణగిరి యాశ్రమ సమీపమందే కదా యున్నది. ఏటి వెంట వెదకుచు వచ్చిన నచ్చటఁ జచ్చిన జటాయువు కనఁబడియుండడా? రావణుని సారథి, చామరములు ధరించిన వారు, తేరులోనైనవి నేను బాఱవేసిన భూషణములు కానరాకయుండునా? వీనినిఁబట్టి యెవ్వఁడో రాక్షసుఁడు నన్ను హరించెనని యూహింపలేఁడా? అంతమాత్ర మనుమానము కలిగిన నెవఁ డీ రాక్షసుఁ డని పోఁబడి తీయకుండునా! వానరుల ముందట సొమ్ములు వైచితినే, వారెవ్వరైనఁ జెప్పియుండరా! ఇంతకాలమునకు నావార్త చెప్పువారే లేక యుందురా! కాఁబట్టి యెట్టులైన నే నిందున్నానని తెలిసి యిచ్చటికి వచ్చుటయే సత్యము. అది తప్పదు. అబలశాలులు రామలక్ష్మణు లిచ్చటికి వచ్చిరా యీ రాక్షసులందఱు చెల్లాచెదరై పరువెత్తుదురే కాని తమ ప్రాణములను క్షణమైనఁ గాపాడుకొనఁగలరా ?

ఆ. పాడెరాసు లుండ • బాటల నిండఁగఁ, బొగిలి కాలు పీన్గు•పొగలు మింట
నెడము లేక యూడు • గృధ్రాళిగూడ నీ,వీడు వేగ వల్లె•కాడు కాదె. ౬౬౫

అర్థములు. వీడు = పట్టణము, వల్లెకాడు=శ్మశానము, పొగిలి = కుమిలి.

తాత్పర్యము.

స్పష్టము.

క. తూర్ణంబ నాదుకోరికి, పూర్ణం బగుఁ, జెడెడివారు • పొలఁతులు! మీ మీ
దుర్ణయముల మీరే యిది, నిర్ణయముగ వినుఁడు వెండి•నిజము గనుఁడీ. ౬౬౬

అర్థములు. తూర్ణంబ = శీఘ్రముగ.

తా త్ప ర్య ము.

ఓ స్త్రీలారా ! నా కోరిక త్వరలోనే నెఱవేఱును మీ మీ చెడు కార్యముల మీరే చెడిపోదురు. ఇది నిశ్చయము. ఇప్పుడు వినుఁడు. తరువాత నిజమైనపుడు చూడుడు.

ఇది యంతయు దేహేంద్రియముల కన్వయింపవలెను.

చ. చెలఁగెడి నిప్పు డీ పురిని • జేటును దెల్పెడు పెక్కులక్షణం
బులు, నిజ మీ పురంబు చెడి•పోవును నిష్ప్రభమై, దశాననుం
డిలుగ దురాసదం బయిన•యీ నగరంబు ముహూర్తమాత్రలో
పల సొబగా తెడిం గొమరుఁ• బ్రాయపురండను బోలి, చూడుఁడీ. ౬౬౭

అర్థములు. నిష్ప్రభమై = కాంతిహీనమై, ఇలుగన్=ఈలుగన్=చావఁగా, దురాసదంబు = ఇతరులకు లభింపనిది, కొమరుఁ బ్రాయపురండ = లేత వయసు విధవ.

తా త్ప ర్య ము.

. ఈ పురము పాడైపోవు లక్షణములు పెక్కులు కానవచ్చు చున్నవి. ఈ యూరు కాంతిహీనమై చెడిపోవుట నిజము. ఇతరులకుఁ బ్రవేశింప సాధ్యముగాని యీ పురము స్వల్పకాలమున బాలవిధవవలె నందము చెడిన దగును. చూచు చుండుఁడు. 'వ్యభిచారరతా నారీ బాలరండాతు జాయతే' పోయిన జన్మమున అంకాడిన స్త్రీ యీ జన్మమున బాలవిధవ యగును. అట్టులే యీ పురమింకను నెంతోకాలము బాగుండవలసిన దయ్యును నిందు వ్యభిచారము లెక్కువగుటచేఁ ద్వరలోనే పతిహీనమై పాడగును.

క. భాసురపుణ్యోత్సవములు, వాసిగ శుభలక్షణములు • పాయుచు విధవా
వాసం బగుచును బూర్వసు, వాసినివలె నుండు లంక•పతి మరణింపన్. ౬౬౮

అర్థములు. విధవావాసము = ముండలకు నెలవు, పూర్వసువాసిని = ముందు ముత్తైదువుగా నుండునది. అనఁగా నిప్పుడు విధవ.

తా త్ప ర్య ము.

పతియగు రావణుఁడు చచ్చిన కారణముచే నీలంక పుణ్యోత్సవములు శుభ చిహ్నములు పోయినదై పుణ్యములగు పండుగలు పసుపు కుంకుమ కాటుక గంధము కమ్మలు పాపట మొదలయిన శుభలక్షణములు పోయిన విధవవలె విధవల కునికి పట్టైయుండును.

క. తడ వింక లేదు ఘోరం, బడఁతులు బిడ్డా యటంచు • మగఁడా యనుచున్
గొడుకా యని యింటింటను, బిడుక న్నే వినఁగఁ గలను • మెలఁతుకలారా !

అర్థములు. తడవు = జాగు, ఘోరంబడఁతులు = రాక్షసస్త్రీలు, బిడుకన్ = దుఃఖింపఁగా.

తా త్ప ర్య ము.

స్పష్టము.

క. దిగ్గాము లెఱుఁగ హతపల, భుగ్ధీరము నిష్ప్రభంబు • పుర మగును నసం
దిగ్ధము రఘువరశరశుచి, దగ్ధం బై ముగ్ధలార ! • తథ్యము కనుఁడీ. ౬౭౦

అర్థములు. దిగ్గాములు = దిక్కుల గాఁపురముండువారు, హత = చంపఁబడిన, పలభుక్ + ధీరము = రాక్షస వీరులు గలది, నిష్ప్రభంబు=కాంతి చెడినది, అసందిగ్ధము = సందేహము లేదు. రఘువరశర = రామచంద్రమూర్తి బాణములనెడి, శుచి = అగ్నిహోత్రముచే, దగ్ధంబై = కాలినదై.

తా త్ప ర్య ము.

దిక్కులందుండువారికిఁ గూడఁ దెలియునట్లు ప్రసిద్ధముగా మూఢలారా ! రామబాణాగ్నిచేఁ గాలి యీ పురము కాంతిహీనమై మాంసభోజ లగు రాక్షసులు చచ్చినదై పట్టణము నిస్సందేహముగఁ బాడగును. ఇది నిజమగును. చూచు చుండుఁడు.

ఇదంతయు సీతాదేవి భూమియందు నాకాశమునందుఁ గానవచ్చు శకునములఁ బట్టి చెప్పె నని తెలియ నగు. ఉత్పాత చిహ్నము లనిష్టసూచకములు.

క. ఆ నీచ పంక్తికంఠుఁడు దా నోపఁగిన గడువు ముగియ • దాపయ్యె మదిన్
మీ నైరృతు లెఱుఁగరు సువిధానం బుత్పాత మిపుడు • దలకొనెఁ జండీ. ౬౭౧

అర్థములు. నీచపంక్తికంఠుఁడు = నీచుఁడు పంక్తికంఠుఁడు, నీచశబ్దము వృద్ధాదులలోఁ జేరినది, కావున దుష్టులోపము. "వన్మిచ్ఛఁడు బాహుగర్వమున నీచు సుయోధనుఁడు" భార. ఉద్యో. దాపు = సమీపము, నైరృతులు = రాక్షసులు, సువిధానంబు = చక్కఁ జేసికొను విధము.

తా త్ప ర్య ము.

ఆ నీచుఁడగు రావణాసురుఁడు నాకు సంవత్సరము గడువిచ్చెను. అది తన చావు గడువు. అది సమీపించుచున్నది. ఆ గండ మెట్లు తప్పించుకొనవలెనో మీ రాక్షసు లెఱుఁగరు. కావున నుత్పాత మిపుడే పుట్టును. చూడుఁడు.

క. మాంసము నమలెడి దుష్టనృ, శంసులు ధర్మం బెఱుంగఁ • జాలర యసురుల్
హింసింతురు నన్ రాక్షస, పాంసను వలువాతికూటి•వ్యంజనమునకై. ౬౭౨

అర్థములు. నృశంసులు = క్రూరులు, రాక్షసపాంసను = నీచరాక్షసుని రొక్క, వలువాతి = ఉదయకాలమందలి.

తాత్పర్యము.

ఈ లంక పాడగుటకుఁ బ్రారంభింపఁగా మాంసము నమలెడి క్రూరులకు బుద్ధి తక్కువ గావున ధర్మమార్గమున నపాయము తప్పించుకొను మార్గ మెఱుంగక నా వలన నీ కీడు మూఁడె నని రావణాసురుని ప్రాడ్డుటి కూటికి సాధకముగ నన్ను హింసింతురు.

ఆ మాత్రమునఁ గీడు తప్పదు. తన్నుమగఁడు కొట్టఁగాఁ గాను బిడ్డను గొట్టు దాని వలె రామచంద్రమూర్తి తమ్ముఁ జంపఁగాఁ దాము నన్నుఁ జంపుదురు.

క. ఏమి కొమొనర్చితి రేనియు, నే మనగా నేర్తు నా హృ • దీశ్వరుఁ గరుణా
ధాముని రాముని వికసిత, తామరసదళాక్షు విడిచి • తలరేడిదానన్. ౬౭౩

అర్థములు. వికసిత తామరస దళాక్షున్=వికసించిన తామర రేకులవంటి కన్నులు గలవానిని, హృదీశ్వరున్ = ప్రాణనాథుని - భర్తను.

తాత్పర్యము.

నా ప్రాణేశ్వరుఁడు దయాస్థానము. తామర రేకులవంటి కన్నులు గల రామచంద్రమూర్తిని విడిచి యేన్ను నేను మీ రేమి చేసిన నే నేమి చేయఁగలను ?

క. పతిఁ బాసి యిందు నీ గతి, పెత గుడుచుట కన్న నిదిగో • విషముం గొను మం
చితవుగ నిచ్చెడి కరుణా, వతి యుండినఁ జవనె కనఁగ • వైవస్వతునిన్. ౬౭౪

అర్థములు. కరుణావతి = దయగలది, వైవస్వతునిన్ = యముని, కనఁగఁ జవనె = చూడఁబోనా = చావనా ?

తాత్పర్యము.

స్పష్టము.

ఉ. ఇక్కడఁ బ్రాణయుక్త నయి • యేన్నచు నుంకుట లక్ష్మణాగ్రజుం
డక్కడఁ దా నెఱుంగఁడో కటా ! యొక యింత యెఱింగి యుండినన్
జక్కఁగ రోయ కేలుడుగు • తామ్రతల మెల్లను? నన్నుఁ బాసి లోఁ
గ్రొక్కను శోకవేగమునఁ • దీఱె నొకో ! యిఁక నేమి సేయుదున్. ౬౭౫

అర్థములు. ఇక్కడన్ = ఈ లంకాపురమందు, ప్రాణయుక్తనయి = ప్రాణముతో నున్నదాన నయి, లక్ష్మణాగ్రజుండు = లక్ష్మణుని కన్నయగు రామచంద్రమూర్తి, రామచంద్రుఁడనియే చెప్పరాదా యనిన రాముని విడిచినప్పటి సీతాదేవి దుఃఖము రాముని కెట్లు తెలియఁగలదు ! కన్నులారఁ జూచిన లక్ష్మణునకుఁ దెలియును. తనకుఁ దెలియకున్న లక్ష్మణుఁడు చెప్పియైన నుండఁడా? ఆ విధముగఁ దెలిసికొనవచ్చును గదా యని భావము. ఒకయింత=కొంచెమైనను, రోయక = వెదుకక, ఉడుగును = చాలించుకొనును.

తాత్పర్యము.

ఈ లంకలో నే నింకను బ్రతికి యేన్నచున్నదాన నని రామచంద్రమూర్తి

మొఱుఁగడు గాఁబోలు. తన్నుఁబాసి నే నేడ్చువిధము లక్ష్మణుఁడు చెప్పుటచే నైన దెలిసియుండెనా ? భూమండల మంతయు వెదుకక యేల యూరకుండును. నాదుఃఖ విధము తెలిసి వెదకింపక యుండుటచే నడవిలో నా శోకముచే మరణించెనేమో ! ఇఁక నే నేమిచేయుదును ?

క. ధన్యులు రఘుకులనృపమూ,ర్ధన్యుని నా హృదయాధినాథు • రాముని నతరా
జన్యుని రాజీవాక్షుని, మాన్యునిఁ గను దేవసిద్ధ • మౌనిప్రవరుల్. ౭౭౬

తా త్ప ర్య ము.

౭౪౬ పద్యముఁ జూచునది. అందు రామదర్శన భాగ్యము గల యీ లోక జనులు ధన్యులని చెప్పఁబడెను. ఇందు ఆయననే పరలోకంబునఁ జూచు దేవతలు సిద్ధులు మౌనులు ధన్యులని చెప్పఁబడెను. ఇంచే రూప గుణ విశేషములు చెప్పఁ బడెనో యందా గుణవిశేషములే చెప్పఁబడెను. ఇట్లీ లోకమూర్తికిఁ బరలోకమూర్తి కభేదము చెప్పఁబడెను.

'భక్తాస్తే యాదృశే రూపే సంసారపదసంశ్రితాః తాదృశం తే సమీక్షంతే, పరమవ్యోమవాసినః ॥ సంసారమం దున్నప్పుడు భక్తు లెట్టిరూపమునం దాసక్తులై చూడఁగోరుదురో పరమపదమం దట్టి రూపమునే వారు చూడఁగలరు. ఇందు సీతా రాముల సేవించుచు ముక్తు లగువారికిఁ బరమపదమందు భగవంతుఁడు సీతారామ మూర్తిగనే కానవచ్చును. కృష్ణుని సేవించువారికి కృష్ణుడుగానే కానవచ్చును. భయంకరమూర్తులయిన భూతాదుల పతుల సేవించు తామసులకు భూతపతులు గానే కానవచ్చును. కావుననే శ్రీభాగవతమున సాత్త్వికులు భయంకర భూత పతుల వదలి సౌమ్యుఁడైన విష్ణువునే సేవింతు రని ప్రథమస్కంధమునఁ జెప్పబడెను. శంకరాచార్యులవారి తల్లి చరిత్ర స్మరించునది.

ఈ లోకమున సాధువులలోఁ గలసి వర్తించు సాధువునకు సుఖము, సంతోషము గలదు. దుష్టులతోడ వర్తించు సాధువునకు సుఖము లేదు. అట్లులే ఇచ్చటి సాత్త్వికునకుఁ బరలోకమున సాత్త్వికులతోఁ గలిసిన సుఖము, సంతోషము గలదు. ఇచ్చట మిశ్ర సాత్త్వికుఁ డనఁగాఁ గొంత సత్త్వగుణము, కొంత తమోగుణము గల వాఁడు. పరలోకమున భూతప్రేతపిశాచములతోఁ గలసి వర్తించుట సుఖసంతోష కరముగాదు. కావున సాత్త్వికులు సత్త్వగుణము గల భగవంతునే యారాధింపవలెను.

క. పరమాత్ముఁడు ధీమంతుఁడు. నిరతము ధర్మైకరతుఁడు • నృపఋషి యగు నా
వరశీలున కా లయినం, బరఁగెడి నా వలన నేమి • ఫల మాయనకున్. ౭౭౭

అర్థములు. పరమాత్ముఁడు (౧) ఆత్మల కన్నిటికిఁ బరముఁడైన వాఁడు, (౨) శ్రేష్ఠమైన స్వభావము గలవాఁడు, ధీమంతుఁడు = బుద్ధిమంతుఁడు, ఆశ్రితుల నెట్లు రక్షింతునా యను నాలోచన గలవాఁడు, ధర్మైకరతుఁడు = ధర్మము నందే ప్రీతిగలవాఁడు, నిరతము = ఎల్లప్పుడు, నృపఋషి = రాజులందు ఋషివంటి

వాఁడు. 'విద్ధి మాం ఋషిభి స్తుల్య' మ్మని కైకకుఁ జెప్పెనుగదా. ఋషి యనఁగా ద్రష్ట, చూచువాఁడు అని యర్థము. నృపఋషి యనఁగా జీవకోటులను బాలించు విధమునందే దృష్టిగలవాఁడు. వరశీలునకు = ఉత్తమ సదాచారము గలవానికి, ఆలు = భార్య.

తాత్పర్యము.

రామా రామా రామా యని నే వంగలార్చుచున్న దాననుగదా! రామచంద్రమూర్తి తోడి సాంగత్యము వలన నాకు మేలా? ఆయనకు మేలా? రామచంద్రమూర్తి పరమాత్ముఁడు, జీవాత్మల కన్నిటి కంటెఁ బరముఁడైనవాఁడు. ఆయన స్వరూప స్వభావములు జీవాత్మల స్వరూప స్వభావముల కంటె నుత్తమమైనవి. ఆయన సర్వజ్ఞుఁడు. ఎవ రెవరి విషయమున నెట్లు తాను ప్రవర్తించిన వారు బాగుపడుదురో యా విధము చక్కఁగఁ దెలిసినవాఁడు. తెలియుట మాత్రమే కాక జీవకోటి యుద్ధారణమందే సర్వదా యాసక్తి గలవాఁడు. రాజమాత్రుఁడా యనిన, రాజులందు ఋషివంటివాఁడు. జీవకోటులఁ బాలించు నాలోచన గలవాఁడు. ఇట్టి సదాచారసంపత్తిగలవానికి నేనో యాయన ఆజ్ఞకులోఁబడి యాయన నియోగించినట్లు పని చేయుదానను. నే నాయన విషయమై పొరపడి వక్రముగఁ బోవుటయుఁ గలదు. ఇట్టి నావలన నాయన కేమి మేలుగలదు. నా మేలునకై యాయనను నేను సేవింప వలయును. నేను సేవింపకుండినంత మాత్రమున నాయనకు రాఁగల లోపము లేదు.

దీనివలన జీవాత్మలు భగవంతుని సేవించుట తమ మేలు కొఱకే కాని యాయన నుద్ధరింపఁ గాదు. జీవాత్మలు సేవింపకుండినంత మాత్రమున నాయనకు రాఁగల లోటు లేదు. లోకమున సర్వవిధముల సమాన మైనవి రెండు పదార్థములు లేవు. ఎందుఁజూచినను గొంచెమైన హెచ్చుతగ్గులే కానవచ్చును. హెచ్చు దానిని తక్కువది తన మేలునకై యాశ్రయింపవలసి యున్నది. అట్టులే భగవదంశము లైన జీవాత్మలు పరమాత్మను సేవించుట తమ మేలునకే. వీరి సేవవలన నవాప్త సమస్త కాముఁడైన భగవంతునకు రాఁగల లాభ మేమియు లేదు.

ఆ. కంటి కెదుర నున్నఁ • గనుఁ బ్రేమ గలుగును
మఱుఁగుపడిన మైత్రి • మఱపు గలుగుఁ
తథ్య మద్ది యగుఁ గృ • తఘ్నులయం, దెటఁ
ప్రేమ మఱవఁ డెపుడు • రామవిభుఁడు. ౬౮

తాత్పర్యము.

రామచంద్రమూర్తి రాజుగదా! రాజులు తమ యెదురుగ నున్న వారి నెక్కువగఁ బ్రేమించుటయుఁ, జాటుగనున్న వారిని మఱచి పోవుటయుఁ గలదు. ఆకారణమున నెదురుగా నున్నప్పు డెంతో ప్రేమగలవాఁడై యుండుట వాస్తవమే. ఇప్పుడు కనుచా

టగుటచే మఱచియుండునేమో. ఆ కారణమున నా విషయమై వెదకుటగాని, యిచ్చటికి వచ్చుటగాని యాలోచింపలేదేమో యందునా ? కృతఘ్నులందుఁ గనుచాటువారిని మఱచు గుణముగలదు. రామచంద్రమూర్తి కృతఘ్నుండుగాఁడే. ఒక్క యుపకారము చేసినను గలకాలము దానిని స్మృతియం దుంచుకొనువాఁడే. అట్టివాఁడు నన్ను మఱచునా ! చాటుగ నున్నప్పు డొక విధముగ, నెదురుగ నున్నప్పు డొక విధముగ నే నుందునేమో కాని యాయన ప్రత్యక్షమందుఁ బరోక్షమందు నేకవిధముగ నుందును. సమక్షమున నే నుపేక్షింతునేమో యనుటకు భగవద్గీత యందలి

ద్వి. నీ యిట్టి మహిమను నే నెఱుంగమిని, నో యచ్యుతా చెల్మినో పొరపడియో
 యో యాదవా యని, యో కృష్ణయనుచు, నోయి సఖా యని యూహించి చెలిమి
 గేలిసేయుచు నిన్నుఁ గ్రీడల భుక్తి, వేళల నాపన వేళల నొంటి,
 పాటున నేన్ బెద్దవారి సన్నిధినో, మాటలాడిన యవమానంపు నుడుల,
 నప్రమేయా ! కృష్ణ ! యాత్మ క్షమింపు.

అను నర్జును వాక్యంబులు స్మరించునది. అరణ్యమునకు నిన్నుఁ బిలుచుకొని పోనని రామమూర్తి చెప్పినపుడు సీతాదేవి నలుగురిలో నవమానకరముగ మాటలాడలేదా ? ఏకవచనమునఁ బిలువలేదా ? రామచంద్రమూర్తి యిట్టి మాటలాడెనా ? రావణ వధానంతరము మాటలాడలేదా ? యనిన నది నైమిత్తికము. ఆమె మహిమ లోకమునకుఁ దెలుపుటకే కాని క్రోధముచేఁ గాదు. జీవాత్మలు భగవంతుని విషయమున నెన్ని యపచారము లైనఁ జేయుదురు గాని భగవంతుఁ డట్లు చేయఁడు. దూరముగా నున్న మాత్రమున బిడ్డలను దల్లిదండ్రులు మఱతురా ? అట్లులే భగవంతుఁడును.

ఆ. అంతమంచిగుణము • లమరవో నా యందుఁ, బుణ్యఫలము చూఱ•పోయె నేమొ ?
 ప్రాణతుల్యుఁ డైన• భర్తచే విడువంగఁ, బడితిఁ బడఁతి! గోడు•గుడుచుదాన.౭౬

తాత్పర్యము.

అంతప్రేమ నీ యందు నీ భర్త కింకను గలదేని యేల రాలే దందువా ? ఓసీ రాక్షసీ! చెప్పెద విను. అది యాయన లోపముగాదు. నన్నాయన యనుగ్రహింపఁ దగినంత మంచి గుణములు నాయందు లేవో, ఒకవేళ నుండినను వాని పుణ్యఫలము ప్రారబ్ధ వశమునఁ జెడిపోయెనో ? ఆ కారణమున నాభర్తచే నేను విడువఁ బడితిని గాని యాయనకు నా యందు దయలేక కాదు. ఆయన నన్ను మఱచి పోవుట చేతను గాదు.

క. శూరుఁడు రణధీరుఁడు నరి, మారుఁడు సద్గుణధనుండు • మహితాత్ముఁడు సూ
 దారుఁడు రాముఁడు పాయుట, ధారిణి నే మనుటకంటెఁ • దగు మరణింపన్.

అర్థములు. అరిమారుఁడు = శత్రువుల సంహరించువాఁడు, సూదారుఁడు = సు+ఉదారుఁడు = మిక్కిలి గంభీరుఁడు, మనుటకంటెన్ = బ్రదుకుటకంటె.

తా త్ప ర్య ము.

ఓసీ సీతా ! నీ దోషమో, యాయన దోషమో ఆయన రాలేదు. నిన్నుఁ దోడ్కొని పోలేదు. ఇప్పుడు నీవు చేయబోవునది యేమనెదవా ? అటువంటి శూరుఁడు యుద్ధమునం దటువంటి ధైర్యము గలవాఁడు శత్రుసంహారకుఁడు కల్యాణ గుణములే ధనముగాఁ గలవాఁడు గొప్ప స్వభావము మనస్సు గలవాఁడు, మిగుల గంభీరుఁడు త్యాగియగు రామచంద్రమూర్తిని బాసి బ్రతికి యుండుటకంటెఁ జచ్చు టయే తగినపని.

మ. వనిలో వేరులు వెల్లఁకుల్ మెసవుచున్ • వర్జించి శస్త్రాస్త్రముల్
మనుజశ్రేష్ఠులు నన్నదమ్ములు వ్యథా•మగ్నాత్ములై పోయిరో !
యనయుం డీ యసురేశ్వరుండు కుటిల•వ్యాపారపారీణుఁ డే
మన శూరాగ్రణులన్ వధించె నొకో మా•యాసంప్రయోగంబునన్. ౭౧

అర్థములు. మెసవుచున్=తినుచు, వర్జించి=వదలి; వ్యథామగ్నాత్ములై = శోకమునందు మునిఁగినవారై, అనయుండు = నీతిమాలిన వాఁడు, కుటిల వ్యాపార పారీణుఁడు=మోసకృత్యములందు గడితేఱినవాఁడు, మాయాసంప్రయోగంబునన్= మోసగించుటచేత, ఈ పద్యము పై పద్యమునకు ముందుండుట బాగు.

తా త్ప ర్య ము.

రామచంద్రమూర్తి యేల రాలేదందువా ? దానికి రెండు కారణములు గలవు. ఒకటి యడవిలో ఆకులలములు వేరువెల్లఁకులు దిని శస్త్రాస్త్రములు వదలి నామెడఁ బాటు వలనఁ గలిగిన దుఃఖము చేతను అవమానము చేతను శోకమున మునిఁగి యన్నదమ్ము లిరువురు మరణించియైన నుండవలెను. లేదా ? న్యాయము దప్పి చరించు నీ రావణుఁడు వంచనయందు గడితేఱినవాఁడు కావున నేదే మోసముచే వారిని జంపియైన నుండవలెను. వారు మరణించి యుండుటచే రాలే దేమో కాని జీవించియే యుండిన రాక మానరు.

క. ఇంతటి దురవస్థలఁ బడి, యింతటి దుఃఖంబుఁ గుడుచు•హీనాత్మకుఁ దా
నెంతో సుఖదము మరణం, బంతకునకుఁ గరుణ లేదు • హా ! నా మీఁదన్. ౭౨

అర్థములు. హీనాత్మకు = నీచురాలికి, అంతకునకున్ = యమునకు.

తా త్ప ర్య ము.

ఇంత దుర్దశలకుఁ బాలుపడి యింతకష్ట మనుభవించు నీచురాలికి దీనికంటెఁ జచ్చుటే సుఖకరము. కాని యమునకు నామీఁద దయరాలేదు. అయ్యో నేనేమి చేయుదును ?

క. ఎంతటిధన్యులో మును లా,వంతయు నే వంత లేక • త్యక్తకలుషులై
స్వాంతముఁ బ్రియాప్రియంబుల, పొంతలఁ బోనీరు విజిత•బుద్ధీంద్రియులై. ౭౩

అర్థములు. ఆవంతయున్ = ఆవగింజంత యైనను, వంత = వ్యసనము

త్యక్తకలుషులై = వదలిపెట్టఁబడిన పాపములుగలవారై, కలుషము = ద్వంద్వము, స్వాంతమున్ = మనస్సును; ప్రియాప్రియంబులన్ = ఇష్టములయొక్క యనిష్టముల యొక్క, ప్రాంతలన్ = సమీపమందు, విజితబుద్ధీంద్రియులై = జయింపఁ బడిన మనస్సు ఇంద్రియములు గలవారై.

తా త్ప ర్య ము.

మనస్సును నింద్రియములను జయించిన వారై శీతోష్ణములు సుఖదుఃఖములు లాభాలాభములు లోనగు ద్వంద్వము లనఁబడు కలుషముల వదలినవారై మనస్సును బ్రియమునకుఁ గాని యప్రియమునకుఁ గాని సమీపమునకైనఁ బోనీయక సుఖము వచ్చిన సంతోషింపక యప్రియము వచ్చిన దుఖింపక రెంటను నేకవిధముగ నుండి కొంచమైన నే వ్యసనము లేకయుండు మునీశ్వరు లెంత పుణ్యాత్ములో.

క. ప్రియమున సంతోషం బ, ప్రియమున నధికముగ భయము • పృథివి జనించున్
భయమును ముదమును విడిచిన, యయగుణులకు మ్రొక్కెదాన • నవహితమతినై.

అర్థములు. అయగుణులకున్ = శుభము గలిగించు గుణములు గలవారికి, అవహితమతినై = హెచ్చరికతోఁ గూడిన మనస్సు గలదాననై.

తా త్ప ర్య ము.

దేహాభిమానము గలవారికిఁ బ్రియము కలిగెనా సంతోషము కలుగును. అప్రియము కలిగెనా భయము కలుగును. కావున మనస్సు ప్రియము మీఁదను అప్రియము మీఁదను పోకపోయెనా ముదములేదు, భయములేదు. కావున నట్టి శుభకరమైన గుణములు గలవారికి హెచ్చరిక గలదాననై మ్రొక్కెదను.

మును లని చెప్పుటచేత నీ రెండు పద్యములు వానప్రస్థుల విషయ మని యేర్పడు చున్నది. అయినను నిది నాకు స్వధర్మము గావున నా విషయ మాలోచింపఁ బని లేదనుకొను చున్నది.

క. కావున విదితాత్ముం డగు, కేవల మత్ప్రియుని రాముఁ • గీర్తితగుణునిన్
బో విడిచి పాపదైత్యున, కే వశపడి యుండఁ గలనె • మృత్యువుఁ గందున్. ౨౮౫

అర్థములు. విదితాత్ముండు = తెలియఁబడిన ఆత్మగలవాఁడు, కేవల మత్ప్రియుఁడు = నాకుఁ గేవలము ప్రియుఁడగువాఁడు, అంతకంటెఁ బ్రియమైనది నాకు లేదు. కీర్తితగుణునిన్ = కీర్తింపఁబడిన గుణములు గలవానిని, పాపదైత్యునకు = పాపపు రాక్షసునకు.

తా త్ప ర్య ము.

ఆత్మజ్ఞానము గలవాఁడై నాకుఁ బ్రియుఁడైన వాఁడొక్కఁడే యయి కీర్తింప బడిన సద్గుణములు గల రామచంద్రమూర్తిని విడిచి యాత్మజ్ఞానము లేక నా ప్రీతికిఁ బాత్రుఁడుగాక నింద్యగణములు గల పాపపు రావణాసురునకు స్వాధీనపడి యుండఁ గలనా ? చావనైనఁ జచ్చెదను గాని.

—• ౨౭-వ సర్గము. త్రిజట తన స్వప్నవృత్తాంతము రాక్షసస్త్రీలకుఁ జెప్పుట.•—

క. అనిన విని యామె మాటల, కును గింకిరిపాటు గదురఁ • గొందఱు రక్షో
వనితలు దశకంఠునకున్, వినిపింపఁగఁ జనిరి సీత•వృత్తాంతంబున్. ౬౮౭

అర్థములు. కింకిరిపాటు = కోపము.

తా త్ప ర్య ము.

సీతాదేవి చెప్పిన యా మాటలు విని రాక్షసస్త్రీలు కోపించినవారై కొందఱు రావణాసురుని పాలికిఁ బోయి రాజా నీవు చెప్పినట్లు మే మామెను నయమున భయమునఁ జెప్పి చూచితిమి. మా మాట విన లేదు. మరణింప యత్నించుచున్నది యని చెప్పిరి.

క. కొందఱు కరాళవదనలు, ముందర నిలుచుండి రామ•ముదితం గని రో
మందమతి! నీదు మాంసం, బిందఱమును గుడుతు మనుడు • నేకార్థముగన్.

తా త్ప ర్య ము.

మఱి కొందఱు పిట్టపండ్లు గల నోళ్ళవారు సీతాదేవి కెదురుగ నిలఁబడి రోసీ బుద్ధిలేని దానా! యిప్పుడే నిన్నుఁ జంపి నీ మాంసము నిందఱము పంచుకొనెద మని యొక్క మాటగాఁ జెప్పిరి

క. వారలను గాంచి నిద్దురఁ, గూరిన యొకవృద్ధ మేలు•కొని త్రిజట యనన్
బేరుఁది యిట్టులు పలికెఁ, మీరలు చాలింపుఁ డింక•మీ మీ మాటల్. ౬౮౮

తా త్ప ర్య ము.

అప్పు డచ్చట నిద్దుర పోవుచున్న యొక ముసలి రాక్షసి త్రిజట యనునది మేలుకని వారి మాటలు విని వారితో నిట్లనెను. మీ మీ మాటలు మీరు చాలింపుఁడి. అది తత్తఱపాటుచే లేచి కూర్చుండు నవకాశము లేక పరుండియే చెప్పుచున్నది.

క. మీ రకట సీతను రాముని, దారను జనకేంద్రుసుతను • దశరథు స్నుషనున్
జేరి భుజింతురె? పొండీ, దూరంబుగ నన్నుఁ దినుఁడు • తొయ్యలులారా! ౬౮౯

తా త్ప ర్య ము.

ఆడంగులారా! సీతాదేవిని, రాముని భార్యను, జనకరాజు పుత్రిని, దశరథు కోడలిని మీరా భుజించువారు. చాలుఁ జాలు, దూరముగఁబొండు, ఆమెను బాధింపకుఁడు. మీరు తినవలె నని యున్న నామె బదులు నన్నుఁ దినుఁడు.

మ. కలఁ గంటిం జెలులార! యే మనుదు మైఁ•కంపంబు పో దిప్పుడున్
దలఁపఁ దాని, సమూలనాశనము సి•ద్ధం బాశరశ్రేణి, కీ
నళినాక్షీమణిభర్తకున్ జయము మా•నం బో దనన్, భీత ల
చ్చెలువల్ నీ కల నెట్టి దీ నిశ నవం • జెప్పం దనీయార్థమున్. ౬౯౦

అర్థములు. మైకంపంబు = దేహమున వణుఁకు, ఆశరశ్రేణికిన్ = రాక్షస

సమూహమునకు, సమూలనాశనము = వేరుతోడ పాడైపోవుట, భీతలు = భయపడినవారు, నిశన్=రాత్రియందు, తదీయార్థమున్ = ఆ కలయందలి విషయమును. ఈ త్రిజట విభీషణుని కూతురని కొంద అందురు.

తాత్పర్యము.

అమ్మలారా! నే నొక కల గంటిని. నే నేమని చెప్పుదును. దానిని దలఁచుకొనిన నా దేహ మిప్పటికిని వణఁకుచున్నది. దానివలన రాక్షస సమూహము మూలముట్టుగ నాశనము కాఁగలదు. ఈ సీతాదేవి భర్తకు జయము తప్పదు. అని చెప్పఁగా వారు భయపడి నీవెట్టి కలగంటివి చెప్పుమన నా కలయందలి విషయమా త్రిజట యిట్లు చెప్పెను.

సీ. ఆకాశగమనంబు • హంససహస్రంబు, గజదంతమయ మైన • కలికి పల్ల
కీలోనఁ దెల్లని • మాలికల్ చేలముల్, దాల్చి సుమిత్రాగ్ర • తనయులోడ
రామచంద్రుఁడు వచ్చె • రమణీయశుక్లాంబ, రావృత యగుచు నీ • దేవి పాల
వెల్లిలోపల నున్న • వెల్లనిగట్టుపై, భానునితోఁ బ్రభ • పరఁగునట్లు
ఆ. రామచంద్రుతోడ • రంజిల్లఁ గంటిని, ధరముఁబోలి నాల్గు • దంతములను
మీఱు చున్న గజము • మీఁద సలక్ష్మణుఁ, గౌసలేయు నరుగఁ • గంటిఁ గలను.

అర్థములు. ఆకాశ గమనంబు = ఆకాశమునఁ బోవునది, గజదంతమయము = ఏనుఁగు దంతముతోఁ జేసినది, శుక్లాంబరావృత=తెల్లని వస్త్రము కట్టుకొన్నది, పాలవెల్లి = క్షీరసముద్రము, గట్టు = పర్వతము, ధరము=పర్వతము, కౌసలేయున్ = రామచంద్రమూర్తిని.

తాత్పర్యము.

రామచంద్రమూర్తి యాకాశమునం బోవుచట్టిదియు, వేయి హంసలు గట్టి నట్టిదియు, తెల్లని యేనుఁగు దంతముతోఁ జేయఁబడినదియు నగు పల్లకీలో తెల్లని పూలసరములు వస్త్రములు ధరించిన లక్ష్మణునితోడ వచ్చెను. ఈ సీతాదేవి యంద మైన తెల్లని చీర గట్టుకొని పాల సముద్రమునందలి తెల్లని పర్వతముమీఁద సూర్యునితోడఁ బ్రభ యున్నట్టు లాయనతోడ నుండఁగంటిని. నాలుగు దంతములు గలదై కొండవలె నున్న యేనుఁగుమీఁద లక్ష్మణునితోడ రాముఁడు పోవఁగంటిని.

"ఆరోహణం గోవృషకుంజరాణాం, ప్రాసాద శైలాగ్ర వనస్పతీనాం, విష్ఠానులేపో రుదితం మృతంచ స్వప్నేష్వగమ్యాగమనంచ ధన్యం" (స్వప్నాధ్యాయము) కలలందు ఎద్దులను, ఏనుఁగులను, మేడలను, కొండశిఖరములను, కాచు పూచు చెట్లను ఎక్కుటయు, మలము పూసికొనుట, ఏడ్చుట, చచ్చుట, పొందరాని దానితోఁ బొందుట—ఇవి శుభములు.

క. వెల్లని వలిపపుఁ జేలలుఁ, దెల్లని మాల్యములు దాల్చి • ధీరోత్తము లీ
పల్లవపద చెంగట రంజిల్లఁగ రఘుకులులఁ గంటిఁ • జిత్తం బగలన్. ౨౧

తా త్ప ర్య ము.

తెల్లని దువ్వలువలు తెల్లని పూలదండలు ధరించి ధీరులలో శ్రేష్ఠులైన రామ లక్ష్మణులు చిగుళ్ళవంటి పాదములు గల యీమె ప్రక్కను సంతోషముతో నుండఁ గంటిని. అది చూడఁగానే నా గుండెలు పగిలెను.

తే. అంత నా పర్వతాగ్రంబు•నందు మింటి, నంటి యుండిన గౌరుపై • నబ్జమిత్రి
కులుని తొడమీఁద నెక్కి యీ•కలువకంటి,తరణి చంద్రుల నంటు వి•ధంబుఁ గంటి.

అర్థములు. గౌరు = ఏనుఁగు, అబ్జమిత్రకులునితోడ = సూర్యవంశమునఁ బుట్టిన రామచంద్రమూర్తితోడ, తరణి చంద్రులన్ = సూర్యచంద్రులను.

తా త్ప ర్య ము.

అవల నా పర్వతము శిఖరమునందు నాకాశముఁ దాఁకుచున్న యేనుగుమీఁద రాముని తొడమీఁద నీ సీతాదేవియుండి సూర్యచంద్రులఁ దాఁకుచున్నట్లు చూచితిని.

ఆదిత్య మండలం వాపి చంద్రమండల మేవవా
స్వప్నే గృహ్ణాతి హస్తాభ్యాం రాజ్యం సంప్రాప్నుయా న్మహత్.

కలయందు సూర్యమండలముగాని, చంద్రమండలముగాని చేతులతోఁ బట్టుకొన్నట్లు కనఁబడెనా వానికి గొప్పరాజ్యము లభించును.

క. రా కొమరులు రాజాస్యయుఁ, బ్రాకటముగ నెక్కినట్టి • భద్రేభము నే
నాకసమున లంకపయిన్, జోకగ నిలువంగఁ గంటి • సుందరులారా! ౬౮

అర్థములు. రాకొమరులు = రాజకుమారులు, రాజాస్య = చంద్రునివంటి ముఖముగలది, భద్రేభము = భద్రజాతి యేనుఁగు.

తా త్ప ర్య ము.

రాజకుమారులు రామలక్ష్మణులు చంద్రునివంటి ముఖము గల సీతాదేవి స్పష్టముగ భద్రజాతి యేనుఁగుపై నెక్కి లంకమీఁద నాకాశమున నున్నట్లు గంటిని.

క. అంచిత వృషభాష్టకముం, బూంచిన రథ మెక్కి పురుష•పుంగవుఁ డిట కీ
చంచలలోచనతో వరు, దెంచుట నేఁ గంటిఁ గొఱంత•దెలియఁగ వినుఁడీ. ౬౯

అర్థములు. వృషభాష్టకము = ఎనిమిది యెద్దులు, పూంచిన = పూనునట్లు చేసిన.

తా త్ప ర్య ము.

మంచి యెద్దు లెనిమిది కట్టిన తేరెక్కి రామచంద్రుఁ డీ సీతాదేవితో వచ్చుచుండుట గంటిని. తక్కిన కల చెప్పెద వినుఁడు.

తే. అర్కసన్నిభపుష్పకా•ఖ్యాతదేవ, యానమున వార లీ గజ•యానతోడ
నుత్తరంబుగ వరుగుట•యుత్సవముగఁ, గన్ను లారంగఁ గంటి నేఁ•గలను జెండి.

అర్కసన్నిభ = సూర్యునితో సమానమైన, పుష్పక+ఆఖ్యాత = పుష్పకమను పేరు గల, దేవయానమున = విమానమునందు, వారలు = రామలక్ష్మణులు.

తా త్ప ర్య ము.

సూర్యకాంతిగల పుష్పకవిమాన మెక్కి రామలక్ష్మణులు ఉత్తరముగ నీ సీత తోడఁ బోవఁ జూచితిని.

క. ఆ విష్ణుపరాక్రముఁ డగు, ధీవిభవుఁడు రామవిభుఁడు • తేజం బెసఁగం
గా వెలఁదియుఁ దమ్ముఁడుఁ దా, నీ విధమున నుండఁ గంటి • నిది నిక్కం బౌ.

తా త్ప ర్య ము.

విష్ణు పరాక్రముఁడు, మహాబుద్ధిశాలి యగు రామచంద్రమూర్తి సీతతోను, దమ్మునితోను నీ విధముగ నుండఁగా నేను జూచితిని. ఇది నిజమగును.

స్వప్నక్రమ మే మనఁగా:—రామలక్ష్మణులు పల్లకిలో నెక్కి సీతను గూర్చి లంకాసమీపమునకు వచ్చిరి. లంక దగ్గఱ పాల సముద్రమునందు నొక తెల్లనికొండ యా కలయందుఁ గనఁబడెను. అప్పటికి రామచంద్రమూర్తి వచ్చి చేరెను. సీతయు నా కొండయం దుండినది. రామలక్ష్మణులు పల్లకి దిగి యేనుఁగుపై నెక్కి సీత యొద్దకు వచ్చిరి. సీతయు నేనుఁగుపై నెక్కి పెనిమిటి తొడపైఁ గూర్చుండి నిక్కి సూర్యచంద్రులను బట్టుచుండినది. ఆ విధముగ వారు లంకమీఁదికి నాకాశ మార్గమున వచ్చి యేనుఁగు దిగి యెనిమిది యెద్దులు కట్టిన తేరిపై గూర్చుండి లంకలోనికి వచ్చి పుష్పకము నెక్కి యుత్తర దిక్కుగాఁ బోయిరి.

క. పాపాత్ములు స్వర్గంబున, దాపున కరుగంగ లేని • తద్గతి రామున్
రూపింప నైన నేరదు, సోపర్వసురారిగణము • సంగరవీథిన్. ౬౯౭

అర్థములు. సోపర్వ = దేవతాసమూహము, సురారిగణము = రాక్షస సమూహము, సంగరవీథిన్ = యుద్ధరంగమందు.

తా త్ప ర్య ము.

పాపాత్ములు స్వర్గము సమీపమునకైన నెట్లు పోలేరో యా విధముగ దేవ రాక్షస సమూహములు యుద్ధరంగమందు శ్రీరామచంద్రమూర్తిని సమీపింప లేవు.

సీ. దశకంధరునిఁ గంటిఁ • దైలలిప్తాంగుఁ డై, తైలంబుఁ గ్రోలు చు • న్మత్తుఁ డగుచు
గన్నేరుపేరులు • గళమున వ్రేలంగ. రక్తాంబరంబులు • గ్రాలు చుండ
ముండుఁడై, కృష్ణాంబ • రుండయి నెండియుఁ, బుష్పకంబున నుండి • పుడమిఁ గూలఁ
బడఁతి యీడ్వంగను • బాధలు పడుచుండఁ, గంటి నేఁ గల పోఁడు • కాంతలార!
తే. మఱియు ఖరయుక్తరథమున • మలయువాని, రక్తమాల్యానులేపన • యుక్తుఁ డగుచు
భ్రాంతమతి నూనెఁ గ్రోలుచు • గంతు లిడుచు, నగుచు గాడిదపై దక్షి • ణంబుగాఁగ.

అర్థములు. తైలలిప్తాంగుఁడై = నూనె పూసికొనిన దేహము గలవాఁడై, క్రోలుచున్ = త్రాగుచు, ముండుఁడై = బోడితల గలవాఁడై, కృష్ణాంబరుం డయి = నల్లని గుడ్డ కట్టుకొన్నవాఁడై.

తా త్ప ర్య ము.

ఇఁక రావణు విషయమై యేమి కల గంటినో చెప్పెద వినుము. రావణుఁడు దేహమునకు నూనె రాచుకొని, నూనె త్రావుచు దేహము తెలియనివాఁడై, గన్నేరు పూలదండలు మెడయందు వ్రేలాడ నెఱ్ఱవస్త్రములు గట్టుకొని బోడితలవాఁడై నల్ల వస్త్రములు గలవాఁడై, పుష్పకమున నుండి యొక యోఁడుది యీడువఁగా నేలఁబడి బాధపడుచుండఁ జూచితి. మఱియు గాడిదలు కట్టిన తేరిమీఁద నెఱ్ఱ పూలదండలు నెఱ్ఱ గంధము పూసికొని భ్రాంత చిత్తుఁడై నూనె త్రావుచు గంతులువెట్టుచు గాడిద మీఁద దక్షిణముగా.

సీ. చను చుండ వెండియు • వన దశవదనుం బు, తల్క్రిందు గాఁగ గా•ర్దభమునుండి
భయమోహితుం డయి • పడుచు దిగ్గన లేచి, వెల వెల నై మద•విహ్వలుండు
సాధ్వసార్తుండు నై • జల్పకుఁ డగుచును, దిగ్వాసుఁ డయి దిక్కు•తెలియ లేక
దుర్గంధ ఘోర మై • దుస్సహతిమిర మై, నరకాభ మగు పెను•బురదలోనఁ
తే. బడఁగఁ గనుఁగొంటిఁ గాళినాఁ • బడఁతి యొక తె
ర క్తవసనయు మఱియుఁ గ•ర్దమవిలి ప్త
దేహయును నయి మెడ గ్రుచ్చి • తిసుచు చుండె
దక్షిణపుదిక్కుగా మన•రాక్షసేంద్రు. ౨౦౦

తా త్ప ర్య ము.

పోవుచు గాడిదనుండి తల్క్రిందుగాఁ బడుచు, భయపడి దిగ్గనలేచి తెల్లఁబోయి మత్తుచే వికలుఁడై, భయపీడితుఁడై, వదరుచు,దిగంబరుఁడయి,దిక్కు తెలియక,గబ్బు గొట్టుచు భయంకరమై, సహింపరాని చీఁకటి గల నరకసమ మైన పెనుబురదలో బడుచుండఁజూచితిని. కాళి యనెడి స్త్రీ యెఱ్ఱగుడ్డ కట్టుకొని బురద పూసికొని వాని మెడఁ గౌఁగిలించి దక్షిణ దిక్కుగా మన రాక్షసరాజు నీడ్చుచుండెను.

సీ. అల కుంభకర్ణుపై • గలఁ గంటి నే నిట్టి, రీతిన మఱి దశ•గ్రీవసుతులు
నూనెఁ బూసికొనుట గంటి • దానవనాథుండు, పందిని నింద్రజి•త్తు మొసలిని
గుంభకర్ణుం డొంటెఁ • గొని వాహనములుగ, దక్షిణదిశ కయి • తరలఁ గంటి
వీరలలోన వి•భీషణుం డొక్కఁడే, వెల్లనిగొడుగును • వెల్లచేల
తే. ములును వెల్లనిగంధంపుఁ•బూఁతలు నయి, శంఖదుందుభినిర్ఘోష•సంయుతముగ
నృత్తగీతాదు లొప్పఁబూ•ర్ణత్వమంబు, మేఘరావంబు నగు నొక్క•మేలిగజము.

తా త్ప ర్య ము.

ఇఁక నా కుంభకర్ణుపై నిట్టి కల నే గంటిని. రావణాసురుని కొడుకులు నూనె మునుఁగుటఁ జూచితిని. రావణాసురుఁడు పందిని ఇంద్రజిత్తు మొసలిని, గుంభకర్ణుఁ డొంటెను, వాహనములుగాఁ జేసికొని దక్షిణదిక్కు ప్రయాణము చేయఁ జూచితిని. ఇందఱిలో విభీషణుఁ డొక్కఁడే తెల్లనిగొడుగు తెల్లవస్త్రములు తెల్లగంధపుఁ

బూఁతగలవాఁడై శంఖములయు భేరులయు ధ్వనులు గలుగఁగ ఆటలు పాటలు నొప్ప కొండ వంటిదియు మేఘధ్వని గలదియు నగు నొక్క పెద్ద యేనుఁగునెక్కి.

తే. ఎక్కి వల్వ్యారుమంతుగు • లెసక మెసఁగ, మింటి కెరువునఁ బోవుచు • నుంటగంటిఁ;
  ద్రావి చెంగావిగుడ్డలు • రక్తమాల్యములును దాలిచి వాదిత్ర • ములు చెలంగ.

తా త్ప ర్య ము.

వల్వ్యారు మంతు్రిలతో విజృంభించి యాకాశమునఁ బోవుచుండఁ జూచితిని. తాగి మెత్తి గుడ్డలు ఎఱ్ఱ మాల్యములు ధరించి మేళతాళములతో నొప్పఁగాఁ జూచితిని. విఱిగిన గోపురములు తోరణములు గలదై రావణరక్షితమైన లంక సముద్రములోఁ బడఁగాఁ జూచితిని.

తే. బోఁకుమూఁకలు వెలయ నేఁ • జూడఁ గంటి, భగ్నగోపురతోరణ • పంక్తి గలిగి
  యసురనాయకరక్షితం • బైన లంక, వనధిలోపలఁ గూలంగ • గనితిఁ జుండు.

దీని తాత్పర్యము పై ౨౦౨ పద్యమున నిమిడి యున్నది.

క. ప్రాఁత యట రామునకు నొక్క, క్రోఁతి వెస న్వచ్చి లంక • గుఱుకొని బూడిన్
  జేఁతయుఁ; జేడెలు ప్రోఁతలు, కూఁతలునై చొచ్చి లంకఁ • గోలుచు నూనెన్

అర్థములు. ప్రాఁత = భృత్యుఁడు, గుఱుకొని = ప్రియత్నపూర్వకముగా, బూడిన్ జేఁతయు = భస్మము చేయుటయు చూచితిని.

తా త్ప ర్య ము.

మఱియొక విశేషము చెప్పెద వినుఁడు. రామునకు భృత్యుఁడఁట, ఒకక్రోఁతి వచ్చి ప్రయత్నముతో లంకను గాల్చి బూడిద చేయఁగాఁ గంటిని. అఁడువా రేడ్పు లతో నూనె ద్రావి లంకలో.

క. వేఁడి యగుబూదిఁ గూలుట, మూఁడఁగ విధి కుంభకర్ణ • ముఖ్యులు దమ దొ
  వాఁడిమి చెడి పడఁబొఱఁగఁ, బేఁడమడుంగునను గంటి • వెలఁదుకలారా. ౨౦౪

తా త్ప ర్య ము.

వేఁడి బూడిదలోఁ బడుటయుఁ గుంభకర్ణుఁడు మొదలగు ముఖ్యరాక్షసులు వచ్చి పౌరుషముచెడి పేఁడ మడుఁగులోఁ బడుచుండఁగఁ జూచితిని.

ఈ కలగన్నది త్రిజట. ఇది విభీషణుని కూఁతురని చెప్పఁబడెను. విభీషణుఁడు మొదటినుండియు సీతా పక్షపాతి. అమెయం దభిమానము గలవాఁడు. అయన తన భార్యను కూఁతును బంపి సీతాదేవికి ననుకూలముగ వర్తింపఁజేయు చుండినవాఁడు. ఇట్లగుటచేత రాక్షసస్త్రీలు సీతాదేవిని బెట్టుబాధ సహింపఁజాలక వారిని భయపెట్టు టకై తనబిడ్డ కిట్టి యుపాయము చెప్పెనాయని సందేహింపనగు ఇది ముసలిది. కావున విభీషణునిపుత్రి కాదేమో యని సందేహము. అదెట్టు లుండినను తక్కిన దంతయుఁ గల్పితమని తలంచినను క్రోఁతి వచ్చుట లంకకాల్చుట యనునది యెవరికి నూహింప

రాని విషయము. అట్టి కల వచ్చుట వెంటనే యది ఫలించుట యనునది స్వప్న మంతయుఁ గల్పితము కాదని స్థిరపఱచుచున్నది.

స్వప్న విచారము.

శూన్యవాదులు నాస్తికులు మాయావాదులు స్వప్నము లసత్యము లందురు. ఈ వాదము శ్రుతిస్మృతీతిహాసపురాణాదుల యభిప్రాయమునకు ననుభవమునకు విరుద్ధమైనది. ఈ రామాయణమందే దశరథస్వప్నము, భరతస్వప్నము, త్రిజటా స్వప్నము మూఁడుగలవు. మూడును సత్యము లయ్యెను. పగటి కలలు ధాతు వైషమ్యముచే వచ్చు కలలు నసత్యము లగును గాని యారోగ్యవంతులై నిర్మల మనస్సు గలవారి స్వప్నములు సత్యములే యగును. అట్లు గాదేని స్వప్నవిషయము వాని ఫలములు గుఱించి చెప్పు శాస్త్రవాక్యము లన్నియు నున్మత్తప్రలాపము లగును. అనుభవ మందును నేఁటికిని ననేక స్వప్నములు సత్యము లగుచున్నవి. వాని నిరాకరించు టెట్లు? కావున వాని నసత్యము లనరాదు.

అట్లైన "కలలంబోలెడి పుత్ర మిత్ర వనితాగారాది సంయోగముల్" అని గ్రంథములు చెప్పుచున్నవే యనిన నవి యసత్యము లని చెప్పలేదు. అల్పకాలముండి యావల వ్యర్థములై పోవునని చెప్పుచున్నవి. కలలో లభించిన డబ్బు కలలో సత్యమే కాని మేలుకొన్నప్పు డవి యెట్లు పనికిరావో యట్లే ఈ సంసారవర్గము జీవించి యుండు వఱకే కాని పుణ్యపాపములవలెఁ బరలోకమునఁగాని భక్తిజ్ఞానములవలె మోక్షదశయందుఁగాని పనికిరావు. కావున వ్యర్థములు. ఈ దేశపు నాణెము లీ దేశమునఁ జెల్లినను బరదేశమునఁ జెల్లవు. కావున వానికి విలువలేదు. వ్యర్థములు కావున బెండ్లాము బిడ్డలను కలలకుఁ బోల్తురు. దేహము నీరుబుగ్గవంటి దన్నప్పు డల్పకాల ముండునది యని యర్థమే కాని యసత్య మని యర్థము కాదు. ఎవరి యభిప్రాయ మెట్లుండినను రామాయణము స్వప్నములు సత్యము లనియే సాధించుచున్నది.

బృహదారణ్యకోపనిషత్తు 4-3-9

'తస్యవా ఏతస్య పురుషస్య ద్వే ఏవ స్థానే భవతః; ఇదంచ పరలోక స్థానంచ; సంధ్యం తృతీయం స్వప్నస్థానం, తస్మిన్సంధ్యేస్థానే తిష్ఠన్నేతే ఉభేస్థానే పశ్యతీదంచ పరలోకస్థానంచ. అథ యథాక్రమోయం పరలోకస్థానే భవతి తమాక్రమ మాక్రమ్యోభయాన్, పాప్మన ఆనందాంశ్చ పశ్యంతి; సయత్ర ప్రస్వపి త్యస్య లోకస్య సర్వావతో మాత్రా మపాదాయ స్వయం విహృత్య స్వయం నిర్మాయ, స్వేన భాసా స్వేన జ్యోతిషా ప్రస్వపి త్యత్రాయం పురుషః స్వయంజ్యోతి ర్భవతి''

అర్థములు. ఆ పురుషునకు (జీవాత్మకు) రెండుస్థానములే కలవు! ఈలోకము, పరలోకస్థానము. మూఁడవది స్వప్నమను తృతీయస్థానము. అది ఇహలోకమునకుఁ బర లోకమునకు సంధిస్థానము. ఆసంధిస్థానమందుండి ఈలోకమును బరలోకమును రెండును జూచుచున్నాఁడు. (రెండు గ్రామముల సంధి పొలిమేర మీఁద నిలువఁబడినవాఁడు

రెండుగ్రామముల పొలమును జూచునుగదా) ఇట్లు సంధియం దున్నవాఁడై యీ లోకమున జాగ్రద్దశయందలి విషయములను బరలోకమున స్వప్నదశయందలి విషయములను జూచినవాఁడై పరలోకమార్గమును(తాను జేసిన పుణ్యపాప ఫలానుభవము కొలఁదిఁ) బట్టి పోయి స్వప్నప్రపంచ మందునిలిచి యీ లోకమున జాగ్రిద్దశ యందలి పాపములను, స్వప్నమునఁ బరలోకమందలి సుఖములను జూచుచున్నాఁడు. భగవంతుఁడే వీనిని నిద్రపుచ్చునపుడు వానికి మేలుకొనినపు డున్న జ్ఞానమును ఇంద్రియములను దానే గ్రహించి బాహ్యేంద్రియముల నెల్ల నివర్తింపఁజేసి స్వప్న పదార్థములను వానివాని యదృష్టము కొలఁది సృష్టించి యా స్వప్నపదార్థములను దన జ్యోతిచేఁ బ్రకాశింపఁజేసి స్వప్నము నందలి యాలోచనము తానే ప్రకాశింపఁ జేయుచున్నాఁడు. అట్టి నిద్రయందుఁ బురుషుఁడు స్వయంజ్యోతియగుచున్నాఁడు.

౪-౩-౧౦. నతత్ర ఆనందా ముదః ప్రముదో భవం త్యథానందాన్ముదః ప్రముదః సృజతే; నతత్ర రథా నరథయోగా నపంథానో భవం త్యథరథారథయోగా న్పథః సృజతే. నతత్ర వేశాంతాః పుష్కరిణ్యః స్రవంత్యో భవం త్యథ వేశాంతాః పుష్కరిణీః స్రవంతీః సృజతే సహికర్తా.

అచ్చట ఆనందము ముదము ప్రముదము లేవు. ఆనందము ముదము ప్రముదము సృజింపఁ బడుచున్నవి. అచ్చట (ఆ స్వప్నమందు) రథములు లేవు. గుఱ్ఱములు లేవు. రథము పోవు మార్గము లేదు. రథములు వానిగుఱ్ఱములు మార్గము సృజింపబడుచున్నవి. అచ్చట గుంటలు లేవు, పుష్కరిణులు లేవు, నదులు లేవు, గుంటలు పుష్కరిణులు నదులు సృజింపఁ బడుచున్నవి. వానికిఁ గర్త భగవంతుఁడె.

జీవుఁడు చేసిన పుణ్యపాపముల ఫలము ననుభవింపఁ జేయుటకై భగవంతుఁడు దానికి దానికిఁ దగిన పదార్థముల నప్పటి కప్పుడు సృజించుచున్నాఁడు. కావున స్వప్నమునఁ జూచునవి యసత్యములు గావు.

రెండు గ్రామములు సత్యములైనచో నడిమి పొలిమేర యసత్య మెట్లగును? కొందఱు జీవాత్మయే వీని నెల్ల సృజించుకొనుచున్నాఁ డందురు. కలలందుఁ బ్రియముల వలె నప్రియములు కానవచ్చును గదా. ఎవఁడైనను దన కప్రియము లగువానిని సృజించుకొనునా? కావున స్వప్నసృష్టికర్త భగవంతుఁడే. సృష్టికార్య మాయనదే కాని జీవునిది కాదు. ముక్తునకే యా యధికారము లేనపుడు బద్ధజీవున కెందుండి వచ్చును? స్వప్నములకు ఫలము గలదని ఛాందోగ్యోపనిషత్తునం దీ శ్లోకము గలదు.

"యదా కర్మసు కామ్యేషు, స్త్రియం స్వప్నేషు పశ్యతి
సమృద్ధిం తత్ర జానీయా, త్తస్మిన్ స్వప్ననిదర్శనే." ఛా. ౨. ౯

ఎప్పుడు కామ్యకర్మములందు స్వప్నమున స్త్రీని జూచునో యప్పుడు వాని కభివృద్ధి గలదని తెలియవలెను.

స్వప్నము లసత్యములైనచో వానికి ఫలముగలదా? ఫలము గలదని శ్రుతి

చెప్పెనా? ఇట్టులే. "స్వప్నే పురుషం కృష్ణం కృష్ణదంతంచ పశ్యతి, స ఏనం హంతి," ఐ. అర. ౩-౨-౪-౧౭. కలలో నల్లనివానిని నల్లదంతములు గలవానిని చూచెనేని వాఁడు వానిని జంపును. చూ. బృ. సూ. ౩-౨, ౪-౫; జై ౭, ౭-౧. బృ-సూ ౩-౨-౬;౩-౨-౪.

ఇఁక స్మృతు లేమి చెప్పుచున్నవో చూతము.
స్వప్నాధ్యాయమున బృహస్పతి—
స్వప్నాధ్యాయం ప్రవక్ష్యామి నానాస్వప్నసముచ్చయే
స్వప్నస్తు ప్రథమే యామే సంవత్సర విపాకినం.
ద్వితీయే చాష్టభి ర్మాసై స్త్రిభిర్మాసై స్త్రియామికమ్
చాతుర్థే యామికే స్వప్నే మాసే నై కేన ఫలంభవేత్
అరుణోదయ వేలాయాం దశాహేన ఫలం భవేత్
ఏవం చానుదితేకాలే త్రిరాత్రంతు భవిష్యతి
గవాం దోహనవేలాయాం సద్యః స్వప్నఫలం భవేత్
అత ఊర్ధ్వం ప్రవక్ష్యామి స్వప్నపుణ్య ఫలం ధ్రువమ్
వాతికం పైత్తికంచైవ చింతితం చానువర్జయేత్
అతిదీర్ఘం దివా దృష్ట్వా స్వప్నం తం పరివర్జయేత్
యస్తు పశ్యతి స్వప్నాంతే రాజానం కుంజరం హయమ్
సువర్ణం వృషభం గావః కుటుంబం తస్య వర్ధతే.
ఆరోహణం గోవృషకుంజరాణాం ప్రాసాద శైలాగ్రివనస్పతీనామ్
విష్ఠానులేపో రుదితం మృతంచ స్వప్నే ష్వగమ్యాగమనంచ ధన్యమ్
క్షీరిణం ఫలినం వృక్ష మేకాకీ యోఽధిరోహతి
తత్రై తస్య విబుద్ధస్య మృత్యు రిత్యేవ నిర్దిశేత్
యస్తు శ్వేతేన సర్పేణ.........దంశితో భుజః
స హ స్తలాభ స్తస్య స్యా దష్టార్ణే దశమే దినే
ఉరగో వృశ్చికోవాపి జలూకా దృశ్యతే యది
అవ్యయం చార్థసిద్ధించ పుత్రం తస్య వినిర్దిశేత్
ప్రాసాద శైల మారుహ్య సముద్రం తరతే నరః
అపి దాసకులేజాతః సోఽపి రాజా భవిష్యతి.
యస్తు మధ్యే తటాకస్య భుంక్తే నై ఘృతపాయసమ్
అఖండే పుష్కరే పత్రే తం విద్యా త్పృథివీపతిమ్
బలాకాం కుక్కుటీం క్రౌంచీం లబ్ధ్వా యః ప్రతిబుధ్యతే
సక్కులా ల్లభతే కన్యాం భార్యాంచ ప్రియవాదినీమ్॥

స్వప్నాధ్యాయము వచించెదను. మొదటిజామున వచ్చిన కల సంవత్సరమునకు

ఫలించును. రెండవజామున వచ్చినది యెనిమిది నెలలకు ఫలించును. మూడవ జామున వచ్చినది మూఁడు నెలలలో ఫలించును. నాలుగవజామున వచ్చిన కల నెలకు ఫలించును. అరుణోదయ వేళ వచ్చిన కల పది దినములకు ఫలించును. సూర్యోదయమునకు ముందు వచ్చినది మూఁడు దినములలో ఫలించును. ఆవులు పితుకు వేళ వచ్చిన కల వెంటనే ఫలించును. ఇఁక స్వప్నముల పుణ్యఫలము చెప్పెదను. వాత పిత్తాదుల వలనఁ గలుగునవి తా నాలోచన చేయుచుండు వాని విషయమై వచ్చినవి. అతిదీర్ఘమైనవి పగటి కలలు త్యాజ్యములు. స్వప్నాంతమందు నెవఁడు రాజును, ఏనుఁగును, గుఱ్ఱమును, బంగారును, ఎద్దును, గోవును జూచునో వాని కుటుంబము వృద్ధి యగును, "ఆరోహణం గోవృషకుంజరాణాం" ఈశ్లోకార్థము ముందు వ్రాయఁ బడినది. పాలుగాఱు చెట్లను, పండ్ల చెట్లను నొంటరిగా నెవఁడెక్కునో వెంటనే వాఁడు మేలుకొనెనేని వానికి మరణదశ ప్రాప్తించును. పాముగాని తేలుగాని జలగ గాని కఱచెనేని విశేషధనలాభము పుత్రప్రాప్తి గలదు. మేడయెక్కి సముద్రము దాటినట్లు కల గనెనేని దాసికులములోఁ బుట్టినవాఁడైనను రాజగును. తటాకమధ్య మున నిండు తామరాకు నందు నేతిపాయస మెవఁడు తినునో వాఁడు రాజగును. ఎవనికి నాఁడుకోంగ పెట్టకోడి క్రౌంచి లభించినట్లు మేలుకొనునో వానికి సత్కుల మునఁ బుట్టి ప్రియవాదిని యైన భార్య లభించును. స్వప్నములు మిథ్యలైనచో నిట్టి ఫలము లెట్లు కలుగును.

శా. తొండీ చాటుగ లేచి రామవిభుఁ డీ • పూఁబోఁడిఁ గైకొంచు ను
ద్దండైై రాక్షస కోటులం దునుముచోఁ • గోపించి మీ రిట్టు లు
ద్దండత్వంబున నాత్మదారను బ్రియం • దర్జించి బాధించుటన్
ఖండీభూతలఁ జేయకుండఁడు మిముం • గంజాక్షి సంప్రీతికై. ౨౦౮

అర్థములు. ఉద్దండత్వమునన్ = విశేషముగ, ఆత్మదారను=తన భార్యను, ఖండీభూతలన్ = తునుకలుగాఁ జేయఁబడిన వారిని.

తాత్పర్యము.

రాక్షసాంగనలారా! లేచి చాటుగఁ బొండు. రాముఁ డీ సీతాదేవిని గ్రహిం చుటకై రాక్షసుల నెల్ల భయంకరుఁడై వధించునపు డీమెను తనభార్యను విశేషించి భయపఱచి బాధించుటచే నీమె సంతోషమునకుఁగాను మిమ్మెల్లఁ దునుకలుగా నఱుకక మానఁడు.

క. మచ్చిక గల దని తన్నున్, వచ్చిన దని భార్య యని వచనంబుల కెలమిన్
వచ్చిన దని రఘునాయకుఁ, డిచ్చానకు నై వధించు • నెల్లయసురులన్. ౨౦౯

తాత్పర్యము.

తనయందుఁ బ్రేమగలదని తన్ను నమ్మినదని తన భార్యయని తనతోడ నడవు లకు సంతోషముతో వచ్చినదని రామచంద్రమూర్తి యీమె నిమిత్తమై రాక్షసుల

నెల్ల జంపును. ౪౫౩ పద్యమును జూచునది. రామచంద్రమూర్తి దుఃఖించుట కే కారణములు చెప్పెనో యా కారణములే త్రిజటయు రాక్షసవధకుఁ గారణములుగాఁ జెప్పెను.

దీనివలనఁ దన యాశ్రితుల నవమానించినవారిని భగవంతుఁడు సహింపఁడు, తీవ్రముగ దండించు నని సూచన. దోషము కొలఁది వంశనాశము చేయును. ద్రౌపది నవమానించిన కౌరవులు వంశనాశమై పోయిరి. సీతాదేవిని బాధించిన రావణుఁడు వంశనాశ మయ్యెను. దీనివలనఁ బతివ్రత నవమానించువారు బాధించువారు తప్పక వంశనాశ మగుదురు.

ఉ. చాలును జాలు రక్కసులు ! • సాధ్వసభావలపుస్తకంబు లా
మూలను గట్టి వైవుఁ డిఁక • మోసము వచ్చును, మంచిమాటలన్
లాలన సేయుఁ డీమె, మన•లన్ క్షమియింపఁగ వేఁడుకొంటయే
పోలును, సీత యాత్మవిభుఁ • బొందుట నిక్కము నిక్కలం గనన్. ౭౦౮

అర్థములు. రక్కసులు = రాక్షసులారా! సాధ్వసభావల పుస్తకంబులు = మీరు పాఠముగ నేర్చిన బెదరింపు మాటల పుస్తకములు, నిక్కల = నిజమైనకల.

తాత్పర్యము.

రాక్షసులారా! మీ మాటలు చాలింపుఁడు. మీరు పాఠముగ నేర్చుకొన్న బెదరింపుమాటల పుస్తకము లావలఁ బాఱవేయుఁడు. ఇఁక నా పాఠములు వల్లించిన మన ప్రాణమున కపాయము వచ్చును. కావున మంచిమాటలచే నమ్మా తల్లి యని బుజ్జగింపుఁడు. ఇదివఱకుఁ జేసినదానికిఁ బ్రాయశ్చిత్తముగ క్షమింప వేఁడుకొంటయే తగిన కార్యము. నాది నిజమైన కల. దీనినిబట్టి చూడ సీత తనభర్తతోఁ గూడు కొనును.

క. వ్యసనంబుల మునిగిన యా, బిసజేక్షణవిషయ మిట్టి•విధమున కలయుం
బొసఁగిన యేనియుఁ దత్సతి, వెస దుఃఖము బాసి సుఖిత•నెలయును జుండీ.

అర్థములు. బిసజ+ఈక్షణ= కమలము వంటి కన్నులు గలది. బిసజేక్షణ విషయము = బిసజేక్షణ విషయమందు అని సప్తమ్యర్థమునఁ బ్రథమగాఁ గాని బిసజేక్షణ విషయముగాఁ గల దని బహువ్రీహిగ నైన గ్రాహ్యము.

తాత్పర్యము.

వ్యసనంబులందు మునిఁగి యున్న యే స్త్రీ విషయమున నిట్టి కల కలుగునో యా స్త్రీ దుఃఖములను బాసి సుఖించును.

క. అదరించియు బెదరించియు, ముదలించియు గాసి పెట్టి•మో మన మేలా
సదయ యగు ననఁగ వలవదు,కదిసెంబో బెడద మనకుఁ •గాకుత్స్థునిచేన్. ౭౧౦

అర్థములు. ముదలించి = ఆజ్ఞపెట్టి, సదయ = దయతోఁ గూడినది, బెడఁద = అపాయము.

తాత్పర్యము.

సీతాదేవిని మన మదరింపలేదా బెదరింపలేదా నిర్బంధింప లేదా మన విషయమున నీమె యెట్లు దయ గల దగును? అనవలదు. మనకు రామునిచే నపాయము సమీపించినది. రావణుఁడు చావఁగానే మనము చేయుచున్న పనికి మనల నయ్యో పాప మని రక్షించు వా రెవరు ?

క. ప్రణతిప్రసన్న జానకి, యణుమాత్రంబైన సంది యము లేదు సుఁడీ
క్షణదాచరసతులారా, యణుమధ్యను వేఁడుఁడీ మహాపదఁ బాపున్. ౨౧౧

అర్థములు. ప్రణతిప్రసన్న = ఈమె నమస్కారముచేతనే సంతోషించునది. క్షణదాచరసతులారా = రాక్షసాంగనలారా ! అణుమధ్యను = సూక్ష్మమైన నడుముగలదానిని.

తాత్పర్యము.

ఈమెను నానావిధముల బాధించితిమే, మనయందు దయ దలఁచునా యని సందేహింపఁ బనిలేదు. ఈమె నమస్కార ప్రియురాలు. మన మెన్ని తప్పులు చేసి నను నిష్కల్మషమైన బుద్ధితో క్షమింపు మని వేఁడుచు నమస్కరించితిమేని శాంతి వహించి మనల నవశ్యము రక్షించును. మనకు రాఁగల మహాపాయమును నీమె తప్పఁ బాపువా రెవ్వరును లేరు.

"ప్రాయశ్చిత్త ప్రసంగేషు, సర్వపాప సముద్భవే
మా మేకాం దేవదేవస్య, మహిషీం శరణం వ్రజేత్॥"

సర్వపాపములు చేసి ప్రాయశ్చిత్తము పెట్టుకొనవలసి వచ్చినపుడు దేవదేవ మహిషినైన నన్ను శరణము పొందవలెను. "సర్వకామప్రదాం రమ్యాం, సంసారార్ణవ తారిణీం, క్షిప్ర ప్రసాదినీం లక్ష్మీం శరణ్యా మనుచింతయేత్॥" సమస్త కాంక్షల నిచ్చునదియు, మనోజ్ఞమైనదియు, సంసారసముద్రమును దాటించునదియు, శీఘ్రముగ ననుగ్రహించునదియు నగు లక్ష్మీదేవిని శరణు చొర నర్హ యగు రక్షకురాలిని ధ్యానింపవలెను, అను వాక్యములు స్మరింప నగు.

క. లక్షించి చూడఁగా నవలక్షణ మొకటైన లేదు లలితాంగి విశా
లాక్షి యెయిఁ గాన వల్లభ,సాక్షాత్కారంబు గలుగు జలజాక్షీ కెటున్. ౨౧౨

అర్థములు. అవలక్షణము = చెడు చిహ్నము, సీతాదేవి బాగుపడఁగల దనుటకు రెండవ కారణము చెప్పుచున్నది.

తాత్పర్యము.

కల యటుండ నిండు. ఈమె దేహచిహ్నములఁ బరీక్షించి చూచినను నీమెకు శాశ్వతముగఁ బతి వియోగము గలదని తెలుపు చెడు చిహ్న మొకటియైన లేదు. కావున భర్త యీమెకు సాక్షాత్కరింపఁ గలఁడు.

క. కేవలము వన్నె మాయుట,చే వనటం బడె నటంచు • సెంకించితి నీ
దేవి యదుఃఖార్హాయ యగు, గావున దివ్యసుఖములను • గలదు భుజింపన్. ౨౦౩

అర్థములు. సెంకించితిన్ = సందేహించితిని, అదుఃఖార్హాయ = దుఃఖపడ యోగ్యురాలు కాదు.

తాత్పర్యము.

ఈమె దుఃఖముచేఁ గాంతి మాయుటచే నీమె భర్తను బాసి దుఃఖ మనుభవించునదియే యని సందేహించితిని గాని యీమె దుఃఖంప నర్హురాలు గాదు. ఈమె దివ్యసుఖముల ననుభవింపఁ గలదు. సందర్భము లట్లుండుటచే నీమెను నిష్కారణముగ బాధించి వెనుక మన మేల బాధపడవలెను. ఈమెను బాధించుట వలన మనకు రాఁగల లాభమేమి ? ముఖకాంతి మాయుట కష్ట దశను దెలుపును.

చ. అదె యదె కంటిరే జలరు•హాయతపత్రముఁ బోలి మిక్కిలిన్
గదలెడి వామలోచనము • తన్వికిఁ బ్రియసూచకంబునై
సుదతికిఁ గార్యసిద్ధియును • పోతులతేనికి నాశనంబు దు
ర్మదపరకాలుఁడైన రఘు•రామునకున్ విజయంబుఁ దెల్పుచున్. ౨౦౪

అర్థములు. జలరుహాయత పత్రము = కమలము యొక్క దీర్ఘమైన రేకు. వామలోచనము = ఎడమ కన్ను, ప్రియసూచకంబునై = మేలు సూచించునదై, పోతుల తేనికి = రాక్షస రాజగు రావణునకు, దుర్మద పరకాలుఁడు = చెడు గర్వము గల శత్రువుల పాలిటికి యముఁడైన వాఁడు.

తాత్పర్యము.

నా మాట యసత్యమేమో ప్రత్యక్షముగఁ జూడుఁడు. అదిగో నదిగో నామె యెడమకన్ను నిడివి తామరరేకు వంటిది యెట్లదరుచున్నదో చూడుఁడు. అది యామెకు మేలు సూచించు చున్నది. ఈమె కోరిన కార్యము భర్తసమాగమము సిద్ధించును. రావణాసురునకు వినాశము, మదించిన శత్రువులపాలికి యముఁడైన రామచంద్రమూర్తికి గెలుపు తెలుపుచున్నది. స్త్రీల కెడమ కన్నదరుట శుభ సూచకము. ఇది మూఁడవ కారణము.

క. అకస్మికముగ జానకి, డాకేల్ పులకించి వడకె • డాపలిదెస శుం
డాకారోరు వదరుచును, గాకుత్స్థుఁ బురస్థితిం బ్ర•కాశముఁ జేసెన్. ౨౦౫

అర్థములు. అకస్మికముగన్ = ఉన్నట్టులుండి, డాకేలు = ఎడమచేయి, పులకించి = గగ్గురు పొడిచి, డాపలిదెస = ఎడమప్రక్కన, శుండాకార = ఏనుగు తొండమువలె నున్న, ఊరువు = తొడ, కాకుత్స్థు పురస్థితిన్ = రామచంద్రమూర్తి సమీపమందే యుండుట.

తాత్పర్యము.

ఉన్నట్టులుండి సీతాదేవి యెడమచేయి గగ్గురు పొడిచి యదరెను. ఎడమతొడ

యదరెను. దీనివలన రామచంద్రమూర్తి సమీపమందే యున్నాఁడనుట సిద్ధము.

చం. నెలకొని శాఖలందుఁ గడు • నెమ్మది నుత్తమసాంత్వవాది యై
వెలసెడి పక్షి పల్కుచును • వెండియు వెండియు స్వాగతోక్తిఁ బే
రెలమిని వెండి వెండియును • ప్రేరణ చేసెడునట్లు గ్రాలెడున్
వల దిక నింద నిల్చి యతి • వన్ వ్యథపెట్టఁగఁ బొందు దవ్వుగన్. ౭౧౬

అర్థములు. ముందు తనకుఁ గల వచ్చెనని చెప్పెను. దాని కనుగుణముగా సాముద్రిక చిహ్నములను శుభశకునములను జెప్పెను. ఇఁక నంతకంటె బహిరంగమైన శకునము చెప్పుచున్నది. శాఖలందు నెలకొని, కడునెమ్మిగన్=మిక్కిలి సంతోషముతో, వెండియు వెండియున్ = మీఁద మీఁద, పలుమఱు; ఉత్తమ సాంత్వవాదియై = మిక్కిలి మధురముగఁ బలుకుచున్నదై, పక్షి = పైఁడికంటి పక్షి, స్వాగతోక్తిన్ = స్వ + ఆగత + ఉక్తిన్ = స్వ = బంధువులయొక్క, 'బంధు స్స్వస్వజనాసమా'యని యమరము. బంధువు రాకను గుఱించి మాటను, పేరెలమిని= మిక్కిలి సంతోషముతో, వెండి వెండియును = మాటి మాటికిని, ప్రేరణ చేసెడునట్లు = సీతాదేవిని ప్రేరించుచున్నదో యను నట్లు, రాముని కథను జెప్పుచున్నట్లు, గ్రాలెడిన్ = ఒప్పుచున్నది. కావున నో రాక్షసస్త్రీలారా! మీ రిచ్చట నుండి యీమెను బాధపెట్టవలదు. దూరముపొండు. ఇది నాల్గవకారణము.

(౨) శాఖలందున్ = చిగిరించి పూచియున్న కొమ్మలందు, ఇట్టివే శాఖలనఁబడును. నెలకొని=నెలవుకొని= దృఢముగాఁ గూర్చుండి, కడు నెమ్మిగన్= ఫలాదులఁ దినుటచే మిగుల సంతోషముగ. ఉత్తమ సాంత్వవాదియై వెలసెడి పక్షి, పక్షి = గొప్ప ఱెక్కలు గలది. పక్ష+ఇ=పక్షి. ప్రశంసార్థమున మతుప్ప్రత్యయము. 'భూమనిందాప్రశంసాసు। నిత్యయోగేతిశాయినే। సంసర్గేస్తి వివక్షాయాం। భవంతి మతుబాదయః" అను ప్రమాణమును గ్రహించునది. అనఁగా ఱెక్కలు విచ్చి యాకసమున గుండ్రముగఁ దిరుగుచుండిన గరుత్మంతుఁడు - గరుడపక్షి యాకాశమునఁ జక్రాకారముగఁ బ్రదక్షిణముగఁ దిరుగుటయుఁ బచ్చికొమ్మపై దృఢముగఁ గూర్చుండుటయు ఫలాదుల భక్షించుచు సంతోషముగా నుండుటయు శుభసూచకములు. కావుననే యుత్తమసాంత్వవాదియై వెలసెడు నట్లున్నది. పైనున్న యట్లను పదము వలసిన చోటుల నెల్ల నన్వయించును. ఉత్తమ సాంత్వవాది = నీ భర్త శీఘ్రముగా వచ్చును, ఇది దుఃఖపడవలసిన కాలముగాదు, కావున దుఃఖపడవలదు, అని యూఱట మాట లాడుచున్నది. స్వాగతోక్తిని వెండి వెండియుఁ బల్కుచును- నీభర్తదుఃఖము నీ దుఃఖ మంత్రమాత్రమే కాదు. ఇంతకంటె నెంతయో యధికము అని పలుమాఱు చెప్పుచున్నట్లు విరహిణులకుఁ జెప్పెడి స్వాగతోక్తి భర్త సంతాపాతిశయమును జెప్పుటయే యని యెఱుఁగవలెను. కాఁబట్టియే కదా కాళిదాసుఁడు, "తపతి తనుగాత్రి మదన స్త్వా,మనిశం మాం పునర్దహ త్యేవ, గ్లపయతి

యథా శశాంకం న తథా హి కుముద్వతీం దివసః" అని శాకుంతలమునఁ జెప్పెను. సన్నని దేహము గలదానా! మన్మథుఁడు నిన్ను దపింపఁజేసి నేని వన్నుఁ గాల్చుచునే యున్నాఁడు. పగలు చంద్రు నేమి చేయుచున్నదో కలువతీఁగ నేమి చేయుచున్నదో చూడుము. (చూడు ౧౮౧౩-౧౮౧౫ప)

వెండి వెండియును ప్రేరణ చేసెడువట్లు = ఇట్లీమె యొద్దకు రామచంద్రమూర్తి వచ్చుట నిశ్చయమైన పిదప నింకేల స్నానాలంకారాదులకై తామసించు చున్నది, ఏల త్వరపడరాదు అని సీతను ప్రేరించువట్లు కాఁ్రిలెడిని. ఆ పక్షిస్వరము విన్నప్పుడిట్లుగాఁ దోఁచు చున్నదని యుత్ప్రేక్షాలంకారము. పేరెలమిన్ = భార్యాభర్తలు కూడుట తనకే గొప్పసంతోషముగా భావించి యీపక్షి యట్టి తనభావము రోమాంచముచేఁ దెల్పుచున్నట్లున్న దని భావము.

(౩) ఉత్తమము మధ్యమము అధమము అని కావ్యములు మూఁడువిధములు. "తను వగు శబ్దార్థంబులు, ధ్వని జీవ మలంక్రియా వితానము సొమ్ముల్, దనరు గుణంబులు గుణములు ఘనవృత్తులు వృత్తు లౌర కావ్యేందిరకున్" నరస. అని. కావ్యమునకు ధ్వని ప్రాణము. శబ్దార్థములు దేహము. కావున వాచ్యార్థమున కంటెను, ధ్వన్యర్థమెందు విశేషించి యున్నదో యది యుత్తమకావ్యము. వాచ్యార్థముకంటె ధ్వన్యర్థమెం దతిశయింపదో యది మధ్యమకావ్యము. దీనినే గుణీభూతవ్యంగ్య మందురు. అనఁగా వ్యంగ్యము గౌణము, అప్రధానము అని యర్థము. ధ్వనియే లేనిది యధమ కావ్యము. కథల పుస్తకములవంటివి చిత్రకావ్యములు. ఇట్టి ధ్వన్యర్థ మొక్కచోఁ బదమునను, ఒక్కచో వాక్యమునను, మఱొక్కచోఁ బ్రబంధ సమష్టి పైనను నుండుట గలదు. ఈ కాండమున ధ్వన్యర్థము అనాదిగా భగవత్సంబంధము గల జీవుఁడు సంసారమునఁ జిక్కి బాధలు పడుచుండఁగా నాచార్యుఁ డది చూచి తాళలేక వాని యుజ్జీవనార్థమై ప్రవర్తించు చున్నాఁడు అని. ఈ యర్థము ఈ కాండమున రెండవ పద్యమగు "తరువాత రావణాసుర వరసీత" యను పద్యముననే సూచింపఁబడెను. ఈ కాండమున లంకాశబ్దముచేత శరీరమును ఏకాత్మ్యాదులచేత నింద్రియములును రావణ కుంభకర్ణులచే నహంకారమమకారములును ఇంద్రజిత్తు లోనగువారిచే కామక్రోధాదులును సూచితము. లంకలో శ్రమపడుచున్న సీత యనుటచే సంసారమునఁ గష్టపడుచున్న జీవుఁ డనియు నట్టి జీవునికి భగవత్ప్రేరణమున జ్ఞాన ముపదేశింప వచ్చిన యాచార్యుఁడు హనుమంతుఁడనియు సూచితము. ఆ యాచార్యుని లక్షణమీ పద్యంబున సూచితము. శాఖలందున్ = వేదశాఖలందు - నెలకొని = (౧) దృఢముగానుండి; వేదశాఖలను మఱవక దృఢముగా జ్ఞప్తియం దుంచుకొని; అధ్యయనము చేసిన వేదమును మఱవరాదు. మఱచినచోఁ బాపము కలదు. "అధీత మపి యోవేదం విముంచతి నరాధమః, భ్రూణహా సమవిజ్ఞేయో యోని మధిగచ్ఛతి" యని శిక్షా వాక్యము. (౨) నెలకొని = వేదార్థవిషయమైన శ్రవణ మనన

నిది ధ్యాసనము లనియెడి యనుష్ఠానములు కలిగి "ఆచార్యో వేదసంపన్నో విష్ణుభక్తో విమత్సరః మంత్రజ్ఞో మంత్రభక్తశ్చ, సదా మంత్రాశ్రయ శ్శుచిః, గురుభక్తి సమాయుక్తః పురాణజ్ఞో విశేషతః, ఏవం లక్షణసంపన్నో గురురిత్యభిధీయతే॥" అనియాచార్య లక్షణము. అనఁగా జ్ఞానముగలవాఁడును విష్ణుభక్తి గలవాఁడును మాత్సర్యము లేనివాఁడును, మంత్రార్థము తెలిసినవాఁడును, ఆ మంత్రమందు భక్తిగలవాఁడును, సర్వదా మంత్రము నాశ్రయించి యుండువాఁడును అనఁగా మంత్రార్థ మనుసంధానము చేయుచు నాప్రకారము వర్తించువాఁడును, లోపల వెలుపలఁ గామినీ కాంచనాదుల పట్ల శుచిగా నుండువాఁడును, గురుభక్తి గలవాఁడును, పురాణజ్ఞానము విశేషించి గలవాఁడును, శాస్త్రములఁ జదివి తా నాప్రకారముగ నాచరించుచు శిష్యులచేనాచరింపఁ జేయువాఁడు నగు వాఁడు గురువనఁబడును. ఇట్టి యాచార్యలక్షణ మీా పదముచే జెప్పినట్లయ్యెను. కడు నెమ్మిగన్ = సదా సంతోషముతో నుండు నని భావము. ఇట్టి యాచార్యుఁడుగదా భక్తులకు సదా సేవ్యుఁడు. "ఆహ్లాదశీతనేత్రాంబుః పులకీకృతగాత్రవాన్ సదా పరగుణావిష్టో ద్రష్టవ్య స్సర్వదేహిభిః" ఆచార్యుఁడు సర్వదా సంతోషముచేఁ జల్లని యానందబాష్పములు గలవాఁడును, పులకరించిన దేహము గలవాఁడును, ఎల్లప్పుడును పరమాత్మ గుణములను ధ్యానించుచుండువాఁడును నగువానిని గురువుగ నందఱు చూడవలెను. ఆచార్యుఁ డిట్టి సంతోషము గలవాఁడై యుండవలెను. నెండి నెండియును ఉత్తమ సాంత్వవాది - ఉత్తమ = "ఉత్తమః పురుషస్త్వన్యః పరమాత్మే త్యుదాహృతః" భ. గీ. ప్రకృతి జీవులకంటె - బద్ధాత్మ ముక్తాత్మలకంటె నుత్తమ పురుషుఁడు పరమాత్మ యని చెప్పఁబడును, అన్నట్లు పరమాత్మను గుఱించి సాంత్వవాది = మంచి మాటలను శిష్యులకుఁ జెప్పువాఁడు. "త్వంమేఽహంమే, కుత స్తత్తదపి కుత ఇదం వేదమూల ప్రమాణా చ్చైతచ్చానాదిసిద్ధా దనుభవ విభవాత్తర్హి సాక్రోశఏవ। క్వాక్రోశః? కస్య? గీతాదిషు మమ విదితః కోత్రసాక్షీ? సుధీస్యాదర్థం త్వ త్పక్షపాతీ స ఇతి నృ కలహే మృగ్య మధ్యస్థవ త్త్వ" మ్మని పూర్వాచార్యులు చెప్పినట్లు జీవ పరమాత్మలకు స్వాతంత్ర్య వివాదము కలిగినప్పుడు "యమో వైవస్వతో రాజా య స్తవైష హృది స్థితః తేనచే దవివాద స్తే మా గంగాం మా కురూన్ గమః" మనుస్మృతి. అనఁగా సర్వము సంయమించు వాఁడగుటచే యముఁడనియు దండించువాఁడగుటచే వైవస్వతుఁడనియు రంజించువాఁడగుటచే రాజనియుఁ జెప్పఁబడి నీ హృదయమందుండు పరమాత్మతో నీకు వివాదము లేదేని అనఁగా నాత్మవంచనము లేక సత్యమందుఁ బ్రవర్తించెదవేని గంగకుఁ బోవలసిన పనిలేదు. కురుక్షేత్రమునకుఁ బోవలసిన పనిలేదు. అంతరాత్మ కనుకూలముగ త్రికరణశుద్ధిగఁ బనులు చేయువాఁడు దన పాపములను బోఁగొట్టుకొనుటకు గంగాది స్నానములకై పోవలసిన పనిలేదు. వానియందుఁ బాపలవము లేదు. కావున నంతరాత్మకు విరోధముగా వర్తించు వాఁడెక్కడ

నెన్ని స్నానములు వ్రతములు చేసినను నిష్ప్రయోజనము. వానిపాపము పోదు. కావున వాడు తీర్థయాత్రలు చేయవలసిన పనిలేదు, అనియర్థము. ఇట్టి భగవదనుకూల ప్రవర్తనము భగవంతుని స్వాతంత్ర్యమును నాచార్యుఁడు మంచిమాటలతో జీవునికి బోధించును అనిభావము. సేద్యగాఁడొక తూరిపొలము దున్ని పైరుపెట్టినపుడది మొదటిసారి ఫలింపక విత్తుపాడైనను, పై రెండి పోయినను నంతమాత్రమున సేద్యము చేయుట మానక మఱలమఱలఁ గృషిచేయుచుఁ దాను బూనిన కార్యము సఫలమగునంతవఱకు నిలుపనట్లు ఆచార్యుఁ డొక్కసారి చెప్పఁగా వారివచనములను శిష్యుఁడు వినకపోయినను నంతతో వదలక యాశిష్యుఁడు తనమాట వినునంత వఱకు నప్పుడప్పుడు వానికి జ్ఞాన ముపదేశించుచుండును. అని వెండియు వెండియు ననుపదముచేతఁ జెప్పినట్లయ్యెను. ఎట్లనఁగా నర్జునునకు భగవంతుఁడు భగవద్గీత యుపదేశించెను. దాని నర్జునుఁడు మఱచి మఱల దానిని జెప్పుమని యడిగెను. అప్పుడు శ్రీకృష్ణభగవానుఁడు 'నూన మశ్రద్దధానోసి, దుర్మేధాశ్చాసి పాండవ" అర్జునా! నీవు శ్రద్ధగలవాఁడవు కావు. చెడుమేధ గలవాఁడ వని చీవాట్లుపెట్టి యనుగీతల నుపదేశించెను. ఇది ఉత్తర గీత లనఁబడునది కాదు. మహాభారతమున నశ్వమేధ పర్వమున ననుగీత లున్నవి కాని యుత్తరగీత లనునది లేదు. దానికి దీనికి సంబంధములేదు.

పరలోక గమనమునకు సాధనమైన జ్ఞానము కర్మము అను రెండు రెక్కలు గలవాఁడు ఆచార్యుఁడు. ఒంటి రెక్క నిష్ప్రయోజన మైనట్లు జ్ఞానములేని కర్మము, కర్మములేని జ్ఞానము వ్యర్థము. రెండు చేరిననే ఫలముగలదు. "ఉభాభ్యా మేవ పక్షాభ్యాం యథా ఖే పక్షిణాంగతిః, తథైవ జ్ఞానకర్మాభ్యాం నియతా పరమాగతిః। అనువాక్యము ఇందుఁ బ్రమాణము. అనఁగా రెండు రెక్కలతో నాకాశమందుఁ బక్షి యెట్లు ఎగిరిపోవునో యట్లు కర్మజ్ఞానములు రెండును బరమగతికి నియతములు. 'జ్ఞానీతు పరమైకాంతి' యన్నట్లు జ్ఞాన మనఁగాఁ బరమైకాంతభక్తి. జ్ఞాన కర్మములలో జ్ఞాన మంగి, కర్మమంగము. 'బ్రాహ్మణా వివిదషంతి యజ్ఞేన దానేన తపసానాశకేన," యను శ్రుతి యీ యంగాంగిభావమునఁ బ్రమాణము. అనఁగా యజ్ఞముచేత దానముచేత తపస్సుచేత ఉపవాసములచేత బ్రాహ్మణులు చక్కఁగాఁ దెలిసినవా రగుచున్నారు. (జ్ఞాను లగుచున్నారు.) దీనిచే నాచార్య శబ్దమునకు వ్యుత్పత్తి చెప్పిన ట్లయ్యెను. 'ఆచినోతిహి శాస్త్రార్థా, నాచారే స్థాపయత్యపి, స్వయ మాచరతే యస్మా త్తస్మా దాచార్య ఉచ్యతే' యని యాచార్య శబ్ద నిర్వచనము. శాస్త్రార్థముల నెఱిఁగి తనకుఁ దెలిసిన దాని నితరులకుఁ జెప్పి చేయించుచుఁ దా నా ప్రకారము నడచువాఁ డాచార్యుఁడు.

స్వాగతోక్తిన్=స్వ+ఆగత+ఉక్తిన్ = తనకు నాచార్యపరంపరగా వచ్చిన మంత్ర మను వాక్కును పల్కుచును, మంత్రానుసంధానము నకుఁ బూర్వముగా

"ఆచార్యాణా మనా వసా వితాన్యాభగవత్త"యని శ్రుతి చెప్పినట్లు గురుపరంపరాను సంధానము తప్పక చేయవలె ననుట దీనిచేత సూచితము.

వెండివెండియును ప్రేరణ చేసినట్లు గ్రాలెడిన్ = తా నుపదేశించిన దానిని అనుష్ఠింపఁ బలుమాఱు శిష్యుని నాచార్యుఁడు ప్రేరించు నని భావము. అట్లుసేఁడు చేయనిచోఁ దాను జేసిన యుపదేశము వ్యర్థమగునుగదా. దీని ననుసరించియే 'స్థాలీత్యే శాసితార'మ్మని స్థలనము కలిగినపుడు శాసించు వాఁడని గురులక్షణము చెప్పఁబడెను. ఇది తన లాభమనియే గురు పెంచవలయును, అని పేరెలమి నను పదము సూచించును.

తాత్పర్యము.

కొమ్మలందుఁగూర్చుండి మిక్కిలి సంతోషముతో మేలగు నూరార్పు మాటలు పక్షి చెప్పుచు మీఁద మీఁద శుభమును దెలిపెడి పలుకులను బలుకుచు నిండు సంతోషముతో ధైర్యము కలిగి యుండఁ బ్రేరించుచున్న ట్లొప్పుచున్నది. దీనివలన సీతాదేవికిఁ గేవల సమీపకాలమందే శుభము కలుగఁగలదు. కావున మీరిందుండి యీమెను బాధింపవలదు. లేచి దూరముగాఁబొండు. ఆమెను నిర్భయముగా నుండనిండు. అనఁగా వారందఱు నట్లేచేసిరి. ఇచ్చట నా రాక్షస స్త్రీలు సీతాదేవి శరణు చొచ్చిరి. ఆమె రక్షించెదనని యభయమిచ్చెను. ఈ విషయ మిచ్చటఁ జెప్పఁబడలేదు. సీతాదేవి గుణమ్మాహాత్మ్యము వానరులకుఁ దెలియఁ జెప్ప టావశ్యకము, గావున హనుమంతుఁడు వానరులతో మాటలాడు సమయమున నిది యాయన చెప్పెను. రెండుస్థలము లందొక విషయము చెప్పుట వ్యర్థమని వాల్మీకి ముఖ్యమైన చోటఁ జెప్పెను.

—• { ౨౮-వ సర్గము సీతాదేవి శ్రీరాముడు తనకి యనేకవిధములఁ బరితపించుట. } •—

మత్తకోకిలము. క్రూరుఁ డైన దశాస్యునాజ్ఞను • ఘోరరాక్షసకామినుల్
దారుణంబుగ నప్రియంబులు•దన్ను పలుకుచు నుంటకున్
ధారిణీసుత కాననో మృగ•నాథుబారిని బడ్డ యా
వారణేంద్రుని కన్యకీతిని • బాధకంపిత గాత్రయై. ౨౧౭

తాత్పర్యము.

దయలేని రావణాసురుని యాజ్ఞాప్రకారము రాక్షసస్త్రీలు తన్ను వినరాని మాట లనుచుండఁగా సీతాదేవి యడవిలో సింహము బారిని బడ్డ యేనుఁగు పిల్లవలె మిగుల వణఁకుచున్న దేహము గలదై.

మత్తకోకిలము. ర స జ జ భ ర-పదునొకండవ స్థానంబున యతి.

మత్తకోకిలము. రాక్షసాంగన లెల్లఁ జుట్టును • గ్రాలి భీషణవేష లై
రూక్షభాషల బాధపెట్టఁగ • రోషదూషితుఁ డైన యా

రాక్షసాధిపు తర్జనంబుల • రామకామిని కాన సం
రక్షకచ్యుత యైన బాలిక • రాఁ దా విలపించుచున్. ౨౧౮

తా త్ప ర్య ము.

రాక్షస స్త్రీలందఱు చుట్టుకొని భయంకరాకారములతోఁ గఠిన వాక్యముల చేతను, కోపముచే మనస్సుచెడిన రావణాసురుని బెదరింపుమాటలకును రామచంద్ర మూర్తి దేవి సీత యడవిలోఁ గాపాడువారు లేని యాఁడుపిల్లవలె నేడ్చుచు.

పంచచామరము. అకాలమందు మృత్యు వబ్బ • దండ్రు పెద్ద లెల్ల నా
ప్రకారమే యథార్థ మయ్యెఁ • బ్రాణమేగ దయ్యయో
నికారరీతిఁ దెచ్చి క్రుచ్చి • నిష్ఠురంబు లాడఁగన్
వికారరాక్షసీజనంబు • నే నదెంత పాపనో. ౨౧౯

అర్థములు. నికారరీతిన్ = మోసపువిధముగ.

తా త్ప ర్య ము.

విధి నియమించిన కాలము వచ్చువఱకుఁ బ్రాణముపోదని పెద్దలు చెప్పుదురు. ఆ మాటయే నా విషయమున నిజమయ్యెను. కాలము రాలేదు. గనుకనే ప్రాణము పోవలసినంత స్థితి వచ్చినను వది పోలేదు. రావణాసురుఁడు మోసపువిధముగా నన్నుఁ దెచ్చి వికారాకారములు గల రాకాసుల కఠిన వాక్కుల నన్నుఁబొడిచి బాధించు టకు నే నెంత పాపము చేసితినో.

పంచచామరము. జర జర జగగణంబులు, తొమ్మిదిఁట యతి. దీనిలో మొదటి హల్లు తొలఁగించిన సుగంధి యగును.

మత్తకోకిలము. అక్కటా! కఱ వాయె సౌఖ్యము • నైకదుస్సహదుఃఖముల్
పెక్కు లాయెను, వజ్రపాతవి•భిన్నశృంగమునట్టు లై
యొక్క వే శకలంబు లై చన•దుల్ల మింతయుఁ జూడఁగా
నిక్క మీ హృదయంబు నాశిల • నేర దెన్నఁడు దైవమా! ౨౨౦

అర్థములు. నైక = అనేకములయిన, దుస్సహ = సహింపరాని, వజ్రపాత= వజ్రము పడుటచే, విభిన్న = పఱిగిన, శృంగమునట్టులై = పర్వత శిఖరమువలె, వే= వేయి, శకలంబులు=తునకలు, ఉల్లము=హృదయము.

తా త్ప ర్య ము.

అయ్యో! సౌఖ్యమా కఱవాయెను. సహింపరాని దుఃఖములా యనేకము లయ్యెను. వజ్రముపడిన కొండ శిఖరము పగిలి తునుక లగునట్లు నా హృదయమా వేయితునుకలై పోదు. ఇదంతయుఁ జూడఁగా నా హృదయమునకు నాశన మనునది లేదు.

ఉ. చూడఁగ నైనరాని సుర•సూదను కోఁతకు నగ్గ మౌచు న
ల్లాడుటకంటెఁ బాప మగు•నా యురిపోఁతల నేను బ్రాణమున్
వీడుట ? శూద్రజాతునకు • విశ్రుతమంత్ర మొసంగి పాపి యౌ
బాడబునట్లు నాకుఁ దగు•నా మన నీయ నిశాటనేతకున్ ? ౭౨౧

అర్థములు. చూడఁగనైనరాని = ముఖముఁ జూచినను బాపము వచ్చును. అంతటి మహాపాపి. చూచి సహింపరాని భయంకరుఁడు; అగ్గము=వశము, బాడబు నట్లు=బ్రాహ్మణునివలె; నిశాటనేతకున్=రాక్షస ప్రభువునకు.

తాత్పర్యము.

చూచి సహింపరాని రావణాసురుఁడు పెట్టు హింసకు లోఁబడి బాధపడు చుండుట కంటె నురి పోసికొని యాత్మహత్య చేసికొనుట తప్పా ? ఆత్మహత్య వలన నరకము వచ్చును గదా యనిన నరకబాధ దీని కంటెఁ దీవ్రమయినదా ? రావణాసురుని యిష్టప్రకారము వర్తించిన యెడల నీ బాధ యీ బాధ తప్పునుగదా యనిన శూద్రునకు వేదమంత్ర ముపదేశించిన బ్రాహ్మణునివలె నేను రాక్షసునకు మన నీయ వచ్చునా.

రామచంద్రమూర్తికి నా మనసు త్రికరణశుద్ధిగా ధారపోసితిని. అట్టి దానిని మరలఁ దీసికొనిననే దత్తాపహారదోషము వచ్చును. దానికిఁ దోడు నీచున కర్పణ సేయుట మహాదోషము.

ఒక ఋషీశ్వరుఁడు శూద్రున కొకనికి వైదిక విధానముగఁ బైతృకర్మముఁ దెలిపి వానిచే నట్లు చేయించి రాజపురోహితుఁడుగాఁ బుట్టినట్లు భారతమున అనుశాసనపర్వంబునఁ గలదు. కావున నిది ముముక్షువునకు భగవన్మంత్రమును నిషేధింపదు. ఏలన:- భక్తిప్రపత్తి మార్గముల మోక్షమున కందఱు నధికారులే. కావున దానికిఁ గావలసినది చెప్పుట తప్పుగాదు. వైదిక కర్మములందు శూద్రున కధికారము లేదు. కావున వానివిధానము చెప్పరాదని భావము.

మానిని. దుర్భర తేజుఁడు రాముఁడు వ న్నిటఁ • దూర్ణము చూడఁగ రానిమొకన్
నిర్భరకోపముతో గడు వేగిన • నిష్ఠురశాతకృపాణములన్
గర్భమున న్మరణించిన జంతువు • కండల శస్త్రచికిత్సకుఁడున్
నిర్భిదమున్ ఘటియించుగతిన్ రజ•నీచరుఁ డోఁచక కోయు ననున్. ౭౨౨

అర్థములు. దుర్భర తేజుఁడు = శత్రువులకు సహింపరాని తేజముగలవాఁడు, నిర్భరకోపము = విశేష కోపము, నిష్ఠుర=కఠినములైన, కృపాణములన్ = కత్తులచే, శస్త్రచికిత్సకుఁడు=కత్తులతోఁ గోసి చికిత్స చేయువాఁడు, నిర్భిదమున్ = ఛేదించిన దానినిగా,

మానిని. ఏడు భగణములు గురువు; పదుమూఁట యతి.

తా త్ప ర్య ము.

శత్రువులకు సహింపరాని పరాక్రమము గల రామచంద్రమూర్తి త్వరగా నన్నుఁ జూడరాఁడాయెనా, గడువు ముగియఁగానే రావణుఁడు కోపాతిశయముచే నన్ను శస్త్ర చికిత్సకుఁడు గర్భములో మరణించిన శిశువును గోసినట్లు వాఁడికత్తులచే భయము లేక కోయఁగలఁడు.

మత్తకోకిలము. ఎంతకాలముగానొ యేడ్చెడి • హీనభాగ్యకు రెన్నెలల్
కొంత కొంత గతించె నే మను•కొందు నయ్యయొ ధారిణీ
కాంతు నాజ్ఞను గాలుసేతులు • కట్ట వేకువ వధ్యుఁ డై
చింతలం బడు దొంగ భంగిని • జింతఁ గుందెద దైవమా! ౭౨౩

తా త్ప ర్య ము.

దీర్ఘ కాలముగ నేడ్చుచుండు నిర్భాగ్యురాల నగు నాకు రెన్నెలలలోను గొంత కొంత గడచిపోయినది. (పదియవ నెలలో పదునైదు దినములు గడచెను.) అయ్యో! యే మనుకొందును? రాజాజ్ఞచేఁ గాలుచేతులు గట్టివైవఁగా నుదయము కాఁగానే చంపఁబడెడి దొంగవలె నేను దుఃఖపడు చున్నాను.

సీ. కన్నతల్లికి మిన్న • కరుణ నన్ లాలించు, నా రామమాత నా • యత్తగార!
యత్తగారికి మిన్న • యాదరించుచు నున్న, మైత్రి ధీపాత్ర సు•మిత్రదేవి!
కన్నతల్లినిబోలె • మన్నించు నా ముద్దు, మఱఁది యో లక్ష్మణా! • మహితచరిత!
తన ప్రాణములకన్న • ఘనముగా ననుఁ జూచు, ప్రేమసముద్ర యో • రామభద్ర!
తే. యయ్యయో రామ! లక్ష్మణా! • హా సుమిత్ర!
హా రఘూత్తము జనని య•త్తా! యిటేను
గడలి సుడిగాలి సుడివడు • కలముకరణి
మందభాగ్యను నిడుమల • గ్రాంగుదాన. ౭౨౪

అర్థములు. కలము = ఓడ, మందభాగ్యను = భాగ్యహీనను, గీతమున రెండవ పాదమునఁ బ్లుతియతి.

తా త్ప ర్య ము.

స్పష్టము.

చ. కటకట! నా నిమిత్తము మృ•గంబుస్వరూపముఁ దాల్చియున్న యా
కుటిలునిచేత మృత్యువును • గూర్చిరి శూరులు పార్థి వాత్మజుల్
దటుకునఁ బిట్టపిడ్గు వడిఁ • దాఁకిన సింహావృషద్వయంబునా
నటమట మింత కై నఁ గల•దా? మఱి యింతకు మూల మేఁ గదా! ౭౨౫

అర్థములు. మృగంబుస్వరూపము = జింకయొక్క యాకారము, మూలము ఏనుగదా = నేనేకదా కారణము.

తాత్పర్యము.

అయ్యో! నా కోఱకై జింక వేషముధరించిన వంచకునిచేత శూరు లగు రాజ కుమారులు వానలేని వట్టి పిడుగు పడుటచేఁ జచ్చిన సింహముల వృషభముల జంట వలె మరణించిరి కాఁబోలు. అయ్యో! యింతకంటె దుఃఖము గలదా? ఇంత యనర్థమునకు నేనేకదా కారణము. వారిరువురు నన్ను విడిచిపోవుట నా కోరిక ప్రకారమే కదా!

క. రామానుజుఁ డతత్పూర్వజు నే మూఢతఁ బాయఁ గాలమప్పుఁడే దురదృష్టన్
ఆ మృగరూపధరాకృతి,నై మోసము చేసె నన్నుమాట లిఁ కేలా ! ౭౨౬

అర్థములు. రామానుజున్ = రాముని తమ్ముని, తత్పూర్వజున్ = ఆ లక్ష్మణు నన్నను, రాముని తమ్ముఁడు లక్ష్మణుని యన్న యీ ద్రావిడ ప్రాణాయామ మేల? రామలక్ష్మణు లని చెప్పియుండరాదా యనిన ఇరువురు నించుమించు సమాను లని తెలుపుట కని యెఱుఁగునది. "ద్వా సుపర్ణా సయుజా సఖాయా" యను శ్రుతి నిట ననుసంధించునది. దీని వలన శుద్ధాత్మ పరమాత్మ లించుమించుగా సమాను లని భావము. మూఢతన్ = జ్ఞానహీనతచే, కాలము = మృత్యువు, దురదృష్టన్=దుష్ట ఫల మనుభవింప వలసిన దానను.

తాత్పర్యము.

రామచంద్రుని, లక్ష్మణుని నెప్పుడు తెలివిలేని దాననై దురదృష్ట వశమున నెడఁబాసితినో యప్పుడే మృత్యుదేవత జింకరూపము ధరించిన వాని రూపముగ వచ్చి నన్ను మోసగించెను. ఇఁక నే మనుకొని యేమి ప్రయోజనము! జీవాత్మ పరమాత్మ లిరువురు నెడఁ బాసిన దేహము వలె నైతిని.

ఉ. హా రఘురామ! సత్యరత హా! పరిపూర్ణసుధాకరాననా !
హా రమణీయ దీర్ఘకర! హా! జగదేకహితా! విశారదా!
హా రణరంగభీకర! సమస్తజగచ్ఛ్రయ భూతరక్షణా !
సారసనేత్ర! న న్నిట నిశాటులు చంపుట నీ వెఱుంగవో ! ౭౨౭

అర్థములు. సత్యరత = సత్యమందుఁ బ్రీతిగలవాఁడా ! పరిపూర్ణసుధాకర+ఆననా=నిండుచంద్రునివంటి ముఖము గలవాఁడా ! రమణీయ దీర్ఘకర=అందము లైన నిడుపాటి చేతులు గలవాఁడా! జగదేకహితా=ప్రపంచమునకు నొక్కఁడే హితము గోరువాఁడా! విశారదా = నేర్పరీ, రణరంగభీకర = యుద్ధరంగమందు భయంకరుఁడా! సమస్తజగచ్ఛ్రయ భూతరక్షణా = అన్నిలోకములనుండు ప్రాణికోటులను రక్షించువాఁడా! సారసనేత్ర = కమలములవంటి కన్నులు గలవాఁడా! నిశాటులు = రాక్షసులు, వీనిఁది పద్యమునందుఁ బ్రపన్నుఁడు భగవత్సాహాయ్యమును, భాగవత సాహాయ్యమును భక్తిహీనతచే నవివేకమున దురదృష్ట వశమునఁ గోలుపోయి ప్రకృతిచే వంచింపఁబడి మృత్యుస్వరూప మైన సంసారమునఁ బడితి నని తలఁచి

యేడిచి ఖించినదాని కేడ్చిన లాభ మే మనుకొని, దీనిని దరించు నుపాయము భగవచ్చింతనముదప్ప వే ఱుపాయము లేదని భగవద్గుణానుసంధానము చేయుచున్నాఁడు, అని ధ్వని. ఈ పద్యమున భగవత్స్వరూపస్వభావ వర్ణనము చేయఁబడెను.

తా త్ప ర్య ము.

హే రఘురామా! నీ వంశపూర్వుల యోగ్యత, కీర్తి, ప్రతిష్ఠ లాలోచింపుము. సత్యమందుఁ బ్రీతిగలవాఁడా! వివాహకాలమున నాకేమి ప్రమాణము చేసితివో యాలోచింపుము. నిండు చంద్రునివంటి ముఖము గలవాఁడా! లోకమునఁ జీఁకట్లు సమయఁజేసి, యమృతము గురియించి లోకుల సంతోషింపఁ జేయువాఁడుగదా నిండు చంద్రుఁడు. అటువంటినీవు నా విషయమున నెట్లు సార్థక నామధేయుఁడవు కావలెనో యాలోచింపుము. అందము లైన నిడుపాటి బాహువులు గలవాఁడా! నీ కందుకొన రాక దూరమైన దేదికలదు? ప్రపంచమున కంతయు హితమే కోరువాఁడవు నీవొకఁడవే కదా! నిన్నువిడిచిన నన్నురక్షించువారు లేరే. అదియు నాలోచింపుము. నీవు దేనికైన సమర్థుఁడవే. నన్నొకయాఁడుదాని నాపదనుండి తప్పించు సామర్థ్యములేదా? యుద్ధరంగమందు భయంకరుఁడా! నీవు పూనిన నీ రాక్షసులా నీకెదురు నిలుచువారు? దాని నాలోచింపుము. అన్నిలోకముల నన్నిభూతముల రక్షించు దీక్షగలవాఁడవే! నన్నొకతెను రక్షింపకుండిన నీ వ్రతము భంగముగాదా? కమలలోచనా! నీ వీ రాక్షసులవలెఁ గ్రూరపు దృష్టిగలవాఁడవు కావే. తేనచేఁ గమలమువలె దయచే నార్ద్రమైన దృష్టులు గలవాఁడవే. ఏల నాపై నా దృష్టి పఱుపకున్నావు? నీవు సర్వజ్ఞుఁడవే. ఇచ్చట రాక్షసులు నన్ను బాధించుట తెలిసికొనలేక యున్నావా!

సీ. ఈ వొక్కఁడవు దక్క • నితరదైవము లేద,టంచు నేఁ దలఁచిన • యట్టితలఁపు
వినఁగోరి నీసూక్తి • వికటరాక్షసపరు, షాలాపముల విను • నట్టి యొప్పు
నీ తోడ శయనించు • ప్రీతిమై నీ నేలఁ, బడియున్నయట్టి యా • కడిఁది దిటము
రాముఁ డేటికి నన్ను • రక్షింపకుండు నన్, ధర్మమార్గంబున • స్థైర్యవిధము
తే. నాదుపరమపాతివ్రత్య • నవ్యతపము,పాడుగాఁ బోయె నాదు దౌ • ర్భాగ్యమునను
ధరఁగృతఘ్నున కొనరించు • పరమకృతిని,బోలి నా పాప మెంత ప్ర • భూత మౌర.

అర్థములు. ఎంత పుణ్యవంతునకైనను, ఎంత తపస్వికైనను ప్రారబ్ధ మడ్డ పడినపుడు వాని పుణ్యము తపస్సు, శీలమేదియు రక్షింపఁజాలదని చెప్పఁబడుచున్నది.

వికటరాక్షస = భయంకరులైన రాక్షసుల, పరుషాలాపములు = కఠిన వాక్యములు; కడిఁది దిటము = గాఢమైన పట్టుదల, ధైర్యము, స్థైర్యవిధము = నిలుకడగా నుండుట.

నీ వొకఁడవు ....తలఁపు=దైవమనిన నీ వొకఁడవే దైవము గాని వేఱుదైవము లేఁడని మఱి యెట్టివారిని నేను దైవమని తలఁచినదికూడ లేదుకదా. "ఏకభక్తిర్విశిష్యతే" "అనన్యాశ్చింతయంతో మాం" "అనన్యచేతా స్సతతం

'అనన్యభాక్' 'అనన్యమనసః' 'అనన్యయోగేన' ఇత్యాది భగవద్గీతావాక్యములను 'నాన్యం దేవం నమస్కుర్యాత్' 'నాన్యం దేవం నిరీక్షయేత్' మఱి యొకరిని దేవుఁ డని నమస్కారము చేయరాదు. మఱి యొకరిని దేవుఁ డని చూడను రాదు. ఇత్యాదివాక్యము లనుసంధించునది. భక్తుఁడు, ప్రపన్నుఁడు, పతివ్రత సమానులు. నాథా! నే నిటువంటి యేకభక్తి నీ యందుఁ గలదాన నగుటచేఁ గదా నీవు నారాయణుపూజ సేయు నపుడును నేను నీ సహాయురాలుగా నుండి కావలసినవి యందిచ్చు చుంటినే కాని, నేను నారాయణునందుఁ గూడ దైవబుద్ధినుంచి యర్చించిన దాన గాను గదా. ఇది యనేక దేవతాపూజను నిరసించు చున్నది.

వినఁగోరి. . . . . .యోర్పు=చూచినంత మాత్రమువనే గుండెలు పగిలించు నీ రాక్షసుల కఠినవాక్యములు నే నోర్పుతో వినుటకు వానియందలి ప్రీతియా కారణము? కాదు. ఊపిరి పట్టుకొని యుండిన నీ మధురాలాపములు మఱల విను భాగ్యము గలుగక పోవునా? ఒక్కనాఁడు ఒక్కమాటు వినినను నేను ధన్యురాల నగుదునే యని తలంచి కదా యింత యోర్పు గలదాననై యున్నాను. ఆ యాశ లేకున్న నెప్పుడో మరణించి యుండనా? నీ తోడ శయనించు........ఇదియు నీఁది యట్టులే యాలోచింపవలెను.

రాముఁ డేటికి......విధము - దీనికే మహావిశ్వాస మని పేరు. భగవంతుఁడు నన్ను రక్షించునుగాని రక్షింపక పోఁడను దృఢమైన నమ్మకము. 'తెడ్డుండఁగాఁ జేయి యేల కాల్చుకొనవలయు' నన్నట్లు, రక్షించువాఁడు రాముఁ డుండఁగా నేనేల దానికై శ్రమపడవలె? ఇతరుల నేల యాశ్రయింపవలె నన్న పట్టుదల 'నిన్ను దశాస్య నేనిపుడు నీఱుగఁ జేయనే' యని చెప్పుట కిదియె కారణము. పాతివ్రత్య పరమ తపము = పాతివ్రత్యము, పతిసేవయే వ్రతముగాఁ గలది పతివ్రత, ఆమె చర్య పాతివ్రత్యము. స్త్రీల కిదియే పరమతపము, దీనిని మించిన తపము స్త్రీలకు లేదు.

క. ఉపవాసంబులు వ్రతములు, తపములు నేయేల భర్త • దైవత మని ని
ష్కపటతఁ గొలిచిన సాధ్వికి, నృపవర దుర్లభము లేదు • నిఖిల జగములన్.

"నాస్తి యజ్ఞః క్రియా కశ్చిన్న శ్రాద్ధం నోపవాసకమ్। ధర్మః స్వభర్తృశుశ్రూషా తయా స్వర్గం జయంత్యుత॥ నాస్తి స్త్రీణాం పృథగ్ధర్మో నవ్రతం నాప్యుపోషణమ్। పతిశుశ్రూషణం తాసాం, తేన స్వర్గో విధీయతే" స్త్రీలకు యజ్ఞములు - ధర్మములు - కర్మములు - శ్రాద్ధములు - ఉపవాసములు - వ్రతములు లేవు. పతిశుశ్రూష చేతనే వారు స్వర్గము జయింతురు. ఇట్టి వ్రతము గలది పతివ్రత. నా దురదృష్టము వలన నివి యన్నియు వ్యర్థమై పోయెను.

తాత్పర్యము.

నీకంటె నాకు వేఱుదైవము లేదని, నీవే నాదైవమని నిన్నే కొలుచు చుంటిని. నీ మాటలు వినగల నను నాశతో రాక్షసుల పరుషవాక్యముల విన సహించితిని.

నీ తోడఁ బంపుకొనఁగోరి యిచట భూశయ్యఁ గావించితిని. రామచంద్రమూర్తి నన్నేల రక్షింపఁ డను ధైర్యము గలదాననై నా రక్షణమునందు నేనే ప్రయత్నముఁ జేయ మానితిని. పాతివ్రత్య మను తపము దప్ప వేఱు తపము స్మరించిన దానఁ గాను. నేను నిర్భాగ్యురాలనైన కారణమునఁ గృతఘ్నునకుఁ జేసిన మేలువలె నిన్నియు వ్యర్థమై పోయెను. పాప మనఁగా నిచటఁ బాపఫలమైన ప్రారబ్ధానుభవము. ప్రభూతము = దొడ్డది. దీనివలన నన్నిటికంటెఁ బ్రారబ్ధము బలిష్ఠ మని గ్రహింపనగు.

ఇందుఁ జెప్పఁబడిన వన్నియుఁ బరమభక్తులయుఁ బ్రపన్నులయు కృత్యములు.
ఏకదేవతోపాస్తి కలవాఁడై యుండును.
భగవచ్చరిత్రములు తప్ప వేఱు లౌకిక వార్తలు వినరాదు.
దేహసుఖములఁ గోరరాదు.

రక్షకుఁడు భగవంతుఁ డని దృఢవిశ్వాసము గలిగి తన యోగక్షేమములకై తాను బాటుపడ రాదు. స్వాతంత్ర్యబుద్ధి మానవలయును.

చ. చెలువము వాసి మిక్కిలి కృ • శించితి, నీ స్తనులారఁ గానఁగాఁ
గల నను నాశయున్ సమసెఁ • గావున మత్కృతపుణ్యకార్యముల్
బొలిసెను నిష్ఫలంబు లయి • పూరుష పుంగవ! పోయెఁ బొమ్ము ని
ర్మల మగు నేకపత్నినియ • మంబు నిరర్థక మాచు వల్లభా! ౨౯

అర్థములు. చెలువము = అందము, కృశించితి = క్షీణించితిని.

తా త్ప ర్య ము.

నాథా! నీకు సంతోషకరమైన నా చక్కఁదనము తొలఁగి పోయెను. సన్న్యాసులకు వలె దేహమా బక్క చిక్కి తెల్లబాఱెను. కాఁబట్టి నాయందు నిప్పుడు నీకు మునుపటి ప్రేమ యుండునో యుండదో, నీ కైంకర్యహీన నైన నన్ను మునుపటి వలె నీ వాదరింపకుండినను బోనిమ్ము. నేను దూరమున నుండి నీ ముఖమునైన దర్శింప గల నను నాశయు సమసెను. కావున నేను జేసిన పుణ్యముల ఫలమంతయు వ్యర్థమై పోయెను. గార్హస్థ్యమున సన్న్యాసమున రెంటఁ జెడితిని. పుణ్యకర్మముల ఫలము పోయినఁ బోనిమ్ము. దానికి నేను వగవను నన్ను రక్షించునని, వ్యర్థమైపోదని, నీ ప్రాప్తి కప్రతిహతమైన యుపాయమని నమ్మియుండిన నిర్మలమైన పాతివ్రత్యము (భక్తి) కూడ వ్యర్థమై పోయెను. దానికి నేను దుఃఖించెదను.

దేహము భగవంతుఁడుండు నాలయ మను భావముతో నలంకరించుకొనవచ్చును. భగవదర్పణ బుద్ధి మంచి యాహారముఁ దినవచ్చును. స్వబుద్ధి స్వప్రయోజనము మాత్రము నిషిద్ధము. సన్న్యాసులవలె దేహము కృశింపఁ జేసి తపముల నవయుట కంటె నీ గృహస్థమార్గ ముత్తమ మని యేర్పడుచున్నది. కాని దానికంటె నిది కష్టతర మార్గము. ఇట్లు లుండలేనివాఁడు సన్న్యాసి యగును. ఫలమునందు

సన్న్యాసులకుఁ గలుగు బ్రహ్మలోకప్రాప్తికంటె వీరికి భగవత్సాయుజ్యప్రాప్తి తత్సమీపవర్తిత్వము లభించును.

చ. జనకునియాజ్ఞ చొప్పునఁ బ్ర•శస్తగతిన్ వనవాసదీక్షఁ దీ
ర్చి నగర మేగి ధాత్రి కభి•షేకముఁ గైకొనుచుం గృతార్థతన్
జనవున వారిజాతదళ•చారువిశాలవిలోచనాళితో
నెనయిక భీతి లేక రమి•యించెద నంచుఁ దలంతు సువ్రతా! ౭౩౦

అర్థములు. ప్రశస్తగతిన్ = లోకము పొగడునట్లు, నిర్విఘ్నముగా, తీర్చి= ముగించి, కృతార్థతన్ = పురుషార్థము లన్నియు సిద్ధముగా నుండుటచే, వారిజాత దళ = కమలముల రేకులవలె, చారు = మనోహరములై, విశాల = వెడలుపైన, లోచనాళితోన్ = కన్నులు గల స్త్రీలతో, ఎనయికన్ = ఒద్దికతో, భీతిలేక = నే నేమనుకొందునో యను భయములేక, సువ్రతా = ఏకపత్నీవ్రతము గలవాఁడా! ఈ పద్యమును గొందఱు రామునకు బహు భార్య లున్నా రనుటకు నాధారముగ నుదహరించెదరు, గాని యది నిరాకరము. ఇది స్వభావముగ స్త్రీలకు వచ్చు నాలోచనయే. తానుఁబోయినఁ దనభర్త మఱల వివాహ మాడకుండునాయని స్త్రీ తలచుట యందేమి వింత గలదు? ఇచ్చట భయ మనునది వనవాసభయము కాదు. వనవాస దీక్ష ముగించి యయోధ్యఁ జేరినపిమ్మట మఱల వనవాసభయ ముండుండి వచ్చును.

తాత్పర్యము.

రామచంద్రమూర్తి సత్యసంధుఁడు. తండ్రియాజ్ఞ ప్రకారము పదునాలుగు సంవత్సరములు వనవాసము దీక్షగాఁ బూర్తిచేసి తన సత్యమును, దండ్రి సత్యమును గాపాడె నని లోకము మెచ్చునట్లు నిర్విఘ్నముగ వనవాసము సలిపి యయోధ్యకుఁ బోయి రాజ్యాభిషేకము గ్రహించి పురుషార్థము లన్నియుఁ బూర్ణముగా నుండఁగా ననేక సుందరులతో నొద్దికతోఁ గ్రీడింపఁగల వని తలచెదను. అట్లు చేయక నీ వెట్లుండఁగలవు? ఇంత ప్రభుత్వము చేయుచు విధురుని వలె, సన్న్యాసివలె నుండుటను నీవారు సహింతురా? వారు బలవంతపెట్టియైన నీకు వివాహము చేయ యత్నింతురు. ఎందఱు రాజులు మా పిల్లనిచ్చెద మనిన మాపిల్ల నిచ్చెద మని పైపడి వత్తురు. కావున నీవు మఱల వివాహమాడి సంసార సుఖ మనుభవింతు వని తలఁచెదను. కాని సువ్రతుఁడవే. ఏకపత్నీవ్రతము గలవాఁడవే. పట్టిన వ్రతము విడువని దృఢనిష్ఠుఁడవే. నిరపరాధిని నీయం దనురాగముగల దానిని నన్నిచ్చటఁ జావ విడిచి వ్రతభంగ మగుట కోర్చియైన నట్లు చేయుదువా? చేయుదేని నేను నీ సుఖమునకూడఁ జెఱిచిన దాన నగుదునుగదా. అయ్యో తాను జెడి భర్తను జెఱుచు నావంటి నిర్భాగ్యురాలుకూడ లోకంబున నుండునా?

పంచచామరము. ఘనంబుగా మనంబు నిల్పి • కంజనేత్ర! నీ పయిన్
వినాశ మందు చున్న దాన • నేను రామ! యీగతిన్

వినీతిరీతి నేను జల్పు•విశ్వసద్వ్రతంబులున్
జనెం బ్రయోజనంబు లేక • స్వల్పభాగ్య నౌటచేన్. ౨౩౧

అర్థములు. వినీతిరీతిన్=మిక్కిలి వినయముతో, విశ్వసద్వ్రతంబులన్=అన్ని మంచి వ్రతములు, స్వల్పభాగ్యను=కొంచెము పుణ్యముగలదానను,

తా త్ప ర్య ము.

నాథా! రామచంద్రా! ఎంతటి పాపాత్ములైనను నీమీఁద నేకొంచెము మనసైన నుంచినను శ్రేయస్సుఁ గందురు. అటులుండ నేను నీమీఁద దృఢముగఁ జిరకాలముగ మనసు నిల్పి యీ విధముగ వశించుచున్నదానను రామా! యిది నీ దోషము గాదు. నా దోషమే. ఏలన నేను నియమము దప్పక సల్పిన యన్ని మంచి వ్రతములు స్వల్పభాగ్యనగుటచే వ్యర్థములైనవి. ఏకొంచె మదృష్టమున్నను నేనుమాత్రము తక్కిన వారివలె నిన్నాశ్రయించి బాగుపడ లేకపోయితినా! నా దుర్దశకు నా దురదృష్టమే కారణము. నీవు కావు.

శా. లేరే దాతలు నాకు నింత విషమేన్ • లేఖారి వేశ్మంబునన్
గ్రూరం బైన కృపాణ మేనియును గో•కొమ్మంచు నీయంగ ? న
ల్లేరే నిచ్చినఁ బాయనే తనువు ని•ప్డే కాలకూటానఁ గా
నీ రాజత్కరవాలఘాతమునఁ గా•నీ దుఃఖనాశంబుగన్. ౨౩౨

అర్థములు. లేఖారి=దేవతలకు విరోధి యగు రావణాసురుని, వేశ్మంబునన్= ఇంటియందు, కృపాణము=కత్తి, కోకొమ్ము = తీసికో తీసికో, కాలకూటానన్ = విషముచే, కరవాలఘాతమున = కత్తిదెబ్బచే, కానీ = కానిమ్ము, ప్రార్థనాదులం దన్యప్రత్యయాంత క్రియలమీఁది యిమ్మునకు నీ కారంబు విభాష నగు ప్రౌ. వ్యా. క్రి. ౧౦ సూ.

తా త్ప ర్య ము.

రామచంద్రా! నీ వయోధ్యకేగి దుఃఖమే యనుభవింతువో, సుఖమే యనుభవింతువో, దుఃఖ మనుభవింపకుండ నేనేమి చేయఁగలను. సుఖ మనుభవింప నేనేమి చేయఁగలను? నే నేమియుఁ జేయఁజాలను. ఇట్టి దానను నేను జీవించి యేమి ప్రయోజనము? ప్రాణము విడుతునా? దానికైన విషమో కత్తియో కావలయును గదా! అవి నే నెక్కడనుండి తెత్తును? ఈ రావణాసురుని యింటిలో నిందఱున్నారే. ఒకరైన నాయందు దయ గలవారు గాని, ద్వేషము గలవారు కాని, కొమ్మని యింత విషమో, పదునైన కత్తియో యిచ్చు దాతలు లేరా? అట్లెవరే నిచ్చిన నిప్పుడే విషము చేతనో, కత్తి నఱుకుల చేతనో నా దుఃఖము నశింపఁ బ్రాణము విడుతును గదా.

చ. లలన యనేకరీతులఁ ద•లంచి తలంచి మనోవిభున్ వ్యథా
కులమతి నిట్లు వా విడిచి • గోలున నంగిలి నొంద నేడ్చుచున్

దలఁచుచు బుష్పితోరువసు • ధారుహమూలపదేశ మేగి య
చ్చలి తనవేణిఁ గేలఁ గొని • చెచ్చెరఁ దా నురిపోసికొన్మతిన్. 233

అర్థములు. వావిడిచి = నోరు తెఱచి గట్టిగా, పుష్పిత = పూఁచిన, ఉరు= గొప్పదగు, వసుధారుహ = చెట్టుయొక్క, మూల = మొదళ్ళయొక్క. పదేశ = సమీప ప్రదేశము, ఉరిపోసికొన్మతిన్=ఉరిపోసికొను నభిప్రాయముతో.

తా త్ప ర్య ము.

ఈ ప్రకారము తన భర్తను నానావిధములఁ దలఁచి తలఁచి దుఃఖముచే కలవరపడి నోరు తెఱచి హాయని గట్టిగా నోరెండ నేడ్చుచు నికఁ బ్రతికి ప్రయోజనము లేదని పూచిన చెట్టు మొదటికి మునుపటికంటె సమీపముగఁ బోయి సీతాదేవి జడ చేతికిఁ దీసికొని యురిపోసికొను నభిప్రాయముతో.

చ. అనువగుశాఖఁ గేలఁ గొని • యాత్మకులంబును రామచంద్రునిన్
ఘనుని సుమిత్రపట్టిని మ • నంబున నెంచుచు నుండ శోకనా
శనమును ధైర్యసాధనము • శస్తకరంబును నౌ నిమిత్తముల్
గనఁబడెఁ దొంటియట్ల మృగ • కాతరనేత్రకు ముత్ప్రదంబులై. 234

అర్థములు. అనువు = అనుకూలము, ఆత్మకులంబును = తన వంశంబును, శస్తకరంబును = మేలుకలిగించునవి, నిమిత్తముల్ = శకునములు, మృగ కాతర నేత్రకున్ = జింకకన్నులవలె బెదరుటచేఁ జలించు కన్నులు గలదానికి, ముత్ + ప్రదంబులై = సంతోషకరములై.

తన వంశంబును తలచుటచే - అట్టి గొప్పవంశమునఁ బుట్టిన నేను నిట్టి నీచపుఁ జావు చావ వచ్చునా యని యాలోచించె నని భావము.

'అతిమానా దతిక్రోధా త్స్నేహాద్వా యది వా భయాత్ ।ఉద్బధ్నీయా త్స్త్రీ పుమాన్ వా గతిరేషా విధీయతే । పూయశోణిత సంపూర్ణే త్వంధే తమసి మజ్జతి । షష్టిర్వర్ష సహస్రాణి నరకం ప్రతిపద్యతే । ఆశౌచం నోదకం నాగ్నిం నాశ్రుపాతంచ కారయేత్ '॥ అవమానము వలనఁగాని, యతికోపముచేఁ గాని, స్నేహముచేఁ గాని, భయముచేగాని యురిపోసికొని బలవంతపు మరణము స్త్రీగాని, పురుషుఁడుగాని చచ్చినయెడల నఱువదివేల యేండ్లు దుర్గంధముతోఁ గూడిన యంధతమిస్ర నరక మందుఁబడి యుండవలెను. బలవంతపుఁజావు చచ్చినవారికి సూతకముండరాదు. నీళ్లు విడువరాదు. అగ్నిసంస్కారము చేయరాదు. కన్నీరు విడువరాదు.

ఇట్టి నీచపుఁ జావు జనకునివంటి మహాత్ముని వంశము దాననై యెట్లు చత్తునా యని యాలోచించెను.

రామలక్ష్మణులను దలఁచుట నే నిట్లు చేసినవారి కపకీర్తి వచ్చునే యని. వారేమైన ప్రయత్నము చేయుచున్నారేమో నే నిపుడు చచ్చిన వారసమర్థులై యాఁడుదానిని రక్షింపలేక చావ విడిచి రని లోకులందు రేమో నిష్కారణముగ

నంతటి వారికి నపకీర్తివచ్చునే! వారిచ్చటికి వచ్చునప్పటికి నేను జచ్చియుండిన దాహ పీడితుండు పాడుపడిన చలువ పందిరికి వచ్చిన ట్లగునే యని యాలోచన.

తాత్పర్యము.

ఉరి పోసికొనుటకు ననుకూలమైన కొమ్మను జేతం దీసికొని తన వంశంబును, రామలక్ష్మణులను మనస్సులో స్మరించుచు నురిపోంతకు యత్నము చేయుచుండ శోకము నశింపంజేయునవియు, ధైర్యము కలిగించు నవియు, శుభకరములై నవియు నగు శకునములు సంతోషకరములై మునుపటివలెనే కాన వచ్చెను.

మునుపటి వలెనే యనుటచే నింతకుం బూర్వముకూడ నిట్టులే యత్నముచేసి శుభశకునము లగుటచేం జాలించుకొను చుండె నని భావము.

—• ౨౯-వ సర్గము. మరణోద్యుక్త యగు సీతాదేవికి శుభశకునంబు లగుట.•—

సీ. అంతటి వ్యథితను • హర్షవ్యపేతను, బరిదీనమానసం • బరమనియమ
భద్రనిమిత్తముల్ • ప్రాపించి రాజిల్లె, ధనిం జేరు సేవక•తతులభంగి,
లక్ష్మికము నరాళి•పక్ష్మరాజీవృతం,బును విశదవిశాల•మును విసీల
మును నగు వామలో•చనము మీనాహతం, బైన పద్మం బన • నదరంజొచ్చె
ఆ. మృదుమనోజ్ఞపీనవృత్తంబు చందనా,గురుసమర్హ మగుచుం • బరమలోక
నాథచిరగృహీత•సవ్యవామభుజంబు, కొంతసేపు కదలె • నంత కంత. ౨౩౪

అర్థములు. అంతటి = ఇంతయని పరిమాణము చెప్పుటకు వాల్మీకి వంటి సర్వజ్ఞునకు సాధ్యము కానంతటి, వ్యథితను = దుఃఖపడిన దానిని, హర్షవ్యపేతను = సంతోషములేని దానిని, ఈమెయు గొన్నినాళ్లు సుఖ మనుభవించినదా, పుట్టినది మొదలిట్టులే యున్న దేమో యనునట్లు చూచువారికిం దోంచుచున్నట్లున్న దానిని, ౨౮-౨౯ అను రెండుసర్గములం బ్రయోగమువలన నింతయర్థము చెప్పవలసివచ్చినది. పరిదీన మానస=దీనమానస యని చెప్పుట దీనమైన మనస్సుగలదని యర్థమగును. పరిదీన యనుటచే నెప్పుడును నిట్లే శోకముతోం గూడినదై యుండునా, కొన్నినాళ్ళు సంతోషముగలదై యుండెనేమో యందమా, దానికిం దగిన యాధారములేని మనస్సుగల దానిని; పరమనియమ = ఆమె శోకము బాధ యెట్లున్నను ఆమెను జూచినయెడల నీమె జన్మ ప్రభృతి గొప్పనియమములు గలదని, పరమ పతివ్రతయని స్ఫురింపంజేయు దానిని, భద్రనిమిత్తముల్ = శుభసూచకములు, ధనిన్ = ధనవంతుని, సేవకులు తమ యుజ్జీవనార్థము ధనికుని యొద్దకుం దామే పోయి యతని నాశ్రయింతురు. అట్టులే శుభశకునములు తమంతటం దామే తాము శుభశకునము లనిపించుకొనుటకుం దమ యుజ్జీవనార్థము ఆమెయొద్దకు వచ్చె నని భావము. లక్ష్మికము=సేవకులు లక్ష్మిని గోరి లక్ష్మిగల వాని నాశ్రయించి వారి సేవ చేసి వారి కుపకరించి ధన్యు లగు చున్నారు. ఈ శుభశకునము లట్లుగావు. సాక్షాల్లక్ష్మి యగు సీతాదేవినే యాశ్ర

యించి యామె నుపకరించి రాజు నాశ్రయించి రాజ భటు లను గౌరవము సంపాదించు కొనునట్లు తాము శుభశకునము లని పేర్కొంచెను. అరాళ = వంకరయగు ముత్తెపుఁజిప్పలవంటి రెప్పలయొక్క, పక్ష్మరాజీ = వెంట్రుకల సమూహముచే, వృతము = ఆవరింపఁబడినది, విశద విశాలము=విశదము = నల్లగ్రుడ్డుచుట్టు తెల్లగాఁ నుండునది, విశాలము = వెడల్పైనది, విసీలమును=నల్లని గ్రుడ్డుకలది, వామలోచనము = ఎడమకన్ను, మీనాహతము=చేపచేఁ గొట్టఁబడినది, పద్మంబన = కమల మనునట్లు, కనులకొన లెఱ్ఱగా నున్ననని భావము. 'ప్రాంతరక్తే చ నేత్రే' యని యుండుటచే నీ వర్ణన మీామె పద్మిని యని తెలుపుచున్నది. పీనము=బలిసినది, వృత్తము = గుండ్రనిది, చందన + అగురు + సమర్హ్మము=చందనము పూతకును, అగురు పూఁతకు యోగ్యమైనది, పరమలోకనాథ = లోకపరమనాథ యని యన్వయము, లోకముల కన్నిటికి శ్రేష్ఠుఁడైన నాథు ఁడు, లోకనాథు లనిపించుకొన్నవారి కందఱకు నాథుఁడని భావము "ఏకో దేవో నారాయణః-ఏకమేవాద్వితీయమ్ న త్వత్సమో స్త్వభ్యధికః కుతోన్యః" భ. గీ. ౧౧-౪౩ అను శ్రుతి స్మృతి వాక్యములు స్మరణీయములు. ఇది వాల్మీకి యభిప్రాయము. చిరగృహీత = బహుకాలమునుండి బూర్వము. అనఁగా ననాదిగ సూక్ష్మావస్థయందును స్థూలావస్థ యందును, నవ్య = అందమైన, వామభుజంబు = ఎడమచేయి, కొంతిసేపు = కొంచెముసేపు. ఎక్కువకాల మదిరిన వాతరోగ మగును.

తా త్ప ర్య ము.

ఇంతింతని చెప్పరాని బాధపడుచు సంతోష మనునది లేక మిగుల శోకపూరిత మయిన మనస్సుగలదయ్యు పరమ్యవ్రతము విడువక యుండు సీతకు ధనవంతుని సేవకులవలె శుభశకునములు కానవచ్చెను అవి యేవి యనిన శోభతోఁ గూడి వంకర వెంట్రుకలచే నావరింపఁబడి తెల్లనై విశాలమై నల్లనైన గ్రుడ్డుగలదై యుండుచు నెఱ్ఱని కాంతి గల యెడమ కన్ను చేపతాఁకుచేఁ గదలెడి పద్మమువలెఁ జలించెను. వృత్తమై మనోహరమై బలిసినదై గుండ్రమైన చందనాగురు గంధముల కర్హమై లోకాధినాథుఁ డగు శ్రీరామచంద్రమూర్తిచేఁ జిరకాలముగ గ్రహింపఁబడిన దగు మనోహరమైన యెడమచేయి యంతకంత కెక్కువగఁ గొంచెముసేపు కదలెను.

క. కరిరాజహస్తనిభములు, సరసంబులుఁ బీవరములు • సంహతములు నా
కరభోరుతొడల నెడమది, పొరిఁ బొరి రఘురాముఁ జూపు•పొలుపున నదరెన్.

అర్థములు. కరిరాజ హస్త నిభములు=శ్రేష్ఠమైన యేనుఁగు తొండముతో సమానములైనవి, సరసంబులు = అందముతోఁ గూడినవి. పీవరములు = బలిసినవి, సంహతములు = ఒకదాని నొకటి తాఁకియుండునవి, కరభోరు తొడలన్ = సీతాదేవి తొడలందు.

స్త్రీలకు నెడమ కన్ను, ఎడమ భుజము, ఎడమ తొడ అదరెనేని ఫలము

వెంటనే కనఁబడును. అట్టులే పురుషులకుఁ గుడివైపు కన్ను, భుజము, తొడ యదరెనేని వెంటనే శుభఫలము గలుగును.

తా త్ప ర్య ము.

ఏనుఁగు తొండములో సమానములై, యుదములై, బలిసినవై - కావుననే శోభించి సపుసు నడుమ నెడములేనివైన సీతాదేవి తొడలందు నెడమతొడ రామచంద్రమూర్తిని నేను జూపెద నన్నట్టు లదరెను. సీతాదేవికి నెడమకన్ను, ఎడమ భుజము, ఎడమతొడ యదరెనని చెప్పినఁజాలునే. ఇంత వ్యర్థవర్ణన మేల? ఇది వ్యర్థ వర్ణనము గాదు. లోకములోని స్త్రీలకు నేర్పడిన నంగవైకల్యము వారి దుఃఖములకుఁ గారణము. అట్టి యంగవైకల్య మీయామె యందు లవమైన లేదు. అట్లుండియు దుఃఖంప నేల యనిన నిది యామె స్వయముగఁ గోరి తెచ్చుకొన్న దే. కాలుచున్న యింటిలోఁ జిక్కుకొన్న బిడ్డలబయటఁ దెచ్చుటకు దానిలో దుముకు దయావతివలె రావణు చెఱలోనుండు స్త్రీలను రక్షింపఁ దాను చెఱలోఁ బ్రవేశించెనుగాని,కర్మానుభవమునకై కాదు. ఈ విషయము దెలుపుటకై యీ యవయవ వర్ణన మని యెఱుంగునది. అటుగాకున్న బలిసిన భుజములు, బలిసినతొడలు ననునవి మునుపటి స్థితిగాని, కూడు నీళ్ళు లేక కృషించిన యిప్పటి స్థితిగాదు, దాని నిప్పుడు చెప్ప నేల?

క. చారురద చారులోచన, సారసముఖ యైన సీత • స్వర్ణాభవిభో
దారము ధూసరితం బగు,చీరయు నొక యింత సడలె • సేమముఁ దెలుపన్.౭౩౭

అర్థములు. చారురద = అందమైన దంతములు గలది, చారులోచన = అందములైన కన్నులు గలది, సారసముఖ = కమలమువంటి ముఖము గలది, స్వర్ణాభ = బంగారుతో సమానమైన, విభా + ఉదారము = కాంతిచే గొప్పది, ధూసరితము=దుమ్ముచే నిండి బూడిదరంగు గలది. వ్యాకరణము:—సీత యనునది చీరతో సమసించును. సీత చీర యని షష్ఠీతత్పురుషము. ఈ రెండుమాటల నడుమ చీరకు విశేషణములైన స్వర్ణాభ విభోదారము, ధూసరితము అను పదములు వచ్చినవి. ఇట్లు సమాసము నడుమ వ్యస్తపదములు రావచ్చునా? "ఒక్కొక్కచో సమాసగత పూర్వ పదంబు వ్యవహితోత్తర పదం బౌంటికొడను, వాని పెక్కింటి తోడను నన్వయించెడి" ప్రౌ. వ్యా. సమా. ౩౮. సూ. "ఒక్కొక కన్నును, చెవియును, చెక్కును, మూఁపు చెలు వగు చేయున్. భార. సభా. ౧ అ. ఇచ్చట నొక్కొక చేయున్ అను సమాసము నడుమ చెలువగు నను విశేషణము వచ్చినది. సడలెన్=వదు లయ్యెను. నిష్కారణముగఁ గట్టుకొన్న వస్త్రము జాఱుట శుభ సూచకము.

తా త్ప ర్య ము.

అందములై జానిమ్మగింజలవంటి దంతములు, సందములైనకన్నులు, కమలము వంటి ముఖముగల సీతాదేవి కట్టుకొనియున్న పచ్చని కాంతి గలిగి మాసిన చీర కొంచెము వదలి జాఱెను.

క. మున్ను గడు తెప్పరమెఱిఁగి, యున్న నిమిత్తములఁ జూచి • యుగ్రాతపవా
 తోన్నతిఁ జెడు బీజము వృష్టి న్నన మొలకెంచు మాడ్కి • సీతయు నలరెన్. ౨౩౭

అర్థములు. ఉగ్ర + ఆతప + వాత + ఉన్నతిన్ = భయంకరమైన యతిశయించిన యెండకు, గాలికి, వృష్టిన్=వానచే, నన= మొలక.

తాత్పర్యము.

మునుపు చక్కఁగా దెలిసియున్న శకునములఁ జూచి తీవ్రమైన యెండకు, గాలికి నెండిపోయిన, నేలలోఁ బడియున్న విత్తనము వాన పడఁగానే మొలకెత్తునట్లు సీతాదేవి సంతోషించెను.

క. బింబఫలాధరమును రోలంబాలకమును సుమంజు • లభ్రువు నీరే
 జాంబకమున్ సితదంతంబుం బొలిచెను ముఖము రాహు • ముక్తేందుగతిన్. ౨౩౮

అర్థములు. బింబఫలాధరము=దొండపండువంటి పెదవిగలది, రోలంబాలకము= తుమ్మెదవంటి ముంగురులు గలది, ఇవి యన్నియు బహువ్రీహి సమాసములు. సుమంజుల భ్రువు=మిగుల మనోహరమైన కను బొమ్మలు గలది, నీరేజాంబకము = కమలమువంటి కన్నులు గలది. సితదంతంబున్ = తెల్లని పండ్లుగలది, రాహుముక్తేందుగతిన్ = రాహువుచే విడువఁబడిన చంద్రునివలె.

తాత్పర్యము.

దొండపండు వంటి పెదవి, తుమ్మెదలవంటి ముంగురులు, అందమైన కనుబొమలు, కమలము వంటికన్నులు, తెల్లని దంతములు గల సీతాదేవి ముఖము రాహువుచే విడువఁబడిన చంద్రునివలెఁ బ్రకాశించెను.

సాముద్రిక శాస్త్రమందలి యీ శ్లోకము నిచట స్మరింపనగు.

కన్నులు - లలనాలోచనే శస్తే, రక్తాంతే కృష్ణతారకే, గోక్షీరవర్ణ విశదే సుస్నిగ్ధే కృష్ణపక్ష్మిణీ, ఉన్నతాక్షీచ దీర్ఘాయుః.

కనుకొలుకులం దెఱుపు - కనుపాపలు నలుపు - దానిచుట్టు నావుపాలవలెఁ దెలుపుగలవై, నునుపై నల్లని తెప్పరోనలు గల కన్నులు, మిగుల శ్రేష్ఠములు. కన్నులు కొంచెము మిట్టగనుండిన (మిడిగ్రుడ్లు కావు) దీర్ఘాయువు గలదగును. తొడలు:-“సువృత్తైః కరభాకారై రూరుభి ర్మసృణైర్ఘనైః। సువృత్తైరోమరహితై ర్భవేయు ర్భూమివల్లభాః॥

తొడలు దృఢములుగను, కరభములవలెను, నునుపుగను, లావుగను గుండ్రముగను వెండ్రుకలులేకయు నుండిన రాజులకు భార్య లగుదురు.

దంతములు:—గోక్షీర సన్నిభా స్నిగ్ధా ద్వాత్రింశద్దశనాః శుభాః। అధస్తాదుపరిష్టాచ్చ సమా స్తోక సమున్నతాః॥

ఆవుపాలవలెఁ దెల్లనై గంటుకులు లేక నునుపై క్రింద మీఁద సమములై కొంచె మెత్తుగలిగి ముప్పదిరెండు పండ్లుండెనేని శుభము.

పెదవులు:—పాటలో. వర్తులః స్నిగ్ధో రేఖాభూషితమధ్యమః। సీమంతినీ నామ ధరో ధరాజాన్ప్రియా భవేత్॥ ఎఱ్ఱనై - గుండ్రనై - నునుపై నడుమ రేఖగలిగిన పెదవి గల స్త్రీ రాజపత్ని యగును.

ముఖము:—సమం సమాంసం సుస్నిగ్ధం స్వామోదంవర్తులం ముఖం।సునేత్రం సురదచ్ఛాయం ధన్యానా మిహ జాయతే॥ ముఖము సమమై మాంసము గలదై నునుపై మంచి పరిమళము గలదై గుండ్రమై మంచి కన్నులు పెదవుల కాంతిగలదై యుండెనేని యట్టి స్త్రీ ధన్యాత్మురాలు.

స్తనములు:—ఘనౌ వృత్తౌ సమౌ పీనౌ దృఢౌ శస్తౌ పయోధరౌ॥ స్తనములు గొప్పవిగను గుండ్రముగను, రెండును సమముగను, బలిసినవిగను (గుంటలు లేనివి) గట్టిగను నుండునవి ప్రశస్తములు.

దక్షిణోన్నత వక్షోజా పుత్రిణీ స్యాదగ్రజా మతా
వామోన్నత కుచా సూతే కన్యాం సౌభాగ్య సుందరీమ్॥

కుడి స్తన మెత్తుగ నుండిన మంచి కొడుకులు గలదగును. ఎడమ స్తన మెత్తుగ నుండిన సౌభాగ్యవతియు, సుందరియు నగు కూతును గనును. "మూలే స్థూలా క్రమ కృశా వగ్రే తీక్ష్ణౌ ప్రశస్తకౌ" మొదట నడుగు భాగమున లావుగను క్రమ క్రమముగాఁ బైకిఁబోవు కొలఁది సన్నముగను (మారేడుకాయవలె) కొనలు తీక్ష్ణముగ నుండిన స్తనములు ప్రశస్తములు.

"సదృశం చూచుకయుగం శస్తం శ్యామం సువర్తులమ్." రెండుచనుముక్కులు సమానముగను, నల్లగను గుండ్రముగ నుండిన ప్రశస్తములు.

వెండ్రుకలు: కేశా అళికులచ్ఛాయా సూక్ష్మా స్స్నిగ్ధా స్సుకోమలాః
కించి దాకుంచితాగ్రాశ్చ, కుటిలాశ్చాతి శోభనాః.

తుమ్మెదపెక్కుల కాంతిగలిగి సన్నములై, నునుపులై, మృదువులై, కొంచెము వంగిన కొనలు గలవై వంకర లయి యున్న వెండ్రుకలు శుభప్రదములు.

కనుబొమలు:—భ్రువౌ సువర్తులౌ తన్వ్యౌ స్నిగ్ధే కృష్ణే త్వసంహతే
ప్రశస్తా మృదురోమాణౌ, సుభ్రువః కార్ముకాకృతీ.

గుండ్రములై, నునుపులై నల్లనై - ఒకదానితో నొకటి కలియనివై మెత్తని వెండ్రుకలు గలవై విండ్లవలె నుండు కనుబొమలు ప్రశస్తములు. ఇవన్నియు నుత్తమ స్త్రీలక్షణములు. సీతాదేవియం దివి యున్నియుఁ గాన నగును.

క. అంతట శ్రీరఘురాముని, కాంత విగతశోక హర్షకలితయునై యే
కాంతము శోభిల్లె నిశా, కాంతునితో వెలుగు రేయిగతి నవ్వేళన్. ౨౮౦

అర్థములు. విగతశోక = పోయిన శోకము గలది, హర్షకలితయు=సంతోషము కలది, ఏకాంతము=మిక్కిలి.

తా త్ప ర్య ము.

ఇట్లు శుభ శకునములు కనఁబడిన పిమ్మట సీతాదేవి శోకమువదలి సంతోషించినదై చంద్రునితోఁ గూడిన రాత్రివలెఁ బ్రకాశించెను. నిశాకాంతునితోడి నిశవలె శ్రీరఘురాముని కాంత యనుటచే భర్తతోఁ గూడినంత సంతోషము గలదయ్యె నని భావము.

—• ౩౦-వ సర్గము. సీతాదేవితో నెట్లుభాషింపఁదగునని హనుమ యోచించుట •—

క. సీతావిలాప మసురీ, వ్రాతము బెదిదములు త్రిజట•స్వప్న కథనమున్
వాతతనూజుఁడు విని భూ, జాతను సురవని నమర్త్య•సఖఁగఁ దలంచున్. ౭౪౧

అర్థములు. విలాపము = ఏడుపు, అసురీ వ్రాతము=రాక్షస స్త్రీలయొక్క, బెదిదములు = పరుషంపు మాటలు, బెట్టిద శబ్దమునకువలె దీనికిని బహువచన మందే యీ యర్థము. కథనము = చెప్పుట, సురవనిన్ =నందనమందలి, అమర్త్య సఖగ = అప్సరసవలె, విని, తలంచున్ - ఈ రెండు క్రియలకు సమానాశ్రయిత యే వివక్షితముకాని యుత్తర కాలీనత వివక్షితము కాదు.

తా త్ప ర్య ము.

సీతాదేవి యేడుపు మాటలు, రాక్షసస్త్రీల బెదరింపు మాటలు, త్రిజటచెప్పిన కలవిషయమైన మాటలు హనుమంతుఁడు విని యీమె దేవలోకములోని నందనవనమున నుండు దేవతాస్త్రీగాని, మనుష్యస్త్రీ గాదని తలఁచెను. ఈమె సీతాదేవియే యనుటకు నింకఁ జెప్పఁబడినవి, స్వతంత్రములు, పరోక్షములు, పరస్పర సంబంధములేని సాక్ష్యములు. ప్రత్యక్ష సాక్ష్యము దేహమునందుఁ గాన వచ్చిన సాముద్రిక చిహ్నములు. ఇన్ని విధములఁ బ్రత్యక్ష పరోక్ష నిదర్శనములచే నీమె సీతయే. రామచంద్రమూర్తి సందేశము విన నీమె యర్హురాలే యని యెట్లు హనుమంతుఁడు తీర్మానించు కొనెనో యట్టులే యాచార్యుఁడును శిష్యుఁడుగా గ్రహింప నుద్దేశించిన వానిని బ్రత్యక్ష పరోక్ష నిదర్శనములచే భగవత్తత్త్వ రహస్య ముపదేశింప నర్హుఁడా యని పరీక్షింప వలయును.

ఉ. వేయితలంపు లూరఁబడి•వేలవిధంబుల యోజనాపరుం
డై యతిసంఖ్యులైన ప్లవ•గాగ్రణు లెల్లెడ నే సతీమణిన్
రోయుచు నున్నవారో సిత•రోచిముఖిం గనుఁగొంటి నిందు నే
నా యలినీలవేణిఁ గుసు•మాసవసన్నిభవాణి జానకిన్. ౭౪౨

అర్థములు. యోజనాపరుండై = ఆలోచనలతోఁ గూడినవాఁడై, అతిసంఖ్యులు = లెక్కకు మించినవారు, ప్లవగాగ్రణులు = వానరశ్రేష్ఠులు, సితరోచిముఖిన్=చంద్రముఖిని, అలినీలవేణిన్ = తుమ్మెదలవలె నల్లనైన జడగల దానిని, స్త్రీని, కుసుమాసవ = తేనెతో, సన్నిభ = సమానమైన, వాణిన్ = వాక్కుగల దానిని.

తాత్పర్యము.

అనేకములగు తలంపులు గలుగఁగా ననేకవిధంబుల యోజించి హనుమంతుఁడు తనలోఁ దా నిట్లనుకొనుచున్నాఁడు. లెక్కలేని వానరులే సతీరత్నమును వెదకుచున్నారో యా స్త్రీని నే నిందు జూచితిని.

క. చారుఁడ నై యోగ్యుఁడ నై, వైరిబలాబలము లెఱుఁగ • వలఁతిని నా నే
నారసి యసురవిశేషము, లీ రావణుబలముఁ బురము • నెఱిఁగితి నెల్లన్. ౨౪౩

అర్థములు. చారుఁడనై = వేగులవాఁడనై, హనుమంతుఁడు దూతగాఁ బంపఁబడెనుగాని వేగులవాఁడుగాఁ బంపఁబడ లేదు. దొంగవేషములతో, దొంగచేష్టలతో, దొంగమాటలతోఁ గార్యము చేయువాఁడు వేగులవాఁడు. దూత బహిరంగముగ వర్తించువాఁడు. వీఁడు దూరు పేరు దాఁపఁడు. ఇట్టివాఁడు తాను వేగులవాఁడననుటయే గాక యోగ్యమైన కార్యముచేసితి ననియుఁ జెప్పుచున్నాఁడు. ఇది యెట్లు సమంజసము?

సుగ్రీవుఁడు సీతాదేవి యెందున్నదో చూచి రండని చెప్పెను. రామచంద్రమూర్తి సీతాదేవితో మాట్లాడి రమ్మని ముద్రిక యిచ్చెను. వెదుకుటయను కార్యము రహస్యముగను జేయవచ్చును. బహిరంగముగఁ జేయవచ్చును. ఇచ్చట బహిరంగముగఁ జేయఁబూనినఁ గార్యభంగమగును. అది యాచితీవిరుద్ధము. దొంగవలె వెదకుట పౌరుషవిరుద్ధము కాదా యనిన నది యెట్టివారియం దట్టులే వర్తించుట, యెవరికైన నీతిబాహ్యము కాదు. "కుటిలబుద్ధుల గెలువంగఁ గుటిల మతియు, యర్హమగుఁగాని నీతిగా దార్జవంబు" అని నీతి లక్షణము. మఱియు "యో యథా వర్తతే యస్మిన్, తస్మిన్నేవం ప్రవర్తయన్ । నాధర్మం సమవాప్నోతి, న చాశ్రేయశ్చ విందతి" (భార. శాం. ౧౭౯-౩౦.)

ఎవని విషయమున నెవఁడెట్లు వర్తించుచున్నాఁడో వాని విషయమున వాఁడట్లు వర్తించిన యెడల ధర్మహాని లేదు, శ్రేయోహాని లేదు. ఇది భీష్మ వాక్యము.

యస్మిన్ యథా వర్తతే యో మనుష్యః
తస్మిన్ తథా వర్తితవ్యం స ధర్మః
మాయాచారో మాయయా బాధితవ్యః
సాధ్వాచారః సాధునా ప్రత్యుపేయః॥ శాంతి.

ఏ మనుష్యుఁ డితరుని పట్ల నెట్లు వర్తించునో వాని విషయమున నితరు లట్లే వర్తింపవలయును. అదియే ధర్మము. మాయలమారిని మాయచేత బాధింపవలయును. సాధు వగు నాచారము గల వానిని సాధుమార్గముననే జయింపవలెను. (శాంతి ౧౦౯-౨౯)

'త్వం మాయాభి రనవద్య మాయినం.........వృత్రం అర్దయః'

ఓ పాపరహితుఁడైన యింద్రా! మాయలాఁ డగు వృత్రుని నీవు మాయచేతనే

చంపితి వని ఋగ్వేదమునందు నింద్రుని మాయావిత్వము నిందింపఁబడక శ్లాఘింపఁబడెను. (ఋ.౧౦.౧౮౭-౧-౪౦-౭)

ప్రజంతి తే మూఢధియః పరాభవం
భవంతి మాయావిషు యే న మాయినః

కిరాతార్జునీయం ౧-౩౦.

మాయావుల విషయమై యెవరు మాయతో వర్తింపరో వారు నాశమగుదురు.

ఇట్టి మహావాక్యము లుండుటచే వంచన చేసి చోరుని వలె వర్తించిన రావణుని విషయమై హనుమంతుఁడు వంచనముగఁ బ్రవర్తించుట ధర్మవిరుద్ధము గాదు. ఇంతకుఁ దన కార్యము సాధింప, అనఁగా సీతను వెదకుట యందు చారుని వలె వర్తించెనే కాని, నిద్ర పోవువాని గొంతు పిసుక లేదు. హనుమంతుని వేగులతనమున రావణునకు వచ్చిన హాని యేమియు లేదు. ఓయీ యనైన 'న పాపే ప్రతిపాపః స్యాత్' పాపి విషయమున మనము పాపము చేయ రాదు. అనియు "అక్రోధేన జయేత్క్రోధం, అసాధుం సాధునా జయేత్, జయేత్ కదర్యం దానేన జయే త్సత్యేన చానృతమ్" అక్రోధముచేఁ గ్రోధమును, సాధుత్వముచే నసాధువును, దానముచే లోభిని, సత్యముచే నసత్యమును జయింప వలె నను (భా.ఉ. ౩౮-౭౩-౩౮) వాక్యములు వ్యర్థములా యనిన వ్యర్థములు కావు. సాధు మార్గముచేఁ గార్యము చక్కఁబడు నని తోఁచినపుడు వంచన చేయరాదు. సామదానములు వ్యర్థములు, కార్యహాని కరములు అని తోఁచినపుడు 'విషస్య విష మౌషధ'మన్నట్లు (విషము విఱుగుటకు వేఱొక విష మిచ్చుట) వంచనకు వంచనయే యర్హకార్యము. గోటఁ బోవుపనికి గొడ్డలి ప్రయోగింపరాదు. గాని,గొడ్డలి ప్రయోగించినఁ గాని కార్యము చక్కఁబడ దని తోఁచినపుడు గొడ్డలి నుపయోగించుట తప్పు గాదు. వలఁతిని = సమర్థుఁడను, ఆరసి = వెదకి.

తా త్ప ర్య ము.

వేగులవాఁడనై యుపాయముచేఁ దగిన కార్యము చేసిన వాఁడనై యెట్టులైన యుద్ధము తటస్థించునుగాని తప్పదు. గావున శత్రువుల బలాబలము తెలియఁగ సమర్థుఁడ నగు నేను పురమంతయుఁ దిరిగి వెదకి రాక్షసులందఱఁగల వారి వారి బల తారతమ్య విశేషము, రావణు బలము, పుర లక్షణము సర్వము తెలిసికొంటిని. ఇప్పటికి సుగ్రీవుఁడు చెప్పిన కార్యము సాధించి యిఁక రామచంద్రమూర్తి చెప్పిన కార్యము సాధింప నాలోచించుచున్నాఁడు.

సీ. అటుగాన నప్రమే•యగుణాకరుండును, నఖిలభూతహితుండు • నైన రామ
చం ద్రు దేవిని భ ర్తృ•సందర్శనాసక్త, నాశ్వాసించుటె శుభం • బైన విధము
దుఃఖనిర్మగ్న యై•దుఃఖాంత మెఱుఁగక, సంతపించెడి పూర్ణ•సౌఖ్యపాత్రి
నూఱడింపకయు యే•నూరక పోయిన. సత్య మనర్థంబు • సంభవిల్లు

తే. నీ యశస్విని తన్నుఁ దా • నిందుఁ గాచు,కొనఁగ నేరక మరణించు•గురుబలుండు
దశరథసుతుండు జానకీ•దర్శనేచ్ఛుఁ,డతని నాశ్వాసపఱచుటే • న్యాయ్యమగును.

అర్థములు. అప్రమేయగుణాకరుఁడు = ఇంతమాత్రము ప్రమాణమని కొలఁది చెప్పరాని కల్యాణ గుణములకు గనియైనవాఁడు, భర్తృసందర్శనాసక్త= భర్తను జూచుటయందుఁ గోరిక కలదానిని, ఆశ్వాసించుట = ఊఱడించుటయే, పూర్ణసౌఖ్యపాత్ర = నిండిన సౌఖ్యముల పాత్రము - సౌఖ్యములను బూర్ణముగా ననుభవింప యోగ్యురాలు, అనర్థంబు = కీడు, యశస్విని=కీర్తిమంతురాలు, జానకీదర్శనేచ్ఛుఁడు = సీతాదేవిని జూడఁ గోరిక కలవాఁడు.

తాత్పర్యము.

రావణుని గుఱించి తెలియవలసిన విషయము లన్నియుఁ దెలిసికొంటిని. కావున ననంత కల్యాణగుణఖనియును సర్వభూతములకు మేలుగోరువాఁడును నగు రామచంద్రమూర్తి దేవిని పతినిజూడ నాసక్తి గలదానిని నామెభర్త యోగక్షేమములు దెలిపి ధైర్యము వచ్చునట్లు చేయుటయే మేలగు కార్యము. అట్లుచేయక వచ్చినవాఁడను వచ్చినట్లు పోయితినా యీమె దుఃఖము తుదనెఱుఁగక దుఃఖమునందు మునిఁగి సంతపించుచున్నది. ఈమె మిగుల సౌఖ్య మందవలసినదేకాని యిట్టి స్థితియం దుండఁదగినది కాదు. కావున నీమెకు ధైర్యోక్తులు చెప్పి యీమె దుఃఖము నివారించుట ప్రథమ కార్యము.అంతమాత్రమే కాదు. నే నీమె నూఱడింపక పోయితినేని మఱియొక యనర్థముకూడఁ గలదు. ఈమె యెంతో కీర్తికి నర్హురాలు. ఇట్టి యీమె తన్నుఁదాను రక్షించుకొనలేక మరణించును. అక్కడనో మహాబలశాలి యగు రామచంద్రమూర్తి సీతాదేవి నెప్పు డెప్పుడు చూతునా యని యాసక్తి గలవాఁడై యున్నాఁడు. ఆయనమాట లీమెకుఁ జెప్పి యూరార్చినట్లు లీమె వృత్తాంత మాయనకుఁ దెలిపి యాయనను నూరార్చవలెను. ఇదియే న్యాయయుక్తమైన మార్గము.

ఆ. ఏమి సేయవచ్చు • నీ రక్కసులు విను,చుండఁ బల్క నెల్లు • యుక్త మగును
మగువ నేను రాత్రి• తెలువలలోపల, నూఱడింప కున్న •నసులుఁ బాయు. ౭౪౫

తాత్పర్యము.

రామచంద్రమూర్తి వృత్తాంత మీమెకుఁ జెప్పుట యావశ్యకమే కాని చెప్పఁజెల్లు! నా మాట లీ రాక్షసులు వినరాదు. వినిరా యిప్పుడేపోయి రావణునకుఁ దెలుపుదురు. వాఁడు బయలుదేఱి వచ్చును. అనుకొన్న కార్య మనుకొన్నట్లు గాదు. చెడును. కావున వీరికిఁ దెలియకుండునట్లు సీతాదేవికి మాత్రము తెలియునట్లు మాటలాడుట బాగు. ఉదయము కాకముందే నే నీ కార్యము చేయకపోయితినా యీమె నూఱడింపక పోయితినా యీమె ప్రాణము విడుచుట నిజము.

మ. హనుమా! యే మని నాకుఁ జెప్పు మనె నయ్యా! జానకీదేవి నీ
వనుమా తద్వచనంబులెల్ల ననిధ • ర్మాత్ముండు శ్రీరాముఁ డా
య్యెనఁ బల్కన్ సతి నిందుఁ జూచియును మాట్లాడింప కే నేగి లో
ననుమానింపక యేమి మా టిడుదు! నర్థం బౌనె నా కా విధుల్ ! ౨౪౬

తా త్ప ర్య ము.

అంతియకాదు. రామచంద్రమూర్తి యొద్దకుఁబోఁగానే హనుమంతా! సీతను జూచితివికదా. ఉంగర మిచ్చితివా? దానిని జూచి యామె యే మనెను. ఆమాట లన్నియుఁ జెప్పుమని ధర్మాత్ముఁ డగు శ్రీరామచంద్రమూర్తి దీనుఁడై యడుగును గాని యడుగకపోఁడు. ఆమెను మాట్లాడింపకపోయితినేని నాయనతో జంకులేక యేమని చెప్పుదును? చూచిరమ్మనిన జూచివచ్చితిని. మాట్లాడలేదని చెప్పుదునా? ఉంగర మేమిచేసితి వనిన నేను ధరించితినందునా? అటువంటిపని నాకుఁదగినదా? నేనట్లు చెప్పఁదగునా ?

క. సీతాసందేశము తే, కా తరణికులేంద్రుఁ జూడ • నరిగిన నతఁడున్
జాతాధికకోపానల, హేతుల నను నీఱుఁ జేయ • కేలా మానున్. ౨౪౭

అర్థములు. సీతాసందేశము = సీతాదేవి చెప్పిన వార్త, జాతాధిక కోపానల హేతులన్ = పుట్టిన యధికమైన కోపమనెడి యగ్నిజ్వాలలచే,నీఱు = భస్మము.

తా త్ప ర్య ము.

సీతాదేవి రామచంద్రున కేమి చెప్పెనో తెలిసికొనక యాయనను జూడఁ బోఁగానే యాయన తీవ్ర మగు కోప మనెడి యగ్నిజ్వాలలచే నన్ను భస్మము చేయకుండునా ? పోయిన వాఁడవు చూచినవాఁడవు మాట్లాడింపక యేమని వచ్చితి వనఁడా ?

సీ. సీత యున్నది లంకఁ • జెచ్చెరఁ బదఁడని, రాముకార్యమున శా•ఖామృగాళిఁ
దోడితెచ్చితి నేని • తుదకు వ్యర్థము గాదె, జానకి యింతలో • సమసె నేని
యటుగాన నిం దుండి • యంతరంబును రోసి, జానకి నూరార్చి • చనుట లెస్స
యల్ప శరీరుండ • నందు వానరుఁడను, మనుజునివలె నేను • మాటలాడఁ

తే. దగదె సంస్కృతమున ? నేను • ధరణిసురుని
రీతి సంస్కృత మాడిన • భీత యగుచు
దశముఖాసురుఁగా నన్నుఁ • దలఁచు నేమొ ?
యేమి సేయుదుఁ గ్రోధితి నే•నెట్లు పలుక ? ౨౪౮

అర్థములు. అంతరంబు = సందు, తగిన సమయము, అల్పశరీరుండన్ = చిన్న దేహము గలవాఁడను, ధరణిసురునిరీతిన్ = బ్రాహ్మణునివలె, సంస్కృతము= దేవభాష. తా త్ప ర్య ము.

సీతాదేవిని జూచిరమ్మనినఁ జూచి వచ్చితి నని నేను చెప్పఁగానే యడవి

క్రోఁతి కింత యెక్కువ తెలివి యెక్కడనుండి వచ్చునని తలఁచి కోపింపఁ దనుకో, నామాట నమ్మి వానరు లందఱు నిటవచ్చిరనుకో, ఇంతలో సీతాదేవి చచ్చెననుకో వాలందఱు వచ్చియు వ్యర్థముగదా. కావున నవకాశముచూచి సీతాదేవి నూరార్చి పోవుటే బాగు. ఊరార్చు టెట్లు! నేనా చిన్న దేహముగల వాఁడను. దేహము నిప్పుడు పెంచరాదు. పిల్లక్రోఁతి యగు నేను మనుష్యులు మాటలాడినట్లు సంస్కృతమున మాటలాడ వచ్చునా! బ్రాహ్మణునివలె సంస్కృతమున మాటలాడిన నీమె భయపడి నన్ను రావణాసురునిఁ గాఁ దలఁచునో యేమో. క్రోఁతి నే నెట్లు మాటలాడుదును!

క. ఊరార్పఁగఁ దగుఁ దరుణిని, నూరార్చుట యెట్లు మౌన ♦ మూనిన! మఱి నే
నేరీతిఁ బలుక, గతి లే, దీ రమణిం బలుకరింతు ♦ నే మనుజోక్తిన్ ! ౨౪౯

తాత్పర్యము.

మాటలాడక నోరుమూసికొని యుంటినేని యూరార్ప వలసిన యీమెను నే నెట్లూరార్తును! మాటలాడఁబూనిన నే నేరీతి మాటలాడవలె! వేఱుగతి లేదు. ఈమెను నీమెకుఁ దెలిసిన ప్రాకృత భాషయందుఁ బలుకరించెదను. అట్లు చేసితినేని యీ భాష యీ రాక్షసులకుఁ దెలియదు. గావున నేను చెప్పునది వారి కర్థముగాదు.

క. రూపంబునఁ గ్రోఁతియు నా,లాపంబులు మనుజులవియు ♦ లలనామణి దా
రూపించి మున్నె రక్ష, స్త్రీ పరిసంత్రస్త భయము ♦ చెందదె మఱియున్. ౨౫౦

తాత్పర్యము.

నేను బ్రాకృతము మాట్లాడిన నందు నొక గండము గలదు. నేనా యాకారమునఁ గ్రోఁతిని. నా మాటలా మనుష్యులు మాటలాడునవి. కాఁగాఁ జూచి క్రోఁతి యేమి మనుష్యునివలె మాటలాడుట యేమి యని సందేహించి యిది యేదో మాయ యని మును పే రాక్షసస్త్రీలచే భయపెట్టఁబడి యుండునది మరింత భయపడును.

సీ. కంజాక్షి యంతటఁ ♦ గామరూపిని నిర్జ,రారినేతఁగ నెంచి ♦ యఱుచు భీతి
నా నాదమునఁ జేసి ♦ యఖిలాసురాంగనల్, వివిధసాధనహస్త♦లవుచుఁ గదిసి
కోపించి ననుఁబట్టి♦రూపుమాపఁగ నొండెఁ, గట్టి కొంపో నొండెఁ ♦ గడఁగువారు
కొమ్మల రెమ్మల ♦ గొప్ప మొదళ్ళతో, వృక్షముల్ గొని పరు♦విడుచు నేను
తే. వనమున విహరింపఁగ ♦ భయదమైన, మత్స్వరూపంబుఁ గనుఁగొని ♦ మగువలెల్ల
వికృతముఖములతో వెలి♦వేగ మరిగి, రాక్షసేంద్రుని గేహసం♦రక్షకులను. ౨౫౧

అర్థములు. నిర్జరారినేతఁగన్ = రావణాసురునిగ, గేహసంరక్షకులన్ = ఇంటికావలివారిని.

తాత్పర్యము.

ఇట్లు భయపడి నన్నుఁ గామరూపి యగు రావణాసురుఁ డీ వేషమున వచ్చెనని తలఁచి యఱచును. ఆ యఱపు విని రాక్షసస్త్రీలందఱు నానాయుధములు తీసికొని నావద్దకువచ్చి కోపించి నన్నుఁబట్టి చంపుటకో, కట్టి రావణు నొద్దకుఁ దీసికొనిపోవుటకో,

ప్రయత్నింతురు. నేనో కొమ్మలతో, రెమ్మలతో, బోదెలతోఁ జెట్లను బీఁకికొని వారికిఁ జిక్కక పరుగు లెత్తుచు నే నీ వనముఁ దిరుగఁగా వారు నా భయంకర వేషముఁ జూచి వికారముఖములతోఁ బోయి రావణు నగళ్ళకావలివారిని.

కం. రక్కసులం బిలుతురు వా,రుక్కున శూలములు శక్తు • లుగ్రాసులు నీ
సెక్కఁగఁగొని మొత్తములై, యొక్కట నను దాఁకి రోస • మొదవెడు నాకున్.

అర్థములు. ఈసు = ఈర్ష్య, కోపము, ఉక్కున = బలముచే, అసులు = కత్తులు.

తాత్పర్యము.

రాక్షసులను బిలుతురు. వారు బలమున శూలములు, శక్తులు, కత్తులు కోపముతోఁ దీసికొని గుంపులై యొక్కటిగ నాపైఁ బడి రాఁగా నాకు రోషము వచ్చును.

ఉ. వారల నెల్ల జంపుపని • వచ్చినచో జలరాశి దాటి యా
తీరముఁ జేర నెట్లు లగు ? • దెంపునఁ బైఁబడి నన్నుఁ బట్టినన్
శ్రీరఘురామవార్త చెవి సేరదు సీతకు, నేను జిక్కుదున్
ధారిణికన్యఁ బట్టి ఖల • దైత్యసముల్ వధియింతు, రంతటన్. ౨౫౩

తాత్పర్యము.

ఈ వచ్చిన రాక్షసుల నందఱను జంపుచుంటినేని సముద్రముదాటి యావలి యొడ్డెట్లు చేరఁగలను ? అటుగాక వారు సాహసించి పైఁబడి నన్నుఁ బట్టికొనిరా సీతాదేవికి శ్రీరాముని వార్త చెప్పువా రుండరు. నేను జిక్కుదును. అప్పుడు రాక్షసులు దుష్టులై సీతను జంపుదురు.

ఉ. పాడగు రామభానుజులు • పట్టిన కార్యము, సీత యుంటినా
జాడయుఁ గానరా కసుర • సంఘపరీవృత యాచు వార్ధియే
పీడని పేరగడ్త యయి • విశ్రుతి గాంచిన లంకలోనఁ గా
పాడఁ బడున్ రహస్యముగ • ప్రాణములైనను గోలుపోవెడిన్. ౨౫౪

తాత్పర్యము.

అంతతో రామసుగ్రీవులు పట్టిన కార్యము పాడై పోవును. సీతను వారు చంపకపోయిరా, జాడ గూడఁ దెలియ రాకుండునట్లు రాక్షసులచేఁ జుట్టఁబడి సముద్రమే యగడ్తగాఁ గల లంకలో రహస్యముగ నే నేలమాలిగయందో దాఁపఁబడును. లేదా యామె యీ బాధలు పడలేక చావనైనఁ జచ్చును.

చ. కలనను నన్నుఁ జంపినను • గాక రుషామతిఁ గట్టినై చినన్
గలుగఁ డొకండు రామవిభు • కార్యముఁ దీర్పఁగఁ జాలుమేటి, యె
వ్వాలను దలంచి చూచినను • వానరుఁ డన్యుఁడు నూఱు యోజనం
బులు గల వార్ధి దాఁటఁగను • బూనెడు వాఁ డట లేఁడ యారయన్. ౨౫౫

అర్థములు. కలనను=యుద్ధమందు, రుషామతిన్ =కోపముతోఁ గూడిన మనస్సుతో, ఎవ్వాలను=ఏ విధముగఁ.

తాత్పర్యము.

యుద్ధమందీ రాక్షసులు నన్నుఁ జంపినను గోపించి కట్టివైచినను రామ కార్యముఁ జక్కఁబెట్టఁగల గొప్పవాఁ డొక్కఁడైన లేఁడు. ఏ విధముగ నాలోచించినను నూఱుయోజనముల సముద్రమును దాటఁగల వానరుఁడు లేఁడు.

ఉ. వేలకొలంది రాక్షసుల • పీఁచ మడంపఁగ నేర్తునైన దో
ర్లీల వెలుంగఁ బిమ్మటఁ ద•రింపఁగ లేను మహాబ్ధి గాసినై,
నాలములో జయం బపజ•యం బన రా దిదమిత్థ మంచు, శం
కాలుళితార్థముల్ సలుప•గా మది గొల్పదు కొంచె మేనియున్. ౨౪౬

అర్థములు. పీఁచము = మదము, దోర్లీల = భుజబలము, గాసినైన్ = బడలికచేత, ఆలము = యుద్ధము, ఇదమ్ + ఇత్థమ్ = ఇది యీ ప్రకారము జరుగును, శంకాలుళితార్థముల్ = సందేహముచేఁ గలఁత చెందిన కార్యములు, గొల్పదు = సమ్మతింపదు.

తాత్పర్యము.

ఎన్నివేల రాక్షసుల మదమైనను భుజబలముచే యుద్ధమందు నణఁపఁగలను గాని, బడలికచేత మఱల సముద్రము దాటలేను. అదిగాక యుద్ధమందు జయమపజయ మిట్టులే యగు నని నిర్ధారించి చెప్ప నెట్లు? కావున సందేహమున కెడ మిచ్చు కార్యములు చేయ మనస్సు సమ్మతింపదు.

క. సందేహ మైన కార్యము, నం దెవ్వఁడు బుద్ధిమంతుఁ • డాలోచన లే
కెందును దెగు నటు చేసిన, నిందింపఁగఁబడును దుర్వి•నీతుఁ డటంచున్. ౨౪౭

అర్థములు. తెగును = సాహసించును, దుర్వినీతుఁడు = నీతి యెఱుఁగని వాఁడు.

తాత్పర్యము.

మేలు గలుగుట సందేహమైన కార్యమును బుద్ధిమంతుఁ డగు వాఁ డాలోచింపక చేయ సాహసింపఁడు. అటు సాహసము చేసెనా వీఁడు నీతిమాలిన వాఁ డని లోకులు నిందింతురు.

తే. పలుకరింపక నే నేగ • భయము పేర్మి, మేను దొఱఁగుట నిక్క మీ•మీననేత్ర
పలుకరించితి నేనియుఁ • బైయనర్థ, చయము లెల్లను ప్రాప్తించు•సత్యముగను.

తాత్పర్యము.

రాక్షసులకు భయపడి పలుకరింపక నేను బోయితినా రాక్షసభయముచే నీమె దేహము వదలుట సత్యము. పలుకరించితినా మీఁదఁ జెప్పిన కీడు కలుగుట సత్యము.

క. ఐనట్టు తోఁచు పనులేన్, భానునిఁ గనుగొన్నతమము • పగిదిం జెడెనున్
వానిని దేశము, కాలము, జ్ఞానము లేనట్టిదూత • పలుపఁ గడఁగినన్. ౨౪౮

అర్థములు. తమము = చీఁకటి

తా త్ప ర్య ము.

వినదని యని నిస్సందేహముగఁ దోఁచు పను లైనను దేశకాల జ్ఞానములేని దూత చేయఁబూనినేని సూర్యునిఁ జూచిన చీఁకటివలెఁ జెడిపోవును.

క. దీని నిటు సల్ప సఫలం, బౌ నని ప్రాజ్ఞులు విధించి•నట్టిది కార్యం
బైనను జెఱుచును బండిత, మాని యయిన దూత శక్తి•మంతుఁడు గామిన్. ౨౬౦

అర్థములు పండితమాని = పండితుఁడనని తన్నుఁదాను దలచువాఁడు.

తా త్ప ర్య ము.

ఈ ప్రకారము చేసిన నీ కార్యము ఫలించు నని బుద్ధిమంతు లేర్పాటు చేసిన పనినైనను పండితమాని యగు దూత సామర్థ్యము లేనివాఁడై దానిని జెఱుచును.

ఉ. ఏగతిఁ గార్యహాని జని•యింపక యుండునో, బుద్ధిజాడ్య మిం
కేగతిఁ రాకయుండు నోకో • యేగతి వారిధిలంఘనంబు దా
నో గయి పోక యుండెడినో • యుర్విజ యేగతి నాదుమాటలన్
బాగుగ నాలకించు, వెఱ • పొల్పడ కేగతి నుండు న న్గనన్. ౨౬౧

అర్థములు. జాడ్యము = మాంద్యము, ఓగయి = చెడి, వెఱ =భయము, నన్ గనన్=నన్నుఁ జూడఁగానే.

తా త్ప ర్య ము.

ఎట్లు చేసినఁ గార్యము చెడక యుండును. బుద్ధిమాంద్యము నా కేగతి రాకయుండును. ఎట్లు వర్తించిన సముద్రము దాఁటుట వ్యర్థము గాక యుండును. ఎట్లు చెప్పిన సీతాదేవి నా మాటలను జక్కఁగా వినును. నన్నుఁ జూడఁగానే సీతాదేవి భయపడకుండు నెట్లు ?

సీ. అనుచు దీర్ఘంబుగ • నాలోచనమొనర్చి, మతిమంతుఁ డగు హను•మంతుఁడపుడు
కార్యనిశ్చయము నీ•కరణిని గావించె, నా రూపమును జూప • కా రఘూత్త
మునిని గీర్తించెద • వనజాతలోచన, భయపడ కుండెడు • పగిది గాఁగ
రఘుకులగ్రామణి • రాముని విదితాత్ము, ధర్మసహితశుభ•దంబు లైన
ఆ. మధురవాక్యములను • మానుగ నమ్మిక, పుట్టునట్టి భంగిఁ • బొగడువాఁడ
వెలఁది యెంతమట్టు • విశ్వసించునొ దాని, నెఱిఁగి యవలికార్య• మే నొనర్తు.

అర్థములు. దీర్ఘంబుగ = దూరముగ, ధర్మసహిత=ధర్మముతోఁ గూడినవి, శుభదంబులు = మేలిచ్చునవి, వెలఁది = స్త్రీ, సీత, ఎంతమట్టు = ఎంత మాత్రము.

తా త్ప ర్య ము.

ఈ ప్రకారము హనుమంతుఁడు దూరాలోచనము చేసి బుద్ధిమంతుఁ డగుటచే నిటు చేయవలె నని నిశ్చయించుకొనెను. ఎట్లనఁగా నన్నుఁ జూచినఁగదా యీమె

భయపడును. నా రూప మీయామెకుఁ గానరాకుండునట్లు కొమ్మలచాటున దాఁచి యీయామె భయపడకుండునట్లు రామచంద్రమూర్తిని ధర్మముతోడఁ గూడినవియు, శుభము నిచ్చునవియునగు తియ్యని మాటలచే నామెకు నమ్మకముపుట్టునట్లు పొగడెదను. ఆమాట లీమె యెంతవఱకు నమ్మినో చూచి తరువాతి కార్య మాలోచించెదను. ఇంతమాత్రమునఁ జెడునది యేదియు లేదు.

క. అని నిశ్చయించి సీతం, గను చామెయె వినెడునట్లు•గా సరసకుజం
బున మాటుగొనియె పావని, యనిమెన్ మధురంబులైన•యవితథసూక్తుల్. ౭౬౩

అర్థములు. ఆమెయె = ఆమె మాత్రమె, రాక్షసులకు వినఁబడకుండునట్లు, సరస = సమీపంబుననున్న, కుజంబునన్ = వృక్షంబునందు, మాటుగొనియె = దాఁచుకొనియె; అవితథసూక్తుల్ = యథార్థములై, వ్యర్థముకాని మంచిమాటలు, మధురంబులు=వినుటకు స్వయముగఁ దియ్యనివి, లోకమునందుఁ దలుచుగా నింద్రియముల మూలమున జ్ఞానము ప్రసరించి విషయమును గ్రహించిన పిమ్మటనే మనస్సున నాహ్లాదము కలుగుట వాడుక. ఈమాట లట్లుగాక తామే చెవిని స్పృశించుచున్నవో, యాచెవియందే యాహ్లాదమునుగలిగించుచున్నవి ఈమాటలు జ్ఞానమూలమున నాహ్లాదకరములు గావు. స్వయముగనే యాహ్లాదకరములు. ఇచ్చట జ్ఞానమునకు నాహ్లాదకరత్వము శబ్దమూలమున నని తెలియఁగునది. ఈ వాక్యముల కంతటి మాధుర్యము గల దని యతిశయోక్తి. అవి తథసూక్తులు = ఈ వాక్యములు సీత విన్నతోడనే సంతోషపడి తాను బూనియున్న ప్రాణత్యాగ ప్రయత్నము తప్పక మాను నని భావము. ఏ యుద్దేశముతో నా మాటలు చెప్పఁబడెనో యా యుద్దేశము నెఱవేర్చు శక్తి యీ మాటలయందుఁ గలదని భావము. సూక్తుల్ = ఈ వాక్యములకు నాహ్లాదకరత్వము పూర్వాపరనిరూపణముచేఁ గాదు. వానియందు సహజముగానే యున్నదని భావము. తాత్పర్యము.

ఈ ప్రకారము నిశ్చయించుకొనినవాఁడై హనుమంతుఁ డామెను జూచుచు నామె మాత్రము వినునట్లు దగ్గఱనున్న చెట్టుచాటున నుండియే తియ్యనివి, ప్రయోజనకారులైన మంచి మాట లిట్లనెను.

—• ౩౧ వ సర్గము. హనుమ సీతాదేవి వినునట్లు శ్రీరాముఁ బ్రశంసించుట •—

సీ. దశరథుం డనురాజు•దారకీర్తియు రథ, వారణ సైంధవ•భటయుతుండు
ధర్మశీలుఁడు గుణ•ధన్యుండు మాన్యుండు, రాజర్షివర్యుండు • ప్రకటయశుఁడు
చక్రవర్త్యన్వయ•జాతుండు తపమున, ఋషిఁబోలు బలమున • నింద్రనిభుఁడు
కరుణాపరుండు ని•క్ష్వాకువంశాగ్రణి, సత్యవిక్రముఁ డహిం•సారతుండు

తే. నృపతిలక్షణ యుక్తుఁడు • ఋజుగుణుండు
చతురుదధివృత మేదినీ • చక్రవిభుఁ

తుండు సుఖదుండు సుఖ యయి ♦ దొరలు లేక
దొరల కెల్లను దొర యయి ♦ పరఁగు చుండు. ౭౬౪

అర్థములు. ఉదారకీర్తి = (౧) గొప్పకీర్తి గలవాఁడు, (౨) ఉదారుఁడు = దాత యను కీర్తి గలవాఁడు, యాచించి వ్యర్థముగాఁ బోయినవాఁడు లేఁ డను కీర్తి. "దానేన ప్రభవా కీర్తిః, ప్రతాప ప్రభవం యశః" అన్నట్లు దానాదులచేత వచ్చు మంచిపేరు కీర్తి యనియు, ప్రతాపముచే శత్రువుల జయించి సంపాదించిన పొగడ్తకు యశమనియుఁ బేరు.

దశరథుఁ డను పేరు స్మరించు వా రచ్చట లేరు. ఒకవేళ యేదో ప్రస్తావనగా ననుకొన్నను బాగడు వారు లేరు. కావున దశరథుఁడనురాజు ఉదారకీర్తి యనుమాటలు చెవిలోఁ బడఁగానే యామెకు సంతోషము జనించి, యామె మనస్సు నాకర్షించి, యావల నేమి చెప్పునో విందమను బుద్ధి పుట్టించెను. ఈ విధముగ హనుమంతుఁడు సీతాదేవి మనస్సును దన వంకకు లాగుకొనెను. రథ = తేరులు, వారణ = ఏనుఁగులు, సైంధవ = గుఱ్ఱములు, భట = కాలిబంట్లు, వీరితో-యుఁతుఁడు = కూడిన వాఁడు, చతురంగబలము గలవాఁడని భావము. ఇట్లు సేనాసమృద్ధి చెప్పఁబడెను. ధర్మశీలుఁడు=ధర్మగుణము స్వభావముగాఁ గలవాఁడు, గుణధన్యుఁడు=సద్గుణము లను ధనముగలవాఁడు, ధనము చేయు కార్యములు ఆయన గుణములే చేయుచున్నవి. మాన్యుఁడు = లోకులచే గౌరవింపఁబడువాఁడు, రాజర్షి వర్యుఁడు = రాజఋషులలో శ్రేష్ఠుఁడు, ప్రకటయశుఁడు=ప్రసిద్ధమైన యశస్సుగలవాఁడు, చక్రవర్త్యన్వయ జాతుఁడు =సగరుఁడు మొదలగు చక్రవర్తులు మూల పురుషులుగాఁ గల వంశమునఁ బుట్టినవాఁడు, సత్యవిక్రముఁడు = సత్యమే విక్రమముగాఁ గలవాఁడు, "సత్యేన లోకాన్ జయతి" యన్నట్లు పరాక్రమముచే సాధింపఁదగిన దానిని, సత్యము చేతనే సాధించువాఁడు, సత్యవిక్రముఁడు = యుద్ధమునందు న్యాయమున నిలిచి, వంచనలేక శత్రువుల గెలుచువాఁడు, బలహీనుఁడు గదా వంచన చేయవలె. నిక్కపు బలశాలికి వంచన యేల ! భుజగుణుండు = చక్కని నడవడి గలవాఁడు, చతురుదధి = నాలుగు సముద్రములచే, వృత = చుట్టఁబడిన, మేదినీచక్ర = భూచక్రము గలవాఁడని, విశ్రుతుండు = ప్రసిద్ధిగలవాఁడు, సుఖదుండు = ప్రజలకు సుఖమే కలిగించువాఁడు. సుఖ = తాను సుఖము ననుభవించువాఁడు, దొరలులేక = సమానులులేక, దొరలకు = ప్రభువులకు, దొర = ప్రభువు.

తా త్ప ర్య ము.

దశరథుఁ డనురాజ మహాదాత యను కీర్తిని సంపాదించినవాఁడు. చతురంగ సైన్యము గలవాఁడు. ధర్మస్వభావముగలవాఁడు. సుగుణసంపత్తి గలవాఁడు, లోకపూజ్యుఁడు. రాజర్షులందు శ్రేష్ఠుఁడు. ప్రసిద్ధమైన యశము గలవాఁడు. చక్రవర్తుల వంశమునఁ బుట్టినవాఁడు. తపమున ఋషులకు సముఁడు. బలమున నింద్రసమానుఁడు.

దయాశాలి. ఇక్ష్వాకువంశమునఁ బుట్టినవారిలో శ్రేష్ఠుఁడు. సత్య పరాక్రముఁడు. అహింసయందుఁ బ్రీతిగలవాఁడు. గొప్ప రాజులకుండవలసిన చిహ్నములు గలవాఁడు. చక్కని నడవడి గలవాఁడు. నాలుగు సముద్రముల నడిమిభూమిని నేలువాఁడు. ఒకరిని సుఖపెట్టి తాను సుఖించువాఁడు. తనతో సములు లేక, ప్రభువులకెల్లఁ బ్రభు వగువాఁడు.

తన మామగారి నిల్లు పొగడు మాటలు విన గుణవతి యగు స్త్రీ యొల్లని దుండునా ! కావున నిం కేమి వినఁబడునో యని సీతాదేవి యూరక నిలఁబడెను.

ఉ. ఆ మహితాత్ము నగ్రసుతుఁ • డబ్జనిభాస్యుఁ డతిప్రియుండు, శ్రీ
రాముఁడు పేర, స్వీయజన•రక్షణదక్షుఁడు, నాత్మధర్మర
క్షామతి, చాపభృద్వరుఁ డ•ఖండుఁడు నన్నిట, దుష్టశాత్రవ
స్తోమభయంకరుండు, నిజ•శుద్ధకులాగత ధర్మరక్షుఁడున్. ౭౬॥

అర్థములు. అబ్జనిభాస్యుఁడు = చంద్రునితో సమానమైన ముఖము గలవాఁడు, స్వీయజనరక్షణ దక్షుఁడు = తన్నాశ్రయించిన వారిని తన్నాశ్రయించిన వారి నాశ్రయించిన వారిని రక్షించుట యందు సమర్థుఁడు, ఆత్మధర్మ రక్షామతి = స్వధర్మమును రక్షించు మనస్సు గలవాఁడు, చాపభృద్వరుఁడు = చాపభృత్ + వరుఁడు = విల్లుపట్టెడి వారిలో మేటి, అఖండుఁడు నన్నిట = ఏ విషయమందును గొఱఁత యనునది లేనివాఁడు, దుష్టశాత్రవ=దుష్టు లగు శత్రువులయొక్క, స్తోమ = సమూహమునకు, భయంకరుఁడు = భయము కలిగించువాఁడు, నిజ = తనయొక్క, శుద్ధ = నిర్మలమైన, కులాగత = వంశపరంపరగా వచ్చిన, ధర్మ = ధర్మమును, రక్షుఁడు = రక్షించువాఁడు.

తా త్ప ర్య ము.

గొప్పమనస్సుగల యాదశరథ మహారాజునకుఁ బెద్దకొడుకొకఁడు గలఁడు. ఆయన పేరు రాముఁడు. ఆయన చంద్రునివంటి ముఖము గలవాఁడు, ఆకారణముచే నందఱకుఁ బ్రియుఁడైనవాఁడు, తన్నాశ్రయించిన వారిని - వారి నాశ్రయించినవారిని రక్షించుట యందు సమర్థుఁడు. స్వధర్మరక్షణమందు మనస్సు గలవాఁడు. విల్లు పట్టెడి వారిలో నెల్ల మేటి, అన్ని విషయంబులఁ బూర్ణుఁడు, సర్వజ్ఞత్వ -సర్వశక్తి మత్త్వ-సర్వసంహార కర్త్వ- సర్వరక్షకత్వాది గుణము లం దన్నిట నేలోపము లేనివాఁడు, చెడు పగవారికి భయము గలిగించువాఁడు, నిర్మలమైన తనవంశాచార ధర్మమును రక్షించువాఁడు.

ఓహో యెవరో నామగనిపేరు చెప్పుచున్నారే, ఆయన గుఱించి యేమి చెప్పునో - ఉన్నాఁడని విందునో - వచ్చుచున్నాఁడని విందునో యని తహతహ పాటుతో చెవి మనస్సు నిచ్చి సీతాదేవి వినుచున్నది.

సీ. ఆయనఘుఁండు స•త్యాత్ముఁడు వృద్ధుఁ డా, తనితండ్రి పనిచిన•పనువుఁ జేసి
తమ్ముఁడు దారయుఁ •దనతోడ రా వనీ, ధారణి కేగి యా•వీరవరుఁడు

మృగయారతుం డయి • మెలఁగుచు శూరులుఁ, గామరూపులు నైన•ఖలసురారి
వరులఁ బెక్కు-రఁ జంపె • ఖరదూషణాదులు, సమయుట విని జన•స్థానమునను
తే. మాయలేడి నెపంబున • మాయ చేసి, యతని యిల్లాలి రావణుఁ•డపహరించె
నామె వెదకుచు వచ్చి నె•య్యం బొనర్చె, భూవిభుఁడు కీశుఁడైన సు•గ్రీవుతోడ.

అర్థములు. పనుపుఁజేసి=ఆజ్ఞచే, మృగయారతుండయి=వేఁటయం దాసక్తి గలవాఁడయి.

తాత్పర్యము.

పాపరహితుఁడైన యా శ్రీరామచంద్రమూర్తి సత్యస్వభావుఁడు, ముసలి వాఁడు నగు తన తండ్రి యాజ్ఞాపించిన ప్రకారము తన తమ్ముఁడు భార్య తనతోడ రాఁగా, నడవుల కేగి యా వీరుఁడు వేఁటకై తిరుగుచు శూరులు, గామరూపులును నగు దుష్టరాక్షసుల ఖరదూషణాదుల ననేకులఁ జంపెను. జనస్థానమున నున్నవారు చచ్చుట విని రావణాసురుఁడు మాయలేడి నెపమున మోసగించి యా రామచంద్ర మూర్తి భార్యను అపహరించెను. రామచంద్రమూర్తి యామెను వెదకుచు వచ్చి వానరుఁడైన సుగ్రీవుతో స్నేహము చేసెను.

ఉ. వాని నిమిత్తమై తునిమె • వాలిని, వానర రాజ్యలక్ష్మినిన్
బూనిచె సూర్యసంభవునిఁ • బూనిఁ యతండును సీత రోయఁగా
వానరవీరులం బనిచె • వాఁడి చెలంగెడి కామరూపులన్
మానక సర్వదిక్ని చయ•మార్గణతత్పరు లైరి వారలున్. ౭౬౭

అర్థములు. పూనిచెన్ = పూనునట్లుచేసెను, పూనునకు పూనిచె, పూంచె. ఇవి ప్రేరణార్థకరూపంబులు. వాఁడి = పరాక్రమము, సర్వదిక్ + నిచయ =అన్ని దిక్కు-ల సమూహములందు, మార్గణతత్పరులైరి = వెదకుట యను పనియందు నాసక్తిగలవారైరి.

తాత్పర్యము.

రామచంద్రమూర్తి తనస్నేహితుఁడైన సుగ్రీవుని నిమిత్తమై వాలినిజంపి సుగ్రీవున కారాజ్యము నిచ్చెను. ఆ సుగ్రీవుఁడు సీతాదేవిని వెదకుటకై పరాక్రమ వంతులు, కామరూపులు నగు వానరులఁ బంపెను. వా రన్నిదిక్కు-లయం దామెను వెదకు చున్నారు.

మ. సరగన్ నేను జటాయుసోదరుఁడ నౌ • సంపాతి వాక్యంబునన్
గురుశక్తిన్ శతయోజనాయతమహా•కూపారమున్ దాటితిన్
ధరణీపుత్రి నిమిత్తమై; యిచట సీ•తానాయకోక్తస్వరూ
పరుచిశ్రీలఁ జెలంగు సాధ్వి గుణరూ•పం గంటిఁ బుణ్యంబునన్. ౭౬౮

అర్థములు. సరగన్ = త్వరగా, శతయోజనాయత = నూఱుయోజన ములు నిడివిగల, మహాకూపారమున్ = గొప్ప సముద్రమును, సీతానాయకోక్త =

సీతాపతి యగు రామచంద్రమూర్తిచేఁ జెప్పఁబడిన, స్వరూపరుచిశ్రీలన్ = ఆకారముచేతను, వర్ణముచేతను, కాంతి సంపత్తిచేతను, సాధ్వీన్ = పతివ్రతను.

తా త్ప ర్య ము.

అట్టివారిలో నొకఁడనైన నేను జటాయువున కన్నయగు సంపాతిమాటల ప్రకారము శీఘ్రముగ నా గొప్ప శక్తిచే నూ ఱామడ నిడివి గల గొప్ప సముద్రమును సీతాదేవి నిమిత్తమై దాఁటి వచ్చి రామచంద్రమూర్తి చెప్పిన యాకారము, వర్ణము, కాంతి, గుణము, సౌందర్యము గల పతివ్రతను నా పూర్వపుణ్య ఫలమునఁ జూచితిని.

చ. అని హనుమంతుఁ డాడ జన•కాత్మజ తద్వచనంబు లన్నియున్
విని వెఱగంది మోమునను•వ్రేలెడి ముంగురు లల్లఁ ద్రోచికొం
చును మొగ మెత్తి చెట్టు దెసఁ • జూచుచు రాము వెఱన్ స్మరించుచున్
గనియెను గ్రింద మీఁదును న•గంబునఁ బ్రక్కల నందు నొక్కెడన్. ౨౧౯

అర్థములు. వెఱగు+అంది = ఆశ్చర్యపడి, వెఱన్ = భయముచే, ఆపదలందు, భయసమయముల రామనామస్మరణము "ఆపదామపహర్తార" మ్మను మంత్రశ్లోకమును బఠించిన నా యాపద, భయము దొలఁగును. ఇది యనేక భక్తులకు ననుభవ విదితము.

తా త్ప ర్య ము.

ఈ ప్రకారము హనుమంతుఁడు చెప్పఁగా సీతాదేవి యా మాట లన్ని విని యాశ్చర్యపడి ముఖముపై వ్రేలాడుచున్న వెంట్రుకలు మెల్లఁగ బైకిఁ ద్రోచికొని యెవ రీ మాటలు చెప్పిన వా రని ముఖమెత్తి చెట్టుప్రక్క చూచుచు నిది యేమి రావణమాయయో, యని భయముచే రామనామము స్మరించుచుఁ జెట్టునందు, క్రింద మీఁదఁ, బ్రక్కల, సందులఁ బక్కఁగాఁ జూడఁగా నందు నొక్కచోట.

—• ౩౨-వ సర్గము. సీతాదేవి హనుమంతునిఁ జూచి భయపడుట. •—

ఉ. తూఁగపు కొండపై నరుణు • తోయమువాఁడన నొప్పి కొమ్మలం
దారఁగ డాఁగియున్న కపి • నర్జునచేలుని సాంత్వవాది శం
పారమణీయపింగళుని • భాస్వదశోకసుమోత్కరాభునిన్
జేరువ కొమ్మ నుండెడి య•చింత్యపరాక్రము స్వర్ణలోచనున్. ౨౨౦

అర్థములు. అరుణ తోయమువాఁడు = అనూరునితో సమానుఁడు, ఆరఁగన్ = బాగుగ, అర్జున చేలునిన్ = తెల్లవస్త్రము గలవానిని, సాంత్వవాదిన్ = మంచి మాటలు చెప్పువానిని, శంపా = మెఱుఁగువలె, రమణీయ = అందమైన, పింగళుని = పచ్చని కాంతి గలవానిని, భాస్వదశోకసుమోత్కరాభునిన్ = ప్రకాశించు నశోక పుష్పముల సమూహముతో సమానుని, చేరువ కొమ్మన్ = సమీపమున నుండు కొమ్మయందు; మెల్లగాఁ జెప్పుమాటలుసీతాదేవికి వినఁబడుటకై సమీపశాఖయందే

యున్నాఁడని భావము. అచింత్య పరాక్రమము=చింతింపరాని పరాక్రమము గలవానిని, సముద్రము దాఁటుట, లంకలో వెదకుట, తన్నుఁగనుఁగొనుట సామాన్యులచే నగు కార్యముకాదు. స్వర్ణలోచనున్ = బంగారువంటి కన్నులు గల వానిని.

తా త్ప ర్య ము.

తూరుపు కొండమీఁద నుదయించి యుదయింపకయుండు సూర్యునివంటి వాఁడనఁ జెప్పఁదగి కొమ్మలందు బాగుగా దాగియున్న తెల్లని వస్త్రము ధరించి ప్రియవాక్కులు చెప్పుచున్న వానిని, మెఱుఁగు వంటి పింగళవర్ణము గల వానిని అశోక పుష్పముల రాశివలె నెఱ్ఱనగు ముఖము గలవానిని, సమీపమందే యుండెడి యద్భుత పరాక్రమము, పచ్చని కన్నులు గలవానిని, క్రోఁతిని,

తూరుపు కొండమీఁది యనూరుఁడు ఎఱ్ఱనివాఁడు, ఎత్తున నున్నవాఁడనుటచే సూర్యబింబము కానవచ్చి కానరాని సమయమును, సూచించుచున్నది. హనుమంతుడను ననూరుని దర్శనమగుటచే రామచంద్రమూర్తి యను సూర్యుని దర్శనము శీఘ్రకాలమందే తప్పక కలుగునని భావము.

చ. కని చలియించి యబ్బపడి • తన్మసుత హా! యిది భీషణంబు నౌ
వనచరరూప, మే దొసఁగు • పాటిలునో కనఁ గొంట దీని, నం
చును మదిలోఁ దలంచి భృశ•శోకమునన్ రఘురామ! లక్ష్మణా!
యని భయమోహితాత్మ యయి • యల్లన నల్లన నేడ్చె దీనయై. ౭౭౧

అర్థములు. చలియించి = భయముచే దేహమును గదలించి, భీషణము= భయంకరము, దొసఁగు = కీడు, భృశ = అధికమైన, అల్లన నల్లన నేడ్చెన్ = మెల్ల మెల్లగా నేడ్చెను. ఇప్పటి సీతాదేవి మనసు నమ్మి నమ్మని డోలాయమాన దశయం దున్నది. దానివలన గట్టిగా నేడ్చిన రాకాసు లందఱు వత్తురేమో. నిజముగ నితఁడు రామదూతయై యుండినఁ గార్యము తాను బాడుచేసిన ట్లగును.

తా త్ప ర్య ము.

చూచి దేహము జలదరింపఁగా నాశ్చర్యపడి యిది భయంకరమైన క్రోఁతి రూపము. దీనిని జూచితిని. ఏమి కీడు మూఁడఁగలదో యయ్యో యని మిగుల శోకముచే రామలక్ష్మణుల స్మరించి భయముచే భయపడిన మనస్సు గలదై మెల్ల మెల్లన నేడ్చెను.

క. కనుచుఁ బృథుభుగ్న వక్త్రుని, వనచరపతిమంత్రివర్యు•వాతాత్మజునిన్
ఘనమేధావివరిష్ఠుని, దిననాథతనూజుబంటుఁ • దేజోనిలయున్. ౭౭౨

అర్థములు. పృథుభుగ్న వక్త్రునిన్ = గొప్పదియు వంకరయైనదియు నగు ముఖము గలవానిని, మేధావి వరిష్ఠునిన్ = బుద్ధిమంతులలో శ్రేష్ఠుని.

తా త్ప ర్య ము.

పెద్దదియు వంకర రైనదియు నగు ముఖము గలవానిని, సుగ్రీవుని మంత్రు

లందు శ్రేష్ఠుని, వాయుకుమారుని, గొప్ప బుద్ధిమంతులలో శ్రేష్ఠుని, సుగ్రీవుని బంటుగా వచ్చిన వానిని, తేజమునకు స్థానమైన వానిని జూచుచు.

చ. నెలఁత భృశార్తిఁ గుందుచు వి • నీతునిరీతిగ నున్న మారుతిం
దలఁచి మనంబులోన నగు • నా యిది స్వప్న! మ టంచు నెండియున్
జెలువ సమీరపుత్రుఁ గని • చిత్తము వ్యాకుల మంద భీతిచేఁ
గలఁగి విసంజ్ఞ యై శవము • కై వడి నై తెలి వొంది యి ట్లనున్. ౨౨౩

అర్థములు. నెలఁత = స్త్రీ, సీత - వినీతునిరీతిగన్ = వినయము గల వాఁడుగ, విసంజ్ఞయై = స్మృతి తప్పినదై.

తా త్ప ర్య ము.

సీతాదేవి మిగుల మనోవేదనచే దుఃఖించుచు వినయవంతుఁడుగ నున్న హనుమంతుని జూచి యిది కలయా యేమి యని వ్యాకులపడి స్మృతి తప్పి పీనుఁగు వలె నిశ్చేష్టయై యుండి మఱలఁ దెలివి తెచ్చుకొని తనలోఁ దా నిట్లనుకొను చున్నది.

మ. కలలోఁ గ్రోఁతిని జూడరా దనుచు వ • క్కాణించు శాస్త్రంబు, నేఁ
గలఁ గంటిం గద వానరంబు, నిఁక నే • కష్టంబు ప్రాప్తించునో
కలుగుం గావుత రామలక్ష్మణులకుం • గళ్యాణముల్, సంతతం
బల్గరుం గావుత నాదుతండ్రి జనకుం • డారోగ్యసంపత్తిచేన్. ౨౨౪

అర్థములు. వక్కాణించున్ = చెప్పును.

తా త్ప ర్య ము.

కలలోఁ గ్రోఁతిని జూచినఁ గీడని శాస్త్రములు చెప్పుచున్నవి. నేను గలలోఁ గ్రోఁతిని జూచితిని. కావునఁ గీడు కలుగనున్నది. రామలక్ష్మణులకు మేలు కలుగుం గావుత. మా తండ్రి జనక మహారా జారోగ్యముచే సంతోషించును గాక.

చ. కల యని యందునా యెటులు • కల్గెడు స్వప్నము నిద్ర లేకయే!
కలిగెడు నెట్లు నిద్ర యిటు • కాఱియపాటున వేఁగు వేళలన్ !
జెలఁగు నొకో సుఖంబు నను • శీతకరాభముఖారవిందునిన్
జెలువుని రాముఁ బాసి యిటు • చేడ్పడు దుర్భగురాల నాకునున్ ! ౨౨౫

అర్థములు. కాఱియపాటునన్ = బాధచే, సమ = నిండు; శీతకరాభ = చంద్రునితో సమానమైన, ముఖారవిందునిన్ = ముఖకమలము గలవానిని, దుర్భగురాలన్ = దురదృష్టముగలదానను.

తా త్ప ర్య ము.

ఇది కలయా! కాదు. ఏల? నిద్రలేక కల యెట్లువచ్చును? ఇప్పుడు నేను నిద్రించు చున్నా నేమో. నిద్ర యెట్లు వచ్చును? దుఃఖముచే బాధపడుచున్న వేళ నిద్ర యెట్లు వచ్చును. సుఖముకోఁచినఁగదా నిద్రవచ్చును. నిండు చందురువంటి ముఖారవిందము

గల రామచంద్రుని విడిచి యేడ్చుచుండు యీ నిర్భాగ్యురాలికి నిద్ర యెట్లు వచ్చును? సుఖ మెట్లు దోఁచును.

చ. కల యిదిగాదు, నిక్కవము • గాదు, నిజం బరయంగ నెప్పుడున్
దలఁపున రామ రామ యని • ధ్యాన మొనర్చుచు, నోర నట్టులే
పలుకుచు నుంటఁ దద్విషయ • వాక్యములే విను దాన, నమ్మహా
బలుని స్వరూపమే కనెద • భావనతీవ్రబలంబు పెంపునన్. ౭౭౨

తా త్ప ర్య ము.

నిద్రకుఁ గారణములేదు, కావున నిది కలకాదు. రామదూత క్రోఁతి యింత సముద్రముదాఁటి రావణాసురుని యంతఃపురమునకు వచ్చుట నమ్మరాని విషయము. కావున నిది నిజముగాదు. అయిన నిఁకేమి యనిన నేను సర్వవేళల రామ రామ యని స్మరించుచున్నదానను. ఆయననే ధ్యానించు చున్నదానను. కావున నాయన మాటలే వినవచ్చుచున్నవి. తీవ్ర భావన బలముచే నాయన స్వరూపమే కానవచ్చు చున్నది.

ఉ. ఆ రఘువీరునై హృదయ • మంతయు నిల్పి మనోభవవ్యథా
భారముచేఁ దపించుటను • భావనశక్తి రఘూత్తమాకృతిన్
సారెకుఁ గాంతు నెల్లయెడఁ • జారుతదీయకథల్ వినంబడున్
వారక నాదు మోహ మొక • వానరరూపముఁ గాంచి పల్కెనో. ౭౭౭

తా త్ప ర్య ము.

వాస్తవ మిదియె. రామచంద్రమూర్తి మీఁదనే నా మనస్సంతయు నిలిచి మనస్సులోఁ బుట్టిన దుఃఖాతిశయముచేఁ బరితాప పడుట వలన హృదయమునందు వేఱొక విచారము లేకుండుటచే భావన బలంబున నే నెందు జూచినను రాముని స్వరూపమే కానవచ్చుచున్నది. ఆకథలే వినఁబడు చుండును. కావున నా మోహమే యొకక్రోఁతిరూపము గైకొని పల్కు చున్నది.

ఈ పద్యమందు భక్తివలనఁ గలుగు సమాధి చెప్పఁబడెను.

యత్రైవ యత్రైవ మనో మదీయం
తత్రైవ తత్రైవ తవ స్వరూపమ్
యత్రైవ యత్రైవ శిరో మదీయం
తత్రైవ తత్రైవ పదద్వయం తే.

నా మనస్సెందెందుఁ బోవుచున్నదో యదియంతయు నీ స్వరూపమే. నా శిరస్సెందెందు వ్రాలుచున్నో యం దెల్ల నీ పాదములే యున్నవి.

'స్వానుభూతి రసావేశా, దృశ్యశబ్దా ఉపేక్షితః,
నిర్వికల్ప సమాధిస్స్యా, నివాత స్థిత దీపవత్.

తన యనుభవ రసమావేశించుటచేఁ గానవచ్చునవి, వినవచ్చునవి, ఉపేక్షిం

చుట నిర్వికల్ప సమాధి యగును. ఇది గాలిలేనిచోట నుండు దీపము వంటిది.

సీతాదేవి రామునందే మనస్సు నిలిపి రామునే ధ్యానించుటచే నితరాకార ములు గానవచ్చుట లేదు. ఇతర ధ్వనులు చెవిని బడుటలేదు. ఏది చూచిన రామ చంద్రమూర్తియే. యేది విన్నను రాము ముచ్చటలే. ఇది భక్తి పరాకాష్ఠ. దీనిని మించిన దశలేదు; దీని నెప్పుడు రామచంద్రమూర్తి ప్రసాదించునో, ఈ దశ కంస మారీచులకు భయము చేతను సీతాప్రహ్లాదులకు భక్తి చేతను గలిగెను.

చ. అటు లయినన్ మనోరథము•నాకృతి యిట్టిది గాద టంచుఁ బ్ర
స్ఫుటముగ బుద్ధిచేఁ దెలియఁ • జూచెద, రూపము లేదు దానికిన్
బటుతరరూపి యియ్యదియుఁ • బల్కెడి మాటలు నన్నుఁ జూచియే
యెటు లనవచ్చు మాయ యని • యెంతయుఁ జూచిన నిక్కవంబ యౌ. ౨౨౭

తాత్పర్యము.

ఆ విధముగఁ జూచిన నదియు సరికాదని తోఁచుచున్నది. మనోరథరూప మిది కాదని బుద్ధి చెప్పుచున్నది. మనస్సునకు రూపము లేదుకదా. ఇది స్పష్టముగ రూపముగలదై కానవచ్చుచున్నది. ప్రత్యక్షముగఁ గానవచ్చునది, నన్నుఁజూచి మాటలాడుచున్నది, మాయయని యెట్లనవచ్చును. కావున నిది వాస్తవమే.

"యథార్థం సర్వ విజ్ఞాన మితి వేదవిదాం మత"మ్మన్నట్లు మనకుఁ గాన వచ్చునది వినవచ్చునది సర్వ సత్యమే కాని యసత్యముకాదని సూచితము.

చ. అని మది నిశ్చయించి తన • హస్తయుగంబును మోడ్చి మ్రొక్కెదా
నను బలవైరి యుక్త సుమ • నస్తతి మంత్రి స్వయంభువున్ శుచిన్
వనచరుఁ డిప్డు నా యెదుటఁ • బల్కిన వాక్యము లెల్ల సత్యమై
యొనరుత వేఱుగా జరుగ • కుండెడిఁ గాత మటంచు వేఁడఁగన్. ౨౨౮

తాత్పర్యము.

నాకుఁ గానవచ్చు క్రోఁతి వాస్తవముగఁ గోఁతియే గాని యొకవస్తువు మఱి యొకవస్తువుగాఁగానరాలేదని నిశ్చయించుకొని రెండుచేతులు జోడించి యింద్రునితో గూడిన బృహస్పతిని బ్రహ్మను అగ్నిని నమస్కరించెదను. ఇప్పుడీ క్రోఁతి నాయెదుట జెప్పిన మాటలన్నియు సత్యములే యగునుగాక ! దానికి భిన్నముగా జరుగకుండును గాక యని ప్రార్థించెను. ఇప్పటికి సీతాదేవి మనస్సునకు నిది నిజముగాఁ క్రోఁతియే యని విశ్వాసము కుదిరి ఆయన చెప్పిన విషయము సత్యమని యింకను నమ్మినది కాదు.

—• ౩౩-వ సర్గము. హనుమంతుఁడు సీతాదేవితో సంభాషించుట. •—

క. హనుమయు వినీతవేషం,బున వృక్షముఁ గొంత దిగ్గి • మోడ్పుం గేలన్
దనశిరమునఁ బూనుచు నతి,వినయంబున మధురభణితి • వెంఁడికి ననియెన్.

తాత్పర్యము.

ఇంత మాత్రము దనయందు విశ్వాసము గలదమ్మా గదా యని హను మంతుఁడు నిశ్చయించుకొని మునుపున్న కొమ్మకంటెఁ గ్రిందికొమ్మకు వినయవంతుని వేషముననే దిగి రెండు చేతులు జోడించి శిరస్సున నుంచుకొని మిగుల వినయముతోఁ దియ్యని మాటలతో నిట్లనెను.

శా. అమ్మా ! పద్మదళాక్షి యెవ్వతె వీఁటు • లా మైల కౌశేయచే
లమ్మున్ దాలిచి కొమ్మ యూఁతఁగొని ని • ల్వంగ ? బద్మపత్రంబులం
దిమ్మై కాఱు జలంబు నాఁగఁ గనులం • దిట్లేల శోకాశ్రుపూ
రమ్ముల్ గ్రమ్మెడి ? నానతీయఁ గదవే • ప్రార్థింతు సాధ్వీమణీ ! ౭౮౧

తాత్పర్యము.

అమ్మా! పతివ్రతా రత్నమా! నిన్ను నే నొకటి ప్రార్థించెదను. నాయందు దయ గ్రహించి సెలవిమ్ము. నీ వెవ్వతెవు. ఏల యిట్లు మాసిన పట్టువస్త్రము గట్టుకొని కొమ్మను బట్టుకొని నిలఁబడి యున్నదానవు. తామర రేకులనుండి పడునీళ్లవలె నేల కన్నులనుండి నీరు కాఱుచున్నది ?

ఉ. కిన్నరకాంతవో ? యసుర • గేహినివో ? వసురుద్రరామవో ?
పన్నగనారివో ? విబుధ • భామినివో ? మఱి యక్షరామవో !
యన్నెలఁ బాసి కూలిన గు • ణాన్విత రోహిణివో ? తలంప నో
కన్నియ నీవు దేవతవ • కాఁ దలపోసెద భద్రలక్షణా ! ౭౮౨

తాత్పర్యము.

నీవు కిన్నరస్త్రీవా ? వసువుల రుద్రుల భార్యవా ? పన్నగస్త్రీవా ? దేవతా స్త్రీవా ? యక్షకాంతవా ? ఆ చంద్రుని విడిచి నేలఁబడిన రోహిణివా ? నీ యందుఁగల శుభచిహ్నములు చూచి నీవు మనుష్యస్త్రీవికావు, దేవతాస్త్రీ వని తలంచెదను.

తే. అలుక చేతనొ మోహంపుఁ • గలఁక చేత
నో వసిష్ఠుని నెడఁబాసి • యుర్వీదిరుగఁ
గడఁగిన యరుంధతివి గావు • గా ! మొఱుంగఁ
బల్కవే ప్రేమఁ గళ్యాణి • భద్రమగుత. ౭౮౩

తాత్పర్యము.

కల్యాణీ ! నీకు మేలుగలుగునుగాక ! చెప్పుము. కోపముచేతనో మోహము వలనఁ గలిగిన కలఁత చేతనో భూమిని దిరుగుటకై వసిష్ఠుని విడిచివచ్చిన యరుంధతివి కావు గదా చెప్పుము. అరుంధతి తన పేరున కర్థము తానే యిట్లుచెప్పెను. "ధరాన్ ధరిత్రీం వసుధాం భర్తృ స్తిష్ఠా మ్యనంతరమ్, మనో ఽనురంధతీ భర్తృరితి మాం విద్ధ్య రుంధతీమ్॥ భార. అను ౧౪౨ అధ్యా.

ధరాన్ = పర్వతములను, ధరిత్రీం = భూమిని, వసుధామ్ = ఆకాశమును

(వసన్ దేవాన్ ధత్తే ఇతి వ్యుత్పత్త్యా వసుధాం దివమ్ - నీలకంఠ) పర్వతములను భూమిని ఆకాశమును భర్తతోడ నధిష్ఠించి యున్నాను. భర్తను అవ్యవధానముగ ననుసరించి యుండుదానను. భర్తకంటె నెక్కువగా సారవంతమైన ధరిత్రిని దలఁచు దానఁ గాను, కావున నా పే రరుంధతి యందురు.

ఉ. ఎందులనుండి వచ్చి ! తిటు • లిచ్చట నేల మహార్తిఁ గుంద, నో
సుందరి ! తండ్రి యెవ్వఁ డొకో ! • సోదరుఁ డెవ్వఁడు ? భర్త యెవ్వరో
నందనుఁ డెవ్వఁ డమ్మ ! సుర • నారివి గా వని తోఁచె నేడ్చుటన్,
దండడియూర్పు లుంట, వసు • ధాస్థలి నిల్చుట, రాజచిహ్నలన్. ౨౦౪

తా త్ప ర్య ము.

అమ్మా ! ఎచ్చట నుండి నీ విచ్చటకు వచ్చితివి. ఇచ్చట నీ విట్లు దుఃఖింపఁ గారణ మేమి ? నీవిటు దుఃఖింపవలసిన దానవుగావే. నీ తండ్రి యెవ్వఁడు ? నీ తోడఁ బుట్టినవాఁ డెవ్వఁడు ? నీ భర్త యెవ్వఁడు ? కొడు కెవ్వఁడు ? నీ రూపము గుణముఁ బట్టి నీవు దేవతాస్త్రీ వని తలఁచితిని గాని నీ వేడ్చుచుండుట చేతను, విస్తారముగ నూర్పు లుండుటచేతను, భూమి మీఁద నిలఁబడి యుండుటను రాజస్త్రీల కుండవలసిన చిహ్నములు నీ యం దుండుటను నీవు దేవతాస్త్రీవి గా వని తోఁచు చున్నది. రాజస్త్రీ చిహ్నములు.—

'చక్రస్వస్తిక వజ్రాంకం ధ్వజమీనాతపత్రవత్
యస్యాః పాదతలం బ్రహ్మన్ సా భవేత్ క్షితిపాంగనా,
భవే దఖండభోగా యోర్వ్యాం మధ్యాంగుళీ సంగతం
ఉన్నతో మాంసలోంగుష్ఠో వర్తులోఽతుల భోగదః॥'

చక్రము, స్వస్తికము, వజ్రము, ధ్వజము, మత్స్యము, గొడుగు వీని యాకారమువంటి రేఖలు పాదము లందుండిన రాజపత్ని యగును. కాలిప్రేళ్ల నడిమి భాగము భూమిని దాఁకియుండిన నఖండభోగములు గలుగును. బొటనవ్రేలు ఎత్తుగను గుండ్రముగ నుండిన విశేషసౌఖ్యములు గలుగును.

'రాజ్ఞీత్వసూచకం స్త్రీణాం - పాదపృష్ఠం సమున్నతమ్
అస్వేద మసిరాఢ్యంచ మసృణం మృదు మాంసలమ్॥'

మీఁగా లెత్తుగను, చెమటలేనిదిగను, నరములు తెలియనిదిగను, నునుపుగను, మెత్తగను, బలిసినదిగను నుండిన రాజభార్య యగును.

'రోమహీనే శుభే స్నిగ్ధే యజ్జంఘే క్రమవర్తులే
సా రాజపత్నీ భవతి వ్యాసిరే సుమనోహరే
ఏకరోమా రాజపత్నీ ద్విరోమాతిసుఖాన్వితా
త్రిరోమా రోమకూపేషు - భవే ద్వైధవ్య దుఃఖభాక్॥'

పిక్కలు రోమములులేక నునుపై గుండ్రములై నరములు తెలియక రమ్యముగ నుండిన రాజపత్ని యగును. ఒక రోమకూపమం దొక వెండ్రుక యుండిన రాజపత్ని యగును. రెండురోమము లుండిన మిగులసుఖ మనుభవించును. మూఁడు వెండ్రుకలుండిన విధవ యగును.

"సువృత్తైః కరభాకారై రూరుభి ర్మసృణై ర్ఘనైః
సువృత్తై రోమరహితై ర్భవేయు ర్భూమివల్లభాః"

తొడలు దృఢములుగను, ఏనుఁగు తొండములవలెను, నునుపుగను,లావుగను, గుండ్రముగను, వెండ్రుకలు లేనివిగను, నుండిన రాజభార్య లగుదురు.

"చతుర్భి రంగులై శ్శస్తా కటి ర్వింశతి సంయుతైః
సమున్నత నితంబాఢ్యా చతురస్రా మృగీదృశామ్
నితంబబింబో నారీణా మున్నతో మాంసలః పృథుః
మహాభోగాయ స ప్రోక్త స్తదన్యోఽశర్మణే మతః॥

మొల యిరువదినాలు గంగుళముల వెడలుపుగలిగి యెత్తై చదరముగా నుండిన పిఱుఁదులు గలది రాజపత్నియగును. పిఱుఁదు లున్నతములుగను బలిసినవిగను విశాలముగ నుండిన మహాభోగము గల దగును.

'సూతే సుతాన్ బహూన్ నారీ పృథుకుక్షిః సుఖాస్పదమ్
క్షితీశం జనయే త్పుత్రం మండూకాభేన కుక్షిణా.

కడుపు పెద్దదిగ నుండిన పెక్కు కొడుకులఁ గనును. కప్పవంటి కడుపు గలది రాజు గాఁగలవానిని గనును.

'రక్తా వ్యక్తా గభీరాశ్చ, స్నిగ్ధాః పూర్ణాశ్చ వర్తులాః
కరరేఖా స్త్రియో యస్యా, శ్శుభా భాగ్యవతీచ సా
మత్స్యేన సుభగా నారీ స్వస్తికేన వసుప్రదా
పద్మేన భూపతేః పత్నీ జనయే ద్భూపతిం సుతమ్
చక్రవర్తి స్త్రియః పాణౌ నంద్యావర్తః ప్రదక్షిణః
శంఖాతపత్రకమలా నృపమాతృత్వ సూచకాః.'

అఱచేతియందు రేఖలు ఎఱ్ఱగను,స్పష్టముగను, లోతుగను, నునుపుగను సంపూర్ణముగను (నడుమ తెంపులులేక) గుండ్రముగ నుండిన భాగ్యవతి యగును, మత్స్యరేఖ యుండిన మహైశ్వర్యము కల దగును. స్వస్తిక ముండిన మంచి వ్రతము గల దగును. పద్మరేఖ యుండిన రాజు భార్యయై రాజు గాఁగలవానిని కొడుకును గనును. చేతియందు నంద్యావర్తరేఖ యుండిన, ప్రదక్షిణముగను రేఖలుండిన చక్రవర్తి భార్య యగును. శంఖము గొడుగు కమలము వీనివలె రేఖలుండిన రాజమాత యగును.

'పాటలో వర్తుల స్నిగ్ధో రేఖాభూషిత మధ్యమః,
సీమంతినీనా మధరో ధరాజాని ప్రియో భవేత్.

ఎఱుపు వర్ణము - గుండ్రము - నునుపు - నడుమ రేఖగల పెదవి గలది రాజ భార్య యగును.

'భ్రువోరంతర్లలాటేవా మశకో రాజ్యసూచకః,
నాసాగ్రే మశక శ్శోణో మహిష్యాశ్చైవ జాయతే.'

కనుబొమల నడుమఁ గాని, లలాటమునందుఁ గాని దోమవంటి సన్న మచ్చ యుండిన రాజ్యప్రాప్తి కల దగును. ముక్కు కొన నెఱ్ఱని మచ్చ యుండిన రాజ భార్య యగును.

'అరవిచ్చు తమ్మికై వడి, పరఁగిన రుచి నొప్పి నింబ పల్లవరుచితో
సరియైన మోవి గలయది, యరయంగా రాజపత్నియై విలసిల్లున్'
'ఉదరంబు కరతలోదర, సదృశంబై జంఘ లతి విశాలంబైనన్
సుదతీ తిలకంబున క,భ్యుదయం బగు ధరణినేలు పుత్రులఁగాంచున్.
"విదితముగఁ బ్రసన్నతగల
వదనముగల వనిత రాజవల్లభ"

ఇత్యాది చిహ్నములచే సీతాదేవి రాజపత్ని యని హనుమంతుఁడు గ్రహించెను.

చ. లలనరో! చూడ నీదుశుభ•లక్షణముల్ నృపకన్య వంచు భూ
వలయము నేలుమేటి నృప•వర్యుని పట్టపుదేవి వంచు నేఁ
దలఁచెద, దండకాటవి య•థామతి ద్రిమ్మర రావణుఁడు దా
బలిమిని దెచ్చినట్టి నృప•భామిని సీతవొ? పల్కు మే లగున్. ౭౦॥

తా త్ప ర్య ము.

తల్లీ! నీయందుండు శుభచిహ్నములు చూచి నీవు క్షత్రియ స్త్రీవనియు భూచక్రమంతయుఁ బరిపాలించు రాజశ్రేష్ఠుని పట్టపుదేవి వని నేను దలఁచుచున్నాను. దండకారణ్యములో యథేచ్ఛముగాఁ ద్రిమ్మరుచుండ రావణాసురుఁడు బలాత్కారముగఁ దెచ్చిన సీతవా యేమి! నిజము చెప్పుము. నీకు మేలగును.

క. అతిమానుష మగురూపము, వ్రతయుతవేషంబు నీదు•వైవర్ణ్యంబున్
మతిఁ దలపోయఁగ రాముని, సతి వంచును దోఁచె; లేదు • సందియ మబలా!

అర్థములు. అతిమానుషము = మనుష్యుల నతిక్రమించినది, మనుష్యులందు గానరానిది, వైవర్ణ్యము = కాంతిహీనత.

తా త్ప ర్య ము.

మనుష్యస్త్రీలకు దుర్లభమగు నీయందము దీక్షతోఁగూడిన వేషము నీకాంతి హీనత యివన్ని చూడ నీవు రామచంద్రమూర్తి భార్యవని తోఁచుచున్నది. ఇందు సందేహము లేదు. నా యభిప్రాయము నిజమా చెప్పుము.

త్రిజట చెప్పిన మాటలు వినిన తరువాత రాక్షసస్త్రీలు సీతాదేవి నుపేక్షించి మెనరంతట వారు దూరముగఁబోయి పండుకొనిరి. ఆ కారణముచే హనుమంతుఁడు సీతాదేవితో సంభాషింప సమయము దొరకెను. ఈ విషయము హనుమంతుఁ డంగదాదులతో ముందుచెప్పును. సీతావిలాపము ముముక్షువగు ప్రపన్నుని విలాపము నొకటియని ముందు చెప్పఁబడెను. పూర్వకాండమున సంసారముఁ దరించు మార్గము దెలియక నిర్వేదపడుచుఁ దన్నాశ్రయించిన జీవుల రక్షించుటకై భగవంతు డాచార్యులఁ బంపుట చెప్పబడెను. ఇట్టి భగవత్సాహాయ్యము ప్రత్యక్షముగనో పరోక్షముగనో దేహాభిమానము పూర్తిగ వదలి తన్నే తన నిమిత్తమై మానప్రాణములను బోఁగొట్టు కొనుటకుసిద్ధపడి కేవల పరతంత్రులగువారికి లభించును. స్వప్రయత్నమందు దేహమునయందే మాత్రమభిమాన ముండినను భగవత్సాహాయ్యము రాదు. గజేంద్రుఁడు యుద్ధము చాలించి నీవేతప్ప నితఃపరంబెఱుఁగ నని నిలిచిపోయిన తరువాతఁ గాని భగవత్సాహాయ్యము రాలేదు. కౌరవ సభయందు దుశ్శాసనుఁడు తన చీర లొలుచు నప్పుడు ద్రౌపది తన్నుఁదాను గాపాడుకొనఁ బ్రయత్నించు చుండువఱకు భర్తలు తన్ను రక్షింతురని నమ్మియున్నంతవఱకు భగవత్సాహాయ్యము రాలేదు. పురుషప్రయత్నము వ్యర్థమని తలఁచి భగవంతుఁడే కలఁడని నమ్మి రెండు చేతులెత్తి.

> 'హా కృష్ణ! ద్వారకావాస! క్వాసి యాదవ నందన!
> ఇమా మవస్థాం సంప్రాప్తాం కి మ్మనాథా ముపేక్షసే
> శంఖచక్రగదాపాణే! ద్వారకానిలయాచ్యుత!
> గోవింద! పుండరీకాక్ష! రక్ష!మాం శరణాగతామ్. భార. సభా.౬౮-౪౧

ఓ కృష్ణా ! ద్వారకావాసా ! వసుదేవ కుమారా ! అనాథనై యిటువంటి యవస్థయందుండ నన్ను నేల యుపేక్షించెదవు.

శంఖము చక్రము గద చేతియందుఁ గలవాఁడా ! ద్వారకావాసా! భక్తులను విడనాడని వాఁడా! పుండరీకాక్ష! శరణు! శరణు! రక్షింపుము.అని వశిష్ఠునుపదేశము స్మరించి భగవంతుని శరణు వేడఁగా వలువ లక్షయము లయ్యెను.

అట్లులే సీతాదేవియు,"కోయుఁడు కడికండలుగా, వ్రేయుఁడు కత్తులను మంటలఁ ద్రోయుఁ" డనియు, వీరు నన్నుఁ దినినీ, కోయనీ యేమైనఁ జేయనీ యని దేహాభిమానము వదలి నిద్రాహారము లుజ్జగించి యేకాగ్రమనస్కురాలై దుష్టరాక్షసులచేఁ జంపఁబడుట కంటె బుద్ధిపూర్వకముగా దేహము ప్రాణము రామచంద్రమూర్తికే సమర్పింపఁ దలఁచి నిరాశయై మరణోద్యుక్త యయ్యెనో యప్పుడు హనుమదాచార్య లాభము ప్రాప్తించెను.

—• సీతాదేవి హనుమంతునితోఁ దన వృత్తాంతము చెప్పుట •—

క. అనుడున్ రఘువల్లభ కీ, ర్తన హృష్టమనోజ్ఞ యగుచుఁ • దర్వా శితునిన్
హనుమంతుఁ గాంచి పలికెన్, జనకతనూజాతి తనదు•చారిత్రంబున్. ౭౮౭

అర్థములు. రఘువల్లభకీర్తన హృష్టమనోబ్జ = రామచంద్రుని బొగడుటచే సంతోషించిన మనఃకమలము గలది, తరు+ఆశ్రితునిన్ = చెట్టుమీఁద నుండువానిని.

తా త్ప ర్య ము.

ఈ ప్రకారము హనుమంతుఁ డడుగఁగా రాముని బొగడుటచే సంతోషించిన మనస్సుగలదై సీతాదేవి చెట్టుమీఁద నున్న యాంజనేయునితోఁ దన వృత్తాంత మిట్లు చెప్పెను.

క. రాజితయశుఁ డగు దశరథ, రాజేంద్రుని స్నుషను జనక•రాజతనూజన్
రాజనిభాస్యుఁడు రామున, కే జాయను సీత యందు•రిల నాపేరన్. ౨౭౮

తా త్ప ర్య ము.

కీర్తిచేఁ బ్రకాశించు రాజశ్రేష్ఠుఁడగు దశరథునిఁ కోడలను,జనకరాజపుత్రికను చంద్రునివంటి ముఖముగల రామచంద్రుని భార్యను. నాపేరు సీతయందురు.

ఉ. మానితసర్వకామముల • మానుషభోగములన్ భుజించుచున్
మానుగ రెండునుం బది స•మల్ వసియించితి రామునింటిలోఁ
బూని త్రయోదశాబ్దమున • భూవరుఁడున్ గురుమంత్రిపౌరలో
కానుమతిన్ మదీశ్వరు ర•సాధిపుఁ జేయఁగ నున్న యంతటన్. ౨౭౯

అర్థములు. మానిత సర్వకామములన్ = గౌరవింపఁబడు సమస్తములైన కోరికలను,మానుషభోగములన్ =మనుష్యు లనుభవింప యోగ్యములైన భోగములను, దీనివలనఁ దాను మనుష్యస్త్రీ గాదని సూచితము. రెండునుంబదిసమల్ = పండ్రెండు సంవత్సరములు, త్రయోదశాబ్దమునన్ =పదుమూఁడవ సంవత్సరమున, మదీశ్వరు= నా భర్తను, రసా+అధిపున్ =భూపతిన్ =రాజుగ.

తా త్ప ర్య ము.

మనుష్యు లనుభవింప యోగ్యములైన సమస్తములైన కోరికలను భోగములను ననుభవించుచుఁ బండ్రెండు సంవత్సరములు రామచంద్రమూర్తి యింటిలోనుంటిని. పదుమూఁడవ సంవత్సరమున దశరథరాజు నా భర్తను రాజుగాఁ జేయఁ బ్రయత్నింపఁగా.

ఇచట పదియు రెండు సంవత్సరములు రాము నింట నుండితినని చెప్పెను. రావణాసురునితోఁ దాను రామునితో నరణ్యమునకు వచ్చునప్పటికిఁ బదునెనిమిది సంవత్సరములని చెప్పెను. (చూ అర. ౭౬౭) కావున రామచంద్రమూర్తి యింటికి నాఱవ సంవత్సరముననే వచ్చెనని యేర్పడుచున్నది.

ఉ. ఆ మనుజాధినాథు ప్రియు•రా లగు కైకయి ప్రాణభర్తతో
రాముని నీవు ధారిణికి • రాజుగఁ జేసిన నేని చెప్పెదన్
నేమముఁ బట్టి త్రావ నీక • నీరముఁ, గూడును ముట్ట నింతలో
నీమెయితోడి పొత్తు సరి, • యిప్పుడ ప్రాణముఁ బాయుదుం జుమీ ౨౮౦

తాత్పర్యము.

ఆ రాజేంద్రుని ప్రియభార్యయైన కైక తన మగనితో నిట్లు చెప్పెను. నీవు భూమికి రామచంద్రమూర్తిని రాజుగాఁ జేసెద వేని నేను నేమముఁబట్టి నీళ్ళు త్రాగను. కూడు ముట్టను. నా ప్రాణముల నిప్పుడే పోఁగొట్టు కొందును.

ఉ. ఆడినమాట నిల్పుకొను•నట్టి తలం పెదఁ గల్గె నేనియున్
ఈడుము రాముని౯ గహన•వీథుల వేగ మటన్న మున్ను దా
నాడినమాట నెంచి ప్రియు•రాలి కఠోరత రాప్రియోక్తికై
యేడిచి మూర్ఛలన్ మునిఁగి • వృద్ధధరాపతి ధర్మబద్ధుఁడై. ౭౯౧

తాత్పర్యము.

నీవు చెప్పిన మాటప్రకారము సత్యము తప్పక వర్తింపఁదలఁచెదవేని రామచంద్రమూర్తిని నడవులలో వదల వలసినదని కోరఁగాఁదాను ముందు చెప్పిన మాట తలఁచి ప్రియురాలి కఠినమై యప్రియమైన మాట విని యేడిచి మూర్ఛలో మునిఁగి ముసలివాఁడగు రాజు ధర్మముచేఁ గట్టఁబడినవాఁడై.

ఉ. అలికిఁ జెప్ప లేక తన • యగ్రతనూజుని వేఁడె రాజ్యమున్
శ్రీలలితుండు రాముఁ డభి•షేకముకంటెఁ బ్రియంబు నైన భూ
పాలునిమాటఁ గైకొనియెఁ • బ్రాణనిమిత్తమ మైన నా మగం
డాలరిపల్కుఁ బల్కఁడు, న•యంబున నిచ్చు గ్రహింపఁ డేమియున్. ౭౯౨

తాత్పర్యము.

పెండ్లమున కేమియు సమాధానముఁ జెప్పఁజాలక తన పెద్దకొడుకును నీవు రాజ్యము వదలి పొమ్మని కోరెను. సహజ శ్రీమనోహరుఁడగు నాభర్తకు నాగంతుకమైన యీ రాజ్యాభిషేకము కంటెఁ దండ్రిమాట నెఱవేర్చుట ప్రియము కావున నాయనమాట నెఱవేర్ప నంగీకరించెను. ప్రాణము రక్షించుకొనుటకైనను నా మగఁడు అప్రియమైన మాట చెప్పెడు వాఁడుకాఁడు. మంచితనముగా నెవ్వరేమి యడిగిన నిచ్చునేకాని యొకరిచే నేమియు గ్రహింపఁడు.

చ. జనకునిమీఁది భక్తిమెయి • సంపదలున్ ధరణీ ప్రభుత్వమున్
ఘనతరనవ్యచేలములు • గ్రొక్కన వీడి, కుశాజినంబులన్
గొని, ననుఁ దల్లికిన్ మిగులఁ • గూరిమి నప్పన చేసి నాకు న
య్యనఘునిఁ బాసినంత నమ•రాలయ మైన రుచింప దాత్మకున్. ౭౯౩

తాత్పర్యము.

తండ్రిమీఁద దనకుఁ గల భక్తిచేత సమస్తైశ్వర్యము భూప్రభుత్వము గొప్ప వెలగల వస్త్రములు తక్షణమే వదలి వనవాసమునకుఁ దగిన దర్భలు జింకచర్మములను గైకొని యడవికిఁ బోవఁ బ్రయత్నించి నన్నుఁ దన తల్లి కప్పగింపఁ జూచెను. గాని యీ పుణ్యాత్ముని వదలితినా స్వర్గమైనను నాకు రుచింపదు.

ఉ. కావున రాముకంటె మును • కానలకేను బ్రయాణ మైతి, స
ద్భావుఁడు లక్ష్మణుండు దొలు•తన్ ధరియించెను నారచీరముల్
మూవుర మిట్లు మేము వ్ర•తముం గొని యెన్నఁడుఁ జూడనట్టి భీ
త్యావహ మైన దండక ధ•రాధిపు నాజ్ఞనుజొచ్చి యుండఁగన్. ౭౪

తాత్పర్యము.

కావున రామచంద్రమూర్తి కంటె ముందు నేనే యడవులకుఁ బ్రయాణమైతిని. రామచంద్రమూర్తిని సేవింప వలయునను మంచి హృదయముగల లక్ష్మణుఁడన్న మీఁది భక్తిచే నారచీర లప్పుడే కట్టుకొనెను. మేము మువ్వుర మీ విధముగా వనవాసదీక్ష గైకొని ముందెన్నఁడు చూడని భయంకరమైన యడవియందు రాజాజ్ఞాప్రకారము ప్రవేశించి యుండఁగా.

అయోధ్యాకాండమందు ముందు రామచంద్రమూర్తి నారచీరలు కట్టుకొన్న తరువాత లక్ష్మణుఁడు కట్టుకొనెనని యున్నను ఇచ్చట లక్ష్మణుఁడు ముందుకట్టుకొనెననుట ప్రయాణమందలి యతని యాదరాతిశయముఁ దెలుపుట కని గ్రహింపవలెను.

ఉ. ముచ్చిలి తెచ్చె నన్ను రఘు•ముఖ్యుని దేవిని కూళ రావణుం
డిచ్చట దిక్కు లేమి నిటు • లేడ్చెద, మాసయుగంబు జీవితం
బిచ్చె దశాస్యుఁ, డంతపయి • నీల్గెదుదానను, నింతలోన నా
సచ్చరితుండు వచ్చు నని • చాలఁగ నాశను మేను నిల్పితిన్. ౭౫

అర్థములు. ముచ్చిలి = దొంగిలించి, కూళ = వంచకుండు, క్రూరశబ్ద భవము = కూళ, మాసయుగంబు = రెండునెలలు.

తాత్పర్యము.

రాముని భార్య నగు నన్ను వంచనచేసి రావణుఁడు దొంగిలించి తెచ్చెను. కావున నిచ్చట దిక్కులేక యేడ్చుచున్న దానను. నాకుఁ బన్రెండు నెలలు వాఁడు గడువిచ్చెను. వానిలో రెండు మిగిలినవి. అది తీరఁగానే చత్తును. ఇంతలో రామచంద్రమూర్తి వచ్చునను నాశచేతఁ జావకున్నాను.

{౩౪-వ సర్గము. హనుమంతుఁడు సీతాదేవికి శ్రీరామ
లక్ష్మణుల కుశలవార్తఁ దెలుపుట.}

సీ. అనవుడు నామాట • లాలించి పావని, సాంత్వనోక్తుల నను • జనకసుతకు
దేవి ! నీ కొక్కసం•దేశ మంపఁగ రామ,భద్రుండు దూత నై • వచ్చినాఁడ
శ్రీరామచంద్రుండు • సేమ మయ్యెడఁ దన, సేమంబు నీతోడఁ• జెప్పు మనియె
బ్రహ్మాస్త్ర వేదశా•స్త్రవిదుండు శ్రీరాముఁ, డర్మిలి నీ సేమ • మడిగె నమ్మ!
ఆ. శౌర్యదర్పధనుఁడు • సౌమిత్రి నీ పతి, కనుచరుండుఁ బ్రియుఁడు • సాధుసేవకుఁ
డగుచు నీకు భక్తి • సాష్టాంగ మెరఁగెను, కుశలు లమ్మ వారు • కువలయాక్షి.

అర్థములు. సాంత్వనోక్తులన్ = ఓదార్పు మాటలచే, సందేశము=వార్త, అనుచరుండు = దాసుఁడు, వెంటవెంటి తిరుగువాఁడు; సాస్రునేత్రుఁడు = కన్నీటితోఁ గూడిన కన్నులు గలవాఁడు, బ్రహ్మాస్త్రము తెలిసినవాఁ డనుటచే సమస్తాస్త్రములు దెలిసినవాడని యర్థము. వేదములు తెలిసినవాఁ డనుటచే అర్థములోఁడ వేదముల నధ్యయనము చేసెనని భావము. శాస్త్ర మనుటచే ధర్మశాస్త్రము కర్మానుష్ఠానముతోఁడఁ దెలిసినవాఁడని యర్థము. అర్మిలిన్=ప్రేమతో, శౌర్యదర్పధనుఁడు=శౌర్యము వలని గర్వమే ధనముగాఁ గలవాఁడు, ఎఱఁగెను = నమస్కరించెను. కువలయాక్షీ = కలువలవంటి కన్నులుగలదానా! హనుమంతుఁడు సీతాదేవిని కువలయాక్షియని, అసితేక్షణయని పలుతావుల వర్ణించెను. ఈ నేత్ర సౌందర్యమే యీమె రామచంద్ర మూర్తికిఁ దగిన భార్య యని తెలుపుచున్నదని హనుమంతుని యభిప్రాయము. కు+వలయ మనఁగా భూచక్రము. అది యంతయు నీ కను సన్నల మెలఁగవలసినదై యుండ నీ కీ దశ తగినది కాదని భావము. అనఁగా నీవు సాక్షాల్లక్ష్మివిగాని, మనుష్య స్త్రీవిగా వని భావము.

తాత్పర్యము.

ఆ మాట లాంజనేయుఁడు విని యూఱడింపు మాటలతో సీతాదేవి కిట్లనియె. దేవీ! రామచంద్రమూర్తి నీ కొక్కమాట చెప్పుమని నన్నుఁ బంపుటచేత నాయన దూతనై వచ్చినాఁడను. శ్రీ రామచంద్రమూర్తి క్షేమముగా నున్నా నని నీతోఁ జెప్పు మనెను. బ్రహ్మాస్త్రాది సకలాస్త్రములు దెలిసిన వాఁడును, కావుననే యుద్ధమం దెదురు లేనివాఁడును వేదముల నర్థముతో నధ్యయనము చేయుటచే సర్వవిషయములు తెలిసిన జ్ఞానియు, ధర్మశాస్త్రములు తెలిసినవాఁడగుటచే నే కార్య మెట్లు చేయవలెనో తెలిసి చేయువాఁడును నగు శ్రీ రామచంద్రమూర్తి మిగులఁ గూర్మితో నీ సేమ మడిగె నమ్మ. శౌర్యము వలనఁ గలిగిన గర్వమె ధనముగాఁ గలుగుటచే రామ చంద్రమూర్తికి సహాయుఁడై రాక్షసుల నెల్ల సాధింప సామర్థ్యముగల లక్ష్మణుఁడు నీ భర్తకు సేవకుఁడు ప్రియుఁడునై తల్లీ! నీకు సాష్టాంగ నమస్కారము గావించెను. కువలయాక్షీ! వారిరువురు కుశలులు తల్లీ!

క. అని హనుమంతుఁడు పల్కిన, విని జనకతనూజ హర్ష • వివశాత్మిక యై
తను వెల్లఁ బులకరింపఁగ, ననుఁ బావనిఁ జూచి యంచి • తాలాపములన్. ౮-౯

తాత్పర్యము.

అని హనుమంతుఁడు చెప్పఁగా విని సీతాదేవి సంతోషముచే దేహము మఱచినదై దేహము గగ్గుఱింపఁగా మనోహరములైన వాక్యముల హనుమంతున కిట్లనెను.

క. తనువునఁ బ్రాణము లుండినఁ, గనుఁగొను నూఱేండ్లకైనఁ • గడు హర్షంబున్
మనుజుం డను సామెత మ, న్ననుకొనఁగా వింటి నది య • థార్థమ చూడన్.

తాత్పర్యము.

ఆంజనేయా! దేహమునఁ బ్రాణము లుండెనా నూఱేండ్లకైనను మనుష్యుడు

సంతోష మనుభవించునని యొక సామెత పూర్వము వినియుంటిని. అది సత్య మనియే తోఁచుచున్నది. నేను ప్రాణము బిగఁబట్టుకొని యుండుటచేఁగదా యీ సంతోష వార్త వినఁగలిగితిని. ప్రాణము విడిచియుండిన నీ భాగ్యము లేక పోవునుగదా.

క. అని శుభవార్తం దెలిపిన, హనుమయెడన్ జనకతనయ • యద్భుత మగు ప్రీ
తిని జూపఁగ నన్యోన్యం, బును నమ్మిక కుదురుకొనఁగ • ముచ్చట జరిగెన్. ౭౯

తాత్పర్యము.

ఈ ప్రకారము శుభవార్త దెలిపిన హనుమంతునియందు సీతాదేవికి మిక్కిలి ప్రీతి గలిగెను. ఒకరి నొకరు నమ్మి సంభాషింపఁ దొడఁగిరి.

క. భూపుత్రిక పలికిన యా, లాపంబుల విశ్వసించి • లాలించుచు దుః
ఖోపశమనం బొనర్పఁగ, దాపునకున్ మెల్ల వాయు • తనయుం డరిగెన్. ౮౦

అర్థములు. విశ్వసించి = నమ్మి, లాలించుచు = బుజ్జగించుచు, ఉపశమనంబు = శాంతి.

తాత్పర్యము.

సీతాదేవి చెప్పిన మాటలు విని మనయందు నీమెకు దృఢమైన నమ్మకము కుదిరెనని నమ్మి యామెను బుజ్జగించుచు దుఃఖశాంతి సేయుటకై మెల్లమెల్లన సమీపమునకుఁ బోయెను.

క. అంతకు నంతకు వానర, కాంతుఁడు దను డాయుకొలఁది • తన్మానసుత శంకన్
జింతించె రావణుండే, చెంతకు నిటు వచ్చె ననుచుఁ • జేడ్పడి భీతిన్. ౮౧

తాత్పర్యము.

హనుమంతుఁడు దగ్గఱకు వచ్చుకొలఁది రావణాసురుఁడే యీ వేషము వేసికొని తన్ను మాటలాడించుటకై వచ్చెనని సీతాదేవి భయపడెను.

—• సీతాదేవి హనుమంతుని రావణుఁ డని శంకించుట. •—

ఉ. అక్కట ! మోస మయ్యెను ద • శాననుఁ డీగతి మాఱురూపమున్
నొక్కని వచ్చె, నీవిధము • నేఁ దలపోయక మాట లాడితిన్
మక్కువ విశ్వసించితిఁ, బ్ర•మాదము గల్గె నయో ! య టంచుఁ దా
గ్రక్కునఁ గొమ్మ వీడుచు ధ•రాస్థలిఁ గూలఁబడెన్ వ్యథామతిన్. ౮౨

తాత్పర్యము.

అయ్యయ్యో ! నే నెంత మోసపోయితిని. రావణాసురుఁడే మాఱువేషము వేసికొని వచ్చెను. నే నింతమాత్ర మాలోచింపక వీనితోఁ జనవుగ మాటలాడితిని. నిక్కపు రామదూత యను ప్రేమచే నమ్మితిని. అయ్యో ! చాలఁ బ్రమాద పడితిని. అని పట్టుకొన్న చెట్టుకొమ్మ వదలి దుఃఖించుచు నేలఁ గూలఁబడెను.

క. వడఁకెడి దేహముతో వ్యథ,పడు పడఁతిం గాంచి హనుమ • ప్రాంజలి యగుచున్
గడు వెఱ వలదనిం జూడక, యడబడి నిట్టూర్పుతోడ • నన నీ రీతిన్. ౮౩

అర్థములు. అడబడిః = దుఃఖముతో.

తాత్పర్యము.

శరీరము వడఁకుచుండఁగా బాధపడుచున్న యామెను జూచి హనుమ రెండు చేతులు జోడించి నమస్కరించెను. సీతాదేవియు నాయనను జూడక దుఃఖముచే నిట్టూర్పులు విడుచుచు నిట్లనెను.

చ. తెలిసితి లేర నిన్ను, నిటు • తెక్కలివేషము వేసి రావణా!
కలఁచెద వేలరా! శుభము • గాదుర నీ కిది, దండకాటవిన్
వలనుగ భిక్షురూపమున • వచ్చిన మాయలమారి వీవె, దు
ర్బల నుపవాస దీనఁ దగ • వా యిటు కాఱియ పెట్ట రాక్షసా! ౭౦౮

అర్థములు. తెక్కలివేషము = దొంగవేషము.

తాత్పర్యము.

ఓరీ! నీ వెవఁడవో తెలిసికొంటిని. రావణా! యేలరా! యిటు దొంగవేషము వేసికొని నా మనస్సు వికలము చేసెదవు. దీనివలన నీకు మేలులేదు. దండకారణ్యమందు నే నుండఁగా సన్న్యాసివలె వచ్చిన మాయల మారివి నీవు కావా! రాక్షసా! బలముడిగినదానను, ఆహారము లేని దానను. ఏడ్చుచున్నదానను. న న్నీ ప్రకారము బాధపెట్ట నీకుఁ దగునా?

ఉ. రావణుఁ డీ వటంచు నన • రా దనియుఁ మదిఁ దోఁచె, ని న్గనన్
భావమునందుఁ బ్రీతి ప్రభ • వం బగు చున్నది, రామదూతవేన్
వావిరి మేలు నీ కగుత • వర్ణన సేయుము మ త్ప్రియంబు లౌ
నా విభు రామచంద్రునిగు • ణంబు, లనంతముదంబు నా కగున్. ౭౦౯

తాత్పర్యము.

ఒకవిధమునఁ జూచిన నీవు రావణుఁడు కావనియుఁ దోఁచుచున్నది. ఏలన రావణునిఁ జూచినంతనే నా మనస్సు చిఱచిఱ లాడుచుండును. అట్టిది నిన్నుఁ జూచినఁ బ్రేమ యుదయించుచున్నది- నా యంతఃకరణము నన్ను మోసపుచ్చదు. నీవు నిజముగ రామదూతవే యయితివేని రాముని గుణములు వర్ణింపుము. రామచంద్రమూర్తి గుణములు నాకుఁ బ్రియంబులు. దానివలన నాకు మితిలేని సంతోషము కలుగును. రావణుఁడే నైన పక్షమున రామచంద్రునిఁ గీర్తింపఁడు. దీనివలన భగవద్గుణానుభవమందు నభిలాష గలిగి భగవద్గుణానుసంధానము చేయుచు శిష్యునకు భగవద్గుణములు వర్ణించి చెప్పువాఁడు నిజమైన గురువు. అటుచేయక తక్కినవి చెప్పువాఁడు దొంగగురువు. అట్టివా రెట్టివారైనను నమ్మరాదు. దగ్గఱఁ జేర నీయరాదు.

క. భూరిప్రవాహవేగము, తీరంబు హరించురీతిఁ • దిగిచెడు సౌమ్యా
కారా! మచ్చిత్తము నని, ధారిణిసుత మఱియు నిట్లు • వలఁచెన్ మదిలోన్.

తా త్ప ర్య ము.

గొప్ప పరీవాహము యొక్క వేగము గట్టును ప్రవాహములోనికి నీడ్చుకొనునట్లు నీ సౌమ్యమైన యాకారము నా మనస్సును నీవంక కీడ్చుచున్నది, అని మఱియు నిట్లు తలఁచెను.

ఉ. ఎక్కడిరామదూత ? యిట • కేగతి వచ్చును ? స్వప్న మద్దిరా
నిక్కపుసౌఖ్య మిచ్చెడిని • నేటికి రామునిదూత నంచుఁ దా
నొక్కఁడు క్రోఁతి వచ్చె,నయ • యో కలయుం గఱ వాయె, మచ్చరం
బెక్కెయొ నన్నుఁ జేర దది, • యేగతిఁ గాంచెద రాఘవేంద్రులన్. ౭౦౬

తా త్ప ర్య ము.

అయ్యో ! యిదియేమి నా భ్రాంతి. ఎంత భ్రమ పడుచున్నాను. రాముడెక్కడ ? ఆయన దూతయెక్కడ ? ఇచ్చటికి సముద్రముదాఁటి లంకలోఁ బ్రవేశించి యంతఃపురమునఁ బ్రవేశించి యీ వనములో నీ మూలఁ బడియుండుచోటికి నెట్లు రాగలఁడు. ఇది సాధ్యమా? కాదు. కావున నిది స్వప్నమే. స్వప్నమే జాగ్రద్దశయందును నాకు నిజమైన సౌఖ్య మిచ్చుచున్నది. ఇన్ని దినాలకు నేను రామదూతనని యొక క్రోఁతి కలలోవచ్చెను. అయ్యో! నాకుఁ గలకూడఁ గఱవాయెను. నిద్రపోయినఁగదా కలవచ్చును. నిద్రలేక కల యెట్లు వచ్చును? దానికిని నామీఁద మచ్చరమేమో! కలలోనే రామలక్ష్మణులఁ జూడలేనిదానను ప్రత్యక్షముగ నెట్లు చూడఁగలను ?

చ. కల యిది గాదు, వానరునిఁ • గాంచిన స్వప్నమువారు భద్రముల్
గలుగునె ? కల్గు చున్న యవి • గా యిపు డితనిఁ జూడ, నామనః
కలిలమొ ? వాతలక్షణమొ ? • కా దనఁ బిచ్చియొ ? యెండమావొ ? యిం
దుల నిది గాదు, చక్కఁ గపి • తోఁచెడి, నాస్మృతి లెస్స యుండెడిన్. ౭౦౭

తా త్ప ర్య ము.

కలకల యని కలవరించుచున్నాను. ఇది కలయగునా ! కాదు. ఏలనందువా? స్వప్నములోఁ క్రోఁతిని జూచిన మేలుకొన్నప్పుడు మేలు కలుగునా ! కలుగదు. అయినను ఇప్పుడు నాకు నీయనను జూడ మనస్సునకు సంతోషము కలుగుచున్నది. కావున నిది మనోవ్యాకులత్వమో ? వాయువుగుణమో ? అది కాదనిన నాకుఁ బిచ్చి పట్టినదో ! పిచ్చివానికిఁ దాను పిచ్చివాఁడని తోఁచునా ? వాతరోగమైన నాడులు సమముగా నడచునా ? కావున నిది యెండమావేమో ? ఎండమావు నీళ్ళవలెఁ గానవచ్చును గాని క్రోఁతివలెఁ గానవచ్చునా? కావున వీనిలో నేదియుఁగాదు.ఏలన:- క్రోఁతి చక్కఁగాఁ గాన వచ్చుచున్నాఁడు. నా స్మృతి చక్కఁగా నున్నది.

చ. అనుచు బలాబలంబుల ని • జాత్మవిచార మొనర్చి లేక నా
మనమున మోస, మింక నను • మానము మానెదఁ, గామరూపి యా

దనుజవరుండె వచ్చె, నిది • తథ్య మటంచును నిశ్చయించి యా
యనుపమసాధుశీల పలు•కాడక యుండె మరుత్తనూజుతోన్. ౨౦౯

అర్థములు. బలాబలంబులన్ = ఈ కానవచ్చునది నిజమైన క్రోఁతి, రామ దూతయా? మాయవేషము వేసికొనిన రావణాసురుఁడా యను విషయమున నే ప్రక్క నెక్కువ బలమున్నది, ఏ ప్రక్క తక్కువ బలమున్నది యని నిజాత్మన్ = మనస్సులో, విచారము = ఆలోచన.

తా త్ప ర్య ము.

ఇతఁడు రామదూత యగు నిజమైన వానరుఁడా, మాయావేష ధారియైన రావణుఁడా యనుటయందుఁ గల బలాబలంబులు తనలో నాలోచించుకొని వీనిని రామదూత యని నేను నమ్మితినా యటుకాదేని నా కపాయము కలదు. నిజముగా రామదూత యైనను నా నిమిత్తమై వచ్చినవాఁడు గనుకఁ దన యథార్థస్థితిఁ దెలుప యత్నించును. కావున నేను మాటలాడకుండుటచేఁ గలుగు నష్టిలేదు. నా మనసునఁ గలంకములేదు. ఈ సందేహముతోఁ బనిలేదు. కామరూపి రావణుఁడే యిట్లు వచ్చెను, ఇది సత్యమని నిశ్చయించుకొని యనమాన పాతివ్రత్యసంపదగల సీతాదేవి హనుమంతునితో మాట్లాడక యూరకుండెను.

—• హనుమంతుఁడు సీతాదేవికి సందేహము దీఱునట్లు భాషించుట. •—

క. కాంతామణి యీవిధమునఁ, జింతాకుల యగుట కీశ•శేఖరుఁడు నిజ
స్వాంతంబున నూహించి వి,శాంతమధురసూక్తి సతికిఁ•దా నిట్లనియెన్. ౨౧౦

అర్థములు. నిజస్వాంతంబునన్ = తన మనస్సులో, కాంతామణి = స్త్రీల యందు శ్రేష్ఠురాలు, గనుకనే యెవనితో నమ్మి మాటలాడవచ్చును, ఎవనితో మాడలాడ్డరాదని యాలోచింపఁ గలిగినది. సామాన్యస్త్రీల కిట్టి వివేక ముండదు కదా.

తా త్ప ర్య ము.

స్త్రీరత్నమగు సీతాదేవి యీ విధముగఁ దనవిషయమునఁ జింతచేఁ గలఁత చెందిన దని తెలిసికొని వానరరత్నమగు హనుమంతుఁ డా సందేహముఁ బాపఁ దలఁచి తియ్యని మాటలతో నిట్లనెను.

ఉ. రాజులలోన మేటి, దిన•రాజు ప్రతాపమునందు, యామినీ
రాజు మనోజ్ఞతన్, భువన•రాజులరా జలరాజరాజున
ట్లా జగదేకకీర్తి, యప•రాజిత శౌర్యుఁడు, మూర్తిమద్రతీ
రాజు సురూపసంపద, వి•రాజిలు సత్యవచోరతుండునన్. ౨౧౧

అర్థములు. దినరాజు = సూర్యుఁడు, యామినీరాజు = చంద్రుఁడు, రాజ రాజు = కుబేరుఁడు, భువనరాజులన్ = లోకసమూహములందు, మూర్తిమత్ = రూపముగలిగిన, రతీరాజు = మన్మథుఁడు, రతి, రతీ రెండురూపములు గలవు. కుబే

రుఁడు = భువనరాజుల రాజనుటకు "రాజాధి రాజాయ ప్రసహ్య సాహినే, నమో వయం వైశ్రవణాయ కుర్మహే" యని శ్రుతి.

తా త్ప ర్య ము.

ఎవ్వఁడు రాజులలో శ్రేష్ఠుఁడు, ఎవ్వఁడు ప్రతాపమున సూర్యుఁడు, ఆహ్లాదకరత్వము నందుఁ జంద్రుఁడు. ఎవ్వఁడు కుబేరునివలె లోక సమూహములందు ప్రభువు. అటువలె జగమునందుఁ గేవల కీర్తిగలవాఁడు. ఎవ్వఁడు విష్ణువువలెఁ బరాజయ మెఱుఁగని శౌర్యముగలవాఁడు. ఎవఁడు సౌందర్యమునందు నాకారముగొన్న మన్మథుఁడు, ఎవఁడు సత్యభాషణమందుఁ బ్రీతి గలవాఁడునై ప్రకాశించును. రాముని దూతనైతి నేని రామచంద్రునిఁ గీర్తింపు మని సీతాదేవి చెప్పుటచే నా సందేహము పోవ నాయనను వర్ణించు చున్నాఁడు.

క. గురుఁడు మధురోక్తులను ధీ,కరుఁడు విరోధులకు భువన•గణ మెవ్వని శ్రీ
కరకరముల ఛాయను సు,స్థిరతన్ జీవించు నట్టి • దేవుని రామున్. ౮౧౩

అర్థములు. గురుఁడు = బృహస్పతి, శ్రీకర = సంపత్కరము లగు, కరముల = బాహువుల, ఛాయను = నీడను, ఎండ వడఁబడినవాఁడు చెట్లనీడను సుఖపడినట్లు సంసారతాపమున వేఁగువానికి నాయన హస్తముల నీడయే సంతోషము గలిగించును. అట్టి దేవుని = ఇచ్చట నట్టి యనుటచే ఎవ్వఁడు రాజులలో మేటియని మొదటను పదము అన్ని విశేషణంబుల మొదట ననువర్తింపఁ జేయవలెను.

తా త్ప ర్య ము.

తియ్యని మాటలం దెవ్వఁడు బృహస్పతియో, ఎవ్వఁడు శత్రువులకు భయంకరుఁడో లోకమంతయు నెవ్వని సంపత్కరములైన బాహువుల నీడను స్థిరముగ జీవించుచున్నదో యట్టి దేవుని రామచంద్రమూర్తిని.

క. మృగము నెపంబుగ దూరం,బుగఁ గొని చని యెవరు లేని•పొలకువఁ గని న
న్వగఁబడ నిన్నుం దెచ్చిన. పగతుఁడు తత్ఫలముఁ గుడువఁ • బరికింపు మిఁకన్.

తా త్ప ర్య ము.

లేడి నెపము పెట్టి దూరముగఁ గొనిపోయి నీ యొద్ద నెవరులేని జాడ తెలిసికొని నీవు దుఃఖించుచుండఁగా దెచ్చిన నీ విరోధి వాఁడు చేసిన పాపమునకు ఫలము నిఁక ననుభవించును. చూచుచుండుము.

శా. జ్వాలాభీలకరాళశాతఖగదు•ర్వారప్రవాహంబునన్
బాలా! రావణు ముంచి త్రుంచు నని గో•పస్ఫీతుఁడై పోరిలోఁ
గాలాగ్ని ప్రతిమానుఁ డేమహితుఁ డా•కాకుత్స్థవర్యుండు స
చ్ఛీలా! నీ కథ కంచె దూతగ ననున్ • సెంకింప నీ కేటికిన్. ౮౧౪

అర్థములు. జ్వాలాభీల = జ్వాలలచే భయంకరమైన, కరాళ = నిడివిగలైన, శాత = వాఁడియైన, ఖగ = బాణములనెడి, దుర్వార ప్రవాహంబునన్ = అడ్డగింప

రాని వెల్లువయందు, కోపస్ఫీతుఁడై = నిన్ను హరించె నను కోపముచే వృద్ధినొందిన వాఁడై, కాలాగ్ని ప్రతి మానుఁడు = ప్రలయకాలమందలి యగ్నిహోత్రునకు సమానుఁడు, సచ్ఛీలా=మంచి పాతివ్రత్యము గలదానా! శంకించు-తద్భవము = సెంకించు; సంస్కృత శకారమునకు వికృతియందు 'సె, వచ్చును. శల్యుఁడు = సెల్లుఁడు, శంఖము = సెంకు లోనైనవి.

తాత్పర్యము.

పతివ్రతాశిరోరత్నమా! నా విషయమున వాస్తవరామదూత యగునో కాదో యని యేల సందేహించెదవు? తల్లీ! యే మహామహుఁడు యుద్ధమునందుఁ బ్రలయకాలాగ్ని వంటివాఁడై మంటలచే భయంకరమై నిరుపాటివై పదునైన బాణముల ప్రవాహమునందు రావణుఁడు నిన్నుహరించెనను కోపముచే విజృంభించి వానిని ముంచి నఱికివైచునో యట్టి నీభర్త రామచంద్రమూర్తి పంపఁగా దూతనై వచ్చితిని. ఏల సందేహించెదవు? నేను రావణుఁడఁగాను. నేను మాయావేషము వేయలేదు.

సీ. నీ వియోగంబున • నవ్వఁగ రాముఁడు, నీసేమ మడిగె నో•నీరజాస్య!
సౌమిత్రి సద్భక్తి • సాష్టాంగ మెఱఁగి నీ, కుశలంబుఁ గోరెనో•కోమలాంఘ్రి!
రామునిమిత్రుండు • రాజ కోఁతుల కెల్ల, సుగ్రీవుఁ డడిగె నీ•శుభముఁదల్లి!
సౌమిత్రి సుగ్రీవ•సహితుఁ డై రాముండు, సంస్మరించును నిన్ను • సతము దేవి!
తే. రాక్షసులకును జిక్కియు • రాజవదన! భాగ్యవశమున నిందాఁక•బ్రతికి యున్న
దాన విం కిటఁ దూర్ణంబ • తరుణి కనెదు, రాము లక్ష్మణు వానర•స్తోమవిభుని.

అర్థములు. నీరజాస్య = (౧) కమలమువంటి ముఖముగలదానా! (౨) చంద్రునివంటి ముఖముగలదానా! ఇట్లు పగటిపూఁటఁ గమలమువలెను, రాత్రులందు జంద్రునివలె ఆహ్లాదమును గలిగించు నీ ముఖ దర్శనము లభింపమిని, కోమలాంఘ్రి= మృదువులగు పాదములను గలదానా! దేవి=శ్రీ లక్ష్మీదేవి.

తాత్పర్యము.

నిన్నెడఁబాయుటచేఁ గలిగిన యపార వ్యథచేత రామచంద్రమూర్తి హనుమంతా! రేయి పగలుకూడ నన్ను సంతోషింపఁజేయు సీతాదేవియొక్క కమల చంద్రములఁబోలు ముఖము చూచుటకుఁ బ్రాప్తి లేదు. నీవైన బోయి చూచి నా సేమ మామెకుఁజెప్పి యామె సేమము తెలిసికొని రమ్మని నాతోఁ జెప్పెను. ఆయన యాజ్ఞప్రకారము నేను బయలుదేఱి వచ్చునపుడు నీ మృదుపదములను దప్ప నిన్నుఁ గన్నెత్తియైనఁ జూడని లక్ష్మణుఁడు నిండారు భక్తితో నీ పాదములకు సాష్టాంగముగ నమస్కరించి నీ క్షేమము తెలియఁ గోరెను. తనకుఁ బ్రాణదాత భయత్రాత యగుటచే రామచంద్రమూర్తిని దండ్రివలెఁ జూచు సుగ్రీవుఁడు రామచంద్రమూర్తి మిత్రుఁడు వానరులకెల్ల రాజు నీవు తల్లి వను భావముతో నీ క్షేమముఁదెలియఁ గోరెను. రామచంద్రమూర్తి నాకై దుఃఖించుచున్నాఁడో, రాజ్యనష్టికై, బంధు

వియోగమునకై దుఃఖించు చున్నాఁడో నీవేమి యెఱుంగుదు వందువేమో నాపాలికి నీవు శ్రీ మహాలక్ష్మివి. అట్టి నీతో నేను గల్లలాడుదునా ! ఆయన రహస్యముగఁ దనలోఁదా నేడువలేదు. లక్ష్మణుఁడు సుగ్రీవుఁడు కూడనుండఁగ వారితోఁ జెప్పుకొని దుఃఖింపఁగా వారును నీకై దుఃఖించుచున్నారు. మాయందఱ భాగ్యము బాగుండుటచే నీవు మనుష్యులను భక్షించు రాక్షసుల చేతిలోఁ జిక్కియు వారిచే భక్షింపఁబడక నీవై చావకయింతదాఁక బ్రదికియున్నదానవు. నీవు మరణించి యుండిన మేమందఱము చచ్చిన వారమే. ఇక జరుగఁబోవునది చెప్పెద వినుము.

నీవు రామచంద్రమూర్తిని, లక్ష్మణుని, సుగ్రీవుని త్వరగా నీ లంకయందుఁ జూడఁగలవు.

ఉ. మానిని! వానరుండ, హను•మంతుఁడఁ బేర, దినేశపుత్రుఁ డౌ
వానరరాజ మంత్రిని • వారిధి దాఁటితి, లంకఁ జొచ్చితిన్
మానవభోజి నెత్తిపయి • నా పద ముంచి పరాక్రమంబునన్
గానఁగ వచ్చినాఁడ నినుఁ • గంజదళాయతనేత్ర ! నమ్ముమీ. ౮౧౬

తా త్ప ర్య ము.

నేను మాఱువేషముతో వచ్చిన రావణుఁడనని కదా నీ సందేహము. అట్టి మాయలమారిని నేనుగాను. నీ కెట్లు గానవచ్చుచున్నానో యట్టిదే నా నిజస్వరూపము. నేను గ్రోఁతినే. నా పేరు హనుమంతుఁడు. సూర్యపుత్రుఁడు వానరరాజగు సుగ్రీవుని మంత్రిని. అధముఁడగాను. ఇట్టి నేను నీ నిమిత్తమై రాము నాజ్ఞాప్రకారము సముద్రము దాఁటితిని. లంకలోఁ బ్రవేశించితిని. రావణాసురుని తలమీఁద దొంగతనముగఁ గాదు, పరాక్రమముచేఁ గాలుంచితిని. ఇంతచేసి నిన్నుఁ జూడవచ్చినాఁడను. తల్లీ ! నన్ను నమ్ముము.

క. ఎవ్వనిఁగా ననుఁ దలఁచితి, వవ్వాఁడను గాను సంది•యంపడ నేలా !
నొవ్వక యభిభాషింపుము, మవ్వంబున నవిన సీత•మారుతి కనిమెన్. ౮౧౭

తా త్ప ర్య ము.

నన్ను నీ వెవ్వఁడ వని తలఁచితివో యా రావణుఁడను నేనుగాను. ఏలసందేహించెదవు ! పరునితో నెట్లు భాషింపవచ్చునాయని నొచ్చుకొనక నీ దాసునితో నీ బిడ్డతో నీవు ప్రేమమున మాట్లాడునట్లు మాటలాడుము. అనిన సీతాదేవి యాంజనేయున కిట్లనినెను.

పూర్వము హనుమంతుఁడు రామచంద్రమూర్తి భార్య సీతాదేవి యీమెయే యని యెట్లు పెక్కునిదర్శనములచే నిశ్చయించుకొనెనో యట్లు సీతాదేవి యిఁక హనుమంతుని బ్రత్యక్షముగఁ బరీక్షించుచున్నది. అట్టులే శిష్యుని గురు వెట్లు పరీక్షించునో గురువును నట్లే శిష్యుఁడుగాఁ గోరువాఁడు పరీక్షింపవలెను. గాని తటాలున వీథిని బోవు వానిని వేషభాషణములఁ జూచి యాచార్యుఁడని నమ్మి

దగ్గఱఁ జేర్పరాదు. అందు ముఖ్యముగ స్త్రీలు వారితో మనసిచ్చి మాటలాడరాదు. సీతాదేవి హనుమంతు నే విధముగఁ బరీక్షించుచున్నదో చూతుము. రామచంద్రమూర్తి యొద్దకు మాఱువేషముతోఁ బోవ సాహసించిన హనుమంతుఁడు సీతాదేవి యొద్ద కట్లు పోవుట నిప్పుతో నాడుకొనుట యని తలఁచెను, లేకుండిన మనుష్య వేషములోనే పోయి సంగతులన్ని చెప్పి తరువాతఁ దనరూపము చూపి యుండ వచ్చును, అట్లిచ్చటఁ జేసెనేని వీఁడు మాయలమారి, నన్ను మోసగించె నని తలఁచి యుండును. కార్యము భంగమై యుండును.

—• ౩౫-వ సర్గము, సీతాదేవి హనుమంతుని శ్రీరామలక్ష్మణుల చిహ్నంబు లడుగుట •—

సీ. శ్రీరామచంద్రుతో • స్నేహ మెట్లు లభించె, నీకు? లక్ష్మణు నెట్టు • లెఱిఁగి తీవు?
నరవానరుల కెట్లు • పరఁగె సమాగమం? బెట్టి గుర్తుల వార • లిద్ద ఱన్న
దమ్ములు? వానిని • దక్ష్యంబుగాఁ దెల్పి, నా దుఃఖ మడఁపు వా•నరవరుండ!
యెట్టిది సంస్థాన? • మెట్టిది రూపంబు, రామున కా సుమి•త్రాజునకును
ఆ. నూరు బాహు లెట్టి • వా రీతి వినిపింపు, మంచు నిట్లు దన్ను • నడుగుటయును
మారుతాత్మజుండు • మైథిలితో రాఘవుల శుభాంకములను • బలుకఁ దొడఁగె.

అర్థములు. సమాగమము = కూడిక, సంస్థానము = ఆకారసన్నివేశము.

రావణాసురుఁడు మాఱువేషముతో వచ్చి యుండిన యెడల రావణు నెత్తిపై నా పదముంచితిని, రావణుని రామచంద్రమూర్తి చంపును, అని యిట్టి మాటలు చెప్పి యుండఁడు. కావున వీఁడు రావణుఁడు కాఁడు, మాటలాడ వచ్చునని నిశ్చయించుకొనెను గాని వీఁడు రామ దూత యనుట యేమి నిజము? అని యీ సందేహము దీరఁ బ్రశ్నించుచున్నది.

తాత్పర్యము.

శ్రీరామచంద్రమూర్తికి నీకు స్నేహ మెట్లు లభించెను? ఏవిధముగా నీవు లక్ష్మణు నెఱిఁగితివి? నరులను జూచిన కోఁతులు దూర దూరమునందే యుండును. వానరులను జూచిన మనుష్యులు బెదరించుచుందురు ఇట్టిచోట మీ రిరువురు నొక చోట నెట్లు చేరితిరి? ఆ యన్నదమ్ము లిరువురు నెట్టి గుర్తులవారు? నీవు నిజమైన వానరుఁడ వైతివేని యున్న వాస్తవముఁ దెల్పి నాకు సంతోషముఁ గలిగింపుము. రామునకు నాయన తమ్ముఁడు లక్ష్మణునకుఁ దొడ లెట్టివి? బాహువు లెట్టివి? తెలుపుము అని తన్నడుగఁగా హనుమంతుఁడు రామచంద్రమూర్తి శుభకరములైన చిహ్నము లిట్లు చెప్పఁ దొడఁగెను.

సీతాదేవి ప్రశ్న విషమ ప్రశ్న. అందు రెండు భాగములు గలవు. బాహువులు బహిరంగము లెవరైనఁ జూచియుండవచ్చును. తొడ లెట్టి వని యడిగెను. అనఁగా మర్మాంగము లెట్టి వని ప్రశ్న. ఇవి వస్త్రము మఱుఁగున నుండునవి. వీనిని

వీఁ డెట్లు తెలిసికొనెను. తెలిసికొనె నేని, స్త్రీనైన తనతో వాని నెట్లు చెప్పును. ఔచిత్యము నెఱుఁగునా యెఱుఁగఁడా? రాముని దూతయేనైన పక్షమందు నౌచిత్య మెఱుఁగక మాటలాడఁడు. అని సీతాదేవి తలఁచి యీ ప్రశ్న వేసెను.

దీనివలన నాచార్యుఁడు భగవత్తత్త్వము నామూలాగ్రము సరహస్యముగఁ దెలిసినవాఁడై యుండవలెను. దాని నెవరి కెట్లు చెప్పవలయునో యదియుఁ దెలిసిన వాఁడై యుండవలయు నని భావము.

ఉ. భాగ్యము గాదె దేవి! నను • భావమునం దిటు విశ్వసించి నీ
వాగ్యమ ముజ్ఝగించి నిజ•వల్లభు గుర్తులు లక్ష్మణాంకముల్
యోగ్యవిధంబుగాఁ బలుకు • మున్న విధంబుగ నంటి ప్రీతి సౌ
భాగ్యవతీ! వచింతు విను • భ్రాతల మేని శుభాంకపద్ధతుల్. ౮౧౯

అర్థములు. భాగ్యముగాదె = నా యదృష్టముగదా, వాగ్యమము = నియమము, ఉజ్ఝగించి = వదలి.

తాత్పర్యము.

దేవీ! నా యదృష్టము కొలఁది నన్ను నీవిట్లు మనస్సున రావణుఁడు గాఁడని నమ్మి మౌనము చాలించి నీ భర్త గుర్తులు లక్ష్మణు చిహ్నములు యోగ్యమగురీతి వాస్తవముగఁ జెప్పుమంటివి. సౌభాగ్యవతీ! యీ యన్నదమ్ముల దేహము లందలి చిహ్నములు చెప్పెద వినుము.

సీ. రాముండు కమలప•త్రవిశాలలోచనుం, డఖిలసత్త్వమనో•హరగుణుండు
రూపదాక్షిణ్యాభి•రూఢుఁడై జనియించెఁ, దేజంబునందు నా•దిత్యుఁబోలు
నోరుపుగుణమున • నుర్వికిఁ దుల్యుండు, బుద్ధి బృహస్పతి•పురుడు చూపు
సద్యశంబున హరి • సకలజీవావళి, రక్షకుఁ డాత్మీయ•రక్షకుండు
ఆ. స్వజనవృత్తి ధర్మ•సంరక్షకుఁడు నాల్గు,జాతు లరయుచుండు • రీతి చెడక
మనుజహితము లైన•మర్యాదలం దుండి, పరుల నట్లు చేయఁ • బనుచుచుండు.

అర్థములు. కమల పత్ర విశాల లోచనుండు = తామర రేకులవలె వెడలుపగు కన్నులు గలవాఁడు, విరోధ భావముతోఁ జెప్పినను అనుకూల భావముతోఁ జెప్పినను రామచంద్రమూర్తిని జూచిన వారాయన కన్నులు తమకన్నుల యెదుటఁ గట్టినట్లుండుటచే వానినే ముందువర్ణింతురు. అవి యెట్టివారి మనస్సునైన నాకర్షించి వారి మనస్సున దృఢముగ నాటుకొను నంతటి సౌందర్యము గలవి. కావుననే శూర్పణఖయు 'నిడుద బాహులవాఁడు నెడఁద కన్నులవాఁ' డని ప్రారంభించెను. రామచంద్రుని బాహువులఁ జూచినపు డీ బాహువులచేఁ దన్ను నీయన కౌఁగిలించుకొనునా యని యాశపడెను. ఆ భ్రమ వదలినది కాదు. కావున ముందు చేతులు చెప్పి తన్ను మోహింపఁజేసిన కన్నులు రెండవదిగాఁ జెప్పెను. ఈ కన్ను లెట్టివనిన మహా ప్రవాహమందుఁ దామర పూలవంటివి. సుడిగుండముల వంటివి. ప్రవాహ మెంత సుందర

ముగఁ జాలు చుండినను వాని వసుమ కమలము లుండెనేని మనుష్యుల దృష్టి వాని మీఁదికే పోవును. వానికై వానిని సమీపించితి మేని యవి తమలోనికి నీడ్చుకొనును. అట్లు సౌందర్యరస ప్రవాహమున నీకన్నులు దూరమునుండి చూచువారిని సమీపమునకు నాకర్షించును. సమీపమునకు రాఁగానే వారి మనస్సులను దమయందే లగ్నము చేసికొనును. సహజసుందరుఁడు రాముఁడు, ఆయన యందీ కన్ను లభిరామములై యున్నవి.

అఖిలసత్త్వ = సమస్త జంతువులయొక్క, సుమనో = మంచి మనస్సులను, హర = హరించు, గుణుండు = కల్యాణ గుణములు గలవాఁడు, ఈయన సౌందర్య మెవరి నాకర్షించును? కన్నులు గలవారి నందఱను గన్ను లాకర్షించునట్లు లీయనయు సమస్త జంతువులను నాకర్షించును ప్రత్యక్షముగా నుండినచోఁ దామరలు కన్నులకుఁ గానవచ్చును. దూరమున నుండు వారికెట్లు గానవచ్చును. రామచంద్ర మూర్తి సుమనోహర గుణములు గలవాఁడు. కమలము లెందో యున్న తుమ్మెదల నెట్లాకర్షించును? దాని స్వభావగుణమైన సువాసనచేఁ గదా. అట్లే రామచంద్ర మూర్తి తన గుణములచే దూరమున నుండు వారికిని దనయందుఁ బ్రేమ పుట్టించి తనయొద్దకు నాకర్షించును. ఏల? ఆయన సుమనస్సులవలె (పూలవలె) సుమనస్సుల (దేవతల - పండితుల) సుమనస్సులను (మంచి మనస్సులను)హరించు గుణములు గలవాఁడు. సర్వసత్త్వములను హరించువాఁడంటివే. రావణాది రాక్షసులం మనస్సుల నేల హరింపలేదు? కమలము తుమ్మెదలు లోనగువాని నాకర్షించునే కాని కప్పలను తేళ్ళను బాములను నాకర్షించునా? అట్లే రాక్షసులు సుమనస్సులు గారు. కావున వారి మనస్సులు హరింపలేదు. వారి యందు సుమనస్సులు (మంచి మనస్సు గలవారు)గా నుండు విభీషణాదుల మనస్సు నాకర్షింపలేదా? చెట్లయందు గుట్టల యందుఁ దిరుగు వనవిమృగమైన నా మనస్సునే యాకర్షించినపుడు మనుష్యుల నేల యాకర్షింపకుండును?

రూపదాక్షిణ్య నిరూఢుఁడై జనియించె = ఓయి, కమలము పుట్టినపుడే తేనె, వాసన పుట్టలేదు. కొన్నిదశలు మాఱిన పిమ్మట వచ్చినవి. రామచంద్రుని గుణము లట్టివా యందువేని తల్లీ! యట్టి యాగంతుకములు గావు. రూపముచే - దాక్షిణ్యముచే, నిరూఢుఁడై = పరిపూర్ణముగ నిండినవాఁడై, జనియించెను = పుట్టెను. అనుటచే నాయన కల్యాణగుణము లాయన తోడనే పుట్టినవి. కాని వసుమ వచ్చినవి కావు. ఇది 'పూర్ణమదః పూర్ణమిద'మ్మను శ్రుత్యర్థమును బోధించుచున్నది. పరత్వ దశయందు నే షాడ్గుణ్య పరిపూర్తి గలదో అవతార దశయందును నా యాఱు గుణములు గలవని భావము. ఇచ్చట భ. గీ. ౯-౧౧ "అవజానంతి మాం మూఢా మానుషీం తను మాశ్రితమ్, పరంభావ మజానంతో మమ భూతమహేశ్వరమ్" సర్వ భూతములకు మహేశ్వరుఁడనైన నేను నా పరత్వ భావమును వదలక జనించితి

నని తెలిసికొన లేక మూఢులగువారు మనుష్య దేహము వంటి దేహమును (మనుష్య స్త్రీ దేహమును) ఆశ్రయించిన నన్నుఁ దెలిసికొనలేరు. అను శ్లోకము ననుసంధించునది. ఆ గుణములేవి యందువా? రూపము = సౌందర్యము. ఇది దేహ గుణముల కన్నిటికి నుపలక్షణము. దాక్షిణ్యము. ఇది యాత్మ గుణముల కన్నిటికి నుపలక్షణము. ఈ ప్రకారము సమష్టిమీఁద సౌందర్యము, గుణముల గుఱించి చెప్పి యిఁక వానిని వేఱు వేఱుగ వివరించి చెప్పుచున్నాఁడు. ఆదిత్యాన్ = సూర్యుని, ఉర్వీకి = భూమిని, పుసదు = సమానము, సత్ + యశంబునను = మంచి కీర్తియందు, హరి = ఇంద్రుఁడు, ఆత్మీయ = తన వారిని, మనుజహితములైన మర్యాదలు = ఈ మర్యాదలు (కట్టు పాట్లు) మనుష్యులకు హితములైనవే కాని వాని వలనఁ దన కేమి మేలు లేదని భావము. మనుష్యులను హితమర్యాదలందుఁ బ్రవర్తింపఁ జేయుటకై లోక సంగ్రహార్థము తాను జేయుచున్నాఁడు. కాని యవి చేసిన నాయనకు రాఁగల లాభములేదు. చేయకుండినఁ బ్రత్యవాయములేదు. "న మే పార్థాస్తి కర్తవ్యం, త్రిషు లోకేషు కించన, నానవాప్త మవాప్తవ్యం వర్త ఏవచ కర్మణి" భ.గీ.౩.౨౨.

తాత్పర్యము.

రామచంద్రమూర్తి తామరతేకులవలె విశాలములైన కన్నులు గలవాఁడు. సమస్త జంతువుల మనస్సును హరించు గుణములు గలవాఁడు. సౌందర్యదాక్షిణ్యములతోఁ బూర్ణుఁడై జనించెను. తేజస్సునందు సూర్యునకు ఓరుపునందు భూమికి బుద్ధియందు బృహస్పతికి సమానుఁడు. మంచికీర్తియందు నింద్రునివంటివాఁడు. సకల జీవకోటుల రక్షించువాఁడు. అందు విశేషముగఁ దన యాశ్రితులను రక్షించువాఁడు, తన కులవృత్తి ధర్మముల రక్షించువాఁడు, తన యనఁగా తనది మాత్రమే కాక లోకమున వారి వారి కులవృత్తులను కులధర్మములను రక్షించువాఁడు, వారి వారి పద్ధతులు చెడకుండునట్లు నాలుగు వర్ణములవారిని రక్షించును. మనుష్యుల కేవి హితములో యా మర్యాదలను ముందుఁ దా ననుష్ఠించి మార్గముఁజూపి తరువాత లోకులను విూరిట్లులే చేయుఁడని చెప్పుచుండును. రామచంద్రుడం దుపదేశ పాండిత్యమే కాక యనుష్ఠానసామర్థ్యము చెప్పఁబడెను.

ఉ. కాంతి రహించుఁ, బూజితుఁడు • కంజదళాక్షిరో! బ్రహ్మచర్య మ
త్యంతముఁ బూను, సాధులకుఁ • దప్పనిప్రాపు, సమస్తసద్విధుల్
సాంతముగా నెఱుంగు, సము•పాసితవిప్రుఁడు, రాజవిద్యలం
దెంతయు మేటి, శీలధనుఁ • డెల్లరపట్ల వినీతుఁ డంగనా ! ౮౨౧

అర్థములు. కాంతిరహించున్ = కాంతిచేఁ బ్రకాశించును. నా విషయమై శోకించుచున్నాఁడంటివే. అట్టివానియందుఁ గాంతి యుండునా ! యందువేమొ. గ్రహణము సూర్యకాంతిని రూపుమాపలేనట్టు లాపదలెన్ని వచ్చినను మహాత్ముల సహజకాంతి పోదు. పూజితుఁడు = సాధువులచే నర్చింపఁబడువాఁడు. బ్రహ్మ

చర్య మత్యంతముఁ బూనుచ్=బ్రహ్మచర్యము రెండువిధములు. గృహస్థుఁడు ఋతుకాలమందు మాత్రము తన భార్యతో సంగమించి తక్కిన దినములందు స్త్రీసాంగత్యము మానువాఁడు.

"ఋతు స్స్వాభావిక స్త్రీణాం, రాత్రయ ష్షోడశః స్మృతాః
చతుర్భి రితరై స్సార్థ మహోభి స్సద్విగర్హితైః
తాసా మాద్యా శ్చతస్రస్తు నిందితైకాదశీచ యా
త్రయోదశీచ శేషాస్తు ప్రశస్తా దశరాత్రయః.

స్త్రీకి రజోదర్శనమైనది మొదలు పదునారుదినములు ఋతుకాలమనఁబడును. వానిలో మొదటి నాలుగురాత్రులు నిషిద్ధములు. పదునొకండవ రాత్రి పదుమూఁడవ రాత్రియుఁ బనికిరావు. తక్కిన పదిదినములందు ఏకాదశీ అమావాస్య పున్నమ పితృదినములు వదలవలయును. తక్కినదినములు ప్రశస్తములు. ఋతుకాలమందు భార్యాభర్త లారోగ్యవంతులై యుండి దానిని వ్యర్థముచేసిరేని భ్రూణహత్యాదోషము వచ్చును. ఇది ముగ్గురుకొడుకులు గలుగువఱకేకాని యావల నీ నియమములేదు. ఆవల భార్యను చెల్లెలివలెఁ జూడవలయును. పరస్త్రీలను తల్లులవలెఁ జూడవలెను.

"యుగ్మాసు పుత్రా జాయంతే, స్త్రియో యుగ్మాసు రాత్రిషు
పుమాన్ పుంసోధికే శుక్లే స్త్రీ భవత్యధికే స్త్రియాః
సమే పుమాన్ పుంస్త్రియా వా క్షీణేల్పేచ విపర్యయః
యది సంయోగకాలేతు పురుషో రాగమోహితః
ద్విధా సముత్సృజే చ్ఛుక్లం యమకం తత్ర జాయతే॥

సరిదినములయందుఁ గూడిన పుత్రులును, బేసిదినములయందుఁ బుత్రికలును గలుగుదురు. పురుషుని వీర్యము అధికమైన పుత్రుఁడును స్త్రీ యార్తవ మధికమైన స్త్రీయును రెండును సమత్వమును బొందిన నపుంసకుఁడు గాని స్త్రీ పురుషులు గాని గలుగుదురు. సంభోగకాలమునఁ బురుషుఁడు రాగమోహితుఁడై శుక్రమును రెండు విధములుగ విడిచినఁ గవలు పుట్టుదురు.

శ్లో॥ రాత్రౌ చతుర్థ్యాం పుత్త్రస్స్యా దల్పాయు ర్ధనవర్జితః
పంచమ్యాం పుత్రిణీ నారీ షష్ఠ్యాం పుత్రస్తు మధ్యమః
సప్తమ్యా మప్రజా యోషి దష్టమ్యా మీశ్వర స్సుతః
నవమ్యాం సుభగా సాధ్వీ దశమ్యాం చ వరః పుమాన్
ఏకాదశ్యా మధర్మ్యా స్త్రీ ద్వాదశ్యాం పురుషోత్తమః
త్రయోదశ్యాం సుతా లోకవర్ణ సంకర కారిణీ
ధర్మవిచ్చ కృతజ్ఞస్స్యా దాత్మవేదీ దృఢవ్రతః
ప్రజాయతే చతుర్దశ్యాం గుణాఢ్యై ర్జగతీపతిః

రాజపత్నీ మహీభోగా రాజవంశగతాథవా
జాయతే పంచదశ్యాంతు బహుపుత్రా పతివ్రతా
విద్యాలక్షణ సంపన్న స్సత్యవాదీ జితేంద్రియః
ఆశ్రయ స్సర్వ భూతానాం జాయతే షోడశే పుమాన్ ॥

తా త్ప ర్య ము.

నాలవ దినము రాత్రి పురుషునిఁ జేరిన యెడల అల్పాయువు ధన హీనుఁడు నగు పుత్రుఁడును, ౫వ దినము రాత్రి పుత్రవతియగు కూఁతురును, ఆఱవ దినము రాత్రియందు మధ్యముఁడగు పుత్రుఁడును, ఏడవ దినము రాత్రి సంతానహీనురాలగు పుత్రికయు, ఎనిమిదవ దినమున ప్రభువగు పుత్రుఁడును, తొమ్మిదవ దినమున పతివ్రతయగు పుత్రికయు, పదియవ దినమున శ్రేష్ఠుఁడగు పుత్రుఁడును, పదునొకండవ దినమున అధర్మురాలగు పుత్రికయు, పండ్రెండవ దినమున పురుషోత్తముఁడగు పుత్రుఁడును, పదుమూఁడవ దినమున వర్ణసంకరురాలగు పుత్రికయు, పదునాలవ దినమున ధర్మవేత్తయు, కృతజ్ఞుఁడును, ఆత్మవేదియు, దృఢవ్రతుఁడును, సుగుణములు గలవాఁడును భూభర్తయు నగు కొమరుఁడును గలుగుదురు. పదునేనవ దినమున రాజపత్నియు పతివ్రతయు రాజవంశమును పొందునదియు శ్రేష్ఠురాలును పుత్రులు గలదియు నగు పుత్రికయు, పదియాఱవదినంబున విద్యాలక్షణ సంపన్నుఁడును సత్యవాదియు జితేంద్రియుఁడును సర్వభూతాశ్రయుఁడు నగు పుత్రుఁడు గలుగును.

ఇట్లు ఋతుకాలమందు మాత్రము స్వభార్యతో సంగమించుట యొకవిధమైన బ్రహ్మచర్యము. రెండవది స్త్రీసంభోగమునే మానుట.

"ప్రేమాభిలాషో రాగశ్చ, స్నేహః ప్రేమరతి స్తథా
శృంగారశ్చేతి సంభోగ స్సప్తావస్థః ప్రకీర్తితః.

ప్రేమ - అభిలాష - రాగము - స్నేహము - ప్రేమము - రతి - శృంగారము అని సంభోగ మేడువిధములు.

"ప్రేమా దిదృక్షారమ్యేషు, తచ్చింతా త్వభిలాషకః
రాగ స్తత్సంగబుద్ధిస్స్యాత్, స్నేహ స్తత్ప్రవణా క్రియా
తద్వియోగాసహం ప్రేమ, రతి స్తత్సహవర్తనం
శృంగార స్తత్సమంక్రీడా, సంభోగ స్సప్తధా మతః.

అందగత్తెలఁ జూడవలయు నను కోరిక ప్రేమ యనఁబడును. ఆ విషయమైన చింత యభిలాష. అట్టివారితో సంగమింపవలయు నను బుద్ధి రాగము. దానియందే మనస్సుంచుట స్నేహము. అట్టివారిని విడిచి యుండలేకుండుట ప్రేమ. వారితోడ గలసి మెలసి తిరుగుట రతి. వారితోడఁ గ్రీడించుట శృంగారము. ఈయేడును సంభోగ మనఁబడును. స్త్రీలతో నొంటిపాటున మాటలాడుటగాని, వారిచేఁ దల దువ్వించు కొనుటగాని, తలంటించుకొనుటగాని, వారిని స్పృశించుటగాని, వారు తలదువ్వుకొను

నపుడు పరుండినపుడు స్నానముచేయునపుడు చూచుటగాని యిట్టివి నిషిద్ధములు. వయస్సు స్త్రీలను పీనుఁగులవలె నైనఁ జూడవలె, లేదా వారి యొద్ద ౫ - ౬ ఏండ్ల బాలునివలె నుండవలె. ఇట్టిది రెండవ బ్రహ్మచర్యవిధము. ఇట్టి బ్రహ్మచర్యవ్రతము రామచంద్రమూర్తి యందు విశేషించి గలదు. సమస్త సద్విధుల్ = అన్ని వైదిక కర్మవిధానములు, సముపాసిత విప్రుఁడు = బ్రాహ్మణుల సేవించినవాఁడు, రాజవిద్య లందున్ = ఆన్వీక్షికి - త్రయీ - వార్త - దండనీతి యను నాలుగు రాజవిద్యలు.

"ఆన్వీక్షికీ త్రయీ వార్తా దండనీతిశ్చ శాశ్వతీ
ఏతావిద్యా శ్చతస్రస్తు లోకసంస్థితిహేతవః॥ అని ప్రమాణము.

ఆన్వీక్షికి = తర్కవిద్య, త్రయి = మూఁడు వేదములు, వార్త = వాణిజ్యాదికము, దండము = దోషుల దండించుట. లోకస్థితి యీ నాలుగింటిపై నాధారపడి యున్నది. శీలధనుఁడు = సదాచార పరాయణుఁడు.

తాత్పర్యము.

కాంతిగలవాఁడు, సాధు పూజితుఁడు, తీవ్రమైన బ్రహ్మచర్యనిష్ఠ గలవాఁడు, సాధువులకు నాయన తప్ప వేఱు ప్రాపు లేదు. సమస్త వైదిక కర్మవిధానము తుద ముట్టఁ బూర్ణముగ నెఱుఁగును. బ్రాహ్మణోపాస్తి గలవాఁడు, రాజవిద్యలందు మిగుల సమర్థుఁడు. సదాచారసంపత్తి గలవాఁడు. అందఱ విషయమున నీతితోఁ గూడిన ప్రవర్తనము గలవాఁడు.

తే. వేదవేదాంగముల యజు•ర్వేదమునను, విల్లువిద్యను నిపుణుండు•విపులము లగు
మంసములవాఁడు దీర్ఘ బా•హావిరాజి, యబ్జకంఠుఁడు ముఖము రా•కాబ్జసఖము.

తాత్పర్యము.

ఋగ్వేదము సామవేదము అధర్వణము లను వేదములను, వేదాంగము లగు శిక్ష వ్యాకరణము ఛందస్సు నిరుక్తము జ్యోతిషము కల్పము ననువానిని, యజుర్వేదమును, ధనుర్వేదమునందును,నిపుణుఁడు.ఇంతవఱకు నాత్మగుణములు. ఇఁక దేహగుణములు చెప్పెద వినుము. వెడల్పుగల మూఁపులు.గలవాఁడు,నిడుపులగు బాహువులచేఁ బ్రకాశించువాఁడు, శంఖమువంటి కంఠముగలవాఁడు. ముఖము పూర్ణచంద్రునితో సమానము. ఇందు యజుర్వేదమును బ్రత్యేకించి చెప్పుటచే రామచంద్రమూర్తి యజుశ్శాఖ యని తెలియ నగు.

ఆ. తామ్రలోచనుండు • తతగూఢజత్రుండు, దుందుభిస్వనుండు • తోయజాక్షి
బల్లిదుండు స్నిగ్ధ•వర్ణుండు చామన,చాయవాఁడు సింహ•సంహననుఁడు. ౭౩

అర్థములు. తామ్రలోచనుండు = ఎఱ్ఱ కమలమువంటి కన్నులు గలవాఁడు, తతగూఢజత్రుండు=మూఁపులు బలిసియుండుటచే వెలుపలికిఁ దెలియరాని మూఁపుల సంధి యెముక గలవాఁడు, దుందుభిస్వనుండు=భేరివంటి కంఠధ్వని గలవాఁడు, బల్లిదుండు=మిగుల బలిష్ఠుఁడు, బల్లిదాదులు సంస్కృత తుల్యములు గావున బల్లిదము

బల్లిదుఁడు బల్లిద యని రూపంబులు. ఇవి విశేష్య నిఘ్నములు, స్నిగ్ధవర్ణుండు=మిన మిన మను దేహకాంతి గలవాఁడు,—చామనచాయవాఁడు చామనము+చాయ = వృత్తియందు ప్రత్యయలోపము. బొగ్గువలె నలుపుగాక తెలుపుగాక మేఘ వర్ణము వంటి చాయ గలవాఁడు. సింహసంహననుఁడు=సౌందర్యముతోఁగూడి సౌష్ఠవమైన ప్రత్యవయవము గలవాఁడు. 'వరాంగరూపోపేతో య స్సింహసంహననో హి సః॥ అమరకోశము. ఏ యే యవయవ మెంత పరిమాణముండవలయునో యంతే పరి మాణముగల యవయవములు గలవాఁడు.

తాత్పర్యము.

ఎఱ్ఱని కన్నులు, దాఁగిన మూఁపు సంధి ఎముకలు, భేరివంటి గంభీరధ్వని గలవాఁడు, బలిష్ఠుఁడు, మినమినమెఱయు దేహకాంతి గలవాఁడు, మేఘ వర్ణమువంటి దేహవర్ణము గలవాఁడు, అవయవ సౌష్ఠవము గలవాఁడు.

సీ. సమవిభక్తాంగుండు • సముఁడు త్రితామ్రుండు. త్రిప్రలంబుండును • త్రిస్థిరుండు
ముచ్చోట్ల నున్నతి • ముచ్చోట్ల స్నిగ్ధత, ముచ్చోట్ల గాంభీర్య•మును గలండు
త్రివళివంతుండును•త్రినముండు త్ర్యవనత, త్రిశిరస్కుఁడమ్మ!సీ • హ్రస్వయవిధుఁడు
నాలుగు వ్యంగ్యముల్ • నాలుగు కలలును, నాలుగురేఖ లం•దంబు మీఁదు
ఆ. చెలి! చతుస్సముండు • బలి చతుష్కిష్కుఁడో, యమ్మ మహితనాసి•కోష్ఠహనువు
లమరువాఁడు జంట • లగు పదునాలుగు, సమముగాఁ గలండు • జనకతనయ.

అర్థములు. సముఁడు = ఎచ్చుతక్కువలు లేని శరీరము కొలఁత గలవాఁడు, సమవిభక్త+అంగుఁడు = ఒక్కొక్కయంగమును దగినంత కొలఁతతోఁ గలవాఁడు. త్రితామ్రుండు = కన్నుల కొలుకులందును, గోళ్ళయందును, అరచేయి యరకాలియం దును నెఱ్ఱని రంగుకలవాఁడు. 'నేత్రాంత నఖ పాణ్యంఘ్రితలై స్తామ్రై శ్శ్రీభి సు ఖీ' యను వచనము ప్రమాణము. శ్లిష్టాంగులీ రుచిర తామ్రనఖౌ సుపార్ష్ణి పాదౌ కరా వపి సురక్తనఖాత్మరేఖా' యనియు నిందుఁ బ్రమాణవచనము. త్రిప్రలంబుండు = రామునికిఁ గనుబొమలు బాహువులు వృషణములును దీర్ఘములైనవి. 'దీర్ఘభ్రూ బాహుముష్కస్సు చిరజీవీ ధనీ నర' యని ప్రమాణ వచనము. త్రిస్థిరుండు = మూఁడు చోటులందు స్థిరమైనవాఁడు. స్థిరమైనరొమ్ము, స్థిరమైన మునికట్టు, స్థిరమైన పిడికిలి కలవాఁడు. "ఉరశ్చ మణిబంధశ్చ ముష్టిశ్చ నృపతేస్స్థిరా' యని సాముద్రిక వచనము. ముచ్చోట్లన్ = రొమ్ము, కడుపు, నాభి యంతర్భాగము అను నీ మూఁడు చోట్లయందు, ఉన్నతి = మిట్టగానుండుట కలవాఁడని యన్వయము. "నాభ్యంతః కుక్షి వక్షోభి రున్నతః క్షితిపో భవే" త్తని ప్రమాణవచనము. "ఉన్నతకుక్షిః క్షితిపః పరిమండలోన్నత నాభీ యః క్షితిపః। హృదయం నలేపనం పృథు సమోన్నతం మాంసలంచ నృపతీనా" మ్మనియు వరాహమిహిరవచనము. ముచ్చోటన్ = పాదరేఖలు, తలవెండ్రుకలు, లింగమణి యను నీ మూఁడు చోట్ల

యందు, స్నిగ్ధత = నునుపు, కలఁడు = కలవాఁడు. "స్నిగ్ధా భవంతి వై యేషాం పాదరేఖా శ్శిరోరుహాః తథా లింగమణి స్తేషాం మహాభాగ్యం వినిర్దిశేత్" అని సాముద్రిక ప్రమాణవచనము. ముచ్చోట్లన్ = స్వరము సత్త్వము నాభి యను మూఁడు చోట్లయందు, గాంభీర్యము గలఁడు = గంభీర స్వరము, లోఁతైన నాభి, గొప్ప సత్త్వము కలవాఁడు. "స్వరే సత్త్వే నాభౌచ గంభీర స్త్రిషు శస్యతే" యని బ్రహ్మపురాణము.

త్రివళివంతుఁడు = బొజ్జపైని మూఁడు మడఁతలుగలవాఁడు. (౨) మెడపైన మూఁడు మడఁతలు గలవాఁడు "స్థిరా త్రిరేఖ్యా సుభగోపపన్నా స్నిగ్ధా సుమాంసోపచితా సువృత్తా, నచాతిదీర్ఘా చతురంగుళాచ గ్రీవా సుదీర్ఘా భవతీహ ధన్యా" యని ప్రమాణవచనము. త్రిసముండు = వెండ్రుకల కొనలు, మోఁకాళ్ళు, వృషణములు అని మూఁడును ఎచ్చు తక్కువలు లేక సమానమయినవిగాఁ గలవాఁడు. "కేశాగ్రం వృషణం జాను సమా యస్య స భూమిపః" అని వచనము. త్ర్యవనతుఁడు = రొమ్మునందు స్తనభాగము, దాని కొనభాగము, కాలు సేతులయందు రేఖలు అను నీ మూఁడును లోఁతుగానున్నవి రామునకని యర్థము. "పీనోపచితై స్సిమ్నైః క్షితిపతయ శ్చూచుకై స్తనై స్సుఖినః స్నిగ్ధా నిమ్నా రేఖా ధనినాం తద్వ్యత్యయేన నిస్స్వానా"మ్మని వరాహమిహిరవాక్యము. త్రిశిరస్కుఁడు = మూఁడు సుడులు గల తలలుగలవాఁడు. "ఆవర్తత్రయరుచిరం యస్య శిర స్స క్షితిభృతాం నేతా" యని ప్రమాణము. మూఁడు తీరులుగల శిరస్సు గలవాఁడు. సమమై గుండ్రమై యుండుట, ఛత్త్రాకారమై యుండుట, విశాలమైయుండుట యనునవి మూఁడు తీరులు "సమవృత్తశిరాశ్చైవ ఛత్త్రాకారశిరా స్తథా । ఏకచ్ఛత్త్రాం మహీం భుంక్తే దీర్ఘమాయుశ్చ విందతి" యని నారద వాక్యము. నాలుగు వ్యంగ్యముల్ = పొట్టివియైన నాలుగవయవములు. మెడ ప్రజననము వీఁపు మోఁకాళ్ళు. ఇవి పొట్టివైన నాల్గవయవములు, నాలుగవయవములు కొన్నిలోపములు గలవి. పాదములందు నరము కనఁబడదు. ఒక రోమకూపమందు రెండు రోమములు మొలవవు. మగగుంటి పొడుగుగాక యుండును. వస్తి మాంసహీనాన్యము. ఇవియే లోపములు. "పాదైః ప్రస్వేదరహితైస్సిరాహీనశ్చ పార్థివః । ఏకరోమా భవే ద్రాజా ద్విరోమా పండితో భవేత్ । త్రిరోమా చతురోమాచ భవే ద్భాగ్యవివర్జితః । సమపాదోపవిష్టస్య గుల్ఫం స్పృశతి మేహనం। యస్యేశ్వరం తం జానీయా త్సుఖినం చైవ మానవం । నిర్మాంస స్సంహతో వస్తిర్యేషాం తే సుఖభాగినః" అని నారద వచనము. నాలుగు కలలును = నాలుగు వేదములును. శరీరలక్షణము చెప్పునప్పుడు వేదములను జెప్పుట తత్సూచకములైన రేఖలను దెల్పుటకై యని తెలియునది. "మూలేంగుష్ఠస్య వేదానాం చతస్రస్త్విస్ర ఏవహి । ఏకా ద్వేవా యథాయోగం రేఖా జ్ఞేయా ద్విజన్మనా" మ్మని నందివచనము. నాలుగు రేఖలు - నొసలియందును, అఱచేతులయందును,

నఱకాళ్ళ రెండును నున్న నాలుగు రేఖలు. "లలాటే యస్య దృశ్యన్తే చతు స్త్రిర్ద్వ్యేకరేఖకాః। శతద్వయం శతం షష్టి స్తస్యాయు ర్వింశతి స్తథా" యని కాత్యాయన వచనము. "యస్య పాదతలే వజ్రధ్వజ శంకాంకుశోపమాః। రేఖా స్సమ్య క్ప్రకాశంతే మనుజేంద్రం తమాదిశే" త్తని నారదవచనము. "పాణౌ చతస్రో రేఖాశ్చ యస్య తిష్ఠం త్యథాంగులా" యని బ్రహ్మవచనమునిట స్మరించునది. చతు స్సముఁడు=భుజములు మోఁకాళ్ళు, తొడలు, చెక్కిళ్ళు అనునవి ఎచ్చు తక్కువలు లేనివాఁడు. (సమానముగాఁ గలవాఁడు.) చెక్కిళ్లకు మాఱుగాఁ బిక్కలని కొందఱందురు. "బాహూ జానూరు గండాశ్చ చత్వా ర్యది సమానిచ" యని బ్రహ్మాండ పురాణము. "గండాశ్చ" యన్నచో "జంఘాశ్చ" యనియు పాఠాంతరము. చతుః+కిష్కుఁడు = నాలుగు కిష్కుల కొలఁత గలవాఁడు, కిష్కువు = ఇరువదినాలుగంగుళములు. తొంబది యాఱంగుళముల మొత్తగలవాఁడని భావము. మహిత.. .... హనువులు. మహిత=కొనియాడఁబడిన, నాసిక=ముక్కు, ఓష్ఠ=పెదవి, హనువులు= దవడలు, పెదవులు దొండపండువలె నెఱ్ఱనై బలిసియున్నవి. ముక్కు ఎత్తై పొడుగుగా నున్నది. దవడ లంటుకొనిపోక బలిసియున్నవని భావము. జంట యిత్యాది = జంటగానున్న పదునాలు గవయవములు హెచ్చు తక్కువలులేక యున్నవి. "భ్రువౌ నాసాపుటే నేత్రే కర్ణౌ ఓష్ఠౌచ చూచుకే కూర్పరౌ మణిబంధౌ చ జానునీ వృషణౌ కటీ। కరౌ పాదౌ స్ఫిజౌ యస్య సమాజ్ఞేయ స్స భూపతిః" అని బ్రహ్మాండ పురాణము. "కర్ణాక్షి భ్రూగండ నాసా దంతోష్ఠ స్కంధ జత్రుణీ। పాదౌ కరౌ స్తనౌ పూరూ స్ఫిచౌ ద్వంద్వా శ్చతుర్దశ సమాశ్చయస్య విద్యంతే క్రమేణోపచితా స్తథా" యని బ్రహ్మాండ పురాణ వాక్యము.

తాత్పర్యము.

ఏ యవయవ మెంతయుండిన నందమో యంతమాత్రమే వేర్వేఱుగాఁ దెలియునట్లు గలవాఁడు. ఎచ్చు తక్కువలులేని శరీరము కొలఁత గలవాఁడు. ఎఱ్ఱని కనుఁగొనలు, గోళ్ళు అరచేతులు అరకాళ్ళు గలవాఁడు. కనుబొమ్మలు, వృషణములు, బాహువులు పొడుగుగాఁ గలవాఁడు. రొమ్ము మణికట్టు పిడికిలి స్థిరముగాఁ గలవాఁడు. పొత్తికడుపు, బొడ్డు, రొమ్ము ఎత్తుగాఁ గలవాఁడు. పాదరేఖలు తలవెండ్రుకలు లింగము నునుపై యుండువాఁడు. గంభీరమైన కంఠధ్వని, నడక లోఁతైన బొడ్డు గలవాఁడు. కంఠమున మూఁడు రేఖలు గలవాఁడు. తలవెండ్రుకలకొనలు, వృషణములు, మోఁకాళ్లు సమముగాఁగలవాఁడు. చను మొనలు స్తనములు రేఖలు పల్లముగాఁ గలవాఁడు. మూఁడు సుళ్లు గల తలగలవాఁడు. కంఠము, లింగము, పిఱుఁదులు, పిక్కలు ఇవిహ్రస్వములుగాఁ గలవాఁడు. సమమై గుండ్రమై విశాలముగా నుండుశిరస్సు గలవాఁడు. బొటనవ్రేలిక్రింద వేదముల సూచించు నాలుగు గీఁతలు గలవాఁడు. నొసట నాలుగు రేఖలును, అఱకాలి యందును, అఱచేతియందు,ధ్వజము వజ్రము అంకుశము

శంఖమువంటి నాలుగు రేఖలు కలవాఁడు. బాహువులు మోఁకాళ్లు, పిక్కలు, తొడలు, సమముగాఁ గలవాఁడు. బలశాలి. నాలుగు హస్తము లనఁగాఁ దొంబది యాఱం గుళముల యెత్తుగలవాఁడు. మంకెనపువ్వు దొండపండు వంటి పెదవియు, బలిసి యున్న చెక్కిళ్లు, నిడుపై నిక్క పొడిచిన ముక్కు గలవాఁడు. కనుబొమలు, ముక్కు పుటములు, కన్నులు, వీనులు, పెదవులు, చనుముక్కులు, మోఁచేతులు, మణికట్లు మోఁకాళ్ళు, వృషణములు, కటి ప్రదేశములు, చేతులు, కాళ్ళు, పిఱుఁదులు సమాన ములుగ నుండువాఁడు. ఇట్టి మగవారు లోకమందున్నారా యందువేమో. వీనికిఁ దగిన చిహ్నములు గల స్త్రీవి నీవొకతెవే యెట్లున్నావో, లోకమున నీకుఁదగినట్టి యిట్టి చిహ్నములు గలవాఁ డాయన యొక్కఁడే యున్నాఁడు.

ఉ. నాలుగుప్రక్కదంష్ట్రిలును • నాల్గిటియానముఁ గల్గు, నాలుగున్
నాలుగు వంశముల్ గలఁడు • నాలుగు నొక్కటి స్నిగ్ధ, మాఱునన్
నాలుగు పద్మముల్, మఱియు • నాలుగు నాఱును గొప్ప వొప్పడున్
నాలుగు రెండు మిట్టలును • నాలుగు నైదును సన్నమై తగున్. ౮౨

అర్థములు. నాలుగుప్రక్క దంష్ట్రిలు = పై పండ్లవరుసయందు రెండు ప్రక్కలును, దిగువ పండ్ల వరుసయందు రెండు ప్రక్కలును జేరి నాలుగు ప్రక్కలు. అం దొక్కొక్క ప్రక్కయందును నాలుగేసి కోరలవంటి పండ్లు కల్గు నని యన్వ యము. (౨) ఈ రెండువరుసలలోను నడుమనుండు నాలుగు పండ్లకు రెండుప్రక్కల యందునునొక్కొక్క పల్లు కలదు. దానికి దంష్ట్రి యని పేరు. అవి నాలుగు ప్రక్కలం దును నాలుగున్న వని యర్థము. 'స్నిగ్ధా ఘనాశ్చ దశనా సుతీక్ష్ణదంష్ట్రాస్సమాశ్చ శుభా' యని వరాహమిహిరవచనము.

"బంధుజీవ కుసుమోపమోఽధరో । మాంసలో రుచిరబింబ రూపధృత్ । పూర్ణమాంసళహనుస్తు భూమిప స్తుంగతుండ రుచిరాకృతిస్తథా" యని సంహితా వచనము. నాల్గిట యానముఁగల్గున్ =సింహశార్దూలగజ వృషభములవంటి నడక గల వాఁడు. "గజసింహ గతీ వీరౌ శార్దూల వృషభోపమౌ" యని బాలకాండ వాక్యము. నాలుగున్ నాలుగు = ఎనిమిది. వంశముల్ =నిడుపైన యవయవములు కలవాఁడు. వెన్నముక, శరీరము, వ్రేళ్లు, చేతులు, ముక్కు, కన్నులు, చెవులు, మగగుఱి-యివి, యెనిమిది యవయవములు. మగగుఱి వంకర కాకుండుట పొడు గనఁ బడును. 'పృష్ఠ వంశ శ్శరీరంచ హస్తపాదాంగుళీ కరౌ, నాసికా చక్షుషీ కర్ణౌ ప్రజనో యస్య చాయతా" యని సాముద్రిక వచనము. (౨) రెండు చేతులు, రెండు చేతుల వ్రేళ్లు, రెండు తొడలు రెండు పిక్కలు చేరి యెనిమిది యవయవము లని కొందఱు. 'బాహూచ నలకౌ చోరూ జంఘే చే త్యష్టవంశకా' యని వచనము. నాలుగు నొక్కటి=అయిదు అవయవములు. అవి వాక్కు, వక్త్రము, నఖములు, రోమ ములు, త్వక్కు అని కొందఱు. వెండ్రుకలు - కన్నులు - దంతములు - అడుగులు-

త్వక్కు - అని మఱి కొందఱు. స్నిగ్ధములు = నునుపైనవి. 'చక్షు స్స్నేహేన సౌభాగ్యం, దంతస్నేహేన భోజనం, త్వచస్స్నేహేన శయనం పాదస్నేహేన వాహన'మ్మని వరరుచి వాక్యము. 'స్నిగ్ధనీల మృదుకుంచితా స్తథా మూర్ధజా స్సుఖకరా స్సమం శిర' యని మిహిర వాక్యము. ఆటునుస్ నాలుగు = పది యవయవములు, పద్మముల్ = పద్మాకారములు. ముఖము, నేత్రము నోరు, నాలుక, పెదవి, దవడలు, స్తనములు, గోళ్ళు, చేతులు, కాళ్ళు - యివి పది యవయవములు. "ముఖ నేత్రాస్య జిహ్వోష్ఠ తాలు స్తన నఖా కరౌ । పాదౌచ దశపద్మాని పద్మాకారాణి యస్య చ" యని వచనము. నాలుగు నాఱును = ఱొమ్ము, తల, నొసలు, మెడ, భుజములు, మూఁపులు, నాభి, పార్శ్వములు, వెన్ను, స్వరము-అను పది యవయవములు గొప్పవి. 'ఉర శ్శిరో లలాటం చ గ్రీవా బాహ్వంస నాభయః । పార్శ్వ పృష్ఠస్వరా శ్చేతి విశాలాస్తే శుభప్రదా" యని సాముద్రిక వచనము. విశాలములు. స్వరము అనేకులకు వినఁబడుటయేగొప్ప (౨) ఱొమ్ము, నొసలు, చెవులు, మెడ, తల, మనసు, కడుపు, కాలు సేతులు, వెన్ను - అని పది యవయవములని మఱి కొందఱు. "శిరో లలాటే శ్రవణే గ్రీవా వక్షశ్చ హృత్తథా । ఉదరం పాణి పాదౌచ పృష్ఠం దశ బృహంతిచ" యని బ్రహ్మపురాణ వాక్యము. నాలుగు రెంటను = కక్షము, కుక్షి, వక్షము, ముక్కు, మూఁపు, నొసలు - అను నా ఱవయవములు, మిట్టలు. 'కక్షః కుక్షిశ్చ వక్షశ్చ ఘ్రాణస్కంధో లలాటికా । సర్వభూతేషు నిర్దిష్టా ఉన్నతాంగా శ్శుభప్రదా" యని వరరుచి వాక్యము. నాలుగైదును = కేశములు, మీసములు, రోమములు, వ్రేళ్ళకణుపులు, త్వక్కు, మగగుఱి, బుద్ధి, చూపు - అను తొమ్మిది యవయవములు. సన్నలై తగున్. "సూక్ష్మాణ్యంగులిపర్వాణి కేశలోమ నఖత్వచః । శేఫశ్చ యేషాం సూక్ష్మాణి తే నరా దీర్ఘజీవిన" యని వరరుచి వాక్యము. 'అస్ఫుటితాగ్రం సూక్ష్మం శ్మశ్రు శుభం మృదుచ సంతతం స్నిగ్ధ'మ్మనియు "సూక్ష్మద్రు క్సూక్ష బుద్ధిశ్చ యో నర స్స సుఖ భవే" త్తనియు వచనాంతరములు.

తాత్పర్యము.

నాలుగు దంష్ట్రలు గలవాఁడు సింహము, ఏనుఁగు, శార్దూలము, వృషభము పేనివలె నడచువాఁడు, వీఁపు, దేహము, చేతుల కాళ్ళ వ్రేళ్ళు, చేతులు, ముక్కు, కన్నులు, చెవులు, లింగము ఇవి నిడుదలుగా గలవాఁడు. బాహువులు, వ్రేళ్ళు తొడలు, పిక్కలు యీ యెనిమిది నిడుపు లగువాఁడు, కన్నులు, దంతములు, చర్మము, పాదములు, వెంట్రుకలు మెఱయుచుండువాఁడు ముఖము, కన్నులు, నోరు, నాలుక, పెదవులు, దవడలు, చన్నులు, గోళ్లు, చేతులు, కాళ్ళు - ఇవి పద్మములవలె గుండ్రముగాఁ గలవాఁడు. శిరము, నొసలు, చెవులు, కంఠము, ఱొమ్ము, హృదయము, కడుపు, చేతులు, కాళ్లు, పిఱుఁదులు పెద్దవిగాఁ గలవాఁడు, చంకలు, కడుపు, ఱొమ్ము, ముక్కు, మూఁపు, నొసలు మిట్టలుగాఁ గలవాఁడు.

ప్రేళ్ళ గణుపులు, తలవెంట్రుకలు, దేహమున వెంట్రుకలు, చర్మము, లింగము, నాస మున వెంట్రుకలు, సూక్ష్మబుద్ధి, సూక్ష్మదృష్టి – ఇవి సూక్ష్మములుగఁ గలవాఁడు.

తే. మూఁట వ్యాప్తుఁ డనుష్ఠించు • మూఁటి సతము
రెంటఁ దెల్లన సత్యంబు • నంటి యుండు
ధర్మనిరతుండు సంగ్రహ•దాన విధుల
నెంతయును నిస్తులుండు శ్రీ•మంతుఁ డమ్మ! ౮౨

అర్థములు. మూఁట వ్యాప్తుఁడు = మూఁడింటిచే వ్యాపించినవాఁడు. “త్రిభి ర్వ్యాప్తిశ్చ యస్యస్యాత్ । తేజసా యశసా శ్రియా” యన్నట్లు తేజస్సు చేతను, కీర్తి చేతను, శ్రీ చేతను వ్యాపించినవాఁడు. మూఁటన్=పూర్వాహ్ణ మధ్యాహ్నపరాహ్ణము లను మూఁడుకాలములందు ననుష్ఠింప వలసిన ధర్మార్థకామము లను త్రివర్గము గల వాఁడు. “ధర్మార్థకామాః కాలేషు త్రిషు యస్య స్వనుష్ఠితా” యని బ్రాహ్మవచనము. రెంటఁదెల్లన = తెల్లనిదంతములు, తెల్లనికన్నులు గలవాఁడు. మాతాపితృవంశములు రెండును శుద్ధముగాఁ గలవాఁడు.

తా త్ప ర్య ము.

తేజస్సు, యశస్సు, శ్రీ- యీ మూఁటిచే వ్యాపించి యుండువాఁడు. పూర్వాహ్ణ మధ్యాహ్నపరాహ్ణములందు ధర్మార్థకామముల నాలోచించి చేయువాఁడు. కన్నులు దంతములు తెల్లనైనవాఁడు. పరిశుద్ధము లైన మాతాపితృ వంశములు గలవాఁడు. సత్యము వదలనివాఁడు. స్వధర్మమునందు విశేషించి ప్రీతి గలవాఁడు. ధనార్జనమందు దానము చేయుటయందు మిక్కిలి యసమానుఁడు. శ్రీతో నిత్యయోగము గలవాఁడు.

ఇంత గూఢముగాఁ జెప్ప నేల? స్పష్టముగనే చెప్పియుండ వచ్చును గదా! స్పష్టముగాఁ జెప్పియుండిన సీతాదేవి హనుమంతుని బరిహసించి యుండును. మీఁద వ్రాయఁబడిన యర్థమందు శిశ్నము, వృషణములు చెప్పఁబడినవి. హనుమంతుఁడు నీ మగని శిశ్న మిట్లున్నది, నీ మగని వృషణము లిట్లున్నవని చెప్పిన సీతాదేవి వీఁ డడవి మనుష్యుఁడే, ఔచిత్య మెఱుఁగక మాటలాడుచున్నాఁడు, ఇటువంటి మొద్దుగాఁడు శ్రీరామచంద్రమూర్తి దూతగా నుండఁజాలఁడు, అని తీర్మానించు కొని యుండును. ఆ కారణముచేతనే యీ రామాయణమునందు నౌచిత్యపోషణకై గూఢముగానే చెప్పఁబడెను. ఈ విషయము వీఁ డెట్లు చెప్పునో తెలిసి కొందమనియేకదా సీతాదేవి యిటువంటి ప్రశ్న వేసెను. వస్త్రము మఱుఁగున నుండు వానిని హనుమంతుఁ డెప్పుడు చూచెను? ఎట్లు తెలిసికొనఁ గలిగెను.

“పలు సందియములఁ దొలఁచును, వెలయించు నతీంద్రియార్థ విజ్ఞానము లోకుల కక్షి శాస్త్ర మయ్యది యలవడ దెవ్వనికి వాఁడె యంధుఁడు జగతిన్” చిన్నయసూరి నీతిచంద్రిక. బుద్ధిమంతులకు శాస్త్రమే కన్ను. కావునఁ దక్కిన వన్ని శాస్త్రప్రకారము సరిగా నున్నప్పుడవి యిది సరిగా నుండకతప్పదు. కావున శాస్త్రము

నాధారము చేసికొని చెప్పెను. దానిని గుఱించి హనుమంతుఁడు చెప్పకుండినను నేను జూడలేదు, నాకుఁ దెలియ దని చెప్పియుండినను హనుమంతుఁడు మందబుద్ధి యని సీతాదేవి తలఁచియుండును.

క. రాముని ద్వైమాతురుఁ డగు, సౌమిత్రి యజయ్యుఁ డాజి ♦ సద్గుణరూప
ప్రేమముల నట్టివాఁ డు, ర్వీమండలి దేవి! నిన్ను ♦ వెదకుచు వారల్. ౮౨౭

అర్థములు. ద్వైమాతురుఁడు = లక్ష్మణుఁడు రామునకు సవతితల్లి కొడుకైనను నిచ్చట నిద్దఱు తల్లుల బిడ్డఁ డని చెప్పఁబడెను. ద్వయో ర్మాత్రో రపత్యం పుమాన్ ద్వైమాతుర యని వ్యుత్పత్తి. "మాతురుత్సంఖ్యాసంభద్రపూర్వాయా" యని పాణిని. అనఁగా నిద్దఱు తల్లుల బిడ్డఁడు. కన్నతల్లి సుమిత్రవలెనే కౌసల్యాదేవిచే రామునితోఁడఁ బెంపఁబడుటచే నిద్దఱు తల్లుల కొడుకని చెప్పఁబడెను. రామలక్ష్మణు లిరువురు నొక్కతల్లి బిడ్డలవలెఁ గలసి మెలసి యున్నారుగాని, సవతితల్లి బిడ్డలని వారిని జూచిన వారు వారి నడవడిఁబట్టి చెప్పఁజాల రని భావము. అజయ్యుఁడు = జయింపరానివాఁడు, ఆజిన్ = యుద్ధమందు, అట్టివాఁడు=రామచంద్రమూర్తి వంటి వాఁడే, వారల్ = రామలక్ష్మణులు.

తా త్ప ర్య ము.

రామచంద్రమూర్తి సవతితల్లి కొమరుఁడైనను సోదరునివలె నుండువాఁడు లక్ష్మణుఁడు. యుద్ధమం దజయ్యుఁడు, సద్గుణమందు, రూపమందు, ప్రేమమందు, రాముని వంటివాఁడు, వా రిరువురు నిన్ను భూమి యంతయు వెదకుచు.

ఇంతవఱకు "ఎట్టిది సంస్థాన మెట్టిది రూపంబు రాముని కా సుమిత్రాత్మజునకు" అని సీతాదేవి యడిగిన ప్రశ్నకు సమాధానము చెప్పి శ్రీరామచంద్రుతో స్నేహ మెట్లు లభించె నీకు, లక్ష్మణు నెట్టు లెఱిఁగి తీవు, నరవానరుల కెట్లు పరఁగె సమాగమం బన్న ప్రశ్నలకుఁ బ్రత్యుత్తర మిచ్చుచున్నాఁడు.

—♦సీతాదేవికి హనుమంతుఁడు శ్రీరామసుగ్రీవుల సమాగమ విధంబుఁ జెప్పుట♦—

సీ. చను దెంచి రమ్మ! మా♦చరియించుచోటికి, నన్న రాజ్యమునుండి♦తన్నుఁ దఱుమ
ఋశ్యమూకాద్రి మే♦మెల్లరు సేవింప, నన్నభయంబున ♦ నదరిపడుచు
నున్న సుగ్రీవుఁ డి♦యన్నదమ్ములఁ జీర, వసనుల ధృతచాప♦పాణితలుల
వీక్షించి భయమున ♦ నెగిరి శృంగముఁ జేరి, ననుఁ బంపె వారిచం♦దం బెఱుంగ

ఆ. నొప్పుఁ గేలఁ బురుష♦ముఖ్యుల డాసితి, వారు నాదు పల్కు ♦ గారవింప
మోచి తెచ్చి కీశ♦ముఖ్యుని ప్రోలను, లలితరీతి వారి ♦ నిలుపుటయును. ౮౨౮

అర్థములు. మా చరియించు చోటికి=మేము చరించు చోటికి, సమాసంబునఁ బ్రథమకు షష్ఠి - చీరవసనులన్ = నార చీరలు గట్టిన వారిని, ధృతచాప పాణి తలుల = హస్తములందు విండ్లు ధరించిన వారిని.

తాత్పర్యము.

మే మున్నచోటికి వారు వచ్చిరి. అన్న రాజ్యము నుండి తఱుమఁగా ఋశ్యమూకాద్రియందు మే మెల్లవారు సేవింప నున్నచో భయపడుచు నున్న సుగ్రీవుఁడు నారచీరలు, చేతుల విండ్లు ధరించిన వీరిని జూచి భయపడి యెగిరిపడి శిఖరము చేరి వారి వృత్తాంతము దెలిసికొని రమ్మని నన్నుఁబంపెను. వారిని జూడఁగానే వారెవరో మహాత్ములని తోఁచుటచే నేను వినయమునఁ జేతులు జోడించుకొని వారియొద్దకుఁ బోయితిని. వారు నా మాటయం దాదర ముంచి గారవింపఁగా నేనే వారిని మోచి తెచ్చి సుగ్రీవుని యెదుట నిలిపితిని.

ఇచ్చట నేను నేను అని యుత్తమపురుషము చెప్పుట యహంకారముచేఁ గాదు. రామ సుగ్రీవసఖ్యమునందుఁ దనకుఁగల సంబంధమును, నీవు లక్ష్మణు నెఱిఁగితి వనుటకుఁ బ్రత్యుత్తరము తెలుపుటకే.

క. వారు పరస్పరసల్లా,పోరురతిన్ విశ్వసించి • యొండొరులను వా
రూరార్చిరి తమఁ దవతవ; చారిత్రముఁ జెప్పి విశద•సరణిగ నంతన్. ౨౯

తాత్పర్యము.

వా రిరువు రొకరితో నొకరు మంచిగ మాటలాడుచు నొకరి నొకరు నమ్మిరి. వారి వారి దుఃఖము వారు వారు చెప్పుకొనఁగా వారే యొకరి నొకరు సమాధాన పఱిచిరి.

క. అన్న యను వాలిచేఁ దన, యన్ను నిమిత్తంబు వెడల • నడువంబడుటన్
బన్నపడి వగచు సుగ్రీ,వు న్నీ ప్రాణేశ్వరుండు • పొలఁతీ! తేర్చెన్. ౩౦

అర్థములు. అన్ను = స్త్రీ, ఇచ్చట భార్య యని యర్థము.

తాత్పర్యము.

తనభార్య నపహరింప వలెనని తన యన్న తన్ను వెడలఁగొట్టఁగా నవమానపడి దుఃఖించు సుగ్రీవుని నీ మగఁడు తల్లీ! సమాధాన పఱిచెను. వాలిసుగ్రీవుల వాస్తవ కలహ కారణ మిదియే.

తే. నీ వియోగవశంబున • నెవ్వగ గొను, రాముచరితంబు వానర•స్వామి కంత
వినిచె సౌమిత్రి యది విని • విగతతేజుఁ, డయ్యె నుపరాగకలిత ప•ద్మాప్తునట్లు.

తాత్పర్యము.

నిన్ను నెడఁబాయుటచే దుఃఖించు రామచంద్రమూర్తి చరితంబు సుగ్రీవునకు లక్ష్మణుఁడు వినిపించెను. అది విని సుగ్రీవుఁడు రాహు పట్టిన సూర్యునివలెఁ దేజోవిహీనుఁ డయ్యెను. విగతతేజుఁడు = సీతా విరహముచే రాముఁడు గతతేజుఁడు = పోయిన తేజము గలవాఁడు, సుగ్రీవుఁడు; విగతతేజుఁడు =విశేషముగ (పూర్ణముగ) పోయిన తేజస్సుగలవాఁడు. ఇటువంటి దంపతుల దర్శనము వారు కూడియుండఁగా

లభింపదయ్యెఁగదా యని గతతేజుఁడై యుండి, రామచంద్రమూర్తి దుఃఖము జూచి విగతతేజుఁ డయ్యెను.

ఉ. పూర్వము మింట రావణుఁడు • పొల్తుక ని న్గొనిపోవువేళ నీ
 వుర్విని వైచినట్టి నగ • లొక్కెడ నేఁ బదిలంబు సేసితిన్
 సర్వము నవ్వి తేర దివ•నప్రభుసూతియుఁ జూపెఁ గాని హృ
 త్పర్వము గూర్ప నీ యునికి•పట్టును మాత్ర మెఱుంగ మంగనా! ౮౩౨

అర్థములు. హృత్పర్వము = హృదయమునకు సంతోషము.

తా త్ప ర్య ము.

పూర్వము రావణాసురుఁడు నిన్ను నాకాశమార్గమునఁ దీసికొని పోవునపుడు నీవు భూమిమీఁద వేసిన యాభరణములను నే నొకచోట భద్రపఱిచి యుంటిని. వాని నన్నిటినిఁ దీసికొని రాఁగ సుగ్రీవుఁడు వానిని రామచంద్రమూర్తికిఁ జూపెఁగాని, యాయన మనస్సు సంతోషించునట్లు చెప్పుటకు నీ వెందున్న దానవో మాకుఁ దెలియదు.

కిష్కింధాకాండము ౧౮౩వ పద్యంబున సుగ్రీవుఁడు తెచ్చి చూపిన ట్లున్నది. ఇచ్చట హనుమంతుఁడు తెచ్చిన ట్లున్నది. హనుమంతుఁడు తెచ్చి సుగ్రీవుచేతి కీయఁగా సుగ్రీవుఁడు కనఁబఱచె నని తెలియ నగు.

ఉ. వానిని జేర్చి యంకమున • వారిజలోచన! నీదుభర్త శో
 కానలదహ్యమానుఁ డయి • యాభరణాళిని గాంచి కాంచి య
 మ్మా! నినుఁ గూర్చి యా వఱచి•న ట్లఱచెన్ వివిధప్రలాపుఁడై,
 నేను విచేతనున్ నృపతి • నెమ్మదిఁ దేర్చితి సాంత్వవాక్యలన్. ౮౩౩

అర్థములు. అంకమునన్ = ఒడియందు, శోకానల దహ్యమానుఁ డయి = శోకాగ్నిచే దహింపఁబడిన వాఁడై, అవు+అఱచినట్లు, విచేతనున్ = స్మృతి తప్పిన వానిని, సాంత్వవాక్యలన్ = ఊరార్చు మాటలచే.

తా త్ప ర్య ము.

ఆ యాభరణములను నొడిలో నుంచుకొని నీ మగఁడు శోకాగ్నిచేఁ గాలిన వాఁడయి వానిని జూచి చూచి, తల్లీ! యావఱచినట్లు నానా విధముల నేడ్చెను. స్మృతి తప్పిన రామచంద్రుని నేనే మూర్ఛ తేఱునట్లు చేసి యూరార్చితిని.

—• శ్రీరాముని విరహతాపము హనుమంతుఁడు సీతాదేవికి జెప్పుట. •—

ఆ. నగలు చూచి చూచి • నగచరపతి కిచ్చె, మఱల వాని నీదు•మగఁడు దేవి!
 నిన్నుఁ బాసి విభుఁడు • నిత్య మగ్నినిగాలు, నగ్నిపర్వతంబు•నటు తపించు. ౮౩౪

మొదట రామచంద్రమూర్తి యవయవ సౌందర్యము నచ్చ చెప్పి యిప్పుడు సొమ్ముల విషయముఁ జెప్పి యా నమ్మకమును బలపఱచెను. నగలు చూచిన పిమ్మట

తన విషయమై యుపేక్ష వహించెనా, ప్రేమగలవాఁడై వర్తించెనా యను విషయము సీతాదేవి ముఖ్యముగాఁ దెలియవలసినది. కావున నా విషయము చెప్పుచున్నాఁడు.

తాత్పర్యము.

ఆభరణములను జూచిచూచి మఱల రామచంద్రమూర్తి సుగ్రీవున కిచ్చెను. నిన్నెడబాసి నీ మగఁడు సర్వదా లోలోపలనే కుములు వహ్నిగల యగ్నికొండవలెఁ దపించుచున్నాఁడు.

'అత్రమాల్యవతే శృంగే। దృశ్యతే హవ్యవాట్సదా,నామ్నా సంవర్తకోనామ కాలాగ్ని ర్భరతర్షభ॥ భారత మాల్యవంతమను పర్వత శృంగమున సంవర్తకుఁ డను వహ్ని సర్వదా కానవచ్చును, అని ప్రమాణము.

క. మగ్నుండై శోకంబున, భగ్నంబుగ నిద్ర చింత • వనరుచు రాముం
డగ్నులచేఁ దపియించెడి, యగ్నిగృహం బనఁగ నున్న•యాతం డబలా! ౮౩౫

లోపల నున్నది నీ కెట్లు తెలిసెను. ఉన్నదో, లేదో లోపల నుండిన వెలు పలికిఁ దెలియదా యందు వేమో శోకంబున మునిఁగినవాఁడై నిద్ర భగ్నమైపోఁగా చింతచే దుఃఖించుచు రామచంద్రమూర్తి యగ్నులచే దపించు వహ్నిహోత్ర గృహమువలె నున్నాఁడమ్మా!

తాత్పర్యము.

నిత్యాగ్నిహోత్రు లగు ద్విజుల యిండ్లలో వహ్నిని సంరక్షింప నొకగది దానికని ప్రత్యేకముగా నుండును. అం దగ్ని యారక మండుచునే యుండును. ఆ కారణమున నాగది సెగలు గ్రక్కుచుండును. ఆ విధముగ నీ మగడు విరహాగ్నిచే సంతప్తుఁ డగుటచే దేహము సెకను గ్రాఁగినట్లు గ్రాగుచున్నది.

ఉ. కానఁడు సౌఖ్య మేమి నినుఁ • గానని వేదనచేతఁ, దాపముం
మానఁడు, త్వద్వియోగదహ•నంబు దహింపఁగ భూమికంపవే
గాన వణంకుకొండ యనఁ•గాఁ జలియించెడి, సంతసింపఁ డో
మానిని ! నిన్నుఁ బాసి సుమ•మంజులకుంజము లెన్ని చూచినన్. ౮౩౬

అర్థములు. భూమికంపవేగానన్ = భూమివణఁకు వేగముచే, సుమమంజుల కుంజములు = పూవులచే రమ్యములైన పొదలు.

తాత్పర్యము.

నిన్నుఁ జూడలేదను తాపము చేత సౌఖ్యము కొంచెమైనఁ గానఁడు. తాపము వదలఁడు. నీ వియోగవహ్ని దహింపఁగ భూకంపముయొక్క వేగముచే వణఁకు కొండవలె వణఁకుచున్నాఁడు. తల్లీ! నిన్ను నెడఁబాసిన కారణముచే రమ్యములైన పూఁబొద లెన్ని చూచినను సంతోషింపఁడు.

తే. హృద్యకాంతారముల నెందు • నేగుచున్నఁ
గ్రమలహరీతరంగిణుల్ • గాంచుచున్న

నిన్నుఁ గానని కతమున • నీరజాక్షి
మానవేంద్రున కరుస మన్ • మాట లేదు. ౨౩౬

అర్థములు. హృద్య = మనోహరములైన, కాంతారములన్ = అడవులందు, కమ్ర = మనోహరములైన, లహరీ తరంగిణుల్ = ప్రవాహములు గల యేఱులను, కతమునన్ = కారణముచే.

తా త్ప ర్య ము.

ఎల్లవారికి మనోహరములైన యడవులందుఁ బోవుచున్నను, మనోహరములుగాఁ బాఱుచున్న యేఱ్లు చూచినను నిన్నుఁ జూడని కారణముచే రామచంద్రమూర్తికి సంతోష మను మాటయే లేదు.

ఉ. అంబుజనేత్ర ! నీపతి ర•ణావని రావణుఁ బుత్రమిత్రయు
క్తంబుగఁ జంపి శీఘ్రముగఁ • గ్రమ్మఱఁ గైకొను నిన్ను, బాస లా
యంబుజమిత్రవంశ్యుఁడును • నబ్జహితోద్భవుఁ డాచరించి రో
యంబ ! వధింప వాలి నిను • నారసి వల్లడ వార్తఁ దేరఁగన్. ౨౩౭

సీతాదేవి తృప్తికై రామ విరహంబు వర్ణించి, ప్రకృత మనుసరించుచున్నాఁడు.

అర్థములు. బాసలు=ప్రమాణములు, అంబుజమిత్రవంశ్యుఁడు = సూర్యవంశమునఁ బుట్టిన రామచంద్రమూర్తి, అబ్జహితోద్భవుఁడు = సూర్యపుత్రుఁ డగు సుగ్రీవుఁడు. క్రమాలంకారము.

తా త్ప ర్య ము.

కమలాక్షి! నీ భర్త రావణాసురుని కొడుకులతోడను, మిత్రులతోడను యుద్ధమందుఁ జంపి నిన్ను మఱల శీఘ్రముగ గ్రహించును. నీ కెట్లు తెలియు ననదవా! వాలిని జంపునట్లు రామచంద్రమూర్తి ప్రమాణము చేసెను. నిన్ను వెదకించి వార్త తెప్పించెద నని సుగ్రీవుఁడు ప్రమాణము చేసెను.

ఉ. బంధుర తేజు లుగ్రరణ•పండితు లా హరినాథుతోడఁ గి
ష్కింధను దాసి వాలి హతుఁ • జేసి యినాత్మజు రాజుఁ జేయుటన్
సంధిగ నైక్య మిల్లోదవె • జక్కఁగ వారికి, వారి దూతుఁడన్
సింధువు నుత్తరించి యిటు • చేరితి రోయుచు నిన్ను మైథిలీ. ౨౩౮

అర్థములు. బంధుర తేజులు = అధిక తేజస్సుగలవారు, ఉగ్రరణ పండితులు= భయంకర యుద్ధమునందుఁ బండితులు; ఇనాత్మజున్ =సుగ్రీవుని, ఐక్యము=సమభావము, స్నేహము, సింధువున్=సముద్రమును, ఉత్తరించి = దాఁటి, రోయుచున్ = వెదకుచు, దూతుఁడు = యోధాదులు బహుళంబుగ స్త్రీసమములు. సు. వ్యా. తత్స. ౨౧. దూత శబ్దము యోధాదులందుఁ జేరినది. ఐక్యము ఈ శబ్దార్థము గుఱించి కిష్కింధ ౧౬-౫ ప. వ్యాఖ్య చూచునది. ఉప్పుగడ్డ నీళ్ళలోఁ బడినేని ఘనత్వము పోయి ద్రవత్వమును బొందునేకాని వాని పరమాణువులు జలపరమాణువులు కాఁజాలవు

సముద్రములో గంగ కలసినను విభజింపరానట్లు కలియునే కాని యొక పరమాణువు మరియొక పరమాణువు కాజాలదు. నామ రూపములు మారినను స్వస్వరూప స్వభావములు మారక భేదింపరాని సమత్వదశకు నైక్యమనిపేరు. తుమ్మెదలు నానా పుష్పముల తేనె లొకచోఁ జేర్చును. మరల దానిని విడఁదీయ సాధ్యపడునా! అట్టి కూడిక నైక్య మనిపేరు. మేఘ గంభీరభాషణంబు లన్నప్పుడు మేఘధ్వని మనుష్యు నకు రాదు. మేఘధ్వనిని బోలిన ధ్వని యని యర్థము.

తా త్ప ర్య ము.

అధిక తేజము గలవారును భయంకర యుద్ధములందుఁ బండితులును, నగు రామలక్ష్మణులు సుగ్రీవునితోడఁ గిష్కింధకుఁ బోయి వాలిని జంపి సుగ్రీవుని రాజు చేయుటచే రామసుగ్రీవులకు స్నేహ మిట్లు కుదిరెను. నేను వారి దూతను. నిన్ను వెదకుచు సముద్రము దాటి యిచటికి వచ్చితిని.

క. హనుమంతుఁడఁ బేరను నా,యినజుఁడు రాజ్యస్థుడై హ•రీశ్వరకోటిన్
నిను వెదకఁగఁ బదిదిక్కుల, కును బంచిన వారు చనిరి • కోమలి నీకై. ౪౮౦

తా త్ప ర్య ము.

నా పేరు హనుమంతుఁడు. సుగ్రీవుఁడు రాజ్యము నంగీకరించిన వాఁడై తాను జేసిన ప్రమాణము ప్రకారము వానరకోట్లను నిన్ను వెదకుటకై పది దిక్కులకును బంపెను. వారును నీకై వెడలి పోయినారు.

ఉ. వాలి తనూభవుండు కపి•వల్లభుఁ డుత్తమశూరుఁ డంగదుం
డోలిఁ ద్రిభాగసైన్యయుతుఁ • డూనె స్వయంబుగ నేతదర్థమై
శైలవరంబు వింధ్యమునఁ • జాలదినంబులు రోసి మేము దు
ర్గాళిని ద్రోవ తప్పి వ్యథ•నార్తిఁ బడం జనెఁ గాల మంతయున్. ౪౮౧

అర్థములు. త్రిభాగసైన్యయుతుఁడు = సైన్యములో మూఁడవ భాగ ముతోఁ గూడిన వాఁడై; సమాసంబున సంఖ్యార్థకము సంఖ్యేయార్థక మగును. తృతీయ భాగ మనుటకు త్రిభాగము. స్వయంబుగన్ = తానే, ఏతదర్థమై = నిన్ను వెదకు కార్యమునకుఁగా.

తా త్ప ర్య ము.

వాలి కుమారుఁడు యువరాజు శూరులం దుత్తముఁడు నగు నంగదుఁడు సేనలో మూఁడవభాగముఁ దీసికొని యువరాజై యింట నుండవలసినవాఁ డయ్యు నిన్ను వెదకవలయు నని తానే పనిపూనెను. మేము వింధ్యపర్వతమునందుఁ జాల దినంబులు వెదకి త్రోవ తప్పి దుఃఖించుచుండ, జాల దినములు గడచెను. ఆ కారణ మున నిచ్చటికి నేను వచ్చుట కాలస్యమయ్యెను. "వింధ్యాత్తు దక్షిణో దేశో దక్షిణాపథసంజ్ఞికః॥ యాదవ॥

క. గుట్టయు గుట్టయు వెదకక, చెట్టును జెట్టును మఱుంగు • చేనుం జేనున్
బట్టుగ వెదకిన జనకుని,పట్టీ! నీయునికి దెలియఁ • బడ దయ్యెఁ జుమీ. ౮౪౩

తాత్పర్యము.

చెట్టు, చెట్టు గుట్ట గుట్ట వదలిపెట్టక చాటుగా నున్న చేను చేను పనిపూని వెదకితిమి గాని, నీ యునికిపట్టు మాకుఁ దెలియలేదు.

క. గడు వేమో గడచనియెను, బుడమితనూజాత యున్న • పోబడిఁ గనమున్
గడుసరి కపిపతి యనువెఱ, విడువఁగ నెంచితిమి మేము • వెలఁదీ యసువుల్.

తాత్పర్యము.

సుగ్రీవుఁ డిచ్చిన నెలగడువు మించిపోయెను. సీతాదేవియున్నజాడ తెలియరాదయ్యెను. కపిరాజు కఠినుఁడు. ఊరకపోయినఁ జంపునని భయపడి మేమే ప్రాణములు విడువ నెంచితిమి.

—• హనుమంతుఁడు సీతాదేవితోఁ దన రాక యునికి దెలిసినవిధంబుఁ జెప్పుట •—

ఉ. అంగదుఁ డంతశోకమున • హా! యనుచున్ నినుఁ గోలుపోవుటల్
భంగము గృధ్రరాజునకుఁ • బ్రాణవినాశము వాలి కబ్బుటల్
శృంగమునందు మా కిటులు • చేకుఱుటల్ స్మృతి, చెప్పికొంచు నో
యంగన! యేడ్చె, నేడ్చిన జ•టాయువుసోదరుఁ డంతయు న్వినెన్. ౮౪౪

తాత్పర్యము.

అప్పు డంగదుఁడు శోకముచే నీ వపహరింపఁబడుటయు, జటాయువు మరణించుటయు, వాలి వధయు, దిక్కులేనివారివలెఁ గొండ శిఖరమున మేము చావవలసి వచ్చుటయుఁ జెప్పుకొనుచు హా యని యేడ్చెను. అమ్మా! యా ధ్వని విని జటాయువున కన్న మా ముచ్చట లన్నియు వినెను.

మ. విని సంపాతి యనంగ గృధ్రపతి వే•వే వచ్చి మా యంతికం
బునఁ గోపారుణనేత్రుఁ డై పలికె మ•మ్ముం జూచి యెవ్వండు నా
యనుజుం జంపె వచింపుఁడీ ప్లవగులా•రా! యన్నఁ దారేయుఁడున్
దనుజుం డాతని నీ నిమిత్తము జన•స్థానంబునం ద్రుంచుటల్. ౮౪౫

అర్థములు. అంతికంబునకున్=సమీపమునకు, కోపారుణనేత్రుఁడై = కోపముచే నెఱ్ఱనయిన కన్నులు గలవాఁడై, తారేయుఁడు = తార కొడుకగు నంగదుఁడు.

తాత్పర్యము.

ఆ గ్రద్ధరాజు పేరు సంపాతి. అతఁడు త్వరత్వరగా మా సమీపమునకు వచ్చి కోపముచే నెఱ్ఱ నగు కన్నులు గలవాఁడై నా తమ్ముని జంపినవాఁ డెవ్వఁడు వానరులారా! చెప్పుఁ డని యడుగఁగా నంగదుఁడు నీ నిమిత్తమై రావణుఁడు జటాయువును జంపెనని చెప్పెను.

ఉ. అంతయు నాడె; నాడ నరు•ణాత్మజుఁ డార్తి వహించి నీదువృ
త్తాంతముఁ బల్కె రావణుని • ధామమునందు వసించి యుండుటల్
సంతస మార దాని విని • చయ్యనఁ గీశులు లేచి తన్నగ
ప్రాంతముఁ బాసి చేరిరి మ•హాంబుధి యుత్తరతీరధారిణిన్. ౭౪౬

అర్థములు. ఆడన్ = చెప్పఁగా, అరుణాత్మజుఁడు = అనూరుని కొడుకు, ధామమునందు = ఇంట.

తాత్పర్యము.

సర్వము చెప్పఁగా విని యనూరుని కొడుకగు సంపాతి దుఃఖపడి నీవు రావణాసురుని యంతఃపురమునం దున్న వార్త చెప్పెను. వానరు లందఱు నా వృత్తాంతము విని సంతోషించి లేచి యా కొండ శిఖరము విడిచి సముద్రముయొక్క యుత్తరపు టొడ్డు చేరితిమి.

ఉ. చిత్తము నిన్నుఁ జూడఁ ద్వర • సేయుచు నుండియుఁ గంధిదర్శనం
బుత్తలపాటు గూర్పఁ బ్లవ•గోత్తమపాళికి, నంత నేను లో
హత్తిన ధైర్యసారమున • నామడ లొక్క-శతంబు దాఁటి దై
త్యోత్తము వీడు సొచ్చి నిశ • నొయ్యన రావణు నిన్నుఁ జూచితిన్. ౭౪౭

అర్థములు. కంధి=సముద్రము, ఉత్తలపాటు=కలఁత, నిశన్ = రాత్రియందు.

తాత్పర్యము.

నిన్నుఁ జూడవలయు నని మాకెంత తొందర పాటుండినను సముద్ర దర్శనము వానరులకు మనోవ్యాకులత్వము గలిగించెను. అప్పుడు నేను ధైర్యము సాహసము గలవాఁడనై నూఱామడ సముద్రమును దాఁటి రావణు నగరము ప్రవేశించి రాత్రి యందు రావణు, నిన్నుఁ జూచితిని.

చ. కలది వచించినాఁడ, మదిఁ • గాతరభావము మాని ధీరతం
బలుకుము, నన్ను నమ్ముము, నృ•పప్రవరోద్యమ మూని నీకుఁగాఁ
జెలి! యరుదెంచినాఁడఁ, గపి•శేఖరుమంత్రిని, వాయుపుత్రుఁడన్
జలజహితాన్వవాయనృప•సత్తము రామునిమాట సాధ్విరో ! ౭౪౮

అర్థములు. కాతరభావము = భయము, నృపప్రవరోద్యమము = రాజశ్రేష్ఠుఁడగు రామచంద్రుని ప్రయత్నము, జలజహితాన్వవాయ = సూర్యవంశమువాఁడగు; వాయుపుత్రుఁడన్=వాయుదేవుని కుమారుఁడను, 'నమస్తే వాయో - త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి' యను శ్రుతివాక్య మిట ననుసంధించునది. జగత్తునకుఁ బ్రాణమైన ప్రత్యక్ష బ్రహ్మముయొక్క కుమారుఁడను. దీనిచేఁ దన యుత్తమ కుల ప్రసూతి చెప్పినవాఁ డయ్యెను. దీనివలన నుత్తమ కులమునఁ బుట్టినవానిని గాని, గురువుగా గ్రహింపరాదని యేర్పడుచున్నది. ఆనుపూర్విగ వంశపరంపర చెప్పలేని

గురువును గురువుగా గ్రహింపరాదు. అట్లు చెప్పలేనివారు నీచకులులుగాను, నీచ మతిమువారు గాను నుందురు.

తా త్ప ర్య ము.

సాధ్వీరత్నమా! వా స్తవము చెప్పినాఁడను. నీవు భయము వదలి ధైర్యముతో మాటలాడుము. నన్ను నమ్ముము. నా యందు మాయలేదు. రామచంద్రమూర్తి కార్యము నిర్వహింప నీ నిమిత్తమై వచ్చినాఁడను. వానరరాజు మంత్రిని. వాయు దేవుని కుమారుఁడను. సూర్యవంశపు రాజగు రామచంద్రమూర్తి దూతను.

క. మీ రాముని కఖిలాయుధ, వారభృదగ్రణికి సుఖము • వర్ణితగుణ ! గు
ర్వారాధన యుక్తుం డగు, వీరుఁడు సౌమిత్రి సుఖితి • వెలసెడి నమ్మా! ౮౪౯

అర్థములు. అఖిలాయుధవారభృదగ్రణికిన్ = ఆయుధములు ధరించు నందఱిలో మొదటివానికి; వర్ణితగుణ=కీర్తింపఁబడు గుణములు కలదానా ! గుర్వా రాధనయుక్తుఁడు = అన్న సేవతోఁ గూడినవాఁడు, సుఖితిన్ = సౌఖ్యముచే.

తా త్ప ర్య ము.

అమ్మా! ఆయుధములు ధరించువారిలో శ్రేష్ఠుఁడగు నీ భర్తకు రామచం ద్రమూర్తికి సుఖము. కీర్తింపఁబడు గుణములు గలదానా ! లక్ష్మణుఁడు అన్న సేవ చేయుచు సుఖముగా నున్నాఁడు.

క. నీ విభు హిత మెంచుచు సుగ్రీవుని నుడి దక్షిణముగ • క్షితిజా ! నిన్నున్
నే వెదకుచు ననహాయుఁడ, నై వచ్చితి నిన్నుఁ గంటి • నతిపుణ్యమునన్. ౮౫౦

అర్థములు. నుడిన్ = మాటప్రకారము.

తా త్ప ర్య ము.

నీ భర్త మేలుగోరి సుగ్రీవుని మాటప్రకారము దక్షిణపు దిశగా నిన్ను వెదకుచు వచ్చితిమి. అందు నా పూర్వ పుణ్యాతిశయమున నేను నిన్నుఁ జూడఁగలిగితిని.

చ. నినుఁ గనలేని దుఃఖమున • నివ్వెఱఁగూరిన కీశపాళికిన్
వినిచి నినుం గనుంగొనుట • వే తొలంగించెద దుఃఖ మెల్ల, నో
జనని ! సముద్రలంఘనము • సార్థక మయ్యెను బుణ్యసంపదన్
హనుమ డొకండె కాంచె జన•కాత్మజ నన్యశ మేను గాంచితిన్. ౮౫౧

తా త్ప ర్య ము.

నిన్నుఁ జూడలేక పోయితిమి గదా యను దుఃఖమున మిగుల భయపడుచున్న వానరసమూహమునకు నేను నిన్నుఁ జూచిన వార్త తెలిపి వారి దుఃఖ మంతయుఁ బోఁగొట్టెదను. తల్లీ ! నేను సముద్రము దాటుట సఫల మయ్యెను. నా పుణ్యాతి శయముచే హనుమంతుఁ డొక్కఁడే సీతాదేవిని జూడఁగలిగె నను కీర్తిని సంపాదించి తిని.

—• హనుమంతుఁడు సీతాదేవికిఁ దన జన్మవృత్తాంతముఁ జెప్పుట. •—

క. వీరుఁడు రాముఁడు సహహరి,వారున్ సహమిత్రుఁడునిన్ స•బాంధవుని ర
క్షోరాజుఁ జంపి పోరన్, వారక గ్రహియించు నిన్ను • నమ్ముము దేవీ! ౮౨

ఇంతవఱకుఁ దాను రామచంద్రమూర్తి పంపున దూతనై వచ్చిన వార్తఁ దెలిపి యిఁకఁ దన జన్మచరిత్ర చెప్పుచున్నాఁడు. ఏలన:—

"యస్య నజ్ఞాయతే శీలం, కులం తస్య చ సంశ్రయమ్
న సంగతిం కుర్యా, దిత్యువాచ బృహస్పతిః॥

ఎవనియాచారము, స్వభావము, కులము నెవరి యొద్ద నెచ్చోట నుండునది తెలియదో వానితోడఁ గూడియుండరాదు, అని బృహస్పతి చెప్పెను. కావున స్నేహముచేసినను గలసి మెలసి యుండవలసి వచ్చినను గులహీనునితో నాచారహీనునితో సదాశ్రయము లేనివానితో నట్లు చేయరాదు గనుకఁ దన విషయము చెప్పుచున్నాఁడు. తన కులము, గుణము,ఊరు, నిజమైన పేరు, దాఁచువానిని నమ్మి దగ్గఱఁ జేరరా దన, నిఁక వానిని గురువుగా గ్రహింపవచ్చునా. కావున శిష్యులును గురువు వంశాదులను, వారి పుట్టుపు పూర్వోత్తరములను విచారింపవలెను.

తా త్ప ర్య ము.

వీరుఁ డగు రామచంద్రమూర్తి పరివారముతోను, మిత్రులతోను జుట్టములతోను గూడిన రావణుని యుద్ధమునందుఁ జంపి నిన్ను గ్రహింపఁగలఁడు. నా మాట, దేవీ ! నమ్ముము.

సీ. మాల్యవంతం బను•మహితభూధరమున, జనని! నాతండ్రి కే•సరి వసించుఁ
జనిమొ గోకర్ణాఖ్య•శైలంబున కతండు, నట శంబసాదనుఁ • డనెడి దైత్యు
దేవర్షిసంఘుని•ర్దిష్టుఁడై వధియించె, నతనిక్షేత్రంబున • ననిలునకును
జనియించినాఁడను•స్వకృతకర్మంబుకఁ, హనుమంతుఁ డను నామ • మమరె నాకు,

ఆ. నీవు నమ్మఁపొంచు•నీ నాథుగుణముల, నెల్లఁ బలికినాఁడ • నిచటనుండి
నిన్నుఁ దోడుకొనుచు • నీవల్లభుం డేగు, భయపడంగ వలదు • భవ్యశీల! ౮౩

తా త్ప ర్య ము.

మాల్యవంత మను గొప్ప పర్వతము గలదు. అందు నా తండ్రి కేసరియను వానరరాజుండును. ఆయన యొకసారి దేవఋషుల సంఘముచే నాజ్ఞాపింపఁబడినవాఁడై శంబసాదనుఁడను దైత్యుని జంప గోకర్ణమను పర్వతమునకుఁ బోయి వానిని జంపెను. ఈ విధముగ మా తండ్రి తరమునుండి రాక్షసులకు మాకు విరోధమే. ఆయన భార్యయందు వాయుదేవునకు నేనుజన్మించితిని. నేను స్వయముగఁ జేసిన కార్యముచే నాకు హనుమంతుఁ డను పేరువచ్చెను. నీవు నమ్ముకొఱకు నీ భర్త గుణములను నన్నిటిని జెప్పితిని. నిన్నిచ్చటనుండి నీ ప్రియుఁడు తోడుకొని పోవును. నా మాట నమ్ముము.

ఇది యాచార్యకృత్యము. శిష్యునకు భగవద్విషయము నంతయు సమగ్రముగఁ జెప్పి నీవు భయపడ వలదు. నిన్ను భగవంతుఁడు తన యొద్దకు స్వయముగా వచ్చి తీసికొని పోవును. భయపడ వలదు. కాలమునకు వేచి యుండుము. నీవు మాత్రము సదాచారము, భక్తి విశ్వాసములు మానవలదని చెప్పును. భవ్యశీల యను సంబోధన మీ యర్థ మిచ్చుచున్నది. గురుపరంపరయుఁ జెప్పినవాఁడయ్యెను.

చ. అనవుడు విశ్వసించె జన•కాత్మజ యాతని దూతగా మనం
బున, గడు సమ్మదాశ్రువులు • ముమ్మర మై ప్రవహించె వాలుఁగ
న్గొనలను, రాహుముక్త శశి•కోపున మోము వికాస మందె, వా
నిని దలపోసె నిక్కపు వ•నేచరుఁ డంచు నపాస్తశంక యై. ౮౫౪

తా త్ప ర్య ము.

ఇన్ని విధములఁ జెప్పఁగా సీతాదేవి హనుమంతుని రామచంద్రమూర్తి దూత యని నమ్మెను. నిడుపాటి కన్నుల కొలకుల నుండి సంతోషబాష్పములు విశేషముగఁ బ్రవహించెను. ముఖము రాహువుపట్టి విడిచిన చంద్రునివలె వికాసము నొందెను. సందేహమువదలి వీఁడు నిజముగా రామదూత వానరుడని నమ్మెను.

ఈ విధముగ శిష్యులు గాఁగోరువారు గురువుల మని వచ్చువారిని బరీక్షింపక గ్రహింపరాదు.

క. దానిని గని హనుమంతుఁడు, మానవతీమణికి ననియె • మఱలి చనియెదన్
జానకి! యూఱడుమీ నీ, కే నేమి యొనర్తు నెద్ది • యిష్టము చెపుమా. ౮౫౫

తా త్ప ర్య ము.

ఈ ప్రకారము సీతాదేవి తన్నుఁ దన మాటలను నమ్ముటయు, సంతోషించుటయుఁ జూచి యమ్మా! మఱలి నేను రామచంద్రు నొద్దకు నీ వార్తఁ దెలుపఁబోవలసి యున్నది. నీకేమి సాహాయ్యము చేయుమనెదవు, చెప్పుము. ఊఱడిల్లుము తల్లీ! ఊరడిల్లుము. నీ యిష్టము చెప్పుము. చేయుదు ననుటచే శిష్యుని సందేహములన్నియు గురువు దీర్పశక్తిగలవాఁడై యుండవలె నని యేర్పడుచున్నది.

క. పవనతనూజుఁడ నగుటను, జవబలగరిమములఁ దండ్రి • సరిపోలుదు నో
యవనిజ! కపిమాత్రుఁడ నని, తలులుట సందియము నీకుఁ • దగదు సుశీలా!

తా త్ప ర్య ము.

నేను వాయుపుత్రుఁడ నగుటచే వేగాతిశయము చేతను, బలాతిశయము చేతను తండ్రికి సమానుఁడను. వీఁడు సామాన్య వానరుఁడు, ఏమి చేయఁగలఁ డని సందేహించుట సత్స్వభావము గల నీకుఁ దగదు.

పవన తనూజుఁడను = పునాతి - పవనః; పవిత్రము చేయువాఁడు, అట్టి వాని కొడుకను. ఆయన గుణములు నాయందుఁ గలవు. కావున నోరు అపవిత్రములగు కార్యము గాని, మాటలు గాని నేను చెప్పనని భావము. నీవును సుశీలవు కావున

నీ కింతదూరము చెప్పఁబూనితిని గాని నీ వడవడి సరిగా దేని నీతో నేను మాట లాడి యుండ నని సుశీలాశబ్దము స్ఫురింపఁ జేసెడిని.

—• ౩౬-వ సర్గము. హనుమంతుఁడు సీతాదేవికి శ్రీరామముద్రిక నిచ్చుట •—

ఉ. ఇంకను నమ్మవేని జన•కేశ్వరనందిని! చూడు రామనా
మాంకిత మైన యుంగరము•నాదటఁ బంచె నతండు దీని నీ
కింకరుచేత నీదు మది•కిన్ ఘటియింపఁగ నమ్మకంబు నీ
యంకిలి దీఱు నం చొసఁగ • నా యమ గైకొని దానిఁ బ్రీతితోన్. ౪౫౭

అర్థములు. రామనామాంకితము = శ్రీరామ యను నక్షరములు చెక్కఁ బడినది. అంకిలి = కలఁత, వ్యాకులత్వము, ఆయమ = అంతవఱకు వీఁడు రావణుఁ డని సందేహించి హనుమంతుని ప్రక్క చూడకుండిన యా సీత ప్రీతితోఁ గైకొని = ఇదియేమి మాయయో, యే కమసాలిచేతఁ జేయించుకొని వచ్చెనో యని భీతిచే నిరాకరింపక ప్రీతిచేఁ జేతఁ దీసికొనెను.

కై+కొను = చిరకాలమున విడిచిపోయిన బంధువు అప్పుడు తటాలున రాఁగానే సంతోషముచే నతని చేతులు పట్టుకొని యాదరించినట్లు చేకొని.

తాత్పర్యము.

జనకరాజు కూతురా! నామాటయందు, నా యందును నీకింకను సందేహము గలదేని శ్రీరామచంద్రమూర్తి పేరు చెక్కఁబడిన యీ యుంగరమును జూడుము. దీనిని నీ కింకరుఁ డగు నాచేత నీ కిమ్మని నీవు దీనిని జూచిన నీకు నాయందు నమ్మకము గలుగు నని ప్రేమతో నిచ్చి నీయొద్దకుఁ బంపెను. దీనిచే నీమనోవ్యాకులత్వముఁ దీరు నని యీ యుంగరమును నామె కిచ్చెను. ఆమెయు దానిని సంతోషముతోఁ గైకొనెను.

దీని వలన సంశయచిత్తులకు, శ్రద్ధచాలని వారికి రామమంత్ర ముపదేశింపరా దని యేర్పడుచున్నది. సీతాదేవి సందేహము దీరె ననియు, శ్రద్ధగలదయ్యె ననియు ౪౫౭ వ పద్యంబునఁ జెప్పఁబడెను. ఆ యమ గైకొని దానిఁ బ్రీతితో ననుటచేఁ దారకమంత్రము దొరకెను, ధన్యుఁడనైతి నని సంతోషమున గురూపదిష్ట మంత్ర మును శిష్యుఁడు గ్రహింపవలె నని యేర్పడు చున్నది. నా కిది చెప్పు, మిది చెప్పు మని యడుగరాదు. గురు వనుగ్రహించినది గైకొనవలెను.

ఈ విధముగ సీతాంజనేయుల చర్యవలన శిష్య లక్షణము, గురు లక్షణము ముముక్షు హితచర్య, భగవన్మంత్రప్రాప్తి చెప్పఁబడెను.

చ. పతికరభూషణంబుఁ గని • పద్మదళాక్షి ముదంబు నొందెఁ దాఁ
బతియె సమక్ష మచ్చుటికి • వచ్చినయట్లుగఁ, దామ్రశుభ్రభా

సితనయనాంచితం బయిన • శ్రీముఖ మెంతో వికాస మొందె న
ద్భుతగతి రాహుముక్త పరి • పూర్ణ సుధాకరబింబమో యనన్. ౮౫౮

అర్థములు, తామ్ర = కనుగొలుకులందు నెఱ్ఱని కాంతిచేతను, శుక్ర=కంటి గ్రుడ్డుచుట్టు తెల్లని కాంతిచేతను, భాసిత = ప్రకాశించు, నయన+అంచితంబు = కన్నులచేఁ బ్రకాశించు, శ్రీముఖము=శోభాయుక్తమైన ముఖము, రాహుముక్త= రాహువుచే విడువఁబడిన, పరిపూర్ణ = నిండు, సుధాకరబింబము = చంద్రబింబము. ఉత్ప్రేక్షాలంకారము. తాత్పర్యము.

తన మగఁడు హస్తమున ధరించు నాభరణంబులఁ జూచి తన మగఁడే యెదు రుగ వచ్చిన విధముగఁ దలంచి మిక్కిలి సంతోషించెను. ఎఱుపు తెలుపు గల కన్ను లచేఁ బ్రకాశించు నామె ముఖము రాహువు విడిచిన చంద్రబింబమువలె వికాసము నొందెను.

భర్తృవియోగదుఃఖమే రాహువు.

పతికరభూషణంబు = పాణిగ్రహణ సమయంబునఁ దొలుత నా చేతిని రామ చంద్రమూర్తి పట్టుకొన్నప్పుడు నన్ను స్పృశించిన ప్రథమాభరణ మిదియే కదా. నేను ప్రణయకోపము వహించినపుడు నన్ను శాంతిపఱుప నాభర్త గడ్డము పట్టు కొని సమాధానపఱచువేళ నన్ను స్పృశించిన దీ యుంగరమే కదా! నన్నుఁ గౌఁగి లింపఁగోరి కౌఁగిలించు నప్పుడు తనమేని యాభరణములు హారములు లోనైన వన్ని తొలగించి నప్పుడును వదలక యుండిన దీ యుంగరమే కదా. ఇరువురకుఁ బ్రణయ కోపము వచ్చి మాటలాడక బిగించుకొని యుండి నపుడు మఱల నన్ను మాటాడింపఁ గోరి యీ యుంగరమును నేల విడువఁగా నది నెపముగా నీ యుంగరము నేలఁబడి నది తీసికొనుఁ డని దాని నందిచ్చు నెపమున మమ్ముఁ గలిపిన దీ యుంగరమే కదా. వివాహకాలమున నాతోడ మా తండ్రి యిచ్చిన కారణముచే వరణ్యమునకు వచ్చు నపుడు సర్వాభరణములను వదలియు నన్నుఁబోలెఁ దనతోడ తెచ్చుకొన్న దీ యుంగ రమే కదా. పచ్చకప్పురపుఁ దిప్పల వెన్నెల కుప్ప లాడునపు డొక కుప్పలో దీనిని నా భర్త దాఁచి యుంచఁగాఁ గనిపెట్టి నేను దెచ్చి యిచ్చుచుండున దీ యుంగరమే కదా. అని యిట్లనేకములు తలంపులు పూర్వకృత్యములు మనస్సునకురాఁగా నుంగరమును బట్టి చేయి, ఆ మూలమునఁ గ్రమక్రమముగ నాకారమంతయు స్పష్టముగ భావనాతిశయబలమున గోచరింపఁగా భర్తయే యెదుట వచ్చి నిలిచెనని కౌఁగిలింపఁబోయె నని, రామచంద్రమూర్తి సమక్ష మచ్చుటికి వచ్చినట్లని కవి గూఢ ముగ సూచించెను. ఈ క్రమము భగవన్మూర్తి ధ్యాన సోపాన మార్గమును దెలుపు చున్నది ఇది శిష్యుని యుత్తరకార్యము. భగవన్మూర్తి యెదురుగ వచ్చి నిలచి నట్లు తోఁచువఱకు నిట్లుపాసింపవలెను. అప్పుడు రామచంద్రమూర్తియే వచ్చి యుండిన సీతాదేవి కౌఁగిలింపక యుండునా ?

పద్మదళాక్షి = పద్మము ముకుళించి యుండిన రేకులు తెలియరావు. కావున విచ్చిన పద్మ మనియే చెప్పవలెను. దాని వలన సీతాదేవియు సూర్యుని జూచిన కమలమువలెఁ దన ముఖమును వికాసింపఁజేసెనని భావము. ఉంగరమును జూచినంత మాత్రమునకే ముదంబు చెందిన సీత యిఁక రామాగమనము రావణవధ పునస్సంగమము గలిగిన నెంత యామోద ప్రమోద సమ్మోదములు గాంచునోకదా యని సూచన.

తామ్ర శుక్ల నయనంబులు=రక్తవర్ణము. నీ విన్నిది నాలు నన్ను పేక్షించి తివిగదా యని కోపమును - స్వయంకృతాపరాధమునకు నాయన వననేల యని శుక్లవర్ణము శాంతిని గన్నులు సూచించెను.

క. హ్రీమతి బాలామణి పతి, సేమము సందేశవార్తఁ • జెప్పఁగఁ గపియున్
సామోదంబుగ విని యా,సామీరిని గౌరవించి • స్తవ మొనరించెన్. ౬౫

అర్థములు. హ్రీమతి = లజ్జగలది. తనయందు భావోదయము, భావోల్బణము, భావశాంతి తాను జవాలున లేచి భర్తను గాగలించుకొనఁ బోవుట యీ చేష్టలను హనుమంతుఁ డే మనుకొనునో యని సిగ్గుపడెను.

మీఁదఁ జెప్పిన విషయము కవిహృదయము. కాదేని యిచ్చట 'హ్రీమతి' వ్యర్థవిశేషణము, అప్రస్తుత మగును. సిగ్గు పడవలసిన వేళు కారణము లేదు. ఈ యర్థమును బాలామణి యను శబ్దము బలపఱచుచున్నది. సీత యిప్పుడు ముప్పది రెండేండ్లది కావున బాలనాయిక కాదు. అట్లుండియు బాలామణి యనుటచే నా సమయంబున ముగ్ధనాయికయందలి గుణము లజ్జ యామెయందుఁ గానవచ్చె నని భావము.

'ఉదయ ద్యౌవనా ముగ్ధా లజ్జావిజిత మన్మథా' యని కదా ముగ్ధ లక్షణము. సామోదంబుగన్ = ఆమోదముతోఁ గూడినట్లుగ, తొలుతటి మోద మిప్పు డామోద మయ్యెను. సామీరి = సమీర కుమారుఁడు = ఆంజనేయుఁడు. సమీరుఁ డనఁగా 'సమ్యక్ ఈరతి - సమీరః' యని వ్యుత్పత్తిప్రకారము చక్కఁగాఁ జెప్పువాఁ డని యర్థము.

"వ్యాహర త్యభిధ త్తే భిదధా తీరయతీ త్యపి" యని క్రియానిఘంటువు. కారణ గుణము కార్యమం దుండును, గావున ప్రియ వక్తృత్వ మాంజనేయునందుఁ గలదని భావము. స్తవము = స్తోత్రము. స్తవ మొనరించె ననుట గురుస్తోత్రము గురు మాహాత్మ్య వర్ణనము దెలుపుచున్నది. భగవన్మూర్తి సాక్షాత్కరింపఁ జేసిన గురువు నెంత స్తోత్రము చేసినను గొఱతయే.

తాత్పర్యము.

లజ్జావతి యగు నా బాలిక పతిక్షేమము, పతివార్త కపీశ్వరుఁడు చెప్పఁగా

మిగుల సంతోషముతో విని, ప్రియవాక్యములు చెప్పు నాంజనేయుని సన్మానించి యిట్లు స్తోత్రము చేసెను.

“ఆత్మజ్ఞ మర్చయే ద్భూతికామః” అను శ్రుతి వాక్య మిట ననుసంధించునది.

—• సీతాదేవి హనుమంతునిఁ బ్రశంసించి శ్రీరామాదుల కుశలం బడుగుట. •—

సీ. జలనిధి యోజన•శతము గోష్పదముగా, లంఘించి యొక్కఁడ లంకఁ జొచ్చి
నీవె శూరుండవు • నీవె సమర్థుండ, వీవె ప్రాజ్ఞుఁడవు • కపీంద్రచంద్ర !
సామాన్యవానరుఁ•గా మది నమ్మంగఁ, జాల రావణుఁ డన • సంభ్రమంబు
సంత్రాసమును లేమి • సమభిభాషింపగఁ బావని తగుదువు • ప్రాణనాథుఁ
తే. డైన శ్రీరామునకుదూత • వగుటఁ జేసి; పంపఁ డతఁ డపరీక్షితుఁ• బవనతనయ!
యందులోపల నా కొఱ • కంపునప్పుడు, పటుపరాక్రమవంతునిఁ • బంపుఁ గాని.

అర్థములు. సంభ్రమంబు = తొట్రుపాటు, సంత్రాసము = భయము, సమభి భాషింపఁగన్ = ఆంజనేయుఁడు ౨౧౬ వ పద్యంబున నభిభాషింపు మని కోరెను. దాని కిది ప్రత్యుత్తరము. భాషించుట యనఁగా నీ వెవ్వరనిన నీ వెవ్వరని క్రొత్త వారి వలె నేవో ముచ్చటలాడుట. అభి భాషించుట, యనఁగాఁ బరిచితులగు వారు చేయు కుశల ప్రశ్నాదికము. సమభిభాషించుట యనఁగా నితరు లెవ్వ రెఱుఁగని యంతఃపుర రహస్యములు కూడఁ జెప్పుట. దశరథుఁ డను రా జని హనుమంతుఁడు చెప్పుట ౭౮౧ మొదలు పద్యంబులఁ గలదియు ౭౮౮ పద్యము మొదలు గలదియు భాషణము. ౭౯౬ మొదలుగాని యభిభాషణము. ఇఁకఁ జేయఁబోవునది కాకాసుర వృత్తాంతము, తిలక వృత్తాంతము సమభి భాషణము. నీ వభిభాషింపు మని కోరితివి గాని సమభిభాషింప నీవు యోగ్యుఁడవు.

ఏల ననఁగా:—పావని యనుటచే, పావని = (౧) ఆంజనేయుఁడు (౨) పవిత్రుఁడు. ఉపసర్గముల గుఱించిన యీ సూత్రము లిచ్చట ననుసంధింపనగు. “ఉపసర్గేణ ధాత్వర్థో బలా దన్యః ప్రతీయతే। ప్రహారాహార సంహార విహార పరిహారవత్॥ ధాత్వర్థం బాధతే కశ్చి త్కశ్చిత్త మనువర్తతే।తమేవ విశినష్ట్యన్య ఉపసర్గ గతి స్త్రిధా” అను సూత్రముల ననుసరించి యీ యర్థము సాధితము.

తాత్పర్యము.

నూఱామడ గల సముద్రమును గోష్పాదమంత గుంటవలె దాఁటి యొక్కఁడవే లంకలోఁ బ్రవేశించితివి. వానరేశ్వరా? నీవే శూరుఁడవు. నీవే కార్యసాధకుఁడవు. నీవు మహాబుద్ధిమంతుఁడవు. రావణుఁ డనిన నందఱుఁ దత్తఱపాటు నొంద నీవు వాఁ డనిన తొట్రుపాటు పడవు. భయముపడిన వాఁడవు కావు. కావున నిన్ను నన్ని క్రోఁతులవంటి క్రోఁతి వని నేను నమ్మలేను. నా ప్రాణనాథుఁ డైన శ్రీరామచంద్రమూర్తికిఁ బావనీ ! నీవు దూతవు గావున నీతో రహస్యవిష

యములైన చెప్పుటకుఁ దగుదువు. ఏలన శ్రీరామచంద్రమూర్తి సామాన్య కార్యములకే పరీక్షించి గాని దూతను బంపఁడు. అందు నా యొద్దకుఁ బంపునప్పుడు విశేష పరాక్రమము గలవానిని బంపును గాని దుర్బలునిఁ బంపఁడు. నా మగఁడు వచ్చిన బంటు గావున నీవు రహస్యవిషయములు గూడఁ జెప్పఁదగుదువు. శూరుఁడవు, సమర్థుఁడవు, ప్రాజ్ఞుఁడవు అను పదంబులు జ్ఞానశక్తి బలంబులఁ దెలుపుచున్నవి. అనాయాసముగ జలనిధి లంఘించి యనుట బలమును, ఒక్కఁడవే యనుటచే సామర్థ్యమును, లంకఁ బ్రవేశించి నన్నుఁ దెలిసికొనుటచే జ్ఞానమును దెలుపఁబడెను. కపి + ఇంద్ర+ చంద్ర = కపి = సూర్యుఁడు- జలమును పానమును చేయువాఁడు; కపయో ర్కే-భ వానరాః" నానా. ర. ఈ మువ్వురగుణములు నీయందున్నవి. తపింపఁజేయు సూర్యుని వలె నీవు శూరుఁడవు. ఇంద్రునివలె సమర్థుఁడవు. మనోధిష్ఠాన దేవత యగు చంద్రుని వలెఁ ప్రాజ్ఞుఁడవు. సంత్రాసము = అంత సముద్రమునకు - ఇంతటి రావణునకు భయపడవైతివి. ఇఁక నిన్ను భయపెట్టునది యేది కలదు ?

పటు పరాక్రమవంతునిఁ బంపుఁగాని, ఇచ్చట గాని యేవార్థక బోధకము పటుపరాక్రమవంతునే పంపును. అట్టివాఁడు కాని వానిని బంపడని యర్థము. కాని, యనుక్త వాక్య పదగ్రాహకం బగు నవ్యయము. (ప్రౌ. వ్యా. వా. ౧౮ సూ).

హనుమంతునియందు జ్ఞానశక్తి బలములు మూఁడుగుణములు గలవని యిందుఁ జెప్పఁబడెను. వీర్యము తేజస్సు యుద్ధకాలమునఁ జెప్పఁబడును. కావుననే నీవు రామునంతటి వాఁడవని జాంబవంతుఁడు చెప్పెను.

సీ. సత్యసంగరుఁడు కౌ•సల్యాతనూజుండు, కుశలిగా నా భాగ్య•వశతఁ దండ్రి !
యనుపమగుణ సుమి•త్రానందవర్ధనుం,డా లక్ష్మణుఁడు సుఖ•యా హితేంద్ర !
రాముండు కుశలియేన్•భూమివార్థులఁ గాల్చి, తేకుగా కల్పాగ్ని•లీలఁ గినిసి !
కాకేమి శూరులు • నాకుల గెల్వరే, కలనిలో నా పాప•ఫలము గాక
తే. యున్నవాఁడు గదా రాముఁ • డన్న ! చెపుమ
మద్వియోగవ్యథార్తిని • మఱఁగకుండ ?
నాకుఁగాఁ బరితాప మం•దండు గాదె ?
యెంచునా మీఁదికార్యంబు • లెన్నఁడైన ? ౪౬౧

అర్థములు. సత్యసంగరుఁడు = (౧)యథార్థమైన ప్రతిజ్ఞగలవాఁడు. (౨) 'సామనె నిను నాత్మజ్ఞుఁడు, భ్యాతివలెన్ నీవు నేల కళవళ పడఁగన్' అని చెప్పెనే, అట్టివాఁడు నన్ను విడిచియున్నాఁడె ఇదియా సత్యప్రతిజ్ఞత్వము. ఇది వక్రోక్తి యని గ్రహించునది. కౌసల్యాతనూజుండు కాని దశరథతనూజుఁడు కాఁడు. దశరథుకొడుకైన నొకల నాయనయం దుండు బలపరాక్రమ శౌర్య సత్యసంధత లేవి లేవే. అఁడుదానియం దుండు గుణము లున్నవే. కౌసల్యాతనూజుండు = కౌసల్య కడుపునఁ బుట్టి యామె నేమి సంతోషపెట్టెను, ఇఁక నన్ను సంతోషపెట్టుటకు ?

ఆమె యక్కడ నేడ్చు చున్నది. నే నిక్కడ నేడ్చుచున్నదానను. కుశలిగా నా భాగ్యవశాత = నా భాగ్యవశమున బాగున్నాఁడుకదా! ఆయన యెందైన నుండనీ బాగున్నాడుకదా! నాకంతే చాలు. నే నెట్లు పోయిన నాయనకేమి? కౌసల్యా తనూజుండు కుశలియా = నేను నిర్భాగ్యురాలనే. ఆమె కడుపు చలువచేతనైన క్షేమముగా నున్నాఁడుకదా. అదియే నాపాలికి భాగ్యము. తండ్రీ! తండ్రితోఁ జెప్పు కొన్నట్టు సిగ్గు బిడియము విడిచి తండ్రివలె నన్నాదరించి నా కష్టములు తొలగించెద వని చెప్పుకొనుచున్నాను. గాని పరాయివాఁడవు కూత వని నేను జెప్పఁ బూనలేను. మగఁడు వదలిన ఆఁడుబిడ్డలు తమ దుఃఖమును దండ్రితోఁ జెప్పుకొనక మఱి యెవరితోఁ జెప్పుకొందురు?

అనుపమగుణి = అసమానమైన గుణములుగలవాఁడు. రామునివలె నొకటి చెప్పి మఱియొకటి చేయువాఁడు గాఁడు. ఎంత చెప్పునో యంతే చేయువాఁడు. సుమిత్రానందవర్ధనుఁడు = రామచంద్రమూర్తి యడవికివచ్చి తల్లిని దుఃఖపెట్టెను. లక్ష్మణుఁ డన్న వెంట వచ్చి తల్లిని సంతోషపెట్టెను. అటువంటి లక్ష్మణుఁడు రామ దాస్యమే చిహ్నముగాఁ గలవాఁడు, రామునకుఁ గష్టము దోఁపనీయక సేవ సేయుటే సుఖముగా నెంచు చున్నాఁడు గదా. హితేంద్రా = నా హితము కోరు బంధువు లున్నారు. ఏమి లాభము! అక్కఱవేళకు నీ వాదుకొన్నట్లు వార లాదుకొనఁ గలిగిరా! కావున నా మేలు కోరు బంధువు లందఱిలో నీవే శ్రేష్ఠుఁడవు. అక్కఱకు రాని చుట్టము లుండియు నేమి ప్రయోజనము?

రాముండు కుశలియేన్ = రామచంద్రమూర్తి కుశలిగా నున్న పక్షమున, భూమి వార్ధులన్ = భూమిని సముద్రమును, కల్పాగ్నిలీలన్ = ప్రళయకాలాగ్నివలె, కినిసి = కోపించి, అయ్యో! రాముఁడు ప్రాణముతో నుండినయెడల నా నిమిత్తమై కోపించి ప్రలయకాలాగ్నివలె భూమిని సముద్రమును గాల్పకున్నాఁడా! నన్ను దక్కించుకొనుటకై యంతపని చేసి యుండునే. చేయలేడా? అది యాయనకుఁ గష్ట కార్యము గాదే. ఆయన కన్నెఱ్ఱనైనఁ జాలును. అదియే ప్రలయకాలాగ్ని చేయు పని చేయును గదా. విల్లు చేతికిఁ దీసికొని యెక్కుపెట్టి బాణము సంధించి సముద్ర మునై నొకటి, భూమిపై నొకటి ప్రయోగింపవలెనా? ఆంజనేయా! రాముఁడు కుశలి యని నీవు చెప్పుటచే నమ్ముచున్నాను గాని యంతకార్యము చేయలేదు గావున మఱియొకరు చెప్పిన నమ్మియుండను. నీవు చెప్పుటచే నమ్మెదను గాని యంతకార్యము చేయకుండుటచే నా మీఁదఁ బ్రేమ తప్పిన దని తలఁచెదను. లేదా యంతటిశక్తి లేదని తలఁచెదను. వారి శక్తి యాఁడుదానిని జంపను, ఆఁడుదాని ముక్కులు చెవులు గోయనే కాని యిటువంటి వారిని దండించుటయందు లేదు.

కాకేమి శూరులు = శూరులు కాకేమి? శూరులే యగుదురు. నాకులన్ = నాకులనైనను = దేవతలనైనను. నాకము + ఇ = నాకి = స్వర్గమందుండువారు,

గెల్వరా = గెల్వలేరా. నా పాపఫలము వారికి నాయందు దయ తప్పఁజేసి వారి శౌర్య ముపయోగింపకుండఁ జేసినది. ఆకారణముచే; మద్వియోగ వ్యథార్తిని = నన్ను విడుచుట వలనఁ గలిగిన దుఃఖముచే, మఱుఁగకుండన్ = సంతాపింపక, నీళ్ళు కళపెళ కళపెళ క్రిందికి మీఁదికి మసల గ్రాఁగుట మఱుఁగుట యందురు.

తా త్ప ర్య ము.

తండ్రీ! సత్యప్రతిజ్ఞగల కౌసల్యాకుమారుఁడు నా భాగ్యవశమునఁ గుశలముగా నున్నాఁడుగదా. అసమానగుణవంతుఁ డగు సుమిత్రానందనుఁడు లక్ష్మణుఁడు హితేంద్రా! సుఖమా? రాముఁడు కుశలముతో నుండినఁ బ్రలయకాలాగ్ని వలెఁ గోపించి నా నిమిత్తమై భూమిని, సముద్రమును గాల్పలేదు గదా. వారు శూరులు కారా, శూరులే. దేవతలనైనను యుద్ధమందు గెల్వఁగలవారే. నా పాపఫలమువలన వా రా ప్రయత్నము చేసినవారుగారు. అన్నా! యాంజనేయా! నన్ను నెడఁబాసిన తాపముచే రామచంద్రమూర్తి సంతాపింపకున్నాఁడుగదా. నా కొఱకై యాయన దుఃఖింపఁడు గదా. నా విషయమునఁ గాకున్నఁ దన విషయమే నైనను నిఁకమీఁద నయోధ్యయందుఁ జేయవలసిన కార్యములు మఱల జెండ్లియాడుట మొదలైనవి యాలోచించుచున్నాఁడా? లేక నా విషయమై నా ప్రియురాలి కింత కష్టము వచ్చెనే, యెట్లు తప్పింత మని చేయవలసిన కార్య మెన్నఁడైన నాలోచించుచున్నాఁడా?

సీ. ఏమఱఁడే కదా • యెల్లకార్యంబులు, దీనుఁ డై సంభ్రాంతి • వానరేంద్ర!
పురుషకారము లెల్ల • సరిగఁ జేయును గదా, యా రాజనందనుం•డాంజనేయ!
సలుపునా మిత్రుల•శత్రులయెడ రెండు,మూఁ డుపాయంబులు • మోసపోక?
గడన•సేయునుగదా • కడుమిత్రవర్గంబుఁ! జెలికాండ్రు రతనిఁ బూ•జింతు రయ్య?
తే. దేవతానుగ్రహమును జిం•తించునొక్కొ?పౌరుషంబును దైవంబుఁ•బరఁగుచున్న?
కరము దవ్వైన నామీఁదఁ•గరుణ గలఁడె? ప్రోచునా నన్ను నీబాధ•ద్రోచితండ్రి?

అర్థములు. పురుషకారము = మనుష్యులు చేయవలసిన ప్రయత్నము. మిత్రులయెడ సామదానములను రెం డుపాయంబులు. శత్రులయెడ దానభేద దండములను మూఁడుపాయంబులు, గడనసేయునుగదా=సంపాదించునుగదా.

తా త్ప ర్య ము.

న న్నెడఁబాసిన కారణముచే శోకతప్తుఁడై తొట్రుపాటుచేఁ జేయవలసిన కార్యములన్నియు నేమఱక చేయుచున్నాఁడుగదా (ఇవన్నియు వర్మగర్భితము లని యెఱుఁగనలయును.) నామీఁద ప్రేమ మునుపటి వలెనే యుండెనా? (ఈ కార్యము లేవియుఁ జేయఁజాలఁడని యర్థము.) ఆంజనేయా! ఈ రాజకుమారుఁడు రాజధర్మ మనుసరించి చేయవలసిన పురుష ప్రయత్నములు లోపములేక చేయుచున్నాఁడు కదా. మిత్రులందు సామదానములు, శత్రువులందు దానభేదదండము లుపయో

గించుచున్నాఁడుగదా. మిత్రులను సంపాదించుచున్నాఁడా? స్నేహితు లతని గౌర వింతురా? దైవ సాహాయ్యము కలుగు నుపాయ మాలోచించుచున్నాఁడు గదా! పౌరుషమును నమ్మి దైవమును నమ్మి పురుష ప్రయత్నము విడువక రెంటిని నాశ్ర యించి యున్నాఁడుగదా. ఇన్ని కార్యముల సందడిలో మిగుల దూరమం దుండు నన్నెప్పుడైనఁ దలఁచునంతటి దయగలదా? ఈ బాధనుండి తొలఁగించి నన్ను రక్షించు నని యాశగలదా?

క. అగర్భశ్రీమంతుఁడు, భోగి వ్యథానర్హుఁ డైన • పుణ్యుఁడు రాముం
డీ గతి నాకై దుఃఖా,భోగంబున మిగుల నవసి • పోలేదు గదా? ౮౬౩

అర్థములు. అగర్భశ్రీమంతుఁడు = తల్లికడుపులో నుండినది మొదలు సంపద ననుభవించినవాఁడు, శ్రీ యాయనకు నిత్యానపాయిని గదా. (౨) శ్రీశబ్ద మునకు విషమనియు నర్థము గలదు. తల్లి గర్భమునందుండి హృదయమున విషము గలవాఁడే. భోగి = (౧) భోగము లనుభవించువాఁడు, (౨) సర్పము, వ్యథానర్హుఁడు = దుఃఖపడఁదగిన వాఁడు కాఁడు. (౨) పరులబాధ యెట్టిదో తెలిసికొను యోగ్యత లేనివాఁడు, పుణ్యుఁడు = పుణ్యమూర్తి. (౨) వక్రోక్తి-పుణ్యము నెఱుఁగనివాఁడు. రాముఁడు - (౧) రామచంద్రమూర్తి. (౨) పైకి నభిరాముఁడుగాఁ గనఁబడువాఁడు. దుఃఖాభోగంబునన్=దుఃఖాతిశయముచే, నవసి=శుష్కించి.

తా త్ప ర్య ము.

ఆంజనేయా! తల్లిగర్భమున నుండునది మొదలు సంపద ననుభవించువాఁడు. పుట్టిన పిమ్మట భోగములే నిత్యముగా ననుభవించువాఁడు, దుఃఖమెట్టిదో యెఱుఁగ నర్హుఁడు కానివాఁడు. ఇట్టి రాముఁడు అడవులలోఁ దిరుగుటచే నెంత శుష్కింపవల యునో యంతేగాని, నా నిమిత్తమై దుఃఖాతిశయముచే విశేషించి శుష్కింపక బాగు న్నాఁడుకదా.

తల్లిగర్భము నం దుండినది మొదలు విషముగల పాము తన కాటువలనఁ బరులు పడు బాధ యెట్లు తెలిసికొనఁగలదు? యట్లే తన యుపేక్షచే నేను బాధ పడుచుండ నాకై యా పుణ్యుఁడు (వ్యతిరేకలక్షణ) దుఃఖించుచు మిగుల శుష్కింపక పూర్వమువలె బాగున్నాఁడుకదా!

సీ. కౌసల్యయు సుమిత్ర • కపివరా! భరతుండు, కుశలులే? యవ్వార్త • విశదపడునె?
భ్రాతృవత్సలుఁ డైన • భరతుండు నాకయి, యక్షోహిణీసేన • నంపునయ్యొ?
దంతనఖాయుధ • తరుచరకోటితో, సుగ్రీవుఁ డీ లంకఁ • జొచ్చు నయ్యొ?
సత్త్వసంపన్నుండు • సౌమిత్రి యసురుల, నానాస్త్రవృష్టిని • నఱుకునయ్యొ?
తే. చూతునా నేను భీకర • శాతబాణ,దారితాంగు సబాంధవు • దశశిరస్కు?
నా నిమిత్తంబు వగచుచు • న్నాఁడె? యేక,మతియొనాపతియుఁణఁపనా • యతులితార్తి?

అర్థములు. అవ్వార్త విశదపడునె=వారి కుశలవార్త యేమైన వినవచ్చు

చున్నదా. తా మయోధ్య విడిచినది మొదలు కౌసల్యాదుల కుశలవార్త వచ్చుటయే లేదేని యిప్పు డీమె యీ ప్రశ్న వేయఁ గారణము లేదు. దీనివలన భరతుఁడు గుహుని మూలమున మనుష్యులఁ బంపి తమ వార్త రామాదులకుఁ దెలుపుచు వారి వార్త తాను దెలిసికొను చుండె నని యేర్పడుచున్నది. అటుగాకున్న నంతటి భ్రాతృవత్సలుఁ డన్న వదినె యడవిలో నేగతి పట్టెనో విచారింపక యింతకాల మూరకుండునా? సీతాపహరణము వఱకు నిట్లే జరుగుచుండెను గాని, యున్నట్టుండి యాశ్రమము వదలి వచ్చిన కారణముచేఁ దమ వార్త వారికి, వారి వార్త వీరికిఁ దెలియలేదు. ఈ యభిప్రాయమును భ్రాతృవత్సలుఁ డైన భరతుఁడు నాకయి యక్షోహిణీ సేన పంపునా? యను ప్రశ్న బలపఱుచు చున్నది. నాకుక ప్రకారము వచ్చువారు తాము పంచవటి విడిచిన తరువాతఁ బంచవటికి వచ్చి తమ వృత్తాంతముఁ దెలిసికొని పోయి భరతునకుఁ జెప్పి యుందు రనియు నాయన తనకుఁగల యక్షోహిణీసేన రామచంద్రమూర్తికి సహాయముగాఁ బంపియుండు ననియు సీత యూహించెను. ఈ యూహ యపోహము గాదు. ఉత్తర కాండంబున ౨౭౧-౨౭౯ పద్యములఁ జూడుఁడు. కం. జనకావనీశ, నందిని, వనముల హృతయైనవార్త భరతుఁడు విని యి, మ్మనఘాత్ములార పిలిపించిన వచ్చితి రెల్ల రీరు స్నేహము పేర్మిన్" ఇత్యాది వాక్యములు భరతుఁడు సీతారాముల కుశల వార్త తెప్పించుకొనుచుండె నని స్థిరపఱుచు చున్నవి. పూర్వ మిూ విషయము చెప్పఁబడకుండినను వాల్మీకి శైలి ననుసరించి యీ ప్రశ్నవలన నది ముందు జరగుచున్నట్లూహింపవలెను.

దంత నఖాయుధ తరుచర కోటితోన్ = దంతములు, గోళ్లు నాయుధములు గాఁగల క్రోఁతుల సమూహముతో, సత్త్వ సంపన్నుఁడు = బలసంపత్తి గలవాఁడు, భీకరశాతబాణ = భయంకరములై వాఁడియైన బాణములచే, దారితాంగు = చీల్పఁబడిన దేహము గలవానిని, సబాంధవున్ = బంధువులతోఁ గూడిన వానిని.

తాత్పర్యము.

కౌసల్యయు, సుమిత్రయు, భరతుఁడు క్షేమముగా నున్నారా? ఆవార్తయేనైన దెలియ వచ్చుచున్నదా? అన్నయందు ప్రేమగల భరతుఁడు నా నిమిత్తముగఁ దనకు గల యక్షోహిణీసేనను బంపునా? దంతములు, నఖములు సాధనములుగాఁ గల వానరసమూహములతో సుగ్రీవుఁ డీ లంకయందుఁ బ్రవేశించునా? బల సంపత్తి గల లక్ష్మణుఁడు రాక్షసుల నెల్ల నానాస్త్రవర్షముచే నఱకి వైచునా? దశకంఠుఁడు బంధువులతోడ భయంకరములైన వాఁడి బాణములచేఁ జీల్పఁబడిన దేహము గలవాఁడై నేలఁబడి యుండఁ జూడఁగలనా? అయ్యా! రామచంద్రమూర్తి నా కింత కష్టము వచ్చెనుగదా యని వ్యసనపడుచున్నాఁడా? నా దుఃఖమును బాపుటయందుఁ జపలుఁడుగాక యేకనిశ్చయముతో నున్నాఁడా?

చ. పరమనవీనహేమసమ•వర్ణము పద్మసమానగంధి నై
సురుచిర మైన మన్నయన•సోమముఖంబు మరుత్తనూజ! మ
ద్విరహము పేరిమిన్ వ్యసన•దీనత నీరము లింకఁ దమ్మికిన్
దర మయి వాడుపాఱదు గ•దా వచియింపఁగదయ్య తత్త్వమున్. ౮౬౫

అర్థములు. పరమ నవీన హేమ=శ్రేష్ఠమై పుటమువేసి తీసి మెఱుఁగు పెట్టఁబడిన శుద్ధమైన బంగారుతో, సమ = సమానమైన, వర్ణము=కాంతి గలది, ఇచ్చట మెఱుఁగు మాత్రమే వివక్షితముగాని పసిమి వివక్షితముగాదు, పద్మ సమానగంధి = తామర పూవుల వాసనవంటి వాసన గలది, సురుచిరమైన = అందమైన, మన్నయన సోమముఖంబు = నా కన్నులకుఁ జంద్రునివంటిదగు ముఖము, దరమయి = సమాన మయి, తత్త్వమున్ = వాస్తవమును.

తాత్పర్యము.

అప్పుడు పుటము వేసి తీసి మెఱుఁగు పెట్టఁబడిన శుద్ధమైన బంగారు మెఱుఁగు వంటి మెఱుఁగు కలదియు, పద్మముల వాసన వంటి వాసన గలదియు, నందమైనదియు, నా కన్నులకుఁ జంద్రుని వంటిదియునగు రామచంద్రమూర్తి ముఖము, వాయునందనా! నన్నుఁ బాసిన తాపముచేఁ గలిగిన దైన్యము వలన నీళ్ళింకిన తామరవలె వాడి పోలేదు గదా. అయ్యా! నిజము చెప్పుము.

ఉ. క్రౌర్యముతోడఁ గైకయి య•రణ్యములం బను మన్న ధర్మ్య స
త్కార్య మటంచు నెంచిన వి•శార విహారుఁడుఁ, నేను బాదసం
చర్యఁ జరింపఁ గానఁ గనఁ•జాలినధీరుఁడు, నేఁడు దీనుఁడై
ధైర్యము నుజ్జగింపఁడు గ•దా కపినాథ! నిజంబుఁ జెప్పుమా. ౮౬౬

అర్థములు. క్రౌర్యము = దయలేని తనము, ధర్మ్యసత్కార్యము = ధర్మ యుక్తమైన మంచిపని, విశార విహారుఁడు = మనసున మాఱుపాటు లేనివాఁడు, పాదసంచర్యన్ = కాలినడకతో, ధీరుఁడు = ధైర్యశాలి, ఉజ్జగింపఁడు = మానఁడు, రాముని విషయమైన సీతాదేవి మాట లన్నియు వర్మోక్తులే.

తాత్పర్యము.

దయలేనిదై, రామా! నీ వడవులఁ బడఁ బొమ్మని చెప్పఁగా సవతి తల్లి మాట ప్రకారము వర్తించుట ధర్మ యుక్త కార్య మని పట్టాభిషేకము చేసికొమ్మన్నప్పుడెట్లుండెనో యట్టులే కోపచిహ్నములు గాని, భయముగాని, వ్యసన చిహ్నాలు గాని కనఁబఱుపని వాఁడు. నేను బదునెనిమి దేండ్ల పిల్లను, గాఱడవులలో, ముండ్లలో రాలలోఁ దనకన్నుల యెదుట గాలినడఁ దిరుగుచున్నను అప్పుడును మనస్సులో జాలి యనునది లేక యూరక ధీరతఁ జూచుచుండిన ధైర్యశాలి, యిప్పుడు సీత పోయినఁ బోనిమ్మని ధైర్యము విడువక యున్నాఁడు గదా. అంజనేయా! నిజము చెప్పుము.

ఉ. ఏ మనుజాన దూతుఁడ! మ • దీశ్వరు, నా పయి కూర్మికంటె శ్రీ
రామున కాత్మమాతపయి • రా జగు తండ్రిపయిన్ హితాళిపైఁ
బ్రేమము హెచ్చు గాదు సరి • ప్రీతియుఁ గా, దటు గావునం గదా
యా మహితాత్మువార్త విను • నంతకు నిల్పితి మేనఁ బ్రాణముల్. ౪౬౭

తాత్పర్యము.

అయ్యో! రామదూతా! మా రాముఁడు కఠినచిత్తుఁడు, నన్ను విడిచి సహించినాఁ డని నిష్ఠురము లాడెదవే, నీవు మాత్రము తక్కువైన దానవా ఆఁడు దాన వయ్యుఁ, జిన్నదానవయ్యు, నింత యాపదలో మునిఁగియుఁ బ్రాణములు నిలిపితివే నీ ధైర్యము ముందట మా రాముని ధైర్యమే మాత్రములే యందువా. నేను బ్రాణములు నిలిపిన కారణము చెప్పెద వినుము. నే నేమని చెప్పుదును. నా హృదయేశ్వరుఁడైన శ్రీరామచంద్రమూర్తికి నా యం దున్న ప్రేమ కంటె నెక్కువ ప్రేమగాని, సమానమైన ప్రేమగాని తన తల్లి యందు లేదు. తండ్రి యం దుండినది కాదు, తన యాప్తులయందును లేదు. ఇది నే నెఱుఁగుదును. ఆ ధైర్యము చేతఁగదా యాయనవార్త వినవచ్చువఱకు బొందిలోఁ బ్రాణములు నిలిపి యున్నదానను. నేను బ్రాణము విడిచితినా నా యందంతటి ప్రేమగలవాఁడు కావున నెటులైన నిచ్చటికి రానేవచ్చును. వచ్చి నేను జచ్చితి నన్న వార్త విని యాయన "అయ్యో! నా ప్రేమ వ్యర్థము చేసెఁగదా. నేను వచ్చి తన్ను రక్షింపఁ గల నను ధైర్యము, విశ్వాసము నా యందు లేనిదయ్యెఁగదా, ఎంతదయాహీనురా లని తపించునే, నా యందంతటి ప్రేమగలవానికి నేను దుఃఖము కలిగింప వచ్చునా! ఎన్ని బాధలైన సహించునుగాక యని కదా ప్రాణములు నిలిపితిని. ప్రాణము తీఁపని రక్షించుచున్నానని తలఁచితివా? ఇంత వఱకుఁ బైపద్యములందు వానరేంద్రా! కపీంద్రా! యని సంబోధించుచుండిన సీత యిప్పుడు దూతా! యని సంబోధించెను. ఏల? దూతతోఁ జెప్పినమాట లతని స్వామితోఁ జెప్పినట్లే. అతని స్వామి కా మాట లతఁడు చెప్పవలయు ననియే యుద్దేశ్యము. శ్రీభాగవతమున దశమ స్కంధమున గోపికల భ్రమరగీతలు పోల్చి చూచినది.

సీతాదేవి తనయందు రామచంద్రమూర్తికిఁ గల ప్రేమ, యాయన తలిదండ్రులయందుఁగాని యాప్తులగు బంధువులందుఁగాని లేదని చెప్పుటచే భర్త లగు వారు పతివ్రత లగు తమ భార్యలం దట్టిప్రేమ యుంచవలె నని సూచన:—ఏల? అర్ధాంగ లక్ష్మినై సగము దేహము పంచుకొని సహధర్మచారిణినై సమాన సుఖ దుఃఖనై యీ లోకమునందే కాక పరలోకమునందును, నీ జన్మమందే కాక కడచి నట్టియు, రాఁగలట్టియు జన్మంబులందును వెంటనంటియుండు సాధ్వి యగు భార్యకుఁ దక్కిన వారెల్లు సాటి కాఁగలరు! వారితోడి కూటమికి ఋణసంబంధము కారణము. ఒక యాత్మయేకదా రెం డయ్యెను.

చ. అని మధురార్థయుక్తము మ•హార్థము నౌ వచనంబు లాడి యా
వనజదళాయతాక్షి కపి•వర్యుని రామగుణానుకీర్తనం
బును విను నాశ మానమును • బూనిన నాయమఁ జూచి వాయునం
దనుఁడు కరంబుభక్తిఁ గర•తామరసంబులు మోడ్చి యిట్లనున్. ౮౬౮

అర్థములు. మధురార్థయుక్తము = తియ్యని యర్థముతోఁ గూడినది, ఆమె చెప్పుమాటలను నింకను దినవలె నింకను దినవలె నని యాశ కలిగించునవి. రామచంద్రమూర్తి హనుమంతా! సీతాదేవి యేమిచెప్పె ననిన నామెమాటలు వినకుండినఁ దానేమి చెప్పఁగలఁడు. కావున వినుచుండెను. వినుకొలఁదిఁ దియ్యగానుండుటను, రామచంద్రునకుఁ జెప్పుటకై వినుట యావశ్య మగుటను సేవకుఁడగు వాఁడు నడుమ నడుమ మాటలాడరాదు గనుకను, ఆమెచెప్పిన మాటలు హనుమంతుఁడూరక వినుచుండెను.

మహార్థము = ఆమాటల యందుండు గొప్పయర్థము. బ్రహ్మచారులగు హనుమంతునకు వాల్మీకికిఁ దెలియునవి కావు. కనుక వానిని వివరించి చెప్పఁజాలక సమష్టి మీఁద మహార్థము లని వాల్మీకి చెప్పెను. కపివర్యుని = కపులందు శ్రేష్ఠుఁడగు వాని యొక్క - కపులకెల్ల రాజు సుగ్రీవుఁడు-ఆయన మంత్రి, బంటు హనుమంతుఁడు-ఎట్లు కపివర్యుఁడయ్యెను. లౌకికాధికారము బట్టి కాదు. సీతాదేవితో నింతచనవుగ నేకాంతమున మాటలాడు నధికారము భక్తిపారతంత్ర్యపూర్తిగల హనుమంతునకుఁ గలిగెఁ గాని మఱి యేక్రోఁతికిఁ గలిగెను! కావున వాస్తవ కపివర్యుఁడు హనుమంతుఁడే.

తాత్పర్యము.

ఈ ప్రకారముగ గొప్పదియుఁ, దియ్యనైనదియు నగు నర్థముతోఁ గూడిన మాటలు చెప్పి సీతాదేవి రామభక్తుఁడును, రామపరతంత్రుఁడును నగు కపిశ్రేష్ఠుఁడు చేయు రామగుణకీర్తనము వినఁగోరి మౌనము వహించెను. ఇట్లు మాటలు చెప్పుట నిలిపిన యామె యభిప్రాయ మెఱిఁగి మిగుల భక్తిచే హనుమంతుఁడు హస్తకమలములు ముకుళించి యిట్లనియె.

దీని వలన రామభక్తుఁడు సీతారాముల యిరువురయందు సమాన భక్తి, యసమానపారతంత్ర్యము గలవాఁడై యుండవలయు నని యేర్పడు చున్నది. కరంబులు మోడ్చి యిట్లనున్ = అనుటచే నుత్తమ స్త్రీలతోఁ గాని యుత్తమ పురుషులతోఁ గాని మాటలాడు నపుడు సేవకులు చేతులు కట్టుకొని కాని, యంజలి మోడ్చి కాని మాట లాడవలెఁ గాని, చేతు లూఁగు లాడించుచుఁ గాని, వ్రేల వైచి కొని కాని మాటలాడ రాదని సూచన.

—• హనుమంతుఁడు సీతాదేవికి ధైర్యోక్తులు చెప్పుట. •—

చ. కమలదళాయతాక్షి! మొఱుఁ•గండు సుమీ యిట నీదు నున్కి నీ
రమణుఁడు, కావునం గద పు•రందరుఁ డా శచిఁబోలె నిన్ను శీ

ధ్రువముగ నిను దోడుకొం చరుగ • రాఁ, డిఁక నే వచియించి నంత వే
గమ చనుదెంచు ఋక్షకపి•కాండసమాహుల సైన్యయుక్తుఁడై. ౮౬౯

అర్థములు. నీ రమణుఁడు=నిన్ను రమింపఁ జేయువాఁడు కదా రాముఁడు - ఏమి కారణము? నీవు కమల దళాయతాక్షి వగుటయే కారణము. కమల దళాయతాక్షీ = తామర తేకులవలె దీర్ఘములైన కన్నులు గలదానా! నీనేత్ర సౌందర్యము నెపుడు నీ వద్దము నందైనఁ జూచుకొన్న దానవో, కావో - చూచినను తేనెకుఁ దనతీపు తెలియనట్లు నీ సౌందర్య మాహాత్మ్యము నీ వెఱుఁగలేకయేఁ యున్నావో కాని, నీ దృష్టి తనపైఁ బడునా యని రాముఁడే కోరుచున్నాఁడు. నాదృష్టి గుఱించి యేమి చెప్పినాఁ డందువా, నీవు దగ్గఱ నున్నప్పుడు కమలదళాయతాక్షి వఁట. దూరముగా నుండినను గమలదళాయతాక్షివఁట. దగ్గఱనున్నప్పుడు నీదృష్టులు తామర తేకులవలె శీతలమై తాపమార్చు నఁట. దూరమున నున్నప్పుడు చూరకత్తి వలె మనస్సును జీల్చునఁట, 'కమలం ఛురికా దీనా' మ్మని కమల శబ్దమునకు చూర కత్తి మొదలగు వానికిఁ బేరు. దళశబ్దమునకుఁ జీల్చుట ఖండించుట యని యర్థము. అట్టివాఁడు నీ విచ్చట నున్నదాన వని తెలిసిన రాకయుండునా? నీ విచ్చట నుండుట యాయన యెఱుఁగఁడు. ఆ కారణముచేత నహుష్ఙుఁ డపహరించిన శచిని నింద్రుఁడు మరల గ్రహించుటయం దాలస్యమైనట్లు నీ విషయమందును ఆలస్య మైనది. ఇప్పుడు పోయి నేను జెప్పితినా వానర భల్లూకసేనా సమూహముతో బయలుదేఱి వెంటనే వచ్చును.

ఉ. క్రమ్మను క్రూరశాతవిశి•ఖమ్ములచే వరుణాలయంబు స్త
బ్ధమ్మొనరించి లంక హత•పాపనిశాటగఁ జేయు నమ్మ! మ
ధ్యమ్మునఁ గాలుఁడైన విబు•ధాసురకోటులు నైన నాఁగినన్
దిమ్మ వదల్చు నమ్మువు మ•దిన్ నిరవద్యసుశీలభూషణా! ౮౭౦

అర్థములు. క్రూరశాత విశిఖమ్ములన్ = కఠినములై వాఁడిగల బాణములచే, వరుణాలయంబు = సముద్రము, స్తబ్ధ మ్మొనరించి = కట్టివైచి, హతపాప నిశాటగన్ = చంపఁబడిన పాపపు రాక్షసులు గలది, పాపాత్ములను జంపునే కాని, విభీషణాదులఁ జంపఁడని భావము, కాలుఁడు=యముఁడు, విబుధ+అసుర కోటులు = దేవతలయు, దైత్యులయు గుంపులు, ఆఁగినన్ = అడ్డగించినను, దిమ్మ = మత్తు, గర్వము, నిరవద్య = దోషరహిత మైన, సుశీల = పాతివ్రత్యమే, భూషణా = ఆభరణములు గలదానా.

తాత్పర్యము.

నీవు క్రోఁతివి గనుక సముద్రమును దాఁటితివి. రాముఁ డెట్లు దాఁటునందువా? కఠినములై పదునైన బాణములు ప్రయోగించి సముద్రమును గట్టివైచి లంక యందలి పాపపురాక్షసుల నందఱఁ జంపును. ఈ నడుమ యముఁ డైనను, దేవత

లయినను దైత్యులయినను, నద్దము వచ్చిరా వారికిఁ బట్టిన తలదిమ్ము వదల్పును. తల్లీ ! నిర్దుష్ట పాతివ్రత్యమే యలంకారముగాఁ గలదానా ! నా మాట నమ్ముము.

ఇట్లు చెప్పుటచే నింతపని చేయించునని యర్థము. నా పాతివ్రత్యము వ్యర్థముగాఁ బోయె ననిన సీతవాక్యమున కిది ప్రత్యుత్తరము.

క. సింగముచేఁ జిక్కిన మా,తంగమువలెఁ ద్వద్వియోగ•తాపార్దితుఁడై
యంగన! సుఖము నెఱుంగఁడు, పొంగఱి కృశియించుఁ బూఁట•పూటకు దేవీ !

అర్థములు. మాతంగమువలెన్ = ఏనుఁగువలె, త్వత్ + వియోగతాప+ అర్దితుఁడై = నిన్ను నెడఁబాయుట, వలనఁ గలిగిన తాపముచేఁ బీడింపఁ బడిన వాఁడై, పొంగు + అఱి = సంతోషము చెడి; ఈ పద్యములో మన్మథావస్థలలోఁ గృశత్వ మను నవస్థ చెప్పఁ బడెను.

తాత్పర్యము.

రామచంద్రమూర్తి చిక్కిపోలేదుగదా యంటివి. ఆయనస్థితి చెప్పెద వినుము. సింహము బారిఁబడిన యేనుఁగువలె నిన్ను నెడఁబాయుటవలనఁ గలిగిన తాపముచే బాధపడుచు సంతోషముచెడి పూఁట పూఁటకుఁ జిక్కిపోవుచున్నాఁడు.

చ. మలయసుమేరువింధ్యధర•మందరదర్దురభూధరాళిపై
ఫలముల వేరువెల్లకుల•పై జననీ ! శపథంబుఁ జేసెదన్
గలవు కనంగ భవ్యతర•కంజవిలోచన ముజ్జ్వలోరుకుం
డల మరుణాధరంబు నగు • నాథమనోజ్ఞముఖేందుబింబమున్. ౮౭౨

అర్థములు. భవ్యతరకంజ విలోచనము = శుభకరమైన కమలములవంటి కన్నులు గలదియు, ఉజ్జ్వలోరుకుండలము = ప్రకాశించు గొప్ప కుండలములు గల దియు (ఉంగరమువలె దీనిని విసర్జింప లేదు. ఉత్తచెవులతో నుండరాదు గావున) అరుణాధరంబు = ఎర్రని పెదవిగలదియు, అగు, నాథ = రామచంద్రమూర్తి యొక్క, మనోజ్ఞ=అందమైన, ముఖేందుబింబమున్ =చంద్రునివంటి ముఖమును.

తాత్పర్యము.

తల్లీ ! నేను రిత్తయోదార్పుమాటలు చెప్పరాలేదు. మలయము, మేరువు, వింధ్యపర్వతము, మందరము, దర్దురము, లోనగు కొండల మీఁదను మా కాహారమైన పండ్లు, వేళ్లు, గడ్డల మీఁదను ప్రమాణము చేసి చెప్పుచున్నాను. నీవు మేలయిన కమలములవంటి కన్నులు, గొప్ప కుండలములు, ఎఱ్ఱని పెదవిగల నీ మగని రామ చంద్రుని యందమైన ముఖమును జంద్రునివలెఁ జూడఁగలవు.

క. రామునిఁ బ్రస్రవణతటీ,ధామునిఁ జూడంగఁ గలవు • త్వరగా వల సు
త్రాముని విబుధాలయగత,భా మానితనాకపృష్ఠ•భాసితుఁ బోలెన్. ౮౭౩

అర్థములు. ప్రస్రవణ తటీధామునిన్ = ప్రస్రవణ పర్వతమం దిప్పు డుండు వానిని, సుత్రామునిన్ = ఇంద్రుని, విబుధాలయ గత = స్వర్గమందుండిన, భామా

నిభ=కాంతిచేఁ బూజింపఁబడు, నాకపృష్ఠ భాసితుఁ బోలెన్=నాకపృష్ఠ మను పర్వత ప్రదేశమునఁ బ్రకాశించు వానివలె.

తాత్పర్యము.

నేను జెప్పినది యసత్యమని నమ్మవేని రమ్ము. నీవే స్వర్గమండలి నాకపృష్ఠము నందుండు నింద్రునివలెఁ బ్రస్రవణ పర్వతశిఖరంబున నున్న రామచంద్రమూర్తిని జూడఁగలవు.

క. మాంసము ముట్టఁడు రాముఁడు, హంసీవరయాన! మధువు • నాసింపఁడు సా
యంసమయములన్ మాత్ర మ,హింసారతి వన్యఫలము • లించుక కొనెడిన్.

అర్థములు. మధువు = తేనె, వన్యఫలములు = అడవి యందుఁ బుట్టిన పండ్లను, ఇంచుక = కొంచెము.

శ్లో॥ దృఙ్మనస్సంగ సంకల్ప జాగరాః కృశతాఽరతిః
హ్రీత్యాగోన్మాద మూర్ఛాంతా ఇత్యనంగదశా దశ.

యని మన్మథావస్థలు పది. అందు అరతి యను నవస్థ యిందుఁ జెప్పఁబడెను. అరతి యనఁగా దేనియందుఁ బ్రీతి లేక పోవుట.

తాత్పర్యము.

మాంసమును దాఁకఁడు, తేనె నాశింపనే యాశింపఁడు. సాయంకాలమందు వానప్రస్థమార్గమున హింసలేక యడవి ఫలములను దేహధారణార్థమై కొంచెముగఁ దీసికొనును. దినమున కొక పూఁటనే కాని రెండవసారి భుజించుటలేదు. నాకు రెండు పూఁటల నాహారము లేదుగదా యందువేమో. నీవు చేయవలసిన కష్టము లేదుగదా! ఆయనకు యుద్ధకార్యముగలదే; నిరశనవ్రతముఁ బూనిన యుద్ధ మెట్లు చేయఁగలఁడు. అదియును గాక, నీవు ప్రోషితపతికవు, ఉత్తమరాజకన్యవు. కావున పరదత్తము, అందు శత్రుదత్తము గ్రహింపరాదు. అందు రావణుఁడు పతితుఁడు. కులటా షండ వైరి పతితు లిచ్చునది పక్వమైనను, అపక్వమైనను ప్రాణాపద దశయందును గ్రహింపరాదు. అందు వ్రతస్థవు కావున నీ కుపవాసము దగినదే. ఆయన నిష్కారణోపవాసము శాస్త్ర నిషిద్ధము కావున నెట్లు శుష్కోపవాసము చేయవచ్చును. నిర్నిమిత్తమైన శుష్కోపవాసము ఆత్మహత్య యగును. అది దోషావహము. శోకము, కోపము నుపవాస కారణములు గావు.

క. దోమలు నీఁగలుఁ బురుగులుఁ, బాములుఁ దను వెరియ మీఁదఁ • బ్రాకుచు నున్నన్
రాముఁ డెఱుంగఁ డొకింతయు, భామిని! నీ యంద యుంటఁ • బ్రాణము లెల్లన్.

అర్థములు. ఎరియన్ = మండునట్లు, భామిని = కోపశీలా !

తాత్పర్యము.

ఆయన నిమిత్తమై నా దేహమునఁ బ్రాణములు నిలిపిన దాన వంటివి. ఆయన తన ప్రాణము లన్నియు నీయందు నిలిపియుండు వాఁడగుటచే ఈఁగలు,

దోమలు, పురుగులు, పాములు దేహము మీఁద ప్రాఁకుచుండినను ఆయనకుఁ గొంచెమైనఁ దెలిసినది కాదు. పరకాయప్రవేశము చేసిన యోగి వలె నున్నాఁడు. నీ యందుఁ గోపస్వభావ మున్నది. ఆయనయం దది లేదు. నీవాయన నుద్దేశించి నిష్ఠురము లాడితివే. ఆయన యొక్క మాటయైన నిన్ను గుఱించి నిష్ఠురము లాడినవాఁడు కాఁడుగదా. ఆయనకాలము సీతా సీతా యనుటలో సరిపోవు చున్నది. నే నాలోచన తోఁచినఁగదా నిష్ఠురము లాడుట.

ఈ పద్యమున మనస్సంగమ మనెడి యవస్థ చెప్పఁబడెను. ప్రియ పదార్థము నందుఁ దప్ప మఱి దేనియందును మనస్సుంచకుండుట మనస్సంగమ మగును.

సీ. నీ చక్కఁదనమును • నీదు సౌశీల్యంబు, చెలువరో! ధ్యానంబుఁ • జేయుఁ జేయుఁ
జేయుచో నీరూపు • చెలువు కన్నులఁ గట్టఁ, సుందరీ! నిన్నుఁ • జూచుఁ జూచుఁ
జూచి నన్ బాసితే • సుదతిరో! యంచును, గన్నులబడి నీరుఁ • గార్పుఁ గార్పుఁ
గార్చి నే నే రీతిఁ • గనుఁగొందునో కదే, యెలఁత యంచును గదు • మిడుకుమిడుకు
తే. నన్య మేది స్మరించఁడ • నంగ బాణ, తాపమునఁ జేసి కనుమూయఁ • దలఁపఁ డెపుడుఁ
దలఁచెఁ బో యంతలోన సీ • తా! యటంచు, నులికిపడి లేచు మదిలోనఁ • గళవళించు.

అర్థములు. అనంగ బాణతాపమున = మన్మథుని బాణముల వలనఁగలిగిన తాపముచే. ఇందుఁగను మూయఁదలఁపఁ డనునది జాగరణమును దెలుపును. నీకు నిద్ర రాలేదని నిద్రావిషయ జ్ఞానమైనఁ గలదు. ఆయన కా యాలోచనయే లేదు. నిద్ర యనునది యొకటి యుండుటయు నెఱుఁగఁడు.

తా త్ప ర్య ము.

స్పష్టము.

క. హంసో పుష్పో మఱి యిం, కొండు మనోహరపదార్థ • మో కాంచినచో
నండజగమనా యంచును, నుంచును నినుఁగూర్చి యుల్ల • ముదిలఁగొనంగన్. ౭౮౮

అర్థములు. అండజగమనా = హంసనడక వంటి నడక గలదానా. ఉదిల గొనన్ = పరితాప పడును.

తా త్ప ర్య ము.

స్పష్టము.

క. సీతా సీతా యనుచును, జేతము తపియింపఁ బలుకు • క్షితిజా, నినుఁ దా
నే తెలియఁగునఁ బడయఁగ నగు,నా తెలఁగు నోవర్చెడిన్ మ • హాత్ముం డనఁగన్.

అర్థములు. చేతము=మనస్సు; ఇందుఁ దాపము చెప్పఁబడెను.

తా త్ప ర్య ము.

స్పష్టము.

ఉ. రామునికీర్తనంబునను • రాగిలి రామసమానశోక సీ
తామదిరాక్షి దుఃఖమును • దవ్వానరించి, శిరస్సుఖంబునన్

ధూమజఖండయుక్త మగు • తోయజశాత్రవమండలంబు నా
యామిని బోలి భూమిసుత • యంజనినందనుతోడ ని ట్లనున్. ౮౭౯

అర్థములు. రాగిలి = సంతోషించి, రామసమానశోక = రాముని శోక మెంత తీవ్రమో యంత తీవ్రత గల శోకము గలది. రాముని శోకము సీతకురాదు. సీత శోకము రామునకు రాదు. తీవ్రత యందు సమత్వము. దవ్వు = దూరము. శరత్ + ముఖంబునన్ = శరత్కాలారంభమందు. ధూమజ = మేఘముయొక్క, ఖండ = తునుకతో, యుక్తము = కూడినది. తోయజశాత్రవ మండలంబు = చంద్ర మండలము; ఓ=కల, యామిని = రాత్రి.

తా త్ప ర్య ము.

హనుమంతుఁడు రామచంద్రమూర్తిని పొగడుటచే సంతోషించినదై రాముని దుఃఖమంత దుఃఖము గల సీత, నా దుఃఖమంత దుఃఖము రామచంద్ర మూర్తియుఁ బడుచున్నాఁడుకదా! తనదుఃఖముఁ బాపుకొన యత్నించునుకదా, యదియే నాకుఁ జాలునని తనదుఃఖమును వదలి శరత్కాలారంభమందు మేఘము తునుకలతోఁగూడిన చంద్రమండలము గల రాత్రివలెనై యాయనతో నిట్లనియె.

ఇందలి యుపమానమువలన సీతాదేవి దుఃఖమంతయుఁ బోలేదనియు నింకను గొంత శేషము గలదనియు నేర్పడుచున్నది. కారణము క్రింది పద్యమునఁ గలదు.

—•{ ౩౭-వ సర్గము. సీతాదేవి హనుమంతునకు రావణుఁడు పెట్టినగడువు నెఱింగించుట. }•—

క. రాముఁ డనన్యమనస్కుఁడు, రాముఁడు భూరివ్యథాప • రాయణుఁ డనుచున్
నీ మాటలు సుధ విషమున, సామీరీ! కలిపి యిడిన • చందం బయ్యెన్. ౮౮౦

అర్థములు. అనన్య మనస్కుఁడు = ఇతరమునందు మనస్సు లేనివాఁడు, భూరివ్యథాపరాయణుఁడు=గొప్ప బాధ పూర్ణముగ ననుభవించు చున్నాఁడు. సుధ = అమృతము.

తా త్ప ర్య ము.

ఆంజనేయా! రామచంద్రమూర్తి నన్ను దప్ప మఱిదేనిని దలఁచుటలే దంటివి. ఇది యమృతము త్రావినంత సంతోషము గలిగించెను. రామచంద్రమూర్తి మిగుల దుఃఖించుచున్నాఁ డంటివి. ఇది విషము త్రాగినట్లు తాపము గలిగించు చున్నది. నీవు విషము కలిసిన యమృతము నిచ్చిన ట్లయ్యెను.

క. భూరితరైశ్వర్యముననో, దారుణదుఃఖమున నేని • దైవము త్రాటన్
బూరుషునిఁ గట్టి యీడ్చును, ధారుణిపై జీవికిని స్వా • తంత్రత గలదే! ౮౮౧

అర్థములు. భూరితర+ఐశ్వర్యమునకో = గొప్ప సంపదయందుఁగాని, దారుణ దుఃఖమున నేని=భయంకర దారిద్ర్య దుఃఖమందైనను.

తా త్ప ర్య ము.

గొప్ప సంపదయందుఁగాని, భయంకర దారిద్ర్య దుఃఖమందైనను పూరుషుని దైవము (పూర్వజన్మ కర్మఫలము) త్రాటితోఁ గదలకుండఁ గట్టి యీడ్చును. భూమిమీఁదఁ బుట్టిన వారికి స్వాతంత్ర్య మనునది యున్నదా ? లేదు.

ఆ. విధిని దాటు జీవి • విశ్వంబునను లేదు, వానరేంద్ర! యింత • పట్టు నిజము
రామచంద్రవిభుని • సౌమిత్రినిన్ నన్ను, నెట్లు పఱచెఁ గంటి • వే కదయ్య. ౮౮౨

అర్థములు. విధిని = దైవమును, పఱచెన్ = బాధపెట్టెనో.

తా త్ప ర్య ము.

దైవనియమము నతిక్రమించి స్వతంత్రించి తన యిష్టప్రకారము వర్తించు ప్రాణి యీ లోకమందు లేదు. వానర శ్రేష్ఠా! యింతమాత్రము నిజము. అసత్యము గాదు. రామచంద్రమూర్తిగాని, లక్ష్మణుఁడుగాని, నేనుగాని దుఃఖంపవలసిన కారణమూ లేదు. అయినను దుఃఖించు చున్నాము. దుఃఖించుటకు మాయందే దోషము గలదు? రామునికై నేను, రామచంద్రమూర్తి మా యపరాధములకై దుఃఖంపవలసినదే యనుకో. మా యిరువుర నడుమ లక్ష్మణుఁ డేల మా యిరువురకై దుఃఖంపవలె! ఇదంతయు దైవచేష్టగదా.

ఉ. ఎప్పుడు చేరువాఁ డొకో ది • నేశకులాభరణంబు రాముఁ డీ
గొప్ప వ్యథాసముద్రమున • కూలముఁ? బెద్ద తుపానుతాఁకునన్
ద్రిప్పుల నొందు నావగతిఁ • దేఱ దొఱంగి నలంగినాఁడె ? న
న్నెప్పుడు దోడుకొం చరుగు? • నెప్పుడు రావణుఁ ద్రుంచు? మారుతీ ! ౮౮౩

అర్థములు. దినేశకులాభరణంబు = సూర్యవంశమునకు నలంకారమైనవాఁడు. సముద్రమున కూలము=సముద్రముయొక్క తీరము,షష్ఠీసమాసమున నకారాగమము.

తా త్ప ర్య ము.

మారుతీ! రామచంద్రమూర్తి యీ వ్యథాసముద్రమున మునుఁగకుండఁ దీర మెప్పు డయ్యా చేయును? పెద్ద గాలివానవలన గిరగిర తిరుగు నావవలెఁ గాంతిని బాసి నలఁగినాఁడా? నన్నెప్పుడు తోడుకొని పోవునో, ఎప్పుడు రావణు సంహరించునో !

'పరిత్రాణాయ సాధూనాం, వినాశాయ చ దుష్కృతా'మ్మన్నట్లు సీతాదేవిని గ్రహించుట యను సాధు పరిత్రాణము ముఖ్యకార్యము దానికి విఘ్నము కలిగించు దుష్కృతుల వినాశము రెండవ కార్యము, అని యేర్పడుచున్నది.

ఉ. ఎప్పుడు వచ్చు నొక్కొ మను జేంద్రుఁడు? రాక్షసకోటిఁ బట్టి తా
నెప్పుడు వ్రచ్చు నొక్కొ? దను • జేంద్రునిఁ గిట్టి శరాలి పాలుగా
నెప్పుడు ద్రుంచు నొక్కొ? యసు • రేంద్రుని వీటిని మూలముట్టుగా
నెప్పుడు దంచు నొక్కొ? నను • నెప్పుడు చూచెడి నొక్కొ? పావనీ ! ౮౮౪

తాత్పర్యము.

పావనీ ! రామచంద్రమూర్తి యెప్పు డయ్యో వచ్చును. ఎప్పు డయ్యో రాక్షస సమూహములను బట్టి చీల్చును. రావణుని బాణముల పాలు చేసి యెప్పుడు ఖండించును? ఈ లంకాపురమును బునాదితో డఁ బాడగునట్టు లెప్పుడు దంచునో, నన్నెప్పు డయ్యో చూడవచ్చును ?

ఉ. తీవర పెట్ట వయ్య జగ•తీవిభు నింతటిలోన రాఁగ నో
పావని! నా కిలన్ బ్రదుకు•పాటును నీ సమ తీఱునంతకే
చూ విధియించె నట్లు దను•జుం, డిఁక మాసయుగంబ చిక్కె ద
త్తావధియందుఁ, జెల్లెడిఁ జా•మా దశేమం బగు మాస మిద్యోడన్. ౮౮౫

అర్థములు. సమ=సంవత్సరము; ఇది సంస్కృతమున స్త్రీలింగము. ప్రాయికముగ బహువచనమందే ప్రయోగము. అయినను పాణిని ఏకవచనమందు 'సమాం సమాం' అని పఠించెను. (పా. వ్యా. ౨. ౧౨) మఱియు సమాం విజాయతే యని యేకవచనమందును బ్రయోగముకలదు. కావునఁ దత్సమమున సమ యను రూపము సాధువు. దత్తావధి = ఇయ్యఁబడిన గడువు.

తాత్పర్యము.

అంజనేయా ! రావణుఁడు నా కొక్క సంవత్సరము గడు విచ్చెను. ఆ సంవత్సరము ముగియువఱకే నేను జీవించియుందును ఆ సంవత్సరమునందుఁ బదియవ నెల జరగుచున్నది. కావున రెండు నెలలు మాత్రమే మిగిలినవి. అవి కాఁగానే నా చావు సిద్ధము కావున నీ లోపలనే వచ్చునట్లు రామచంద్రమూర్తిని తొందర పెట్టుము. ఆవల వచ్చినను ఫలము లేదు.

ఇది ఫాల్గున మాసము. ఇని పదియవ నెల యగునేని జ్యేష్ఠమాసమున సీతాపహరణ మని యేర్పడుచున్నది.

ఉ. పెక్కువిధాలఁ దమ్ముఁడు వి•భీషణుఁ డెంతయు నొక్కి చెప్పి నీ
వ క్కమలేక్షణన్ మఱల • నంపు మటంచును, నాలకింపఁ డా
ముక్కిడి రావణుండు, విధి • మూఁడినవానికి సాధుపద్ధతుల్
మక్కువ గూర్పునే దురభి•మానము కన్నులఁ గప్పు చుండఁగన్ ! ౮౮౬

తాత్పర్యము.

ఈ లోపల మంచి బుద్ధి పుట్టి రావణుఁడు మఱల నన్ను రామచంద్రున కర్పింప రాదా యందువేమో, వానికట్టి యభిప్రాయములేదు. రావణుని తమ్ముఁడు విభీషణుఁడను వాఁడు నీవు సీతను మరల నిమ్ము అని యనేక విధముల బోధించెను గాని మూర్ఖుఁ డగు రావణుఁడు విన్నవాఁడుకాఁడు. వానికి మరణకాలము సమీపించి దురభిమానము కన్నులు గానరాకుండఁ జేయుచుండఁగా వాఁ డేల వినును ?

చ. ఎనిమిదియావతిం గొని వి•భీషణుపత్ని నిజాత్మజాతఁ దా
ననల యనంగఁ బేర నల•రారెడి కన్యక యీ చరిత్రమున్
వినుపఁగ బంచె నా కడకు • నే పతి నన్ను గ్రహించు శుద్ధమై
తనరె మదంతరాత్మయును • దాన వసించు గుణంబు లెన్నియేన్. ౮౮౭

తాత్పర్యము.

నీకెట్లీ విషయము తెలిసె నందువా ! ఆ విభీషణుని భార్యయే సరమ యను నామె పతి యనుమతిఁ దీసికొని తన కూఁతురగు ననల యను కన్యకచే నీ విషయము నాకుఁ జెప్పి పంపెను. ఆంజనేయా ! నా పతి నన్ను గ్రహించుట సత్యము. ఏమి ధైర్యముతో నీ మాట చెప్పెద నందువా, నా యంతరాత్మ శుద్ధమై యున్నది. అంతరాత్మ శుద్ధమై యుండెనేని యనేక శుభగుణములు గలవు. ఏ కార్యమునందు నంతఃకరణము శుద్ధమై, ప్రసన్నమై యుండునో యా కార్యము నెఱవేఱిన దనియే నమ్మవచ్చును.

విభీషణుఁడు సకుటుంబముగ సీతాపక్షపాతి యని దీనివలన స్పష్టపడుచున్నది. విభీషణునందు సీతాదేవి కనుగ్రహబుద్ధి కల దని యెఱుఁగుట చేతనే శ్రీరామచంద్రమూర్తియు విభీషణు ననుగ్రహించెను. సుగ్రీవుని విషయమున నిట్టులే కదా వర్తించెను.

క. పౌరుషము సముత్సాహము, సారతరబలంబు నానృ•శంస్యము మహిమో
దారత కృతజ్ఞతాదులు, శ్రీరామునియంద కలవు • స్థిరముగ హనుమా! ౮౮౮

లోకోత్తర కార్యమునందు స్థిరప్రయత్న ముత్సాహము. దానికిఁ దగినట్టుకార్యము చేయుట పౌరుషము, సత్త్వము. అది నెఱవేఱుటకు బలము. ఆనృశంస్యము = చేయుట యందుఁ గ్రూరత్వము లేకుండుట, కృతజ్ఞత = తనకుఁ జేసిన మేలు మఱవకుండుట, విక్రమము = శౌర్యము, ప్రభావము = శక్తి.

తాత్పర్యము.

హనుమంతా! లోకోత్తర కార్యము చేయుట, దానికిఁ బ్రేరకమైన యుత్సాహము, కార్యమును సాధింపఁదగిన మహాబలము, కార్యము చేయుటయందుఁ గామరోషములకు వశుఁడై, క్రూరుఁడై వర్తింపకుండుట, తన దివ్యమహిమ ప్రకాశింపఁ జేయుట, కార్యముచేయుట యందు సహాయుల పట్లఁ గృతజ్ఞత, యీ మొదలగున గుణములు స్థిరముగ నొక్క శ్రీ రామచంద్రమూర్తి యందే కలవు. కొందఱి యందివి యల్పకాలమే యుండును. మఱికొందఱి యం దిందుఁ గొన్నియే యుండును, రామునం దట్లుగాదు. కల్యాణగుణము లన్నియు సంపూర్ణముగ శాశ్వతముగ నున్నవి. అట్టివాఁడు నా విషయమై తన పౌరుషము చూపకుండునా ?

సీ. ఆ జనస్థానంబు•నందు బోవకుఁ డేవి, బాసటగా లేక • పదియునాల్గు
వేలరక్కసుల దో•ర్లీల నొక్కఁడ చంపె, నట్టివానికి నెవ్వఁ • డడల కుండు ?

నింద్రుని శచిపోలె • నెఱుఁగుమఁ దన్మహి, మంబుఁ గష్టంబు లా•మానధనునిఁ
గలఁపగ జాలవు • కాండభానువులను, రక్షోజలంబుల • రామభానుఁ

తే. డడరి శోషింపఁజేయు నం • చశ్రుపూర్ణ, లోచనాంబుజ నైన యా•లోలనేత్రఁ
జూచి యిట్లను నంజనా•సూనుఁ డప్పు, డేల శోకించెదమ్మ! యీ•లీల నీవు.౧౪౯

అర్థములు. అడలకుండుము=భయపడకుండుము; కాండభానువులను = బాణము లను కిరణములచే, రక్షోజలంబులన్=రాక్షసులనునీటిని; రామభానుఁడు=రామచంద్ర మూర్తి యను సూర్యుఁడు; అశ్రుపూర్ణలోచనాంబుజము = కన్నీళ్ళచే నిండిన నేత్ర కమలములు గలది.

తా త్ప ర్య ము.

అంజనేయా ! ఆయన రాలేదు. రావణుఁ జంప లేదు. నన్నుఁ దీసికొని పోలే దని నిష్ఠుర మాడెదవే. ఆయన యొంటరిగాఁ డేమి చేయఁగలఁడమ్మా ! యందు వేమో. ఆ జనస్థానమందుఁ దమ్ముఁడుకూడఁ దోడులేక పదునాల్గువేల రాక్షసులను భుజబలముచే నవలీలగాఁ జంపలేదా. అట్టివాఁడిచ్చటికి వచ్చినంత మాత్రముననే యీ రాక్షసులు చూచి భయపడకుందురా. ఆయన శక్తి తెలియక నేను దూషింప లేదు. ఇంద్రుని శక్తి శచికిఁ దెలిసినట్లు రామచంద్రుని శక్తి నాకుఁ దెలియును. మానధనుఁ డగు నతనిని నీ కష్టము లెవ్వియుఁ గలఁత చెందింప లేవు. ఎన్ని కష్టము లైన నోర్చి మానము కాపాడుకోఁగలఁడు. సూర్యునకుఁ దన కిరణములచే జలము నెండించుట మహాశ్రమకరమైన కార్యమా ! అట్టులే రామునకు రాక్షసుల వధించుట కష్టకార్యమా ! అని కన్నుల నిండ నీరు నించిన యా సీతాదేవిని జూచి హనుమంతుఁడు తల్లీ! యేల శోకించెదవు ?

—• హనుమంతుఁడు సీతాదేవిని దనవీఁపున నెత్తుకొని పోయెద నని చెప్పుట. •—

ఉ. నానుడు లాలకించి రఘు•నాథుఁడు వానరభల్లుకావళీ
సేనలతోడ నిచ్చ్యోడక • శీఘ్రము వచ్చెడు, నంత కోర్వ నె
ట్లా వనితేని దుఃఖము ర•యంబుగఁ బాతు ననింద్యశీల ! చం
ద్రానన! నాదు వీఁపుపయి • నాదట నెక్కుము కొంచుఁ బోయెదన్. ౧౫౦

అర్థములు. నా నుడులు = నా మాటలు; పాతున్ = పాచుదును, పాయు నట్లు చేయుదును.

తా త్ప ర్య ము.

నా మాటలు విని రామచంద్రమూర్తి క్రోఁతులు, ఎలుగులు గల సేనలతో నిచ్చటికిత్వరగా వచ్చును.అంతకాలము వఱకు నే నీ దుఃఖమెట్లు సహింతునందువా! నీ దుఃఖమును నేను బోవునట్లు చేసెదను. నా వీఁపుపై నెక్కుము. రామచంద్ర మూర్తి యున్న చోటికిఁ దీసికొని పోయెదను. నేను నీ కింకరుఁడను. కావున దీనివలన నీ శీలమునకు హాని లేదు.

క. నీ వాశతవేల? లంకను, రావణునిన్ మోచికొనుచు • రయమునఁ బోవం
గా వలఁతిని, జేర్చెద నిపు, డే విభుకడ హవ్య మగ్ని • యింద్రునకువలెన్. ప-౧

అర్థములు. వలఁతిని = సమర్థుఁడను, హవ్య మగ్ని యింద్రునకువలెన్ = అగ్నిహోత్రుఁడు హోమము చేయఁబడిన హవ్యమును నింద్రునకుఁ జేర్చినట్లు; ఈ యుపమానముకూడ స్పర్శదోష శంకను బరిహరించుచు, నాంజనేయుని శుచిత్వము దెలుపుచున్నది.

తా త్ప ర్య ము.

నీవు నన్ను మోయఁగలవా యందువేమో, నిన్ను మాత్రమే కాదు. లంకను, రావణుని కూడ మోచికొని శీఘ్రముగఁబోవ సమర్థుఁడను. హవ్యవాహనుఁడగు నగ్ని హుతమును నింద్రునకుఁ జేర్చినట్లు నిన్ను శ్రీరాముని యొద్ద కిప్పుడే చేర్చెదను.

శా. అమ్మా! మున్ దనుజావళిం దునుమ దై • త్యారాతి సన్నాహి యా
నమ్మాడ్కిం దన తమ్ముతోడ భవదీ • య ప్రాణనాథుం డు ద
్యమ్మున్ జేయుచు నుండఁ జూడఁగలవు • ద్యత్ప్రీతిఁ గన్నారఁగా
లెమ్మా యెక్కఁగదమ్మ! వీఁపుపయి నో • లేమా! నను న్నమ్మవే. ప-౨

అర్థములు. సన్నాహి = ప్రయత్నముగలవాఁడు; ఉద్యత్ప్రీతిన్ = పుట్టుచున్న ప్రేమతో.

తా త్ప ర్య ము.

తల్లీ! పూర్వము రాక్షసులను జంపుటకు విష్ణువు ప్రయత్నము చేసినట్లు తమ్మునితోడ నీ మగఁడు రావణాదులఁ జంప యత్నముఁ జేయుచుండ నీవు సంతోషముతో గన్నులారఁ జూడఁగలవు. అమ్మా! లెమ్ము. నా వీఁపుపై నెక్కుము. నా మాట నమ్ముము.

క. నీనుఁ జూడఁ గోరు వానిని, ననుపమబలశాలిఁ బర్వ • తాశ్రమగతునిన్
గనుఁగొనెదు నాకపృష్ఠంబున నుండెడి వజ్రధరునిం • బోలినవానిన్. ప-౩

తా త్ప ర్య ము.

నాకపృష్ఠంబున నింద్రునిఁబోలి పర్వతాశ్రమ మందుండి నిన్నుఁ జూడఁగోరుచున్న బలవంతు రామచంద్రమూర్తినిఁ జూడఁగలవు.

ఉ. అలము సేయకమ్మ నిను • నాదటఁ గూర్చెదఁ బ్రాణనాథుతో
బాలిక! రోహిణీకుముద • బాంధవు లట్టులు కూడి యుండ విరా
రాలు మగండు, శీతకిర • ణార్కులతోడఁ బ్రసంగమాడుచున్
లీలగ దాఁటవమ్మ యవ • లీల నభంబును సాగరంబునున్. ప-౪

అర్థములు. అలము = ఉపేక్ష, ఆదటన్ = ప్రేమముతో, కుముద బాంధవుఁడు = చంద్రుఁడు, శీతకిరణార్కులతోడన్ = సూర్యచంద్రులతోడ, ఆకాశమున నెంత యెత్తు ప్రదేశమునకుఁ బోయిన సూర్యచంద్రు లిరువు రేకకాలమునఁ గావ నత్తరో యంత యెత్తున; నభంబును = ఆకాశమును; సాగరంబునున్ = సముద్రమును.

తాత్పర్యము.

నా మాట లేమోలేయని యుపేక్షింపకుము. రోహిణీచంద్రులు కూడియుండునట్లు నీవు నీ మగఁడు కూడియుండునట్లు చేసెదను. ఆకాశమున సూర్యచంద్రులతో ముచ్చట లాడుచు సముద్రమును, సముద్రమును దాటిన తరువాత నాకాశమును నవలీల దాఁటుము. రామచంద్రమూర్తి యొద్దకుఁ బోవు వఱకు నిన్ను దింపను.

క. నిను నేఁ గొనిపోవఁగ న, న్ననుగమనము సేయ నోపఁ • డమ్మా! లంకన్
దనుజుం డొక్కరుం డైనను, ననుమానము మాని యెక్కు•మా నా వీఁపున్. ప-౫

అర్థములు. అనుగమనము = వెంటవచ్చుట.

తాత్పర్యము.

ఈ రాక్షసులు మన వెంటబడఁగా, పోనిత్తురా యందువేమో, నిన్ను నేను దీసికొని పోవునపుడు నావెంట నీ రాక్షసులలో నొకఁడైన రాఁ జాలఁడు, నమ్ముము.

క. ఏకరణిని వచ్చితి విట, కా కరణిని గొంచుఁబోదు • నాకాశమునన్
నీ కేల సందియం బన, నా కపిఁ గని హర్ష విస్మ•యాంగి వచించెన్. ప-౬

తాత్పర్యము.

నీ వే విధముగ నాకాశమార్గమున నిటకు వచ్చితివో యావిధముగనే యాకాశమార్గమున నిన్నుఁ దోడుకొని పోయెదను, నీకేల సందేహము అనిన నా వానరుఁ జూచి సీత యతని భక్తికి సంతోషము, అతని మాటల కాశ్చర్యము గలదై యిట్లు చెప్పెను.

—• హనుమంతుఁడు సీతాదేవికిఁ దన దేహముఁ బెంచి చూపుట •—

క. హనుమా! మిక్కిలి దూరము, ననుఁగొని నీ వేగతిం జ•నం జాలెదవో
విన వింతలు నీ పలుకులు, వనచర! నీ క్రోఁతిబుద్ధి • వచ్చెం దెలియన్. ప-౭

తాత్పర్యము.

అంజనేయా! నేను సొమ్ములమూట కట్టి యెక్కడ నైచితినో నాఁడుఁదెలియును. అక్కడకు నిక్కడకు మిగుల దూరముగలదు. ఇంతదూరము నన్ను మోచికొని నీ వే ప్రకారము పోఁగలవు. నీ మాటలు వినుటకు వింతలుగా నున్నవి. ఇంతవఱకు నీవు నిజమైన క్రోతి వగుదువో కావో యని సందేహించుచుంటిని. ఇప్పుడు నీబుద్ధిని బట్టి చూడ నీవు నిజమైన క్రోఁతివే యని నిశ్చయించుకొంటిని.

ఉ. ఇంతవు నీ వదేమి గతి • నేగదవో నను మోసికొంచు భూ
కాంతునిపాలి కం చనిన • తన్మొసుతపల్కుల నాలకించి లోఁ
జింత వహించె నా కిపుడు • చేకుఱెఁ గ్రొత్తపరాభవం బటం
చెంతయు వానరుండు మఱి • యిట్లని తాఁ దలపోసె నాత్మలోన్. ప-౮

అర్థములు. ఇంతవు = ఇది చేతితోఁ జూపించి జేనెఁ డని చెప్పెను. అనఁగా అల్పశరీరుఁడవు. క్రొత్తపరాభవంబు = ఎన్నఁడు లేని యవమానము.

తా త్ప ర్య ము.

హనుమంతా! యీడిచి కొలఁదిచిన కేనకు లేవే, నీ వెట్లు నన్ను మోసికొని రామచంద్రు నొద్దకు సంతెదూరము పోఁగల వనెదవు అనఁగా సీతాదేవి పలుకులు విని హనుమంతుఁ డిట్లు విచారపడెను. ఎన్నఁడు నెవరిచేతఁ గలుగని యవమానము, నేఁడు ఈఁమెదానిచేతఁ బడవలసి వచ్చెను గదా యని మఱియు నిట్టు లాలోచించెను.

చ. ఎఱుఁగదు గాక యించుకయు • నెంతటివాఁడనొ కానఁ బల్కె న
న్నుఱక మదీయరూప మిపు • డొప్పుగఁ జూపిన నమ్మఁ గాక యీ
తెఱవ యటంచు నెంచి తన • దివ్యమహాకృతిఁ జూప నేలపై
కుఱికి ద్రుమంబునుండి రభ • సోద్ధతిఁ బెంపఁ దొడంగె గాయమున్. ౮౯౯

అర్థములు. ఉఱక = లక్ష్యము లేక, ఉఱికి = దుమికి; రభసోద్ధతిన్ = వేగముతోడి గర్వముచే; నేలపై కుఱికి యనుటచే నింతవఱకు రాక్షసస్త్రీలకుఁ గాన రాకుండునట్లు చెట్టుకొమ్మమీఁదే యుండె నని యేర్పడుచున్నది. అవమానము సహింపలేక రోషము గలవాఁడై చెట్టుమీఁదనే యుండి దేహము పెంప సాధ్యపడదు కావున నేల దుమికెను.

తా త్ప ర్య ము.

ఈమె నన్ను నవమానింపవలయు నను తలంపులో నవమానింపలేదు. నే నెంతటి వాఁడనో, నా మహత్త్వ మెట్టిదో తెలియక లక్ష్యములేక మాటలాడినది. నా మాట నిజ మని, నే నంత కార్యము చేయఁగల నని, నిజముగ నమ్మినది కాదు ఈమె నమ్మ నట్లు చేయుటకు నా స్వరూపము చూపించెద నని తలఁచి తన దివ్యమైన గొప్ప యాకారమును జూప నేలమీఁదికి దుమికి శీఘ్రముగాఁ బెంపఁ బ్రారంభించెను.

సీ. దీప్తానలప్రభఁ • దేజరిల్లుచు, మేరు, మందరసంకాశ • మహితరూప
ముననఁ దామ్రవక్త్రుఁడై • ఘనవజ్రసన్నిభ, దంష్ట్రానఖంబులు • దద్ద వెలుఁగ
జానకి ముంగల • గా నిలుచుండి యి, ట్లనియె నా సతితోడ • నాంజనేయుఁ
డో దేవి! సగిరివ • నోద్దేశముగ సాట్ట, వప్రతోరణముగ • వైరినాథు

ఆ. తోడ లంకఁగొనుచుఁ • దోరంపుజవమునఁ, బోవు శక్తి గలదు • భూమితనయ!
పిన్నవాఁడ నను న • భిప్రాయమును బాసి, రమ్ము జాల మేల • రాము కడకు. ౯౦౦

అర్థములు. దీప్తానల ప్రభన్ = మండుచున్న యగ్నిహోత్రుని కాంతితో; సంకాశ = సమానమైన; మహిత = గొప్పదైన; తామ్రవక్త్రుఁడై = రాగివలె నెఱ్ఱని ముఖము గలవాఁడై; ఘన = గొప్ప వగు; వజ్ర సన్నిభ = వజ్రముతో సమానమైన; దంష్ట్రానఖంబులు=కోఱలు గోళ్లు, సగిరివనోద్దేశమున్=పర్వతములు, వనప్రదేశములతోడ; సాట్టవప్రతోరణముగ=బురుజులతో, ప్రాకారములతో, తోరణ ములతో.

తాత్పర్యము.

మండుచున్న యగ్నిహోత్రకాంతి గలిగి, వెలుఁగుచు మేరుమందర పర్వతములతో సమానమైన గొప్ప యాకారముగలవాఁడై, నెఱ్ఱని ముఖము, వజ్రాయుధముల వంటి గోళ్ళు, కోఱలు గలవాఁడై, సీతాదేవి ముందు నిలుచుండి యిట్లనియె. దేవీ! ఈ లంకను గొండలతో, వనములతో, బురుజులతో, ప్రాకారములతో, తోరణములతో, రావణాసురునితో పెల్లగించి యతివేగముగఁ దీసికొని పోవు శక్తి గలదు. నేను చిన్నవాఁడ నను నభిప్రాయము వదలుము. ఆలస్య మేల? రాము నొద్దకుఁ బోదము రమ్ము.

—◆ హనుమంతునితోడ సీతాదేవి తాను రాకకుఁ గారణములు చెప్పుట ◆—

చ. అవునను వాయుసూనుని మ◆హాద్భుతభీప్రదభూరి రూపమున్
గనుఁగొని నీరజాక్షి యను ◆ గాడుపువందనుతో నెఱింగితిన్
ఘన మగు తావకీనబల◆గర్వసమున్నతి వాయువేగమున్
వనదహనోరు తేజమును ◆ వానరమాత్రుఁడవే కపీశ్వరా! ౯౦౧

అర్థములు. మహాద్భుత = మిగుల నాశ్చర్యకర మైన, భీప్రద = భయము కలిగించు; భూరి = గొప్పదగు, రూపమున్ = ఆకారమును, వనదహన = కాఱు చిచ్చు తేజస్సువంటి; ఉరు = గొప్పదగు; తేజము.

తాత్పర్యము.

హనుమంతుఁ డీ ప్రకారము చెప్పఁగా మిగుల నాశ్చర్యము, భయము కలిగించు నతని గొప్ప యాకారము చూచి యాయనతో నిట్లనియె. కపీశ్వరా! నీ బలగర్వము, వాయువేగము, కాఱుచిచ్చువంటి నీ తేజము, నెట్టిదై నది తెలిసికొంటిని. నీవు సామాన్యపుఁ గోతివి గావు.

ఉ. ఇంతటివాఁడు గాక యది ◆ యెట్లు పయోధిఁ దరించి లంక నే
కాంతము చొచ్చి న న్నరయఁ◆గా క్షముఁ డౌ? నొక ప్రాకృతుండు దా
నింత ఘటింప నేర్చునె? య◆హీనజవంబున నన్ను రామ భూ
కాంతుని యంతికంబునను ◆ గ్రచ్చఱఁ జేర్తువు విశ్వసించితిన్. ౯౦౨

అర్థములు. ఏకాంతము = రహస్యముగా; క్షముఁడు = సమర్థుఁడు; ప్రాకృతుండు = సామాన్య పురుషుఁడు, అంతికంబునకు = సమీపమునకు; విశ్వసించితిన్ = నమ్మితిని.

తాత్పర్యము.

ఇంత గొప్పవాఁడవు కావేని, నీ వెట్లు సముద్రము దాటి రహస్యంబుగ నొంటిగ లంకలోఁ బ్రవేశించి నన్ను వెదకి కనుఁగొన సమర్థుఁడ వగుదువు. ఇంతకార్యము సామాన్య పురుషులకుఁ జేయ సాధ్య మగు పనియా? మిగుల వేగముగ నీవు నన్ను రామచంద్రమూర్తి సమీపమునకుఁ దీసుకొని పోఁగల వని నమ్మితిని.

సీ. అయినను మామకీ•నాత్మేశు కార్యంబు, వేగంబు సిద్ధించు•విధ మ దెట్లొ
యని తలపోయుట • యావశ్యకము నాకుఁ, గాదె? నీ వెంట రా•రా దటొట
ననిలవేగము తుల్య • మగు నీదు జవమున, కోర్వక దిగ్భ్రమ • నొందవు నాకుఁ
బైపైన బొరలు కూ•పారంబుఁ గన భీతిఁ, దల చుట్టి పడిపోన • దానిలోనఁ
తే. బడిన యంతనె తిమినక్ర•పటలి నన్నుఁ
బట్టి చవు లూరఁగా భ్రమింగి • యట్టి వోవె!
నన్ను రక్షింపఁ దలపోయు • చున్న నిన్నుఁ
గూర్పియును సంశయించెదఁ • గ్రోతిరాయ. ౯౦3

అర్థములు, మామకీ నాత్మేశు కార్యంబు = నా యాత్మకు నధీశ్వరుఁడైన రామచంద్రమూర్తి కార్యము త్వరగా సఫల మగు విధ మేదో యది నే నాలోచించుట తగును గదా. కావున నీ వెంబడి నేను రాను. నేను నీ వెంట వచ్చితినా.

(౧) రావణుఁడు దొంగతనముగా సీతను హరించుకొని పోయినట్లు రామచంద్రుఁడును రావణాసురుని జయింపలేక దొంగతనముగా సీతను దెప్పించుకొన్నాఁడు, హనుమంతుఁడు లేకుండిన రామచంద్రుఁడు సీతను దక్కించుకొని యుండలేఁ డను నపకీర్తి నా మగనికి వచ్చును. నే నట్టి కార్యము చేయవచ్చునా?

(౨) నే నచ్చటికి వచ్చితినేని నా ప్రాణము దక్కించుకొన్నట్టు లగును గాని యింత దుష్టకార్యము స్త్రీల విషయమునఁ జేయు వీని కేమి శిక్ష గలిగినట్లు! ఇట్టివాఁడు శిక్షింపఁబడఁడేని యింకను లోకమున నెన్ని యనర్థకార్యములు చేయునో.

(3) రామచంద్రమూర్తి తప్ప రావణునిఁ జంపఁగలవాఁ డెవ్వఁడు. ఎందఱ స్త్రీలనో నావలెనే బలాత్కారముగఁ దెచ్చి చెఱలో వేసియుండుట నీవు చూచితివి కదా. వారి మగవా రెవ్వరైన వానిని దండింపఁగలిగిరా? కావున రామచంద్రమూర్తి చేతనే వీని పుట మార్పింపఁ జేసిన నీ స్త్రీ లందఱు సుఖముగఁ బోదురు. క్రొత్త వారు రాకుందురు.

(౪) రామచంద్రమూర్తి రావణుఁ జంపఁ బ్రతిజ్ఞఁ జేసెఁ గదా. నే నచ్చటికి వచ్చితినేని యిది నెఱవేఱు టెట్లు! ఆయన సత్యప్రతిజ్ఞత్వమునకు హాని రాదా! నాయందు భక్తి గలవాఁడ వగుటచే నా సుఖము మాత్రము చూచితివి గాని, యివన్నియు నాలోచింప వైతివి గదా. ఇకను జెప్పెద వినుము.

కూపారంబు = సముద్రము; చవులు = రుచులు.

తాత్పర్యము.

నీయందు నా కెంత విశ్వాసమున్నను శీఘ్రముగ నా మగని కార్యము సిద్ధించు నుపాయము నే నాలోచించుట యావశ్యకము గదా. కావున నీ వెంట నేను రారాదు. వాయువేగముతో సమానమైన నీ వేగము సహింపలేక నేను దిగ్భ్రమ నొందుదును. మీఁద మీఁద బొరలుచున్న యలలు గల సముద్రమును జూడఁగానే దానిలో

దలతిరిగి పడిపోదును పడఁగానే తిములు మొసళ్లు వచ్చి నన్ను రుచులార మ్రింగి స్వేచ్ఛగాఁ బోవును. ఇది నాగతి. ఇఁక నీ గతి విషయ మందును నాకు సందేహము గలదు. ఏ మంటివా ?

సీ. ననుఁ గొనిపోవు ని•న్గని పంక్తికంధర, చోదితరాక్షస•శూరవరులు
నిను వెంబడింపరే! • నీకును వారికిఁ, జండసంగ్రామంబు • జరుగ కున్నె ?
శూలముద్గరక రా•ళీలురవారల, గెలుతువో ! కలనిలో • గెలువ లేవో ?
సాయుధుల్ వారు ని•రాయుధుండవు నీవ, వెట్లు పోరెదవు న•న్నెట్లు గాతు ?
తే. నీవు కలహింపఁ గ్రూరదు•ర్భావు లైన
దైత్యులను గని నా మది • తల్లడిల్లి
వనధిలోపలఁ బడుదునో ? • పడిన నన్నుఁ
గొనుచుఁ బోయి యొసంగరే • దనుజపతికి ! ౯౦౪

అర్థములు. చోదిత = ఆజ్ఞాపింపఁబడిన; క్రూరదుర్భావులు = చెడ్డమనస్సు గలవారు.

తా త్ప ర్య ము.

నన్నుఁ దీసికొని పోవు నిన్నుఁజూచి రావణుచే నాజ్ఞాపింపఁబడిన రాక్షసులు నీ కంటఁబడరా ? వారికి నీకు భయంకర యుద్ధము జరుగకుండునా ? వారు శూల ములు, ముద్గరములు కలవా రగుటచే దూరమునుండి నిన్నుఁ గొట్టుదురు. వారలను నీవు గెలుతువో గెలువలేవో. గెలు పోటు లెట్లున్నను ఆయుధములు కలిగి దూరము నుండి గొట్టువారితో నాయుధములు లేని నీ వెట్లు యుద్ధము చేయఁగలవు ? న న్నెట్లు రక్షింపఁగలవు? నీవు వారియొద్దకుఁ బోయికదా కొట్టవలెను. వారు నాలుగుప్రక్కల నిన్నుఁ జుట్టుకొని యాయుధములతోఁ గొట్టునపుడు నీవు ముఖ మొకవైపు తిరిగి పోరునపుడు వెనుకటి నన్నుఁ గొట్టరా ? ఆ దెబ్బలు నాకుఁ దగులవా ? దెబ్బలు తగులు కుట్లుండినను క్రూరులు చెడ్డ మనస్సుగల రాక్షసులను జూడఁగానే నా మనస్సు తల్లడిల్లదా ? నేను సముద్రములోఁ బడిపోదు నేమో ? నేను బడిపోఁగానే వారు నన్నుఁ బట్టుకొని పోయి రావణున కీయరా ?

ఉ. పోరుపయిన్ మది న్నిలిపి • పోరుచు నుండెడివేళ నీవు నే
వారిధి జాఱి ద్రెళ్ళినను • వారు బలాత్కృతిఁ గొంచుఁ బోయినన్
శూరత నిన్ను గెల్చినను • జొప్పు చెడుం గదె! నన్ను రాక్షసుల్
క్రూరత ముక్కముక్కలుగఁ • గోయరె వారలచేతఁ జిక్కినన్ ? ౯౦౫

తా త్ప ర్య ము.

నీమనస్సంతయు యుద్ధముపై నుంచి యుద్ధముచేయునపుడు నేను జాఱి సముద్ర ములోఁ బడినను వారు బలాత్కారముగ నన్నుఁ దీసికొని పోయినను, నిన్ను వారు గెలిచినను క్రమమార్గము తప్పునుగదా. వారిచేఁ జిక్కిన ముక్కలు ముక్కలుగాఁ గోయరా ?